# ఆచార్య రంగా రచనలు



సంపాదకుడు:

**దరువూరి వీరయ్య**

# యాత్రరంగారషసలు

సంపాదకుడు:
దరువూరి వీరయ్య

—88 వ జన్మదినోత్సవ ఆహ్వాన సంఘ ప్రచురణ

1987 నవంబరు

ప్రభవ

808.84
రంగా..బా

C-8589

ప్రచురణ

ఆచార్య రంగా

88 వ జన్మదినోత్సవ

ఆహ్వానసంఘం

ప్రచురణ

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C No 81696.
హైదరాబాద్-500 044.

ప్రతులకు

దరువూరి వీరయ్య

సంపాదకుడు

కిసాన్ పబ్లికేషన్స్

గుంటూరు - 522007

# విషయ సూచిక

## I రంగాజీ రచనలు :


1. జమిందారీ రైతాంగ ఉద్యమం
రామానాయుడు తొలినాటి జ్ఞాపకాలు 1
2. రైతాంగ ఆర్థిక వ్యవస్థ 23
3. తూర్పు ఐరోపాలోని ఎర్ర సామ్రాజ్యవాదం 34
4. రైతుకూలీ వ్యవసాయక ఉద్యమాల లక్ష్యాలు 39
5. ఈనాటి అనుభవాలు తీరని ఆశలు 47
6. సహకార సంస్థలు – రైతాంగ అవసరాలు 51
7. హాలాల్లో – పరిశ్రమల్లో – శ్రామికుల మధ్య తేడా 54
8. భారత రైతాంగ ఉద్యమాలు – విజయాలు 58
9. రైతు కాంగ్రెస్ ఉద్యమం 103
10. స్వయం కల్పిత వృత్తి వ్యవస్థే
మన ఆర్థిక సమస్యల పరిష్కారానికి మార్గం 108
11. అఖిలాంధ్ర ప్రజల మహోద్యమం ద్వారా
సంప్రాప్తించిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు 115
12. కాంగ్రెస్‌లో తిరిగి చేరడానికి కారణాలు 125
13. శ్రీమతి భారతీదేవి సంస్మరణ 131
14. 1944లో నా సేవాగ్రాం యాత్ర 145


## II. శ్రీమతి భారతీదేవీ రంగా రచనలు :


15. స్వయంశక్తి, స్వయం సహాయలతో
దేశాభివృద్ధి సమైక్యంగా కృషిసాగాలి 156
16. రైతులపై శీతకన్ను వేయడం
జాతి మనుగడకే ప్రమాదం 166
17. కృష్ణాజిల్లా మహిళా మహాసభలో అధ్యక్షోపన్యాసం 172

## III. రంగాజీ పీఠికలు :


1. మన కవిబ్రహ్మ 1
2. విప్లవాధ్యక్షుడు 9
3. కర్షకా 32
4. జీవిత మధురిమ ఇదే ఇదే 33
5. సహకార వ్యవసాయం 36
6. ఆంధ్రగ్రంథాలయ మహోద్యమం 40
7. కాంతికిరణాలు 44
8. బాపు - నేను 46
9. గుంటూరు మండల సర్వస్వము 49
10. రైతు భజనావళి 51

# ముందుమాట

ఆచార్య రంగాజీ ఒక వ్యక్తికాదు. ఒక మహాసంస్థ. ఒక మహా సంస్థేకాదు ఒక మహోద్యమం. ఆయన జీవితమంతా పోరాటమే సాగించారు. ఎందుకు? అధికార పదవుల సంపాదన కొరకా? కాదే! రైతుకూలీ, చేతి వృత్తుల శ్రామికజనాల స్వయం వృత్తి రక్షణకు. వారి అభివృద్ధి కొరకు. ఇంకొక రకంగా చెప్పుకోవాలంటే వారికి రాజకీయాధికారము కొరకు. రంగాజీజీవిత చరిత్ర నొక "విజ్ఞాన సర్వస్వం" గా పోల్చవచ్చును. అందనేక సంపుటాలున్నట్లు, రంగాజీ జీవితంలో కూడా మరెన్నో సంపుటాలు. మహాభారత చరిత్రంత విస్తృతంగానూ వుంటుంది. "ఆచార్యరంగా రచనలు" ఈ గ్రంధానికి ఈ పేరు పెట్టడమే సాహసం. రంగాజీరచనలు, అవిరాజకీయములా? సాంఘికములా? ఆర్థికములా? చారిత్రకములా? సాహిత్యమా? సాంస్కృతికమా? లేదా పార్లమెంటు ప్రసంగములా? అంతర్జాతీయ వ్యవహారములా? రైతాంగ సమస్యలా? కార్మిక సమస్యలా? చేతి వృత్తులవారి సమస్యలా? చేతివృత్తుల్లో, ఎవరి వృత్తికి సంబంధించిన విషయము? కరువు కాటకాలపైననా? తుఫాను వుప్పెనల పైననా? విద్యార్థి, యువజన, మహిళా సంఘాల సంస్థాపనావశ్యకత పైననా? రాజ్యాంగ సవరణల పైననా? జమీందారి, ఇనాందరీ, మొఖాసాదారీ, భూస్వామ్య వ్యవస్థల రద్దు చేయవలసిన అవసరం పైననా? వ్యక్తి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య వ్యవస్థల అభివృద్ధికా? మనుగడల కొరకా? స్వయం వృత్తుల, స్వతంత్ర ఉద్యోగుల రక్షణల పైననా? పంటల-పైరుల-పశువుల భీమా సౌకర్యం కలిగించవలసిన అవసరాన్ని గురించా? హరిజనుల, గిరిజనుల తదితర ఆర్థికంగానే గాక సాంఘికంగా కూడా అధోగతి నందున్న బీద బడుగు వర్గాల ప్రజల రక్షణ—అభివృద్ధికి అనుసరించ దగు విధానము—గైకొనవలసిన చర్యల గురించా? ఇంకెన్నో — ఇలా ఉదహరించుకొంటూ పోతే రంగాజీ స్పృష్టించిన సమస్యలు కోకొల్లలు, ఆయన చేపట్టని, స్పృశించని సమస్యలే లేవంటే అతిశయోక్తికాదు. ప్రతి సమస్యపైనా ఒక గ్రంధం రచించారు. ముద్రించారు. అందుకనే రంగాజీని గురించి రచన చేయవలసి వస్తే - లేదా ప్రసంగించవలసి వస్తే అంటుంటారు? ఆయన ఒక వ్యక్తికాదు. ఒక మహా సంస్థ అని— ఆయన ఒకమహా సంస్థేకాదు— ఒక మహోద్యమమని. అలా రంగాజీని గురించి ప్రస్తావించే వారు, వారి సమగ్ర సంపూర్ణ జీవిత చరిత్ర పట్ల అవగాహన వుండి

కూడా కాదు. వారికి తెలిసిన, అర్థమైన, అవగాహనలతో మాత్రమే అలా అంటుంటారు. బహు కొద్దిమందికి మాత్రమే రంగాజీ స్థాపించిన సంస్థలు, సాగించిన ఉద్యమాలు, రచించిన పరిశోధక గ్రంథాలు, వ్యాసాలు, చేసిన ఉపన్యాసాలపై పూర్తి అవగాహన వుంటుంది. ఈ తరం వారిలో చాలామందికి ఎక్కువగా తెలియదు కూడా. అందుకే యీ రచనలు యీ రూపంలో ప్రచురించాలని నిర్ణయించుకోవడం జరిగింది. రంగాజీ 1934లో సెంట్రల్ లెజిస్లేచరు సభ్యులుగా ప్రవేశించినదాదిగా, ఆరు దశాబ్దాల సుదీర్ఘ పార్లమెంటరీ జీవితంలో ఆయన పార్లమెంటు చర్చలలో పాల్గొని—వివిధ సమస్యలపై చేసిన ప్రసంగాల జాబితాయే ముద్రణలో ఇరవై పేజీలు దాటింది. అదీ 1970 దాకా మాత్రమే. మిగతా కాలానికి సంబంధించిన వివరాలు సేకరించ వలసియున్నది. అది మరొక ఇరవై పేజీ లుండవచ్చు.

వందల సంఖ్యలోనే వున్నాయి ప్రసంగాలు. అవి సుదీర్ఘ ప్రసంగాలుకూడా. పార్లమెంటులో యీ ఆరు దశాబ్దాలుగా చేసిన ప్రసంగాలే పాతిక, ముప్పయి దాకా వేయ పేజీలు వాల్యూములకు మించి పోగలవనుటలో సందేహము లేదు.

కరువు కాటకాలు, తుఫానులు ఉప్పెనలు, అగ్ని ప్రమాదాలు, సుడిగాలులు లాంటి జాతీయ ఉపద్రవాలు సంభవించి నప్పుడు, వాటి నివారణకు, బాధితుల సహాయానికి, యేదో ఒక రాష్ట్రమో, లేదా ఒక దేశమో కాక. దీనినొక ప్రపంచ సమస్యగా తీసుకొనాలని, అందుకొరకొక అంతర్జాతీయ రక్షణ నిధి యేర్పాటు చేయాలని ప్రపంచ దేశాలకు, యునైటెడ్ నేషన్సు ద్వారా ఒక విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. అందుకొక అవిశ్రాంత మైన ప్రచారాన్ని సాగించారు. దానిపై ఒక గ్రంథం ప్రకటించారు.

ఇటీవలి కాలంలో అమెరికాలోని తెలుగువారు ఒక సంఘాన్ని స్థాపించుకొని దానికి అనేకమంది సాహితీ వేత్తలను, రాజకీయ నాయకులను ఆహ్వానించారు. రంగాజీని కూడా ఆహ్వానించారు. అనేక మంది వెళ్ళి వినోదయాత్రలు జరిపి, ఒక వుపన్యాసం చేసి ఇల్లు చేరుకొన్నారు. రంగాజీ అలా చేయలేదు. ప్రపంచ సాహిత్య సాంస్కృతిక, సాంఘిక చారిత్రక రంగాలలో ఆంధ్రుల పాత్ర అనే, రచన చేసి— అందులో ప్రాచీన ఆధునిక చరిత్ర, సాహిత్యం, సాంఘిక సంస్కరణ, జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం విద్యా, వైజ్ఞానిక రంగాలలో ఆంధ్రుల భూమికలను సంక్షిప్తంగా అందించారు, అందు వందల సంఖ్యలో వివిధ ఉద్యమాలలో కృషి, త్యాగాలు చేసిన తెలుగు వారిని పేరు పేరున పరామర్శించారు.

ఢిల్లీలో 1983లో నాన్ ఎలైన్డ్ నేషన్సు కాన్ఫరెన్సు జరిగింది. వందకు పైగా దేశాలకు చెందిన వేల సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు. భారత ప్రతినిధి వర్గంలో రంగాజీ ప్రముఖ పాత్ర వహించారు. స్వాతంత్ర్య పోరాటకాలం నుండి నేటివరకు బ్రిటిష్ ఫ్రెంచి, వలస పాలన నుండి, వందలాది దేశాల స్వాతంత్ర్యం కొరకు, మహాత్మాగాంధీ, జాతీయ కాంగ్రెసు చేసిన కృషిని వివరించే పత్రాన్ని తయారు చేశారు. ఆ 1920-25 మధ్య కాలంలో యూరప్‌లో ఆఫ్రికా దేశాల— వలస దేశాల— రంగు జాతుల ప్రజల సంఘాన్ని యేర్పాటు చేసి, దానిపై ఒక వుద్యమం సాగించి, ఒక గ్రంధం రచించి ప్రచురించారు రంగా-జీదాని తాలూకు వివరాలను ప్రకటించారు —పంచశీల—భారతదేశం పాత్ర అనే శీర్షికతో ఒక రచన, పండిట్‌జీ సుభాష్‌బాబు ఇంకెందరో ఆనాటి జాతీయ నాయకులెందరితోనో, రంగాజీ సాగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటముల చరిత్ర తద్విషేశారొక పత్రంతో.

అలీన దేశాల, స్వాతంత్ర్య సంపాదనా ప్రయత్నాలలో దీర్ఘకాలం సాగించిన పోరాటములతో, భారత దేశపు పాత్ర ముగియ లేదని, నేటికీ రంగుజాతుల వలస దేశాల శ్రామిక ప్రజల అభివృద్ధికి, వాని స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కొరకు స్వతంత్ర భారతదేశము కృషిని సాగిస్తూనే వుంటుందని వివరించారొక పత్రం. యీ అన్నింటిని సమన్వయం చేసి నాన్ ఎలైన్డ్ మూవ్‌మెంట్‌లో అర్థ దశాబ్ది భారత దేశం పాత్ర (Quintessence of Non- Aligned Mvoement Half A cantury of India's Contribution) అనే గ్రంధ రూపములో ముద్రించి, ప్రతినిధుల మధ్య పంచి పెట్టారు. అలీన దేశాల అధినేతలు. ప్రతినిధి వర్గాలు రంగాజీ కృషిని బహుదాశ్లాఘించారు.

యునైటెడ్ నేషన్సు ఆర్గనైజేషను (U.N.O.)కు. 1982లో రంగాజీ భారత ప్రతినిధిగా నియమితులయ్యారు. అంతరిక్ష ప్రయోగాలలో శాంతియుత, ప్రయోజనాలకు, మాత్రమే వుప యుక్తం కాగల, అంతర్జాతీయ సహకారము వుండాలంటూ రంగాజీప్రబోధించారు. భారత ప్రధానిగా 1981లో ఇందిరా గాంధీ అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో చేసిన ప్రసంగపాఠాన్ని గ్రంధస్తం చేసి, ప్రతినిధులకు పంచారు. ఆటమిక్ ఎనర్జిప్రయోజనాలు, యు.ఎన్ అసెంబ్లీ జనరల్ సమావేశ తీర్మానములు- భారతదేశ పాత్ర ఇలా అనేక సమ

స్యలను గ్రంథస్తం చేసి, వివరించారు. యు.ఎన్.ఓ. ఆశయ ఆదర్శాల సఫలీకృత మొనర్పుటలో భారత ప్రభుత్వ భూమికను విపులీకరిస్తూ పరెన్నో శీర్షికలతో, యు.ఎన్.ఓ.లో ఆచార్యరంగా అనే పేరుతో గ్రంథ రూపంలో ముద్రించి సభ్యుల మధ్య పంచారు-

ఆక్స్‌ఫర్డులో, విద్యార్థిగా వున్న ఆ 1920-25 సంవత్సరాలలో తీరిక సమయాలలో, బ్రిటిష్ పార్లమెంటుకు ప్రేక్షకులుగా వెళ్ళిన రంగాజీ; ఎంతో ఆసక్తితో, చర్చల నాలకించి, వారి ప్రజాస్వామిక సంప్రదయాల పట్ల గౌరవం పెంచుకొని, పార్లమెంటరీ విధానం పట్ల అభిమానంతో, బ్రిటిష్ పార్లమెంటు చర్చలపైనాలుగు సమీక్షా వ్యాసాలు రచించి, ఆంధ్ర పత్రికకు పంపారు. ఆంధ్ర పత్రికలో ప్రచురించబడిన ఆ రచనలు బహుముఖ ప్రశంసలు పొందాయి. రంగాజీ రచనా పాటవాన్ని, భాషాశైలిని,గమనించినదేశోద్ధారక,కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు రంగాజీనిఆంధ్ర పత్రికకు ఇంగ్లాండ్‌లోఅధికార విలేఖరిగానియమించడంజరిగింది.

ఆదే సమయంలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారి విప్లవాత్మక సాంఘిక నవల "మాలపల్లి" చదివారు. ఉత్తేజితు లయ్యారు. దానిపై నాలుగైదు గ్రంథ సమీక్షా వ్యాసాలు రచించి ఆంధ్ర పత్రికకు పంపించారు. రంగాజీ "మాలపల్లి" నవల పై రచించి ప్రచురించిన సమీక్ష వ్యాసాలు "మాలపల్లి" నవలకు బహుళ ప్రచారం కలిగించింది. రంగాజీ సమీక్షా వ్యాసాలు ప్రజలలో రేకెత్తించిన విప్లవ కెరటాల కారణంగానే, బ్రిటిష్ ప్రభుత్వం ఆ గ్రంథాన్ని చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించడం జరిగిందని ప్రజాభిప్రాయం. ఉన్నవ వారి రచనలోని విప్లవ తత్వాన్ని ప్రజలకు ఎరుక పరచినవారు రంగాజీయే ననుటలో అతిశయోక్తి లేదు. విద్యార్థిగా చదువులు సాగిస్తూనే ఆయన సాగించిన రచనా వ్యాసంగం. ఆయనను మంచి రచయితగా, గ్రంథ విమర్శకుడుగా పరిగణనకు తెస్తే, బ్రిటిషు పార్లమెంటు పై చేసిన సమీక్ష లాయనను ప్రతిభావంతుడయిన జర్నలిస్టుగా ఎన్నిక చేశాయి.

-ఆ 1924 ప్రాంతాల్లోనే, లండన్ మిత్రులతో కలసి రంగు జాతుల వలస దేశాల ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలపై పరిశోధనసాగించి, వారి కొరకొక సంఘాన్ని స్థాపించి, ఒక పరిశోధన గ్రంథాన్ని రచించి ప్రచురిం

చారు. అది నాటికీ నేటికీ రంగుజాతుల వలస ప్రజల ఆశయాలకు, ఆదర్శాలకు సమస్యల పరిష్కారాని కొక దర్పణము లాంటిదనే ప్రశంసల నందుకొన్నది. ఇటీవల భారతదేశంలో ఢిల్లీయందు జరిగిన అసీనదేశాల సభఘుంషంచ బడింది.

మాతృ దేశానికి తిరిగి వచ్చి, పచ్చయప్ప కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టి, మద్రాసు ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా నియమించబడిన ఆదినాలలో (1925) నే, వేసవి విశ్రాంతి కొరకు నీలగిరి వెళ్ళిన రంగాజీదృష్టిఅచట నివసిస్తూ, దారిద్ర్యంలో దీనాతి దీనమైన జీవితం గడుపు తున్న కొండ జాతుల ప్రజలపై బడింది. విచారించారు. వారి మధ్య తిరుగుతూ, వారి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు పరిశీలించారు. సంగ్రహంగా ఒక నివేదికను తయారుచేసి, ప్రభుత్వానికి పంపారు. దాంతో సరి పెట్టుకొనక, వారి అభివృద్ధి వికాసాలకు, ఆర్థిక, సాంఘిక రాజకీయ ప్రతిపత్తికి అనుసరించదగు, అమలుజరుపదగు అనేక సూచనలతో ఒక గ్రంథాన్ని రచించి ప్రచురించారు. పెద్దయెత్తున ఉద్యమం సాగించారు.

ఆక్స్‌ఫర్డు యూనివర్శిటీకి, డి.లిట్. డిగ్రీకొరకొక సిద్ధాంత గ్రంథాన్ని అందజేయాలి. అందుకు ఒక సమస్యను ఎన్నుకొనవలసి వున్నది. ఆలోచించారు రంగాజీ. తన అభిమాన విషయం గ్రామీణ ఆర్థిక, సాంఘిక రాజకీయ, సమస్యలు. నిర్ణయించుకొన్నారు దానినే. ప్రొఫెసర్లకు చెప్పారు. పరిహాసం చేశారు. గ్రామాల కొక ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలు వేరుగా వుంటాయా? అని హేళన చేశారు. వుంటాయి:రచించి మీముందుంచుతాను. చూడండి అనిధైర్యంగాచెప్పారు. పట్టు విడవకుండా వారిని ఆమోదింప చేశారు. పరిశోధన చేశారు. వ్యాసం రచించారు. పెదవివిరిచారు ప్రొఫెసర్లు. అయినా పట్టు వదలలేదు, స్వదేశానికి తిరిగి వచ్చారు. భారతీయ గ్రామాలను ఎంచుకొన్నారు. ఆంధ్రగల అనేకతానేపులయిన వృత్తుల,ఉపవృత్తుల సమస్యలనుపరిశీలించిపరిశోధకవ్యాసం రూపొందించి, యూనివర్శిటీకి నివేదించి, డి.లిట్. డిగ్రీ పొందారు. అప్పుడే చేనేతవారి సమస్యలపై పరిశోధన గావించి మరొక పరిశోధక గ్రంథం రచించారు. చేనేత కాంగ్రెసు జాతీయ స్థాయిలో నిర్మించారు. ఒక మహోద్యమాన్ని నేటికి సాగిస్తూనే వున్నారు.

ఇలా సాగింది రంగాజీ రచనా వ్యాసంగం. సాగడమే కాదు మూడు పూలు ఆరుకాయలుగా దిన దిన ప్రవర్ధమానంగా, పెంపొందింది. ఒకటా రెండా పదులా పాతికలా-వందల సంఖ్యలోనే సాగాయి గ్రంథ రచనలు ప్రచురణలు.

* * * *

హరిజనులు-అంటరాని తనం-ఆర్థిక-సామాజికపరిస్థితులు-ఆయనకుమొదటి నుంచి ఆందోళన కలిగించాయని చెప్పుకొన్నాము గదా? ప్రజలలో ప్రచారం విరివిగా సాగించాలంటే, వ్యాసములు గేయాలతో పాటుగా నవలా ప్రక్రియను చేపట్టాలనుకొన్నారు. పూను కొన్నారు. గుంటూరు కృష్ణా మండలాలలోని అనేకగ్రామాలు సందర్శించారు. హరిజనులతోను-సవర్ణులతోను సంప్రదించారు. చర్చించారు.ఉభయుల మధ్య సంఘర్షణలు. కలహాలు కార్పణ్యాలు- సాధింపులు- వేధింపులులేని- సామరస్య పూర్వకమూ, స్నేహసౌశీల్యములుపెంపొందించేందుకు అనువైన రచనా ప్రణాళికను నిర్ణయించుకొని, పాత్రలు సృష్టించుకొని, ఆయా పాత్రలచేత చెప్పించవలసిన సంభాషణలు రూపు దిద్దుకొని "హరిజన నాయకుడు" అనే సాంఘిక నవలను రచించారు. (దానిని యాభయ్యేండ్ల తరువాత పరం నేడు పునర్ముద్రించబడింది.) హరిజనుల గురించి అంటరాని తనాన్ని గురించి, మరి అనేక రచనలు చేశారు. గాంధీజీ పర్యటన కార్యక్రమం (1930)లో, ఆ హరిజన వాదం సందర్శనానికి ప్రాధాన్యత నిచ్చారు.

ఆ తరవాత, బ్రిటీషు పార్లమెంటు చర్చలు, యూరపు, అమెరికా, ఆఫ్రికా, ఆసియా ఖండాలలోని అనేక దేశాల చరిత్రలు, రాజ్యాంగాలు. రాజరికాల చరిత్రలు అధ్యయనం చేయడం ద్వారా, ఆయన భారతదేశం స్వతంత్రతా సంపాదనానంతరం ఎలాంటి ప్రభుత్వం వుండాలో, దాని రాజ్యాంగ చట్టం యేరూపంలో వుండాలో అనే ఆలోచనలు సాగించారు. దానిపై "ఆధునిక రాజ్యాంగ సంస్థలు అనే గ్రంథాలు రెండు భాగాలు రచించారు. అందు ప్రపంచ దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా చర్చించారు. కేంద్రశాసనసభలో ప్రవేశించేనాటికే ఆయనకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల, నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. ప్రజాస్వామ్య విధానంపట్ల అభిమానం, ఆదరణ, గౌరవాలు పెరిగాయి. అందుకే ఆయన ఎప్పుడూ, నియంతృత్వం, యే రూపంలో వున్నా దానిని యెదిరిస్తూవచ్చారు. కమ్యూనిజం పట్ల, రష్యా కమ్యూనిస్టు ప్రభుత్వంపట్ల, లెనిన్ నాయకత్వంపట్ల మొదట్లో అభిమానం ప్రకటించినా, వారితోకలసి, మెలసి రైతాంగ సమస్యలపై, సంఘాలుస్థాపించినా, ఉద్యమాలు నడిపినా, వారినియంతృత్వపు పోకడలు, ముఖ్యంగా కార్మికనియంతృత్వము, ఏక పక్షపాలనా విధానం వారితో ఆయనను

కలపి వుంచలేక పోయాయి. కమ్యూనిస్టులనుండి బయటపడడానికి ఆయన పెద్ద పోరాటాలే సాగించవలసి వచ్చింది. రైతు సంఘంలో తన సహచరులు స్వామి సహజానంద సరస్వతిగారు, కమ్యూనిస్టుల పంజరంలో చిక్కుకున్నా, మిగత మరెందరో తనకు దూరమైనా, కమ్యూనిస్టులతో సిద్ధాంతపరమైన విబేధాల కారణంగా, బయటకువచ్చి వేరుగా అఖిలభారత కిసాన్ సభను యేర్పాటు చేశారు.

ఆ సందర్భంగా అనేక వ్యాసాలు రచించి ప్రచురించారు "కమ్యూనిస్టులు — రైతులు" అనే వివరణాత్మకమైన సిద్ధాంత గ్రందమే రచించి ప్రచురించారు. రైతులకు, వారి వృత్తిరక్షణకు, వృత్తి స్వాతంత్ర్యానికి, "స్వతంత్రవృత్తులు-స్వంత ఉద్యోగం" అనే గ్రంథాన్ని రచించారు. దానిపై జాతీయ స్థాయిలోనేకాక అంతర్జాతీయంగా కూడా సంచలనం కలిగింది.

"స్వయంవృత్తి; స్వంతఉద్యోగం"గురించి రంగాజీ వివరిస్తూ ఈదేశంలో ఆ దేశంలోఅనిగాక,ప్రపంచపరివ్యాప్తంగాప్రభుత్వంపైగాని,వాణిజ్య,పారిశ్రామిక సంస్థలపైగాని ఆధారపడకుండాపనిచేసుకొనే స్వయం వృత్తిదారులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడుకొంటూ ఏ ఒక్కరి ముందు మోకాలు వంచని .వారని ఎవరిదయాదాక్షిణ్యాలు, ధర్మాలతో నిమిత్తంలేకుండా మనుగడసాగించేవారని, వారినిశ్లాఘించారు ఇలాంటి స్వయం వృత్తులకు చెందిన స్వతంత్ర జీవనం సాగించే కోట్లాది శ్రామిక జనాలను, తమ ఇనుపసంకెళ్ళతో బంధించాలనే కుట్రసాగించే కమ్యూనిస్టుల మాటలు నమ్మవద్దని బహుళప్రచారం సాగించారు. ఇందుకై ఎన్ని రచనలు చేశారో, మరెన్ని ప్రసంగాలు చేశారో ఊహకందదు. వాటినన్నింటిని గ్రంథస్తం చేశారు. వివిధ ప్రక్రియలలో రచనలు సాగించారు.

"మార్క్స్" రైతులు విప్లవ ప్రతీఘాతకులని, ఇనుకలా సంఘటితశక్తి లేని వారని, సిద్ధాంతం రచిస్తే, అందుకు రంగాగారు సమాధానంగా రైతులు విప్లవకారులు, సంఘటిత శక్తి కలవారు. ప్రపంచంలో వివిధకాలాల్లో, రైతాంగం, వారి హక్కుల రక్షణకు, రాజకీయాధికారం సంపాదనకు జరిపిన ఉద్యమాలు, సాగించిన పోరాటాలు, పొందిన విజయాలపై చారిత్రక దృష్టితో పరిశోధించి విప్లవరైతాంగం అనే గ్రంధం రచించారు. ఈ గ్రంథంలో, ఎంత చరిత్ర త్రవ్విపోశారో! మరెన్నెన్నో సాంఘిక, ఆర్థిక రంగాలలో రైతాంగం సాధించిన విజయాలు

ప్రామాణికంగా రుజువుచేశారు. రైతు, కూలీ, చేతివృత్తుల శ్రామిక కార్యకర్తలకు యీ గ్రంథం క్రైస్తవులకు బైబిలులాగా, మహమ్మదీయులకు ఖురానులాగ, హిందువులకు భగవద్గీతలాగ పరిగణించబడింది: పరమ పవిత్రమైనదిగా భావించబడింది.

అంతేనా ! ఎప్పుడు యేసమయంలోనైనా. ఒక సమస్య ఎదురయితే, దానిపై ఒక సమగ్రమైన వివరణాత్మకమైన సిద్ధాంతగ్రంథమే రచించి ప్రచురించారు రంగాజీ. ఆంగ్ల, ఆంధ్ర భాషలలో మొత్తం వందకుపైగానే గ్రంథాలు రచించారు. వేలసంఖ్యలోనే ప్రసంగాలుచేశారు, మరెన్నో వ్యాసాలు ప్రచురించారు. రంగాజీ మహాసభల ప్రసంగాలు. అది విద్యార్థిసభగాని యువజనులసభగాని, మహిళల సభగాని. రైతు, కూలీ, చేతివృత్తులకు చెందినవారి సభలుగాని అందులో చేసిన అధ్యక్షోపన్యాసం, లేదా ప్రారంభోపన్యాసం, విధిగా గ్రంధరూపంలో రచన చేయవలసిందే, అది ముద్రణ జరగవలసిందే. ప్రజలలో పంచవలసిందే. ఒక సమస్యను పరిష్కరించడం కొరకు, ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం, దానిని ప్రజల మస్తిష్కములో ఎక్కించుట కొరకు తనకు అందుబాటులో వున్న యావత్తు ప్రచారసాధనాలను ఉపయోగించుకొనడంలో రంగాజీ ప్రతిభావ్యుత్పత్తులు అసాధారణమైనవి. అపురూపమైనవి అనికరసాధ్యాలు. ఇలాంటి సందర్భాలలో రంగాజీ ఆందోళన చెందరు. అసహనం చోటుచేసుకోదు. ఆగ్రహం చెందరు. తాపీగా, చిరునవ్వుతో, అరటి పండు వలిచి చేతిలో పెట్టినట్లు మృదుమధుర భాషణలలో పగతురను చిత్తు చేయగల నేర్పు, ఓర్పు, సహనం, విజ్ఞతగల అప్రతిమాన ప్రతిభావంతుడు రంగాజీ. అందువలనే ప్రత్యర్థులకు ఒళ్ళు మండుతుంది. "ఈర్ష్య, ద్వేషం, అసూయ - కార్పణ్యం-ఇవన్నీ మానవుడిని, ఆహుతిచేస్తాయి. నిలువునా దహించి వేస్తాయి. అందుకనే "తనకోపమే తన శత్రువు" అన్నారు వేమన మహాయోగి. అదినిజం. అందుకనే వాటికి దూరంగా వుంటారు రంగాజీ.

రంగాజీ స్థాపించిన సంస్థలు, సాగించిన మహోద్యమాలు, పుంఖాను పుంఖాలుగా చేసిన రచనలు, ప్రచురించిన గ్రంధాలు, రైతు రక్షణ యాత్రలు, వేసంగి రాజకీయ పాఠశాలలు, వయోజన విద్యా ప్రచారాలు, ప్రత్యర్థులలో ఈర్ష్యా అసూయలు అసహనం, ఓర్వలేని తనం. పెరిగిపోయింది. మరొకరకంగా సాధించలేక, తప్పుపట్టడానికి కారణాలు దొరకక, కొందరు, తమ కక్షసాధించుకొనే ప్రయత్నంలో ఆయనపై పక్షపాతకల్పితకలతో నీలాపనిందలు పత్రికలలో వ్రాయిం

చారు. అందులో భాగంగానే 1951 ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుఅధ్యక్ష ఎన్నికసందర్భంగా, మద్రాసు నుండి వెలువడే ఒక సినిమా పత్రిక "ఢంకా"లో దశకంఠుడు రంగా అనే శీర్షక క్రింద పది తలకాయలతో రావణబ్రహ్మ కార్టూను ప్రచురించిరి. (ప్రతి తలపై, రైతురంగా కూలిరంగా, చేనేతరంగా, విద్యార్థిరంగా, యువజనరంగా, హరిజనరంగా, ఆ రంగా యీ రంగా అని వ్రాశారు. ఇది చీరాలలో జరిగింది. పోటీ చాలాతీవ్రంగా వున్నది. ఒకవైపు అప్పుడు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు గావున్న రంగాజి రెండోవైపు మద్రాసు ప్రెసిడెన్సీలో మంత్రిగావున్న శ్రీ నీలం సంజీవరెడ్డి గారల మధ్య పోటీ. ఒకవైపు అధికారంలో వున్నవారు. మరొక వైపు రైతు, కూలీ, చేతివృత్తులకు చెందిన శ్రామికులు మద్దతు యిస్తున్నారు. అశేషంగా ప్రజలు ఆసక్తితో ఫలితం కొరకు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి ఉద్రిక్త వాతావరణంలో "దశకంఠుడు రంగా" అనే పతాకశీర్షికతో, వ్యంగ్య చిత్రముతో వున్న ఢంకా పత్రిక పంచడం సాగించారు. రంగాజీ అనుచరులు, సహచరులు కోపోద్రిక్తులయ్యారు. పత్రికలను పోగువేసి, తగలపెట్టాలని, పత్రికాధిపతికి బుద్ధిగరపాలని ప్రయత్నాలు సాగాయి. కలకలం బయలుదేరింది. రంగాజీదృష్టికి వచ్చింది విషయం. రంగాజీ విషయం గ్రహించారు. పత్రికను తెప్పించుకొన్నారు. పరిశీలించారు. ఇందులో తప్పేమీలేదనీ, వారు రంగాను అర్థంచేసుకోవడంలోనే- అంచనా వేయడంలోనే పొరపాటు పడ్డారని, నేను దశకంఠుడను మాత్రమేకాదు, శతకంఠుడను. పందలసంఖ్యలోనే సంఘాలు స్థాపించాను ఉద్యమాలు నడిపాను, ఉపన్యాసాలు చేశాను. విద్యాలయాలు పెట్టాను. యాత్రలు సాగించాను. అందువలన నన్ను రాక్షసుడన్నా, మరేమన్నా బాధపడనని, మీరు పడవద్దని ప్రశాంత వదనంతో, సంతోషాతిశయంతో, మందహాసంతో, పౌరాణిక చారిత్రక ఘట్టాలపై ఒక మహోపన్యాసం చేశారు. ఇంతలో ఫలితం రంగాజీకి అనుకూలంగా వచ్చింది అపజయం చెందినందుకుగాక, రంగాజీని రాక్షసుడుగా చిత్రించాలనుకొంటే శత కంఠుడనని, రావణబ్రహ్మలాగా, తానొక ఉద్యమాల, సంఘాల, సంస్థలసృష్టి కర్తనని రంగాజీ చేసిన సిద్ధాంత ప్రతిపాదనతో సిగ్గుపడిపోయారు.

రామాయణంలో పిడకలవేట అన్న చందంగా మధ్యయీ పిట్టకథనెందుకు చెప్పవలసి వచ్చిందంటే, రంగాజీ దూరదృష్టి, దూరాలోచన, సమయస్ఫూర్తి, చారిత్రక పరిజ్ఞానం, పౌరాణికగాథలు, తనకన్వయించుకొనడంలో నేర్పరితనంఇందులో ఇమిడియున్నదనే విషయాన్ని పాఠకులముందుంచడం కొరకు; అంతేగాదు,

సంఘాల, సంస్థల, ఉద్యమాల, నిర్మాణం, వాటిని పెంచి, పోషించి, బలవత్తరము చేయుటలో ఆయన కున్న ఆసక్తి తెలియజేయాలనే ఉద్దేశం.

చారిత్రకరచనాసక్తి రంగాజీకి మొదటి నుండి వున్నది. అందుకనే లోక్‌సభ ఎన్నికలలో పరాజం పొందిన రంగాజీ, నిరాశా, నిస్పృహలతో నిరాసక్తుడై వుండక, ఓరుగల్లుకోట, రామప్ప దేవాలయ సందర్శనకెళ్ళారు. ఓరుగల్లులో, కాకతీయ చరిత్ర అధ్యయనం చేశారు. స్థానికంగా లభ్యమయ్యే శాసనాలను పరిశీలించారు. అందుకవసరమయిన ప్రాచీన చరిత్రకారుల రచనలు అధ్యయనం చేశారు. ప్రతాపరుద్రీయం పఠించారు. పరిశోధన ప్రారంభించారు. కాకతీయ నాయకుల చరిత్రవ్రాయాలని సంకల్పించుకొన్నారు. ప్రారంభించారు. ఆరుమాసముల పర్యంత మొక యజ్ఞ ప్రాతిపదికపై పూర్తిచేసి, ప్రచురించారు. అది తరువాత తెలుగులో అనువదించబడింది. ఇప్పటికప్పుడే రెండు ముద్రణలు జరిగింది.

రంగాజీకి చరిత్ర పఠనం పట్ల ఆసక్తి అన్నాంగదా? ఇది యీ నాటిదికాదు. ఆయన విద్యార్థిగా, అది మాధ్యమిక స్థాయిలోనే "రాణీసంయుక్త" చదివారు. దానిని చదవడం అనడం కంటె కంఠస్థం చేశారు. దాని ప్రభావం-నాటికీ నేటికీ వారిపై వున్నది.

భారత, రామాయణ, భాగవత పురాణ గ్రంథాలు, విమర్శనాదృష్టితో చారిత్రికదృష్టితో, సాంఘికదృష్టితో అధ్యయనం చేశారు. ఆయన ప్రసంగాలలో అది కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. అది రాజకీయోపన్యాసమయినా, రైతు, కూలి, చేతివృత్తుల శ్రామికులసమస్యలపై, లేదా మహిళా, యువజన, వయోజన, విద్యార్థిఉద్యమాలపైన చేసినా, భారత, రామాయణ, భాగవత పురాణముల నుండి కోకొల్లలుగా ఉదాహరణలిస్తారు. ఆయనకు శ్రీ కృష్ణుని పట్ల అత్యంతాభిమానం అందుకనే భగవద్గీతను, రాజకీయోపన్యాసములలో ఉటంకిస్తుంటారు. స్త్రీ సమస్యలు వచ్చినప్పుడు, ద్రౌపతి, సీత, సావిత్రి, దమయంతి - పాత్రల ప్రాశస్త్యాలను, వారి వీరోచిత, సాహసోపేత సమయోచిత, కథా కథనాలను వల్లెవేస్తుంటారు. రణరంగములో, రాజ్యాంగ పాలనావ్యవహారములో, రాణీరుద్రమ, రాణీ ఝాన్సిలక్ష్మి నాయకినాగమ్మల పై సాగుతుందాయన ప్రసంగం.

సాంఘిక, దురాచారాలు, కట్టుబాట్లు అంటరానితనం, సంకుచిత కులమత విషయాలపై ప్రసంగించవలసి వచ్చినా, రచనచేయ వలసి వచ్చినా బ్రహ్మనాయుడు, వీర బ్రహ్మేంద్రయోగి

యోగి వేమన, కందుకూరి, త్రిపురనేని ప్రభావాలు, రచనలపై సాగుతుంది అనర్గళంగా....రచనలుకూడా చాలానే చేశారు. ప్రాచీనాంధ్ర కవులలో, పోతనకు శ్రీనాధునకు పెద్దపీట. పోతన భాగవతమునుండి, ఎన్ని పద్యాలు కంఠస్థంచేశారో! సాహిత్యంలో, చారిత్రకదృష్టికల శ్రీనాధుని పై ఎంతటి గాఢమైన ప్రేమాభిమానాలు చూపుతారో, అంతటి కోపం గూడా ఆయనపై. నాయకి నాగమ్మను తక్కువచేసివ్రాశారని అపఖ్యాతికలిగే విధంగా పాత్రసృష్టించారంటారాయన. ఆమె రాజనీతిలో, రణకౌశలములో, ప్రజ్ఞాధురీణురా లంటారాయన. యీ విషయాలెందుకనుకుంటారు కదూ! పురాణాలపై, చరిత్రపై, సాంఘిక, సాంస్కృతిక విషయాలపై అనేకరచనలు, వ్యాసాలరూపంలో, గ్రంధాలుగాను కూడా రచించారు.

* * *

1946లో, ఆంధ్రకాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నుకొనబడగానే ఆంధ్రలో జాతీయకవులను సమావేశపరచి, ఒక సంఘాన్ని నియమించి, ప్రజలలో జాతీయ భావాన్ని, సేవా, త్యాగాల వైపుగా మళ్ళించే, రచనలు చేయించారు. "జాతీయ విజ్ఞాన సర్వస్వము" అనే బృహత్ రచనకు సమాయత్తంచేశారు. రచన సాగించారు. సర్వస్వము విజ్ఞానదాయకంగా, జాతీయతా ప్రబోధాత్మకంగా రూపొందించబడింది.

"రైతు భజనావళి" ఈపేరుతో వున్న యీ గ్రంథం కేవలం రైతులకొరకే గాక, సర్వశ్రామిక జనాల ప్రబోధగేయాలతో ఇరవై ముద్రణలు సాగింది. ఎందరో యువరచయితలకు ఉత్సాహము - ప్రోత్సాహము కలిగించాయి. అందలిగీతాలు, గేయాలు, పద్యాలు సభలలో, ఉపన్యాసకులు గొంతెత్తి పాడుతుంటే రణరంగంలో యుద్ధవీరులలాగ, ప్రజలు ఆవేశంతో ఊగిపోయేవారు.

"కలం చిత్రాలు" ఇదొక విచిత్ర ప్రక్రియ. రంగాజీ యీ ప్రక్రియను కార్యకర్తలలో ఉత్సాహం కలిగించింది. స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కరణోద్యమంలో కృషిచేసినవారు, గ్రంథాలయ-వయోజన విద్యారంగాలలో పనిచేసినవారు. సాహితీవేత్తలు, మొదలుగాగల ప్రజాసేవారంగాలలో పనిచేసిన అనేకమందిని గురించి "కలం చిత్రాలు" వందల సంఖ్యలలో రచించి, పత్రికలలో ప్రచురించారు. ఆ రోజులలో ప్రజాసేవకులను హుషారు చేయడం, ప్రజలచేత గుర్తింప చేయడం కొరకు తనకు అనుభవంలోవున్న వారందరిని, పత్రికలకెక్కించారు.

యువకులలో ప్రజాసేవానురక్తి - దేశభక్తి - త్యాగాలు చేయడంలో అనురక్తి, పెంపొందవచేశారు. యువకులలో, ముఖ్యంగా విద్యార్థులలో, చేతివృత్తుల నాయకులలో రంగాజీ గుర్తింపునకు ఎగబడేవారు. ఎనలేని భక్తి ప్రపత్తులు చూపించేవారు. కలం చిత్రాలకు పరిగణ హెచ్చింది. ఆయన కలం చిత్రం రచించారంటే,అదొకసన్నదుగా, యోగ్యతాపత్రంగా గౌరవబిరుదుగాఎంచబడింది.

రంగాజీ రచనలు, సమగ్రంగా, సంపూర్ణంగా ప్రచురించాలంటే, వ్యక్తులకు సాధ్యమా ? సంస్థలకే సాధ్యంకాదు. ప్రభుత్వస్థాయిలో చేపట్టినప్పుడే అదిసాధ్యం అందుకని, ఎప్పుడో, ఎవరో ముందుకువస్తారని, యే సంస్థనో స్థాపించి, యీ బృహత్కార్యమునకు పూనుకొంటారని ఆశతో ఉదాసీనం వహించక చంద్రునకొక నూలుపోగులాగ - సముద్రంలో నీటిబొట్టు పగిది- చేతనైనంతలో ముందుగా రైతుల-కూలీల-చేతివృత్తుల శ్రామికజనాల సమస్యలపై చేసిన ప్రసంగాలు- రచనలు-గ్రంథాలతో "ఆచార్యరంగారచనలు" అనే మకుటం క్రింద తొలి భాగాన్ని మీ ముందుంచడం జరిగింది. సాధ్యమైనంత త్వరలో ద్వితీయభాగం, పార్లమెంటుతో రైతు సమస్యలపై ఆయన చేసిన ప్రసంగాలతో ముద్రణ మీ ముందుంచే ప్రయత్నం సాగుతుందని సవినయంగా మనవి చేయున్నాము.

ఆచార్య రంగా రచనలు - రంగాగారు ఆయా సందర్భాలలో చేసిన ప్రసంగాలు - రచనలనుండి కొన్నింటిని ఇందు ప్రచురించడం జరిగింది. ఇందు శ్రీమతి భారతీ దేవిగారు రంగాగారితో పాటుగా రైతు, కూలీ, చేతివృత్తుల - గ్రామీణ శ్రామిక జనాలకు చెందిన అన్ని ఉద్యమాలలోనూ ప్రముఖ పాత్ర వహించారు. కారాగారములకు వెళ్ళారు. అఖిల భారత కిసాన్ కాంగ్రెసుకు అధ్యక్షురాలుగా. ఉపాధ్యక్షురాలుగా వున్నారు. ప్రపంచ దేశాలెన్నో రంగాజీతో పాటు పర్యటించారు. లెజిస్లేటివ్ కౌన్సిలులో సభ్యులుగావున్నారు.వారిరచనలుకూడాప్రచురించడంజరిగింది.

ఇందుతో పాటు "ఆచార్య రంగాజీకి కవితామంజరి" అనే శీర్షిక క్రింద రెండవ గ్రంథమిది.

ఇందు గత మూడు నాలుగు దశాబ్దాలుగా రంగాజీని ప్రశంసిస్తూ - అభినందిస్తూ - ఆశీర్వదిస్తూ పలువురు ప్రముఖ కవి పండితులు రచించిన పద్యాలు - గేయాలతో కవితామంజరి ముద్రించబడింది.

లోగడ "హరిజన నాయకుడు" అనే సాంఘిక నవల 1933 రచించి ప్రచురించబడిన గ్రంథం యాభై అయిదేళ్ళ తర్వాత పునర్ముద్రించడం జరిగింది. రంగాజీ 88 వ జన్మదిన శుభసమయంలో, వారి పాదపద్మములకు భక్తి గౌరవాలతో అందించుటకు సంతోషిస్తున్నాము. ఈ మూడు గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహాయము అందించిన 88 వ జన్మదిన మహోత్సవ ఆహ్వాన సంఘము వారికి కృతజ్ఞతలు ప్రకటిస్తున్నాను.

దరువూరి వీరయ్య

సంపాదకుడు

## జమీందారి రైతాంగ ఉద్యమం

# రామానాయుడు తొలినాటి జ్ఞాపకాలు

అది మద్రాసులోని విశ్వవిద్యాలయ స్థాయి పొందిన ప్రసిద్ధ పచ్చయప్ప కాలేజీ ఆక్టింగు ప్రిన్సిపాల్‌గా నేను, సోదర ప్రొఫెసర్లతో ముచ్చటిస్తున్న సమయం. పిచ్చి రెడ్డి ఎం. ఎ. వచ్చినారవిరి. ఏదో వుద్యోగానికో, మరెవ్వరికైనా యం. ఏ. చదువు కోడానికై సీటుకొరకో వచ్చినారనుకుంటూ, పిల్చుకురమ్మన్నాను.

నిటారుగా వున్నాడు, నిమ్మపండు ఛాయ, అందమైనమోము, సులలితమైన చిరునగవుతో వచ్చిరి. తమది నెల్లూరు, తాము "జమీందారీ రైతు, పత్రికకు సంపాద కులు, తామంతకుముందొక వుత్తరం వ్రాసిరి, జమీందారీ దురంతాల గురించి రైతుల తరపున తమ పత్రిక బైలుదేరినది-అంటూ పల్కుచుండిరి· "శ్రీరామానాయుడు మీకు తోడుకదా? ఆ మధ్య కలిసిరి. మీ వ్యవహారమంతా కోర్టులలో వ్యాజ్యాలకు సంబం ధించినట్లున్నదే· ఏదో ఒక్క జమీందారుమీద మీకున్న వ్యవహారం, అలాంటి ప్రైవేటు లావాదేవీలలో, నాబోంట్లు తలదూర్చుట అంత మంచిదా? అన్నా నేను నాయుడుగారితో!

"అందుకుమాత్రమే కాదండీ మేము పత్రిక పెట్టుతున్నది. అలాంటి జమీం దారు లెందరో, వారివల్ల ఎన్నెన్ని ప్రదేశాలలో ఎందరెందరో మాలాగానే కష్టాలు నష్టాలు పొందుతున్నారో వారందిరినీ బలపరుస్తూవుండడానికే, అలాంటి జమీందారుల దుండగాలను యెదిరించడానికే యీ పత్రికను ప్రారంభిస్తున్నాము" అన్నారు వారు. "మీరేమో విద్యాధికులు, ఈ పత్రికా సంపాదకత్వం వుద్యోగంకొరకా, మన రైతుల రక్షణయే మీకు ప్రధానలక్ష్యమా?" అంటి!

"శ్రీమతి పొణకా కనకమ్మ నెరుగుదురుగదా ఆమె ఆస్తులనన్నిటిని, దిగ మ్రింగుతున్నారీ వెంకటగిరి సంస్థానపు ఉద్యోగులు. ఆమె మా వదినెగారు. మేమంతా మహాత్ముని అనుచరులం. నాయుడుగారు 1920 నుండి జాతీయోద్యమంలో, మా అందరికీ ఆత్మీయులు. బ్రిటిషు సామ్రాజ్యంవల్ల ప్రజలందరికి కల్గు బాధలు నివారించ డానికై సహాయనిరాకరణోద్యమం సాగిస్తూవుంటే; ఆ సామ్రాజ్యాధికారముమ తమ సొత్తుగా చేసుకొని యీ జమీందారు, వారిక్రిందవుంటున్న రైతులను మరెంతో బాధిస్తు న్నారండీ. "మాకొద్దు యీ తెల్లదొరతనము" అంటూ, మా పల్లెపాడు ఆశ్రమంలో గర్జిస్తూవుంటే, మారైతుల బాధలను, గ్రామోద్యోగిగా, కాంగ్రెసు వాదిగా, రైతుగా వుండిన నాయుడుగారు "మాకొద్దీ జమీందారీ పొందు, వోదేవా, మా ప్రాణాలపై

పొంచి, మానాలు హరియించు యీ జమీందారీ పొందు, మాకొద్దు, మాకొద్దు" అంటూ పాటలు వ్రాస్తూ పాడుతూవుంటే, స్వంత కుటుంబములో, మా భూములలో, గ్రామంలో చిచ్చుపెట్టిన జమీందారీ పెత్తనంపైన, దేశంకొరకై గాంధీజీ సామ్రాజ్య శక్తిపై దండెత్తితే, రైతు, కూలీలరక్షణకై మేము దండెత్తవద్దా-అన్నాడాయన, సరే, అనుకున్నాము మేము" అన్నారు పిచ్చిరెడ్డి.

"నేనీ కాలేజీలో వున్నానే" అన్నా.

"అదేగదా మాకాక అంద. మీరిప్పుడు ఈ మద్రాసు ప్రభుత్వానికి ఆర్థిక. సలహాదారు. రైతులు, కూలీలు ఎన్నెన్ని యిబ్బందులకు లోనై వున్నారో, రిపోర్టులు వ్రాస్తున్నారు. దిన, మాస, వారపత్రికలు ప్రచురిస్తూవున్నవి. కనుక మీకు మా జమీందారీ రైతుల కష్టాలను తెల్పుతుంటాము. ప్రతిష్ఠను చేర్చి, మా బాధల గురించి పత్రికలకు వ్రాస్తూ వుంటే, యిటు ప్రభుత్వానికి, అటు మహాత్మునికి మీరు తెల్పుతూవుంటే, మాకెంతో బలం కల్గుతుందని నాయుడుగారు మాకు చెప్పిరి. నన్ను మిమ్ముల కలుసుకోమన్నారు."

"వారే యెందుకు రాలేదు" అన్నా!

"కోర్టులలో యీ జమీందారు వుద్యోగులతో సతమతమౌతున్నారు" అన్నారు

"నన్నే వారెందుకు కలియమన్నారు?"

"అమధ్య మీరు నెల్లూరులో, గాంధీజయంతికి, వచ్చిరిగదా? మీ ధోరణి వారికి నచ్చినది. అంతకుముందు ఒంగోలు కరువు నివారణ వుద్యమాన్ని నడిపినారట. అప్పుడు మీరు ఐ.సి.యస్ రివిన్యూబోర్డు మెంబర్లను ధిక్కరించిరట. కరువు నివారణ పనులు ఆ వుద్యోగులచేతనే చురుకుగా, విస్తారంగా జరిపించారట. ఈ గవర్నర్లకు మీరంటే భయమట. మహాత్మునికి మీ ఆర్థిక శాస్త్ర రచనలు మెప్పు అట. మీరే యీ జమీందారులను యెదిరించగలరు" అంటూ మా నాయుడుగారు చెప్పుతూ వుంటారు. మా కనకమ్మగారికి చాలా యిష్టము." అలాగా ప్రారంభమైనది. మా స్నేహితము-యిరవై అయిదు సంవత్సరాల కుటుంబ సఖ్యత్వము. రైతు ఉద్యమ సౌభ్రాతృత్వము, పొణకా వారితో, నాయుడుగారితో.

వచ్చినారొకప్రొద్దుట, అంత యెర్రటి ఇద్దరు తలపాగాతో, మాంబళంలోనిమా గృహానికి. ఆట్టె యెత్తులేరు. అందచందాలు అతలపాగా క్రింద కనపడ్డంలేదు. తాంబూలపు చురుకుదనం వున్నది.

"విసుగెత్తుతున్నదన్నట్టి, బ్రిటిషువారి దుండగాల గురించే పల్కడం, పాడడం,

గ్రామాల్లో దిక్కులేని బీదజనాలు యీ జమీందారి పెత్తనంలో నలిగిపోతున్నారు. మీరైత్వారీ రైతులకష్టాలొక లెక్క: మా జమీందారీరైతుల జీవితం దుర్భరమై పోతున్నది. పోతే ఆ బ్రిటిషు పెత్తనం యీ జమీందారీ పెత్తనం ఒకేసారి పోవాలండీ లేకుంటే మా కాంగ్రెసువారివి స్వరాజ్యం వచ్చిం తరువాత, యీ జమీందారులు కానేస్తారండీ. అప్పుడింకా మా కష్టాలు హెచ్చుపెరుగుతాయి" అన్నారు.

అలా మాట్లాడుతూ, పాట ప్రారంభించారు. ఏమి ఆ కంఠం, ఆ వుద్ధృతమైన పాటలమాటలు: వాటిని మించిన ఆ స్వరాల పలుకులు. భారతీదేవిని పిల్చినా, యిద్దరం వారి పాటలు వింటిమి· మాటలను మ్రింగితిమి ఆయనక్షణంలో ఆరడుగులకు మించి పెరిగిపోతున్నారు. ఆ వెంకటగిరి ఆరుపులు మా మనసుముందుకువచ్చినవి. ఆ రైతుల పశువుల మంద బందెలదొడ్లల్లో, రొప్పుకుంటూ ఆకలితో కన్పడుచున్నవి. "దారి దొంకలు లేని వూళ్ళన్నా" అంటున్నారు నాయుడుగారు, జింకలు, లేళ్ళు పంటలు పాడుచేస్తుంటే, రైతో, కూలో వడిసెలతోనో, బరిసెలతోనో అదిలిస్తుంటే పడగొట్టితె, మోయలేనంత జరిమానాలు. అందమైన ఆడబడుచు ఉద్యోగి కంటబడ్డదా ఆ వూరికి ముప్పే. రోషమున్న రైతు వున్నాడా వాని పైరు దగ్ధమే, పాలిచ్చే పెద్ద పాడుగు అవు అందిందా, వుద్యోగులకు అందించాలసిందే. రైతులు కూలీలంతా జమీందారులు "పరవ" వేటకువస్తే, తప్పెట్లు డబ్బాలు, వడిసెలు, యీటెలు తేవాలి. పులిని ,జమీందారుకోవున్న కలెక్టరు వగైరాల ముందుకు చేర్చాలి· వారి తుపాకిగుండు, పొరపాటున తమలో యెవ్వరిపైనపడినా, నోరుమూసుకుని వుండాలి. గొప్పమృగం ఎవ్వరికైనా· కొట్టిందా, కరిచిందా, చంపిందా "గప్‌చిప్" గానే నడవాలి. చచ్చిన మృగాలను దివాణం వారికే అందించాలి. మిగతావారికి, రైతుకూలీల యిండ్లల్లో, విందులుసాగించాలి, పంటలు పోయినై, పశువులు చచ్చినై, యింటి ఆవిడకు ప్రసవవేదనలు. దిక్కేది, మందేది, కరువురక్షణేది, ఆస్పత్రులు, జమీందారీ వుద్యోగులకే. అంతాదివాణంవారికే, ఇంకెన్నో, హృదయ విదారకంగావుండే, కృషీవలుల కష్టాలను తవ కవనంపు అద్దాలలో మాకు చూపెట్టిరి. భారతీదేవి ముఖమంతా దుఃఖంతో కందిపోయింది, వాగ్దానం చేశాం నాయుడుగారికి-మాశక్తికొలది వారిని, వారి పత్రికను బలపరుస్తామని, తాను శ్రీమతి కనకమ్మగారితో త్వరలోనే కలుసుకొందునన్నారు.

త్వరలోనే దేశదేశాల్లో పర్యటించి, పెద్దచదువులు బొంది కళకళలాడుతూ వున్న భారతీదేవిని చూస్తూ, సౌందర్య పిపాసియైన ఆరైతు కవీంద్రుడు ఆమెను తమబిడ్డగా, "యీమే మా భారతీదేవండి, ఈనాటి నుండి" అంటూ వో ఆశుకవిత్వం అల్లినాడు.

## గాంధీజీ గారి యెదుట నాయుడుగారిపాట

1933 డిశంబరాంతమందు, మహాత్ములు ఆంధ్రకు, వెంకటగిరికి వచ్చిరి. వారి వద్ద మాపైన కొందరు ఆంధ్ర కాంగ్రెసు పెద్దలు వ్యాజ్యం వేసిరి. జమీందారులపై అకాలంగా జగడాలుపెంచి, జాతీయోద్యమానికి బలహీనత కల్గిస్తున్నామన్నారు. గాంధీజీకి మా వుద్యమం తలనొప్పి కల్గిస్తున్నదంటూ వుండినారు.

ఆయన హృదయం నాకు యెరుకే. ఐనా వారినుండి రైతుల సమక్షంలో మా వుద్యమానికి ఆశీర్వాదం పొందాలి గదా?

కటికినేనివారి యింట్లో వున్నారువారు. ఆ సోదరుల స్త్రీలను, జమీందారీ వుద్యోగులవల్ల బాధితులైన స్త్రీలను మహాత్మునికి పరిచయపరచిరి భారతీదేవి. దెబ్బలు తిన్న గోవిందరెడ్డి ప్రభృతులను నాయుడుగారు వారియెదుట బెట్టిరి. నేను రైతులగోడు వినిపించితిని. "అడవులు నీటివనరులు, బంజర్లు, గ్రామకంఠాలు ప్రజలందరిసు అవిభక్త్వ పెత్తనంలో వుండాలిగాని, జమీందారుల ప్రైవేటు ఆస్తులు కాగూడదు గదా? రైతాంగపు పశువులను వీధులలోనే దొడ్డులందే బందీచేయవివ్వచ్చునా యీ రాజులే రోజురోజుకు శిస్తులు పెంచుతూ? శాసన ధిక్కారం చేయడం రాజుల హక్కా? శాంతియుతంగా, రైతు ఉద్యమం నడుపుకోవడం తగదా? బ్రిటిషువారి అండనుచేరి యిన్ని అన్యాయాలు చేస్తుంటే, కొందరు జమీందారులు అప్పుడప్పుడు కాంగ్రెసును బలపరుస్తునారని రైతుల మరువదగునా?" అంటున్నానేను. మధ్యమధ్యగా కూనిరాగం వినవస్తూవుంది.

ఏమిటన్నారు మహాత్ములు?, నేను నాయుడువంక చూచితిని, భారతీదేవి "వారే మా రామానాయుడుగారు. ఈ బక్కరైతులకు, మాకు తమ పాటలద్వారా, ధైర్యం పూరించువారు" అన్నారు.

"పాడమనండి ఆపాటను" పాడడం మొదలెట్టినారు. కథియవాడ రైతు పాగాతో, వొక్కటి 'మాకొద్దీ జమీందారుపొందు, రెండు 'తుమ్మెదా మూడు' చికలు మహాత్మునికి తెలుగుతెలియకు; రైతాంగపు హృదయవేదనంతా నాయుడుగారి ధ్వనులలోమహాత్మునికి అందింది. నావంక తిరిగారు. "రంగా, యీజమీందారీ పెత్తనం పోవలసిందే. చెప్పు, మీనాయుడు అరైతులకు నాఆశ్వీర్వాదములు మీకున్నవి: రామా, రంగా, భారతీబాటలో నడవండి" అన్నారు. ఆనాడే. రైతులోకం జమీందారులనుండి, విముక్తిపొందింది. అనుకున్నాం మేమంతా:

1930-34, సెంట్రలు అసెంబ్లీ యెన్నికల్లో. నాయుడు కనకమ్మ నన్నే బల పరచిరి. మమ్మెదిరించు రెడ్డి, చౌదరులతో తమకు పనిలేదనిరి, ఇచ్చినారు సమాధానం

ప్రశ్నించువారికి - "మా రంగాగారు రైతులమనిషి కనుకనే, వెంకటగిరి రాజా. జిల్లా బోర్డురెడ్డి, తాలూకాబోర్డుల దొరలు, కాంగ్రెసులోని పైపై రాజకీయ అంతస్తులవారు అయిన్ను యెదిరిస్తున్నారు. మాదిమహాత్ముని కాంగ్రెసు. మమ్మెదిరించువారిది, ముసుగు లోని పెట్టుబడిదారులు, జమీందారుల కాంగ్రెసు" అపుడుపాడుచుండినారు. ప్రారంభించి నారు నాయుడుగారు తమ పాటను:- "రైతుకే వోటివ్వవలెనన్నా అనినాదం వల్లె వల్లెలలో ప్రతిధ్వనించి పోయింది. "రైతుప్రతినిధే నీకష్టసుఖముల తెల్పగలడన్నా" అని నాయుడుగారు తన అమృతగళంతో ఘోషిస్తూవుంటే, రైతులు మా మాటలంచు మననుంచినారు. మాకందరికి నాయుడుగారి పాటా మాటా, యెనలేని బలంకల్గించి. విజయం అందించింది.

1930లో నేను మహాత్ముని ఉప్పుసత్యాగ్రహోద్యమాన్ని బలపరచితి. వారి అనుమతిపొంది, వుద్యోగాలన్నిటివీడితి, మద్రాను నివాసము వదలితి: నిడుబ్రోలులో మా పొలంలో, 'గోభూమి'గా మా పశువుల కొష్టమును మార్చితిమి. అందే భారతీదేవి తన కాపురము, గాంధేయ ధోరణిలో నడుపుకొనుటకు పూనుకొనిరి. దానికున్న మట్టి దారిని 'పోతన దొంక అనుకొన్నాము.

1931లో భారతీదేవి తెనాలిలో విదేశీ వస్త్రాలపై, సారా కల్లు, దుకాణాలపై పికెటింగు చేయు కాంగ్రెసు స్త్రీల శిబిరానికి అధిపతిఐరి. అటులే, కనకమ్మగారు నెల్లూరు కాంపును సాగించిరి.

నేను ఇంగ్లాండులో, ప్రథమ రౌండు టేబులు కాన్ఫరెన్సును యెదిరిస్తూ, మహాత్ముడులేకనే అట్టి కాన్ఫరెన్సు జరుపుట భారతజాతికి అవమానమని గొప్ప ప్రచారంచేసి, గాంధీ - యిర్విను వొడంబడిక చేయు సమయానికి భారతదేశానికి వచ్చి, గాంధీజీ ఆశీర్వాదముల తిరిగి పొందితిని. ఇప్పుడేమి చేయబోతున్నావని మహాత్ములడుగగా, శిస్తులభారంతో బాధితులైన ఆంధ్రరైతుల రక్షించడానికి, జమీందారీ రైతులు, అటు బ్రిటిషు పెత్తనం, యిటుజమీందారుల పెత్తనంవల్ల బాధితులైవున్నారు. వారినెట్లా సేవించడమో విచారించబోతున్నాను అంటిని.

"ఔనౌను, రైత్వారీ రైతుల గురించి నీవు వ్రాసిన రిపోర్టు బాగున్నదట. వారి నెట్లా సేవించాలో నీకు తెలిసివచ్చింది. అలాగే జమీందారీ రైతుల గురించి బాగా చర్చించు. ఐతే, యీ జమీందారులు చాలామంది మనతో వుంటున్నారు· జాగ్రత్త" అని హెచ్చరించిరి. ఉప్పుజేసే రైతులు మీ ప్రాంతాల్లో వున్నారు, వారికి యీ గాంధీ-యిర్వినుపాక్టు వుపయోగపడేటట్లు చూడగలవా" అన్నారు. "అవును, అదికూడా చేయ ప్రయత్నిస్తానులెండి:" అలాగా, కరాచీ కాంగ్రెసునుండి ఆంధ్రకు వచ్చినా: నాయుడు గారిని కలుసుకున్న:

## విచారణ సంఘం

1931 ఎండాకాలంలో - అల్లూరులో, నెల్లూరు జిల్లా రాజకీయసభ జరుగుచున్నది. నన్ను పిలిచిరి. నాయుడుగారు 'జమీందారీరైతుల కష్టాలనుగురించి విచారణ సంఘం' యేర్పరచాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టిరి. దానికి, నన్ను అధ్యక్షులుగా సూచించిరి. "అప్పుడే రీసెటిల్‌మెంటుచేసి, రూపాయకు మూడణాలు అదనపుశిస్తు వేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనపై, కౌన్సిలువారి విచారణ సంఘం గొప్ప ఆర్థిక విచారణ జరిపింది: దాన్ని నడిపించిన ఆర్థిక శాస్త్రవేత్త శ్రీరంగా, అప్పుశాయనకి వేయిరూపాయల జీతాలిచ్చారు. ఇప్పుడు గాంధి శిష్యులై, వుచితంగా యీ విచారణ జరుపుతారు" అన్నారు. ఆసంఘమునకు నాయుడుగారే కార్యదర్శి, గూడూరు పెల్లేటి వెంకటసుబ్బారెడ్డి, మేనకూరు సీతారామరెడ్డి సభ్యులు.

ఆ విచారణ సంఘాన్ని 'రంగా కమిటీ' అని 'జమీందారీరైతు, పత్రిక పిలవడం ప్రారంభించింది. ఆవిచారణ సంఘమును ఏర్పరచడంలోనే. నాయుడుగారి రాజకీయ చాతుర్యం పైకొచ్చినది. అప్పటి ప్రభుత్వములో బీరకాయ పీచులాగా, బంధుత్వాల ద్వారా ఆంధ్రలోనున్న ప్రముఖ జమీందారీలలో హెచ్చుమందితో పెనవేసుకొని వుంటూ, వారి అందరిమధ్య అత్యంత ప్రాముఖ్యము పొందిన వెంకటగిరి మహారాజా పాలనపైననే విచారణా? దాన్ని నడుపునది, ఆనాటికి ప్రథమ ఆర్థికశాస్త్రవేత్తగా ప్రభుత్వముచే గుర్తించబడి, వారి ప్రప్రథమ ప్లానింగు సలహాదారుగా అంగీకరించబడి వుండిన ఆచార్యరంగా అంటూనే జమీందారు లందరికి గొప్ప ఆందోళన: విచారణ సంఘం గ్రామాల పర్యటన ప్రారంభించినది. దినపత్రికలలో నాయుడుగారు ప్రచారం సాగించినారు. వారంవారం వివిధ జిల్లాలలోని జమీందారీ రైతులు, తమతమ కష్టాలను తిరిగి తరచుకొంటూ, లెక్కించుకొంటూ, వివరించుతూ. మాకు వ్రాయడం మొదలెట్టిరి. ఆ కథలను మా పత్రిక ప్రచురిస్తూవుండెను ప్రతివారం. ప్రతిజిల్లాకు, ప్రతి జమీందారికి రమ్మంటూ, వచ్చేముందే తమ మెమొరాండంలు తయారుచేసుకోవడం మొదలెట్టమన్నారు నాయుడు: జమీందారీ రైతు పత్రికద్వారా, ప్రతివారం యేదోవొక హెచ్చరిక చేస్తూనేవున్నారు. ఆంధ్రపత్రికనే, వారికి వార్తాపత్రికగా మార్చుకున్నారు. రైతుల ఆందోళనను దినదినానికి రాజేస్తూవచ్చినారు.

ఇదిగో ప్రారంభమైనదన్నారు విచారణ. మనుటోలు చేరిరి. గూడూరులోకూడా విచారణే అన్నారు. ఎట్టకేలకు వెంకటగిరి చేరుతున్నారు. జమీందారుల కోటలో కల్లోలమన్నారు. గ్రామా రైతులల్లో కలకలమన్నారు. వచ్చిరి, వాలిరి, రైతునాయకులు కాంగ్రెసు పెద్దలు అటూ నాయుడుగారి 'జమీంన్‌దారీ రైతు' కబుర్లు.

వెంకటగిరిలో, 1920 లోనే కాంగ్రెసులోచేరి, సంస్థానం వత్తిడులకు లొంగక: బ్రిటిషువారు, జమీందారుల క్రౌర్యంవల్ల, అంతకుమునుపెప్పుడో యివ్వబడ్డ జాగీర్ గ్రామాన్ని తిరిగి సంస్థానం వసపరచుకున్నా లొంగకుండిన గాంధేయులు. కటికినేని వారు. మహారాజుకు బంధువులైనా, దేశభక్తి ప్రపూరితులైవున్న ఆ సోదరులు, కల్యాణరావు, వెంకటరామారావు, మన నాయుడుగారికి మిత్రులు. వారి యింట్లోనే మా మకాము ఎచ్చటెచ్చటనుండో, ఎందరెందరో, రహస్యంగా, బహిరంగంగా, రైతులు మమ్ముకలుసుకుంటున్నారు. వారందరితో ప్రథమ చర్చలు నాయుడుగారే జరుపు చున్నారు.

వారివి మా విచారణ కమిటీముందు సాక్ష్యమివ్వడానికి తయారుచేస్తూవుండిరి. కొందరు భయభ్రాంతులగుచుంటె, ఆశు కవిత్వంతో ఎన్నెన్నో పదాలు అల్లుతూ. వారికి ధైర్యం కరగబోసి, పాలగిన్నెతో అందిస్తూవుండేవారు. అప్పుడే వెలికివచ్చినది. ఎవ్వరోభయం, సిగ్గుబడుచూవుంటె "యినుప కమ్ములలోన యిరికించి, వినుగాంచి, యికిలించుచున్నారు చిలుకా" అనే హృదయమును చిలికించే పదం వెలికిదెచ్చారు.

మా కమిటీప్రోగ్రాం పత్రికలలో వస్తూవుంటె: ఆ చుట్టుప్రక్కల గ్రామాలన్నిటిలో జమీందారీ వుద్యోగులు విపరీతంగా, ఎవ్వరు వారి సంస్థానానికి విధేయులు,' మరెవ్వరు "అవిధేయులు" అనే లిస్టులు వేసుకుంటూ వుండిరి. అందరినీ బెదరిస్తూ, కమిటీని "బాయ్‌కాట్" చేయమని రైతులను ప్రబోధిస్తూవున్నారు. అందువల్ల. ప్రతిచోట బహుకొద్దిమందే మమ్ము కలుసుకునేవారు. అందునూ కొందరు రహస్యంగా రాత్రివేళ, మరికొందరు వారి పీరిద్వారా మాకు తమ కష్టాలగాథలను, అర్జీలు, నివేదనల ద్వారా తెల్పుచుండేవారు.

అంతగా అ విధంగా రైతాంగం జమీందారీ పెత్తనాన్ని చూచి బెదిరిపోతూ వుండడం మాకందరికీ రోషమే: నాయుడుగారికి మరింత వుద్రేకము ఈలాగా యీ రైతులోకంవుంటే, స్వరాజ్యమెలాగవస్తుంది? అది వచ్చినా, గ్రామాలలోవున్న యీ ప్రజలు యెలాగా, ఎప్పుడు మేల్కొంటారు, లేచినిలబడతారు, పౌరుషంగా తమ హక్కులకై పోరాడుతారు? అనుకుంటూ నేను బాధపడుతూ వుంటే, అంతకంటె రోష పడుతున్న నాయుడు, తమ్మును తాను సమాళించుకుంటూ, నాకు కొంత "వార్మి, శాల్మి" సందేశాలను అందిస్తుండినారు.

## ప్రథమ వెంకటగిరి సభ

ఎలాగో వెంకటగిరిలో సభ జరిపాము - ఆరధాలరచ్చవద్ద: అదుగో ఆప్రక్క ఆకాశాన్నందుకొంటున్న దివాణపు "పాలెసు". రాత్రి ఎనిమిదికే మేము చేరగలం

ఆ చీకటిలో, మిణుకు-మిణుకుమంటూ నాల్గులైట్లు. వచ్చినవారు. వొకటి రెండు వందలా. లేక, నాల్గువందలా, అనిపిస్తూవున్నది. ఐనా వారే వేలమాకు. అసలు వస్తారా యెవ్వరైనా అని, ముసలిరెడ్డిగారనుకుంటూ వుండిరి. "తప్పకవస్తారు, ఎందరో అరుగుల మీద వుంటారు, మరెందరో ఆసమయానికి వస్తారు. దివాణపు చిన్ని చిన్ని నౌకర్లే చేరుకుంటారండీ" అంటూ, అతివుత్సాహపరుడు, కష్టాలను లెక్కించక, నిప్పుల్లో దూకుతుండిన కల్యాణరావు పల్కుచున్నారు: సభ ప్రారంభమైనది, బేబుల్సుకు ముందు పల్చగా వున్నారు. ఆచివర, యీ చివర, చిలకరింపుగా వచ్చారు. నెమ్మదిగా కుర్చీలలో కూచుంటున్నారు.

నాయుడుగారు లేచారు, తుమ్మెదపాట ప్రారంభిచారు. ఏమా కంఠస్వ గంటలు: ప్రతిమాటకొక రత్నాల రువ్వలు. కొద్దిమందే చప్పట్లు అందించారు. చిలుక పాట సాగించారు. మరికొన్ని చప్పట్లు. సభలో బలం చేరుతుంది. సీతారామరెడ్డిగారు మెల్లి మెల్లిగా-రైతులు తమ కష్టాలగ్గురించి తెలుపుకోడానికి జమీందారుగారు ఎందులకు ఆందోళన పడాలన్నారు. ఉద్యోగులెందుకింత చిందులు త్రొక్కుతున్నారు. అనేసరికి, దివాణపు వైపుగావున్న వరండానుండి కొందర్ను నవ్వడం ప్రారంభించారు. నాయుడు గారికి కోపం, కల్యాణరావుకు శివం, మా ముందే కూర్చున్నవ్యాకి వుద్రేకం కల్గింది. 'ఏమి, మాసభ జరుపుకోకూడదా, నాయుడుగారూ. రంగాగారిని మాట్లాడమనండి, వీరిసంగతిచూస్తాం' అంటూ వుండినారు.

అంత, 'మాకొద్దీ జమీందారి పొందు, మా ప్రాణాలపైపొంచి, మానాలు హరియించు మా కొద్దీ జమీందార్లపొందు" అనే జేగంట మ్రోగింది. పదం తరువాత పదం రోషారుల కాంతులు, రైతులవద్ద చెకుముకిరాయికి దూది అంటుకున్నట్లు ప్రతిధ్వనించుచున్నది.

"అయ్యా, మీరు లేస్తారా? ఐతే, ఒకమాట ముందు వీరికి అందించనివ్వండి" అన్నారు నాయుడు. యీ రంగాగారు, వీరితో చదువు కొన్నవారే.

"ఇప్పుడిచ్చటికొచ్చారే ఆ యింగ్లాండులో యీ జమీందారువార్రి దివాన్జీ సుబ్బారావుగారు. వీరందర్కికి పెద్ద, ఐ సి. యస్, రామకృష్ణగార్ను రంగాను యిచ్చటికి పోవద్దన్నారు జమీందార్నుగారి తరపున ఏన్నోభయాలు కల్గించారు. యింకా బలీయమైన ఆశలు అందించారు వాటికి లొంగలేదు వీరు. ఎందరో చెప్పినారు నాకు-రంగా యెలా వస్తారయ్యా. వారికి గురువులైనవారే అడ్డగిస్తున్నారు. వెంకటగిరి కుమారరాజా, శాసన సభా సభ్యులు, ఆరామకృష్ణకు స్నేహితులట. రంగాగారు ఎన్నికల్లో నిలబడితే,

క్రిందటిమారు, వెంకటగిరివారు వోడించారుగా, యీమారు మళ్ళా ఎన్నికల్లో రంగా నిలబడుతారు! అప్పుడు యీ దివాణంవారు సహాయం చేస్తామంటున్నారు. అని వక్కాణించినారు. "రానేరారా, రంగాగారు" అని యెందరో నన్ను అడుగుచున్నారు నెల్లూరులో! అప్పుడు అన్నారు, దేశభక్తురాలు కనకమ్మ, "రంగాను వీరెవ్వరయ్యా కదలించగల్గేది? అనాడు బ్రిటిషుగవర్నరు, రెండువేల జీతం, ఎన్నో వుద్యోగాలు, ఎంతో బిరుదులు. ఆ కాలేజి ప్రిన్సిపాలు అందిస్తామంటె, వినకుండా గాంధీజీని కౌగిలించుకున్నవారు" అన్నారు. ఆ ధైర్యంతోటె, కమిటీ విచారణ ప్రోగ్రాం యేర్పరచానండి. రైలు వద్దకు వెళ్ళాం. రారేమోననే భయంగావున్నా, ఆశతో ప్లాటుఫారంమీదవున్నాం! దిగారు మూడో తరగతి పెట్టెనుండి. మేము రెండో తరగతి పెట్టెవద్ద వుంటిమి. వెనుకటివలె, సూటులో హోదాల ఆర్భాటంతో వస్తాడని-శుద్ధ ఖద్దరుతో వున్నారు. ఆటోపీ చూస్తూనే, "వచ్చారు రంగాగారు, నేను చెప్పలేదా, తప్పక వస్తారని" అందరితో అన్నా, అలాగా అంటిన యీ రంగాగారు మాట్లాడతా రన్నారు."

నేను లేచా. చీకటి భాగాల్లోనుండి కరతాళాలు మ్రోగినాయి, ఎంతెంతో చెప్పినా.

ఈ జమీందారులు, యీనాటి కాలమహోత్సవమును గుర్తించి, రైతాంగం యొక్క బాధల నివారిస్తారా, సరి! శిస్తులు తగ్గించి, ఆ శాస్త్రీయ వసూళ్ల మానుకొని, అటవీ అపరాధపు జరిమానాలు తొలిగించి, రైతులను తమ సోదరులుగా చూడ నేర్చుకుంటారా సరి, లేకుంటె, యీ జమీందారీ సిస్టమ్ రద్దుకావాలంటామన్నా! బ్రిటిషువారిని యీ జమీందారులు నమ్ముకొని, రైతులను రచ్చకీడుస్తారా! కూలీలను బలవంతంగా, తమ వేట వినోదాలకు బానిసలుగా తోలుకెళ్ళుతారా? ఎవ్వరైనా పెద్ద మృగాల వాతబడితే, ఆ చచ్చినవారికి, నష్ట పరిహారం లేదుగదా, దహనక్రతువులనైనా జరుపరా! ఇట్టి క్రౌర్యపాలనం, బ్రిటిషువారికి అండగా వుండదమా! ఈ రెండు పెత్తనాలు పోవలసిందే! పోతాయి" అని గర్జించినా.

ముందున్నవారికేదో భయం క్రమంగా కొందరు పోతున్నారు. అది గమనించి, నాయుడుగారులేచి, "ముందుకాలము రైతుదేనన్నా, నిదురించకను నీవందు పాల్గొనరారన్నా" అన్నారు, ఆ సభ అలాంటి ఆశాజ్యోతి వెల్గిన సాగించితిమి.

అదే, భారతదేశంలో, జమీందారీ పెత్తనానికి, పర్మనెంటు సెటిల్‌మెంటు

రద్దుకు నాందిపాట! అదే, భారత రైతాంగ విప్లవమునకు ప్రారంభదశ! దానికి ప్రథమ వైతాళికులు రామానాయుడు.

ఆసభ కబుర్లు విద్యుత్ కణాల్లాగా ఆంధ్రదేశమంతటా, జమీందారీ రైతు యువకుల, వ్యవహర్తల హృదయాల్లో విప్లవజ్యోతులను, వెల్గించినవి. ఎంతోకాలం నుండి అతి నిరంకుశంగా బ్రిటిషువారి అధికారము తమ హస్తగతమైనట్లుగా పెత్తనం సాగిస్తున్న బొబ్బిలి, పర్లాకిమిడి. పిఠాపురం, మునగాల, నూజివీడు, చల్లపల్లి రాజాలు, మహారాజులు రైతులపై ఎన్నెన్నో కట్టడులు సాగించ మొదలెట్టినారు. ఐనా, ఆ బొబ్బిలిలో సాలావారు, ముక్త్యాలలో కిరణాలు, చల్లపల్లి లో ఘంటసాలవారు, నూజివీడులో కొల్లివారు, ఇభరాంపట్నంవారు కోర్టులలో, జమీందారీ శాసన వ్యతిరేక చర్యలపై కేసులు యెంతోకాలంనుండి సాగిస్తూనే వున్నారు. వారివి వ్యక్తిగత వ్యాజ్యాలనే భ్రమతో, మిగతా రైతులు వారికి తోడుగా నిల్చుండలేదు.

మా వెంకటగిరి సభ, విచారణ కమిటీ కబుర్లు, మా నాయుడు, మా శంఖపు మోతలతో, రైతులలో రోజు రోజుకు కలకలం కల్గించాయి. ఇక వ్యక్తిగత వ్యాజ్యాలవల్ల రైతులకు రక్షణ కల్గించలేమన్నాం. ఇది మందితోకూడిన వ్యవహారమన్నాం అందరంకూడి, మొత్తంగా, "ఎలకాలంనుండి రైతులను త్రొక్కివేస్తున్న జమీందారులెవ్వరు? ఆనాడు మొగలుల తాబేదారులు, ఈనాడు బ్రిటిషువారి పేష్కషు జమాధారులు. ఎందుకు రైతులు యింకా వొక్కొక్కరుగా బాధపడాలి?" అంటున్నాం. మా యిద్దరి ప్రబోధన రైతాంగ హృదయాలను చలింపజేస్తున్నది.

## మా సమావేశాలు అమృత కలశాలు

ధైర్యం పుంజుకున్నారు నాయుడుగారు. మా కందరికి, కనకమ్మగారి యిల్లు ఆఫీసు, ఆశయాలకు ఆకరము, ఆలోచనలకు ఆలయం! ఆమె మా కందరికి వుత్సాహం కల్గించు మాటలు, ఆమె చుట్టూచేరి, అందచందాల నందించు కవీంద్రులు మాకు కొంగ్రొత్త శక్తులు అందించుతూవుండేవారు.

"ఆమె దేశం, ఆస్తిపాస్తులంతా పోగొట్టుకొని, జమీందారుపై కక్ష సాధించాలని యీలాగా వీరందరిని ప్రోత్సహిస్తూవున్నారు. తనలాగే ఇతరులు గూడా దివాళా కోరులు కావాలని యిదంతా" అనేవారెందరో.

"ఆమె ధోరణి అది కానేకాదు, తనకు, తన కుటుంబానికి కల్గినబాధలే, వేలకొలది జమీందారీ రైతు కుటుంబాలకు కల్గుచున్నవి గనుక, తన అనుభవాన్ననుసరించి, అలాంటి దుర్గతి యితరులకుకూడా కల్గరాదని ఆమె ఆశయం" అని భారతీదేవి గ్రహించిరి. అందుకే కనకమ్మగారిని గౌరవించిరి. అలాగా, మేమంతా వారిచుట్టూ

చేరేవారం, ప్రతి టూరు పూర్తికావడంతోటే మా అనుభవాలు ఆమెతో కలిసి చర్చించుకొనేవారం. ఆ సమావేశాలు అమృతకలశాలు.

## రాష్ట్ర జమిందారీ రైతు మహాసభ

1931లో బొంబాయిలో, అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశం. రెండో రౌండ్ టేబులు సభకు మహాత్ముడే స్వయంగా వెళ్ళుతారు. కరాచీ కాంగ్రెసులో మేమంతాకూడి, జవహరు నాయకత్వం క్రింద, సుభాష్ సవాలు మా కందరికి చురక లంటిస్తూవుంటె, ప్రజాసామాన్యం, అందునా గ్రామీణ ప్రజలు. రైతులకు, కూలీలకు రక్షణకై, రానున్న స్వరాజ్యమందెట్టి ప్రాథమిక హక్కులుండాలో, వివరిస్తూ చార్టరు. తయారు చేసితిమి దాన్ని శ్రీ ప్రకాశ్ వగైరాలు బొంబాయిలో చర్చకు తెస్తారుక అంతనుముందే, జమీందారీ రైతులకెట్టి రక్షణలు కావాలో నిర్ణయించుకోవద్దా? కనుకే నాయుడుగారు, రాష్ట్ర రైతుసభ యేర్పరచాలన్నారు. కటికనేనివారు వెంకటగిరివి దాన్ని ఆహ్వానించారు. ఎప్పటినుండో, కళ్ళికోట రాజాను యెదిరిస్తూ, మద్రాసు కౌన్సిలులో ప్రతిపక్షనాయకులలో, వొకరైన, విశ్వనాథదాసుగారిని ప్రారంభకులుగా, నన్ను అధ్యక్షులుగా పిలిచిరి. రాజకీయ సభకు, సత్యమూర్తి, అసమాన ప్రత్యర్థి నాయకులు, ప్రముఖ కాంగ్రెసు వక్త, దేశోద్ధారక నాగేశ్వరరావు వచ్చిరి. జమీందారు బెదరిపోయి, అప్పటి హోంమంత్రి ఉస్మాన్ సాహెబు సహాయం అర్థించి సభలను నిషేధిస్తూ 144 సెక్షను ప్రయోగించిరి.

అప్పుడు చేయదగినది యేమి? ఎందరికో ఆందోళన, చేరిన వేలాదిరైతులలో కలకలం. ఎందరికో అదే ప్రథమం. జైలుకు పోవలసివస్తే సరి. పోలీసు లాఠీలు, అరెస్టులు నెదుర్కోవలయు నవాలు, తిరిగి యిళ్ళకు ఎందరు పోగలరో-అన్నీ భయాలే.

రాజకీయ సభలపై ఆంక్షలేమి. అవి జరిగినవి. సత్యమూర్తి, నాగేశ్వరరావు, జమిందారుల దురాగతాల గురించి ప్రజలకు వుద్రేకం కల్గునట్లే పల్కిరి, దేశ స్వాతంత్ర్యం కొరకై ప్రజలు త్యాగం చేయుటకు ప్రోత్సహించిరి. దేశానికే స్వాతంత్ర్యం కోరితే, ఆదేశప్రజల్లో ప్రధాన భాగస్వాములైన రైతులకు జమిందారులు సంకెళ్ళువేస్తే వూరుకుండగలరా అని రైతులను అడిగారు రామానాయుడు.

ఐనా. రైతులను లాటీచార్జి చేయుట మంచిది గాదనుకున్నాం. జైళ్ళకు నాయకులం, ప్రచారకులం, దస్త్రాలు చేయగలవారిని పంపుటకు తయారయినారు. కనుక, పోలీసు సూపరింటెండెంటుకు మా సభ జరుగునని కబురువేశాం. ఎచ్చట, ఎప్పుడు అని వారికి చెప్పాలా! అన్ని బజారులలో, యిళ్ళగేటులలో పోలీసులే.

రాత్రి కటికినేనివారి ఆవరణలో సభజరిపితిమి. తీర్మానాలు అంగీకరించిరి. సభ వృత్తాంతమంతా ఆ రాత్రీ, తిరిగి ప్రొద్దుట పోలీసులకు, కలెక్టరుకు, మద్రాసు దినపత్రికలకు, తంతిద్వారా, పోస్టుద్వారా, విశేఖరులద్వారా తెల్పినాము.

ఎవ్వరెవ్వరము 144వ సెక్షన్ను దిక్కరించితిమో వివరించినాము. ప్రధమంగా నేను, రెండోవారు రామానాయుడు, వారివెంట కటికినేని సోదరులు, అలోగా అకాం గోపాలం తిరుగుబాటుదారుల మయ్యాము.

మరునాడు పత్రికల్లో, మాసభ ప్రప్రధమంగా భారతదేశంలో "మాకొద్దు జమీందారీ పెత్తనం, పర్మనెంటు సెటిల్‌మెంటు పోవలసిందే" అనే తీర్మానం, మారు మ్రోగిపోయింది.

స్వరాజ్యము రైతులు, కూలీలకోసరము. రాళ్ళ కొరకుకాదు. స్వరాజ్యపు భారతావనిలో జమీందారులకు తావుండదు. అడవులు, చెరువులు, తదితర నీటివనరులు వనాలు ప్రజలందరివిగా ప్రభుత్వానికి చెందాలన్నానేను.

అంతే, అలావుంటే స్వరాజ్యము కావాలన్నారు. నాయుడుగారు. విశ్వనాథదాసు గారు 'సరే' నన్నారు, ఐతే ఇదంతా 'శాతియుతముగానే సాదించుదాము."అనుకున్నాము అందరము. ఆ తీర్మానానికి ప్రాణము పోసింది నాయుడు. వారి "జమీందారీరైతు పత్రిక, అందలి సంపాదకీయాలే. అప్పుడు ఆనందించిరి శ్రీమతి కనకమ్మ. తమ కుటుంబము పొందిన కష్టాల అగ్నినుండి యింతటి బ్రహ్మాస్త్రం వచ్చినందులకు ఆమెకు తృప్తి. మా అందరితో ఆనందించిరి? మాకు లాయరు సలహాలు అందిస్తున్న శ్రీవెన్నెలకంటి రాఘవయ్య. మద్రాసు కౌన్సిలులో గొప్పచర్చలు, తద్వారా. జమీం దారు లందరికి భయకంపాలు, వేర్వేరు జమీందారులు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్లను పెట్టుకొని, తాము రైతులను శోషింపచేయడములేదు. ఆ శాస్త్రీయ శిస్తులు, ఫీజులు, అపరాధాలు వసూలుచేయడము లేదు. తమ శిస్తులు భరించరానంత హెచ్చుగాదు అంటూ, తమ చెరువులు, నీటివనరు బాగుచేయ బడుచున్నవంటూ. పత్రికాప్రచురణలు ప్రారంభించిరి.

అందువల్ల రైతుల ప్రబోధాలు రాష్ట్రమంతటా కొంత తగ్గుచుండినవి అది అంతా రామానాయుని పవార ప్రభావమేనని భావితిదేని.

### తీర్థంపాడు సభ - సత్యాగ్రహ నిర్ణయం

ఆనాటి మహారాజకుమారుడు తొందరపాటి పెత్తందారు. కనుక మా సభలలో స్థానికరైతులకు పెత్తనం వహించిన పెట్లూరు గోవిందరెడ్డి, వారి బంధువులు, పెద్దలు చెంచురెడ్డిపై కక్షబూనిరి దివాణానికివ్వవలసిన పుల్లరి పెంచివేసిరి. అటవీనిర్బంధాలు

ఆఖరుకు, వంటచెరుకుకై కర్ర, కొమ్మ కొట్టుకోరాదనిరి ఈకక్షసాధింపు నెదిరించాలని నాయుడు రైతుల ప్రబోధించిరి ముందుకొచ్చిరి గోవిందరెడ్డిగారు. నన్ను తమ ప్రత్యేక సభకు రప్పించిరి.

అది తీర్థంపాడు అడవుల అంచులో. వేల రైతులు చేరినారు. దారిలోవున్న గ్రామాల్లో పశువుల మందలు దారులు, డొంకల్లో, దొడ్లల్లో క్రిక్కిరిసివుండినవి అడవిలోకిపోరాదుగా? అంతటా సంస్థానపు అటవీఉద్యోగులు, పోలీసులు. అంతా యుద్ధ రంగంగా వుండినది.

సత్యాగ్రహానికి నాయుడు అచ్చటి రైతులను పురి గొల్పినారు. నేనేమో నెల్లూరులోని ప్రభుత్వోద్యోగులతో. దివాన్‌జీతో రాయబారాలు జరుపుట ముందు అవసరమన్నా. పత్రికలకు కబురందిస్తున్నారు. చుండి విశ్వనాథం రైతుల లాయరు పత్రికాప్రతినిధి.

తీర్మానమైతే చేశాము సత్యాగ్రహం సాగించవలసినదేనని. ఎవ్వరెవ్వరం ఎప్పుడెప్పుడో నిర్ణయించుతున్నారు నాయుడు, కటికినేనివారు. గాంధి-యిర్విను పాక్టుకు వ్యతిరేకంగాదు మా రైతు వుద్యమం· సత్యాగ్రహోద్యమం అని, పత్రికల వారికి నచ్చచెప్పినప్పుడే ఆ సభ, తీర్మానం, ఆ సత్యాగ్రహదీక్ష, జైలును నడచువారిలిస్టు తయారుచేసితిమి.

## రీ సెటిల్‌మెంటు - రైతు సత్యాగ్రహం

ఆ వెంటనే, వుభయ గోదావరీ, కృష్ణా రైతులపై వేయబడుచున్న అదనపు శిస్తు నిరాకరణ సత్యాగ్రహోద్యమ సాఫల్యం కొరకై, బందరు వెళ్ళితిని: బందరులో రివిన్యూబోర్డు అధ్యక్షునికి, రైతులపై అదనపు పన్నులు వేయడం ఎంత అన్యాయమో వివరించితి: వాటిని రద్దు జేయకుంటే, సత్యాగ్రహం తప్పదంటిని: అనాటి గొప్ప బహిరంగసభలో రైతురక్షణలేని స్వరాజ్యం మహాత్ముడు కోరుకోవడం లేదంటిని: రైతు రక్షణకొరకై ప్రాథమిక హక్కుల జాబితాను, బొంబాయిలో రూపొందించుటలో నేను నడిపిన చర్చలు గాంధీజీకి సమ్మతేనంటిని: అటు వెంకటగిరిలో జమీందారులు, యిటు గోదావరి కృష్ణాలో, బ్రిటిషువారు నడుపుచున్న రైతాంగ వ్యతిరేకపాలనం పోవలసినదే. అందరూ, రైతు సత్యాగ్రహోద్యమాన్ని బలపరచ గోరితిని: కృష్ణా పత్రికలో ముట్నూరి కృష్ణారావుగారు నన్ను సమర్థించిరి. మరునాడే తిరిగి, వెంకటగిరికి తీర్థంపాడుకు బైలుదేరితి. విజయవాడలో రైలును యెక్కుచున్నా, నా చేతిపై మరెవ్వరి చేయో పడ్డది. తిరిగిచూస్తే, పోలీసు సూపరింటెండెంటు సలాముచేసి, మిమ్ము అరెస్టు చేయమన్నారండీ అన్నారు. ఎందుకూ? "వెంకటగిరి రైతు సత్యాగ్రహం ప్రారంభించ

పోతున్నారుగదా. అలా జరుగనివ్వరాదని మాకు రహస్యపు ఆజ్ఞ" అన్నాడు. ఆరాత్రి, విజయవాడ సబ్ జైలులో నన్నుచేర్చిరి.

ఐతే,వెంకటగిరి వుద్యమమో? నాయుడుగారొక్కరేనా? వారిని యేకాకిచేస్తామా అన్న మరునాడు చేరిన భారతీదేవిగారితో. గొట్టిపాటి బ్రహ్మయ్యగారు వొప్పుకున్నారు ఆ వెంకటగిరి అడవులను అందుకోడానికి. భారతీదేవి ప్రయాణమయ్యారు. దివిసీమ ఉద్యమాన్ని శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారు అందుకున్నారు. అలాగా దేవిజీ తనబలాలతో వెంకటగిరిరైతులకు అందిరి.

## భారతీదేవిపై దౌర్జన్యం

వెంకటగిరిలో వారిసభకు ప్రజలు కోలాహలంగా వచ్చిరట. అందరూ యుద్ధ మర్దనలు చేసిరి. భారతీదేవి యితర దేశాల్లో ఎలాగా యీ జమీందారుల దురాగతాలు అపివేయబడుతున్నవో తెల్పిరి: "బ్రిటిషువారికి అండగా వుంటూవున్న, దేశద్రోహపు జమీందారీ పెత్తనం పోవాలి. పోక్రోలుతా" అని గర్జించుచున్నారు. టపీమని ఆమె తలపై రాయిపడ్డదట. నెత్తురు చిందమొదలిడినదట: ఆమె పైట చెరగుతో గాయాన్ని అదిమిపెట్టుచుండగా, ఈరక్తపిపాస జమీందారీ పిశాచం నశించాలనే నినాదాలు రేగిన వట: వుగ్రుడై లేచిరి నాయుడుగారు. వుండండి, "ఈజమీందారులు యిట్లేగా మన రక్తాన్ని ప్రవహింప చేస్తున్నారు. మన భారతీదేవి రక్తాన్ని యిలా యీ రాయిగాదు తీసింది: యీ జమీందారీ యేజెంట్లుగామ: వీరదంరిని ప్రేరేపిస్తున్న జమీందారులు. ఈ జమీందారులే పిశాచము. ఈ పిశాచమును, మన దేవిగారి ప్రతి నెత్తురుబొట్టు వొక్కొక్క చక్రాయుధమై, వెన్నంటుతుంది: తుదముట్టిస్తుంది. ఇదే మనశాపం, మన శాద్ది" అంటూ రుద్రుడై పోయిరట?

ఆ పిమ్మట, తీర్థంపాడు అటవీ సత్యాగ్రహం సాగించినారు, మాసాలపర్యం తం! మేమంతా జైళ్ళలో వున్నాం! ఆ సమయం చూసుకొని, ఆనాటి జిల్లా కాంగ్రెసు వారిని, ఎటులో. సంస్థానంవారు అందుకొన్నారు. వారు "కాంగ్రెసుకు, ఆ రైతుల సత్యాగ్రహోద్యమంతో సంబంధంలేదనే" కరపత్రాన్ని ప్రచురించినారు. అదిచూచి రైతులు విర్ఘాంతపోయిరి.

గాంధీ-యిర్విన్ వొడంబడికను రద్దుచేసినారు వైస్రాయి వెల్లింగ్డను. మహాత్ముని జైలులోపెట్టిరి రెండో రౌండుటేబులు కాన్ఫరెన్సునుండి బొంబాయికి తిరిగివచ్చిన వెంటనే, మద్రాసురాష్ట్రమంతటా రైతుసంఘాలు, సత్యాగ్రహాలను బహిష్కరిస్తూ ఆర్డినెన్సు ప్రయోగించినారు. నన్ను జైలుకు పంపుకున్నారు- ఇదే సమయమనుకుని, గోవిందరెడ్డిగారిని వావుదెబ్బలుకొట్టిరి. గ్రామాల్లో కరకు ఆర్డినెన్సు పాలనం, ఆపైన జమీందారీ దౌర్జన్యాలు: వీటన్నిటికి బలమిస్తుంది కాంగ్రెసు వారి ప్రకటన: ఆ సమ

యాన్నే, నాయుడుగారిపై మిగతావారిపై సెక్యూరిటీ కేసులు, వెంకటగిరి ప్రాంతాలకు చేరరాదని ఆంక్షలు: అప్పుడేమి చేయడం? ఎలాగా రైతులకు దిక్కు కల్గించడం? నాయుడుగారుకూడా జైలుకువస్తే లాభమా? సెక్యూరిటీ యిచ్చి, బైటనేవుండి, అటవీ రైతులపై జరుగుచున్న పోలీసుల దుండగాలను ఆపుకుంటూ కోర్టులలో రైతులపై జమీందారులు సాగించు కేసులలో డిఫెన్సు పెట్టుకుంటూ వుండడమా? భారతీదేవి, గొట్టిపాటి, మరెందరో జైలుకు పోయినారు. వీరినికూడా బ్రిటిషు పోలీసులకు అందిస్తే జమీందారీ దౌర్జన్యాలు పెచ్చుపెరుగునే- అన్నీ ఆలోచించి, నాయుడుగారిని వెలుపలనే వుంచాలనుకున్నాం: ఆయనకు సమ్మతి కలుగలేదు. ఐనా, తప్పదన్నాం: ఎట్టకేలకు వారు, తదితరులు బైటనేవుండిరి, రైతులతరపున చట్టరీత్యా ఆందోళన సాగించిరి.

సంవత్సరం తిరిగేసరికి, రైతులకు బలంకల్గింది తమ గ్రామాల్లో నిర్బంధింప బడ్డ పశువులకు, రాపూరుతాలూకా అడవుల్లో పారాడడానికి నాయుడుగారు, శ్రీ దేగా రామిరెడ్డి వగైరాల సహాయం పొందిరి. కోర్టులలో జమీందారుల ఆటలు కొంతగా కట్టించిరి. వారి దౌర్జన్యాలను, హిందూ, ఆంధ్రపత్రిక ఎగైరా పత్రికలు విమర్శించునట్లు చేసిరి.

తుదకు సిగ్గుయిపోయి, కలెక్టరు, జమీందారును రైతులతో రాజీకి రమ్మని పిలిచిరి. దివాన్జీ రాజీకి సిద్ధపడిరి అటవీ పుల్లరి తగ్గించిరి. తప్పుడు కేసులు అపుడలా చేసిరి; రైతులు, జమీందారీ దివానంతో, సమస్థాయిలో రాజీచేయుటకు తగిన స్తోమతు సాధించిరి. నాయుడుగారు విజయలక్ష్మిని రైతుల దృక్కోణంలోకి అందించగల్గుచున్నారు.

## బోర్డు ఎన్నికలు- రైతుపార్టీ విజయం

నేను జైలునుండి తిరిగివచ్చేవరకు (1932 నవంబరు) తాలూకాబోర్డు ఎన్నికలు వస్తున్నవి. అవి పుట్టినప్పటినుండి వెంకటగిరి బోర్డుకు, సంస్థానంవారే సభ్యులుగా, అధ్యక్షులుగా వుంటూ వుండిరి. మరింకెవ్వరికి నిలబడాలనుకొనుటకు గూడా ధైర్యమేది? ఈమారు నాయుడుగారు మన రైతులపార్టీ అభ్యర్థులను నిలబెట్టినారు.

ఆసమయానికి నేను ప్రచారానికి అందినాను. గ్రామగ్రామాలలో వెళ్ళుతూవుంటే, "మానాయుడు వస్తున్నారు. మన రంగా యిడుగో, వస్తున్నారు" అనేపల్కులే చేతల్లో వున్నవారు, పరుగెత్తుకుంటూ, రోడ్డుప్రక్కకుదూకడం, స్త్రీలు చేతులెత్తి జోహారులు పల్కడం: ప్రతిచేలో, ప్రక్కరోడ్డు, దొంకలో, గుంటవద్ద గ్రామపరిసరాల్లో కొల్లలు కొల్లలుగా జనాలు: అనాడెప్పుడో, మహాత్ముడు తిరుగాడినప్పుడు, ఆ నెల్లూరు ప్రాంతాల్లో అలావుండేదన్నారు నాయుడుగారు.

"మేము గెలిచినట్లేవుంటున్నదండీ" అన్నారు గోవిందరెడ్డి.

"అవును, గెలిచామండీ" అంటారు, కటికనేని వెంకట్రామారావు

"ఏమో జమీందారు విధేయులేమి కుట్రలు 'పన్నుతారో" అంటారు రైతుపెద్ద చెంచురెడ్డి.

"ఎందుకండీ ఆ భయాలు" అంటూవుండిరి నాయుడుపేట సుబ్బానాయుడు.

గ్రామపెద్దలను దివాణానికి "పిందులకు పిలుస్తున్నారే వారంతా ప్రమాణాలు చేస్తున్నారట' అన్నారు వొకరు

నాయుడుగారికి వొళ్ళు మండిపోయింది. రాగా లాపన చేయుచున్నారు:-

"పిందుతిండికి మోసపోయి,

మందమతులకు వోట్లసిస్తావా

మంచిపెద్దల జోలిమాని, వంచెనచె నీ కడుపు

నింపిన, అందుకలిగెడి చెరుపుకై

మనమందరము కుందుదము, సుమా" అంటుండినారు.

గెలిచాము. రైతు, కూలీలను గడగడలాడించిన వెంకటగిరి మహరాజ కుమారుణ్ణి వోడించినాము. వెంకటగిరి బోర్డును రైతులు పట్టినారు, "రండీ, విజయగీతము పాడుతాము" అంటూ రామానాయుడుగారినుండి కబురొచ్చినది.

ఎంతటి జయజయధ్వానాలు. రైతులతో ఆ మైదానమంతానిండిపోయింది, రైతులే రాజ్యమునకు వచ్చినారు: వెంకటరామారావుగారు అధ్యక్షులు, చెంచురెడ్డి ఉపాధ్యక్షులు, వారందరికి మంత్రాంగము నేర్పుచున్నావారే మననాయుడు - వశిష్టునివలె వెల్గుచున్నారు. ఆ వెల్గులలోనుండి కప్పడుచున్నది రైతులశక్తి. అదే"దేశముక్తికి దివ్యతారకమన్నా" నేను. అది "జమీందారీలకు సింహస్వప్నమైనద"న్నారు నాయుడుగారు.

ఆ ఉద్యమ తేజస్సు అలాగా విజృంభణము పొందుటవల్లనే, యువకవి శెట్టిపల్లి వెంకటరత్నం వ్రాశారు- యేలూరులో జరిగిన రెండో రాష్ట్రీ జమీందారీరైతుల సభకు రైతాంగ సభాలును.

"అగునాజీవులు సాగునాలోకాలు" రాజుగా మనమెంచి రైతుజూడకపోతే దేశాలు తలలెత్తునా, దాస్యపున్‌పాశాలు తావీడునా అంటూ:

ఆ విజయార్పటికి భరతవాక్యం నాయుడుదే. దానికి లయచేర్చిరి. అమర విప్లవకంఠ ధ్వినాదములతో. ముందుయువరైతునాయకులు, సన్నపనేనివెంకటసుబ్బయ్య తిమ్మారెడ్డి: మననాయుడు, ఆంధ్రదేశమంతటా విస్తరించుచున్న రైతు సభలలో, జమీందారీరైతు విజయగానసభలలో మంత్రశక్తి నందించిరి.

(1932-33)లో ఆ వెంకటగిరి బోర్డులో అనాడు రైతులను గద్దెనెక్కించి తిమి ఆ బాటలోనే క్రమంగా, అచ్చటచ్చట, రాష్ట్ర, కేంద్ర శాశన సభలలో రైతు, కూలీ బిడ్డలు మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, ప్రధానమంత్రులుగా రాణకెక్కు చున్నారు. కొందరు మాత్రమే "సర్వశ్రామిక రాజ్యస్థాపన చేయావలె లెండు లెండోయ్. రైతుకూలీ ప్రజలు చేరి కలసిమెలసి రండురండోయ్" అంటూ వుండిన నా బాటలో, నాయుడు పాటలు, మాటల విప్లవ మార్గంలో నడువగల్గుచున్నారు. ఎందరో అధికార మత్తులో, క్రొత్తరాజ్య సంస్థానపు తియ్యని మలుపులలో, తమ్ము తాము మరచిపోతున్నారు. అనాడు రామానాయుడు కోరుకుంటూవుండినది, ఆ నాటి నుండి యీనాటివరకు మాటోంట్లము సాగిస్తున్న వ్రతమును "జమీన్‌రైతు" సాగిం చాలి, అదే రాజకీయ స్వాతంత్ర్యమందినా, రాజులపాలన మంతమొందినా.

"రైతులు వృద్ధిం బొందిననాడే
కూలీక్షేమము జూచిననాడే
చేతి వృత్తులను నిల్పిననాడే
బుద్ధి జీవులను పెంచిననాడే
జాతికి జీవము,
జాతికి శ్రేయము

"జాతికి తేజము స్థిరమండోయ్." అంటూ మన రాఘవదాసు యీ మధ్య పాడినారు. అదే అనాటి రామానాయుడుగారు కోరుకున్న పారిశ్రామిక రాజ్యస్థాపన.

ప్రథమ కాంగ్రెసు మంత్రివర్గం 1937-39లో మద్రాసులో జరిగినది. రివిన్యూ మంత్రిగా ప్రకాశం పంతులుగారు జమీందారీ విచారణ సంఘము నేర్పర చిరి. తానేదానికి అధ్యక్షులు. దానిముందు రైతులు సాక్ష్యంఇవ్వాలి. వివిధ జిల్లాలలో పర్యటన జరుగుతున్నది. 1931-33లో, మేము అట్టి విచారణ, అనధికారంగా సాగిస్తున్నప్పుడు, జమీందారుల నిర్బంధాలకు భయపడి, కొందరే రైతులు సాహ సించి, ముందుకువచ్చి సాక్ష్యమివ్వగల్గిరి. ఆ బొబ్బిలి సంస్థానపు రైతులలో, సాలా వారు, ఆడవరం రైతులు మాత్రమే, జమీందారుని ధిక్కరించగల్గిరి. మునగాలిలో కరణం రంగారావు, నాయుడుగారికి ఆశ్రయమిచ్చి, జమీందారు దురాగతాలను వివ రించినందులకు, ఆ చుట్టుప్రక్కలున్న రైతులను బంద్‌చేసి, ఆయన్ను ఆ సంస్థానం

నుండి పారద్రోలిరి. నాయుడుగారిని, నన్ను, ఎన్నోసారులు, వివిధ జమీందారుల యేజంట్లు, విధేయులైన గ్రామపెద్దలు కొట్టాలనుకొనిరి. బందీ చేయాలని ప్రయత్నించిరి. చంపుతారనే పుకార్లుకూడా సైలుదేరెను. ప్రకాశం కమిటీ వచ్చేసరికి, ఆరు సంవత్సరాలు గడిచేసరికి, కాంగ్రెసు గెల్వడం, మహాత్ముని ప్రభావంవల్ల, రైతులు నిర్భయంగా సాక్ష్యాలను అందించుచున్నారు. ఆ మార్పుకు, అంతగా రైతుశక్తి పెంపకానికి, ముఖ్యకారణం, నాయుడుగారి కృషి, "జమీందారీ రైతు" పత్రిక ప్రచారం, రైతాంగ విద్యాలయ ఆచార్యులు, విద్యార్థులశక్తి, నాయుడు, శెట్టిపల్లి, నన్నపనేని గీతాల, రైతు భజనావళి.

ప్రకాశం కమిటీ విజయానికై, ప్రత్యేహాసికులైన నాయుడు, గొట్టిపాటి, మందేశ్వరశర్మ తీవ్రంగా కృషిచేసిరి.

అన్ని ఆంధ్ర జిల్లాలలో నాయుడుగారు తిరిగిరి. ఎందరో రైతులను, సాక్ష్యమిచ్చుటలో, స్టేటుమెంట్లు తయారుచేయడంలో, గొప్పశ్రమ చేసిరి, "కరణీకం" సాగించిరి. జీతభత్యాలులేని మంత్రిగా సేవించిరి.

తుదకారిపోర్టు మేము ఏలాంటి సంస్కరణలు కావాలంటిమో ఆ మార్పులనే స్థిరీకరించింది. ముఖ్యమంత్రి రాజాజీ, పర్మనెంటు సెటిల్‌మెంటు పోవాలి అన్న, నా ఆర్థిక సూత్రాన్ని అంగీకరించిరి. అప్పుడు రామానాయుడు పొందిన తృప్తికి మేరలేదు! "మా తపస్సు ఫలించడానికి యింతెన్నాళ్ళు బాబూ" అన్నారు కనకమ్మగారు.

1947-48లో జమీందారీ పెత్తనం పోయింది. మన రాష్ట్రమునన్నేకాదు, భారతదేశ మంతటా! అలాగా, వెంకటగిరిలో ఆవిర్భవించిన యజ్ఞంలో నాకు నాయుడుగారిచ్చిన దివిటీని అఖిలభారతానికి అందించితి! దేశాన్నంతా ఆవరించినది, స్వరాజ్య భారతదేశం పల్కినది, "మాకొద్దీ జమీందారులపొందు" అన్నది.

## అఖిలభారత నినాదం

వెంకటగిరిలో ప్రారంభించిన, రైతు, కూలీల బాధల విచారణను 1931, 32-33లో ఆంధ్రదేశమంతటా విస్తరింపచేసితిమి? ఆ విచారణ ఫలితాలను తెలుగు పత్రికలు, మద్రాసులోని ఇంగ్లీషు పత్రికలు, హిందూ, స్వరాజ్య, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలోనేగాక, కలకత్తాలోని, అమృతబజారు పత్రిక, అలహాబాదులోని పయనీరు

ఇండిపెండెంటు పత్రిక, ఢిల్లీలోని హిందుస్థాను పత్రిక టైమ్సు, బొంబాయిలోని బాంబే క్రానికలు ప్రచురిస్తూ వుండినవి! ఆ విచారణ రిపోర్టును ఇంగ్లీషులో "యికనామిక్ కండిషన్సు ఆఫ్ జమీందారీరైతు"లనే పుస్తకంగా ప్రచురించితిని. అలాగా, దేశమంతటా జమీందారీ పద్ధతివల్ల కల్గు అనర్థాలు ప్రజలకు తెల్పితిమి! జమీందారీ పెత్తనం పోవాలనే నినాదాన్ని దేశమంతటా ప్రతిధ్వనింపచేసితిమి. 1935 అక్టోబరులో మద్రాసులో, 1936 ఏప్రియలులో లక్నోలో, 1936 డిశంబరులో ఫైజుపూరులో జరిపిన అఖిలభారత రైతుసభలలో, ఆ నినాదాన్ని బలపరచితిమి. అప్పటికే, సెంట్రలు పార్లమెంటులో జమీందారుల ధిక్కరించితి. అఖిలభారత రైతునాయకులగా, కిసాన్‌కాంగ్రెసు అధ్యక్షునిగా మహాత్ములు నన్నాదరించిరి.

## 1934 ఎన్నికలు-కాంగ్రెస్ వ్యతిరేకత

1934లో, సెంట్రల్ అసెంబ్లీ ఎన్నికలు నేను నిలబడతానన్నా. ప్రకాశం పంతులుగారు నన్ను వద్దన్నారు. ఇది గాంధీగారి వరకు పోయింది. ఆయన, "రంగాకు పట్టుదలగావుంటే నిలబెట్టండి" అని అంటిరి. దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారుకూడా నన్ను సమర్థించిరి. నిలబడితిని. నెల్లూరులో వెంకట్రామా నాయుడుగారే నాకు అండ. "రైతుకే ఓటివ్వవలెనన్నా" అని ఆయన ప్రచారం ఆరంభించిరి. అయితే కాంగ్రెస్ కార్యకర్తలు నాకు వ్యతిరేకం చేయడం మొదలు పెట్టినారు. రాజాగారు, రామచంద్రారెడ్డి రామయ్యచౌదరి కలసి రెడ్లను సమీకరిస్తామని బెదిరించిరి. అయితే నాయుడుగారు, నేను, వెన్నెలకంటి రాఘవయ్య కలసి రైతులను సమీకరించాము. రైతులలో-వారిలో రెడ్లుకూడా-నన్ను సమర్థించిరి. గెలిచితిని. రాష్ట్రనాయకులు నామీద కక్ష సాధింపు చర్యలు మొదలు పెట్టిరి. అయినా మేము జంకలేదు.

## రామానాయుడు బహుముఖ వ్యక్తిత్వం

నాయుడుగారు రైతు ఉద్యమంలో ఎంత ఉద్రేకంగా, ఉత్సాహంగా, ఉరకలువేస్తూ వుండేవాడో, ఇతరంగా అంతకంటే మించిన విశిష్టత కల్గినవారు. ఆయన సౌందర్య పిపాసి, రసజ్ఞుడు, కవి, గాయకుడు, ఉత్తమ విమర్శకుడు, భోజనప్రియుడు-ఒకటేమిటి? బహుముఖాలుగా విస్తరించిన వ్యక్తిత్వం ఆయనది.

ఆయనతో కాలం గడపడమంటే ఒక సాహిత్యగోష్ఠిగా వుండేది. జమీందారీ రైతుల విచారణలో ఒక్కొక్కసారి విసుగుపుట్టేది. కొన్ని ఊళ్ళలో పలకరించడానికి మనిషి వుండేవాడుకాదు. జమీందారుల విధేయులు రాజాలకు వార్తలు చేరవేస్తారేమోననే భయంతో మిమ్మల్ని పిల్చిన రైతులుకూడా ముఖం త్రిప్పుకొని పోయేవారు. ఆఖరకు భోజనం పెట్టడానికికూడా సంకోచించేవారు. మునగాల, బొబ్బిలి వంటి చోట్ల మమ్ములను చంపుతారనే పుకార్లుకూడా వ్యాప్తిలోకి వచ్చినవి. అవి గడ్డురోజులు.

అప్పుడుచూడాలి నాయుడుగారిని. ప్రవాహంలాగా పద్యాలు వల్లించేవాడు కంచుకంఠంతో. రాగయుక్తంగా భారతం భాగాలు చదివేవాడు. సుజనరంజని సమాజంనాటి రోజుల్లో వేసిన నాటకాలు, ముఖ్యంగా వేదం వెంకటరాయశాస్త్రిగారి యుగంధరుడిపాత్ర కబుర్లు చెప్పేవాడు, రైతులకు పాండవ వనవాసంతో పోలిక, ద్రౌపది ధైర్యసాహసాలు, ఓర్పు, పట్టుదల, కార్యదీక్షలను చెప్పేవాడు. ఆ చెప్పడంలోకూడా ఎంత రమ్యత, ఎంత సొగసుదనం? ఆశుధారగా పద్యాలు వెలికివచ్చేవి. ఆయన పద్యాలు చదివినట్లు ఎవ్వరూ చదవలేరు. ఆ పద్యాలు మాకు కుషారిచ్చేవి. మాలో నిరుత్సాహమంతా నీరుగారిపోయేది, గాలిలోకి ఎగిరిపోయేది.

మననాయుడు భోజనప్రియుడు. అప్పుడప్పుడు నిడుబ్రోలులో మా ఇంటికి వచ్చేవారు. ఆ రోజు నాకు, భారతీదేవిగారికి పండుగదినమే. నాయుడుగారు భారతీదేవిని దేవతలాగా కొలిచేవారు, కూతురులాగా చూసేవారు. భారతీదేవికి నాయుడుపట్ల ఆ అభిమానమే. నాయుడు భోజన ప్రియత్వం మీద ఎంతో ప్రీతి ఆమెకు. దగ్గరుండి కొసరి కొసరి వడ్డించేది. తిన్నంతసేపూ కబుర్లే.

ఆయన ఆత్మగౌరవాన్ని పదిలంగా కాపాడుకునేవాడు. నాయుడుగారు ఊళ్ళలోకి పోయేటప్పుడు చూడాలి. ముద్దుచొక్కా, ఎర్రటిధోవతి కట్టేవాడు. అవికూడా రెండు జతలే. ఒంటిమీద ఒకటి దండెంమీద ఇంకొకటి. ఎర్రటి తలపాగా చుట్టేవాడు. అదే దిండుగావాడేవాడు.

ఆయనకు భీష్ముడిపాత్ర అంటే ప్రీతి. మాకు కల్గే కష్టాలను భీష్ముడితో పోల్చుకొని ఓర్చుకునే వాళ్ళం. కుంతీదేవి పాత్రమీద మా ఇద్దరివీ రెండు అభిప్రాయాలు. కుంతి ప్రాపంచికమైన తల్లేకాని ప్రామాణికంగా ఎంచవలసిన స్త్రీ కాదనేవారు నాయుడుగారు.

మైళ్ళకొద్దీ నడిచేవాడు ఎవరో భోజనం పెట్టేవారు. బస్సు టిక్కెట్ కొనిచ్చేవారు. ఆయనకై ఆయన ఎవరినీ ఎప్పుడు అడిగినదిలేదు. పాటలు పాడు కుంటూ తిరిగేవాడు. రైతు ఉద్యమ ప్రచారం, పత్రికకు చందాలు వసూలుచేయడం, రెండూ జరిగేవి ఈ తిరుగుళ్ళలో! నేను కూడా పత్రికకు చందాలు చేర్పిస్తుండేవాణ్ణి.

మమ్మల్నిద్దర్నీ ఊళ్ళలోకి పిల్చుకపోయేవారు. నన్ను రప్పించాలంటే నూట పదహార్లు కావాలనేవారు నాయుడుగారు. లేకుంటే రంగాజీరారని బెదిరించేవారు. అదంతా మా పత్రికకే! తిక్కవరపు రామరెడ్డిగారి దగ్గర అప్పులు తెచ్చేవాళ్ళం చెప్పిన సమయానికి చెల్లించేవాళ్ళం. రెడ్డిగారు వడ్డీ అడగలేదు. పత్రికకు ఆయన చేసిన సహాయం అది.

## నాయుడుగారి కల

నాయుడుగారికి ఒకసారి కలవచ్చిందట. పెద్ద చదువులు చదివినవాడు, గొప్పనాయకుడు రైతుల పక్షంగా పోరాడగలిగే యుద్ధవీరుడు, సాహిత్యపరుడు తనతో కలుస్తాడని, కలసి పనిచేస్తాడని ఒకసారి కలగన్నాడట. తర్వాత ఎవరో నా గురించి నాయుడికి చెప్పారట లండన్ నుంచి వచ్చి వున్నాడు; రైతుల కుపయోగపడే సిద్ధాంతాల గురించి పుస్తకాలు వ్రాసివున్నాడని చెప్పాడట. తను కలగన్న సహచరుడు ఇతనే అని అనుకున్నాడట. వెంటనే మద్రాసువచ్చి నన్ను కలిశాడు. ఆయన కల నిజమైంది. మేమిద్దరం సుందోప సుందులుగా, కవల పిల్లలుగా పెరిగాం, తిరిగాం. కష్టసుఖాలు పంచుకొన్నాం. కలసి పనిచేశాం. జమీదారులను ఎదిరించి పోరాడాం; యుద్ధం చేశాం. కడకు దేశవ్యాప్తంగా జమీందారీ విధానం రద్దుచేయించాం. తన కల నిజమైందని తర్వాత చాలాసార్లు చెప్పేవాడు నాయుడుగారు ఉల్లాసంగా!

## జమీందారీ రద్దు బిల్లు

1937 బొంబాయి ఎ. ఐ. సి. సి. లో నాయుడుగారి ప్రోత్సాహంమీద ప్రాథమిక హక్కుల ఛార్టర్‌లో జమీందారీ రద్దును కోరుతూ తీర్మానం ప్రతిపాదించాను. కాంగ్రెస్ ఒప్పుకోలేదు. కనీసం అడవులు, భూమి, చెరువులు, జంతువులు ఈ జాతీయ సంపదలన్నింటినీ జాతీయం చేయమన్నాను. అక్కడ నాకు నెహ్రూకూ జగడం వచ్చింది. "నువ్వేపాటి సోషలిస్టు" (What sort of social st

సుందరయ్య గ్రంథాలయము
A.C. No. 81696

you are !) అని నెహ్రూను ఎదిరించాను. ఆ జగడం మా ఇద్దరి మధ్య 1965 వరకూ అట్లనే వుంది. వెంకటగిరి రైతుల కష్టాలు స్వయంగా తెలిసినవాడిని కావడంచేతనే ఇంత రాద్ధాంతం చేయవలసి వచ్చినది. తర్వాత జరిగిన పోరాటం వల్ల, ఆఖరుకు "ప్రకాశం కమిటీ"ని వేశారు. మా ఉద్యమ ఒత్తిడి తట్టుకోలేక. ప్రకాశంగారికి వెంకటగిరి జమీందారులమీద మా యుద్ధం గిట్టేదికాదు. ఆయన "స్వరాజ్యం"కు జమీందారులు డబ్బిచ్చేవారు. అయినా విచారణ జరిగింది. నేను పార్లమెంట్‌లో పనిచేస్తూవుంటే నాయుడుగారు రైతులను సమీకరిస్తు వుండేవారు. ఆయన జీత భత్యాలులేని నౌకరీ చేసేవాడు. నేను నాయకుడుగా ముందునిలబడినా, నిజమైన, ఆచరణాత్మకమైన నాయకత్వం నాయుడుగారిదే!

ప్రకాశంపంతులు కమిటీముందు నాయుడుగారే నిలబడ్డారు. బలమైన సాక్ష్యం ఇప్పించి రద్దు తప్పదన్నట్లు చేశారు.

ఆ కమిటీ సిఫారసులు తర్వాత బిల్లురూపంలో వచ్చాయి. 1947-48 లో మద్రాసు అసెంబ్లీ ముందుకు వచ్చినది. కళా వెంకట్రావు అప్పటి రెవిన్యూమంత్రి. ఆ బిల్లు పాసయ్యేదాకా నాయుడిగారి మకాం మద్రాసులోనే, అమెరికాలో కన్పించే లాబీయింగ్ మాదిరి ఆయన వెంకట్రావుతో వ్యవహారం నడిపాడు. అసెంబ్లీ సభ్యులు ప్రతి ఒక్కరినీ కలుసుకునేవాడు. ఆ బిల్లులో రైతుల కష్ట నిష్ఠురాలు సమగ్రంగా ప్రతిఫలించేట్లు అహరహం శ్రమించాడు. కళా వెంకట్రావుకు అనధికార సలహాదారుడుగా వ్యవహరించి బిల్లుకు ఒక సమగ్ర స్వరూపం ఇచ్చాడు. అది పాస్ అయిన తర్వాతనే మద్రాసు వదలిపెట్టాడు.

ఆచార్య రంగా

★

"సమష్టి, సహకార వ్యవసాయ చట్టం ద్వారా, రైతాంగ, స్వతంత్ర్యాన్ని హరించేందుకు, నాగపూర్ కాంగ్రెస్‌లో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ, బందరులో జరిగిన కిసాన్ మహాసభలో ఆచార్యరంగాజీ చేసిన చారిత్రాత్మక ప్రసంగ పాఠాన్ని ఇచట పునర్ముద్రిస్తున్నాము."

సంపాదకుడు

# రైతాంగ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచంలో కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మాతృక మన భరతభూమి. ఈ భూమిలో స్వయంపోషకత్వం, స్వయం నిర్ణయాధికారం గలిగియున్న అత్యధిక ప్రజలు రైతులు. మనం రైతులం. మన సృజనాత్మకమైన కాయకష్టం. ఉత్పత్తి శక్తులతో దాని సత్ఫలితాలను పొందుతూ అదేవిధంగా ఇకముందు గూడా మనం మనగలగాలని వాంఛిస్తున్నాం. మనం మనగలగటానికి ఏ ఒక్క వర్గానికి చెందిన శ్రమజీవులనూ దోపిడీ చేయలేము. చేయనుంకించటంలేదు. మన మనుగడ, మన జీవనోపాధి దోపిడీ రహితమైనది. అధునాతన సమాజం నాగరికత ప్రపంచంలో శాశ్వతంగా మనుటకు ప్రాథమికావసర వస్తువులను ఉత్పత్తి జేసేందుకు మనం భూమిని దున్నుతున్నాం- సేద్యం చేస్తున్నాం. ఏ ఒక్కరి క్రిందా పనిచేయటం లేదు. ఎవరి దోపిడీకి గురికారాదు. ఒకరు మనక్రింద దోపిడీ చేయబడరాదు. మన దేశంలో స్వయం పరిపాలనా ఆర్థిక ప్రజాస్వామిక వ్యవసా నిర్మాణానికి మనమే పునాదులం. అదే మన ఆర్థిక వ్యవస్థలోని ప్రత్యేకత. ఈ దేశంలో నాలుగు కోట్లకు పైబడివున్న చేతివృత్తుల శ్రామికులు గూడా అదే కోవకు చెందినవారు. వారికీ దోపిడీరహితమైన ఉత్పత్తిదారుల వర్గం. వారూ కుటుంబ ఆర్థిక వ్యవస్థ పునాదుల మీదనే ఉత్పత్తి కార్యక్రమాన్ని సాగిస్తున్నారు. వారు ఆర్థిక స్వయంపోషకత్వం గలవారు. అదే అంతస్థులో బలపడాలని వారి ఆకాంక్ష. అదే దృష్టితో తరాల తరబడిగా కొనసాగుతూ వస్తున్న ఆర్థిక స్వాతంత్ర్యం, వికేంద్రీకృత సోషలిస్టు జీవిత విధానాలమీద ఆధారపడిన కుటుంబ ఆర్థిక వ్యవస్థ సంరక్షణలో వారిని మన

సహచరులుగా గుర్తిస్తున్నాము. అందుకే భారత రైతాంగం కుటీర పరిశ్రమలను, చేతివృత్తులను, నాలుగుకోట్ల చేతివృత్తులవారిని, కళాకారులను సాహసపూర్వకంగా గౌరవించుకుంటున్నది.

మనకు అనుకూలమైన సామాజిక వాతావరణాన్ని సృష్టించి, నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఆవసరాలకు వలసిన ముడిపదార్థాలను ఉత్పత్తి చేయుటలో, తద్వారా దేశభక్తిని ప్రదర్శించుటలో మనమెప్పుడు వెనుకంజ వేశామో, రుజువు చేయమని సవాలు చేస్తున్నాం. దేశవిభజనానంతరము- పాకిస్తాన్ బెదిరింపుల నెదుర్కొనుటకు, దేశాన్ని రక్షించుటకు, నార అధికోత్పత్తి చేయుటకు పిలుపు వచ్చినప్పుడు వెంటనే ఆ పిలుపు నందుకొన్నాము. దేశంలో ఆహారకొరత యేర్పడినప్పుడు కనీస ఆర్థిక సహకారంతోనే మనం ప్రథమ పంచవర్ష ప్రణాళిక అంచెనాలను మించి అధికోత్పత్తి సాధించాము. మన పంటకు గిట్టుబాటైన ధరలు ఉంటాయనే హామీ లేనప్పుడూ, మన నూనె గింజలకు, నూనెకు ఎగుమతి సౌకర్యాలు కలిగించుటలో ప్రభుత్వ విధానము దిగజారి పోతున్నప్పుడు గూడా మన కుటుంబ ఆర్థిక వ్యవస్థను చెక్కుచెదరకుండా నిలుపుకో గలిగాము. స్వల్పమైన ప్రభుత్వ సహాయంతోనే గత పది సంవత్సరాలలోను ఎంతో పోరంబోకు భూమిని సాగుచేసి, పండించగలిగాము. అదే పనిని ప్రభుత్వం సర్వావకాశాలను వినియోగించి నప్పటికీ రైతులు పొందిన ఫలితాలను పొందలేక పోయింది.

దేశంయొక్క ఆర్థిక పునాదులను బలపరిచేందుకు, జాతీయ ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు యావత్తు రైతాంగమూ చారిత్రక పరీక్షలకు నిలబడి తమ సర్వశక్తులూ వొడ్డి సమాజంలోని ఇతర వర్గాల కంటే ముందడుగు వేసినప్పటికీ, రైతాంగపు కుటుంబ ఆర్థిక వ్యవస్థ విఫలమైందనీ తాము ఆశిస్తున్న సోషలిస్టు సమాజ నిర్మాణానికి రైతుస్వామ్య స్వయంపోషకత్వ విధానం నిరుపయోగమని దేశంలోని రాజకీయ పార్టీలు భావించటం శోచనీయంకాదా? జాతి సర్వతో ముఖాభివృద్ధికి అవరోధంకాదా? ప్రజాస్వామిక సూత్రాలను విరుద్ధంకాదా?

మన సాంఘిక వ్యవస్థలో మనం నిర్వహిస్తున్న నిర్మాణాత్మకమైన, అభివృద్ధికరమైన పాత్రను, నిజమైన మానవ ప్రమాణాలతో కూడుకొన్న, ప్రజాస్వామిక, వికేంద్రీకృతమైన గాంధేయ సోషలిస్టు తరహా సమాజ నిర్మాణానికి మనం సలుపుతున్న కృషిని కేంద్రంలోని కాంగ్రెసు ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తున్నదో

అడగవలసిన హక్కు మనకు లేదా? స్వయంపోషకత్వంతో కూడుకొన్న దోపిడీ రహితమైన రైతాంగ ఆర్థిక వ్యవస్థ స్వేచ్ఛా సమాజ నిర్మాణానికి, సాంఘిక పురోభివృద్ధికి ఎందుకు తోడ్పడదో వివరించ వలసిందిగా సోషలిస్టు సిద్ధాంతాలపై నడుస్తున్న పార్టీలను, ముఖ్యంగా కాంగ్రెసు పార్టీని మనం ప్రశ్నిస్తున్నాము.

పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు విధానాల దుష్ఫలితాలను అధిగమించి కొన్ని కమ్యూనిస్టు దేశాలలో తిరగి స్వతంత్ర్య జీవనోపాధిని సాధించుకొన్న రైతాంగ కళాకారుల ఆర్థిక వ్యవస్థ చలనం లేనిదని, అభివృద్ధిదాయకమైందని- వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను, స్వయంపోషకత్వ సహకార సోషలిస్టు విధానాన్ని, గాంధేయ ధోరణిని ప్రేమిస్తున్న ప్రతి ఒక్కరూ అంగీకరించాలి గదా!

ఈ వ్యవస్థను రూపుమాపడం తమ ఉద్దేశ్యంకాదని, కేవలం ప్రత్యామ్నా యసూచనలుగా మాత్రమే రైతులు- చేతివృత్తులవారి ముందు పెడుతున్నామని రాజకీయ పార్టీల నాయకులు చెప్పవచ్చు. అయితే వారు విశ్వసిస్తున్న సహకార వ్యవసాయం, పంచాయితీ అజమాయిషీ ఏ దేశంలోనైనా, ఎప్పుడైనా అధికోత్పత్తిని, స్వాతంత్ర్యాన్ని, రైతులకు విశ్రాంతిని, సుఖాన్ని ఇచ్చినవనీ చెప్పగలరా? జాతీయ సంపదను దుబారాకాకుండా చేయకలిగారా? కాగా రైతాంగ ఆర్థిక వ్యవస్థలో భూసార రక్షణ, అధికోత్పత్తి, సాంఘిక భద్రత ఆర్థిక స్వేచ్ఛ, సాధించ బడినవని అంగీక రించరా!

వ్యవసాయపు పరికరాలు, సాంకేతిక వస్తువులు, ఎరువులు, గిడ్డంగులు, మొదలుగా గల సౌకర్యాలను పొందుటకు రైతులకు సహకార సంస్థలు అత్యవసర మనే సత్యాన్ని అందరూ గుర్తిస్తారు. ఈ సౌకర్యాలను సమకూర్చుకొనేందుకు ఈనాడు రైతాంగం తమ ఉత్పత్తిలోని అధిక భాగాన్ని వెచ్చించవలసి వస్తున్నది కూడా. రైతులు, ప్రభుత్వం, రాజకీయ పార్టీలు సహకరించుకొని సహకార సంస్థల ద్వారా పై అవసరాలను తీర్చుకోవడము యెంతైనా అవసరం. అంతమాత్రంచేత పూర్తిగా రైతాంగవ్యవస్థనే హతమార్చి, రైతుల యావత్తు జీవితాన్ని సహకార వ్యవసాయంలో ఇరికించి, సహకార వ్యవస్థక్రింద బానిసలను చేయడం- సామాజికంగా తమకుగల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, ఆర్థిక హక్కులనే హరించడం తగని పని.

వాస్తవానికి రైతాంగ వ్యవస్థలో వ్యవసాయాన్ని దేశోపయోగకరంగా కట్టుదిట్టంగా అభివృద్ధి చేయవచ్చు. వ్యవసాయాభివృద్ధికి అవసరమయిన భూమి కోత, తెగుళ్ళ, పశువ్యాధుల నివారణ చర్యలు తీసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వాల సహాయం ఎంతైనా అవసరం. ఈ కార్యకలాపాలలోను, ప్రణాళికా బద్ధంగా పంటలను పండించుటలోనూ, స్థానిక జాతీయ ప్రణాళికా ప్రతినిధులు, రైతులు పరస్పరం సహకరించుకొని కార్యక్రమాన్ని కొనసాగించవచ్చు. ఈ విధమైన నిర్మాణాత్మక కృషి రైతాంగ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు దెబ్బ తగలకుండా ఇంగ్లండులో విజయవంతంగా నిర్వహించబడుతున్నా, మన ప్రణాళికా నిర్వాహకులు ఈ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను రూపొందించుటకు బదులు, అభివృద్ధి దాయకమైన ఆ వ్యవస్థనే రూపుమాపే ప్రతిపాదనలు చేస్తున్నారు. ఈ విధంగా గ్రామంలోని భూముల్ని, వ్యవసాయాన్ని గ్రామ పంచాయితీ స్వాధీనం క్రిందకు, అజమాయిషీ క్రిందకు తీసుకరావలసిన అవసరమేమిటో కమ్యూనిస్టేతర పార్టీలు సమాధాన మివ్వవలసివున్నది. ఈ విధానం మంచి పంట నిస్తుందని, ఉత్పత్తి కార్యక్రమాన్ని మరింత చురుకుగా సాగిస్తుందనీ భావిస్తున్నారా? భూములు, పశువులు, వ్యవసాయ సాధనాలు, సంపద గ్రామసమిష్టి అజమాయిషీ క్రింద వున్నచో చురుకుదనం సామర్థ్యం పెరుగుతుందనా? వ్యయం తగ్గుతుందనా? నిర్మాణాత్మకంగా పని జరుగుతుందనా? ఏ దేశంలోనైనా అది ప్రజాస్వామిక వ్యవస్థగానీ, నియంతృత్వ వ్యవస్థగానీ, గత పదిసంవత్సరాల కాలంలో పై విధంగా ఫలితాలు సాధించబడిన సాదృశ్యాలేమైనా వున్నాయని చెప్పగలరా? దాదాపు పది కోట్లకు పైగావున్న వ్యవసాయదారుల, వారి నిర్మాణాత్మక శక్తికి వ్యతిరేకంగా వారి ఆర్థిక వ్యవస్థను రూపుమాపే ఉద్యమాన్ని లేవదీయటం, వారి స్వత్వాలను హరించటం, వారి స్వేచ్ఛను మంటగలపటం వివేకంతో కూడుకొన్న పనేనా?

సహకార సంఘాల, గ్రామా పంచాయితీల పరిపాలన ఎంతటి అధ్వాన్న స్థితిలో నున్నదో రాజకీయ పార్టీల నాయకులు, జాతీయ ప్రణాళికా నిర్నేతలు గుర్తించలేక పోవటం శోచనీయం. ఉత్తరాది రాష్ట్రాలవారికంటే హెచ్చుగా ఈ సంస్థలను స్థాపించుకొని పనిజేసిన కోట్లాది దాక్షిణాత్యులకు ఇందులోని సాధక బాధకాలు బాగా తెలుసు. ఈ సంస్థలలో నిజాయితీ, నిష్పాక్షిక ధోరణి, చిత్తశుద్ధి మచ్చునకైనా లేవని దక్షిణాదిరాష్ట్ర ప్రజలకు తెలుసు. అలాంటి లోపభూయిష్టమైన

సంస్థలకు మానవపు జీవితానికి ప్రాథమికావసరమైన భూమిని, తదితర ఉత్పత్తి సాధనాలనే ఇచ్చివేస్తే సంఘజీవితం ఎంత భయంకరంగా వుండగలదో ఊహించవి విషయం కాదు. సహకార సంస్థల రిజిస్ట్రేషన్‌కు పాటుపడింది మనం. పంచాయితీల నిర్మాణానికి కృషి చేసిందిమనం. అందులోని సాధక, బాధకాలు అందరి కంటే హెచ్చుగా మనకి తెలుసు. అందుచేత మనమే చెపుతున్నాము- మానవుని దైనందిన జీవితానికి ప్రాథమిక అవుసరాలయిన ఉత్పత్తిని, ఉత్పత్తి సాధనాలను, గ్రామీణుల స్వేచ్ఛను, స్వయం శక్తిని ఆ సంస్థలకు దారాదత్తం చేయవద్దని, అది అపాయకరమని. అందులో అనుభవం గల మన మాటకు విలువ నివ్వవలసిన అవసరం లేదా? పంచాయితీల, సహకార సంస్థల ఎన్నికలలో జరుగుతున్న కుట్రలు- పరిపాలనలో కానవస్తున్న తతంగాలు - తద్వారా ప్రజలనుభవిస్తున్న బాధలు- నష్టాలు- ఆ సంస్థల దైనందిన కార్యకలాపాలలో బయలుదేరుతున్న లిటిగేషన్లు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, మొదలగు వాటితో గత పది సంవత్సరాలలో ఎంత బురద చిమ్మిందో -గ్రామ జీవితం ఎంత వరకు కలుషితమైందో ఈనాటి ప్రజాస్వామ్య ప్రియులైన రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించుటకైనా ప్రయత్నిస్తున్నారా? వారుచిత్తశుద్ధితో ఆ ప్రయత్నం చేయగలిగితే ఈనాటి ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా భూమినంతా పంచాయితీల స్వాధీనం చేయాలనే ఆలోచనను అంత తేలికగా బలపరచగలిగే వారు కాదు.

భూమి గ్రామానికంతకూ సమిష్టి ఆస్తి అనీ, సహకార కమతాల ద్వారా ఉత్పత్తి సాగాలని ఈనాడు గ్రామ దానోద్యమం యిస్తున్న సవాలును ఎదుర్కొనేందుకు గూడా మనం తయారుగా వున్నాం. గ్రామదానోద్యమం ప్రబోధిస్తున్న వ్యవసాయ విధానం, చైనాలో అభివృద్ధికరంగా సాగుతున్నదని చెప్పబడే సహకార వ్యవసాయ విధానంకన్నా, రష్యాలో అమలునందున్న "కోల్‌ఖోజ్ లేక సోల్‌ఖోజ్"ల (సమిష్టి, ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు) కన్నా భారతీయ రైతాంగ ఆర్థిక వ్యవస్థలలో హెచ్చు ఉత్పత్తి రాగలదనీ, చిన్న చిన్న కుటుంబ కమతాలు మరింత గిట్టుబాటుగా వుంటాయనీ, ఎకరానికి సగటు ఉత్పత్తి హెచ్చుగా వుంటుందనీ, వ్యవసాయదారునకు ఆర్థిక స్వయం పోషకత్వం, సాంఘిక భద్రత అధికంగా సమకూరగలవనీ మనం దృఢంగా విశ్వసిస్తున్నాం. ఈనాడు దానాలుగా ఇవ్వబడిన గ్రామాలు మన్య ప్రాంతాలకూ, కొండ ప్రాంతాలకూ- వెనకబడిన ప్రాంతాలకు సంబంధించినవనీ, అచ్చటి భూమి విలువ అతి తక్కువనీ, వ్యవసాయ యోగ్యం

కాని భూములనీ, నీటివనరులు లేని పొలాలనీ మనకు తెలియని విషయంకాదు. సేద్యం ఏమాత్రమూ గిట్టుబాటుగాని, వ్యవసాయంవలన భృతి గడవని ఆ ప్రాంతీయులు- తమ ఊసర క్షేత్రాలపై స్వామ్యపు హక్కులను వదులుకోవటం సులువైన సమస్య. ఆ ప్రాంతాలకూ- వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలకూ- స్వామ్యపు హక్కులను విడనాడటంలో ఎంతో వ్యత్యాసమున్నది. ఈ గ్రామదాన వ్యవసాయ విధానం- సామర్థ్యముతో కూడిన రైతాంగ ఆర్థిక వ్యవస్థ కంటె ఉత్తమమైనదని చెప్పటం- డెహ్రాడూన్ ప్రాంతీయ ట్రైబల్ కుటుంబ వ్యవస్థను- మన ఏక పత్నీవ్రత సమాజానికి పోల్చడమే కాగలదు.

కమ్యూనిస్టులు రైతాంగ ఆర్థిక వ్యవస్థకు బద్ధ శత్రువులు కాబట్టే ఇటీవల బెంగుళూరులో జరిగిన శిఖరాగ్ర సమావేశములో వారి ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే కోట్లాది ప్రజల స్వేచ్ఛాయుతమైన ఆర్థిక జీవనాన్ని విచ్ఛిన్నం చేయగల ఈ గ్రామ దాన విధానంపట్ల కాంగ్రెసువారు ఎందుకు అమితోత్సాహం ప్రదర్శిస్తున్నారో దురూహ్యం. వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను కోరుతూ- అజమాయిషీ పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్న సోషలిస్టులు గూడా రైతాంగ ఆర్థిక వ్యవస్థకు ఎందుకు అయిష్టులుగా ఉన్నారో గూడా అర్థంకాకుండా వున్నది.

ఈ శిఖరాగ్ర సమావేశంలో జరిగిన ఊహాజనిత నిర్ణయాలవలన ప్రభుత్వాధిపతులకు, అజమాయిషీ దారులకు అధికారాలివ్వటం జరిగింది. రాజకీయ పార్టీలు కారణరహితంగా పాక్షిక దృక్పథంతో నియంతృత్వ పద్ధతులకు అమ్ముడుపోవటం జరిగింది. రైతాంగ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా- ప్రభుత్వ యంత్రాంగాన్ని- తదితరమైన శక్తియుక్తుల నన్నింటినీ వినియోగించి రైతులకు, కళాకారులకు తమ వ్యవస్థపట్ల విశ్వాసాన్ని సడలింపజేయుటకు ప్రయత్నం జరిగింది. కోట్లాది స్వేచ్ఛాజీవుల ప్రతిపత్తిని హరించి-వారిని కొలదిమంది వ్యక్తులకు బానిసలను చేయుటకు ప్రయత్నాలు జరిగాయి. దేశంలో అధికారంలో వున్న కాంగ్రెసు ప్రభుత్వాలక్రింద ఇంతకంటే మేము పొందగలిగిన న్యాయంలేదా? అని కాంగ్రెసు సంస్థను మనం నిలదీసి అడగవలసి వున్నది. స్వాతంత్ర్య జీవనోపాధిని పొందుతున్న మనం ఇలాంటి నరకకూపంలోనికి ఎందుకు త్రోయబడాలి? ఒకరి మోచేతిక్రింద బ్రతుకును ఆశించని మనం కొలదిమంది ఉద్యోగుల దయా దాక్షిణ్యాలకు, ఎందుకు వదిలివేయబడాలి. సృజనాత్మక శక్తితో, గౌరవతో, సామర్థ్యంతో ఒకరి తాకిడులతోగానీ,

అజమాయిషీతోగానీ, తిట్లు, బెదిరింపులు, నిర్బంధాలతోగానీ. ప్రమేయము లేకుండా మనకొరకు, దేశంకొరకు మన సర్వశక్తుల్ని వినియోగిస్తున్న మనం బానిసలు కావలసిందేనా? కాంగ్రెసు మనల్ని ఓట్లు అర్థించినప్పుడు గ్రామదాన వ్యవస్థ ఇంత భయంకరంగా వుంటుందనిగానీ, మేము ఇలాంటి పంథాను త్రొక్కబోతున్నామని గానీ సూచన ప్రాయంగానైనా మనకు చెప్పిందా? కాంగ్రెసు నాయకులు-కమ్యూనిస్టు, సోషలిస్టు నాయకులతో కలిసి శిఖరాగ్ర సమావేశాన్ని జరిపే ముందు తమ అభిప్రాయాలను మనముందుంచారా? మన నాయకులతో, మన సంస్థలతో సంప్రదించారా? మనలో చాలామంది కమ్యూనిస్టు, సోషలిస్టులకు వ్యతిరేకంగా కాంగ్రెసుకు ఓట్లు యిచ్చారు. ఎందుకిచ్చారు? కమ్యూనిస్టులు ప్రతిపాదిస్తున్న ఆర్థిక వ్యవస్థ మనకు తగదని, అదే విషయాన్ని కాంగ్రెసు నాయకులు మనకు చెప్పారు. ఇప్పుడు అందరూ ఏకమై మన ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయుటకు కుమ్మక్కై అయినారు. ఇది సబబా? మన వ్యవస్థను విచ్ఛిన్నం చేయటానికి, మన స్వేచ్ఛను హరించటానికి, మన స్వాతంత్ర్య జీవనోపాధిని వమ్ముచేయటానికి రాజకీయపార్టీలు పన్నిన "కుట్ర" అంటే తప్పేముంది! చిన్న కమతాలమీద మన మెంత పెట్టుబడి పెట్టామో-సాగు చేయుటకు ఎంత శ్రమచేశామో ఆ పెట్టుబడిని, శ్రమను దోచుకోవడానికి చేస్తున్న "కుట్ర" అని అన్నా తప్పులేదేమో! కమ్యూనిస్టు నాయకులు లెనిన్, స్టాలిన్, కృశ్చేవ్, మావో హింసాయుత ధోరణిలో సాధించలేని విజయాన్ని ఇచ్చట అహింస పేరుతో సాధించాలని కాంగ్రెసు కమ్యూనిస్టు పార్టీతో చేతులు కలుపుతున్నదనటంలో అతిశయోక్తి ఏమున్నది?

మనం ఈనాడు కమ్యూనిస్టేతర పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెసు పార్టీనుండి ఒక హామీని కోరుతున్నాం. అభివృద్ధికరమైన మన వ్యవస్థను విచ్ఛిన్నంజేసే చర్యలను తీసుకోవద్దని; రైతు స్వామ్యాన్ని నిర్మూలించే విధానాల నవలంబించ వద్దని; మనపై యజమానుల నియంతృత్వ అజమాయిషీని రుద్దవలదని-అందుకు ఉపకరించే సహకార వ్యవసాయం, గ్రామదాన వ్యవస్థను అమలు పరచవద్దని కోరుతున్నాం. మన వ్యవస్థను నిలుపుకొనేందుకు మనమెన్ని త్యాగాలకైనా సిద్ధమే. మనలనెవ్వరూ మోసగించలేరు. మన హక్కుల్ని హరించలేరు.

ఇంతవరకూ కాలయాపన జరుగుతూ దేశాన్ని విసిగిస్తున్న కమతాల గరిష్ఠ ప్రమాణ నిర్ణయ సమస్య ఒక దారికి వచ్చింది. ఇది జరిగితే రైతులు దోపిడీ

చేస్తున్నారు కొందరి వాదన పరిసమాప్తం కావచ్చు. మన కమతాలను సాగుచేసి కాపాడమే మనకు కావలసింది-అది స్వంతంగానీ, కౌలుదారుగానీ, స్వశక్తితోనూ, సమాజంలోని ఇతర వర్గాల తోడ్పాటుతోనూ, పని వత్తిడి సమయాలలో కొందరు వ్యవసాయ కూలీల సహాయంతోనూ, దీన్నొక జాతీయ కార్యక్రమంగా ఎంచుకొని కృషి చేస్తాము. వ్యవసాయ కూలీలకు సమాజం నిర్ణయించిన గిట్టుబాటైన కూలీ ముట్టజెప్పుకొనేందుకు మనం తయారు. మనది దోపిడీ రహితవర్గం. మనం సమస్త శ్రామికులకు సర్వహక్కుల్ని సమకూర్చే సమాజ వాదాన్ని (గిల్డు సోషలిజం) విశ్వశిస్తున్నాము. ఈ పంథా మన స్వాతంత్ర్య జీవనోపాధి సాధనకు హామీ యిస్తుంది. మనం పంచాయితీ బోర్డులను కాదనటంలేదు. ఆ సంస్థ మనకు సహాయకారిగా వుండాలి. మన పై యజమానిగా వుండరాదు. అదే విధంగా సహకార సంఘాలను కోరుకొంటున్నాము. అవి మన కుటుంబ ఆర్థిక వ్యవస్థను హరించేవిగా వుండరాదు.

జపాన్, డెన్మార్క్ దేశాలలో కుటుంబ ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా నిర్మించు కొన్నారు. అధికోత్పత్తిని సాధిస్తున్నారు. తమ అవసరాలను తీర్చుకొనేందుకు సర్వీస్ కో - ఆపరేటివ్ సొసైటీలను నిర్మించుకొన్నారు. కాబట్టి మన ప్రజాశ్రేయ నిర్ణేతలను మనంకోరే దొక్కటే-"మా కుటుంబ ఆర్థిక వ్యవస్థ జోలికి రావద్దు-దాన్ని విచ్ఛిన్నం చేయవద్దు-ఉత్పత్తి కార్యక్రమాలలో మమ్మల్ని ఆపకోండి-మీరు అడిగిన దానికంటె హెచ్చు ఉత్పత్తిని చూపెడతాము. జాతీయ అవసరాలను తక్కువ వ్యయంతో తీర్చగలము" అని మాత్రమే.

అధిక ఆదాయం వచ్చే మార్గాలుంటే వాటిని వదిలిపెట్టి కేవలం చిన్న కమతాలనే పట్టుకొని ఊగిసలాడేటంత మూర్ఖులం మనం కామని ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి మనం హామీ యిస్తున్నాము. ఇప్పటికే భూమిపై వత్తిడి పెరిగి పోయింది. భూమిపై భృతిగడవని గ్రామీణ ప్రజలెందరో బస్తీలకెగబ్రాకుతున్నారు. దీన్ని నివారించడానికి, భూ దాహాన్ని తీర్చడానికి సహకార వ్యవసాయం సాధనము కాజాలదు.

అందుకు మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలి. అందరికీ చేతినిండా పని దొరికే విధంగా పథకాలు అమలులోనికి రావాలి. పరిపాలన, ప్రజాశ్రేయ నిర్వహణలో

సామర్థ్యం, నీతి పెరగాలి. ఆనాడు రైతుల్ని అడగవచ్చు-"మీరు ఏ విధానాన్ని ఎన్నుకొంటారు" అని. అంతవరకూ మన ప్రణాళికా నిర్ణేతలు, ప్రధానమంత్రి వేచి చూడటం అవసరం. దేశ ఆర్థిక వ్యవస్థ శైశవావస్థలలోనున్న యిప్పుడు పై విధానాలను అవలంబించ ప్రయత్నించడం-సాంఘిక విచ్ఛిన్నాన్ని కోరి తెచ్చుకోవడమే ఔతుంది.

ప్రభుత్వ బంజర్లలో భూమిలేని రైతులు, వ్యవసాయ కూలీలద్వారా సహకార సేద్యాన్ని ప్రవేశపెట్టినట్లయితే మనకేమీ అభ్యంతర ముండదు. అది వాంఛనీయంగూడా. తద్వారా కొత్త కొత్త అనుభవాలను గూడా పొందవచ్చు. అలాంటి దానితో నిర్మాణాత్మకమైన పోటీకి గూడా మనం సంసిద్ధమే.

మా కృషికి ప్రభుత్వం సర్వవిధాలా సహకరించాలని అడిగే హక్కు-మనకున్నది. స్వశక్తిపై ఆధారపడి ఉత్పత్తి కార్యక్రమాన్ని సాగిస్తున్న మన కృషిని హర్షించటం ప్రభుత్వంయొక్క కనీసధర్మం. రైతులు, కళాకారులు కృషి సాధనలో సమాజాన్నిగానీ, ప్రభుత్వాన్నిగానీ ఎలాంటి ఆందోళనకూ గురిచేయడం లేదు.

కానీ స్వతంత్ర భారతావనిలో రైతాంగంపట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నది. కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ కృష్ణమాచారిగారే బస్తీలవారి పక్షపాతంతో ధాన్యం ధరలు పెరిగి పోయాయనే ఆందోళనకు నాయకత్వం వహించి నడిపించడం శోచనీయం. 1953 నాటికంటే ఈనాటి ధరలు హెచ్చుగాలేవని ఒక పైపున ఆహార వ్యవసాయశాఖామాత్యులు ప్రకటిస్తున్నా ఆర్థిక మంత్రిగారు అలాంటి ఉద్యమానికి నాయకత్వం వహించటంలో అంతరార్థ మేమిటో? ఎంత ఆందోళన జేసినా-ఎన్నాళ్ళకు ప్రభుత్వం ఆహార ధాన్యాలకు గిట్టుబాటైన ధరలు నిర్ణయించకపోటంలో అర్థమేమి? పోతే ఆంధ్ర ప్రభుత్వం విషయానికొస్తాము. బియ్యం మిల్లులవారి విషయంలో పరస్పర విరుద్ధమైన ప్రకటనలు జేస్తూ-అయోమయస్థితి కల్పించటాన్ని ఎలా సమర్థించుకోగలరు? జనవరి నాటికంటే సెప్టెంబరు నాటికి ధాన్యాల ధరలు తగ్గాయని ఒక పైపున అంగీకరిస్తూనే-బియ్యానికి మరింతగా, గిట్టుబాటుకాని విధంగా ధరలు తగ్గించేందుకు ప్రయత్నిస్తూ-కొనుగోలును గూడా కుదింపుజేసికొనుటకు కారణమేమి? తమ ప్రాంతంలో ధాన్యానికి ధరలు హెచ్చుగా వున్నాయని ఫిర్యాదులు చేస్తున్న బెంగాలు, సౌరాష్ట్ర, మద్రాసు,

పంజాబ్ ప్రాంతాలకు మన బియ్యాన్ని ఎగుమతి చేయుటకు రైల్వే రవాణా సౌకర్యాలను నిరాకరించుటకు కారణమేమి? ఆంధ్ర ప్రదేశ్ ఆహారమంత్రి రైతుల శ్రేయస్సు దృష్ట్యా సాహసోపేతమైన కృషి సలిపినా మన రాష్ట్రపు ధాన్యోత్పత్తిదారులను, మిల్లర్లను నాశనం చేయుటకు పూనుకొన్న కేంద్ర ప్రభుత్వ విధానం అయోమయంగా వున్నది.

అప్పులను వసూలు చేయమని ఒక వైపున బ్యాంకులను వత్తిడి చేస్తుండటము వలన మన వద్దకు గిట్టుబాటైన ధరలు వచ్చేంతవరకు ధాన్యాన్ని నిలవ చేయలేక పోతున్నాము. ఆ విధముగా ఆదిలోనే మనల్ని తప్పుడు ధరలకు ధాన్యాన్ని మనచే అమ్మించుటకు ప్రభుత్వం బస్తీల వారి పక్షపాతంతో నాటక మాడింది. ఈ పక్షపాత వైఖరి అసంగతమని నేను ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. మన రైతులు మరొక వర్గానికి నష్టదాయకముగా అధికలాభాలు పొందే దురాశతో లేరని నేను లోక్‌సభలో స్పష్టంచేశాను. మనం వీలైనంత హెచ్చుగా పండించేందుకే ప్రయత్నిస్తున్నాము. భూమిని సారవంతం చేయుటకు పాటుపడుతున్నాము. శక్తి వంచన లేకుండా సమాజాన్ని సేవించుటకు తాపత్రయపడుతున్నాము. మన విద్యుక్త ధర్మాన్ని నిర్వహించుటలో మనం ఒకరిచేత పదే పదే చెప్పించుకోము. ఒకరి పర్యవేక్షణగానీ, ప్రచారముగానీ మనకు అవసరములేదు. మనం సమాజాన్ని, ప్రభుత్వాన్ని కోరేదల్లా మన నష్టాలకు భీమా, మన శ్రమకు విలువ, వృత్తికి గౌరవము, లాభ నష్టాలురాని ప్రజాకార్యక్రమంగా వ్యవసాయాన్ని రూపొందించటం-మనకు బస్తీవారికి మధ్య జీవన ప్రమాణంలో అధిక వ్యత్యాసాలను లేకుండా చేయడము-నాగరిక ప్రపంచంలో మన గలిగే జీవిత స్థాయిని మాత్రమే.

వాస్తవానికి ఇది ఏమంత ఎక్కువైనదేమీకాదు. ఈ కనీస కోర్కెలకు చెవియొగ్గుటకు బదులు కేంద్ర ప్రభుత్వం పక్షపాతంతో గూడుకొన్న ఆహార ధాన్యాలు ధరలు పరిశీలన సంఘాన్ని ఎందుకు నియమించిందో దురూహ్యం. రైతాంగ ఆర్థిక వ్యవస్థపట్ల జాతికి రోతపుట్టించేందుకు-సహకార వ్యవసాయ విధానాన్ని ప్రచారం చేయుటకు ధనపురాసులను ఎందుకు కరిగించాలి? రైతులకు సవాలుగ మేథావుల మేథస్సులు విరామం లేకుండా కృషి చేయటం దేన్ని సాధించడానికి? అధికారం కలిగిన, పలుకుబడి కలిగిన ప్రభుత్వ నాయకులంతా-రైతులు తమ గ్రామముల నన్నింటినీ లోప భూయిష్టమైన పంచాయితీ బోర్డుల స్వాధీనం

చేయమని కేకలువేయుటకు "ఏల్‌వాల్"కు యెందుకు పరుగెత్తాలి? వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ గలిగి, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్న రైతులపై "బైంబాంబు" వేయటానికే గదా?

అన్నివర్గాల ప్రజలవలెనే-తమకు అవసరమైన రక్షణలు, సౌకర్యాలు, చెయ్యమని అడిగేహక్కు రైతులమైన మనకూ వున్నది. విశేషమేమంటే కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం సహితం సహకార వ్యవసాయ విధానాన్ని అమలు జరుప బోమనీ, రైతాంగ ఆర్థిక వ్యవస్థతో అనవసర జోక్యం చేసికోమని కేరళ రైతులకు హామీ ఇస్తున్నది. అయినా కాంగ్రెసు- కాంగ్రెసు ప్రభుత్వాలు రైతులకు అలాంటి హామీల నివ్వకపోవటం విచారకరం. ఇదంతా రాజకీయ భాగవతము కాదనగలమా!

ప్రభుత్వం ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలని నేను కోరుతున్నాను. మేము జనాభాలో నూరింట 50 మంది మున్నాము. మాతోవున్న చేతివృత్తులవారు, కళాకారులు మరొక 10% వున్నారు. మేమంతా రాజకీయ చైతన్యంతో ముందుకు వస్తున్నాము. ఈ దశాబ్దంలోనే జమీందారుల, భూస్వాముల ఇనుప కౌగిళ్ళ నుండి విముక్తిజెంది, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించుకొన్న ఉత్తర ప్రదేశ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాలు ఆంధ్రప్రదేశ్ అశేష రైతాంగం-జమీందారీ విధానం కంటె భయంకరమైన సహకార వ్యవసాయం, గ్రామపంచాయితీ విధానాలను ఎదిరించటంలో వెన్ను చూపరని హెచ్చరిస్తున్నాను.

మచిలీపట్నం
9-10-57

ఆచార్య రంగా

★

# తూర్పు ఐరోపాలో ఎఱ్ఱ సామ్రాజ్యవాదం

## పారిస్‌లో అక్టోబరు 1956 లో జరిగి అంతర్జాతీయ రైతు మహాసభ - ఆచార్య రంగా ప్రారంభోపన్యాసం

ఇరవైకోట్ల భారత రైతాంగం తరపున ఈ ప్రపంచ రైతుల వేదిక నుండి ఇచ్చట సమావేశమైన ఆగ్నేయ ఐరోపా వీరోచిత రైతాంగానికి- వారు సల్పుతున్న విప్లవ పోరాటాలకు జోహార్లర్పిస్తున్నాను. ఎఱ్ఱ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా వీరోచిత పోరాటాన్ని సాగిస్తూ, జాతీయ స్వతంత్ర సాధనకు, సాంఘిక భద్రతకు పవిత్రమైన తమ మాతృభూమిలో అశేష త్యాగాలకు తలపడిన హంగరీ వీర రైతాంగానికి ప్రపంచ రైతాంగం తరపున యివే నా జోహార్లు.

ఈనాడు హంగరీరైతులు, కొన్ని మాసాల క్రితం పోలెండు కర్షక, కార్మికులు ప్రదర్శించిన, ప్రదర్శిస్తున్న స్వాతంత్ర కాంక్ష, ప్రజాస్వామిక ప్రియత్వం తూర్పుదేశాల ప్రజలను ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా రైతాంగాన్ని ఉత్తేజ పరుస్తున్నాయి. ఈ శతాబ్దపు ప్రారంభమునుండి మా దేశస్తులు జాతీయ స్వాతంత్ర్యం కొరకు సుదీర్ఘ పోరాటాన్ని సాగించారు. అలాంటి మేము ప్రజాస్వామ్య రక్షణకు, సాంఘిక భద్రతకు, జాతీయ స్వాతంత్ర్యానికి యీనాడు ఆగ్నేయ- ఐరోపా దేశాలు సాగిస్తున్న సమరాలను, చేస్తున్న త్యాగాలను ఎలా అభినందించకుండా ఉండగలం.

ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం కమ్యూనిస్టేతర దేశాలలోని అనేక మంది ప్రభుత్వాధినేతలు సోవియట్ సామ్రాజ్య తత్వంవంటి అభివృద్ధి నిరోధక విధానం మరొకటి లేదని గమనించగలిగారు. సామ్రాజ్యవాద తత్వంతో సంబంధాలు కలిగిన రాజకీయ వేత్తలు ఆఫ్రో-ఏసియన్ మహాసభలో సోవియట్ సామ్రాజ్యవాదాన్ని ఖండించలేకపోయారు. ఐక్యరాజ్య సమితి తన ప్రణాళిక దృష్ట్యా యిబ్బందుల వలన నయితేనేమి, మరేయితర కారణాలవల్ల నైతేనేమి ప్రపంచ దేశాలపై సోవియట్ రష్యా సామ్రాజ్యవాద విధానాన్ని సక్రమ దృష్టిలో పరిశీలించ లేక పోయింది. యేనాటి కానాడు కమ్యూనిజం పేరుతో పొరుగు దేశాల జాతీయ స్వాతంత్ర్యాలు కబళించబడుతున్నప్పటికి చూస్తూ వూరుకొనవలసి వచ్చింది.

దేశం తర్వాత దేశం సోవియట్ సామ్రాజ్యవాదంలో అణగారిపోతున్నా ప్రపంచ దేశాలు, రాజకీయ వేత్తలు నిస్సహాయులై శూన్యంలోకి చూడవలసి వచ్చింది. ఇండోనేషియా, మలయా, టునీషియా, మొరాకో, ఆల్జీరియా మొదలగు దేశాలు సోవియట్ సామ్రాజ్యవాదంతో జాతీయ స్వాతంత్ర్య రక్షణకు పోరాటాలు జరపవలసి వచ్చింది. బలవత్తరమయిన, నిర్మాణాత్మకమయిన శక్తి పంచమాంగదళ యంత్రాంగం కలిగిన సోవియట్ సామ్రాజ్యవాదంతో పోలెండు, హంగరీ ప్రజానీకం పెద్దయెత్తున పోరాటాలు సాగించవలసి వస్తున్నవి. పోలెండులో పోలెండు ప్రజలు ఒక రాజకీయ ఘనవిజయాన్ని సాధించారు. ఆ ప్రజలు రాజకీయ చైతన్యాన్ని అభినందిస్తున్నాను. తిరిగి ఈనాడు సోవియట్ సామ్రాజ్య పాశవిక బలం హంగరీపై విజృంభించింది. ఇదంతా చూస్తూవుంటే జాతీయ స్వాతంత్ర్య, సాంఘిక న్యాయం కొరకు మానవ పరిభ్రమణంలో మరొకసారి త్యాగం, ఆత్మశక్తి సమాజపు ఉపరి భాగానికి ఉవ్వెత్తున పొంగినట్లు అవగత మవుతున్నది.

ప్రపంచంలో కని, వినీ ఎరుగనటువంటి నిరంకుశ, అమానుష శక్తులను ఎదిరించుట మానవునిలో పొంగిపరవళ్ళు త్రొక్కుతున్న అభివృద్ధికరమైన, అఖండమైన, వీరోచితమైన, ద్విగుణీకృతమైన స్వాతంత్ర్యేచ్ఛ, ఉత్తేజం ఉద్వేగం ప్రపంచ మానవకోటి జోహారు లందుకొంటున్నది. హంగరీలో, పోలెండులో ఇతర ఆగ్నేయ- ఐరోపా దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు, సోవియట్ సైనిక బల సహాయాలతో ప్రజాస్వామికాన్ని ఎలా అణచివేస్తున్నది. యీనాడు హంగరిలో సాగిస్తున్న విప్లవం స్పష్టపరుస్తూంది. కమ్యూనిస్టు ప్రభుత్వాలు ప్రజాసహకారాన్ని పొందుతున్నాయనే సోవియట్ రష్యా తప్పుడు ప్రచారంలోని బండారాన్ని విప్లవ కారులు బయటపెడుతున్నారు. ఆ దేశాలలో సోవియట్ రష్యా యింతటి అమానుష కృత్యాలకు, అసభ్య ప్రవర్తనకు తలపడి ప్రజల స్వాతంత్రేచ్ఛను అణచుటకు దమననీతిని ప్రయోగిస్తున్నా ప్రపంచములోని స్వతంత్ర రాజ్యాలు, ఐక్యరాజ్య సమితి మిన్నకుండడం శోచనీయం. ఆ దేశాలలో ప్రజలద్వారా ఎన్నికైన మంత్రి వర్గాలను సైనికసహాయంతో కూలద్రోసి నిరంకుశ ప్రభుత్వాలను ప్రజలపైరుద్దేందుకు ప్రయత్నిస్తున్న సోవియట్ రష్యా దమననీతి క్షమార్హంకాదు.

ఇండియా, ఆసియా దేశాలలోని కమ్యూనిస్టులతో మేము 20 సంవత్సరాల నాడు సిద్ధాంతరీత్యా ఒక పోరాటాన్ని సాగించాము. జాతీయవాదం, అందుకు

సంబంధించిన జాతీయ స్వాతంత్ర్యం, సమానత్వం అంతర్జాతీయ వాదంవలెనే అభివృద్ధికరమైన ప్రాపంచిక శక్తులని, సాంఘికన్యాయం, రైతాంగానికి తదితర గ్రామీణ ప్రజలకు స్వేచ్ఛ- రాజకీయాధికారాలు, కార్మికులకు, బుద్ధిజీవులకుపిటనే సంక్రమింపజేయడం న్యాయమని సిద్ధాంతీకరించి, తదాశయనసిద్ధికి ఎన్నో ఉద్యమాలను సాగించాము. కమ్యూనిస్టులు మార్క్సు, లెనిన్, స్టాలిన్ సిద్ధాంతాలను ఉచ్చరిస్తూ జాతీయవాదం, రైతాంగ వ్యవస్థ అభివృద్ధి నిరోధక విధానాలుగా చిత్రించారు. తదనుగుణంగానే సోవియట్ నాయకులు తమ పొరుగు దేశాలైన పోలెండు. బల్గేరియా, చెకోస్లోవేకియా, యుగోస్లోవియా, హంగరీ, లిథూనియా, లాట్వియా, రుమేనియా. తదితర ఆగ్నేయ- ఐరోపా దేశాలతో వ్యవహరించారు. ఆ దేశాలలోని జాతీయ స్వాతంత్ర్యేచ్ఛను అతి దారుణంగా అణచివేశారు. జాతీయ నాయకులను క్రూరంగా వేటాడారు. కమ్యూనిస్టుపార్టీ క్రింద శిక్షణ పొందిన వారితో ప్రభుత్వాల నేర్పాటుచేసి అభాగ్య ప్రజల భవిష్యత్తును ఆ పశువుల చేతుల్లో పెట్టారు. అయితే యీనాడు హంగరీలోనూ, నిన్న పోలెండులోనూ, మొన్న తూర్పు జర్మనీలోనూ ప్రజలు యీ నిరంకుశ విధానానికి ఎదురుతిరిగారు. అప్రతిహతమాన మైన రాజకీయ చైతన్యంతో, అఖండమైన రాజకీయ చైతన్యంతో, అఖండమైన స్వాతంత్రేచ్ఛతో ప్రజలు ముందుకు వచ్చారు. జాతీయ విప్లవం అణచరానిదని, విశ్వవ్యాపితశక్తి కలిగినదని, జాతీయ స్వాతంత్ర్యం అభివృద్ధికరమైన శక్తియని, స్వాతంత్ర్యం అభివృద్ధికరమైన శక్తియని, స్వాతంత్ర్య జ్వాలలు ఆర్పేందుకు సోవియట్ నిరంకుశ సామ్రాజ్య రక్కసిచేత కాదని నిన్న మొన్నటివరకు ప్రజలలో అణగివున్న శక్తులు కాసారంవలె ఉడుకుతూ ఒకనాడు అగ్నిపర్వతంవలె బ్రద్దలు కాగలదని రుజువుచేశారు. చేస్తున్నారు. ఈ నగ్న సత్యాన్నే 1946 లో ప్రచురింప బడిన నా గ్రంథం "ప్రపంచ వ్యాపితంగా జాతీయ విప్లవాలు" (World Role of Nat'onal Revolutions) తదనుగుణంగా మాదేశ ప్రజలు జాతీయ సమరాంగణంలో పురోగమించారు.

ఆఫ్రికా-ఆసియా తూర్పు ఐరోపా దేశాలలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కొరకు వీరోచిత పోరాటాలు సాగిస్తూ పాతకాలపు సామ్రాజ్యవాదులను, కమ్యూనిజం పేరుతో పైకివస్తున్న కొత్తరకపు సామ్రాజ్యవాద శక్తులను ఎదిరిస్తున్న స్వాతంత్ర్య యోధులను యీ అంతర్జాతీయ రైతుమహాసభలో అభినందించుకుందాం !

జాతీయ స్వాతంత్రంతోపాటు ప్రపంచ రైతులను సంఘటితపరచవలసిన అవసరాన్ని కూడా విస్మరించరాదు. ఎన్నో శతాబ్దాలుగా ప్రపంచ రైతాంగం సామ్రాజ్యవాదుల, జమీందారుల, మతగురువుల తదితర సాంఘిక అభివృద్ధి నిరోధక శక్తుల యినుప పాదాల క్రింద నలిగిపోతూ వుండడమే గాక, కాపిటలిస్టు, కమ్యూనిస్టు శక్తులు గూడా వారిని అణగద్రొక్కేందుకు ప్రయత్నిస్తున్నాయి. పౌరసత్వ హక్కులు రైతులకు నిరాకరించబడ్డాయి. కేవలం కూలీలుగా వారు పరిగణించబడ్డారు. తుదకు బానిసలుగా పరిమార్చినారు. ఈ శతాబ్దంలోనే రైతులు చైతన్యవంతులై త్యాగాలకు సిద్ధపడి, విప్లవాలు సాగిస్తూ జమిందారీ విధానం, మత గురువుల యినుప కౌగిలినుండి విముక్తులౌతున్నారు. కోట్లాది రైతులు స్వంత కమతాలను సాధించుకొనుటద్వారా స్వతంత్రులై ఆర్థికంగా, సాంఘికంగా పురోగమించకలుగుతున్నారు. ఈ విధంగా అభివృద్ధికరమైన రైతాంగ విప్లవం సాగుతుండగా ఒక వైపునుండి సోవియట్ రష్యా, మరో వైపునుండి కమ్యూనిస్టు చైనా రైతాంగాన్ని వెనుకటి బానిస జీవితానికి పంపించేందుకు సమష్టి వ్యవసాయ విధానాన్ని, ప్రభుత్వ కమతాలను అమలు జరిపి రైతాంగ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయుటకు తయారౌతున్నాయి. రైతాంగ ఆర్థిక వ్యవస్థలో యీనాడు రెండువిభిన్న దృక్పథాల మధ్య సంఘర్షణ జరుగుతుంది. ఒక వైపున స్వంత సేద్యం ద్వారా ఆర్థిక స్వాతంత్రాన్ని, సాంఘిక భద్రతలను పొందుటకు, నిరుద్యోగాన్ని నిర్మూలించుకొనుటకు రైతాంగం కృషి చేస్తోంది. రెండో వైపునుండి సోవియట్ రష్యా, కమ్యూనిస్టు చైనా వ్యవసాయ విధానాలు కైతువర్గాన్ని తుదముట్టించుటకు అభివృద్ధికర రైతు వ్యవస్థను విచ్ఛిన్నం చేయుటకు; రైతులను రోజువారి కూలీలుగా మార్చుటకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

స్వతంత్ర కుటుంబ రైతాంగ వ్యవస్థను ప్రోత్సహించుటద్వారా యీనాడు ముంచుకవస్తున్న ఆర్థిక సామ్రాజ్యవాద బానిసత్వంనుండి ప్రపంచ రైతాంగాన్ని రక్షించుటకు యీ మహాసభ తగువైన నిర్ణయాలను చేస్తుందని ఆశిస్తున్నాను.

మనం సహకార విధానాలపై వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరింప వలసిన అవసరాన్ని గుర్తిస్తున్నాము. అలాంటి సహకార అభివృద్ధికర విధానం స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఆర్థిక అభివృద్ధిని, ఉత్పత్తిని రక్షించేదిగా ఉండాలి. ఉత్పత్తి వస్తువుల అమ్మకం, సరఫరాలు మొదలైన విషయాలలో రైతాంగం

సమాజంతో పూర్తిగా సహకరించాలని మనవాంఛ, వ్యవసాయాన్ని రైతాంగపు చొరవ, శక్తి, శ్రమ మీదనే వదలిపేయడం అవసరం. అందుకు సంబంధించిన సహాయం, పర్యవేక్షణ, నాయకత్వం, ప్రభుత్వాలు ఇస్తూ, తద్వారా రైతాంగపు హక్కులను జాతీయ అవసరాలకు అనుగుణ్యంగా కాపాడవలసియున్నది. సహకార వ్యవసాయ విధానాన్ని రైతులు అమలు పరచుకొనే స్థితిలో మనం సహాయ పడతాం, మరి ప్రోత్సాహ పరుస్తాం. రైతులు ఐచ్ఛికంగా, నిర్బంధ రహితంగా సహకార సంస్థలను నిర్మించుకున్నప్పుడు, సహకార సంస్థల్లో సభ్యులైనప్పుడు, సహకార విధానం విజయవంతమౌతుంది. సహకార విధానం గిట్టుబాటు లేదని, సాంఘిక పరిస్థితులకు అనను కూలంగా వున్నదని రైతులు గ్రహించినప్పుడు ఆ సంస్థలనుండి విడిపడి తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకొనగల స్వేచ్ఛగూడా వారికి వుండవలెనని మనం అంటున్నాం. రైతుల స్వతంత్రం, వ్యక్తిత్వం పెరిగే విధంగా ప్రజాస్వామిక విధానాలను రూపొందించుకొన్నప్పుడే సహకార విధానం ఆచరణ సాధ్యమౌతుంది. విజయవంతమౌతుంది.

అదే రైతాంగానికి మనము సాధించి పెట్టగలిగే సోషలిస్టు వ్యవస్థాస్వరూపం. తదాశయ సిద్ధికి, తద్వారా- సోషలిస్టు వికేంద్రీకృత ఆర్థిక స్వాతంత్ర్యానికి యీ మహాసభ కృషి చేస్తుందని ఆశిస్తున్నాను. ఈ విధానాన్నే భారతదేశంలో గాంధేయ సోషలిజం పేరుతో మేము ఆరాధిస్తున్నాము.

ప్రపంచంలో ప్రతిచోటా రైతాంగానికి రాజకీయమైన హక్కులు అంతస్తు అసమగ్రంగా వున్నాయి. మా రైతాంగంగూడా రాజకీయాధికారంలో వెనుకబడి యున్నారని చెపితే ఆశ్చర్యంలేదు. స్వాతంత్ర్యం, రాజకీయ అధికారాలలో న్యాయసమ్మతమైన మన వాటాకు కృషి చేయవలసిన సమయం ఆసన్నమైనది. మన ప్రజాస్వామిక వ్యవస్థలో యితర శ్రమిక వర్గాలతోపాటు సమైక్యంగా రాజకీయాధికారం కొరకు ప్రత్యక్షంగా కృషి చేయవలసియున్నది. ఇతర శ్రమిక వర్గాలతోపాటు మాకుకూడా సమానమైన హక్కులు వుండాలనే ఉద్యమంద్వారా పరోక్షంగా పాటుపడవలసియున్నది. ఈనాడు సమాజంలో మన సేవలకు, సామాజిక సంపదకు, మన కృషికి చాలా తక్కువ విలువ కట్టబడుతున్నది. తత్కారణంగానే సాంఘికంగా వెనుకబడియున్న వర్గాలకంటెగూడా మనకు ఆదాయం అతి తక్కువగానూ, కష్టాలు ఎక్కువగానూ వున్నాయి.

ఈ సమాజంలో యితర వర్గాలతోపాటు మన కృషికికూడా విలువ కట్టాలని, యితర వస్తువులతోపాటు మన వుత్పత్తికికూడా ధరలు నిర్ణయించాలని, తద్వారా జీవన ప్రమాణంలో యితర వర్గాలతోపాటు సమత్వం సాధించబడాలని మనం కోరుతున్నాం. సమాజంలోని సర్వశ్రామిక వర్గాల ఆర్థిక జీవనంలో సమత్వం సాధించబడాలనే యీనాటి నినాదం విప్లవాత్మకమైనది, నిర్మాణాత్మకమైనది. అని ఘంటా పథంగా చెప్పవచ్చు. ఈ విధానాన్ని అమలు జరిపేందుకు ప్రెసిడెంటురూజ్ వెల్టు ప్రారంభించిన దేశవ్యాపితమైన ఉద్యమమే నేటికి తార్కాణం. రైతాంగానికి యితర వర్గాలతోపాటు అన్ని విషయాలలోనూ సమత్వాన్ని సాధించుటకు. సాంఘిక న్యాయాన్ని పొందుటకు ప్రపంచ వ్యాపితమైన ఉద్యమాన్ని కొనసాగించటమే అంతర్జాతీయ రైతు సమితి ఆశయమని చాటుకుందాము.

ఇది ప్రపంచ రైతుల నిర్మాణాత్మకమైన, విప్లవాత్మకమైన సిద్ధాంతం. ఈ పవిత్రమైన ప్రపంచ రైతు సమితి నిర్విరామంగా కృషిచేయాలి, చేస్తుంది.

ఈ ఘనమైన వేదికనుండి ప్రపంచ రైతులకు ప్రబోధించగలిగిన సదవ కాశాన్ని కలిగించినందుకు యీ మహాసభ నిర్వాహకులను మనఃపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఆ చా ర్య ర ం గా

# రైతుకూలీ వ్యవసాయక ఉద్యమాల లక్ష్యాలు

స్వతంత్ర స్వరాజ్యపు భారతదేశము తన మూలచట్టముద్వారా "ప్రతి మానవునకు, స్వతంత్రముగా జీవించుటకు, స్వేచ్ఛగా ఎచ్చటైనా ఏదో వృత్తిలో జీవనోపాధి సంపాదించుకునే హక్కు" అందజేయుటకు ప్రతిజ్ఞ చేసినది. కనుకనే. ఎచ్చటెచ్చట బానిసత్వము, దానితో సరియగు దౌర్భాగ్యము ఎవ్వరెవ్వరికి దాపు రిస్తున్నదో దాన్ని వెదకి, వెదకి, తొలగించుటకు ప్రయత్నించుచున్నాము. శ్రీమతి ఇందిరా ప్రభుత్వము ఇందెందో విజయం పొందగలిగింది. ప్రతి ఒక్కరికి, ఏదో ఒక ఉద్యోగము అందించుట అవసరం. పాశ్చాత్య దేశాలలో అచ్చటి సాంఘిక వ్యవస్థలు, ప్రభుత్వాలు అత్యంత విజేయము. ఈ అవసరం తీర్చుటలో హక్కును అనుభవములో అందరికి అందించుటలో దాదాపుగా నిండుగా విజయం పొంద

చున్నవి. మనదేశములో కూడా ఇట్టి హక్కును సాధించుటకై మాబోంట్లము 1923 నుండి ప్రయత్నిస్తున్నాము. బ్రిటిషువారిట్టి హక్కును మన ప్రజలకు కలదనలేకుండిరి. మహాత్ముడీ హక్కు అందరికి కలదు. అనుభవములో సాధించవలసినదే ననిరి. తానే వివిధ గ్రామీణ పరిశ్రమలను పునరుద్ధరిస్తూ పెంచుతూ ఉండిరి. ఆపైన ఎందరెందరికో ఈ ప్రాథమిక, అత్యవసర హక్కును సంపాదించుటకే ఖాదీ గ్రామోద్యోగముల బోర్డును స్థాపించిరి. స్వరాజ్య ప్రభుత్వము ఈ అవసరములను తీర్చుటకు యింకనూ పూర్తిగా పూనుకోలేకున్నది గదా?

కొంగ్రొత్త ఉద్యోగములను ఖాదీ, మాధ్యమిక పరిశ్రమల పెంచుటద్వారా, పదుల లక్షల పారిశ్రామికులకు శ్రీ జవహరుని ప్లానులు పరిశ్రమలద్వారా వుద్యోగములను సాధించితిమి. ఈ దారులలో ఆంధ్ర ప్రజలు కొంత లాభం పొందిరి. కాని, తగినంతగా ఆ లాభములను అందుకొనజాలకున్నారు. ఇదివరకే ఉన్న చేనేత చేతివృత్తుల పెంపకం జరుగుచున్నది. ఇంకెంతో పెరగాలి. ఈ వుద్యోగాల సరళిలో అటు శ్రీ మాచాని సోమప్ప, యిటు ప్రగడ ప్రభృతుల ప్రోద్బలము వల్ల మన రాష్ట్రము ముందంజ వేయగలుగుచున్నది. తరతరాలుగా వస్తున్న వివిధ చేతివృత్తులు, గ్రామాల కుటీర పరిశ్రమలు, వీటిలో అందుచున్న వుద్యోగములకు ప్రధానమగు, సృజనాత్మకమగు, జాతికే నైతిక ఆర్థిక స్వతంత్ర్య ప్రదాయమగు లక్షణము కలదు. అదే స్వంత వుద్యోగము. అదే ఆర్థిక స్వాతంత్ర్య ప్రదాయిని. అయ్యదే సంపూర్ణ మానవత్వమునకు ప్రాణప్రదము.

ఆ స్వంత ఉద్యోగమందు యజమాని స్వత్వము. ఉద్యోగి లక్షణము, కష్టకారుని జీవితము, ఉత్పత్తి సౌభాగ్యము, వృత్తిలోని సృష్టిసౌభాతృత్వము విలీనమవుతున్నవి. అంతటి సృష్టి స్థితి, సౌభాగ్య నిలయము నిండుగా స్వంత వ్యవసాయమందు అందుచున్నవి కనుకనే, నాగరిక జీవిత ప్రారంభయుగము నుండియు, వ్యవసాయవృత్తి వ్యాసంగమందు, స్వంత భూవసతి కల్గి స్వయముగా వ్యవసాయము చేస్తూ, చూస్తూ, చేరుతూవుంటూ వివిధ వృత్తులవలంబించు కష్టజీవులందరు, ప్రథమ తాంబూలము అందించుకొంటున్నారు. అందుకే మహాత్ముడు వ్యవసాయమును స్వతంత్ర జీవితమునకు ప్రధానకీలకమన్నారు. రథచక్రమన్నారు. ఆ చక్రమునకు, వివిధ ఉపాంగములు, వివిధ వృత్తులన్నారు. అన్నిటికీ స్వంత వృత్తి ఉద్యోగము హృదయమన్నారు. స్వంత వుద్యోగం చైతాంగమునకు ప్రాణ

మన్నారు. అట్టి స్వంత వుద్యోగప్రాప్తి వ్యవసాయమందే అత్యధికంగా అంద గలదన్నారు. ఈ ప్రాథమిక ఆర్థిక, సాంఘిక, ధర్మములను పొందిక చేసుకుంటూ, వుండిన వారందరి వద్దనే ఆర్థిక స్వరాజ్యమును పొందదలచినవారు సాంఘిక విప్లవ ప్రధమ పాఠముల నేర్చుకొనవలెనంటూ వుండిరి. పాశ్చాత్యదేశాల సోషలిస్టు నాయ కులు, వారే గిల్డు సోషలిస్టులు, వారి భావుకులు, రచయితలకు నాయకులు శ్రీ జి. డి. హెచ్. కోల్ ప్రభృతులు, వారి ధోరణివి కాదంటూ, ఎంతోదూరం, ఎన్నెన్నో దేశాలలో, ఆర్థిక స్వాతంత్ర్యముకొరకై వెదుకుచూవుండిన, కమ్యూనిస్టులలో ధైర్య సాహసాలు కల్గిన, యుగోస్లావియా, టిటో అనుచరులు, 1950 నుండి, స్వంత వుద్యోగ ధోరణిలో కష్టకారులే స్వయంగా తమ తమ వృత్తులలో వృత్తి వ్యాసం గముల సాగించుతూ, వివిధ పారిశ్రామిక వుత్పత్తులను పరిశ్రమలలో సాధించు టకు పూనుకొంటున్నారు. ఈ రహస్యమును మహాత్ములు 1920—30లోనే తెలిసి కొనిరి. 1923నుండి మాబోంట్లము, రైతుకూలీ వుద్యమములద్వారా, ప్రజోద్యమాల ద్వారా రైతు జీవితమందు ప్రతిబింబించిన ప్రయత్నిస్తున్నాము. ఇట్టి స్వంత ఉద్యోగ ములు అన్ని పరిశ్రమలలో అందవు. వ్యవసాయమందు అధికంగా పొందవచ్చు; కావి జమీందారులు, జాగీరుదారులు, భూకమతాలపై రైతులకు నిమిత్తమగు యాజ మాన్యము లేకుండా, శతాబ్దాల తరబడి లేకుండా చేస్తూవుండిరి. తమ భూములను ఎప్పుడు జమీందారులు లాగేస్తారో, వేలాంవేస్తారో, పట్టాలు లేకుండా చేస్తారో, పండించిన పంటలను తమకు దక్కనివ్వరో అనే భయం రైతులకు కలిగించేవారు.

ఆ భయం, బాధ, అస్థిమితమునుండి రైతుల రక్షించుటకై మాబోంట్లము రామానాయుడు, లక్ష్మీనారాయణ, మందేశ్వరశర్మ, ప్రభృతులం, జమీందారీ రైతు ఉద్యమము నడిపితిమి. ప్రధమంగా, 1930—36 లో ఆంధ్రలో క్రమంగా 1946—50 లో భారతదేశమంతటా స్వామి సహజానంద వగైరాల తోడ్పాటుతో స్వరాజ్యావతరణము పిమ్మట (1952 లోపల) అఖిలభారతమంతటా, తమతమ కమతలములపై రైతులకు సంపూర్ణ అధికారము, తమ పంటలు తమవేననే విశ్వాసము రైతులకు అందించుకోగల్గితిమి.

ఇంతలో ఆ రష్యా, చైనాలోవలె కమ్యూనిస్టు ధోరణిలో కమతాలనన్నిటిని

రద్దుచేసి, రైతాంగం హక్కులను లాగేసి, సహకార వ్యవసాయముగా, ఉమ్మడి ప్రభుత్వ వ్యవసాయముగా, భూములు సాగుచేస్తేనే, జాతీయాదాయం ఉవ్వెత్తున సత్వరంగా పెంచవచ్చనేవారి వెర్రిప్రణాళిక జవహరు పండితునకును ప్రారంభమాయెను. జాతీయ కాంగ్రెసుచే ఆ ప్రణాళికను, జవహరులాలు అంగీకరింపచేసిరి. అదీ స్వంతవృత్తికి స్వతంత్రప్రదాయమగు స్వయం వ్యవసాయమునకు, ఆత్మగౌరవప్రదంబై, అత్యధిక వుత్పత్తి సాధించుటకు సాధనమగు స్వంత వుద్యోగ ఆర్థిక సాంఘిక ధోరణికి చావుదెబ్బగొట్టుననే మా బోధలు, ప్రచారం, జవహరునకు నచ్చకపోయెను. అంతట ఆనాటి జమీందారీ పద్ధతిపై యెదిరించుటకు చేసిన ప్రయత్నమునకు పదులరెట్లుగా ఆందోళనచేసి, మరెంతో రాజకీయ త్యాగములు చేసి జాతీయ పరిధిలో ఆ సహకార వ్యవసాయ ప్రణాళికను ఎదిరించితిమి. ప్రత్యేక రాజకీయ పార్టీనే స్థాపించితిమి. ఎన్నికల్లో పదేపదే ఓటమిల బొందితిమి. తుదకు గెలిచితిమి. గెలుచుకొన్నది యేమిటి? చిన్నచిన్న భూఖండాలు, భూకమతాల ద్వారా హెచ్చు వ్యవసాయ ఉత్పత్తుల సాధించగలమంటిమి. స్వంత వుద్యోగులగు రైతులే దేశపు పంటల పెంచుటకు, భూసారమును, పంటల రక్షించుటకు ఆధారమని పల్కితిమి. స్వంత వ్యవసాయమే రైతులను నిర్మాణాత్మకమగు శక్తివంతమగు, అభివృద్ధిదాయకమగు జాతీయాదాయాన్ని వృద్ధిని ప్రోత్సహించునని ఋజువు చేసితిమి. వివిధ పరిశ్రమలలో ఫ్యాక్టరీలను నిర్మించి పదులు వందలకోట్ల పెట్టుబడిని అందించి, ఎంతోకాలంపై నిర్మించుకొన్న పిమ్మట, పదులు, వేలు, మహా ఐతే లక్ష కార్మికులకు జీవనోపాధి సంపాదించుటే సాధ్యమగుచున్నదే? అదీ ఐనా ఆ కార్మికులకు స్వంత ఉద్యోగం కాదే? వారికి ఆర్థిక స్వాతంత్ర్యము అందునా? అదే వుద్యోగము పూడిగముకాదా? అట్టి ప్రయత్నము చేయనవసరం లేకనే, కోట్ల కొలందిగానున్న వ్యవసాయకులకు స్వంత వుద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యము, సాంఘిక స్వాస్థ్యము అందించుచున్న రైతాంగపు స్వంత కమతములు, స్వంత వుద్యోగము, ఆత్మగౌరవ ప్రదమగు స్వతంత్ర గ్రామికవీరుల బలగాలను రక్షించుట నిర్మాణాత్మకమగు జాతీయ సేవగదా! అట్టి అభివృద్ధి దాయకమగు సేవాపథమును తిరిగి కాంగ్రెసు ఇందిరాజీద్వారా అంగీకరించునట్లు చేయగల్గుచున్నాము. ఈనాటికి శ్రీ చరణసింగు ద్వారా జనతావారుకూడా ఈ ధోరణిని ధర్మమార్గమును అవలంబించు అవకాశము కలుగుచున్నది. ఇంత సాధించుటలో పది సంవత్సరాల తరబడి శ్రీ రాజాజీ "మున్షి" బాయికాలే, బసంతసింగు, భారతీదేవి ప్రభృతుల సహాయం

అందుకొను భాగ్యము కలిగినది. ఐతే ఈ స్వంత కమతములు, స్వంత వుద్యోగ భాగ్యము తరతరాలుగా భూవసతి పొందుచుండిన కులాలు, వర్గాలకేనా? అనాదిగా, వ్యవసాయముపై ఆధారపడుచూ, భూస్థితి స్వామ్యమూ పొందజాలక, కూలిపైననే ఆధారపడుచూ వస్తున్న హరిజనులు, దళిత వర్గాలకూ కూడా భూస్థితి అవసరమే గదా? స్వంత వుద్యోగ భాగ్యము తరతరాలుగా భూవసతి పొందుచుండిన కులాలు, వర్గాలకేనా? అన్ని మాసాలకు గాకున్నా కొంతగానైనా అందచేయాలిగదా? ఈ కనీస ధర్మాన్ని సాధించుటకు అందరం పూనుకోవలదా? ఈ ధర్మనిర్వహణకు, ఇందిరాజీ 1972-77 మధ్య శక్తి వంతంగా పూనుకొన్నారు. లక్షలాది వ్యవసాయ కూలీలకు హరిజనులు, గిరిజనులు, దళిత వర్గాలకు భూకమతాలను, కొద్దికొద్ది పరిమితులలో నైనా, అదించ ప్రయత్నించిరి. ఆ ప్రయత్నములను బలపరచుటకు మేమంతా ముందుకొచ్చితిమి. ఇప్పుడీ, చరణసింగు బలగాలు కూడా మాకు తోడగుదురను ఆశ కలుగుచున్నది.

భూసంస్కరణల చట్టం ద్వారా, కొంతగా భూములు అందినవి. ఈ విధంగా పరిస్థితి చేయుటకు, అది చాలదు. కనుక సంవత్సరానికొక వందకోట్ల రూపాయల ప్రకారం ప్రభుత్వం ఒక ఫండును ఏర్పరచాలి. అమ్మకానికి వస్తున్న భూములను పదెకరాల కమతాలకు మించినప్పుడే - ముందుగా కొనుటకు ప్రభుత్వానికి హక్కు వసతి కలిగించాలి. ఆ భూములను ఉచితంగా, భూములు లేని పారం పర్యాయితిగా వ్యవసాయంపైనే ఆధారపడుచున్న కూలీలమధ్య పంపిణీ చేస్తూవుండాలి. వారు వాటిని తిరిగి అమ్ముటకు వీలుండరాదు. అలాగ క్రమంగా హెచ్చుతూవుండే సంఖ్య లుగా, స్వంత వుద్యోగులుగా ఈనాటి కాంగ్రెసు, జనతా ప్రభుత్వాల ప్రణాళిక కంటె, మేము సూచించు వ్యవసాయిక స్వంత కమతాల స్వంత ఉద్యోగాల ప్రణాళిక అభివృద్ధిదాయకమే, విప్లవాత్మకమేగదా? ఎన్ని విధాలుగా స్వంత ఉద్యోగ శక్తిని వ్యవసాయమందు పెంచినా, పండించబడె పంటలకు గిట్టుబాటు ధరలు సాధించక పోతే రైతాంగ రక్షణము సాధ్యము కాజాలదు. వ్యవసాయ పంటలను అనుభవించే వారు, గిట్టింపు ధరలను చెల్లించునట్లు ప్రభుత్వము ధార్మిక ధోరణిని అవలంబించాలి. ఇందుకే అర్ధశతాబ్దం నుండి మాబోంట్లము ఆందోళన చేస్తున్నాం. వ్యవసాయ కూలీలకు జీవనభృతి యెంతో, దానిపై ఆధారపడే యీ కనీసపు ధరలన్ను నిర్ణయించాలి. సంఘము క్రమంగా అందుకొనే అదనపు సౌభాగ్యము ననుసరించాలి.

కనీసపు కూలీధరలను పెంచుతూ వుండాలి. వ్యవసాయవృత్తి, మిగతా వృత్తులవలె గాక, అతివృష్టి, అనావృష్టి బాధలకు లోనగుచున్నది. కనుక, ఆ నష్టము నుండి వ్యవసాయకులకు భీమాచేసి రక్షించుకోవాలి. ఈనాటికీ ఈ ప్రయత్నము ప్రారంభమే కాలేదే?

వ్యవసాయ వృత్తిలో, ఫ్యాక్టరీలలో వలెనే, దెబ్బలూ, గాయాలు, అవిటితనం, ప్రాణాలు పోగొట్టుకోవడం, పూబిలో, కాలువలలో మునిగిపోవడం, పాములు, మంత్రగబ్బలు పంటల మందులవల్ల ప్రాణోపద్రవాలు, మరెన్నో విధాల నష్టాలు కలుగుచున్నవి. పరిశ్రమలలోని కూలీలకెలాగున భీమా చేస్తున్నామో, అటులే వ్యవసాయకులకు భీమా భద్రత సౌకర్యం కల్పించాలి. అందుకే శ్రీ రాజగోపాల నాయుడు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టుచున్నారు.

ఆ 1926 లోనే "కూలీ దుకాణాలు" అనే చిన్న పుస్తకాన్ని వ్రాసితి. ఈ మధ్య వచ్చిన వుపాధి సౌకర్యాల కార్యాలయాలు చదువుకున్న నిరుద్యోగులకే సహాయం చేస్తున్నవి. గొప్పగొప్ప పరిశ్రమల నిర్మాణమునకు, నిర్వహణకై వందలు, వేల కోట్ల మూలధనం, పెట్టుబడి, తక్కువ లేక సరిసమగు వడ్డీలపై దీర్ఘ వాయిదాలకు ప్రభుత్వము పరపతి అందిస్తున్నదే? అయితే సహకార సంస్థల ద్వారా, బ్యాంకులద్వారా, స్వయంగా కూడా, ప్రభుత్వం రైతాంగమునందలి అన్ని అంతరాలవారికి ప్రత్యేకంగా అధికంగా పది యెకరాలకు లోబడిన కమతాల వారికి, మరెంతో శ్రద్ధగా నూతనంగా స్వంత కమతాలు స్వయం వుద్యోగము బొందుచున్న బీద రైతులకు అప్పులుగా ఇచ్చి బలపరచవలెను. బ్యాంకులను జాతీయము చేసినప్పటినుండి ఈ విధానమునకు క్రొత్త ప్రాణం కల్గినది. ఇంకెంతోగా ఇకముందు ఈ సహాయం అందరికి అందుబాటులోనికి తెచ్చుకోవాలి.

వ్యవసాయ కూలీలు కోట్లకొలధిగా యికముందుగూడా వుండెదరు. వారికి వీలైనంతవరకు ఆయా ప్రదేశాలలో తగుపాటి వుద్యోగ ప్రాప్తి కల్గించాలి. కూలి లేనప్పుడు కనీస జీవనభృతి ఏర్పరచుట అవసరం. ఈ ధర్మాన్ని సూచించితి ఆ 1926 లో 26 సంవత్సరాల ప్లానింగు తరువాత కూడా దాన్ని సాధించలేకున్నామే! కొంతగానైనా ఈ భృతి నేర్పరచుట కొరక బిల్లును శ్రీ రాజగోపాల నాయుడు ప్రవేశపెట్టుచున్నారు. కూలీలలో ముసలివారి గతి ఏమిటో! తలుచుకుంచే

మన్నారు. అట్టి స్వంత వుద్యోగప్రాప్తి వ్యవసాయమందే అత్యధికంగా అంద గలదన్నారు. ఈ ప్రాథమిక ఆర్థిక, సాంఘిక, ధర్మములను పొందిక చేసుకుంటూ, వుండిన వారందరి వద్దనే ఆర్థిక స్వరాజ్యమును పొందదలచినవారు సాంఘిక విప్లవ ప్రధమ పారముల నేర్చుకొనవలెనంటూ వుండిరి. పాశ్చాత్యదేశాల సోషలిస్టు నాయకులు, వారే గిల్డు సోషలిస్టులు, వారి భావుకులు, రచయితలకు నాయకులు శ్రీ జి. డిం హెచ్. కోల్ ప్రభృతులు, వారి ధోరణిని కాదంటూ, ఎంతోదూరం, ఎన్నెన్నో దేశాలలో, ఆర్థిక స్వాతంత్ర్యముకొరకై వెదుకుచూవుండిన, కమ్యూనిస్టులలో ధైర్య సాహసాలు కల్గిన, యుగోస్లావియా, టిటో అనుచరులు, 1950 నుండి, స్వంత వుద్యోగ ధోరణిలో కష్టకారులే స్వయంగా తమ తమ వృత్తులలో వృత్తి వ్యాసంగముల సాగించుతూ, వివిధ పారిశ్రామిక వుత్పత్తులను పరిశ్రమలలో సాధించుటకు పూనుకొంటున్నారు. ఈ రహస్యమును మహాత్ములు 1920—30లోనే తెలిసికొనిరి. 1923నుండి మాదోంట్లము, రైతుకూలీ వుద్యమముల ద్వారా, ప్రజోద్యమాల ద్వారా రైతు జీవితమందు ప్రతిబింబించిన ప్రయత్నిస్తున్నాము. ఇట్టి స్వంత ఉద్యోగములు అన్ని పరిశ్రమలలో అందవు. వ్యవసాయమందు అధికంగా పొందవచ్చు. కాని జమీందారులు, జాగీరుదారులు, భూకమతాలపై రైతులకు నిమిత్తమగు యాజమాన్యము లేకుండా, శతాబ్దాల తరబడి లేకుండా చేస్తూవుండిరి. తమ భూములను ఎప్పుడు జమీందారులు లాగేస్తారో, వేలాంవేస్తారో, పట్టాలు లేకుండా చేస్తారో, పండించిన పంటలను తమకు దక్కనివ్వరో అనే భయం రైతులకు కలిగించేవారు.

ఆ భయం, బాధ, అస్థిమితమునుండి రైతుల రక్షించుటకై మాబోంట్లము రామానాయుడు, లక్ష్మీనారాయణ, మందేశ్వరశర్మ, ప్రభృతులం, జమీందారీ రైతు ఉద్యమము నడిపితిమి. ప్రధమంగా, 1930—36 లో ఆంధ్రలో క్రమంగా 1946—50 లో భారతదేశమంతటా స్వామి సహజానంద వగైరాల తోడ్పాటుతో స్వరాజ్యావతరణము పిమ్మట (1952 లోపల) అఖిలభారతమంతటా, తమతమ కమతలములపై రైతులకు సంపూర్ణ అధికారము, తమ పంటలు తమవేననే విశ్వాసము రైతులకు అందించుకోగల్గితిమి.

ఇంతలో ఆ రష్యా, చైనాలోవలె కమ్యూనిస్టు ధోరణిలో కమతాలనన్నిటిని

రద్దుచేసి, రైతాంగం హక్కులను లాగేసి, సహకార వ్యవసాయముగా, నమ్మడి ప్రభుత్వ వ్యవసాయముగా, భూములు సాగుచేస్తేనే, జాతీయాదాయం ఉవ్వెత్తున సత్వరంగా పెంచవచ్చనేవారి వెర్రిప్రణాళిక జవహరు పండితునకునూ ప్రారంభమాయెను; జాతీయ కాంగ్రెసుచే ఆ ప్రణాళికను, జవహరులాలు అంగీకరింపచేసిరి. అది స్వంతవృత్తికి స్వతంత్రప్రదాయమగు స్వయం వ్యవసాయమునకు, ఆత్మగౌరవప్రదంబై, అత్యధిక వుత్పత్తి సాధించుటకు సాధనమగు స్వంత వుద్యోగ ఆర్థిక సాంఘిక ధోరణికి చావుదెబ్బగొట్టుననే మా బోధలు, ప్రచారం, జవహరునకు నచ్చకపోయెను. అంతట ఆనాటి జమీందారీ పద్ధతిపై యెదిరింపుటకు చేసిన ప్రయత్నమునకు పదులరెట్లుగా ఆందోళనచేసి, మరెంతో రాజకీయ త్యాగములు చేసి జాతీయ పరిధిలో ఆ సహకార వ్యవసాయ ప్రణాళికను ఎదిరించితిమి. ప్రత్యేక రాజకీయ పార్టీనే స్థాపించితిమి. ఎన్నికల్లో పదేపదే వోటమిల బొందితిమి. తుదకు గెలిచితిమి. గెలుచుకొన్నది యేమిటి? చిన్నచిన్న భూఖండాలు, భూకమతాల ద్వారా హెచ్చు వ్యవసాయ ఉత్పత్తుల సాధించగలమంటిమి. స్వంత వుద్యోగులగు రైతులే దేశపు పంటల పెంచుటకు, భూసారమును, పంటల రక్షించుటకు ఆధారమని పల్కితిమి. స్వంత వ్యవసాయమే రైతులను నిర్మాణాత్మకమగు శక్తివంతమగు, అభివృద్ధిదాయకమగు జాతీయాదాయాన్ని వృద్ధిని ప్రోత్సహించునవి ఋజువు చేసితిమి. వివిధ పరిశ్రమలలో ఫ్యాక్టరీలను నిర్మించి పదులు వందలకోట్లు పెట్టుబడిని అందించి, ఎంతోకాలంపై నిర్మించుకొన్న పిమ్మట, పదులు, వేలు, మహా ఐతే లక్ష కార్మికులకు జీవనోపాధి సంపాదించుటే సాధ్యమగుచున్నదే? అదీ ఐనా ఆ కార్మికులకు స్వంత ఉద్యోగం కాదే? వారికి ఆర్థిక స్వాతంత్ర్యము అందునా? అదే వుద్యోగము పూడిగముకాదా? అట్టి ప్రయత్నము చేయనవసరం లేకనే, కోట్ల కొలదిగానున్న వ్యవసాయకులకు స్వంత వుద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యము, సాంఘిక స్వాస్థ్యము అందించుచున్న రైతాంగపు స్వంత కమతములు, స్వంత వుద్యోగము, ఆత్మగౌరవ ప్రదమగు స్వతంత్ర శ్రామికవీరుల బలాలను రక్షించుట నిర్మాణాత్మకమగు జాతీయ సేవగదా! అట్టి అభివృద్ధి దాయకమగు సేవాపథమును తిరిగి కాంగ్రెసు ఇందిరాజీద్వారా అంగీకరించునట్లు చేయగల్గుచున్నాము. ఈనాటికి శ్రీ చరణసింగు ద్వారా జనతావారుకూడా ఈ ధోరణిని ధర్మమార్గమును అవలంబించు అవకాశము కలుగుచున్నది. ఇంత సాధించుటలో పది సంవత్సరాల తరబడి శ్రీ రాజాజీ "మున్షి" బాయికాలే, బసంతసింగు, భారతీదేవి ప్రభృతుల సహాయం

అందుకొను భాగ్యము కలిగినది. ఐతే ఈ స్వంత కమతములు, స్వంత వుద్యోగ భాగ్యము తరతరాలుగా భూవసతి పొందుచుండిన కులాలు, వర్గాలకేనా? అనాదిగా; వ్యవసాయముపై ఆధారపడుచూ, భూస్థితి స్వామ్యమూ పొందజాలక, కూలిపైననే ఆధారపడుచూ వస్తున్న హరిజనులు, దళిత వర్గాలకూ కూడా భూస్థితి అవసరమే గదా? స్వంత వుద్యోగ భాగ్యము తరతరాలుగా భూవసతి పొందుచుండిన కులాలు, వర్గాలకేనా? అన్ని మాసాలకు గాకున్నా కొంతగానైనా అందచేయాలిగదా? ఈ కనీస ధర్మాన్ని సాధించుటకు అందరం పూనుకోవలదా? ఈ ధర్మనిర్వహణకు, ఇందిరాజీ 1972-77 మధ్య శక్తి వంతంగా పూనుకొన్నారు. లక్షలాది వ్యవసాయ కూలీలకు హరిజనులు, గిరిజనులు, దళిత వర్గాలకు భూకమతాలను, కొద్దికొద్ది పరిమితుల్లోనైనా, అదించ ప్రయత్నించిరి. ఆ ప్రయత్నములను బలపరచుటకు మేమంతా ముందుకొచ్చితిమి. ఇప్పుడీ, చరణసింగు బలగాలు కూడా మాకు తోడగుదురను ఆశ కలుగుచున్నది.

భూసంస్కరణల చట్టం ద్వారా, కొంతగా భూములు అందినవి. ఈ విధంగా పరిస్థితి చేయుటకు, అది చాలదు. కనుక సంవత్సరానికొక వందకోట్ల రూపాయల ప్రకారం ప్రభుత్వం ఒక ఫండును ఏర్పరచాలి. అమ్మకానికి వస్తున్న భూములను పదెకరాల కమతాలకు మించినప్పుడే - ముందుగా కొనుటకు ప్రభుత్వానికి హక్కు-వసతి కలిగించాలి. ఆ భూములను ఉచితంగా, భూములు లేని పారం పర్యాయితిగా వ్యవసాయంపైనే ఆధారపడుచున్న కూలీలమధ్య పంపిణీ చేస్తూవుండాలి. వారు వాటిని తిరిగి అమ్ముటకు వీలుండరాదు. అలాగ క్రమంగా హెచ్చుతూవుండే సంఖ్యలుగా, స్వంత వుద్యోగులుగా ఈనాటి కాంగ్రెసు, జనతా ప్రభుత్వాల ప్రణాళికంటె, మేము సూచించు వ్యవసాయిక స్వంత కమతాల స్వంత ఉద్యోగాల ప్రజాళిక అభివృద్ధిదాయకమే, విప్లవాత్మకమేగదా? ఎన్నివిధాలుగా స్వంత ఉద్యోగ శక్తిని వ్యవసాయమందు పెంచినా, పండించబడే పంటలకు గిట్టుబాటు ధరలు సాధించక పోతే రైతాంగ రక్షణము సాధ్యము కాజాలదు. వ్యవసాయ పంటలను అనుభవించే వారు, గిట్టింపు ధరలను చెల్లించునట్లు ప్రభుత్వము ధార్మిక ధోరణిని అవలంబించాలి. ఇందుకే అర్థశతాబ్దం నుండి మాబోంట్లము ఆందోళన చేస్తున్నాం. వ్యవసాయ కూలీలకు జీవనభృతి యెంతో, దానిపై ఆధారపడే యీ కనీసపు ధరలను నిర్ణయించాలి. సంఘము క్రమంగా అందుకొనే అదనపు సౌభాగ్యము ననుసరించాలి.

కనీసపు కూలీధరలను పెంచుతూ వుండాలి. వ్యవసాయవృత్తి, మిగతా వృత్తులవలె గాక, అతివృష్టి, అనావృష్టి బాధలకు లోనగుచున్నది. కనుక, ఆ నష్టము నుండి వ్యవసాయకులకు భీమాచేసి రక్షించుకోవాలి. ఈనాటికీ ఈ ప్రయత్నము ప్రారంభమే కాలేదే?

వ్యవసాయ వృత్తిలో, ఫ్యాక్టరీలలో వలెనే, దెబ్బలూ, గాయాలు, అవిటితనం, ప్రాణాలు పోగొట్టుకోవడం, వూబిలో, కాలువలలో మునిగిపోవడం, పాములు, మండ్రగబ్బలు పంటల మందులవల్ల ప్రాణోపద్రవాలు, మరెన్నో విధాల నష్టాలు కలుగుచున్నవి. పరిశ్రమలలోని కూలీలకెలాగున భీమా చేస్తున్నామో, అటులే వ్యవసాయకులకు భీమా భద్రత సౌకర్యం కల్పించాలి. అందుకే శ్రీ రాజగోపాల నాయుడు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టుచున్నారు.

ఆ 1926 లోనే "కూలీ దుకాణాలు" అనే చిన్న పుస్తకాన్ని వ్రాసితి. ఈ మధ్య వచ్చిన వుపాధి సౌకర్యాల కార్యాలయాలు చదువుకున్న నిరుద్యోగులకే సహాయం చేస్తున్నవి. గొప్పగొప్ప పరిశ్రమల నిర్మాణమునకు, నిర్వహణకై పందలు, వేల కోట్ల మూలధనం, పెట్టుబడి, తక్కువ లేక సరసమగు వడ్డీలపై దీర్ఘ వాయిదాలకు ప్రభుత్వము పరపతి అందిస్తున్నదే? అయితే సహకార సంస్థల ద్వారా, బ్యాంకులద్వారా, స్వయంగా కూడా, ప్రభుత్వం రైతాంగమునందలి అన్ని అంతరాలవారికి ప్రత్యేకంగా అధికంగా పది యెకరాలకు లోబడిన కమతాల వారికి, మరెంతో శ్రద్ధగా నూతనంగా స్వంత కమతాలు స్వయం వుద్యోగము బొందుచున్న బీద రైతులకు అప్పులుగా ఇచ్చి బలపరచవలెను. బ్యాంకులను జాతీయము చేసినప్పటినుండి ఈ విధానమునకు క్రొత్త ప్రాణం కల్గినది. ఇంకెంతో ఇకముందు ఈ సహాయం అందరికి అందుబాటులోనికి తెచ్చుకోవాలి.

వ్యవసాయ కూలీలు కోట్లకొలదిగా యికముందుగూడా వుండెదరు. వారికి వీలైనంతవరకు ఆయా ప్రదేశాలలో తగుపాటి వుద్యోగ ప్రాప్తి కల్గించాలి. కూలి లేనప్పుడు కనీస జీవనభృతి ఏర్పరచుట అవసరం. ఈ ధర్మాన్ని సూచించితి ఆ 1926 లో 26 సంవత్సరాల ప్లానింగు తరువాత కూడా దాన్ని సాధించలేకున్నామే! కొంతగానైనా ఈ భృతి నేర్పరచుట కొరకే బిల్లును శ్రీ రాజగోపాల నాయుడు ప్రవేశపెట్టుచున్నారు. కూలీలలో ముసలివారి గతి ఏమిటో! తలుచుకుంటే

దుఃఖము వస్తుంది. వారి బిడ్డలు తమ్ము తాము పోషించుకోగల్గుటే భారమై పోతుంది. అందుకే ఇప్పుడు మన శ్రీ రాజన్న ఈ సమస్య నివారణకు ఒక బిల్లును వ్రాస్తున్నాడు. ఇంగ్లండు, అమెరికా, యూరపు దేశాలలో ఈ ప్రాథమిక భీమాలన్నీ కూలీలకు సాధించిరారు. శ్రీ వెలేను బ్రిటిషువారి కార్మికులకు, వివిధ ఆరోగ్య భీమాను స్వీడనులో 1947 లోనే సాధించిరి. మన కూలీల కెప్పుడో. వ్యవసాయకులకో? మన డాక్టర్లు అమెరికా, ఇరాను, ఆఫ్రికాదేశాలకు వెళ్ళుచున్నారే? వారందరిని గ్రామాలలో నిల్పుకోవాలి వ్యవసాయకులకొరకు! ఒక్క వ్యవసాయం పెద్ద మాధ్యమిక, చిన్నపరిశ్రమలందే అందరు శ్రామికులకు తగినంత వుద్యోగము జీవనభృతి సాంఘిక కార్మిక భీమాలు, విశ్రాంతి చదువులు, సౌకుమార్యము సాధించగలమా? ఈలాగే జనాభా పెరుగుచుంటె! చైనీయుల నాయకులు మావో కూడా అంతటి కమ్యూనిస్టు నియంతృత్వములో కూడా సాధించలేననుకున్నారు. కనుక, కుటుంబ నియంత్రణ అవసరం. ఈ మాట 1926 లో పలుక ప్రారంభించినా! ఈ మధ్య ఇందిరమ్మ ప్రచారకులు దేశమంతటా ప్రచారం చేసిరి. ఆ కార్యక్రమపు తీవ్రత నెదిరిస్తూ మన పిచ్చిప్రజలు వారిని పదభ్రష్టులు చేసిరే? ఎన్నైనా సాధించండి. ఎంతగానైనా జీవిత సుఖముల సాధించబూనండి. వ్యక్తిస్వాతంత్ర్యములే లేకుంటే అంతా భస్మమే. ప్రభుత్వముపైననేగాక, పరిశ్రమలు, వ్యవసాయ వ్యవహారముల నిర్వహణలో స్వంత వృత్తి స్వంత ఉద్యోగము, స్వయంనిర్ణయ సౌకర్యములు సంఘ ధర్మముల ఆవరణలో అందనిది శ్రామికులు సంపూర్ణ మానవులు కాజాలరు. అందుకే మేము మహాత్ముని ధోరణిలో, సంపూర్ణ సాంఘిక విప్లవము మాత్రమేగాక, స్వయంనిర్ణయాధికారం శ్రామికులకు కోరుతున్నాం. అంత అభివృద్ధి యెన్నేళ్ళకోగాని అందదు. యుగోస్లావియా నెమ్మదిగా అటువైపు నడువ ప్రయత్నిస్తున్నది. రష్యా, చైనా వగైరాలు ఇంకా ఆ దారిని నడచుటకు సాహసం చేయండంలేదు.

అదృష్టవశాత్తు మనదేశంలో బహుళ వ్యవసాయిక గ్రామీణ వృత్తుల జనాలు అనాదిగా అందుతూ వస్తూవున్నా, ఈ వృత్తి వుద్యోగ ఆర్థిక స్వాతంత్ర్యమును కొంతగానైన అనుభవిస్తూ వున్నారు. ఆఫ్రికా దేశాల జానాలు ఇంకనూ కూలీల దుర్గతికి దిగిపోవడంలేదు. వీరి స్వతంత్ర అనుభవాలకు, ఆచారములు, ఆచరణలకు చెలియలకట్టలు కడుతూ ఇరవై శతాబ్దపు సైంటిఫిక్ పరిశ్రమలు,

నిర్మాణశక్తులను జోడింపు చేసుకోగలగాలి ఇట్టి అభివృద్ధికై యీ కంపూటర్సు శాటలైట్సు ~ గపు శక్తులను వుపయోగించుకోవాలి. ఇన్నీ చేకుంటివే! ఈ శ్రామిక జనాలకు చదువులో విజ్ఞానమో, ధార్మిక చింతనమో, కుటుంబ సంఘ దేశ ధర్మ నిర్వహణ తత్పరత శక్తియో! అవి వలదా? కావాలి. మువ్మాటికి? అన్నీ పొంద లేక, వాటిని విసర్జించుతూ కాలానుగతమగు నీతి నియమాలు అవసరం లేదను కుంటూ పాశ్చాత్యులు ఎందరో కూలిపోతున్నారు. అందుకే భారత రాచకీయం చాలదు. గాంధేయ నైతిక పంథా అవసరమనుకుంటున్నాము. ఏమైనా చెప్పండి, చేయండి. అన్నిటికి ఆధారము మానవ జీవితానికి వికాసము కల్గించగలది స్వంత వుద్యోగం. అది స్వంత కమతములోనా? ఆసు, బొంగు మగ్గముద్వారానా? కొమిలి, సుత్తే చేతనా? కుంచె, పటము పట్టుకుంటూనా? చేబాడిన చిత్రిక వల్లనా? స్వంత యింట్లో కూర్చున్నప్పుడా? ఫ్యాక్టరీలో పొరాడుతూనా? ఒంటరిగానా? పదుగురిలోనా? పవరు ప్లగ్గుల సాయంతోటా? ఆకాశాన్నందుకొంటున్న పరిశ్రమాలయాలద్వారానా? భూమిని పండించి, పుష్కలంపచేసి ధాన్యాగారాలు, ధనాగారాలు అందరికి అందు బాటులో వుంచుతూ ఎట్లు, ఎందరు యెంతగా శ్రమించి శ్రుతికల్పి ఆనందరాగము లను స్వతంత్రపు వాయువుల వీచికలలో వేళవింపచేయగల్గుదురో? ముందు తరాలవారికే యెరుక యగును? మా బోంట్ల మాత్రము అలా వస్తూవున్న, రానున్న, సాంఘిక, ఆర్థిక సుఖ సంతోషాలనూ సంపూర్ణ మానవత్వము బొందు పురుషోత్త మునీ ఉదయింపజేయగలుగు స్వంత వుద్యోగములు, స్వంత కమతములు, స్వంత వృత్తులు అనే పాదుకలను భద్రపరచుకోండి. మరువకండి.

ఆచార్య రంగా

# ఈనాటి అనుభవాలు-తీరని ఆశలు

స్వరాజ్యము పొందినప్పటినుండి, భారతదేశమందు అన్నితరగతుల ప్రజలలో అభివృద్ధిని సత్వరముగా సాధించుకోవాలనే కోరిక కలిగినది. అనుకున్నంతగా, ప్రయత్నించినంతగా పైకెదగలేకున్నారు. ఆశాభంగము హెచ్చుగనున్నది. మధ్యతరగతులవారు చాలావరకు, క్రొత్తగా కల్గిన అవకాశములను ఎక్కువగా వుపయోగించుకున్నారులెండి, అత్యధిక ధనవంతులు ఆంధ్రలో తక్కువ. ఐనా క్రొత్తపరిశ్రమల పెంపకంద్వారా, యాభై కుటుంబాల గుబురులు అతి పైకి వెళ్ళగల్గినారు. వ్యవసాయ కూలీలకు అధిక ఆదాయం అంతగా లేదు. మాగాణీ ప్రాంతాలలో పరిశ్రమలు, పట్టణాలు పెరుగుచున్న పరిసరాలలో వారికి మాత్రము దిన కూలి రు 2 నుండి రు 6 కు పెరిగింది. స్త్రీలకు కూలిరేటు పెరగడం, హెచ్చు రోజులు పనిగల్గడం సాధ్యమగుచున్నది. కాపి, మట్టిపని, ఇండ్ల కట్టడాల పని, రాతిపని చేసేవారు ఇప్పటికీ స్వంత యిండ్లు లేక, నిలవసొత్తు లేక దీనావస్థలోనే వుంటున్నారు. స్వయంవృత్తిని తరతరాలనుండి కల్గి అందువల్ల అందుచున్న ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్న రైతాంగం, తదితర వృత్తులవారితో సమాన ప్రతిపత్తిపై పాటుపడాలి. కూలీ తరపు సాంఘిక అస్వాతంత్రత, ఆర్థిక బలహీనత నుండి బయటపడాలనుకొంటున్న వ్యవసాయ కూలీలు తమలో కొందరికైనా భూకమతాలు, ఎంత చిన్నవైనా, కొంతగానైనా సంపాదించుకోవాలని ఆందోళన చేస్తూవుండాలి. అందినంతవరకు వాటిని రక్షించుకోవాలి. తరతరాలుగా నిల్పుకోవాలి. తమ కమతాలలో సంపాదితమగు స్వంత వుద్యోగము చాలక, మిగతా సమయాలలో కూలిచేసుకోవలసినప్పుడు, తగినంత సౌకర్యాలు, ధర్మమైన కూలి రేట్లు అందునట్లు శ్రద్ధ చేయాలి. కూలీలుగా గౌరవపాత్రమగు పనిపాటులు, జీవిత సౌకర్యములు, ఆర్థిక వసతులు, రక్షణలు, భీమాలు అందించాలని, ప్రభుత్వంపై, రైతులపై, సంఘముపై వత్తిడి తెస్తూనే వుండాలి. స్వయంవృత్తిద్వారా అనుదిన జీవితాదాయము. సాంఘిక ప్రతిపత్తి పొందగల్గుట గాంధేయ సోషలిజంయొక్క ప్రధాన ధ్యేయము. ఈ ధర్మ సూత్రాన్ని ప్రచారం చేయడం మాబోంట్ల ప్రజాహితైక్త జీవితమందు దివ్యజ్యోతి, ఆశాజ్యోతి అభివృద్ధి పథము. భూములులేని వ్యవసాయ కూలీలకు కూడా స్వయంవృత్తి వ్యవసాయంలో పొందుటకు అవ

కాశం కల్గించ లేనవి, 1936 లోనే ఆనాటికి మిగిలివున్న, సాగుకు లాయక్కీ అయిన, సాగుచేయబడకుండిన ప్రభుత్వ భూములన్నీ, భూములు లేని వ్యవసాయ కూలీలకు, దళిత వర్గాలకు రిజర్వు చేయాలని ఆందోళన చేస్తూ వున్నాము. ఆపైన యీ పార్లమెంటులో యీ సంవత్సరమే మరో పర్యాయం చెప్పినాను. ప్రతి సంవత్సరం అరవై కోట్ల రూపాయలు ఒక నిధిలో వుంచి, పది ఎకరాలకు మించినవారి నుండి, వారు అమ్మదలచినప్పుడల్లా వారి భూములు ప్రభుత్వాలు కొంటూ వుండాలి. ఈ భూములను ఆయా ప్రదేశాల పేదల మధ్య వంతులవారీగా, వుచితంగా, నష్టపరిహారంగాని, ధరగాని తీసుకోకుండా పంచిపెట్టాలంటున్నా! ఈ విధంగా ప్రతి గ్రామంలో, వ్యవసాయ కూలీలలో కొందరికైనా, వ్యవసాయిక స్వయంవృత్తి అందజేయవచ్చును. వారికి పరపతిని, ఎరువులను, పరికరాలను చౌకగా అందించాలి. భూములను అమ్ముకొనరాదని నిర్ణయించాలి. ఇదే అభివృద్ధిదాయకమైన భూస్వామ్య స్వయం వృత్తి విప్లవ మార్గము. కమ్యూనిస్టులకు ఇది ఇష్టం లేదు. క్రమంగా సీలింగు పరిమితి 5 యకరాల వరకు తగ్గించిన, 5 యకరాల కమతాలు లాభసాటిగాదని ఆ పిమ్మట ఆందోళన చేసి, అన్ని కమతాలు రద్దు చేయాలని దుమారంలేపి ఎవ్వరికి ఏటి భూవసతి లేకుండా చేయాలని వారి కుట్ర. అందుకే ఆనాడు సహకార వ్యవసాయమనే మంత్రం నెహ్రూచేత పాడించినారు. దాన్ని యెదిరించి రద్దు చేయించుటకే నేను, రాజాజీ కలసి అంత ఆందోళన చేయవలసివచ్చినది. ఇప్పటికీ సీలింగు నాటకం చాలదు వారికి. దళిత వర్గాలవారిని, హరిజన, గిరిజనులను అభివృద్ధి పరచుకోవాలంటే, భూకమతాలపై సీలింగు పెట్టడం అత్యంత ప్రధానమైనదిగా కమ్యూనిస్టులు ప్రచారం చేయడం, అభివృద్ధికాముకులనేవారాదోరణిని గొప్ప విప్లవాత్మకమనుకోవడం జరిగినది గదా! అటు రష్యా - చైనా మిత్రులు ఇటు స్కాండినేవియా-అమెరికా చదువుల వారూ, అదే మంత్రమనుకోవడం జరుగుచున్నది. సీలింగు పెట్టుకోవడం మంచిదే, అవసరమే అని మాబోంట్లం ఎప్పటినుండో చెప్పుతున్నాము. ఐతే ఆ సూత్రం, ఆ గండ్రగొడ్డలి రైతు కొక్కరిపైననే ప్రహరించడం! మేమూ కావన్నామా, బస్తీలలోని ఆస్తులపై, వివిధరకాల వుద్యోగములు చేస్తున్నవారి నెలసరి జీతాలపై కూడా సీలింగులు అవసరమన్నాం. అందుకు జవహరులాలు అంగీకరించలేదు. ఆయన అధర్మపు, అసమానత్వపు చర్యల్ని ఎదిరించి తిరగబడితిమి. తుదకు, గ్రామాలలోని భూపతి పైననేగాక, బస్తీలలోని ఇంటి స్థలాలపై

దుఃఖము వస్తుంది. వారి బిడ్డలు తమ్మి తాను పోషించుకోగల్గుటే భారమై పోతుంది. అందుకే ఇప్పుడు మన శ్రీ రాజన్న ఈ సమస్య నివారణకు ఒక బిల్లును వ్రాస్తున్నాడు. ఇంగ్లండు, అమెరికా, యూరపు దేశాలలో ఈ ప్రాథమిక భీమాలన్నీ కూలీలకు సాధించినారు. శ్రీ వెలీను బ్రిటిషువారి కార్మికులకు, వివిధ ఆరోగ్య భీమాను స్వీడనులో 1947 లోనే సాధించిరి. మన కూలీల వృదో! వ్యవసాయకులకో? మన డాక్టర్లు అమెరికా, ఇరాను, అరబు దేశాలకు వెళ్ళుచున్నారే? వారందరిని గ్రామాలలో నిల్పుకోవాలి వ్యవసాయకులకొరకు! ఒక్క వ్యవసాయం పెద్ద మాధ్యమిక, చిన్నపరిశ్రమలందే అందరు శ్రామికులకు తగినంత వుద్యోగము జీవనభృతి సాంఘిక కార్మిక భీమాలు, విశ్రాంతి చదువులు, సౌకుమార్యము సాధించగలమా? ఈలాగే జనాభా పెరుగుచుంటె! చైనీయుల నాయకులు మావో కూడా అంతటి కమ్యూనిస్టు నియంతృత్వములో కూడా సాధించలేననుకున్నారు. కనుక, కుటుంబ నియంత్రణ అవసరం. ఈ మాట 1926 లో పలుక ప్రారంభించినా! ఈ మధ్య ఇందిరమ్మ ప్రచారకులు దేశమంతటా ప్రచారం చేసిరి. ఆ కార్యక్రమపు తీవ్రత నెదిరిస్తూ మన పిచ్చిప్రజలు వారిని పదభ్రష్టులు చేసిరే? ఎన్నైనా సాధించండి. ఎంతగానైనా జీవిత సుఖముల సాధించబూనండి. వ్యక్తిస్వాతంత్ర్యములే లేకుంటే అంతా భస్మమే. ప్రభుత్వముపైననేగాక, పరిశ్రమలు, వ్యవసాయ వ్యవహారముల నిర్వహణలో స్వంత వృత్తి స్వంత ఉద్యోగము, స్వయంనిర్ణయ సౌకర్యములు సంఘ ధర్మముల ఆవరణలో అందనిది శ్రామికులు సంపూర్ణ మానవులు కాజాలరు. అందుకే మేము మహాత్ముని ధోరణిలో, సంపూర్ణ సాంఘిక విప్లవము మాత్రమేగాక, స్వయంనిర్ణయాధికారం శ్రామికులకు కోరుతున్నాం. అంత అభివృద్ధి యెన్నేళ్ళకోగాని అందదు. యుగోస్లావియా నెమ్మదిగా అటువైపు నడువ ప్రయత్నిస్తున్నది. రష్యా, చైనా వగైరాలు ఇంకా ఆ దారిని నడచుటకు సాహసం చేయండంలేదు.

అదృష్టవశాత్తు మనదేశంలో బహుళ వ్యవసాయిక గ్రామీణ వృత్తుల జనాలు అనాదిగా అందుతూ వస్తూవున్నా, ఈ వృత్తి వుద్యోగ ఆర్థిక స్వాతంత్ర్యమును కొంతగానైన అనుభవిస్తూ వున్నారు. ఆఫ్రికా దేశాల జానాలు ఇంకనూ కూలీల దుర్గతికి దిగిపోవడంలేదు. వీరి స్వతంత్ర అనుభవాలకు, ఆచారములు, ఆచరణలకు చెరియలకట్టలు కడుతూ ఇరవై శతాబ్దపు సైంటిఫిక్ పరిశ్రమలు,

నిర్మాణశక్తులను జోడింపు చేసుకోగలగాలి ఇట్టి అభివృద్ధికై యీ కంప్యూటర్సు శాటలైట్సు—గపు శక్తులను వుపయోగించుకోవాలి. ఇన్నీ చేకుంటినే! ఈ గ్రామిక జనాలకు చదువులో విజ్ఞానమో, ధార్మిక చింతనమో, కుటుంబ సంఘ దేశ ధర్మ నిర్వహణ తత్పరత శక్తియో! అవి వలదా? కావాలి. ముమ్మాటికి? అన్నీ పొంద లేక, వాటిని విసర్జించుతూ కాలానుగతమగు నీతి నియమాలు అవసరం లేదను కుంటూ పాశ్చాత్యులు ఎందరో కూలిపోతున్నారు. అందుకే భారత రాచకీయం చాలదు. గాంధేయ నైతిక పంథా అవసరమనుకుంటున్నాము. ఏమైనా చెప్పండి, చేయండి. అన్నిటికి ఆధారము మానవ జీవితానికి వికాసము కల్గించగలది స్వంత వుద్యోగం. అది స్వంత కమతములోనా? ఆసు, బొంగు మగ్గముద్వారానా? కామిలి, సుత్తే చేతనా? కుంచె, పటము పట్టుకుంటూనా? చేబాడిస చిత్రిక వల్లనా? స్వంత యింట్లో కూర్చున్నప్పట్లా? ఫ్యాక్టరీలో పొర్లాడుతూనా? ఒంటరిగానా? పదుగురిలోనా? పవరు ప్లగ్గుల సాయంతోటా? ఆకాశాన్నందుకొంటున్న పరిశ్రమాలయాలద్వారానా? భూమిని పండించి, పుష్కలంపచేసి ధాన్యాగారాలు, ధనాగారాలు అందరికి అందు బాటులో వుంచుతూ ఎట్లు, ఎందరు యెంతగా శ్రమించి శ్రుతికల్పి ఆనందరాగము లను స్వతంత్రపు వాయువుల వీచికలలో వేళవింపచేయగల్గుదురో? ముందు తరాలవారికే యెరుక యగును? మా బోంట్ల మాత్రము అలా వస్తూవున్న, రానున్న, సాంఘిక, ఆర్థిక సుఖ సంతోషాలనూ సంపూర్ణ మానవత్వము బొందు పురుషోత్త మునీ ఉదయింపజేయగలుగు స్వంత వుద్యోగములు, స్వంత కమతములు, స్వంత వృత్తులు అనే పాదుకలను భద్రపరచుకోండి. మరువకండి.

ఆచార్య రంగా

# ఈనాటి అనుభవాలు-తీరని ఆశలు

స్వరాజ్యము పొందినప్పటినుండి, భారతదేశమందు అన్నితరగతుల ప్రజలలో అభివృద్ధిని సత్వరముగా సాధించుకోవాలనే కోరిక కలిగినది. అనుకున్నంతగా, ప్రయత్నించినంతగా పైకి ఎదగలేకున్నారు. ఆశాభంగము హెచ్చగుచున్నది. మధ్యతరగతులవారు చాలావరకు, క్రొత్తగా కల్గిన అవకాశములను ఎక్కువగా వుపయోగించుకున్నారులెండి, అత్యధిక ధనవంతులు ఆంధ్రలో తక్కువ. ఐనా క్రొత్తపరిశ్రమల పెంపకంద్వారా, యాభై కుటుంబాల గుబురులు అతి పైకి వెళ్ళగల్గినారు. వ్యవసాయ కూలీలకు అధిక ఆదాయం అంతగా లేదు. మాగాణి ప్రాంతాలలో పరిశ్రమలు, పటణాలు పెరుగుచున్న పరిసరాలలో వారికి మాత్రము దిన కూలి రు 2 నుండి రు 6 కు పెరిగింది. స్త్రీలకు కూలిరేటు పెరగడం, హెచ్చు రోజులు పనిగల్గడం సాధ్యమగుచున్నది. కాని, మట్టిపని, ఇండ్ల కట్టడాల పని, రాతిపని చేసేవారు ఇప్పటికీ స్వంత యిండ్లు లేక, నిలవసొత్తు లేక దీనావస్థలోనే వుంటున్నారు. స్వయంవృత్తిని తరతరాలనుండి కల్గి అందువల్ల అందుచున్న ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్న రైతాంగం, తదితర వృత్తులవారితో సమాన ప్రతిపత్తిపై పాటుపడాలి. కూలీ తరపు సాంఘిక అస్వతంత్రత, అర్థిక బలహీనత నుండి బయటపడాలనుకొంటున్న వ్యవసాయ కూలీలు తమలో కొందరికైనా భూకమతాలు, ఎంత చిన్నవైనా, కొంతగానైనా సంపాదించుకోవాలని ఆందోళన చేస్తూవుండాలి. అందినంతవరకు వాటిని రక్షించుకోవాలి. తరతరాలుగా నిల్పుకోవాలి. తమ కమతాలలో సంపాదితమగు స్వంత వుద్యోగము చాలక, మిగతా సమయాలలో కూలిచేసుకోవలసినప్పుడు, తగినంత సౌకర్యాలు, ధర్మమైన కూలి రేట్లు అందునట్లు శ్రద్ధ చేయాలి. కూలీలుగా గౌరవపాత్రమగు పనిపాటులు, జీవిత సౌకర్యములు, అర్థిక వసతులు, రక్షణలు, భీమాలు అందించాలని, ప్రభుత్వంపై, రైతులపై, సంఘముపై వత్తిడి తెస్తూనే వుండాలి. స్వయంవృత్తిద్వారా అనుదిన జీవితాదాయము. సాంఘిక ప్రతిపత్తి పొందగల్గుట గాంధేయ సోషలిజంయొక్క ప్రధాన ధ్యేయము. ఈ ధర్మ సూత్రాన్ని ప్రచారం చేయడం మాబోంట్ల ప్రజాహితైక్త జీవితమందు దివ్యజ్యోతి, ఆశాజ్యోతి అభివృద్ధి పథము. భూములులేని వ్యవసాయ కూలీలకు కూడా స్వయంవృత్తి వ్యవసాయంలో పొందుటకు అవ

కాలం కల్పించలేనవి, 1936 లోనే ఆనాటికి మిగిలివున్న, సాగుకు లాయకీ అయిన, సాగుచేయబడకుండిన ప్రభుత్వ భూములన్నీ, భూములు లేని వ్యవసాయ కూలీలకు; దళిత వర్గాలకు రిజర్వు చేయాలని ఆందోళన చేస్తూ వున్నాము. ఆపైన యీ పార్లమెంటులో యీ సంవత్సరమే మరో పర్యాయం చెప్పినాను. ప్రతి సంవత్సరం అరవై కోట్ల రూపాయలు ఒక నిధిలో వుంచి, పది ఎకరాలకు మించినవారి నుండి, వారు అమ్మదలచినప్పుడల్లా వారి భూములు ప్రభుత్వాలు కొంటూ వుండాలి. ఈ భూములను ఆయా ప్రదేశాల బీదల మధ్య వంతులవారీగా, వుచితంగా, నష్టపరిహారంగాని, ధరగాని తీసుకోకుండా పంచిపెట్టాలంటున్నా! ఈ విధంగా ప్రతి గ్రామంలో, వ్యవసాయ కూలీలలో కొందరికైనా, వ్యవసాయిక స్వయంవృత్తి అందజేయవచ్చును. వారికి పరపతిని, ఎరువులను, పరికరాలను చౌకగా అందించాలి. భూములను అమ్ముకొనరాదని నిర్ణయించాలి. ఇదే అభివృద్ధిదాయకమైన భూస్వామ్య స్వయం వృత్తి విప్లవ మార్గము. కమ్యూనిస్టులకు ఇది ఇష్టం లేదు. క్రమంగా సీలింగు పరిమితి 5 యకరాల వరకు తగ్గించిన, 5 యకరాల కమతాలు లాభసాటిగాదని ఆ పిమ్మట ఆందోళన చేసి, అన్ని కమతాలు రద్దు చేయాలని దుమారంలేపి ఎవ్వరికి ఏమీ భూవసతి లేకుండా చేయాలని వారి కుట్ర. అందుకే ఆనాడు సహకార వ్యవసాయ మనే మంత్రం నెహ్రూచేత పాడించినారు. దాన్ని యెదిరించి రద్దు చేయించుటకే నేను, రాజాజీ కలసి అంత ఆందోళన చేయవలసివచ్చినది. ఇప్పుడీ సీలింగు నాటకం చాలదు వారికి. దళిత వర్గాలవారిని, హరిజన, గిరిజనులను అభివృద్ధి పరచుకోవాలంటే, భూకమతాలపై సీలింగు పెట్టడం అత్యంత ప్రధానమైనదిగా కమ్యూనిస్టులు ప్రచారం చేయడం, అభివృద్ధికాముకులనేవారాదోరణిని గొప్ప విప్లవాత్మకమనుకోవడం జరిగినది గదా! అటు రష్యా - చైనా మిత్రులు ఇటు స్కాండినేవియా-అమెరికా చదువుల వారూ, అదే మంత్రమనుకోవడం జరుగుచున్నది. సీలింగు పెట్టుకోవడం మంచిదే, అవసరమే అని మాబోంట్లం ఎప్పటినుండో చెప్పుతున్నాము. ఐతే ఆ సూత్రం, ఆ గండ్రగొడ్డలి రైతులోక్కరిపైననేనా ప్రహరించడం! మేమూ కాదన్నామా, బస్తీలలోని ఆస్తులపై, వివిధరకాల వుద్యోగములు చేస్తున్నవారి వెలసరి జీతాలపై కూడా సీలింగులు అవసరమన్నాం. అందుకు జవహరులాలు అంగీకరించలేదు. ఆయన అధర్మపు, అసమానత్వపు చర్యల్ని ఎదిరించి తిరగబడితిమి. తుదకు, గ్రామాలలోని భూవసతి పైననేగాక, బస్తీలలోని ఇంటి స్థలాలపై

కూడ ఇందిరాజీ సీలింగు వేస్తానంటే అంగీకరించితిమి.

సీలింగువేస్తే ఎన్నో లక్షలాది ఎకరాల మిగులును అది అంతా వంచుతా మని ప్రచారం చేసినారు. తమ బూటకపు మాటలు వెలితైపోయేసరికి, భూములను దాచుకున్నారనే దుర్మార్గపు నిందలు వేస్తున్నారు. అసలీ సీలింగు వేయటంద్వారా ఇకముందు ధనంగలవారు, గొప్పగొప్ప కమతాలుగా భూములను కొనుక్కోవడానికి వీలులేకుండా చేయడమే పరమావధి. వారి వత్తిడిపోతే భూముల ధరలు తగ్గును కూడా. చదువుల బొందగోరేవారికి వివిధ సంస్థలు విరివిగా అందుబాటులో పెరిగి నవి. కనుక వేలకొలదిగా గ్రామీణ యువజనులుకూడా గొప్ప పరీక్షంలో ప్యాసగు చున్నారు. తర్ఫీదు పొందుచున్నవారిలో సగంవరకు ఉద్యోగాల్లో చేరగల్గుచు న్నారు. వుద్యోగాల సంఖ్య విపరీతంగా హెచ్చుగుచున్నది. జీతాలు, భత్యాలు తదితర సౌకర్యాలు వారికి హెచ్చు పెరుగుచున్నవి. కనుక జమీందారీలు, ఈనాంలు, సీలింగు పరిధులను మించిన భూస్థితులు తగ్గిపోతున్నా, అంతకు మరెన్నోరెట్లుగా ప్రభుత్వపు, వ్యాపారపు వుద్యోగాలలో వుండగల్గువారి సంఖ్య లక్షలకు మించుచున్నది. వారికే ఈనాటి క్రొత్త జాగీరు సౌకర్యాలందుచున్నవి. వ్యవసాయ కూలీలు, గ్రామీణ వృత్తులవారి బిడ్డలకు ప్రత్యేక రిజర్వేషన్‌లు, చదువులు, సీట్లు. ఉద్యోగాల వంపిణీల్లో ఇవ్వబడుచున్న ఈ క్రొత్త జాగీర్లు ఒరవడిలో, వారింకా జనాభా ననుసరించి వారి దీనావస్థబట్టియైనా చూస్తే, అందవల సిన స్థాయిలో వదోవంతుకైనా పైకి ఎదుగటలేదు. ఇది గొప్పదౌర్భాగ్యముగాదా!

కనీసపు జీవన భృతి అందించుటకై ఎంతెంత దైనందిన ఆదాయము, సాంవత్సరిక ఆదాయం అవసరమో గుర్తించవద్దా? అలాంటి ఆదాయం ప్రజలలో అశాంతంగా వున్న రైతాంగమునకు, ప్రత్యేకంగా వారిలో దిగజారి వున్న కూలీ లకు అందించుటకై తగిన రక్షణలు కావాలిగదా! ఆ లెక్కలపై ఆధారపరచి మే వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కనీసపు ధరలను నిర్ణయించాలంటూ 1930 నుండి భారత రైతాంగం తరపున మాబోంట్లము కోరుచున్నాము. ఈనాటికీ శాసన సభల్లో, పార్లమెంటులో వున్న సభ్యులలో అధిక సంఖ్యాకులు రైతాంగంనులడి వస్తూనే, రైతాంగపు ఓట్లపై ఎన్నుకోబడుతూనే, ఈ కనీసపు రక్షణకై శ్రద్ధ చేయలేకున్నారే, ఏల? రాకరాక అందిన స్వరాజ్యపు రాచకీయ అధికారంలో భాగస్వాములు కావాలనే

ఆతురత, ఆవేశం, దప్పిక మితిమించి ఎందరినో స్వధర్మచ్యుతులను చేస్తున్నదని పిస్తున్నది.

ఇతర దేశాల నుండి తెచ్చుకుంటున్న ధాన్యాలకు, ప్రత్తికి రెండు మూడింతల ధరలు చెల్లిస్తున్నారు. కాని మనదేశపు రైతాంగమునకు రోజుకు రెండు భోజనాలకు తగిన ధరలు చెల్లింపుకు స్వరాజ్యపు మంత్రులు, శాసనసభ్యులు తయారుగా లేరే? రైతులు తమ రక్షణకైనా గట్టిగా కృషిచేయలేకున్నారు. ఇక తమపై ఆధారపడు చున్న కూలీలనెట్లు రక్షించగలరు? కనుక, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిర్ణయిస్తూ, వాటి ననుసరించి నిర్ణయింపబడే కూలి, భత్యములు, ఖచ్చితంగా కూలీలకు అందునట్లు ప్రత్యేక శ్రద్ధ, కూలీల చెల్లింపు చట్టము అమలు పరచడంలో శ్రద్ధ చేయవలసిన బాధ్యత ప్రభుత్వము శిరసావహించాలి. వ్యవసాయ కూలీలందరి ప్రత్యేకంగా కూలీలకు కనీసము వరుమానం అందచేయుటకు, రైతులు, సహకారంతో సంఘము బాధ్యత వహించాలి.

ఐతే వుద్యోగం లంచగొండితనం, నిరంకుశత్వంనుండి అటు రైతులు, ఇటు కూలీలను తిరిగి రక్షించాలిగదా? అందుకే ప్రతి పంచాయితీలో రైతుకూలీ సామరస్య సహకార సంఘమును స్థాపించుకోవాలి. ఆ సంఘము యాజమాన్యం క్రిందే కూలీ చెల్లింపులు, వ్యవసాయ ఉత్పత్తుల ధరల చెల్లింపులు, తూకాలు, కొనుగోలులు, అమ్మకాలు జరుగునట్లు శ్రద్ధ చేయాలి. రైతుల ధాన్యాలను నిల్వ చేయుటకు మార్కెట్లవద్ద సహకార గిడ్డంగులు నిర్మించాలి. ఎన్ని ఎంతగా జరపాలను కున్నా, ఎంతెంతగా ప్రభుత్వం ప్రజల సేవించాలనుకున్నా ప్రజల సంపూర్ణ సహ కారం లేనిదే సాధ్యము కాదు. కనుకనే ఎలిమెంటరీ స్కూళ్ళనుండి కాలేజీల వరకు, పంచాయితీలనుండి సహకార సంఘాల వరకు ప్రజలెట్లా ఐక్యంగా సంఘ సేవ చేయుటకు ప్రజా సామూహిక కార్యములందు పాల్గొనుటకు ముందుకు రావాలో అనంతరం బోధచేస్తూవుండాలి. అలా ముందడుగు వేస్తున్నవారికే సాంఘిక గౌరవ మర్యాదలు, అన్ని సంస్థలలో, సభలలో, ప్రభుత్వాలలో కలుగునట్లు పెద్దలు శ్రద్ధ చేస్తూ వుండాలి.

# సహకార సంస్థలు - రైతాంగ అవసరాలు

పంచాయితీలు, సహకార సంస్థలు ఈనాడు పార్టీలకు, కక్షలకు, లోబడి వున్నాయి. గుజరాతులో తక్కువ, మహారాష్ట్రలో కొంచెం నయ్యం, పంజాబు, ఆంధ్రలో ఈ సంస్థలలో లంచగొండితనం, మురా దౌర్జన్యాలు, పాక్షిక పెత్తనాలే పరిపాటి అయిపోతున్నవి. వీటిని ఎలా మరమ్మత్తు చేయడం? రాజకీయ పెత్తనాల నుండి వీటిని విడిపించవలెనా? ఎటుల? మెజారిటీ పెత్తన పద్ధతి వదలివేయాలి! అందరు సభ్యుల సమ్మతి ననుసరించి తీర్మానములు చేసుకోవడం, వివాదగ్రస్తమగు విషయ నిర్ణయాలు వాయిదా వేసుకోవడం, ప్రెసిడెంటు, కార్యదర్శి పదవులు, వారివారి సీనియారిటీద్వారా వరుసలు మార్చుకోవడం, వెనుకబడినవారు, హరిజనులకు మూడోవంతు ప్రాతినిధ్యం యివ్వడం మంచిదేమో? వీటి ఎన్నికలలో కక్ష, విభేదాలు తీర్చుటకు ప్రత్యేక కమిషను లుండాలి. ప్రభుత్వపు జోక్యము తగ్గించుకోవాలి. అందరికీ, అంతా న్యాయంగా, దాదాపు సమానంగా పంచిపెట్టాలనుకున్నా, ఎన్ని ఏర్పాట్లు అసమానత్వాన్ని తగ్గించుటకు చేస్తున్నా పంచడానికి తగినంత భూమి, తదితర ఆస్తులు, ఆదాయాలు వుంటేగదా, అందరికి సాధారణ జీవితావసరాలు విందుగా, హెచ్చెచ్చుగా అందించగలిగేది? కనుకనే పంచుటకు అందే అన్న వస్త్రాలు, స్వయంవృత్తి, ఉద్యోగ సౌకర్యాలు హెచ్చించుకుంటూ వుండాలి. అందుకే మహాత్ముడు చెప్పుతూ వుండినట్లు అందరం శ్రమించుటకు కాలు, చేతులతో ఉత్పత్తి, తదితర సేవా కార్యాలు చేయుచుండుటకు తయారు కావాలి. తర్ఫీదు పొందాలి. పోటీపడుతూ, శ్రమజీవనమందు నడవాలి. ఇప్పటివలె స్త్రీలను ఘోషాలలో వుంచటం, కాయకష్టం చేయడం అగౌరవమనుకోవడం, ఎన్నెన్నో సాధారణ సేవాకార్యాలకు సేవకులమీద ఆధారపడడం మానుకోవాలి! ఈ ధోరణినే అనుదిన జీవన ధోరణిగా అందరూ అంగీకరించుకొనునట్లు చదువులు సాగించుకోవాలి.

ఈ దారిలో పంజాబువారిదే ముందడుగు, ఆంధ్రులది వెనకడుగు! ఇది మారాలి, మార్చుకో ... కుంటిమా, సహకార

A.C. No. 81696

సంఘాలను, పంచాయితీలను అభివృద్ధి మార్గాన నడుపుకున్నామా, మన గ్రామీణుల స్వచ్ఛంద శ్రమదానంద్వారా మన గ్రామాలలోని వెనుక బడిన వారికి, హరిజనులకు, ఇండ్లు నిర్మించగలం, సరస్సులను, కాల్వ లను, బావులను, స్కూళ్ళను, ఆటస్థలాలను వనాలను మరామత్తులు చేయ గలం. ప్రజలందరికి సామూహిక ఆస్తులు, అవకాశాలు త్వరితగతిని పెంచుకో గలం. ఆంధ్రులు అభివృద్ధి మార్గాన గాంధేయ సమాజ నిర్మాణ కార్యక్రమము లందు ముందడుగు వేస్తారా? వేయాలి లేకుంటే అభివృద్ధి అందజాలదు. ఎన్నై వున్నా, అన్ని వృత్తులవారిలోనూ, అట్టడుగున వుంటూ అందరితో సహకరిస్తూ వున్న కూలీలు, వారిలో హెచ్చుగావున్న హరిజనులు, గిరిజనులు, వెనుకబడి పోతిమనుకొంటున్న వివిధ వృత్తులవారు, కనీసపు జీతభత్యాలు పొందగల్గుచుండాలి. తిండి, గుడ్డ, యిల్లు, పండుగ పబ్బాలకు వసతులు, ముసలితనాన రక్షణ, ఆరోగ్యం పొందగల్గుటకు మందులు, పోషణ: జీవిత భీమాలు వారికి అవసరంగదా? అట్టి రక్షణ ఇంతవరకు భారతదేశంలో ఎచ్చట అందడం లేదు. వారికి నిరుద్యోగబాధ అప్పుడప్పుడు వారికేగాక, చిన్నకమతాలు గల్గిన స్వంత వ్యవసాయకులకు, స్వయం వృత్తులవారగు చేనేత, వడ్రంగి, కమ్మర, కుమ్మరవారికి కల్గుచునే ఉంటుంది. వారందరికి నిరుద్యోగ భీమా, భృతిని, అందించు గాంధేయ సాంఘికరక్షణలు ఎప్పుడు అందించుకోగలమో! మెల్లవారీగానైనా సాధించవద్దా! ఆంధ్రులు ఈ దారిలో పయనించుటకు ప్రాథమిక ప్రయత్నమైనా చేయవద్దా! ఎప్పుడో! 1923 లో ఇది కావాలనుకున్నామే! ఇంకెంత కాలం వరకు వేచివుందాము? అంత దూరమెందుకు? వరి, గోధుమ, జొన్నలు, పత్తి, చెఱకు, వేరుశనగ పుగాకు తోట పైరులు, కందులు, పెసలు వగైరా పంటలు పండించు స్వయంవృత్తి రైతు లకు పంటల భీమా లేకున్నది, అలాంటప్పుడు కూలీలకు కనీసపు జీవనభృతి అందచేయగలమా? ఇందువల్ల ఉద్యోగాల్లో వుండినవారికి అందిన రక్షణ రైతులకు, వ్యవసాయ కూలీలకు ఎప్పుడు అందచేయగలం? గోధనం రైతాంగానికి ప్రాణపదం. ఒంగోలు ఆవులు, ఎద్దులు, ప్రపంచ ప్రసిద్ధం! కాని పశువుల భీమా లేదు. ఈ మధ్య పాలకేంద్రములు ఏర్పరుస్తున్నారు. ఆ ప్రాంత కంలో మాత్రం, పశువులభీమా సాధ్యము. ప్రతి జిల్లాలో అధమం నాలుగయిదు పాలశీతల కేంద్రములు యేర్పరచుకొంటే, లక్షలాది వ్యవసాయకూలీలు, ఐదు యకరాలకు లోబడ్డ భూవసతిగల్గిన లక్షలాదిగా స్వయంవృత్తి రైతులు, పాలు

పెరుగు తాము అనుభవిస్తూనే, కోట్లకొలది ఆదాయం పొందనగును. గుజరాతు రైతాంగం ఇందు ముందడుగు వేస్తున్నారు.

వ్యవసాయం సాగించుకోవడంలో ఎద్దులు, దున్నలసాయం వ్యవసాయం అవసరం. అందుకు తోడు ట్రాక్టర్లు వగైరా యంత్రసామాగ్రి ఉపయోగం, ఆంధ్రాలో కొన్ని ప్రాంతాల రైతులే వీటిని కొనగల్గుచున్నారు. వాడగల్గుచున్నారు. ఇంక నెన్నో రెట్లుగా ఈ యంత్రాలను పంజాబులోవలె, వాడుకోవాలి. అందుకు రైతాంగ యువజనులు తర్ఫీదుతో వాటిని వాడుటలో, మరమ్మతులు చేసుకోవడంలో అనుభవం సాధించాలి. గాంధీజీ గ్రామీణ ప్రజారక్షణ అత్యవసరమన్నారు. గ్రామీణుడనై, రైతులు కూలీల మధ్య సామరస్యము సాధించుతూ, సాటి గ్రామీణుల సేవించుట, సోషలిస్టు ధోరణిలో భారతీయ సాంఘిక విప్లవము సాధించాలనే తత్పరతలో వుండిన నాకు బాపూజీ పిలుపు హృదయానికి అందినది, కనుకనే 1926 లోనే మాగంటి బాపినీడు, మోటూరి సత్యనారాయణ ప్రభృతులతో కలిసి, విజయవాడలో "పరదా పోదాము పల్లెటూరికి మనము" అనే గీతాన్ని పాడినాను.

గ్రామ జీవితము మాకెందుకు నచ్చినది? జమీందారులు రైతులను పీడిస్తుండుట గమనించినాము. పెద్ద రైతులు బీద సన్నరైతులకు, కూలీలకు అప్పులు నామములు పెట్టి నూటికి యిరవై నాలుగు వడ్డీతో పీల్చివేయడం ఎరుగుదుము. బీద రైతులుకూడా, కూలీలకు అన్నపానాదులు ఇవ్వకుండుట లేదా? కూలీలపై రైతులందరు తమ బీదతన స్వభావాలను మోపుచుండుట మరువగలమా? ఆపైన కొందరు అభాగ్యులను కూలీలను బాందు సేవలు లేక ఆజన్మాంతపు కమతం వారిగా నొక్కివుంచేవారుగదా? కనుక అట్టి అన్యాయాలను తొలగించాలనుకొన్నాము. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్నో విధాల ప్రభుత్వం, సహకార సంస్థలు కష్టించాలన్నాం, శ్రద్ధ చేయాలన్నాం. పశువులకు, దాణా అవసరం. అందులకు ఫ్యాక్టరీలు కావాలి. అడవులనుండి గడ్డిని, ఎండుగడ్డిని సరఫరా చేయాలి. రాకపోకల అభివృద్ధి లోపిస్తున్నది. రోడ్ల నిర్మాణం, రిపేరులేనాక, తోడుగా, కాల్వలను, నదులను రహదారులుగా పెంచుకోవాలి. పడవల నడుపువారికి శిక్షణ, పవరు లాంచీలకు తగినట్లుగా కాల్వకట్టలకు రివిట్ మెంటులు కావాలి. చెట్ల పెంపకం, రోడ్లు, కాలవకట్టలు పెరడులు ఆఫీసు స్థలాలలో అన్నిట అత్యవసరం. ఆకులు, కొమ్మలు, పండ్లుఫలాలు, పశువులు, మనుష్యులు తినుటకేగాదు, శీతోష్ణస్థితిని మెరుగు

పరచుటకు. ఆరోగ్య పరిసరాలెంతైనా అవసరం. అందుకే వనమహోత్సవాలు, ఆంధ్రులిందు వెనుకే వున్నారు. గ్రామాలలోని చెరువులను సరస్సులుగా కాశ్మీరులోని శ్రీనగరువలె మార్చుకోవద్దా! అందులో మత్స్యాలు, బాతులు, హంసలను పెంచాలి. తామరలు, కలువలు వికసించాలి. కట్టలచుట్టూ నారికేళాలు సూర్యునికి జోహారులు అందించాలి. బిడ్డలు ఈతలు, జలకాలు ఆడాలి. ఇవన్నీ మనెన్నో వుంటాలన్నాం. ఉన్నవాటికి అభివృద్ధి సాధ్యమగుచుండాలంటే, ప్రజలు వాటి అవసరాలను గమనించునట్లు చేస్తుండాలి. ప్రబోధిస్తూ వుండాలి. పంచాయితీల, సహకార సంస్థల ఎన్నికలందు ప్రభుత్వపు జోక్యం తొలగించుకోవాలి. పంచాయితీలు, సహకార సంఘాల మధ్య పంపిణీ చేసే నిధులు, ప్రత్యేక ఫైనాన్స్ కమీషనులే నిర్ణయించునట్లు చేస్తూ, మంత్రివర్గాలకు ఆ నిధుల వాడుకపై అజమాయిషీ లేకుండునట్లు చేస్తే బాగుండునేమో. ఎంత చేసినా, ఈనాడు బస్తీలు, గ్రామాల మధ్య వున్న ఆదాయాలు, ఆర్థిక, సాంఘిక విభేదాలను సమానపరచవద్దా? ఇంకెంత కాలం, పట్టణాలలోని ఉద్యోగులు, వ్యాపారులు, వ్యవహర్తలు, వృత్తుల వారికి ఐదు, పది వంతుల అదనపు ఆదాయం, అధికృత అందచేస్తూ, అందనిస్తూ వుండగలం? గాంధీజీ ఎప్పుడో ఈ అన్యాయాన్ని ఎదుర్కొమన్నారే!

# పొలాల్లో - పరిశ్రమల్లో - శ్రామికుల మధ్యతేడా

పొలాల్లో, ఎండలో, వానలో, చలిలో, నీటిలో, బురదలో, రాళ్ళలో, ముళ్ళ మధ్య ఎన్నెన్నో గంటల తరబడి కష్టించే రైతులు, కూలీల గతి ఇంత నీరసంగా ఇంకెన్నాళ్ళు వోర్చుకొనుట? అన్ని బాధలనుండి రక్షణలు పొందుతూ, అన్ని భీమాలు అందుకుంటూ, గంటలుగా తమ శ్రమ లెక్కించుకుంటూ, మెషినుల సాయంతో తమ శక్తియుక్తుల పెంచుకుంటున్న పట్టణాల శ్రామికులు, వుద్యోగులు, గుమస్తాలు, దళారులు, ఎంతెంతోగా దినదినం అభివృద్ధి అన్నివిధాల పొందగల్గుచుండు ఈనాటి సాంఘిక వ్యవస్థను మార్చుకోవద్దా! ఈ ప్రశ్నలను నేను 1923 నుండి ప్రచారం చేస్తున్నాను. ఈ నాటికి వ్యవసాయ కూలీలు, హరిజనులు కూడా

ఈ ప్రశ్నకు సమాధానం కోరుతున్నారు. 1971 ఓటింగు సమయాలనుండి పీడిత జనాలు ఏయే పార్టీలు ఎట్టి సమాధానమిస్తారో! అలాగే వ్యవహరిస్తారా అని వారు పరీక్షిస్తున్నారు.

ఈ ధోరణిని, ఆలోచనలను గమనించి ఆనందిస్తున్నారు. పరిశ్రమల అభివృద్ధి దేశంలో ఎంతగా వున్నదో, అందులో ఐదోవంతైనా ఆంధ్రులు సాధించుకోలేకున్నారు. ప్రభుత్వము సాగించే పరిశ్రమల్లో కూడా ఆంధ్రకు వస్తున్న భాగం చాలా కొద్ది! అందువల్ల వ్యవసాయకులు, యువజనులు వ్యవసాయాదాయములు చాలకున్నందువల్ల, బస్తీలు, పరిశ్రమలకు తరలిపోయి, అధికవృత్తి వుద్యోగపు ఆదాయము సంపాదించుకొనుటకు అవకాశం తక్కువగుచున్నది. అంచినంతలో హైదరాబాదు, విశాఖపట్టణ పరిసరాలలోనే గుమిగూడడం జరుగుచున్నది. ప్రతి జిల్లాలో అలాంటి అవకాశాలు కలగాలి. ప్రతి సమితి, పల్లెల్లో అట్టి ఉద్యోగ, వాణిజ్య సౌకర్యాలు కలగాలి. అలాంటి వృత్తి వుద్యోగాలు హెచ్చుగా అందాలంటే విద్యుచ్ఛక్తి సప్లయి విరివిగా వుండాలి. గ్రామాల్లో లైట్లు వచ్చినట్లు నూతన ఉద్యోగాలు కలిగించే పవరు, దానిపై ఆధారపడే వృత్తులు, వృత్తి పరిశ్రమలు, గృహ పరిశ్రమలు, మాధ్యమిక పరిశ్రమలు పెరగాలి, పెంచుకోవాలి. ఈ సౌకర్యాలను కలిగించుకొనగలిగిన మధ్యతరగతి రైతాంగ విద్యావంతులు, పెట్టుబడిదారులు ఇంకెంతగానో ముందుకు రాగలగాలి.

పంజాబు, హర్యానా రాష్ట్ర జనాలు రైతాంగం ఎలాగా పైపైకి వెళ్ళగలుగుచున్నారో మనవారు గమనించాలి. తమిళనాడులో ప్రభుత్వము చిన్న, మాధ్యమిక పరిశ్రమలనెట్లు అభివృద్ధిపరచుచున్నదో, ఆమూడు రాష్ట్రాలలో విద్యుచ్ఛక్తిని ఎంతగా అత్యధికంగా గ్రామాలకు అందించి వృత్తుల పెంచుకుంటున్నారో, చూచి, నేర్చుకుంటూ, ప్రభుత్వం నుండి సహాయం పొందగలగాలి. రైతాంగము ఆంధ్రలో కొన్ని పంటల ద్వారా పొగాకు, ప్రత్తి. చెఱకు వగైరా ద్వారా ముందడుగు వేసినారు. మాగాణి వసతులు, పెద్ద ప్రాజెక్టులు-తుంగభద్ర, నాగార్జునసాగర్, వంశధార, పోచంపాడు-మధ్యతరగతి, చిన్నతరగతి ప్రాజెక్టులద్వారా, అదనంగానే పెంచుకుంటున్నాము. కొన్ని లక్షల యకరాలకు మాగాణి వసతి కలుగుటద్వారా, అందరు రైతులకు స్వయం వృత్తి స్థాయి పెరిగినది. ఆదాయం అదనంగా అందుచున్నది. వారితో సహకరించు కూలీలకు, వివిధ వృత్తులవారికి అదనపు ఆదా

యప్పు వసతులు అందుచున్నవి. కాని మురుగుపోయే వసతులను, త్వరితంగా, తగినంతగా ఏర్పాటు చేసుకొనడంలేదు. అందువల్ల ఎంతో నష్టం కలగడం అందరికి అందబోతున్న పంటలు పాడయ్యే దౌర్భాగ్యం కలుగుచున్నది. మా రైతాంగోద్యమమునకు ప్రధమ ప్రాతిపదిక, శిస్తుల భారాన్ని తగ్గించుకోవడం ఆ 1923 నాటి అవసరం, ఈ నాటికి ప్రముఖమే? 27 సంవత్సరాల ప్లానులు, వేల కోట్ల పెట్టుబడుల వల్ల పొందిన లాభాలు, అభివృద్ధితో తృప్తి జెందక బస్తీలవారు, పారిశ్రామికాధిపతులు, మధ్య తరగతి ఉద్యోగస్థాయి గలవారు రైతాంగముపై ఇంకెన్నో క్రొత్త శిస్తుధారాలు వేయాలంటున్నారు. ఆ అన్యాయాన్ని ఎదుర్కోవడం అత్యవసరం. ఈమధ్య వ్యాపార పంటలు, పండ్ల తోటలపైన ఆంధ్రలో శిస్తులు వేసిరి. ఆ పిచ్చిపని ఆనాటి జమీందారులు చేస్తూ వుండిరి. తిరిగి గొప్ప ఆందోళనచేసి వీటిని తొలగించుకొంటిమి. ధనిక రైతుల పైననే వేస్తామనే నాటకం ఆడుతున్నారు. ఎవ్వరు ధనిక రైతులు! 5 నుండి 15 ఎకరాల లోపల వారేగా! వారి కీనాడు మిగుల గలిగిన ఆదాయాలు వుండునా! వున్నవా! వారిపై ఇంకెన్ని శిస్తులు? వివిధ వస్తువులపై ఎక్సైజు పన్నుల భారాలను వారు మోయడంలేదా? వారి బిడ్డల చదువులకు ఖర్చులు భరించడంలేదా! నానాటికి పెరుగుచున్న వివిధ వస్తువుల ధరలు వారిపైన వత్తిడి కలిగించడం లేదా! కనుక, అదనపు శిస్తుభారాల నెదిరించుటకు రైతు ఉద్యమం సత్యాగ్రహాయుధాన్ని ప్రయోగించక తప్పదు. ఆ మధ్య ప్రతిరైతు తనకున్న భూమినుండి కనీసపు పంటలు పడించాలి. లేకుంటే, ఆ భూమి నుండి వారిని తొలగించవలసిందేనంటూ, ప్లానింగు కమీషను వారు సూచించిరి. ఇది రైతాంగ వ్యతిరేకం, అభివృద్ధి నిరోధకం, అనుభవములో, ఉద్యోగుల నిరంకుశాధికార ప్రాబల్యమునకు దారి తీస్తుంది అని మాబోంట్లము ఆందోళన చేసితిమి, జయించితిమి.

ఈ సూచన చాలక, మాగాణికై వుపయోగించు, నీటి సప్లయిలను క్రమంగా తగ్గించి, హెచ్చు భూములకు సప్లయి చేయాలంటూ, మరో సూచన చేసిరి. ఇప్పటికి, పి.డబ్ల్యూడి. యిరిగేషను వుద్యోగస్తుల కెంతో లంచాలివ్వక తప్పడంలేదు. తమ భూములకు సప్లయి చేస్తున్న నీటిని కొలుస్తూ, వుంటామంటె, ఇక ఈ వుద్యోగులు భూమిపై నిలుస్తారా! కనుకనే దీన్నికూడా ఎదిరించితిమి.

అయినా, చిత్తూరు, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలోని మాగాణిరైతు ఎట్లా అత్య

ధిక శ్రమ చేస్తూ సంవత్సరానికి తప్పక రెండు, వీలు కలిగినప్పుడు మూడు, పంటలు పండిస్తున్నారో. అలాగే అదనపు శ్రమతో, అత్యధిక పంటలు పండించుటకు, గోదావరి, కృష్ణా, పెన్న, పోచంపాడు, వంశధార వగయిరా జిల్లా రైతులు స్వయంగా శ్రమించుతూ అధిక పంటలను సాధించవలెనని, రైతునాయకులు ప్రచారం చేయాలి.

వ్యవసాయానికి అవసరమగు ఎరువులు, మందులు, మరలు, పంపులు పశువులు, ఇత్యాది పరికరముల నిర్మించు, రిపేరుచేయు, సరఫరా చేసే వృత్తుల ఫ్యాక్టరీల అభివృద్ధి గ్రామాలలో జరుగునట్లు శ్రద్ధ చేయాలి గదా? పంజాబులో అభివృద్ధి సాధిస్తున్నారు. ఐతే రైతు కూలీలు, యువజనులు వీటికి అవసరమగు తర్ఫీదు ఆయా పాలిటెక్నిక్కుల్లో పొందాలి. వ్యవసాయం, పరిశ్రమల తోడ్పాటు నిండుగా పొందుకోవాలి. వ్యవసాయకులు పరిశ్రమల సాగించు వడ్రంగం, కమ్మరం వగయిరా శక్తులను సాధించుకోవాలి. అందరు రైతులకు, మరీ సన్నకారు రైతులకు పారిశ్రామిక శక్తుల సహకారము, ఆయా ప్రదేశాలలోనే, వెన్వెంటనే, చౌకగా వివిధ తత్సంబంధమైన వ్యవసాయిక పరిశ్రమలను. సహకార వర్కుషాపులద్వారా కూడా ప్రభుత్వము, ప్రజలు యేర్పరచాలి. ఆ పారిశ్రామిక పెద్దలు ఈ బక్క రైతులను దోపిడి చేయకుండా, శ్రద్ధ చేయాలి.

ప్రజల ఆరోగ్యం పెరగాలన్నా, బీదరైతులకు కూడా వివిధ పండ్లు, తేనె, పాలు అందునట్లు చేయాలన్నా వారి వారి ఇండ్లచుట్టూ, గ్రామాలు, చెరువులచుట్టూ పండ్ల చెట్ల పెంపకమును ప్రోత్సహించాలి. పాడి పశువులు, గొర్రెలను పెంచుకొనుట పరిపాటిచేయాలి. ప్రతి ఇంటికి పెరడు, పండ్ల వృక్షాలు, ప్రతి గ్రామం వనలక్ష్మి లాగా చేసుకోవాలి ! ఇదంతా, ప్రభుత్వం, ప్రజలు, పరస్పర సహకారం ద్వారా సాధించుకోగలరు? అదే మన లక్ష్యం !

ఆచార్య రంగా

★

# భారత రైతాంగ ఉద్యమాలు-విజయాలు

బౌద్ధ యుగానికంటే అతిప్రాచీన కాలం నుండి, 20 శతాబ్దం వరకు, భారతీయ రైతాంగం, తమ హక్కుల సాధన కొరకు, స్వాతంత్ర్యం కొరకు, జరిపిన పోరాటాలు, సాధించిన విజయాలు, పొందిన అపజయాలు, చారిత్రకాధారములతో, ఆచార్య రంగాజీ రచించిన "విప్లవ రైతాంగం" అనే బృహద్గ్రంథం నుండి, పాఠకుల సౌకర్యం కొరకు పునర్ముద్రించడం జరిగింది.

-ఎడిటర్

క్రీస్తుపూర్వం చాలాకాలానికి ముందే చైనా భారత ప్రజానీకం తమ హక్కుల్ని సజీవంగా నిలబెట్టుకున్నారనే విషయం మనం చరిత్రని చక్కగా చదివితే తెలుస్తుంది. బుద్ధ భగవాన్, కన్ఫ్యూషియస్, అశోక చక్రవర్తి మొదలైన వారు ఆర్థిక న్యాయానికి, ప్రజాస్వామిక సంఘాలకు సంబంధించిన విషయాలలో కష్ట జీవుల అవసరాల్ని గుర్తించి ప్రత్యేక శ్రద్ధని కనపరిచారుకూడ. ఉదాహరణకు కన్ఫ్యూషియస్ రైతాంగానికి అనుకూలంగా అసంఖ్యాకమైన సంస్కరణల్ని తెచ్చాడు. "ఆయన వస్తువుల ధరల్ని నిర్ణయించాడు. దేశ ఆదాయాన్ని వ్యాపార అభివృద్ధి నిమిత్తం వుపయోగించాడు. రాక—పోకల సౌకర్యాలు అభివృద్ధిచేయ బడ్డాయి. రహదార్లు వంతెనలు బాగుపర్చ బడినవి....". ఉన్నత సైనిక పాలకుల దురహంకారం దగ్ధం చేయబడింది. అణచబడిన సామాన్య ప్రజానీకం విముక్తి పొందారు. చట్టం దృష్టిలో మానవులంతా సమానం అని ప్రకటించబడింది. ఇదంతా కూడ క్రీస్తుపూర్వం ఐదువందల సంవత్సరాలనాడు జరిగింది.

మహోజ్వల భారత చరిత్ర బ్రహ్మాండమైన నిరంతర ఒడుదుడుకుల ఫలితంగా కనిపిస్తుంది. బుద్ధభగవాన్ బ్రతికున్న సమయంలో ఆయనకు ముందు సహితం ఒక వైపున దేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రజాతంత్ర రాజ్యాలు అసంఖ్యాక ప్రజా నీకానికి ప్రజా స్వామ్యతను ప్రసాధిస్తున్నా, దేశంలో మరోవైపున అధికార దురహంకార రాజ్యాలకు ప్రభు తత్వ రాజ్యాలకు సంబంధించిన విధానంకూడ

వుండేది. ఈ అధికార దురహంకార రాజ్యాలలో ఈనాడు మనం అనుభవంలో చూస్తున్న కులతత్వకుళ్ళు ఆనాడుకూడ వుండేది. రాజులు దైవాంశ సంభూతులైన హక్కుదారులని తమ సర్వాధికారత తమ జన్మహక్కని, పైకులాల పవిత్ర హక్కులనీ ప్రత్యేకంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, రాజ్యాంగ నిపుణత వ్యవహారాల్లో, రాజ్య పరిపాలనా వ్యవహారాల్లో తమ హక్కు భుక్తమైన పెత్తనాన్ని నిలబెట్టుకోవటం అనే ఈ మొదలైన అభివృద్ధి నిరోధక భావాలు పరిపాలింపబడే ప్రజానీకం మీద తమ ప్రభావాన్ని వ్యాపింపచేసుకుని తిష్ట వేసుకుని కూర్చున్నందు వలన ఇకను నిర్భాగ్య ప్రజానీకమంతా సామాజిక తిరోగమన మార్గాలకు దాసోహమనక తప్పలేదు.

## బౌద్ధ యుగం

భగవంతుని దృష్టిలో, ధర్మందృష్టిలో స్త్రీ-పురుషులు యావన్మంది సమానమని బుద్ధభగవానుడు ప్రకటించాడు. సమస్తకులాలు సమానమన్న దృష్టిలో కులతత్వాన్ని నశింపచేసేటందుకు సమతను ప్రబోధించే సంఘాల్ని నిర్మించి అందులోనికి ప్రజల్ని అసంఖ్యాకంగా చేర్చాడు. తద్వారా ప్రజాస్వామ్యమనే అభ్యుదయ ద్వారాన్ని తెరిచాడు. అంతస్తులంతస్తులుగా ఏర్పడి వున్న హిందూ సామాజిక ఆర్థిక తరగతుల మీద నిరంతరంగా పెరుగుతున్న నిరుత్సాహ నిస్పృహల్ని ఆయన సమకాలికులలో ఈ గొప్ప ప్రబోధకుని విప్లవాత్మక సిద్ధాంతం అరికట్టి, మరో స్వరూపాన్నిచ్చింది. బుద్ధుడు తన సమకాలిక రాజరికంలో ప్రత్యక్షంగా ఘర్షణ పడే కార్యక్రమం ఏదీ తీసుకోక పోయినప్పటికీ, కులతత్వాన్ని రద్దుచేయటం; మహాపవిత్రమని భావించి చేసే బ్రాహ్మణుల యజ్ఞయాగాది క్రతువుల్ని వాటి వాదోపవాదాల్ని—నిరాకరించటం; ప్రజాస్వామ్య యుతంగా స్త్రీ పురుష భేదంలేకుండా; పేద పెన్నిధి తారతమ్యత లేకుండా సమస్తమానవుల్ని తన సంఘంలోనికి ఆహ్వానించటం; వారిని సమానంగా ఆదరించటమనేవి; సమాజంలోని కొద్ది మంది పరిపాలకులు బ్రాహ్మణులు సామాజిక పెత్తనాన్ని చేజిక్కించుకున్న వ్యవస్థ మీదకు విప్లవ తరంగాలు వేగిరంగా చొచ్చుకు పోయేదానికి అవకాశాన్ని కల్పించినవి.

అలా బుద్ధ భగవానునిచేత ప్రేరేపితమై ప్రోత్సహించబడి ప్రారంభించబడిన సామాజిక విప్లవ ఫలితంగా అమాయక, అవిద్యాపరులైన ప్రజలలోనినుంచి ఒక

పై పున బ్రాహ్మణుల నిరంతర వ్యతిరేక వత్తిడి వున్నప్పటికి విశాల భారత దేశంలో విస్తృత ప్రదేశంలో రైతాంగ వంశస్తులని గర్వపడదగిన శూద్ర జాతికి చెందిన పాటలీపుత్ర మౌర్య చక్రవర్తులు అధికారంలోనికి వచ్చారు. ఆ బౌద్ధ సాంఘిక విప్లవం, భారతదేశంలోని అనేక భాగాలలో ప్రజల సాంఘిక పురోభివృద్ధికి సంబంధించిన మహోన్నత అధ్యాయానికి చరిత్రలో సింహద్వారమైనది. ఆ విధంగా దాదాపు ఆరు శతాబ్దాలపాటు అనేక మంది కొండ జాతుల వారు, అప్పటి వరకూ క్రుంగిపోతున్న బానిసలు, బానిసభావాలతో నున్నవారు, వ్యవసాయ ప్రజలు, అంటే, భూములున్నటువంటి లేనటువంటి రైతులు కూడ, చిరకాల బానిస బంధాలనుంచి తమకు తాముగానే విముక్తి పొందటమే గాక, పవిత్ర గ్రంధాల పేరుకోటి, కత్తి భయంతోటి, అప్పటి వరకు నిరంకుశంగా పరిపాలించిన ఉన్నత తరగతులకంటే తాము అధములని భ్రమింపజేసే నిర్వచనంనుంచి సైతం బైటబడగలిగారు. గ్రామ స్థానిక మండల ప్రాంతీయ కామన్‌వెల్తుల ద్వారా తమ సంపూర్ణ పౌరసత్వ హక్కుల్ని ప్రజలు గుర్తించకొని అనుభవించ ప్రారంభించారు.

అశోకునిచేత కట్టబడిన బౌద్ధస్థూపాలు తదితర స్మారక చిహ్నాలు చరిత్రలో ప్రజలు దేశ వ్యాప్తంగా విస్తృతంగా నవయుగంలో ప్రవేశించారనే విషయాన్ని సుబోధం చేస్తున్నాము. అశోక మహా చక్రవర్తి ప్రఖ్యాతవంతమైన సాంఘిక పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రజల సాంఘిక జీవితంలో కుటుంబ వ్యవస్థలో, మహోన్నత ఆదర్శాలతో ప్రారంభించాడు. ప్రజలకు సంబంధించిన వ్యవహారాల్లో రాజ్యాంగ విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా సమగ్రంగా గుర్తించి తద్వారా తరతరాల వారికి మార్గ దర్శకుడయ్యాడు. తన తాత చంద్రగుప్త చక్రవర్తి చేత అమలు పెట్టబడిన దుర్భరమైన రైతాంగ విరుద్ధమైన విధానాల్ని చక్కబరచి తన క్రింద నున్న ఉద్యోగుల్ని ప్రజావసరాలకు అనుగుణ్యమైన విధంగా వ్యవహరించుకునేట్లు చేశాడు. ఎనిమిది (అష్టాంగాలు) విధాలైన మానసిక కట్టుబాట్లకు సంబంధించిన నడవడికలను, వాటికి అనుబంధమైన నిర్వచన తత్వాన్ని, ప్రోత్సహించే దానికి ప్రబోధించే దానికి, ప్రసిద్ధమైన భారతీయ సాంప్రదాయాలకు ప్రతివాడూ చేయ గలిగిన ప్రజోపయోగమైన సేవ. చెట్లునాటే దగ్గరినుంచి చెరువులు త్రవ్వేంత వరకూ, పేదలకు సత్రాలు చలివేంద్రాల ఏర్పాట్ల వరకూ, ఉన్న సమస్త విషయాలకూ పునాదులు వేశాడు. నిరంకుశుల మీద ప్రజా తిరుగుబాట్లు రాజకుటుంబీకుల, లేక

రాజులకు, తప్పొప్పులకు సంబంధించిన విపరీత వాదోపవాదాలు, పౌరులకి సంబంధించిన విషయాలు, దేశబాధ్యతలు, ప్రత్యక్షంగా రైతులకు సంబంధించిన వాటిని, ఇంకా తదితరమైన అనేక విషయాలకు సంబంధించిన వాటిని మహా భారత అసంఖ్యాకమైన ఋజుఘట్టాలలో చూపిస్తుంది. క్రీస్తుకు పూర్వం అయిదారు వేల సంవత్సరాలకు చెందిన చరిత్రలో కష్టజీవుల స్థానాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే నిమిత్తం, ఒక ప్రత్యేక సునిశిత పరిశీలన ఎంతో అవసరమైంది.

ఈ భారత ఇతిహాసం నిజమైన అనేక రాజకీయ పోరాటాలతో నిండి వుంది. అంతేకాక రాజకీయ వ్యవహారాలకు సంబంధించిన విషయాలలో సమగ్రమైన పాత్ర తీసుకుని తర్కించిన వాదోపవాదాలకు సంబంధించిన భోగట్టా గూడ వుంది. అయితే, వృత్తి ధర్మాలలో, ఆచరణ విధానాలలో బౌద్ధ సన్యాసుల పవిత్రత క్రమేణా ఓడిపోయేకొలది, ఏకొద్ది మందికో సంబంధించిన స్వార్థంనిమిత్తం, వారిలో వారి మతాలలో స్వార్థపూరిత వ్యక్తిత్వ ఆధిక్యత పెరిగేకొలది ప్రజారాజ్యాల లోని ప్రజాస్వామిక సాంఘిక వ్యవస్థకున్న గొప్పతనం కోల్పోవటం వలన బ్రాహ్మణ వ్యవస్థ తిరిగి ఆధిక్యత సాధించుకుంది. ఈ విధంగా మరో మారు భారత కష్టజీవులు శక్తివిహీనులై అధోగతి పాలైనారు.

## గ్రామీణ ప్రజా సంస్థలు

సామ్రాజ్యాలు పుట్టి అవి తమ సర్వాధిపత్యాన్ని చూపించుకోకముందే కొన్ని శతాబ్దాలకు పూర్వం, భారతీయులు- చైనీయులు గ్రామ పంచాయితీ రాజ్య పరిపాలనా జీవితాన్ని అనుభవించారు. కనీసం ద్రావిడులు, ఆర్యులు, భారత దేశంలోని గుంపులు గుంపులుగా ప్రవేశించని కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం భారత ప్రజలు అధికంగా దైనందిన గ్రామీణ ప్రజా సంఘాల చల్లని విధానాల ఛాయల్లో జీవించారు. అటువంటి ప్రజా పరిపాలనా సంఘాలు అప్పుడప్పుడు ఒకదానికొకటి సహకరించుకుంటూ సమ్మిళితమై బైటనుంచి వచ్చే దండయాత్రికుల బారినుంచి రక్షించుకునే స్తోమతను ప్రదర్శించుకున్నట్లు ఋజువౌతుంది. ప్రపంచ చరిత్రలో ప్రసిద్ధికెక్కిన అలెగ్జాండరు మహాపురుషుడు, భారతదేశంనుంచి సింధుదేశంలోగుండా తిరిగి వెళ్ళుతున్నపుడు "జాట్లు" ఎదిరించి చూపించిన బలమే దీనికి నిదర్శనం. బుద్ధభగవానుని రోజుల్లో వున్న ఆచార అలవాట్లను బట్టి చూస్తే రైతాంగ కుటుంబ

పెత్తనదార్లను "రాజులు" అని పిల్చినట్లు వ్యక్తమౌతుంది. తమ ఆస్తిపాస్తులమీద రైతాంగ హక్కులు, భూసాగు విషయంలో భూకామందుకు స్వామి దున్నేవానికి వున్న సంబంధాలు, కులానికి సంబంధించిన హక్కులు ఈ మొదలైనవన్నీ ఇకేవల గుర్తించబడినట్లు మనుధర్మశాస్త్రం కౌటిల్యుని అర్థశాస్త్రం వలన తెలుసుకోగలు తున్నాం.

## ఆరు శతాబ్దాల భారత కిసాన్ రాజ్యం

బౌద్ధమత పతన వ్యవస్థ నుండి, కళచూర్య వంశానికి చెందిన మహారాష్ట్ర ప్రధాన మంత్రి బసవుని వీరశైవ మత విజృంభణ వరకు, బ్రాహ్మణ క్షత్రియ మైన చతుర్వర్ణాలలోని పై రెండు కులాల "పవిత్ర హక్కు" పలుకుబడి భారత ప్రజల మీద సవారి చేసింది. విదేశ విజేతలు- వారి అనుచరులు, మరికొందరు బలీయమైన భారతవీరులు, బ్రాహ్మణ గురువుల మన్ననలను సంపాదించారు. తద్వారా పురాతన రాజుల వ్యవస్థకు, హోదాకు తుల్యమైన విధంగా వివిధ ప్రాంతాల్లో పరిపాలకులుగా రాజులుగా క్షత్రియులనే పేరుతో వారిచేత ఆమోదముద్ర వేయించుకుని నిలబడ్డారు.

కాని బ్రాహ్మణ్యం సృష్టించిన పురాతన కుల అంతస్థులను వీరశైవం సవాలు చేస్తూ ముందుకొచ్చిన ఫలితంగా ప్రజానీకం కోల్పోయిన కొంత రాజ్యాంగ పెత్తనం, కనీసం దేశంలోని కొన్ని భాగాలలోనైనా, పునః ప్రతిష్ఠించుకునే అవకాశం కల్గింది. అయినప్పటికి గొప్ప వీరత్వం, సహనం కలిగిన రైతాంగ బృందాలలో నాయకులు అనేక స్థానిక రాజ్యాంగ యంత్రాలలో రాజులవద్ద ప్రధాన మంత్రులుగానున్నా, సమర్థులైన సర్వసేనాధిపతులుగానున్నా మాత్రమే వుండ గలిగారు. ఎప్పుడైనా ప్రస్తుతం వున్న రాజ్యాంగ భాగానికి వెలుపల మరో రాజ్యాంగ భాగాన్ని సంపాదించాలన్నా, కలుపుకోవాలన్నా, రాజ కుటుంబాల కలతల వలన గానీ, లేక ప్రజాందోళన ఫలితంగా కాని వచ్చిన తిరుగుబాట్ల అసరాగా, వెనుక పోగొట్టుకున్న భాగాన్ని కలుపుకోవాలన్నా, సాధారణంగా రైతాంగ వంశాలకు ప్రధాన నాయకులుగా నున్నవారిచేత గానీ లేక తిరుగుబాట్ల నాయకులచేత గానీ ఆ కార్యక్రమం జరిపిబడేది. ఇంతేగాక, ఈ మురానాయకులచేత చుట్టుపట్లనున్న తదితర రాజ్య భాగాల్ని ఆక్రమించుకుంటే, అది తమ హక్కు భుక్తమైనట్లు ఇతరులు గుర్తించే కార్యక్రమం కూడ జరిపించబడేది.

అయితే పదకొండవ శతాబ్దంలో రెండు క్షత్రియ కులాల మధ్య ఆధిక్యత కోసం, ఆంధ్ర దేశంలోని పల్నాటిలో యుద్ధం జరిగింది. ఆంధ్ర రైతాంగ వర్గాలు కేవలం సైనిక నాయకత్వంలోనే కాక, రాజ్యాంగ నిపుణత విషయంలో కూడ వారికున్న శక్తి సామర్థ్యాలు ఎలా వ్యక్తమైనవో ఈ యుద్ధం చక్కగా రుజువుచేసి చూపించింది. మొత్తం దక్షిణ భారత దేశంతో పరిపాలించే టటువంటి రాజులు— వారి సైన్యాలు, ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. ఉభయ పక్షాలలోనూ వున్న సైనిక నాయకులు యథార్థానికి రెడ్డి నాయుడు అనే రెండు పరస్పర వ్యతిరేక రైతాంగ కులాలకు చెందిన వారు. ఈ యుద్ధ అంత్యం క్షత్రియ పాలనకు స్వస్తివచనం పాడింది. అంతేకాక దేశంలో సమాజంలో రైతాంగ ఆధిక్యతకూ, ఆత్మవిశ్వాసానికి హేతుమాత్రమైంది కూడ. ఒక పక్షానికి చెందిన ప్రధాన మంత్రి బ్రహ్మనాయుడు వీరవైష్ణవీయ మతస్థుడు. ఆయన దాన్ని ప్రోత్సాహపర్చి, రైతాంగంలో కుల తత్వాన్ని రద్దుపర్చి, అంటరాని తనాన్ని రూపుమాపాడు. అంతేగాక కన్నమ నాయుడు అనే హరిజన వీరుణ్ణి సర్వ సేనాధిపతిగా చేసి ఆ యుద్ధంలో విజయాన్ని సాధించాడు. మరో పక్షానికి రెడ్డి యువతి అయిన రైతు నాగమ్మ ప్రధాన మంత్రిణిగా వుంది. యుద్ధంలో ధైర్యంగా పోరాడి తానే స్వయంగా సైన్యాన్ని రణరంగానికి నడిపి ఆ వీరోచితమైన పోరాటంలో తుదకు మరణించింది. ఆ విధంగా ఆమె తదనంతరం తరతరాల వరకు రైతాంగ మహిళలకు యుద్ధం-కళ-రాజ్యాంగ నైపుణ్యతలంటే, ఏమిటో తెల్సుకుని అనుసరించ దగిన చక్కని పునాదులు వేసింది.

ఈ విధంగా తాము పరిపాలించే దానికి హక్కులేదని, పవిత్ర హక్కు ప్రకారంగా క్షత్రియులు మాత్రమే పరిపాలించాలనీ, రాజుల్ని బ్రాహ్మణులు మాత్రమే నడపాలనీ ప్రచారం చేసిన తప్పుడు అభిప్రాయాలనుంచి వారు తమంతట తాముగానె బైటపడటమే కాకుండా, తమ శక్తిసామర్థ్యాలని గురించి, పోరాట దక్షతను గురించి, పునః పరిశీలించుకుని హక్కులనేవి తమ శక్తిసామర్థ్యాలను బట్టి ఉద్భవిస్తాయని గ్రహించి వాటిమీదే సాధన గూడ ఆధారపడి వుంటుందే కాని శాస్త్రోద్ఘోషించే పవిత్ర హక్కుల ద్వారా మాత్రం కాదని గ్రహించినందు వలన, ఆంధ్ర రైతాంగ జనాలకు, అధికారానికి అభ్యుదయానికి సంబంధించినంత వరకు ఒక మహత్తర నూతనాధ్యాయం ప్రారంభమైంది.

వరంగల్ కాకతీయ వంశావళి ప్రారంభంతో పల్నాటి యుద్ధాలంత మొందినయ్. కాకతీయ వంశం రైతాంగ నిజస్వరూపం. వారి మంత్రులూ ప్రధాన మంత్రులూ, సైన్యాధిపతులు మొదలైన వారంతా రైతులే! స్థానిక బ్రాహ్మణ గురువుల అభిమానం పొంది తమకు తాము క్షత్రియులమనే ఆమోదముద్ర వేయించుకునే విషయంలో వారెప్పుడూ అవ్యక్తంగా అర్రులు చాచుకుని చూడలేదు. వారికున్న రాజ్యాంగ నైపుణ్యతతో ఆయుధబలంతో ఆత్మ విశ్వాసంతో దక్షిణ భారత దేశాన్నంతా తమ అదుపాజ్ఞల్లో పెట్టుకునే నిమిత్తం ముక్కుకు సూటిగా పోగలిగిన స్తోమత వారికుంది, దాదాపు మూడు వందల సంవత్సరాలపాటు ఉత్తర భారత దేశాన్నుంచి దండయాత్రలు చేస్తున్న విదేశీయ మహమ్మదీయుల దాడినుండి గోదావరికి దక్షిణ భాగాన వున్న ప్రాంతాన్నంతటినీ, రక్షించే విషయంలో శాంతి భద్రతల్ని నెలకొల్పే విషయంలో విజేతలయ్యారు. ఈ మహత్తర కాలంలోనే రైతాంగ బృందాలు ప్రఖ్యాతి వహించిన రుద్రమదేవిని తమ రాణిగా అంగీకరించి కిరీటం పెట్టారు. ఆమె 50 సంవత్సరాల పాలన దేశ సౌభాగ్యాన్ని గొప్పతనాన్ని ఎలా ప్రజలమన్న నలపొంది ప్రతిబింబింప చేసి, చీనా వరకు వాణిజ్యాన్ని విస్తరింప చేసిందో, దక్షిణ భారత దేశానికి "మార్కోపోలో" వచ్చి చూచి వ్రాసిన వ్రాతలు మనకు ఆధారాలుగా వుండి చూపిస్తున్నాయ్. ఆమె రాజ్యాంగ నైపుణ్యత అసమాన్యమైంది. ఆమె తన నలుగురు కూతుళ్ళను నాలుగు ప్రముఖ రైతాంగ కులాల్లోని మేధావంతులైన యువకులకిచ్చి తద్వారా అన్ని వర్గాల వారిని దేశ గౌరవానికి దేశావసరాలకు వినయ విధేయతలు చూపించేట్లుగా చేయగలిగింది. రణరంగంలోని ఆమె శక్తి సామర్థ్యాలు వర్ణనాతీతమని ఆమె నాయకత్వం ఋజువు చేసింది. ప్రజల మాతృభాష అయిన తెలుగు, గద్య విధానంలోని వాడుక భాష, పరిపాలకులచేత, సైనికాధికారులచేత నాయకులచేత విపరీతంగా ప్రోత్సహించ బడింది. అసంఖ్యాకమైన బ్రాహ్మణేతర రైతాంగ రచయితలు ఆ స్థానంలో వుండే వారు. ఆ విధంగా మరోమారు సాంఘిక రాజకీయ జీవితాలకు సంబంధించిన మహోన్నత ఆశయాలను తీర్చిదిద్దే మహత్తర పాత్ర గ్రహించే దానికి, అసంఖ్యాక ప్రజానీకానికి అవకాశం లభించింది.

దురదృష్టవశాత్తు రైతాంగ వర్గాల్లో ఒకర్ని చూస్తే ఒకరికి అసూయ అభివృద్ధయింది. తమలోతామే పోరాడుకోవటం ప్రారంభించారు. ప్రస్తుత దౌలతాబాద్‌గా వ్యవహరించబడనున్న ఆనాటి దేవగిరి-మధ్య భారత్‌లోని ఇతర

రైతాంగ వర్గాలకు అంతః కలహాలతో కాకతీయ రాజధాని సతమతమైంది. తమలో తమకున్న అభిప్రాయ భేదాలు, అంతఃకలహాలతో పాటు దేవగిరి కాకతీయ రాజ్యానికి చుట్టుపట్ల నున్న దేశాలతో ఏర్పడిన తగాయిదాలు తోడైనందున, ఢిల్లీ ముస్లిం పరిపాలకులు రైతాంగంలో అనైక్యత తేవటానికి, రాజకీయ సైనిక స్థయిర్యాన్ని దల్లాలతో పొడుపటానికి అవకాశం కల్గింది.

ఆంధ్ర రైతాంగం, వారి సైన్యం, వారి రాజకీయ నాయకులు ఉత్తర భారత సుల్తానుల దండయాత్రల్ని తీవ్రంగా ఎదుర్కొన్నారు. వారి వీరోచితమైన మహా నాయకుడు ప్రతాపరుద్రుడు రెండుసార్లు ఉత్తర భారత ముస్లిం ఆక్రమణదారుల దండయాత్రల ఉధృతాన్ని, తీవ్రంగా ఎదుర్కొగలిగిన సామర్థ్యాన్ని నిర్మాణయుత పద్ధతుల్లో ఆ తుది దశలో సాధించాడు. ఒక్కమారు కూడ ఆ దండయాత్రికులు గోదావరి పరిసరాల్ని తాకలేక పోయారు.

మూడవమారు విజృంభిస్తున్న బలవత్తరమైన శత్రువుల ఆక్రమణ ధాటికి, అంతఃకలహాలతో అంతరంగిక వైషమ్యాలతో ఆ నాటికానాటికి తీసికట్టైయి బలహీన పడిన రైతాంగ రక్షణ దళాలు, పటాపంచలైనయ్. ఈ విధంగా మూడు శతాబ్దాల పాటు ఒకే పరిపాలకుల వంశవృక్షం అభివృద్ధికరమైన పరిపాలనని దక్షిణ భారత దేశంలో విస్తృత ప్రదేశంలో సాగించిన రైతాంగ నాయకత్వం తాత్కాలికంగా ఆగిపోయింది.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, ఒక వంద సంవత్సరాల పాటు రైతు కులాలలో ఒకటైన రెడ్లు మహా నదినుంచి పెన్న వరకు వున్న మొత్తం తూర్పు కోస్తా ప్రాంతాన్ని పరిపాలించారు. స్థానిక వ్యాపారం, పరిశ్రమ విదేశ వాణిజ్యం, నావికాబలం ఈ మొదలైన కాకతీయ సాంప్రదాయాల్ని అభివృద్ధి చేస్తూ విదేశాలతో సత్సంబంధాల్నికూడా అభివృద్ధి చేశారు. వారు అభ్యుదయ తెలుగు రచననుకూడా ప్రోత్సహించారు. కాకతీయుల మాదిరిగా కాక బ్రాహ్మణుల్ని మంత్రి వర్గాల్లోనికి ఆహ్వానించి పరిపాలనలో భాగస్వామ్యాన్నిచ్చారు. అయితే ఇతర రైతాంగ పాలనా వంశాలతో నిరంతరం యుద్ధాలు చేస్తున్న కారణాన, తుదకు వారుకూడ దేశం మీద తమకున్న పెత్తనాన్ని వదులుకోవాల్సి వచ్చింది. మహమ్మదీయ విజేతల చేతుల్లో దేశం పడింది.

దక్షిణ భారత వీరభూమికి హృదయ మనదగినది హంపిపట్టణం. ఇది తుంగ భద్రా నదికి ఒడ్డున వుంది. గొప్ప బ్రాహ్మణ రాజకీయ దురంధరుడైన విద్యారణ్య స్వామి ప్రోత్సాహం వలన, మరో రైతు వంశీకులైన బోయీలు ఈ పట్టణాన్ని కేంద్రంగా జేసుకొని రాజ్యాన్ని స్థాపించారు. కాకతీయ-రెడ్డి సామ్రాజ్యాల్లో తల లెత్తిన అంతరంగిక నిరంతర పోరాటాలు తిరిగి ఇక్కడ రేకెత్తకుండా చేయాలని విద్యారణ్యుడు సంకల్పించాడు. అందుకని ఇంతకు ముందెన్నడూ అధికారాన్ని చేపట్టని బోయీలకు నాయకత్వ అవకాశాల్ని కల్పించాడు. అయినా ఇతర రైతాంగ కులాల సహకారాన్ని, దేశాన్ని రక్షించే విషయంలో రక్షక దళాల్ని నడిపే విషయంలో ఆహ్వానించాడేకాని వారిని రాజకీయ భాగస్వామ్యులుగా రాకుండా, తన నైపుణ్యత నంతా వినియోగించి చేయగలిగాడు. ఈ విధంగా తుంగభద్రకు దిగువన వున్నటు వంటి దక్షిణాపథాన్నంతటినీ నిర్విఘ్నంగా పరిపాలించిన విజయనగర సామ్రాజ్యాన్ని అవతరింపజేశాడు. రైతాంగ వంశాలు ఈ మూడు శతాబ్దాల వ్యవధిలో కేవలం ఆయుధ సంపత్తిలోను రాజ్యాంగ నైపుణ్యతలోనెగాక, నిర్మాణాత్మక కృషి సాధన వలనకూడ తమ ప్రత్యేకతను ప్రపంచానికి వ్యక్తపరచుకున్నారు. వారు తమిళనాడు ప్రాంతానికి కూడా వెళ్ళి, చిట్టి అడవుల్ని నరికి వేసి పర్వత అటవిక ప్రదేశాల్ని సాగులాయిక్కి అయిన భూములుగా మార్చి వందలాది గ్రామాల్ని నిర్మించి అభివృద్ధి లేకున్న ఆ ప్రాంతాన్ని ఒక ప్రత్యేక వలస ప్రదేశంగా చేశారు. కరువు నివారణకు ప్రధానమైన వ్యవసాయాభివృద్ధి విలువెంతో గ్రహించి, వందలాది చెరువుల్ని వేలాది బావుల్ని త్రవ్వించి గొప్పనీటి వనరులను (రిజర్వాయర్లను) ఏర్పాటు చేశారు, వారు పురాతన ఆనకట్టల్ని బాగుచేయించటమే కాకుండా నూతన ఆనకట్టల్ని నిర్మించారుకూడ. ఆధునిక శాస్త్రయుక్తంగా సర్ ఆర్థర్ కాటన్ వ్యవసాయానుకూలమైన నిర్మాణాల్ని సాధించిన పంథాలోనే వారు వ్యవసాయ ప్రాజెక్టులను శాస్త్రీయంగా అభివృద్ధి చేశారు. అయితే వారందరు కూడ ఒక బ్రహ్మాండమైన పొరపాటు చేశారు. అదే దినదినం పైబడి వస్తున్న ఉత్తరాది మహమ్మదీయుల నిధిలేని వత్తిడిని ఎదుర్కొనేటందుకు వెనుకటి గ్రామ ప్రజాపాలన పద్ధతిలోని కేంద్రీకృత సైనిక క్రమశిక్షణని అలక్ష్యం చేయటం—లేక నిరుత్సాహ పర్చటం. ఒకసారు గ్రామీణ ప్రజా పరిపాలనా జీవితం ఎప్పుడు పతనమైందో అప్పుడే వారి ఘనకార్యాల సాధన పతనమైంది. విజ్ఞానం వట్టిపోయింది. సుస్థిర పునాదులతో నిజంగా నిలబడి వున్న చైతన్య జీవితం నశించింది.

తమ ఆరు శతాబ్దాల పరిపాలనలో, రాజకీయ నాయకత్వంలో, సాంఘిక-ఆర్థిక రంగాలలో ఏ విధంగా ప్రవర్ధమానమయ్యే క్రమబద్ధమైన నిర్మాణ శక్తి ఇమిడి వుందో, ఎంతటి సాహిత్య పిపాసవుందో, లలితకళల మీద ఎంతటి శ్రద్ధ వుందో, ఆధునిక నవనాగరిక రాజ్యాంగంగా మార్చే సత్తా ఎంతటిదో వ్యక్తం చేసుకో గలిగారు. ఆదే సందర్భంలో భూమితో, వ్యవసాయంతో, తద్ధితర రైతాంగ వ్యవహారాలతో, వృత్తి విద్యలతో ఎంతటి నిరంతర సంబంధం ఏర్పరచుకోవాల్నో అంతా పెంచుకున్నారు. తమ సామ్రాజ్యాల పతనానంతరం, అభివృద్ధికరమైన పారంపర్య అనుకరణతో కూడిన, వ్యవసాయ పద్ధతులంతో కొన్ని సారవంతమైన ప్రదేశాలలో, వ్యవసాయం చేసుకునేదానికి తిరిగి తయారుకావటం వారికి అంత కష్టమనిపించలేదు.

ఈ ఆరు శతాబ్దాల పర్యంతరం తమ నాయకులు పల్నాటిలో, దాని యుద్ధ భూమిలో చూపించిన అద్భుత వీరత్వ పంథాలో, రైతాంగ వంశాలు, వివిధ యుద్ధాల్లో తమ వీరుల ప్రత్యేకమైన వీరోచిత పాత్రల్ని స్మరించుకుని, ఆ భక్తి ప్రవత్తుల్ని వీర పూజ ద్వారా వ్యక్తం చేసుకుంటూ వచ్చారు. ఈ వీరపూజ వారిలో, పూర్వుల్లోని ఆత్మ విశ్వాసాన్ని వీరోచిత గుణగణాల్ని జొప్పించగల్గింది. అంతేకాక బ్రాహ్మణుల చేత, పరిపాలకులుగా ప్రత్యేకింపచేయబడిన క్షత్రియుల వలె తమలో గూడ తమ పూర్వుల ధోరణిలో శస్త్రాన్ని బహూకరించింది. ఆ పూజా సాంప్రదాయాలు ఈనాటికీ దక్షిణ భారత రైతాంగంలో ప్రతిబింబిస్తూనే వున్నయ్. అంతేకాదు, ఆ ఆత్మ విశ్వాస అనుకరణ కూడ స్థిరపడి వుంది. ఆనాటి ఆరు శతాబ్దాల దక్షిణ భారత పరిపాలనా సాంప్రదాయాలు ఇప్పటికీ రైతాంగ జనాల్ని పురిగొల్పుతున్నాయి. తిరిగి కోల్పోయిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించుకునేదానికి జరుపవలసిన మరో పోరాటం నిమిత్తం ఆ ఘట్టాలు ప్రోత్సహిస్తున్నాయ్.

## విజయనగర రైతుల తిరుగుబాట్లు:—

ఇటీవల చరిత్రవిచూస్తే నిరంకుశాన్ని వ్యతిరేకించేదానికి రోమన్ ప్లెబియన్స్ ఏవిధంగానైతే బలహీన పడిన రాజ్యాన్నుంచి ప్రజాప్రకోపిత్వాన్ని సమీకరించుకునే వారో, అదేమాదిరి భారత రైతాంగం నిరంకుశాన్ని వ్యతిరేకించే దానికి సాధనగా పెట్టుకున్నట్లు మనకు తెలుస్తుంది. అటువంటి అసంఖ్యాకమైన ఉదాహరణలతో 15వ శతాబ్దిలోని విజయనగర చక్రవర్తుల పరిపాలనలో జరిగిన సంఘటన ఒకటి.

ఒక గ్రామ ప్రతిలందరు కూడ తమ గ్రామాన్ని వదలిపెట్టి ఇతర సామ్రాజ్యంలో వలసదారులుగా నివశిస్తున్నప్పుడు ఒకానొక విజయనగర చక్రవర్తి పదేపదే పాత పన్నుల వ్యవస్థ తొలగిస్తామని, స్థానిక ఉద్యోగుల దుష్ప్రవర్తన ఇక అరికడతామని బకాయిపడిన శిస్తులు చెల్లింపు మినహాయిస్తామని, కాబట్టి తిరిగి గ్రామానికి వెళ్ళ వలసిందని వారికి నచ్చచెప్పేదానికి తన వార్తాహరుల్ని పంపించాడు. ఆ విధంగా గ్రామస్తులు తిరిగి వచ్చినపుడు చక్రవర్తికి-రైతులకు మధ్య కుదిరిన అంగీకార ముసాయిదాను ఒక రాతిమీద చెక్కించి బహిరంగ స్థలంలో పెట్టిన విషయాన్ని ఇప్పటికీ హైద్రాబాద్ సంస్థానంలో రాయచూరు జిల్లాలో చూడవచ్చు. (Third Dynasty of Vijayanagara Venkata Ramana ah 241.)

## గుంటూరు రైతుల తిరుగుబాటు

16వ శతాబ్దపు ఆఖరి దశాబ్దంలో ఒరంగల్ నావాబ్ చేత నియామితుడైన గవర్నర్ రులుంను సవాల్ చేస్తూ భరించరాని పన్నుల విధానాన్ని వ్యతిరేకిస్తూ భరించరాని పన్నుల విధానాన్ని వ్యతిరేకిసూ గుంటూరు జిల్లా రైతాంగం తిరుగుబాటు చేసింది. "నాదిక" గ్రామ కాపురస్తుడైన నల్లమోతు సోమయ్య అనే ఒక ధైర్య సాహసాలు కలిగిన రైతు వీరుని నాయకత్వం క్రింద వారంతా నడిచారు. ఆయన నాగలి సమ్మెను నడిపి రైతులు తమ భూముల్ని దున్నకుండా వుండేటట్లు జేయగలి గాడు. అంతేకాక వరంగల్ నవాబు దగ్గరకు రైతు యాత్రను జయప్రదంగా నడిపించాడు. తత్ఫలితంగా వేయబడిన పన్నులు రద్దయినయ్. స్థానిక గవర్నర్ వెనక్కు వెళ్ళాడు. ఆయన చేసిన ఆ అమోఘ సేవను గుర్తిస్తు రైతులు తమ ఇళ్ళలో జరుపుకునే ప్రతి శుభ కార్యానికీ తొలి గౌరవ తాంబూలం సోమయ్య కుటుంబీకులకు ఇవ్వడానికి నిశ్చయించుకున్నారు.

అల్లా ఉద్దిన్ ధరల నిర్ణయాలకు, మార్కెట్టు నిబంధనలకు చంద్రగుప్త చక్రవర్తి పద్ధతులకు అట్టే తేడా లేదు. ఒకరు పురాతన భారత రాజ్యానికి చెందినా, మరొకరు మధ్యయుగ భారత రాజ్యానికి చెందినా, పై ఇద్దరు కూడా, బస్తీ మార్కెట్లను గురించి ఆలోచించకుండా వుండి తమ అదనపు ధాన్యాల అమ్మకానికి తగిన విలువ ఇచ్చినట్లయితే మార్కెట్లలో ధాన్యాన్ని నిర్ణీత ధరలకు అమ్ముతామని చెప్పే రైతులు ఎవరైతే ఉన్నారో; వారిమీద వత్తిడి తేవడానికి, అభిలషించారు. అదేమాదిరి 17వ శతాబ్దంలో ఇంగ్లండులో కూడ పెనాల్టీల వెడదను కల్పించి వారి

ధాన్యాన్ని దోపిడీ చేసేటందుకు, చెప్పిన నిర్ణీత ధరలకు మించి అమ్మగూడదని, బస్తీ ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులమీద ఒత్తిడి పెట్టే దుర్భర విధానాలే అసలు జరుపబడినయ్. ఇప్పుడిక్కడ కూడ అమలులో ఉన్నయ్అటువంటి దుర్భర విధానాలు ఒకప్పుడు, సర్వాధికారబలాన్ని దుర్వినియోగం చేసి, రైతుల మీద రుద్దారు, రాజులు. కానీ ఇప్పుడు కూడా అమలు జరపటం సహించరాని విషయం. ఈ విధంగా చంద్రగుప్తుని కాలంనుంచిఈనాటి వరకూ ప్రభుత్వాలు బస్తీ ప్రజల కనుకూలంగా పక్షపాతం చూపిస్తూనే వున్నయ్.

అక్బర్ రైతు హక్కుల్ని స్థిరపర్చటానికి వారి హక్కులకు సంబంధించిన భోగట్టాను తయారుచేయటానికి కౌలు ధరల్ని, భూమి శిస్తును నిర్ణయించటానికి, పూనుకున్నాడు. అంతే కాక జాగీర్‌దార్ల హక్కుల్ని కుదించివేయటానికి, చౌకీదార్ల దుష్టశక్తిని అణచివేయటానికి, అలా హెచ్చుమంది రైతులకు చక్రవర్తులతో ప్రత్యక్ష సంబంధాన్ని కల్పించటానికి కూడ పూనుకున్నాడు. ఈ సమస్యలన్నింటి పరిష్కారానికి ప్రముఖ భూమిశిస్తు నిర్ణేత, పాలనాదక్షుడు అయిన ఆర్థిక మంత్రి రాజాతోడరమల్ అక్బరుకు ఎంతో తోడ్పడ్డాడు. ఆ తరువాత వచ్చిన మహమ్మదీయ పాలకులు అనుసరించిన దుర్భర విధానాల ఫలితంగా అక్బరు అమలుపెట్టిన విధానాలు తారుమారైపోయి దినదినానికి రైతులు కృంగిపోయి ఆ తాత్కాలిక విశ్రాంతినుంచి తిరిగి దౌర్భాగ్య స్థితికి దిగజారిపోయారు. వారిలో పెల్లుబికిన నిరుత్సాహంలోనుంచి సాయుధపాణులైన వ్యక్తులు సమీకరించబడిన అనంతరం భయంకర హింసా చర్యలకు దోహదమిచ్చే శక్తి ఉద్భవించింది. ఇప్పటి మన నిరాయుధ పరిస్థితితో పోల్చి చూస్తే అది ఎన్నోరెట్లు మెరుగనిపిస్తున్నట్లు తోస్తుంది. ఔరంగజేబు పరిపాలనలో ఇలాంటి రైతాంగ తిరుగుబాట్లతోనె కాలం గడిచింది. జహంగీర్ షాజహాన్ పరిపాలన కాలంలోకంటే, రైతాంగంమీద అంతులేని పన్నులను విధించి నికృష్ట పద్ధతుల్ని అనుసరించిన ఔరంగజీబ్ పరిపాలన ఏహ్యమైనదనటంలో సందేహంలేదు.

## ఔరంగజీబ్‌మీద రైతాంగ తిరుగుబాట్లు

మొగలాయి వంశీకులలో తుదివాడైన ఔరంగజేబు, హద్దు పద్దులు లేని విధంగా పరిపాలనలో బహిరంగంగా హిందూమత వ్యతిరేక పద్ధతుల్ని అనుసరించే

కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశాడు. అతడు జిజియా (తలపన్ను) విధించటమే కాక యాత్రికులమీద కూడ పన్ను విధించాడు. అంతేకాక మహమ్మదీయేతరుల్ని క్రూరంగా చంపించి ప్రజల్ని భయపెట్టి బలవంతంగా మహమ్మదీయులుగా మార్చటానికి పూనుకున్నాడు. ఈ విధమైన పరిపాలనమీద వారు హిందువులూనీ, సిక్కులూనీ మొత్తంమీద గంగ-సింధు మైదానాలలో నివసిస్తున్న జాట్లు, మహారాష్ట్ర రైతాంగం, రాజపుత్రులు వారి విశ్వాసపాత్రులైన రైతాంగం తిరుగుబాట్లు చేశారు.

అదృష్ట వశాత్తు వారికి నాగరికత-సంస్కృతి కల్గిన బ్రాహ్మణ నాయకత్వ సహకారం లభించింది. పారంపర్య హక్కుతో నిలబడిన క్షత్రియులసైనిక నాయకత్వం తోడైంది. సిక్కుల మతభక్తి, జాట్ల ధైర్య సాహసాలు, మహారాష్ట్రీల విజ్ఞానం, నిర్మాణ కౌశల్యం, యువక రక్తం ఈ మొదలైనవన్నీ కలసి మహా విప్లవానికి మద్దతిచ్చి రైతాంగానికి రక్షణ కల్పించినయ్. ఒక్క జాట్లు తప్ప మిగతావారంతా మత సంబంధమైన, సంస్థాన ప్రభు సంబంధమైన నాయకత్వాన నడుపటానికి ఆమోదించారు. ఒక్క జాట్లు మాత్రమే స్వచ్ఛమైన రైతాంగ నాయకత్వాన్ని వరించారు. అయితే వీరంతాకూడా మధ్యయుగ పంథాని అనుసరించిన ఫలితంగా ఐరోపీయ మత హత్యా కాండకు తుల్యమైన విధంగా పరిస్థితులు పరిణామం చెంది విప్లవం ఆ ధోరణిలో నడచింది.

ఔరంగజేబు అతి తీవ్రంగా, అమితంగా అసభ్యంగా విప్లవాల్ని అణగగొట్టేందుకు, తనకున్న సర్వ శక్తినీ దాదాపు తన హయాంలో సగం కాలమంతా వినియోగించి, వున్న సైనిక బలాన్నంతటినీ ఉపయోగించి, పట్టణాలకు పట్టణాలనే దహిస్తూ దారుణమైన రక్తపాతాన్ని సాగించాడు. కానీ ఆ శ్రమంతా వృథా అయింది. తుదకు అతని మరణ సమయానికి సామ్రాజ్యాన్ని అరాజక, నిరుత్సాహ, నిస్పృహ, నిస్తబ్ధతలలో అట్టిపెట్టి పోయాడు. ఎందుకని?

భారత రైతాంగ జనాలే అందుకు కారణభూతులు. అద్భుతమైన వారి ధైర్య స్థైర్యాలు, అమోఘమైన వారి చిత్త స్థైర్యం అసమాన్యమైన వారి త్యాగాలు అక్కడక్కడ తిరుగుబాట్లకు దోహదం కల్పించి ఆ ఏటికాయేటికి సామ్రాజ్యంలో విస్తృత ప్రదేశాన మహా విప్లవానికి దోహదం కల్పించాయి. ఇంతకు ముందు

డో అప్ లోని జాట్ రైతాంగంగా వున్న సిక్కులు పంజాబ్‌లో జాతీయ శక్తిగా, ఔరంగజేబ్ నిరంకుశ చర్యల ఫలితంగా, విజృంభించి ఒక మహా శక్తిగా పెంపొందారు. వారి సైనిక నిర్మాణ పద్ధతికి, నూతన మత కట్టుబాటుకు ధన్యవాదాలు. మహారాష్ట్ర ఛత్రపతి బిరుదు వహించిన మహారాష్ట్ర మహానాయకుడైన శివాజి నాయకత్వాన, మహారాష్ట్రులు అద్భుతమైన గెరిల్లా యుద్ధాన్ని పశ్చిమ కనుమల్లోనూ, వెలుపలా, మధ్య భారత్‌లో దక్కను పీఠభూమిలో, జరిపి ప్రభుత్వ సైన్యాల్ని వాటి రక్షక దళాల్ని సహితం వత్తిడి పెట్టి, తాము యుద్ధం వలన పొందుతూ వున్న నష్టాల్ని భర్తీ చేసుకునే నిమిత్తం "చౌతు" పన్ను వసూలు చేశారు. అంతటి సుసంఘటితమైన సైనిక బలం, ఉద్రేకోత్సాహాలు కలిగిన సామాన్య ప్రజానీకం, మెరుపు యుద్ధాలు చేయగలిగిన నిప్పు కణాలవంటి నిర్భయ వీరులు ఉండబట్టి, చక్రవర్తి సైన్యాలు, వారి ఆకస్మిక భయంకర దాడుల్ని చూచి అప్పుడప్పుడు గజగజలాడటం కూడా కద్దు. అందుకే ఒక్కొక్కప్పుడు వారినెదుర్కోవటం శత్రువుల కసాధ్యమనిపించేది. మహారాష్ట్రులు భక్తుల మత ప్రబోధంతో ఉత్తేజితులయ్యారు. అంతే కాక భక్తతుకారాం, భక్త రామదాసులవంటి, మహాత్ములు చేసే మత బోధలతో, భజన గీతాలతో చైతన్యవంతులయ్యారు. దీనికి తగినట్టుగా ఔరంగజేబ్ అనుసరించిన మత పాక్షిక విధానాలు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

వారి శారీరక మానసిక శక్తులుకూడ విప్లవయుత చర్యలను ప్రోత్సహించినవి. తమ దుర్భర ఆర్థిక విధానం, తిరుగుబాటుకు దోహదం కల్పించింది. శివాజీ వంటి ఒక మహా నాయకుడు. రామదాస్ వంటి మరో మహా భక్తుడు, వారి నాయకులుగా లభించినపుడు, సుసంఘటిత నిర్మాణాత్మక సంస్థ వున్నపుడు, సమర్థనీయమైన మత సంబంధమైన కారణాలున్నపుడు, హిందువుల సాధారణ కోర్కెల కనుగుణ్యంగా వచ్చిన ఆ మహా విప్లవానికి, వారుతోడ్పడ్డారు. అదే మాదిరి కారణాల వలన మరి కొన్ని తిరుగుబాట్లు, పంజాబ్‌లో శిక్కులచేత రాజ పురానాలో రాజ పుత్రులచేత, దోఆబ్‌లో జాట్లచేత జరుపబడినవి:

## జాట్ల తిరుగుబాట్లు :

ఒక శతాబ్దంపాటు బాహాటంగా జరిగిన అసంఖ్యాక రైతాంగ తిరుగుబాట్లన్నీ గంగామైదానంలో రాజపురానాలో వున్న జాట్ రైతాంగ జనాలచేత జరిగినయ్. ప్రముఖ ఆధారాలతో ఔరంగజేబ్ చరిత్ర (5 భాగం) అనే, యదునాద్ సర్కార్‌చే

వ్రాయబడిన గ్రంథంలో, సైనిక నిర్మాణంలో, నాయకత్వంలో, రాజకీయ ప్రజ్ఞలో, భారత రైతాంగానికున్న శక్తి సామర్థ్యాల్ని ఈ క్రింద కొన్ని పేరాలలో వివరించారు.

16వ శతాబ్దపు ప్రారంభంనుండి మధుర, అలీఘర్ జిల్లాలలోని శ్రామికులు రైతులు జమీందార్లకు తుల్యమైన హోదాల్ని పెంచుకుని షాజహాన్‌కు పన్ను చెల్లించ నిరాకరించారు, 1660 సంవత్సరంలో మాత్రం వారు ఓడించబడ్డారు. [పే. 295]

సిన్‌సానీ కోటకు చెందిన రాజారాం సోగార్ కోటకు చెందిన రామచంద్ర అనే ఇద్దరు నాయకుల అడుగు జాడల్లో తిరిగి వారు 1662వ సం।లో తిరుగబడ్డారు. వీరిద్దరూ "తమ ప్రజల్ని ముఠా సంఘాలుగా ఏర్పాటుచేసి ప్రత్యక్ష యుద్ధం చేయ గలిగిన తరిఫీదు ఇచ్చారు. ప్రతి జాట్ రైతుకూడ కత్తిపట్టటంలో; సాము చేయ టంలో నేర్పరి అయ్యాడు. వారు దళాలుగా మాత్రం విభజించబడి సైనికాధికారులకు వినయ విధేయతలు ప్రదర్శించే విధానాలు నేర్చుకున్నారు. ఎప్పుడు అవసరమొస్తే అప్పుడు యుద్ధానికి సిద్ధమయ్యేట్లుగా, సదా ఆయుధపాణులై వుండేవారు. దట్టమైన అడవుల్లో కాల్పులానికి దుర్భేద్యమైన మట్టి గోడలతో అసంఖ్యాకంగా కోటల్ని నిర్మించుకున్నారు. ఇక అక్కడినుండి రాజ మార్గాలమీదకు అప్పుడప్పుడు మెరుపు దాడులు జరిపేవారు.

ఈ విధంగా రెండేండ్లపాటు రాజారాం బలాన్ని జయించలేక ప్రభుత్వ బలాలు హతమైపోయాయి. తుదకు రాజపుత్రులు-తాము, సంయుక్తంగా ప్రభుత్వ బలాన్ని ఎదుర్కొంటున్న ఒక యుద్ధంలో రాజారాం అకస్మిక దుస్సంఘటన వలన మరణించాడు.

అయితే ఆయన అనుచరులు ప్రభుత్వ బలాన్ని ఒక సంవత్సరం వరకు ముప్పు తిప్పలు పెడుతూనే వచ్చారు. ప్రభుత్వ బలాలచేత సిన్‌సాన్ కోట కూల్చ బడిన అనంతరం, తుట్ట తుదకు "జాట్లు తమ భూభాగంలోని ప్రతి అంగుళాన్ని రక్షించుకునే నిమిత్తం సతమతమై పోరాడి 1500ల మంది వీరుల్ని అందుకు పణంగా పెట్టారు". ఆ తరువాత "ఈ పర్వత ప్రజలు ప్రశాంతమైన వ్యవసాయక పద్ధతుల్ని అవలంభించారు."

వారి తదపరి నాయకుడు "భజ్జా" కుమారుడు, రాజారాం సోదరుడు అయిన "సరామన్" ఈ రాజుకీ భారత్‌పూర్‌ను పరిపాలిస్తున్న వంశాన్ని స్థాపించటంలో

శాయన విజయుడయ్యాడు. అపకాలాల్ని ఉపయోగించుకోవటంలో, సంఘాల్ని స్థాపించటంలో ఆయనకున్న తెలివి తేటలు అద్భుతమైనవి." అతడికి ముందు పరిపాలించిన వారందరికంటే, చురామన్ బలాఢ్యుడేకాక, ధనవంతుడుకూడ. కేవలం తన సైనిక బలాన్ని పెంపొందించటమే కాకుండా ప్రత్యేక కాల్బలాన్ని ఫిరంగి దళాన్ని ఆ బలానికి జోడించాడు. తద్వారా రాజమార్గంలో పోతూవున్న, న్యాయ కాఘామాత్యుల్ని, రాష్ట్రాలనుంచి కేంద్రానికి పోతున్న, ప్రభుత్వ ధనాన్ని, తదితర ప్రభుత్వ సంపదనీ అనేకమార్లు దోచాడు" (పే. 302)

దీని వలన మనకర్థమౌతున్నదేమంటే, ఎడతెగని నిరంతర ఉద్యమాలు రాజకీయ భావాలు కలిగిన రైతాంగం నడిపారనీ, సైనిక నాయకత్వంలోనూ సంఘ స్థాపనలోనూ వారు తగిన సమర్థత కలిగినవారనీ తేలుతుంది. ఈ విధంగా వారు చరిత్రలో ఒక చక్కని స్థానాన్ని సంపాదించి పెట్టారు.

## అధికారానికి దూరమైన రైతాంగం

జాట్లు మహారాష్ట్రులు ఉభయులుకూడా ఒక రాజ్యస్థాపనజేసే విషయంలో, రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకునే విషయంలో తమ అకాంక్షను ప్రదర్శించారు. అంతేగాక, తమ రాజ్యస్థాపన నిమిత్తం లేక తమ సాంఘిక విధాన స్థిరీకరణ నిమిత్తం తమ అభీష్టాన్ని వ్యక్తపరచారు. ఎప్పుడైతే వారు పురాతన మహాభారత కాలంనాటి రాజకీయ విద్యాలయ ఉద్బోధల్ని అనుకరించి వ్యవహరించారో అప్పుడు వారి దృక్పథం రాజరిక వ్యవస్థను అంటిపెట్టుకుని ఉండటం సహజం. అయితే దీనికితోడు వారు ఒక మంత్రి మండలితో పాటు మరొక పెద్దల సలహా సంఘాన్ని కూడ జోడించి ధర్మశాస్త్రం చట్టపూర్వకంగా పరిపాలన జరుగటాన్ని వాంఛించారు. ఆ విధంగా వారు రైతాంగ నాయకత్వంతో, మహారాష్ట్ర - భారత్‌పూర్ సామ్రాజ్యాల్ని సాధించుకున్నారు.

సిక్కులుకూడా సకాలంలో తమ సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. అభినంద నీయుడైన గురుగోవింద సింగ్ విజ్ఞత వలన వారు మరోవిధమైన విప్లవాత్మక ఆయుధాన్ని స్వీకరించారు. వారు తమ మనుష్యులందర్ని సర్వకాల సర్వావస్థల్లోనూ యుద్ధానికి సిద్ధమయ్యే యోధాన యోధ సిపాయీలుగా తరిఫీదు చేసుకున్నారు. అలా సిక్కుజాతి అంతా శాశ్వత సైనిక వృత్తిని స్వీకరించేట్లు చేసుకున్నారు. వారు మహా రాజ్ రంజిత్ సింగ్ అధ్వర్యాన తమ సామ్రాజ్యాన్ని స్థాపించుకుని వాయవ్య మూల నుంచి గంగాతీర ప్రజలమీదకు వచ్చే దండయాత్రల్ని నిలువరించే బ్రహ్మాండమైన ఘనకార్యాల సాధన భారాన్ని స్వీకరించారు. ఈరోజుకు కూడా ఈ ప్రముఖ సైతాంగ జాతి చక్కని క్రమశిక్షణ, జాగృతి, సైనిక తత్వం కలిగినదిగా మన గలుగుతుంది.

ఒక విధంగా ఆ రోజుల్ని ఏవో కొన్ని నూతన రాజ్యాల స్థాపనను గురించి మాత్రమే కలలుగంటూ దైనందిన రాజకీయాల ప్రసక్తిని ప్రజలు మర్చిపోయారు. హక్కుల సాధన నిమిత్తమైన కార్యక్రమమేదీ చేపట్టలేదనుకోవటం పొరపాటు. ఈ దిగువన తలపన్నును గురించి వారుచేసిన ప్రకటన చూడండి:—

"ఈ జిజియా పన్ను న్యాయ విరుద్ధం. పైగా జాతీయ సంపదని కొల్లగొట్టే ఒక సవతి తల్లి ప్రేమభిక్ష. అంతే కాక ఇది ఒక హిందూస్తాన్ చట్టాల్ని ధిక్క రించి వ్యవస్థను తారుమారు జేసేవిధానం. మహాఘనత వహించిన మీ పరిపాలన కాలంలో, అనేకమంది సామ్రాజ్యాన్ని వదిలిపెట్టి పోతున్నారు. ఒకవైపున తల దాచుకునేందుకు స్థానం లేనప్పుడు మీ ప్రత్యక్ష దౌర్జన్య కాండవలన, అస్థిర ఆక్రమణవలన సస్యశ్యామల ప్రదేశాల్ని బంజర్లుగా వదిలేసి ఎక్కడికోపోవలసిన దౌర్భాగ్యం పట్టింది. మీ ఇనుప పాదాల క్రింద పౌరులు నలిగిపోతున్నారు. మీ సామ్రాజ్యంలోని ప్రతి రాష్ట్ర సంపదంతా దోచుకో బడటంవలన వట్టి పోయింది. జనాభా సన్నగిల్లి పోతుంది. కష్టపరంపరలు పెరిగిపోతున్నాయి.

తాను జుమ్మా మసీదు ప్రార్థనలకు వెళ్తున్నప్పుడు, ఢిల్లీలోనూ పరిసర ప్రదేశాల్లోనూ వున్న ప్రజలు చట్టాన్ని ధిక్కరిస్తూ చేసిన పై ప్రకటనతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరుపుకుంటూ ఔరంగజేబ్ వద్దకు వెళ్ళి మార్గ మధ్యంలో కలుసుకున్నపుడు చక్రవర్తి ప్రదర్శకుల్ని సమాధానంగా కాల్చి చంపించాడు. ప్రభుత్వ ఏనుగులపెట్టి గుంపును పిసురెల్ల తొక్కించాడు. ఇదంతా 17వ శతాబ్దపు భారత దేశపు మహా తిరుగుబాటుకు నిదర్శనమైన జాతీయ రాజకీయ తత్వం.

## స్వాతంత్ర్య సమరం

1857-50 సం।రాలమధ్య అన్ని ప్రాంతాల్లోనూ ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం ప్రజ్వరిల్లుతున్న తరుణంలో రైతాంగం సమగ్రమైన వీరోచిత పాత్రను వహించి, చక్కని సైనిక ప్రజ్ఞని చూపి, యుద్ధాల్లో ప్రత్యేక ధైర్య సాహసాల్ని ప్రదర్శించి విజయాల్ని సాధించటమే కాకుండా విపరీతమైన కష్టనష్టాలకు గురి అయ్యారు. కేవలం దేశభక్తితోనే ఆ ఆవేశాన్ని ప్రదర్శించారు. మీరట్ ప్రదేశంలోని రైతాంగం ఆ విప్లవంలో పాల్గొన్న కారణాన ఈ రోజుకుకూడా, ఆనాటి నేరాపరాధం క్రింద విధించబడిన కొన్ని దుర్భర జరిమానాల్ని చెల్లించుకో వలసిన దౌర్భాగ్యంతో కృంగిపోతున్నారు.

ఈ పోరాట సందర్భంలో అసంఖ్యాకమైన రైతాంగం రణరంగంలో తమకు తాముగానే పాల్గొనే నిమిత్తం తయారై తమ భూముల్ని తదితర ఆస్తిపాస్తుల్ని స్థానిక భూస్వాముల భద్రత క్రింద సంరక్షణక్రింద పెట్టే విషయంలో ఏమాత్రం సంకోచించలేదు. ఇంతకుముందు అనేకమంది భూస్వాములు తమకుచేసిన అన్యాయాల్ని సైతం ఆ సందర్భంలో మర్చిపోయి స్వాతంత్ర్య సముపార్జనా పోరాటం నిమిత్తం, అది సమిష్టి బాధ్యతతోకూడిన కార్యక్రమంగా గుర్తించి వారితోకలిసి పోరాడారు. తుట్టతుదకు శత్రువులైన బ్రిటీషువారే జయించినపుడు పాపం వారి భూముల్ని జమీందార్లు అన్యాయంగా ఆక్రమించుకుని తమ స్వంతమైనట్లుగా ప్రక

టించుకుని వారిని భూకామందుల హక్కుకు దూరం చేశారు. తమ స్వంత భూములు అన్యాక్రాంతమైనపుడు, ఇకనూ ఆ యజమానుల దయాదాక్షిణ్యాల పైన ఆధారపడి, కౌలుదార్లుగా బ్రతుకవలసి వచ్చింది. ఇంతటి నికృష్టత్యాగాలకు వారు ఆహుతి కావలసి వచ్చింది, బ్రిటీషువారి సహకారంతో వారి ఆస్తిపాస్తుల్ని తమవిగా ప్రకటించుకుని, రైతాంగానికి ద్రోహం చేసే విషయంలో తాము ఘనకార్యం చేశామని గర్వపడే విషయంలో జమీందార్లు కొంచెమైనా సిగ్గుపడలేదు.

వారి దురదృష్ట వశాత్తు జమీందార్లు ఫ్యూడల్ హద్దుల్ని మించలేక పోయి నందున బ్రిటీషు ఆయుధాల ముందు ఘనీభవించిన జమిందారీ రాయిపిండై పోయింది. అటువంటి దశలో కూడా, యావద్భారత క్షేమం దృష్ట్యా రాజకీయ దృక్పధాన్ని, సాంస్కృతిక సాంప్రదాయాల రీత్యా ఐక్యతను పెంపొందించలేకపోయారు. కాక కనీసం ఇరవైయవ శతాబ్దంలో వచ్చిన సంయుక్త దేశభక్తియుత చైతన్యాన్ని గురించి గానీ ఆలోచించలేకపోయారు. తుదకు ఆ ఆకాంక్షనైనా ప్రదర్శించలేక పోయారు.

వ్యక్తిగతంగా కానీ సమిష్టిగా గానీ భారత రైతాంగం, ఏ మహోన్నత పారంపర్య హక్కుల సంరక్షణ నిమిత్తం బ్రిటీషువారితో యుద్ధం చేయ సిద్ధమయ్యారో గుర్తుంచుకుంటేనేగాని ఆ పోరాటంలో రైతాంగం చేసిన త్యాగాల్ని అర్థం చేసుకోలేం. "ప్రభుత్వాలన్నీ అదృశ్యమైనప్పటికీ వారు తమ కుల లేక సంఘ సభ్యులతో రాజ్యాంగ కార్యకలాపాలు జయప్రదంగా నడిపించుకోగలిగిన స్తోమతతో తమ గ్రామ పరిమలనా సంఘాల్ని నిర్మించుకున్నా" రని ఎలిఫెంట్ స్టాన్ చెప్పినట్లు వారు గ్రామ వృత్తి సంఘాల్లో అలాంటి ప్రధాన సభ్యులుగా ఉన్నారు.

భూములు రైతుల హక్కు భుక్తాలని మొగలాయీలు కూడా గుర్తించినట్లు అక్బరు ఔరంగజేబు వ్యవసాయదారుల వద్ద అవసరానికి డబ్బిచ్చి భూములు కొన్న ఉదంతాలే నిదర్శనంగా వున్నయ్.

అక్బరు ఉత్తరువు ప్రకారం రాజాతోడరమల్ ప్రవేశపెట్టిన రెవిన్యూ సెటిల్‌మెంట్ రైతుల వ్యక్తిత్వాన్ని బట్టి నిర్ణయించబడింది గాని

జమీందార్లనుబట్టి గాని లేక గ్రామ తలమానికల్నిబట్టి గాని జరుగలేదు హోల్ట్ మెకంజీ రైతుల శాశ్వత హక్కుల్ని స్థిరపర్చడంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. "గ్రామ జమిందార్లు.... భూముల్ని దురాగతంగా ఆక్రమించుకున్నవారు .... తమకు బుద్ధి పుట్టినప్పుడు వాటిని రైతులకు అమ్ముకున్నారు; లేదా లాకట్టు పెట్టారు. మామూలుగా చెల్లించవలసిన అద్దెను చెల్లిస్తూ చాలాకాలంపాటు భూముల్ని సాగుచేసుకునే హక్కు పొందివున్నపుడు గానీ లేక ఏవో ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా భూమిని తమ స్వాధీనంలో అట్టిపెట్టుకున్నపుడు గానీ, కొన్ని కొన్ని సందర్భాలలో దిగువ తరగతి వ్యవసాయదార్లకు సైతం వారు లొంగి వుండవలసివచ్చేది. గ్రామ జమీందార్ల భూ కామందు అధికారాన్ని అప్పుడప్పుడు రైతాంగ దౌర్జన్యం సవాల్ చేస్తూ వుండేది. ఎందుకంటే రైతులెప్పుడైనా ప్రవాసానికి వెళ్ళినపుడు లేదా మరింకే కారణాల వలననైనా తమ భూమితో తమకున్న సాన్నిహిత్య సంబంధాన్ని సుదీర్ఘకాలం కోల్పోయినపుడు, తమ తాత ముత్తాతల నుంచీ తమకు దానితో వున్న హక్కు భుక్త సంబంధం, మరొకరి హస్తగతమైనట్లు కనిపిస్తుంటే, తిరిగి స్వాధీనం నిమిత్తం అలాంటి దౌర్జన్యం జరుగటం సహజం" అని ఆతడు పరిశీలించి వ్రాశాడు.

బ్రిటిషువారు దీనినంతా తారుమారు చేయటానికి వచ్చారు. తమ రాజకీయ లక్ష్యాల్ని కాపాడే తొత్తులుగా ఇంగ్లీషు భూస్వాముల ప్రతిబింబాలుగా వారు మన తాలూకాదార్లని గుర్తించారు అయితే ఈ తాలూకాదార్లమీనకూడా ఆధారపడటం సబబు కాదని వారు గుర్తించుకున్నపుడు లోర్డు డల్హౌసి ఈ విధంగా తీర్పిచ్చాడు "ప్రతి గ్రామంలో కూడా భూమి నిజంగా ఎవరి స్వాధీనం క్రింద వుందో వారి పరంగా సెటిల్‌మెంట్ జరుగాలి. అయితే మామూలుగా గానీ లేక పరోక్షంగా గానీ భూమిని స్వాధీనంలో పెట్టుకున్న వారి ఆస్తి హక్కులను గుర్తించకుండా వారిలో వ్యవహారం చేయటం సాధ్యం కాదు."

ఈ విధంగా సంయుక్త రాష్ట్రాల రైతాంగం తమ పారంపర్య హక్కుల సంక్రమణలో, స్వాధీనాలతో తిరిగి కలుసుకుంటున్నపుడు భూ కామందుల పెత్తనం రాజకీయ వ్యవస్థను స్థిరీకరిస్తుంది అనే విశ్వాసం బ్రిటీషువారు తొలగించుకుంటున్నారు. రైతాంగమిత్రుడు కానటువంటిలార్డుకానింగ్ సైతంఆవిషయాన్ని ఇలాఆమోదించాల్సి వచ్చింది. "న్యాయానికి ఈనాడు తాలూకాదార్ల దగ్గరనుంచి గుంజబడుతున్న గ్రామాలు నీగా భూములుగానీ వీరుఒకప్పుడు అక్రమంగాదౌర్జన్యంగాసంక్రమింపచేసుకున్నట్టివే"

సహజంగా బ్రిటీషువారు సంయుక్త రాష్ట్రాల రైతుల కృతజ్ఞత వుంటుందని ఊహించారు. ఒకప్పుడు తాలూకాదార్లచేత బలవంతంగా గుంజుకోబడిన భూముల్ని తిరిగి రైతులకు సంక్రమించేటట్లు చేయటం వలన జాతీయతకు రైతాంగం వెన్ను

క్షోభ పొందిచి. తమ మాతవ పరిపాలనా విధానాన్ని శిరసావహించి, తమ పక్షంగా ఉంటారని ఆశించారు.

"మొట్టమొదట అయోధ్య ప్రాంతంలో విప్లవ బీజాలు మొలకలెత్తినప్పుడు బ్రిటీషు ప్రభుత్వంచేత మన్ననలు పొందిన గ్రామీణ రైతాంగానికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థని తారుమారు చేయగలిగిన శక్తిసామర్థ్యాలు గల భూస్వాముల్ని తోసిరాజనిపించే వారి వంశపారంపర్య హక్కు ప్రకారంగా భూమి సంక్రమింపేటట్లు చేశాం కాబట్టి, వారి క్షేమమే మనకు ముఖ్యమని భావించాం కాబట్టి, వారు ఈ సందర్భంలో ప్రభుత్వానికి అండగా ఉంటారని ఊహించటం జరిగింది. అయితే అనుకున్నట్లు మాత్రం జరుగలేదనే చెప్పాలి. తనకంత సహాయపడిన ప్రభుత్వానికి ఏ ఒక రైతు విశ్వాసపాత్రుడుగా వుండే ధైర్యాన్ని ప్రదర్శించలేకపోయినట్లు నాకు అందిన సమాచారాన్ని బట్టి అర్థమౌతుంది." అని లార్డుకానింగ్ 1858లో పరిశీలించి వ్రాశాడు.

మరోవైపున రైతాంగం ఆ స్వాతంత్ర్య యుద్ధాన్ని సమిష్టి బాధ్యతగా స్వీకరించారు. "మనకు వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తులను సంబంధించిన ఆస్తిపాస్తుల్ని అనుభూతులైన వారికి యోగ్యత కలిగినవారికి బహూకరించేటందుకు, ఇంకా మరికొన్ని ఇతర కారణాలవలన, భారీపెత్తున స్వాధీనం చేసుకోవాల్సివుంది." అని బ్రిటీషు వారు సహజంగా నిర్ణయించుకున్నారు. "అయోధ్య ప్రజలకు గవర్నర్ జనరల్ జారీ చేసే ఉత్తరువు ఏమంటే, రాష్ట్రంలోని భూఖండాలమీద వ్యక్తులకున్న హక్కుని బ్రిటీషు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తదుపరి దానికి ఉచితమనుకున్న రీతిని అది వ్యవహరించగలదు."

ఫలితం ఏమంటే రైతాంగవర్గం అణగారిపోయింది. దీన్మాదాన్ని దొంగలు అయిన తాలూకాదార్లు తలలెత్తారు. ఒక సంవత్సరం గడువున తిరిగొచ్చే లోపల హక్కులు గుంజుకోబడినయ్. లేదా, కుదించబడినయ్. రైతు పూర్తిగా తాలూకా దార్ల పెత్తనం క్రింద మగ్గవలసి వచ్చింది, అంతేగాక అన్ని విధాలైన బాధ్యతలకు, గాడిద చాకిరీకి దోపిడీకి గురికావలసి వచ్చింది."

ఆ ప్రథమ ప్రపంచ సంగ్రామంలో తాలూకాదార్లతో కలిసి సమిష్టి బాధ్యతను నిర్వహించినందుకు ఇంత దారుణమూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చింది రైతాంగం, అదే మాదిరి బ్రిటీషు వారికి వ్యతిరేకంగా నడిపిన తిరుగుబాటులో ఏ మాత్రం విశ్వాసంలేని తాలూకాదారులు పరాయి ప్రభుత్వానికి అడుగులకు మడుగులొత్తే తొత్తులుగా

పయారయ్యారు, స్వాతంత్ర్యానంతరం యు.ఎస్.ఎ.లో "క్రాంవెల్ యొమెన్స్" విప్లవం వచ్చిన తరువాత ఇంగ్లాండులో జరిగిన సంఘటనతో, 1917 రష్యా విప్లవం, 1920-21 నేటి విప్లవం అనంతరం యు.యస్.యస్.ఆర్.లో జరిగిన సంఘటనలతో పోల్చి చూస్తే ఇది దుర్భరంగా గోచరించడంలేదా? ఎప్పుడైనా ఎక్కడైనా సరే రైతాంగం ఏ విప్లవంలోనైనా తమ స్వంత నాయకత్వం లేకుండా, ఆశయస్థిరత్వం లేకుండా రాజకీయ లక్ష్యాలు స్థిరపర్చుకోకుండా, ఇతర వర్గ నాయకత్వాన్ని విశ్వసించినప్పుడు విప్లవానంతర సత్ఫలితాల్ని పొందే విషయంలో సంపూర్ణంగా మోసం చేయబడ్డారు లేదా విప్లవ విఫలమైతే నీచమైన నేరస్థులకంటే హీనంగా చూడబడ్డారు.

## సంతాలుల విప్లవం

తరువాత 1855-73 మధ్య కాలంలో సంతాల్‌లో, బెంగాల్‌లో తిరుగుబాట్లు వచ్చాయి. ఈ మాట కేవలం బ్రిటీషువారిమీదనే కాదు; అనేక తరాలనుంచి పొడుపర్యంతాలను అనుభవిస్తూ, తమ స్వంత శ్రమతో భూమి సాగుచేసుకుంటున్న రైతుల్ని అన్యాయం జేసి మోసంజేసి భూమిమీద ఊహించరాని అధికారాలతో పెత్తనం చెలాయిస్తున్న జమీందారులమీద, బాకీలు ఇవ్వడంలోను రైతుల్ని దగా చేస్తున్న షావుకార్లమీద, అధికారాల్ని పొంది నానావిధాల హింసిస్తున్న పెట్టుబడిదార్ల మీద, పోలీసు అందరికీ మీద తీస్తూ నిరంకుశంగా ప్రవర్తిస్తున్న తదితర ఉద్యోగులమీద కూడా ఈ తిరుగుబాట్లు నడిచాయి. తమ పూర్వులు సంపాదించిపెట్టిన ఇల్లు వాకిలి పొలము పుట్రా చెట్టు చేమ యావత్తూ కూడా దుర్భరమైన బాకీలు చెల్లించలేదు, పన్నులు కట్టలేదు అనే తరం క్రింద, వదలిపెట్టి దిక్కులేని పక్షులలాగా తిరగవలసి వస్తుందని వారెన్నడూ ఊహించుకోలేదు; కానీ అది జరిగింది.

సుసంఘటితులు కాకపోయినా, ఆత్మ గౌరవం స్వాభిమానం కలిగిన భారత రైతు శ్రమ ఫలాల్ని ఇతరులు హరించేదానికి, ఆస్తి స్వాధీనపర్చుకునేదానికి పచ్చపచ్చగా పెరిగి కళకళలాడుతున్న పైర్లని ధ్వంసంచేసుకునేదానికి బ్రిటీషు ప్రభుత్వం జమీందార్లకిచ్చిన అధికారాలకు ఏనాడూ బుద్ధిపూర్వకంగా, తన స్వచ్ఛందంగా అంగీకరించేదానికి సిద్ధంగా లేదు; కానీ ఆనాడు అదంతా బలవంతాన జరుగుతూనే వుంది. కాబట్టి బ్రిటీషు ప్రభుత్వం తన సన్నిహితులైన జమీందార్ల పెట్టుబడిదార్లద్వారా తమమీద జరుగుతున్న అన్యాయ-అక్రమ-అవినీతి శక్తుల విధానాలపై తిరుగుబాట్లు చేశారు.

"ప్రత్యేకంగా పాట్నా జిల్లాలో తప్పుడు కొలతల్ని విరోధించేదానికి, అక్రమ పన్నుల్ని అరికట్టేదానికి, అన్యాయపు కౌళ్ళను చెరించే దానికి అనుకూలంగా చేయబడిన

ఉత్తరువుల్ని తొలగించుకునేదానికి ప్రత్యేకంగా రైతాంగం తమకు తామే ఒక చక్కని సంఘాన్ని స్థాపించుకున్నారు" "తమకు న్యాయమనితోచినదానికి మించి చెల్లించ వలసిన అవసరం లేదనే ఆశయంతో పూర్వ బెంగాల్ రైతులు సమీకరించబడ్డారు."

వ్యాపారస్తుల కుతంత్రాల్ని, ఉద్యోగస్తుల జులుంని అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించే నిమిత్తం ప్రత్యేకంగా భగవంతుని ఆశీర్వాదాలు పొందామని చెప్పుకునే ఇద్దరు సోదరుల నాయకత్వం లభించింది సంతాల్ ప్రజలకు వీరిద్దరికీ సహకారంగా 25000 మంది సంతాలులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. వారికి అలవాటులో వున్న విల్లు అంబులు, గొడ్డళ్లు, కత్తులు ఆయుధాలుగా ధరించి; అక్కడి నుంచి తమను దోపిడీదార్ల నుంచి రక్షించమని గవర్నర్ కు నివేదించుకునేనిమిత్తం కలకత్తాకు కాలినడకనబయలుదేరారు. కానీ ఒక ప్రభుత్వోద్యోగి వారిని ముందుకు సాగకుండా 7-7-1855 దేదీన మార్గమధ్యంలో నిరోధించి హింసాచర్యలకు వారు పూనుకునేట్లు రెచ్చగొట్టాడు. ఇలా బ్రిటీషువారి చేతుల్లో నిర్దాక్షిణ్యంగా ఊచకోతకు ఆహుతి అయిపోయినవారి తిరుగుబాటు ప్రారంభమైంది నిరపరాధుల్ని త్వరత్వరగా రెచ్చగొట్టి తొట్టతొలుత చెయ్యిచేసుకున్న బ్రిటీషు ఉద్యోగులు కొందరు "అది యుద్ధం కాదు; బలిస్వీకారం. అడవిలో వున్న ఏ గ్రామం నుంచైనా పొగ వస్తున్నట్లు కనిపిస్తే మేం తక్షణం అక్కడికి వెళ్లేటందుకు ఉత్తరువులు మా కివ్వబడినయ్. స్థానిక మాజిస్ట్రేట్ కూడా మాతో వస్తుండేవాడు. నేను నా సిపాయిలతో గ్రామాల్ని చుట్టముట్టేవాడిని. మాజిస్ట్రేట్ తిరుగుబాటుదార్లని లొంగిపోవలసిందిగా హెచ్చరించేవాడు" అని ఆమోదించారు. అంతటి అన్యాయ అక్రమాలతో కూడిన ఉత్తరువుకు సంతాలులకు జవాబు ఒకటే ఒకటి వుండేది. అదే ఎదురుతిరగటం అంతటితో కాల్పులు సాగించి పట్టపగలు అమాయక-అభాగ్యుల రక్తాన్ని కండ్లచూచేవారు ఉద్యోగులు.

సంతాలులు తమకున్న ప్రత్యేక సైనికశిక్షణతో ధైర్యసాహసాలతో బ్రిటీషు తుపాకీగుండ్ల పరంపరల్ని నిశ్చలంగా, నిర్భయంగా నిలుచున్న పాటిగానే ఎదుర్కొనేవారు. పాపం ఆ తిరుగుబాట్లన్నీ ఔరంగజేబు అనుసరించిన నికృష్ట పద్ధతులతో ఛాకపోయినా, అందుకేమీ తీసిపోని క్రూరత్వాన్ని, ప్రదర్శించినందున అణగిపోయినయ్.

స్వాతంత్ర్య యుద్ధానికి తీరని ద్రోహంచేసిన బెంగాల్ జమీందార్లమీద ఎంత మక్కువ ప్రభుత్వానికివున్నా రైతులకు లొంగి, భూస్వామ్య దోపిడీని అరికట్టి రైతులు పోగొట్టుకున్న భూహక్కును కలించే నిమిత్తం తిరిగి బెంగాల్ టెనెన్సీయాక్టు ప్రవేశపెట్టక తప్పిందికాదు.

## మహారాష్ట్ర రైతాంగ చైతన్యం :

ఒకే తరంలో అలాటి సాధక బాధకాలతో వతమతమౌతున్న మహారాష్ట్ర రైతాంగం పెట్టుబడిదార్ల దోపిడీ మీదకు తిరుగబడ్డారు. ఏపెట్టుబడిదారుడైనా నిర్దాక్షిణ్యంగా తమకు అప్పుపడిన రైతుని కోర్టుకీడ్చి జైలుకు పంపేదానికి అధికారాన్ని సంక్రమింపజేసిన నూతన చట్టానికి ఏ మాత్రం విధేయత చూపలేవు రైతులు. ఆ విధంగా వారు తిరుగబడి, పెట్టుబడిదార్ల ఇళ్ళు తగులబెట్టి వారి ఇతర సొత్తునంతా నాశనంచేసి దిట్టమైన పెట్టుబడి దోపిడీదార్లను చంపటమేకాక, వారికి మద్దతిస్తున్న ప్రభుత్వ దోపిడీ ఉద్యోగస్తుల్ని సైతం హతమార్చారు.

## 1871-75 బొంబాయి రైతాంగ తిరుగుబాట్లు :

ఈ తిరుగుబాట్లు చక్కని వ్యూహ ప్రణాళికతో జరుగలేదు సరికదా అవి రాష్ట్ర వ్యాప్తంగానైనా జరుగలేదు. ఖైరా, అహమ్మద్ నగర్, పూనా మొదలైన జిల్లాల్లో ఒకదానికొకటి సంబంధంలేకుండా చెదురుచెదురుగా ఈ తిరుగుబాట్లు సంభవించినయ్. రైతులు తమ లక్ష్యాన్ని ప్రభుత్వం పైపే కాకుండా కేవలం పెట్టుబడిదార్ల మీదనే కేంద్రీకరించారు. ఒక్కొక్కప్పుడు గ్రామాలకు గ్రామాలే తిరుగబడినప్పుడు కూడా కేవలం ఒక్క మార్వాడీ పెట్టుబడిదార్ల మీద తప్ప తదితరుల మీద దృష్టి పెట్టుకోలేరు. సాధారణంగా "ఈ తిరుగుబాటుదార్ల అభిప్రాయం, తమమీద అప్పుదార్లు పొందున్న డిక్రీల్ని, తమను బంధించిన బాండ్లను తగులబెట్టటం, ప్రధానంగా పెట్టుకున్నారు. ఎప్పుడైనా తిరుగుబాటుదార్లకు ఇవి గనుక ప్రశాంతంగా పెట్టుబడిదార్లు అప్పగించివట్లయితే, ఇక తరువాత ఏమీ జరిగేది కాదు. అలాగాక పెట్టుబడిదారు అవియివ్వ నిరాకరించిన పక్షంలో లేక తలుపులు రక్షణ కోసరం వేసుకున్నపుడు ఆ కాగితాలు తమకు స్వాధీనం చేసే నిమిత్తం అతడ్ని భయపెట్టే దౌర్జన్యం జరిగేది."

తిరిగి బ్రిటీషు పెనుభూతం పైబడి వచ్చిన వారిని అణగగొట్టేది. అయినప్పటికి వారి కష్టాల్ని తొలగించటంలో కొంతలో కొంతైనా శ్రద్ధ తీసుకోక తప్పేది కాదు. దక్కను వ్యవసాయదార్ల విముక్తి చట్టం చేసేంత వరకూ అందులో మహారాష్ట్ర రైతాంగాన్ని పన్నులు చెల్లించలేని పరిస్థితిలో, నిర్బంధించకూడదనే ఒక మినహాయింపు సివిల్ ప్రొసీజర్ కోడ్‌తో సంబంధంలేకుండా చేసేంతవరకు ఆ ఉద్యమాలు సాగినయ్. అది ఆ పరిస్థితుల్లో ఒక చక్కని ఉసులుబాటే !

## పంజాబ్ అసంతృప్తి :

బాకీలు యివ్వలేక పోయిన నెపంతో బస్తీపెట్టుబడి దార్లకు భూముల్ని భుక్తం చేసే కార్యక్రమం ఆలాగే సాగిపోయే పక్షంలో తిరుగుబాటు చేస్తామని పంజాబ్ రైతాంగం కూడా బెదరిస్తూ ఆందోళన ప్రారంభించింది. అందుకని బెంగాల్-మహారాష్ట్ర తిరుగుబాట్లను అతికష్టంగా ఎదుర్కొన్న తరువాత, ఆ అనుభవాలు పొందిన బ్రిటీషు ప్రభుత్వం యుద్ధపిపాస నైపుణ్యత కలిగిన సిక్కులతో కోరి శాశ్వత విరోధం పెట్టుకునే దానికి సిద్ధంగాలేదు. మరో విప్లవం పంజాబ్‌లో కూడా రాకుండా తీసుకోదగు తక్షణ చర్యలు పరిష్కార మార్గాలేమిటో ఆలోచించ మొదలు పెట్టింది. వ్యవసాయధారులు కాని వారికి భూములు సంక్రమించకూండా వుండేటందుకు పంజాబ్ లాండ్ ఎలియినేషన్ చట్టాన్ని అమలులోనికి తేవటానికి తహతహలాడింది.

## దక్షిణ ఇండియాలో ఆందోళన :

అదే మాదిరి కృష్ణా గోదావరి డెల్టా రైతాంగం, కర్నాటక- రాయలసీమ రైతాంగం 19వ శతాబ్దిప్రారంభం నుంచి అనేక మార్లు ఆకాశమంటుతున్న భూశిస్తు విధానానికి నిరసనగా, తహసీలవారీ పన్నులు వసూలుచేసే పద్ధతికి విరుద్ధంగా, తిరుగుబాట్లు జరిపారు. మద్రాసు టార్చర్సు యాక్టుకు భిన్నంగా జి లక్ష్మీనర్సు చెట్టిగారు ఒక చక్కని రాజ్యాంగయుతమైన ఆందోళనని లేవదీశారు. ఫలితంగా దాన్ని మూలనబెట్టించాడు. తద్వారా దక్షిణ భారత రైతాంగాన్ని పన్నులు చెల్లించలేకున్నందుకు అంతులేకుండా నిర్దాక్షిణ్యంగా పెట్టే బాధల నుంచి విముక్తి కలిగించాడు. దక్షిణ భారత రైతాంగం తమ పూజ్యుల సత్యాగ్రహ పంథాని భూముల్ని గ్రామాల్ని వదిలిపెట్టటం ద్వారా పునరుద్ధరించారు. (1936లో 'ప్రో హా' రైతులు ఆ పద్ధతిని అనుసరించికొద్ది పాటి విజయాన్ని సాధించారు) అవసరమనుకుంటే వారు పరిసర సంస్థానాలకు గానీ బ్రిటీషుజిల్లాలకుగానీ లేచిపోయేవారు రైతాంగంలోవున్న గొప్ప ఐక్యత వలన గానీ లేక అనాటి కృంగదీసే పన్నులభారం వలన గానీ వారి ఇళ్ళనుగాని వారి భూముల్నిగాని ఇతరులు ఎవ్వరూ కూడ ఆక్రమించుకోవటం తెలివి తక్కువనిపించేది. తుదకు ప్రభుత్వమే దిగివచ్చి పన్నులభారం తగ్గించే హామీనిచ్చి, ఒడంబడికలు కుదుర్చుకుని ఆతరువాత గ్రామాలకు ఆహ్వానించి భూములలో తిరిగి ప్రవేశించే ఏర్పాట్లకు బాధ్యత తీసుకోవలసి వచ్చేది.

## భారత జాతీయ కాంగ్రెస్ పాత్ర:

20 వ శతాబ్ది ప్రారంభంలో భారత జాతీయ కాంగ్రెస్ అణగారి పోయిన రైతాంగాశయాలకు ప్రాతినిధ్యం పుచ్చుకుంది. సమిష్టి సమస్య అయిన భారత-జాతీయ స్వాతంత్ర్య సముపార్జన సామ్రాజ్య వ్యతిరేక ధోరణితోపాటు, అది ప్రతిపోరాటంలోనికి రాజకీయ ప్రాముఖ్యతను ప్రవేశపెట్టి, నూతన పెట్టుబడిదార్లు నెత్తినరుద్దే యాంత్రిక ధోరణికి విరుద్ధంగా రైతాంగం చేయవలసిన ఆందోళనకు నాయకత్వం స్వీకరించింది. జాతీయత వారి 'దైవమో'గా ఆర్థిక వత్తిడి వారి 'ప్రొపెల్లర్సు'గా, వికృష్ణ కూలి పద్ధతికి విరుద్ధంగా ఇండియాలోనూ, బ్రిటీషు సామ్రాజ్యంలోనూ వున్న ఐరోపీయ తోట యజమానుల దోపిడీకి నిరసనగా దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపించింది. ఆ రాజకీయ చైతన్యత, సంఘబలం. ఇవి రెండూ, ఆర్థిక ఇక్కట్లులకు జోడించబడినందున భారత రైతాంగానికి భావిభాగ్యోదయ విజయ కిరణాలు సోకుతున్నాయి. తోటల కూలీలకు 'ఇండెంచర్' విధానం రద్దయింది. కొంత లాభం కలిగింది. గత శతాబ్దం ప్రస్తుత శతాబ్దంలో కూడ మలబారులో అనేక ఉద్యమాలు నడిచినయ్ అవి కుల తిరుగుబాట్లుగా పొరపాటుగా భావించటం జరిగింది. స్థానిక భూస్వాముల ఎదురులేని దోపిడీ క్రింద పీల్చిపిప్పి చేయబడిన వారి ఆర్థిక రాజకీయ విధానాలు అందుకు మూల కారణాలుగాని మరొకటి కాదు. కుల నాయకులకు ఈ ప్రధాన విషయాన్ని స్వార్థానికి ఉపయోగించుకునే ఒక తత్వం అక్కడ గ్రహించ వుండకపోలేదు 'మోప్లా' (ముస్లిం) రైతులు చేసిన త్యాగాలకు ధన్యవాదాలు. ఎందుకంటే మద్రాసు ప్రభుత్వం విధిలేక "మలబార్ టెనెన్సీయాక్టు" అమలు జరుపవలసి వచ్చింది, రైతాంగలోని అధిక సంఖ్యాకుల శాశ్వత కౌలు హక్కుల్ని ఇది కాపాడిందనటంలో ఏ మాత్రం సందేహంలేదు.

## రైతాంగ సత్యాగ్రహం-గాంధీజీ :

1916వ సంవత్సరంలో భారత రాజకీయ-ఆర్థిక వేదికమీదకు మహాత్మాగాంధీ రావటంతో రైతాంగ పోరాటాల్లోకి సుస్పష్టమైన ఒక సరిక్రొత్త రాజకీయ విప్లవ తత్వం చొచ్చుకుని వచ్చింది. బీహార్ లోని చంప్రాన్ రైతాంగానికి గుజరాత్ లోని ఖైరా కృషీవలులకు వారు బాహాటంగా, చక్కగా, అహింసాత్మకంగా, సజీవ రాజకీయ ధోరణితో., నీలితోటల యజమానులు, పన్ను వసూలు చేసే బృందం చూపే అన్యాయం మీద తిరుగుబాటు చేస్తూ నడిపే పోరాటాలకు ఆయన సత్యాగ్రహం అనే నూతన ఆయుధానికి వున్న శక్తిని జోడించి ఆ పోరాటాల ప్రాశస్త్యాన్ని నిలబెట్టాడు. ఆయన మొట్టమొదటగా రైతుల సాధక బాధకాలకు సంబంధించిన ప్రముఖ కారణాల గురించిన భోగట్టా సేకరించే పద్ధతిని ప్రారంభించి, తరువాత వాటిని క్రమ పద్ధతిలో పెట్టి తక్షణ అత్యవసర కోర్కెల్ని-సమస్యల్ని అర్థం చేసుకునటట్లుగానే కాక, అంత

ర్గత స్వయంపోషకత్వం-ఆర్థిక సంబంధమైన సంకటం, ఒకవేళ అధికార్ల దృక్పథాన్ని మార్చే పోరాటం సుదీర్ఘమైనట్లయితే, దుర్భరమైన జైలు శిక్షలు అనుభవించవలసి వస్తే ఇంకా ఇతరవిధాలైన సామ్రాజ్యవాద దుష్టశక్తుల్ని ఎదుర్కోవలసివస్తే-తమ కాళ్ళమీద తాము నిలబడగలిగిన స్తోమత నిమిత్తం, అలాంటి తర్ఫీదు ఇచ్చాడు. తక్షణం పరిష్కృతం కావలసిన అత్యవసర కనీస కోర్కెల్ని తీర్చి సంతృప్తిపర్చ వలసిన విషయం ఎదైనా వుంటే దాన్ని, రైతులకు ఆయన "ధర్మమని" లేక "సాంఘిక న్యాయ"మని ఉద్బోధించాడు. అధికార్లు ఈ 'ధర్మ' రీత్యా తమ పవిత్ర కనీస కోర్కెల్ని తీర్చటానికిగాను వారిని రైతులు ఒత్తిడి పెట్టేందుకు ఇది తోడ్పడింది. ధర్మబద్ధంగా నిర్వచించబడిన ఈ ఉత్సాహపూరితమైన ప్రబోధం వారి అన్యాయ ఆక్రమాలమీద తిరుకబడేటందుకు, అలా తమ కష్టాల్ని తగ్గించుకునేందుకు వారు వెనుకటినుంచీ అనుసరిస్తున్న హింసాత్మక పోరాట పంథాలను తొలగించేటందుకు రైతులకు ఇదొక మందుగా ఉపయోగపడింది. తమ లక్ష్యం ఎడల చిత్తశుద్ధి కలిగి నిర్భయంగా నిర్మాగమాటంగా శత్రువుల్ని ఎదుర్కొంటూ రైతులు 'ధర్మ' సంరక్షకులుగా ముందుకుపోయేందుకు, ధర్మరీత్యా తమ అధికారాన్ని, విధిని., వ్యతిరేకులు ఏ విధంగా వ్యవహారంలో అమలుపెట్టవలసివుందో తెలియజేశారు. తమకు తాము సహాయపడటం వలన బూర్జువా తరగతి ఎలా పరోక్షంగా సమాజానికి సహాయపడుతుందని క్వాలిన్ బుజువు చేస్తున్నాడో, దేం చారిత్రక సత్యాల ననుసరించి ధనికవాదులకు తామే వారసులమని వాదించే కార్మిక ప్రదర్శనలలో నూతన శక్తిని ఏ విధంగానైతే మార్క్స్ కలిగించాడో, అదేమాదిరి మహాత్మాగాంధి వలన ప్రజలతోపాటు రైతులు కూడా పవిత్రమైన సత్యాగ్రహ బృందం ద్వారా తమ ధర్మాన్ని సంరక్షించుకునే నిమిత్తం తమ శత్రువులు సైతం ధర్మానికి కట్టుబడితే, తద్వారా మానవత్వాన్ని, అన్యాయాల నుంచి ఉద్ధరించే నిమిత్తం ఈ పద్ధతిని సాధనగా పెట్టాడు.

## బార్డోలీ సత్యాగ్రహం :

మహాత్మాగాంధి ఆశీర్వాదాలందుకున్న ఆయన ప్రముఖ రైతు శిష్యుడైన సర్దార్ వల్లభాయిపటేల్, ప్రభుత్వం పన్నులు అభివృద్ధిచేసే పునఃపరిశీలనా విధానానికి వ్యతిరేకంగా బార్డోలీ రైతాంగాన్ని సమీకరించి పోరాటం నడిపించారు ఆయన చైతన్యపూరితమైన పర్యవేక్షణక్రింద రైతులు తమ చేతుల్లో బిడ్డల మాదిరి పెంచి పోషించిన పశువులు పోతున్నా, తరతరాలనాటి భూములు ధ్వంసం చేసుకుంటున్నా తుదకు గ్రామాల్ని వదలకోవాల్సివచ్చినా, ఇంకా ఆదితరమైన ఎన్ని కష్టనష్టాలు సంభవించినా అమిత ధైర్యసాహసాల్ని ప్రదర్శించి ఎదుర్కొని నిలబడ్డారు. తుదకు వారు ప్రభుత్వాన్ని లొంగదీశారు, ఇదంతా కూడ 1929 సంవత్సరంలో జరిగింది.

తిరిగి 1930 వ సంవత్సరంలో జాతీయ స్వాతంత్ర్య సముపార్జన నిమిత్తం సామ్రాజ్యవాదాన్ని సవాల్ చేస్తూ మహాత్మాగాంధి పోరాట పిలుపునిచ్చినపుడు బార్డోలీ రైతాంగం ఒక్కుమ్మడిగా పన్నులు చెల్లించ నిరాకరించారు. భూముల్ని వేలం వేస్తున్నా లెక్కచేయలేదు.

తమ భూములకు సంబంధించిన అన్నివిధాలైన నష్టాల్ని భరించారు. తుదకు ప్రభుత్వంతో ఎలాంటి రాజీ బేరానికీ ఒప్పుకోలేదు. అదంతా కూడ సర్దార్ నాయకత్వాన నడిపించబడిన రాజకీయ తిరుగుబాటులోని అద్భుతసామర్థ్య ఫలితం. 1937 - 39 లో కాంగ్రెస్ దేశామంతా మంత్రి వర్గాల్ని స్వీకరించినపుడు రైతాంగ నమ్మినబంటు అయిన సర్దార్‌పటేల్, ప్రభుత్వంచేత ఆక్రమించుకోబడిన భూముల్ని తిరిగి వారికిసంక్రమించేటట్లు చేశాడు.

విశాఖ విప్లవంలో రాజు నాయకత్వం :

విశాఖపట్టణం జిల్లా ఆటవిక జాతులవారు, శ్రీసీతారామరాజు విశిష్ట విప్లవ పూరిత నాయకత్వ తోడ్పాటుతో బ్రిటీషు సామ్రాజ్యం మీద రెండేళ్ళు యుద్ధాన్ని సాగించారు యుద్ధ నైపుణ్యతకు సహజాను కూలంగావున్న పర్వతాల్లో — లోయల్లో — చొరరానికనుమల్లో, సంచరిస్తూ సంపాదించిన అనుభవాలతో వారు తమ సైనిక శక్తిని కావాల్సినంతగా కేంద్రీకరించుకున్నారు. అంతేకాదు. వారు ఒక విధంగా హింసను ద్వేషించేవారే! కానీ, సాంప్రదాయంగా వాడుకలో వున్న ఆయుధాల్ని సద్వినియోగం చేసుకున్నారు. కానీ, విచిత్రమేమంటే, హస్తగతమైన శత్రువుల్ని హిందూ ధర్మ శాస్త్ర రీత్యా, క్షమాభిక్షకోరితే వదలివేయటం పరిపాటి కాబట్టి అలా వదలివేసినందువలన వారి రహస్యగృహాలు, నిర్మాణ పద్ధతులు శత్రువులకు సులభంగా తెలిసిపోయినవి.

వారు దేనికోసరం పోరాడారు? మొట్టమొదట అడవిలో సాగులాయకి భూముల్ని ఉచితంగా సాగుచేసుకోనివ్వాలని, ఫలితాన్ని స్వేచ్ఛగా అనుభవించుకోనివ్వాలనీ కోరారు. క్రమేణ వారి లక్ష్యం, సంపూర్ణభారత స్వాతంత్ర్య సముపార్జన కాకపోయినప్పటికీ, ఏజన్సీ ప్రాంతానికంతటికీ, స్వాతంత్ర్యం కావాలనేంత వరకైనా పరిమితమైంది.

1920 - 22 సహాయ నిరాకరణోద్యమానంతరం, ఒక సంవత్సరంపాటు, మహా ఉధృతంగా నడిచిన వారి ఉద్యమం ముగిసింది. భారతజాతీయ తత్వంతో ప్రతీఘాత చర్యలు జరిపిన ఫలితంగా తగిలిన గాయాల నుంచి అప్పుడే దేశం కోలుకుంటుంది. బ్రిటీషు ప్రభుత్వం ఆ ఆటవిక ప్రజల విషయంలో అమిత క్రూరంగా ప్రవర్తించింది. తన కందుబాటులో వున్న సమస్త ఆధునిక ఆయుధాలన్నింటినీ, కోయల మీద, సవరల మీద ప్రయోగించి వేలాది అమాయకుల్ని తన పొట్టన బెట్టుకుంది.

వారి ప్రేమపాత్రుడైన, ప్రతిభావంతుడైన సీతారామరాజు చనిపోయినఅనంతరం, ఇకవారికష్టగాథలు వర్ణనాతీతం అనేక మంది వారిఉప నాయకులుకూడా తుపాకి గుండ్లకు ఆహూతయ్యారు. ఇంకా అనేకమంది దుర్భరమైన జైళ్ళల్లో పెట్టబడ్డారు. వారి దగ్గరున్న కాస్తోకూస్తో ఆస్తిపాస్తుల్ని దోచుకుపోయారు. అయినప్పటికీ వారి ప్రతి రక్తాణువులోనూ జీర్ణించుకుని వున్న వారి ప్రతిఘటనా శక్తిమాత్రం నశించలేదు. అది మరొక ఉత్తేజ నాయకుడ్ని, తగిన సమయాన్ని ఆహ్వానిస్తూ ఎదురుచూస్తుంది. తిరిగి ఈ ప్రజలలోని సామ్రాజ్య వ్యతిరేక శక్తి 1941 సం॥ అగస్టు విప్లవంద్వారా వారు చేసిన పనులవలన చక్కగా వ్యక్తమైంది.

అయితే మన్యప్రాంతంమీద పోలీసులు ప్రత్యేక విఘా పెట్టినందువల్ల కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమంలోని ఒక సూత్రమైన నూలుతీయటం సైతం అక్కడ నిరోధించ బడింది. ప్రభుత్వం ముఠాదారుల్ని ఆటవిక గ్రామపెద్దల్ని రైతుల్ని అణగగొట్టటంమకు ప్రోత్సహించింది. అలా వారిలోని తిరుగుబాటు శక్తి నశిస్తుందని భావించింది. ఇంతటి ఘోరమైన వత్తిడి విధానం అనుసరించబడుతున్నప్పటికీ శ్రీ టి. కోదండ రామయ్య, ఆర్. యం.శర్మ అనే కాంగ్రెస్ వ్యక్తులు ఆ ప్రజలకు అమోఘమైన సేవ చేశారు. వారు చేసిన కృషి ఫలితంగా తాత తండ్రుల దగ్గరనుంచి, ముఠాదారులకు, తదితరులకు 'గోతి' విధానంప్రకారం, ఆటవిక జాతులవారు, నిధిలేక, పారంపర్యంగా సేవచేస్తూఉండ టం ఆచారంలో వుండేది, ఈ నిర్భాగ్య నిరుపేద ప్రజానీకానికి వివాహ సందర్భంగా కానీ, త్రాగుడు నిమిత్తంగా కాని కొద్ది కొద్ది మొత్తాలు పెట్టుబడిపెట్టి, వారిని బానిస లుగా చేసుకునే పద్ధతికి 1940 లో స్వస్తిచెప్పబడింది. అయినప్పటికీ ఈ అవకాశాన్ని వినియోగించుకునే దానికి వారిలోని అధిక సంఖ్యాకులు ఈ రోజుకీ అసమర్థులుగానే వున్నారు. మరొక విషయమేమంటే, గత కాంగ్రెస్ మంత్రివర్గం వారి భూములు ఏ పరిస్థితుల్లోనూ మరొకరి చేతుల్లోనికి పోకుండా తగుచట్టం చేసింది. అయితే గత యుద్ధ సమయంలో సలహాదార్ల గవర్నర్ ప్రభుత్వం జిల్లాకలెక్టర్ అనుమతితో, వారి భూములు అన్యాక్రాంతమయ్యేదానికి తిరిగి ఆమోదించింది.

ప్రస్తుత కాంగ్రెస్ మంత్రివర్గం ఈఆటవిక ప్రజలకు సహాయ పడేందుకు ప్రయత్నిస్తుంది. "అఖిలభారత ఆదివాసి మన్య ప్రాంతాల సంఘం" అనేది 1936 లో స్థాపించబడింది. ఈదేశంలోని రెండుకోట్ల ఆదివాసులకు రాజకీయ పరిజ్ఞానం కలిగించు కుంటూ ఇది దిన దిన ప్రవర్ధమాన మౌతుంది.

### 1921 - 30 మధ్య సత్యాగ్రహం :

సహాయ నిరాకరణోద్యమ ప్రారంభంతో, అసంఖ్యాకమైన సత్యాగ్రహోద్యమాలు అన్యాయ అక్రమపూరితాలైన చట్టాలకు విరుద్ధంగా దేశమంతటా నడిపించబడినవి. భూసిస్తుకు విరసన 1921 లో బొంబాయిలోని 'బార్డోలి' తాలూకాలోనూ, ఆంధ్రలోని 'పెదనందిపాడు - దుద్దుకూరు'లోనూ చూపబడింది. 1921 లో 31 - 34 మధ్య కాలంలో "కర్నాటక అటవిక చట్టాల"కు వ్యతిరేకంగా పోరాటాలు నడిచాయి. సంయుక్తరాష్ట్రం, బీహార్‌లలో అక్రమ కౌలుపద్ధతిని విరోధించే దానికి 1921 లోనూ, 1931 - 34 మధ్యకాలంలోనూ పోరాటాలు నడిచాయి. పన్నుల పునర్విచారణను వ్యతిరేకిస్తూ గోదావరి - కృష్ణా తీరప్రాంతాల్లో అసంఖ్యాకమైన పోరాటాలు - వెంకటగిరి భూస్వాములమీద 1931లో, మునగాల జమీందార్ల మీద 1939లో అనేక పోరాటాలు దక్షిణాదిన మాలో కొంతమందిమి నడిపాం. 1939వ సంవత్సర భూసత్యాగ్రహం, బెంగాల్ - ఆంధ్రజమీందారీల వ్యతిరేకోద్యమం, 1939వ సం॥లో పంజాబ్ - బెంగాల్ కాలువ 'ద్యూటీం' పోరాటం, 1937 - 42 సంవత్సరాలమధ్య జనపనార ఖరీదు విర్ణయాలకు సంబంధించిన పోరాటం, బెంగాల్ అప్పుల విముక్తి ఆందోళన అనేవికూడా జరిగినయ్. ఈఉద్యమాలన్నీ ఏదో ఒక నూతన స్వరూపం ధరించి అంతమైనవి.

### ఆదివాసీ రైతులు :

భారత దేశంలో ఈ ఆదివాసీ రైతాంగందాదాపు రెండుకోట్లకు మించి వున్నారు. గత శతాబ్దంలోని సంతాలుల తిరుగుబాటు ఈశతాబ్దంలోని మూడవ దశాబ్దంలో కోయిల తిరుగుబాటు, ఇటీవల 'ధానూ' ప్రాంతాంలోని భిల్లుల ఆందోళన, "మైమన్‌సింగ్" - "మయూరభంజ్" అటవిక జాతుల ఉత్సాహం; ఇవన్నీ కలిసి, ఆధునిక ధనికవాదుల ప్రభావాన్ని పునాదులంతా కదలించగలిగినా, అమోఘమైన శక్తి - తిరుగుబాటుతత్వం అటవిక జాతులలో సైతం కావలసినంత వున్నదని మనకు చూపిస్తున్నవి.

సంతాల్ అటవిక ప్రజలు "ఛోటానాగపూర్ టెనెన్సీ యాక్టు" ద్వారా సంక్రమించిన న్యాయబద్ధమైన సహజ హక్కుల్ని నిలబెట్టుకోలేకపోవడం, దౌర్భాగ్యమనే చెప్పాలి. "వారు ఒకవేళ నిలబెట్టుకోగలిగినా కనీసం వెయ్యింటికి ఒక్కడైనా, రాజాగారి అడకత్తెర నుంచి తప్పించుకో కలిగిన ధైర్యంలేదు. అయినప్పుడు రాజాయి భూస్వాములు ఈనిస్సహాయ రైతాంగాన్ని నిరాక్షిణ్యంగా నలుపుకు తినటం కద్దు." అని 1936 లో రెవరెండ్ కాండియా పరిశీలించి "మోడరన్ రివ్యూ" పత్రికలో వ్రాశాడు.

ఈ సంతాలులు తమ భూముల్ని పెట్టుబడిదార్లకు గాని, ధనిక వర్గానికిగానీ, తదితర దోపిడీగాండ్రకుగానీ, అప్పజెప్పి నీఛ్ఛ నములుతూ కూర్చుంటున్నారు. దీనికి కారణాలు కూడా అనేకం వున్నాయి. 1947 ఫిబ్రవరి "న్యూరివ్యూ" పత్రికలో 'ఇనిమె యుల్డర్' వ్రాసిన వ్యాసం ద్వారా ఆ కారణాలేమిటో ఈదిగువన ఉదహరించబడినవి.

1) కౌలుదావాలు - స్వాధీనాలు 2) అప్పులు 3) మోసంతో లాంగదీయటం 4) బుద్ధిపూర్వకంగా తప్పుడు పరిష్కారాలు చేయటం 5) భూస్వాములు - ఉద్యోగుల, దౌర్జన్యం - జులుం 6) భూస్వాముల "రిజిష్టర్ల"లో అన్యాయంగా రైతుల పేర్లు తుడిచి వేయటం 7) న్యాయస్థానాలద్వారా నిర్దేశించబడిన ఆటవిక ప్రజల హక్కుల్ని అపార్థం చేయటం 8) ఆదివాసుల భూముల్ని ఆక్రమించుకుని చిన్న దుకాణం పెట్టి ఆ తరువాత నెమ్మదిగా గానీ అకస్మాత్తుగా కానీ, వాటిని పక్కా భవనాలుగా మార్చటం 9) ఆదివాసుల భూముల్లో బావులు చెరువులు తదితర వ్యవసాయానుకూలమైన సౌకర్యాలు కల్పించేదానికిబదులు సారా దుకాణాలు తెరిపించటం 10) అడవుల్ని - సాగు భూముల్ని, పెట్టుబడిదార్ల కంపెనీలకు బ్యాంకులకు అద్దెకివ్వటం లేక తెగదరికి వేయటం.

భూములు లేనటువంటి రైతులసంఖ్య, పెట్టుబడిదార్లు, భూస్వాములు, లంచ గొండి ఉద్యోగులు అనుసరించే విధానాంవలన పెరుగుతున్న ఫలితంగా ప్రతి మన్య గ్రామంలో భుక్తంచేసుకున్న బకాయీ భూముల విస్తీర్ణంకూడా పెరిగిపోతుంది దాని మీద కొత్త రైతుల్ని నియమించే హక్కు భూస్వామికి సంక్రమిస్తుంది

భారతదేశంలో ప్రతి ఆటవిక ప్రాంతంలోకూడ ఇలాంటి ఫిర్యాదులే హెచ్చుగా వస్తున్నవి. నేను 1927లో హైదరాబాద్‌లోనూ - నీలగిరిలోనూ, 1931 - 33 మధ్య కాలంలో ఆంధ్రపర్వత ప్రాంతాల్లోనూ, తిరిగి 1936లో నున్నా ఈ ఆటవిక జాతుల స్థితిగతుల భోగట్టాను సేకరించే నిమిత్తం, విచారణలు జరిపాను. ప్రతిచోటకూడా ఆర్థిక సంబంధమైన దుష్టశక్తులు రైతాంగాన్ని వారి న్యాయమైన కనీస హక్కులకు, దూరంచేస్తూ చెలగాటం ఆడటం చూచాను.

భారతదేశంలోని ఇతర భాగాలలోని ప్రజలు అనుభవించే రాజకీయ స్వాతంత్ర్యం, ప్రతిపత్తివీరికి కూడా లభించేటట్లు చేసేవానికి 1938 సం॥లో "అఖిల భారత వెనుకబడిన ప్రాంతాల - ఆటవిక ప్రజల సంఘం" స్థాపించబడింది. అప్పటినుంచీ దీని నిర్వాహణ మేధగా శ్రీ పి. కోదండరామయ్యగారు వ్యవహరిస్తున్నారు. అసంఖ్యాకమైన రాష్ట్రీసభలు కూడాజరుపబడినవి.ముఖ్యంగాఒరిస్సా,బొంబాయి, అస్సాంరాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రివర్గాలు ఈఆటవిక ప్రజల విద్యా విషయకమైన సౌకర్యాల అభివృద్ధి

కోసరం పాటుపడుతున్నాయి. కొన్ని సహకార సంఘాలుకూడా స్థాపించబడినవి. రాజా లకుముటాదార్లకు-ప్రాంతీయ సర్దార్‌లకు వ్యతిరేకంగా, ఆటవిక ప్రజాస్వామికసంఘాల ద్వారాస్వాతంత్ర్య సముపార్జనా నిమిత్తం పోరాడి,అమరజీవులైన వారివీరుల పూజించే సహజ ప్రేమమందు మా నూతన సంఘాల నిర్మాణం చొరవ చేసుకోలేక పోయిన కారణాన వారికి సన్నిహితంగానూ, వారికి ప్రేమపాత్రంగానూ పనిచేయలేకపోయాం.

ఇటీవల మా అంతటమేముగా ఈ ఆటవిక జాతుల నాయకులైన సమంత్, జై పాల్‌సింగ్, నిఖోలాస్‌రాయ్ మొదలైన వారితో ప్రత్యక్ష సంబంధాల్ని ఏర్పరచుకో గలిగాం. ఆటవిక లేక ఆదివాసీ సంఘాలతో సంబంధాలు పెట్టుకుని, నిర్మాణాన్ని పీరు సాగిస్తున్నందువలన, కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య ఆశయ సాధన నిమిత్తం మేము సాగించే విప్లవాత్మక పోరాటాలతో చేయి-చేయి కలిపి త్వరితంగా ఆటవిక ప్రజలు కూడా ముందుకు రాగలరని ఆశిస్తున్నాం.

ఈ ఆటవిక ప్రజలలోని కొంత మంది విప్లవాత్మకమైన అలవాట్లని జానపద గాధలుగా ఇటీవలనే మేము తెలుసుకున్నందువలన మా ఆశ ఇనుమడిస్తున్నది. ఉదాహరణకు మణిపూర్ సంస్థానానికి చెందిన ఒక స్త్రీకి ఆధునిక మార్కెట్లలో వ్యవసాయోత్పత్తికి న్యాయంగా రావలసిన ప్రతిఫలాన్ని ముట్టచెప్పకుండా మణిపూర్ టోకు చిల్లర వ్యాపారస్తులు నిరాకరించి స్వార్థపూరితంగా వ్యవహరించి సరైన ధరల్ని యివ్వనందున స్త్రీలందరూ కలిసి నిరసనగా సమ్మెను ప్రారంభించారు. కొన్ని వారాల పాటు ఆ సమ్మె అలానే సాగింది. ఏ పరిస్థితుల్లో కూడ సమ్మె విచ్ఛిన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోబడినవి. చిట్టచివరకు ప్రపంచజ్ఞానం కలిగినవారికి ఏ మాత్రం తీసిపోని ఈ ఆటవిక స్త్రీల న్యాయమైన కోర్కెల్ని మణిపూర్ వ్యాపారస్తులు ఆమోదించక తప్పిందికాదు.

రెండవది నేను 1945లో "అకోలా"ని, తిరిగి 1946లో ఉదయపూర్‌ని వందర్శించినపుడు జైపూర్ ఉదయపూర్ మహారాణాల నిరంకుశత్వం మీద వెనుక జరిపిన పోరాట ధోరణిని ఒక భిల్లుల ఆటవిక రైతు ఉత్తేజవంతంగా ప్రదర్శించటం చూచాను. ఈ ప్రదర్శన ద్వారా అర్థమయిందేమంటే, ఒక భీల్లు కవిచేత కొన్ని శతాబ్దాల వెనుక మహారాణాలు, భిల్లులమీద అంతులేని పన్నులువేసి అణగగొట్టటం, వారి ఇళ్ళను బలవంతంగా స్వాధీనపరచుకోవటం, వారి స్త్రీల మృదుత్వాన్ని భంగపర్చటం, అందువలన ఆ వత్తిడిమీద తిరుగుబాటు చేయటం ఈ మొదలైన ఆధారాలుగా ఆ పాటను అతడు వ్రాశాడు. వారి నాయకుడు రాంగోపాల్ వారిని సాయుధ విప్లవానికి తయారు చేశాడు. కొన్ని వారాలపాటు ప్రభుత్వ బలాలమీద భిల్లులు గెరిల్లా పోరాటం నడిపిం

చారు. తుదకు వారి నాయకులు ఇంకా అనేక మంది ఇతర ప్రముఖులు యుద్ధభూమిలో మరణించారు. అందుకు భిల్లులు నిరుత్సాహ నిస్పృహలతో సంస్థానాన్నంతా ఖాళీచేసి ఒక్కుమ్మడిగా ఇతర ప్రాంతానికి తరలి పోయారు. అయితే కొంత కాలం గడిచిన తరువాత, మహారాజు కొడుకు పెత్తనానికి వచ్చి తండ్రి చేసిన పాపాలన్నింటికీ పశ్చాత్తాపడి భిల్లుల్ని తిరిగి సంస్థానానికి రావలసిందిగా ప్రాధేయపడ్డాడు

ఈ వాస్తవిక గాథ చక్కని జానపదగేయంగా వ్రాయబడి మంచి రాగంతో, అద్భుతమైన నృత్యం ద్వారా భిల్లులు తమ గత ఉత్సాహాన్ని ప్రదర్శించుకుంటూ వుంటే, ఈ రోజుకు కూడా వారి చైతన్యం, ఉద్రేకం, ఉత్సాహం ప్రతిబింబిస్తున్నాయి. ఏదో ఒక రోజున వారి విప్లవం చక్కని ప్రజాపోరాటంగా ప్రజ్వరిల్లవచ్చునని దీని ద్వారా మనకు గోచరిస్తుంది.

ఆదివాసులు అటువంటి తమ ఉద్యమ నిర్మాణాన్ని తమ వీరోచిత ప్రదర్శనల్ని భిల్లుల నాయకత్వం క్రింద కేవలం భిల్లుల ప్రాంతంలోనే కాకుండా, దానికి చాల దూరములోనున్న మణిపూర్ ప్రాంతంలోని స్త్రీల అధ్వర్యాన, ఆంధ్రలోని కోరాపుట్ పర్వత ప్రాంతాల్లో ఆదివాసికాని సీతారామరాజు నాయకత్వాన నిర్మాణాత్మకమైన పంథాలో వ్యవహారాలు జరుపుతున్న దాన్నిబట్టి ప్రస్తుతానికి మన విప్లవాత్మక పోరాట ఆశయమైన ప్రజాస్వామిక రైతుకూలి ప్రజారాజ్య స్థాపన కార్యక్రమంలో తిరిగి వారు తమ సముచిత పాత్రను గ్రహించి తమ స్థానాన్ని సంపాదించగలరని ఆశలు కలుగుతున్నాయి.

ఛోటానాగపూర్ ఆదివాసుల "జమీన్ బచ్చాయిస్ సభ" (అగ్రేరియన్ లీగ్) ను ఈ ఉద్దేశాలతోనె వేయబడిన పునాదుల ప్రాముఖ్యత మాటలతో చెప్పేదానికి వీలు లేదు. అది కేవలం శాసన సభా దృక్పథంతోనె కాక "భవిష్యత్తును, ఉత్సాహాన్ని" నాయకత్వాన్ని, పేవాసక్తిని, ఆదివాసుల పౌర సత్వ హక్కుల్ని ఆదివాసి నాయకులు నిలబెట్టుకోవలసిన ఆవశ్యకతని కూడా నొక్కి చెప్పింది. స్వపరద్వాప నాయకత్వం ప్రసాదించలేని విద్య వారివల్ల విద్యేకాదు."

అది "వ్యవసాయ సంబంధంగా విస్తృతంగా, విప్లవంగా జీవన ప్రమాణం అభివృద్ధి చెందేదానికి పేదతనానికి ఒకే ఒక ప్రధాన కారణమైన దోపిడి విధానం మీద పోరాటంజరిపే పద్ధతిని ప్రబోధించుకుంటూ వచ్చింది." అంతేగాక, "వెనుకటి గ్రామ

పంచాయితీ విధానాన్ని అధునాతనంగా పునరుద్ధరించేదానికి అభ్యుదయకరమైన సహకార సంఘాల వ్యవస్థాపనకు" అది తన సుముఖతను తెలియజేసింది వైద్య శాలాశాలలు, వృత్తి విద్యాలయాలు, చట్ట ప్రబోధంతో కూడిన విద్యా సౌకర్యాల్ని గురించి "గాలి-నీరు" ఎంత అవసరమో అదికూడ అంత అవసరమని నొక్కి చెప్పింది.

"ఆదివాసీ, రైతుల ఇండ్లు ఆరోగ్యవంతమైన కొద్దిపాటి భూమిలోనె చక్కగా కట్టుకుని అవి తమ స్వంతమని భావించుకునేవారు. ఆ మాత్రం ఇండ్లు వారి ఆర్థిక పరిస్థితి రీత్యా పరిమాణంలో తగినంత విస్తృతంగానే వున్నాయి. అటువంటి భూమి ఆదివాసి రైతాంగం పోగొట్టుకోవటం అంటే వారి అదృష్టాన్ని మరొకరికి అమ్ముకోవట మన్నమాట. ఆదివాసుల చావుగానీ బ్రతుకుగానీ ఆ భూమిమీదనే ఆధారపడి వుంది."

భూస్వామ్య విధానం పోవాలి తిరిగి సంక్రమించే భూములు "గ్రామాల్లోని సమిష్టి స్థలాలు గ్రామ స్వపరిపాలన సంస్థచేతుల్లో ఉండాలి".

"సైనిక శక్తివలన గాని, యంత్రాలచే సాగుచేయబడే క్షేత్రాల వలనగానీ, ఒక దేశంలోని పురాతన అధికార దురహంకారం నుంచి ఆ దేశాన్ని-ఆ రైతాంగాన్ని రక్షించటం అసంభవం."

"ఒక గ్రామం మొత్తంగాగాని, లేకకొన్ని గ్రామాల సమాఖ్యగాగానీ, అగ్రేరియన్ లీగ్ ద్వారా ఆ ప్రాంతాల్లో అభ్యుదయకరమైన సహకార సంఘాలు స్థాపించబడి సమైక్యత సాధించబడవలసి వుంది.'

వ్యాపారంలో దళారీల బెడదనుంచి స్వాతంత్ర్యం, భూమిమీద హక్కు, ఆదివాసీలకు వంశ పారంపర్యంగా ఆస్తులకు సంక్రమించిన చట్టాలుచేయటం, ఇంకాకొన్ని రాజకీయాలతో ప్రమేయంలేని కోర్కెల్ని కూడా, ఈ సంఘం కోరింది. రాజకీయ ఆర్థిక సంబంధమైన సంస్థలో నిరంకుశంగా సర్వాధికారాన్ని ప్రయోగించే ధోరణిని వ్యతిరేకించి, గ్రామ స్వపరిపాలనకు ప్రజాస్వామ్యానికి అండగా ఈ సంస్థ నిల బడింది.

## భారత సంస్థానాల రైతాంగం తిరుగుబాటు :

1937-46 మధ్యకాలములో అసంఖ్యాక భారత సంస్థానాల్లోని రైతాంగం తమ దైన్య దౌర్భాగ్య దుస్థితిని తొలగించుకునే నిమిత్తము తిరుగుబాట్లు చేసింది. "చార్లిమాగ్ని" రోజుల్లో 'ఎలియన్‌పవర్'చే వ్రాయబడిన మధ్యయుగపు చరిత్రలోని 'రైతులబోర్డ్' అనే శీర్షికక్రింద రైతులగోడును వర్ణించినదానికి ఈ దేశంలోని రైతాంగదుస్థితి ఏమాత్రం తీసిపోదు:

ఆ కవయిత్రి వ్రాసిన 'బోదో' జీవితాన్నుంచి ఈ క్రింద ఇవ్వబడిన కొన్ని వాస్తవిక పరిస్థితులు, ఈరోజుకూ మనదేశంలోని భారత సంస్థానాలన్నింటిలో, అసంఖ్యాకమైన జమీలలో, కొంతమట్టుకు బ్రిటిషు ఇండియా భాగంలో మ్రగ్గిపోతున్న రైతుల స్థితిగతులకు పోలివున్నాయి.

'ప్రతి మనిషీ ప్రతి సంవత్సరముకూడా, భూస్వాముల పొలాల్లో ఒక నిర్ణీత మేరకు భూమిని దున్ని పెట్టాలి. అంతేకాక 'కార్వీ' కూడా చెల్లించాలి. అంతేకాక ఒక్కొక్క సందర్భములో వారికి అవసరమైనంతవరకు తమ స్వంత బాధ్యతతో ప్రతివారము, భూమిని దున్ని పైరువేసి పెట్టాలి.'

దీనికితోడు 'ఇళ్ళు బాగుచేసే కార్యక్రమములో సహాయపడటము, చెట్లు వరికి పెట్టడము, పండ్లు సేకరించటము, వస్తువుల మోయటము ఈ మొదలైన కాయకష్ట మంతా చేస్తూవుండాలి. ఇలాంటి సేవలు పొందే, మఠ సన్యాసుల హితమాన్యాల్ని సాగుచేయించుకునేవారు.'

రైతులు 'భూస్వాములకు సంబంధించిన పెద్దపెద్ద ఇళ్ళకు అడవులనుంచి అసాధారణ దూలాల్ని మోసుకుపోయి అప్పగిస్తే ఎప్పుడైనా చెలిగిన పుల్లల్నివంటచెరకుగా తెచ్చుకునేదానికి అవకాశము కలిగేది. ఆ అడవుల్లోనే పందులను మేపుకునేందుకుగాను కొన్ని రమ్ముల సారాయిని బహుమతిగా వారికి చెల్లించుకోవాలి. భూస్వామి భూముల్లో రైతుల గొర్రెల గుంపులు మేత మేశాయనే కారణాన, ప్రతి మూడేళ్ళకూ ఒక గొర్రెను బహుమతిగా యివ్వాలి. ప్రతిరైతూ పండిన వంటలో కొంత భాగాన్ని కౌలు క్రింద జమకట్టాలి. వారి భవనాల మరమ్మతు నిమిత్తం మూడు కోడి పెట్టల్ని, పది పేణు కోడిగ్రుడ్లని, అసంఖ్యాకంగా ఇతర మోయిన్లను ప్రతి సంవత్సరం కూడా సమర్పించుకోవాలి. తరచు ఒక్కొక్క జత పందుల్ని గూడా అప్పజెప్పాలి. మరికొన్ని సందర్భాలలో ధాన్యం ద్రాక్ష సారాయి, తేనె, మైనం, సబ్బు లేక నూనె మొదలైనవి ముడుపు చెల్లించుకుంటుండాలి. ఒకవేళ బానిసలుగా భావించబడినట్లయితే ఆ రైతుల భార్యలు సైతం వారి కుటుంబాల్లో నిత్యం సేవ చేస్తుండాలి. ముఖ్యంగా బానిసస్త్రీలైతే మాత్రం ప్రతిఏటా వారి ఇంటి అలంకారాన్ని తీర్చి దిద్దడానికి, సంవత్సరము పొడవునా వారికి సరిపడే బట్ట నిమిత్తము నూలు తీసేదానికి పనిచేస్తుండాలి.'

భారత సంస్థానాల్లోని రైతాంగ బాధలు అంతకంటే భరించరానివిగా వున్నవి. అన్యాయపు పన్నులతోపాటు అడ్డంవచ్చిన గాడిద చాకిరిని సదా దాసోహమనుకుంటూ

చేసుకోవటం తప్ప వారికి మరో గత్యంతరం లేదు. మొఘల్ సామ్రాజ్యం ప్రారంభమైనప్పటినుంచీ బానిసత్వానికి ఉండవలసిన సమస్త లక్షణాలు మొలకలెత్తి పారంపర్యంగా పెరుగుతూ వస్తుంటే, బ్రిటీషువారి ఆయుధాలు, భారత సంస్థానాధిపతులు వాటిని పోషించుకుంటూ వచ్చారు

ఈదుర్భరమైన విధానానికి భారత రైతాంగం తీవ్రమైన నిరసన తెలియజేయ ప్రారంభించారు. మొట్టమొదటగా 'లోహరు', 'పాటియాల', 'నాభా' రైతాంగం తిరుగుబాటు చేశారు. వారు క్షేత్ర సమ్మె (form Strike)ను ప్రారంభించి గ్రామాల్ని వదలిపెట్టి సమీప అడవులకు వెళ్ళి కాపురాలు పెట్టారు. సంస్థానాలకు సంబంధించినటువంటి సాయుధ పోలీస్ సైనికులు గుర్రాలమీద అడవులకు వెళ్ళి కనబడిన ప్రతి రైతునూ, తిరిగి గ్రామాలకు వెళ్ళి వ్యవసాయం చేపేటందుకుగాను హింసిస్తూ వేటాడ మొదలుబెట్టారు. కొంతకాలం ఇలానే పోరాటం నడిచిన తరువాత రైతులు బలవంతాన సత్యాగ్రహాన్ని వదులుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత భూసిస్తు తగ్గించమని దీర్ఘకాలంపాటు "మాన్సా" రైతాంగ సత్యాగ్రహం నడిచింది. మూడు మాసాల పోరాటానంతరం కొంతవరకు విజయాన్ని సాధించగలిగారు.

మైసూరు, తిరువాన్కూరు సంస్థానాల్లోని ప్రజలు బాధ్యతాయుతమైన ప్రభుత్వాల సంస్థాపనకు, విస్తృతంగా పోరాటాలు నడిపారు. ప్రభుత్వాలు అసంఖ్యాకంగా ఘోరకృత్యాలకు పూనుకున్నవి. అవి చేసిన కాల్పుల ఫలితంగా వందలకొలది రైతులు-కార్యకర్తలు తుపాకిగుండ్లకు బలియైపోయారు. తదుపరి కొద్దిపాటి రాజకీయ సౌకర్యాలతోబాటు అప్పులు కూడ కొంతవరకు తగ్గించబడినవి.

పోరాటం 'వలిసా' సంస్థానాలకు వ్యాపించింది. కొంతకాలం పాటు రాజులు సంస్థాన ప్రజల చేతుల్లో చిక్కుకున్నారు. ఎటుచూచినా రైతాంగ తిరుగుబాట్లే! వారి ప్రతాపం ముందు స్థానిక పోలీస్ సైనిక శక్తులు నిలువలేక పోయినాయి. తత్ఫలితంగా, అప్పులబాధల నుంచి విముక్తిచేస్తామని అటవిక పన్నును రద్దు చేస్తామని, వంట చెరకును - కలపను - పచ్చిగడ్డిని ఉచితంగా అనుభవించే ఏర్పాట్లు చేస్తామని బలవంతంగా వెట్టిచాకిరీ చేయించటం మానుకుంటామని పశువుల్ని కూడ పరపరా చేస్తామని ఇలా గాభరాతో రైతులకు హామీలిచ్చుకోవాల్సి వచ్చింది. కౌళ్ళు కూడా తగ్గించేదానికి ఆమోదించారు. కానీ బ్రిటీషు పటాలాలు రైతుల చేతుల్లో చిక్కుకున్న

తమ తొత్తుల్ని రక్షించుకునే దానికి హుటాహుటిగా పరుగులు తీశాయి ఈ అదను చూచుకుని ఇంతకుముందు చేసిన ప్రమాణాలన్నింటినీ చాలా వరకు రద్దు చేసుకున్నారు. అంతటితో రైతులు మరొకమారు తిరుగుబడి, వారి ముఖ్యపట్టణాలకు యాత్రలు నడిపి వివిధరకాలైన ఆర్థిక రాజకీయ హక్కుల సాధన నిమిత్తం ప్రదర్శనలు జరిపారు. అయితే పొదలో పొంచి చూస్తున్న పులిమాదిరిగా తెరవెనుక నున్న బ్రిటీషు పటాలాలు వారి మీద కాల్పులుసాగించి అంతులేని రక్తపాతాల్ని జరిపి అనేకమంది అమాయక ప్రజల్ని పొట్టనబెట్టుకుని వారి ఉద్యమాన్ని అణచివేశారు. ఇకను సంస్థానాధిపతులు క్రూరమైన పద్ధతులతో వ్యవహరించ మొదలుబెట్టారు. క్షణంలో నేరస్తులుగా మారి పోయిన ఆ అసంఖ్యాక రైతాంగాన్ని ఆసందర్భంలో చూచే అవకాశం నాకు కలిగింది. వారు ఆ స్థితికి దిగజారిపోయినందుకు హేతువైన రాజుల్ని వారి సంరక్షకులైన బ్రిటీషు వారిని చూడటానికి వారు సిగ్గుపడుతున్నారు. కారణం? స్త్రీలు మానభంగాలకు గురి అయ్యారు. యువకుల్ని మెత్తని భాగాలమీద, నిలబెట్టి కొరడాలతో మోదారు రైతుల్ని కాళ్ళుకట్టి నదుల్లో పారవేశారు. ఇళ్ళని తగులబెట్టారు. గ్రామాలకు గ్రామాల్నే బూడిద పాలు జేశారు. పశువుల్ని జప్తుచేసి ధాన్యాన్ని దోచుకుపోయారు.

ఈ అవమానాల్ని నష్టాల్ని భరించలేక దాదాపు ముప్పై వేల పైచిలుకు రైతాంగం అనేక సంస్థానాల్లో - తుదకు నీలగిరి, ధేన్‌కెనాల్ ప్రాంతాల్లో సైతం - గ్రామాలకు గ్రామాల్నే ఖాళీచేసి అడవులకు వెళ్ళిపోయారు. అడవుల్లోని కొమ్మా రెమ్మా, ఆకు అలంతో చిన్న చిన్న గుడిసెలు నిర్మించుకుని కొన్ని మాసాలపాటు ఆ దుర్భర ప్రదేశాల్లో జీవితాల్ని గడిపారు. తుట్టతుదకు, ఇక ఎన్నడూ అలాంటి అవమానాలకు వారిని గురిచేయమనీ, కష్టనష్టాలకు - లూటీలకు దోహదం కల్పించమనీ, బలవంతపెట్టి పని చేయించమనీ, ఇంకా తదితరమైన వత్తిడి కార్యక్రమమేదీ తీసుకోమనీ, రైతులకు వారు గ్రామాలకు వెళ్ళేటందుకు సంస్థానాలు సిగ్గుపడుతూ హామీలిచ్చుకోవాల్సి వచ్చింది.

నేను వారు నివసించే ప్రదేశాల్ని సందర్శించి ఆ స్త్రీ పురుషుల్ని నాయకుల్ని చూచి మాట్లాడాను. వారి పరిస్థితి మా కనువిప్పుకు దోహదమైంది. అక్కడ అడవుల్లో వున్నా వారి వలస నివాసాలు క్రమబద్ధంగానె వున్నవి. రైతుల గ్రామ నిర్మాణ పద్ధతుల ప్రకారంగానే వారు అక్కడ ఇండ్లను కట్టుకున్నారు. అవన్నీ రైతాంగ పంచాయితీల అధీనంలో వుండేవి వారికి నాయకత్వం వహించిన వారిలో ధైర్యసాహసాలు కలిగిన వృద్ధ తల్లులు కూడ వున్నారు ఐక్యత - క్రమశిక్షణ - సంఘ నిర్మాణం - నాయకత్వం మొదలైన విషయాలకు, పుట్టుకనుంచీ వస్తున్న వారి గుణ గణాల్ని జోడించారు. ఈ విప్లవ ఆవశ్యకతలో పారంపర్యంగా వారి మధ్య తిష్టవేసుకున్న కుల విభే

దాలు సమసి పోయాయి. అంటరానితనం అదృశ్యమైంది. ఇలా వారు ఐక్యతతో సమాన సాంఘిక ప్రతిపత్తితో సమిష్టిగా నివసించే పద్ధతుల్ని అక్కడ నేర్చుకున్నారు.

ఈ విప్లవ ఉదంతాల్లోనే మహారాష్ట్ర - కర్నాటక సంస్థానాల్లోని రైతాంగం కూడా చెలరేగింది. వారుకూడా కొన్ని విజయాల్ని సాధించి, కొన్ని సౌకర్యాల్ని పొందుకున్నారు.

తరువాత జైపూర్ - ఉదయపూర్ - గ్వాలియర్ రైతాంగం స్థానిక ఠాకూర్లు ఇతర భూస్వాములు జరిపే దురాగతాలకు వ్యతిరేకంగా పోరాటం లేవదీశారు. అక్కడవారు జైపూర్ ఠాకూర్లకు - ఠాకూర్లకు మధ్య సంస్థానాధీశులమధ్య, సంస్థానాలకు - సంస్థానాలకుమధ్య వున్న అంతర్గత విభేదాల్ని, అంతరంగిక పోరాటాల్ని చక్కగా ఉపయోగించుకున్నారు. మహాత్మాగాంధీ శిష్యులలో ఒకడైన, వ్యాపార చక్రవర్తి అనేబిరుదుకు అర్హుడైన 'సేట్' జమ్నాలాల్ బజాజ్ నాయకత్వాన వారు నడిచారు. ఆర్థికరంగంలో పునవిజయాన్ని సాధించారు. అయితే, ఒక్క జైపూర్ తిరుగుబాటు మాత్రం క్రూరంగా అణచబడింది. కాని, నిర్బంధకూలి (Forced Labour) విధానం రద్దు చేయక తప్పిందికాదు.

1946 జులై ప్రాంతంనుంచి ఆ సంవత్సరమంతా హైద్రాబాద్ రైతాంగం స్థానిక భూస్వాములమీద, దేశముఖ్‌లమీద, పోరాటం లేవదీశారు. కాంగ్రెస్‌వారు కమ్యూనిస్టులు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. కమ్యూనిస్టులకు సంబంధించినంత వరకు వారు మామూలు ధోరణిలో, కాంగ్రెస్ వ్యక్తుల్ని నాయకత్వంనుంచి త్రోసివేసి అంతతాము ఆక్రమించుకునేదానికి ప్రయత్నించారు. తమ పార్టీ అభివృద్ధి నిమిత్తం పోరాటాన్ని ఉపయోగించుకోజూచిన ఈ ప్రయత్న ఫలితంగా రైతాంగశక్తి ఉభయుల చేతా పంచుకోబడింది. అందువల్ల కమ్యూనిస్టుల చర్యలనుంచి తమను తాము రక్షించుకునే నిమిత్తం, వ్యాపారుల్లోని మధ్య తరగతులలోని అధిక సంఖ్యాకులు ప్రభుత్వోద్యోగులతో చేతులు కలిపి విధిలేని పరిస్థితుల్లో సహకరించవలసివచ్చింది.

ప్రభుత్వోద్యోగులు, స్థానిక భూస్వాములు, ఇంకా వారి ఇతర మిత్రులు వరంగల్, నల్లగొండ బీదర్ జిల్లాల రైతాంగంపట్ల ఘోరాతిఘోరంగా ప్రవర్తించారు. లూటీలు, మానభంగాలు, హత్యలు, గృహదహనాలు - ఇవి ఆనాటి రైతాంగంపట్ల వారనుసరించిన విధానాలు. సంస్థాన ప్రజాసంఘం స్థాపించిన అనంతరం, మరోవైపున ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్, వారి ఉద్యమాలయందు ఆసక్తి చూపి సానుభూతితో కృషిచేసినందువలన, సంస్థాన ప్రభుత్వం ఆ దౌర్జన్య హింసాకాండకు స్వస్తిచెప్పించింది.

అయితే భూస్వాములనుంచి సంపాదించుకున్న ఈ స్వాతంత్ర్యం కేవలం మాటలతో లభించలేదు. దాని విలువ ఇంతఅని ఖరీదుకట్టలేం. అలాగే రాజస్థాన్ సంస్థానాలన్నిం టిలోకూడ, 1947 ఆగస్టునుంచి, నిర్బంధపనినుంచి, జాగీర్ దారి రాకూర్‌దారీ విధానాన్నుంచి, విముక్తి పొందేందుకు రైతాంగం కొన్ని మాసాలపర్యంతరం సతమతమై పోరాడవలసివచ్చింది.

హైద్రాబాద్ రైతాంగబాధలు చాల విచిత్రంగా కనుపిస్తవి. నైజాంనవాబ్‌కు మంత్రివర్గానికీ మధ్య పొత్తు కుదరనందున అధికార పిపాసకలిగిన ముస్లిం రజాకార్ల నాజీపైశాచిక కృత్యాల్ని నైజాం ప్రజలే అమితధైర్యంగా ఎదుర్కోవాల్సివచ్చింది. 'పాల్వంచ' తాలూకాలోని ఆటవికజాతికి సంబంధించిన కోయలు: నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన రైతాంగం, సంస్థాన అధికార్ల దౌర్జన్యాల్ని దుష్టశక్తుల్ని అమితసాహసంతో ఎదుర్కొన్నారు. గోదావరినది కిరువైపుల పర్వతప్రాంతాల్లోని కోయలు అనేక సందర్భాల్లో తీవ్రంగా పోరాడారు.

1928 బార్డోలీ రైతాంగ సత్యాగ్రహ నాయకుడైన సర్దార్‌పటేల్ రాజకీయ విజ్ఞతవలన: అదృష్టవశాత్తు, తీవ్రమైన సమయోచిత పోలీసు చర్య తీసుకోబడింది. అది నైజాం నవాబ్ లొంగుబాటుకు దారితీసింది. నైజాం పతనం, రజాకార్ల వినాశనానికి, భూస్వాముల కోరలు పీకేదానికి దోహదమైంది.

భారతదేశ విభజనానంతరం, దాదాపు 70 లక్షల మంది ప్రజల్ని సంస్థానాధిపతుల నిరంకుశత్వాన్నుంచి విముక్తిచేసి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టమనేది ఒక బ్రాహ్మాండమైన అద్భుత కార్యసాధననే చెప్పాల్సివుంది. దీనికి మరో ప్రత్యేక విశిష్టత ఏమంటే, ఈ మహత్కార్యం, రైతాంగ రాజకీయ ప్రజ్ఞాదురంధరుడైన సర్దార్‌పటేల్ చేత జరుపబడటం. సంస్థాన రైతాంగం జరిపే ఆర్థిక రాజకీయ పోరాటాల వెనుక, రక్షక దళంగా భారత రైతాంగం పరోక్షంగా వుంది. 1947 ఆగస్టు 5 తో భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. దానికి మన జేజేలు. సర్దార్ వల్లభాయిపటేల్ విప్లవాత్మకమైన ఘనకార్యాలు సాధించాడు. ఆయనకు మన ధన్యవాదాలు. ఇక ఇంతటితో జమీందారీ, జాగీర్‌దారీ, భూస్వామ్య వత్తిడి నుంచి సంస్థాన ప్రజలు విముక్తి పొందారు భారత జాతీయ కాంగ్రెస్ దారి చూపెట్టింది :

భారత జాతీయ కాంగ్రెస్ - మహాత్మా గాంధీ, 1921 లో 1930 - 34 సంవత్సరాల్లో, 1940 - 48 సంవత్సరాల్లో - ఇటీవల ఏ శతాబ్దంలో కూడ ఎవరూ తేలేక

పోయినంతటి—మహోద్ధృతమైన చైతన్యాని భారత ప్రజల్లో. ముఖ్యంగా రైతాంగంలో. వివిధ విధాలైన విప్లవయుత పోరాటాల ద్వారా, తేగలిగారు. అంతేకాక, వీటన్నింటినీ కలిపి, దేశీయ సాంస్కృతిక వైభవాన్ని ఉజ్వల సామాజికౌన్నత్యాన్ని, దేశవ్యాప్తంగా వాస్తవిక పరిస్థితుల దృష్ట్యా పెంపొందించేటానికి కూడా కృషిచేశారు సాధారణంగా మనం రైతుల్ని సమీకరించటానికి పూనుకుంటే, వారిలో ఇంతకుముందే పాతుకుని వున్న—బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని సమూలంగా నాశనం చేయాలనే భావాలు, నవీన జాతీయ మనస్తత్వం, సత్యాగ్రహం ద్వారా స్వాతంత్ర్యంసంపాదించుకోవచ్చుననే విశ్వాసం, మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తూనే వుంటవి కాబట్టే, కార్యభారం కొంత సులభంగానే కనిపిస్తుంది.

కిసాన్ కాంగ్రెస్ బహుకృతులు :

మా హయాంలో, అభివృద్ధి చెందుతున్న జాతీయ మనస్తత్వాల్ని ధ్రువపర్చటం, రైతాంగ కాంక్షలు తీర్చుకునే దానికి దేశవ్యాప్తంగా రైతాంగ ఐక్యతావస్యకతవినొక్కి చెప్పటము, విప్లవాత్మకమైన వారి వర్గ ధర్మాన్ని ఆహ్వానించటం, కార్మికుల సహకారాన్ని తీసుకోవాల్సిన ఆవశ్యకతని నచ్చచెప్పటం, స్థిరపడివున్న వర్గ పోరాటాన్ని గుర్తింప చేయటం, వర్గతత్వాన్ని రూపుమాపాలంటే, ముందు తమనితాము బలపరుచుకోవాల్సిన సత్యాన్ని తెలియజేయటం, మొదలైన విషయాల గురించి మేం చేసిన కృషిని సగర్వంగా చెప్పుకోగలం. ప్రస్తుత సంపదలోనూ, ఆదాయంలోనూ కనిపిస్తున్న తరతమ భేదాల్ని, రైతాంగవర్గ ధర్మయుక్తంగాకనిపెట్టి, సాంఘిక-సాంస్కృతికసంబంధమైన ఘన కార్యాల సాధన విషయంలో, వ్యవసాయదారులకూవ్యవసాయేతరులకూ మధ్య, అదేమాదిరి, మత గురుత్వంలోనుంచి భూస్వామ్యంలోనికి తద్వారా ఉద్భవించిన ధనిక వాదానిక కష్టజీవులకూ మధ్యనున్న అసమత్వ వ్యవస్థను కనిపెట్టి, దోపిడీ తరగతుల్నుంచి దేశాన్ని రక్షించే నిమిత్తం, ప్రజాయుతమైన ప్రజాస్వామిక పద్ధతిలో వుంచేటందుకూ, యుద్ధాలనుంచి ఆర్థిక మాంద్యాలనుంచి అప్పుడప్పుడూ ప్రజలకు కలిగే సంకటాల్ని, ధనిక ఫాసిస్టు విధానాల ఫలితముగా కలిగే ఘోర అన్యాయాల్ని—మహాత్మాగాంధీచే అమలులోనికి తేబడిన విప్లవయుతమైన ధర్మ పంథా ద్వారా మానవత్వాన్ని ఉద్ధరించుకోవచ్చుననే నమ్మకం రైతాంగానికి కలిగించ గలిగాం.

దాదాపు ముప్పై సంవత్సరాలపాటు జాతీయ పోరాటాల్లో భాగస్వామ్యాన్ని పంచుకొని, ఇరవై సంవత్సరాల ఉద్యమ చరిత్ర కలిగిన భారత రైతాంగం, ప్రస్తుతం భారత జాతీయ విప్లవ శక్తుల సంరక్షక దళంగా వుండి 1942లో దేశంలోని తదితరమైన ఏ వర్గ ప్రజకూడా, ప్రదర్శించనటువంటి—సువర్ణాక్షరాలతో లిఖించ దగిన

విప్లవకార్యక్రమాల్ని తీసుకుని అమోఘమైన త్యాగాల్నిచేసి అద్భుత ఘన కార్యాల్ని సాధించినందుకు మన ధన్యవాదాలు వారికి అర్పించవలసివుంది. మహాత్మాగాంధీ ఈ ఆధునిక భారత రైతాంగాన్ని చూచి ఎంతగానో గర్వించాడనటంలో నాకే మాత్రంసందేహం లేదు.

వీరగున్నమ్మ :

మందసా నివాసిని అయిన శ్రీమతి వీరగున్నమ్మ సత్యాగ్రహములో సాటిలేని తిరుగుబాటు చాతుర్యాన్ని ప్రదర్శించింది. మద్రాసు ప్రభుత్వంచే నేను నిర్బంధితుడుగా జైలులోవున్న రోజుల్లో 1940 మార్చి 31వ తేదీన మాజిస్ట్రేటు ఉత్తర్వులతో స్థానిక పోలీసులు అసందర్భకారణాల నాధారముగా తీసుకుని అనేకమంది 'మందసా" రైతు నాయకుల్ని బంధించ ప్రారంభించారు. మగవాళ్ళంతా పొలాలలో పనిచేసుకుంటున్నపుడు గ్రామములోఉన్న కొద్దిమందిని బంధించే దుమారము చెలరేగితే, మగవాళ్ళకంటే ఆడవాళ్ళే రైతాంగములో ఎక్కువమంది పోగయ్యారు. వారిని అన్యాయముగా అరెస్టుచేసే పోలీసుచర్యల్ని తీవ్రముగా వ్యతిరేకించారు. అందుకు పోలీస్ జోక్యము కల్పించుకుని వారిని అవమానపర్చటము జరిగింది గున్నమ్మ వారి ప్రవర్తనని అనహ్యించుకుంటూ వరుసబెట్టి చివాట్లు పెడుతూవుంటే ఆమెమీద తుపాకులు కాల్చారు సివంగిమాదిరి ఆమె వారి నెదుర్కొనేదానికి అప్పటికీ సాహసించింది ఆమెను అరు మార్లు పోలీసులు కాల్చి చంపుతూవుంటే, కొనవూపిరి వున్నంతవరకూ పోలీస్‌వారి అన్యాయ అక్రమాల్ని ఎదుర్కొంటూనేవుంది. ఆమెమాదిరి ఈనాటికీ నిరాయుధులైవున్న విశాఖపట్టణము రైతాంగము, తాము బ్రతికుండగా జంతు సభ్యతతో బ్రిటీషు సామ్రాజ్యవాదము ఆమె ఒళ్ళంతా తూట్లుపడేట్లు, కాల్చి చంపినందుకు తాము సిగ్గుపడుతూ, ఆ వీరవనిత జ్ఞాపకార్థము భక్తి శ్రద్ధలతో స్మారకదినోత్సవము జరుపుకుంటారు 1941 సెప్టెంబరు 1వ తేదీన అప్పటి భారతరైతాంగ అధ్యక్షురాలు శ్రీమతి భారతీదేవి వీరమరణము పొందిన అమరజీవి గున్నమ్మ సమాధివద్ద పుష్పమాలలు సమర్పించేందుకు వెళ్ళినపుడు అక్కడికి దాదాపు ఒక లక్షమంది రైతాంగము తమ భక్తి ప్రపత్తుల్ని చూపించేదానికి వచ్చారు. రైతులు మహోన్నతముగా—వీరోచితముగా చావటము నేర్చుకున్నారు. అంతేకాక, వారి అమరజీవుల్ని గౌరవించటము కూడా నేర్చుకున్నారు పెరుగుతూవున్న అమరవీరుల సమాఖ్యకు ఆమె అధ్యక్షత వహిస్తున్నట్లుండటము ద్వారా మనకు తెలుస్తుంది.

రాజకీయరంగములో సహితము, రైతాంగము అసంఖ్యాకమైన ఘన కార్యాల్ని సాధించారు. 193 -40 మధ్యకాలములో అనేక రాష్ట్రప్రభుత్వాలు, గ్రామీణ ప్రజల అప్పుల విముక్తికి రైతులందరికి అప్పుల బెడద తగ్గించేదానికి, జమీందార్ల క్రింద

క్రమగ్గుతున్న కౌలుదార్ల హక్కుల్ని సంరక్షించేదానికి, ఆదివాసుల భూములు అన్యాక్రాంతము కాకుండా ఉంచేదానికి, ఇంకా తదితరమైన అనేక కార్యక్రమాల్ని గురించి "మారిటోరియము" ప్రకటించినవి.

ఆగస్టు - విప్లవము రైతాంగము :

1942 ఆగస్టు విప్లవ సందర్భములో సుసంఘటిత అద్భుత వీరోచిత పాత్రని తీసుకున్నది ఎవరో కాదు, రైతులు బస్తీలలోని మధ్యతరగతి ప్రజలు, విద్యార్థులు కూడా తమ పాత్రని తగినంతగానే స్వీకరించారు కానీ రైతాంగము వీరిని అధిగమించింది. వారు ఒక్కుమ్మడిగా బ్రిటీషువారి రాకపోకల్ని బంద్ చేయగలిగిన సత్తా సామర్థ్యాలతో కార్యరంగములోనికి దుమికారు. పోలీస్ కార్యాలయాల్నీ స్థానిక ప్రభుత్వోద్యోగుల్నీ తమ అధీనములో పెట్టుకున్నారు. ఎక్కడైతే వారు ప్రభుత్వ బలాల్ని దాని తాబేదార్లని లొంగదీసుకున్నారో అక్కడ తమ పంచాయితీ రాజ్యాన్ని నెలకొల్పారు. సంయుక్త రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో, బీహార్, బెంగాల్, మహారాష్ట్ర తమిళనాడు ప్రదేశాలలో పోటీ ప్రభుత్వాల్నికూడా ఏర్పరిచారు అన్నింటిలోకి ముఖ్యమైన ప్రత్యక్ష సాధన మిడ్నపూర్ సతారా జిల్లాలలో జరిగినది రైతాంగ ప్రదేశాలలో ఆ తరువాత బ్రిటీషువారు తమ యావత్తు బలాన్ని ఉపయోగించినా, సంవత్సరాలపాటు కృషిచేసినా వారిని బ్రిటీషువారు ఉన్నంతకాలము అదుపులోనికి తెచ్చుకోవటము దుస్సాధ్యమైపోయింది.

ఈ విధముగా ఇరువైయవ శతాబ్దపు రైతాంగము, ముఖ్యముగా ఆగస్టు విప్లవానంతరము రైతాంగము, తాము రాజకీయాధికారాన్ని సముపార్జించుకోవటమనే లక్ష్యముతో వున్నామని, కేవలము నిరాశ, నిస్పృహలతో వెనుకటిమాదిరి, ఇకముందు అప్పుడప్పుడు లూటీలు చేసి సంతృప్తిపడే స్థితిలో లేమని స్పష్టముగా వ్యక్తము చేశారు. ఆగస్టు విప్లవానంతర రైతాంగ పరిపాలనలో ఒక చెప్పుకోదగిన విశేషమేమంటే, ఏ వ్యక్తిగత ఆస్తులకుగానీ, లేక వ్యక్తులకుగానీ లేక వారి అభీష్టాలకుగానీ ఎలాంటి నష్టమూ కలిగించ లేదు. అయితే, ప్రభుత్వ ఏజంట్లని ఉపేక్షించలేదు. ప్రభుత్వ ఆస్తుల్ని మాత్రము చూస్తూ ఊరుకోలేదు. రహస్య ఉద్యమ కార్యక్రమాలు భారీయెత్తున కొనసాగెను. విముక్తిపొందిన రైతాంగముచేతులలోని భూభాగములో శాంతిభద్రతల్ని కాపాడే నిమిత్తము. పంచాయితీ రాజ్యస్థాపనలో సివిల్-క్రిమినల్ అధికారాల్ని పెంచారు ఈ విధముగా 1942 ఆగస్టు విప్లవములో రైతాంగము కేంద్ర శక్తిగా వ్యవహరించింది.

భారత స్వాతంత్ర్య సముపార్జనానంతరము, రైతాంగ బలముతో పెంపొందిన భారత జాతీయ విప్లవ ప్రాముఖ్యత ఉధృతముగా ప్రదర్శించ బడుతుంది. అదు

వందల భారత సంస్థానాలలో తిష్టవేసుకుని వున్న రాజరికము, రాజరికముమీద ఆధార పడి జీవిస్తున్న భూస్వామ్య బహద్దూర్లు, జాగీర్దారులు, దేశముఖ్లు, ఇంకా తది తరులు ఇప్పుడు చరిత్రలో మొదటిసారిగా మంచు కరిగిపోయినట్లు కరిగిపోతున్నారు. భారత ఉప ప్రధాని అయిన సర్దార్ పటేల్ రాజకీయ ప్రజ్ఞావిశేషాలకు అభినందనలు తెలుపాల్సి వుంది. దాదాపు సంస్థానాలన్నీ సమీప రాష్ట్రంలో విలీనమై పోపటముకానీ లేక సమాఖ్యగా ఏర్పడటము కానీ జరిగింది. మొత్తముమీద వారికి కూడా భారతదేశ ప్రజాస్వామిక పంథా వర్తించేట్లు చేయబడింది. ఈరోజు 70 లక్షల మంది సంస్థాన ప్రజలు ప్రజాస్వామిక పరిపాలన అనుభవించ గలిగిన స్వేచ్ఛ లభించింది. భూస్వామ్య చట్టము సంకెళ్ళ నుంచి అతి విచిత్రముగా రైతాంగము బైటపడటమే కాకుండా, సంస్థాన నాధిపతి-భూస్వామి నిరంకుశత్వము క్రింద క్రుంగిపోతున్న వారంతా కూడా విముక్తి చెందారు. ఇది వాస్తవానికి, గాంధేయ మార్గములో సాధించబడిన ఒక గొప్ప సామా జిక విప్లవ పరిణామము. రక్తపాతము జరిపి సాగించే విప్లవము ద్వారా ఇంత కంటే వేగముగా, సులభముగా కార్యసాధన సాధ్యము కాదు.

రైతాంగ విప్లవవాదుల శక్తిసామర్థ్యాలు, రాజకీయ పరిపాలన,న్యాయసంబంధ మైన పనుల నిమిత్తము ప్రత్యేక పంచాయితీలను ఏర్పాటు చేసుకుని అవన్నీ సంయుక్తముగా, ఐక్యతతో చక్కగా నడుపుకోగలిగితే రైతాంగ విప్లవానికి ముందు ముందు ఒక ఉజ్వల భవిష్యత్తు ఆ సూత్రములో ఇమిడి వుంది. "సతారా" జిల్లాలో గ్రామాల దగ్గర నుంచి జిల్లా స్థాయివరకు, ఈపంచాయితీ క్రమాల నిర్మాణముజరిగింది. అది చరిత్రాత్మకమైన కార్యసాధన. వారు చట్టాల్ని చేపేటందుకుగానీ, లేక చట్టాల్ని అమలులో పెట్టేటందుకుగాని తగిన సమర్థులుగా వ్యవహరించారు. వారు పన్నులు-పెన్నులు వసూలుచేసి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్ట గలిగారు. గత మహోజ్వల పంచా యితీ రాజ్యపు అలవాట్లు-ప్రజాస్వామ్యము వారి వారసత్వ హక్కులు కాబట్టి ఆ విధముగా చేయటము వారికేమాత్రము కష్టము కాదు. తమ సామాజిక కట్టుబాట్లతో దైనందిన వ్యవహారాలకు సంబంధించిన తగాయి దాలను పరిష్కరించే గ్రామీణ సత్తా సామర్థ్యము వారిలో గొప్పగా వుంది. ఇవే వారి వ్యవహారాలకు పునాదులుగా పనిచేసి నవి. కాబట్టి ప్రజా స్వామిక పంచాయితీల ద్వారా రాజకియాధికారాల్ని చెలాయించట ముగాని, లేక పరిపాలనా నిర్వాహణము గాని, వారు క్రొత్తగా నేర్చుకోవాల్సిన అవ సరము లేదు. భారత-చైనా-ఆఫ్రికా దేశాల రైతాంగము ఎప్పుడైనా ఆర్థిక-రాజకీయ సంబంధమైన పెత్తనాన్ని హస్తగతము చేసుకుంటే, ఆచరణలో చక్కగా పరిపాలించి

చూపెట్టిన చరిత్ర ఒకవేళ ఋజువు కావలసివస్తే వుంది.

రష్యాలో లెనిన్ మహాశయుడు వేరుచేసినట్లుగా, ఇతర భాగాలలోని రైతాంగ పోరాటాలతో మన రైతాంగ సత్యాగ్రహోద్యమాల్ని వేరుచేయటం ఇకను సాధ్య పడదు. ఎక్కడైతే పోరాటం జరుగుతుందో అక్కడకు, యావద్భారత దేశ రైతాంగం తమ దృష్టిని కేంద్రీకరించి, చందాలు వసూలుచేసి అఖిలభారత వ్యాప్తంగా సానుభూతి దినాల్ని జరిపి, సాధ్యమైన సమస్త విధాల, ఆ బాధితులకు అనేక సందర్భాలలో సహాయపడ్డారు. ఆ విధంగా మందసా సంస్థాన ప్రజలు, ఒరిస్సా సంస్థానాల ప్రజలు శిబిర వాసులైన శరణార్థులు, బెంగాలీవరదబాధితులు,రాయలసీమ కరువుబాధితరైతులు, మలబార్ రైతులు, ఇంకా అనేకమైన ఇతర ప్రజలు అఖిలభారత సహాయాన్ని కష్టసమయాల్లో పొందారు అఖిలభారత రైతు కాంగ్రెస్, సమస్త రైతాంగాన్ని జాతీయ రైతాంగ ఐక్యత నిమిత్తము, సమీకరించగలిగిందని చెప్పటము సత్యదూరము కాదు.

బర్మాలో కూడా, 1926-27 మధ్య దాదాపు నాలుగోవంతు బర్మా వైశాల్యానికి మించి వున్న ప్రదేశములో, ప్రసిద్ధి చెందిన 'ఐరావతి' విప్లవంలో రైతాంగము ప్రముఖ పాత్రని తీసుకుంది. సాంఘిక అవిధేయతోద్యమం, పన్నుల నిరాకరణోద్యమము, సునంఘటితముగా నడిపింపబడినవి. ఈ విప్లవములోని ప్రాముఖ్యత ఏమంటే బర్మా రైతులు తిరుగుబాటు చేసి ఒక పోటీ ప్రభుత్వాన్ని స్థాపించటం. అయితే పాపం, అది బ్రిటీషువారి బ్రహ్మాండ సామ్రాజ్యం ముందు నిలువలేక పోయింది. ఈ బర్మా విప్లవము, బర్మాకి భారత దేశముతో వున్న సంబంధమే కారణమని భావించి అది ఇంకా విజృంభిస్తుందేమోననే భయముతో, భారత దేశాన్నుంచి బర్మాని విడగొట్టారు. అయితే ఆ ఎడబాటు, బర్మా విప్లవ ప్రజలకేమాత్రము అడ్డురాలేక పోయింది. నేనూ నా భార్య 1939లో బర్మాని సందర్శించ బోయినపుడు బర్మా రైతులు వారు ఏ విధముగా భారత రైతాంగ ఉద్యమాల్ని అనుసరించి పోతున్నారో, బర్మా ప్రజలకు వారు కూడా ఎలా రైతు కూలి ప్రజారాజ్య ఆశయాన్ని సాధించి పెట్టేటందుకు కృషి చేస్తున్నారో వివరించారు. జపాన్ వారి చేతుల్లో బ్రిటన్ ఓడి పోయిన సందర్భములో 1942లో వారికి ఆ అవకాశము చిక్కింది. బర్మా ప్రజలువారి జాతీయ ప్రభుత్వాన్ని వేరే స్థాపించుకున్నారు అంతేకాక రాజ్యాంగ వ్యవహారాల్లో, యుద్ధాలలో తమ నేర్పు ద్వారా, నూతన సమస్యలు ఎలా ఉత్పన్నమౌతవో అవగాహన చేసుకోగలిగారు.



సుందరయ్య గ్రంథాలయ
A C. No. 81696

ఇండియా, బర్మాలు స్వాతంత్ర్యము పొందిన తరువాత, ఈ ఉభయ దేశాల లోనూ రైతు ఉద్యమము పెరిగి పోతున్నది. భారత దేశములోని రైతాంగము మీద ఎక్కువగా ఆధారపడిన కాంగ్రెస్ మంత్రి వర్గాలు. భూస్వామ్య విధానాన్ని రద్దుపరిచే చట్టాలు చేసే కార్యక్రమాన్ని చేబట్టినాయి. ప్రతికోట భూస్వాములకు నష్టపరిహారము ఇవ్వబడుతుంది. అంతేకాక, ముఖ్యముగా జమిందారీ ప్రాంతాల్లో వారికి చెల్లించవలసిన నష్టపరిహారము హెచ్చు మొత్తాలు కావటము వలన పూర్తిగా జమిందారీని స్వాధీనము చేసుకునేదానికి ఆలస్యము జరుగుతున్న విషయము యదార్థమే! అయితే, అసలు ఆచర ణలో భూస్వామ్యము అదృశ్యము అయిందనే చెప్పాలి, బర్మాలో కూడా కౌళ్ళు తగ్గిస్తూ, కౌలు రేటు స్థిరీకరిస్తూ కొన్ని చట్టాలు చేయబడటంతో త్వరలోనే తానొక వర్గ సభ్యుడిగా భూస్వామి ఇకను మచ్చుకైనా కనుపించటానికి వీలులేదు. ఈ ఉభయ దేశా లలో కూడా, రైతాంగ సంఘాలు తగిన బలాన్ని సంపాదించుకొనివున్నవి. తన మరణానికి ఒక్కరోజు ముందు జాతిపిత మహాత్మాగాంధీ స్వరాజ్య భారత దేశములో నిజమైన పాలకులుగా రైతులు వుండి, తదితరులంతా వారి తరపున పరిపాలన జరుపు కోవలసి వుంటుందని ప్రకటించాడు. రైతులు, తదితరుల రాజకీయ స్వాతంత్ర్యము కోసరము పోరాడుతున్న మాకు ఆయన దీవెనలు యిచ్చాడు. వాస్తవానికి 1945లోనే స్వరాజ్య భారత దేశములో "ప్రజాస్వామిక కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యము" కోసరము కాంగ్రెస్ పోరాడగలదని అయన మన ప్రజలకు హామీ యిచ్చాడు కూడ.

ఈ రోజు మనః పూర్వకముగా కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య స్థాపన కోసరము రైతాంగ ఉద్యమము పాటుబడుతుంది.

# రైతు కాంగ్రెస్-ఆంధ్రోద్యమం

అఖిల భారత రైతాంగ ఉద్యమ జన్మ స్థలము ఆంధ్రలోని "నిడుబ్రోలు" గ్రామము. పది శతాబ్దాల వెనుక కులోత్తుంగ చోళ చక్రవర్తి బ్రహ్మాండమైన శివాలయానికి పునాదులు వేసినందు వలన, తదుపరి ఒక శతాబ్దానికి, చోళ సామ్రాజ్య ప్రధాన మంత్రుల్లో ఒకడుగా అక్కడి రైతు ఉండటము వలన అదిచాల ప్రముఖమైన ప్రదేశముగానే పూర్వమునుంచీ వుంటూవచ్చింది. ఈ గ్రామమే "అఖిల భారత దేశక కాంగ్రెస్"కు ప్రధాన కార్యాలయము. అక్కడే 1933లో మహాత్మాగాంధీ చేత ప్రారంభించబడిన "భారత రైతాంగ విద్యాలయము" కూడా నెలకొల్పబడి వుంది.

1923లో ఆధునిక భారత రైతాంగ ఉద్యమము పుట్టింది. రష్యా వారి పరిశోధనల పట్ల, పూర్తినమ్మకముతో, ఉత్సాహముతో మన కష్టజీవుల్నికూడా చైతన్య ప్రపూరితుల్ని చేసే సంకల్పముతో, అటువంటి సాంఘిక విప్లవము ఇక్కడ కూడ తేగలందులకు, నేను ఐరోపా నుంచి తిరిగి వచ్చిన వెంటనే అసంఖ్యాకముగా రైతు సమావేశాలు జరిపించబడినవి. నా సహచరులైన సోదర రైతుల్లోనుంచి అనేక మంది అమిత బాధ్యతాయుత ఉత్సాహంతో ఉన్నా నేను వారి వృత్తిలోను సంఘములోనూ అన్ని విధాల భాగస్వామిని అయినప్పటికీ, వారు నాయందు అసక్తిని ప్రదర్శిస్తున్నప్పటికీ మహాత్మాగాంధి చేత నడిపించిన సహాయ నిరాకరణోద్యమము విప్లవ చైతన్యాన్ని కలిగించేటందుకే కాకపోయినట్లయితే, దీనికి అనుబంధముగానే గుంటూరు జిల్లా పెదనందిపాడు—దుద్దుకూరు గ్రామాల్లో పన్నుల నిరాకరణోద్యమము ప్రారంభించ బడకున్నట్లయితే, వారినుండి నా కంత బాధ్యతాయుతమైన సహకారము లభించివుండేది కాదేమో! కానీ వ్యవసాయ కూలీల్ని సమీకరించి సంఘాల్లోనికి చేర్చేపని ప్రారంభించినపుడు, రాజకీయముగా రైతులంత చైతన్యముగా అభివృద్ధి పొందని హరిజనుల ఆ మనస్తత్వాన్ని తెల్సుకున్నపుడు పై విషయము నాకు స్పష్టమైంది.

1923-28 మధ్య హరిజనుల నుంచి గూడూరు రామ చంద్రుడు, రైతుల నుంచి శ్రీ బాపినీడు, నేను, ఇంకా కొంతమంది స్థానిక సంఘాల్ని పెంపొందించే విషయములో తీవ్రముగా కృషి చేస్తుంటిమి. 1928లో ఆంధ్ర రాష్ట్ర రయితు సంఘము రయితు సమావేశాన్ని గుంటూరులో జరిపిన వెంటనే స్థాపించబడింది. అదే యావద్భారత దేశములోనూ మొట్టమొదటగా ఏర్పడిన రాష్ట్ర రయితు సంఘము.

శ్రీబాపినీడు, "ఆలమూరు" సహచరుడైన యన్. సత్యనారాయణ నేను కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డాము.

ఈ ఉద్యమానికి శాస్త్రీయ పునాదులు వేసే నిమిత్తము, "భారత గ్రామీణ ఆర్థిక సంపదము" అనే రెండు భాగాల ఇంగ్లీషు గ్రంథము ప్రచురింపబడింది. రయితాంగానికి సంబంధించిననాసిద్ధాంతాలు "ఆంధ్ర పత్రికలో" ప్రచురితమైనాయి. అప్పటి వరకూ మేమురూపొందించిన కార్యక్రమమంతా, గ్రామ పునరుద్ధరణ, శాస్త్రీయ వ్యవసాయము, మంచిపంటలు అధికోత్పత్తి చిన్నచిన్న భూఖండాల సమీకరణ, రయితు సంఘాలలో, వ్యవసాయముతో రయితుల మధ్య ఐక్యత, తక్షణ ఆర్థిక ఇబ్బందుల తొలగింపు అనే విషయాలను గూర్చి మాత్రమే పరిమితమై వుండేది ఒక విధముగా ఇటువంటి నిర్మాణాత్మక పద్ధతులలో అధికముగా భూమిని సాగుకు తేవడము, భూమి లేని వ్యవసాయదారులకు భూవసతులు కల్పించటము, గ్రామ—ఆటవిక పంచాయితీల నిర్మాణము కోసరము కృషిచేయటము ఈ మొదలయిన వ్యవహారాలతో మాకృషి మితమై వుండేది.

1929 భారత రైతాంగ ఉద్యమములో ఒక ప్రత్యేక సంవత్సరముఎందుకంటే ఆ సంవత్సరములో, బెజవాడలో జరిగిన రెండవ రాష్ట్ర రైతు మహాసభ అధ్యక్ష స్థానాన్నుంచి, మొట్టమొదటగా నేను భారతదేశములో "రయితురాజ్యము" అనే నినాదము ఇవ్వగలిగాను. సంయుక్త రాష్ట్రములోనూ బెంగాల్‌లోనూ కొద్దిమంది సోషలిస్టు భావాలు కలిగినవారు అప్పుడే రైతాంగ పార్టీల్ని స్థాపించుకుంటున్నారు.

ఈ "రైతురాజ్య" మనే నినాదము ఆంధ్ర రైతాంగ మనస్తత్వాన్ని ఆకర్షించింది. అందుకు కారణము లేకపోలేదు. వారు చాల కాలముపాటు బ్రిటీషువారి పంథాలోనే నడిచి విప్లవాత్మకమైన జాతీయ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నందున, వారు ఆధారముగా పట్టుకున్న బ్రాహ్మణేతరోద్యమము, దాని విలువని కోల్పోయింది. వారు యదార్థానికి దేశభక్తులే! అయితే లభించే స్వరాజ్యము తమకు దక్కాలని వాంఛ. ఇతరులకు లొంగి వుండే స్వాతంత్ర్యాన్ని వారెన్నడూ వాంఛించలేదు. వారికి రాజకీయాధికారము కావాలని మనసులో వుంది. దానికోసరము నిరీక్షిస్తున్నారు కూడ. అది ఈ నినాదములో వుందని వారు గ్రహించారు.

అయితే ఈ రాజకీయ నినాదము అనేక మంది ఇతర రాష్ట్ర రైతాంగ హృదయాల్ని ఆకర్షించలేకపోయింది. దానికి కారణము వారిలో తగినంతగా రాజకీయ చైతన్యము లేకపోవటమే! 1928లో సర్దార్ వల్లభాయి పటేల్ చేత విజయవంతముగా

నడిపించబడిన పన్నుల నిరాకరణోద్యమము ద్వారా, రాజకీయ చైతన్యానికి కావలసిన చిత్తు కార్యక్రమము తయారు చేయబడింది. ఆ రైతాంగ సత్యాగ్రహములోని ఘన విజయము. అసంఖ్యాక రయితాంగ కనువిప్పుకు దోహదమైంది. అంతేగాక దేశమంతటా తమ రాజకీయ సజీవత్వాన్ని తరతరాలనుంచి అనుభవిస్తున్న బానిసబంధాల నుంచి విముక్తిపొందే నిమిత్తము, ఆ ఉద్యమము ద్వారా దానిని నిలబెట్టుకునేదానికి అవకాశము లభించటమేకాక, వారి రాజకీయ ఆకాంక్షలకు రెక్కలుకూడా వచ్చినవి. అయితే, బార్డోలీ సత్యాగ్రహము నుంచే పాఠాలు నేర్చుకోవాల్సినంతగా ఆంధ్ర రయితాంగము వెనుకబడిలేదు. వారు రయితురాజ్య నినాదముతో ప్రజా చైతన్యాన్ని ప్రజ్వలింప చేయ ప్రారంభించారు. అందుచేత అది ప్రధాన రాజకీయ శక్తిగా మనగలిగింది.

**1930-34** ఆర్థిక మాంద్యము. రయితాంగ ఆదాయము క్రమముగా పడిపోవటము, వారి భూములకు తదితర వస్తువులకు విలువ తగ్గిపోవటము, అప్పుల భారము విపరీతముగా పెరిగిపోవటము, ఫలితముగా తమ భూవసతిని కోల్పోవటము, ఇవన్నీ కలిసి రయితాంగానికి ప్రపంచమందంతటా కళ్ళు తెరిపించి, ప్రపంచ మార్కెట్ల ద్వారా ప్రపంచ ధనిక వాద దోపిడీ విధానాన్ని చక్కగా చూపెట్టినవి. భారత రయితాంగము తమ సహజ విప్లవ ధోరణిలో ఈ వినాశనాన్ని ఎదుర్కొనేందుకు ఎప్పుడూ తయారే! అయితే, మళ్ళీ ఆంధ్రరైతాంగమే సుసంఘటితమైన పంథాలో అఖిల భారత వ్యాప్తంగా నాయకత్వం వహించగలిగింది. పంజాబ్‌లోని సిక్కు రైతాంగల తమకు తాముగానే "అప్పుల విముక్తి సంఘాల్ని" స్థాపించుకున్న విషయం, బెంగాల్ ముస్లిం రైతులు కౌలు అప్పులు, కౌళ్ళ బకాయీలు చెల్లించ నిరాకరించటమే కాక, జైలుకు పోవటానికి కూడా తయారవటం, యదార్థమే! కానీ, అన్ని విధాలైన వ్యవసాయ అప్పుల విముక్తికి, 'మారిటోరియం' ప్రకటించమని ఆందోళన ప్రారంభించి విప్లవాత్మకమైన ఆంధ్రరైతాంగం, ఆమాంద్యంలో, ఒక పంథా చూపించి, తన మార్గదర్శకత్వాన్ని నిలబెట్టుకుంది. ఈ ఆందోళన వెనుక దాని రాజకీయ ప్రాముఖ్యత కూడా వుంది. దానితోపాటుగానే శిస్తుతగ్గింపుకు — మినహాయింపుకుకూడా ఆందోళన కొనసాగింది. ఈ ఆందోళనలన్నింటికీ చక్కని సుశిక్షిత కార్యక్రమమిచ్చే నిమిత్తం, మొట్టమొదటగా భారతదేశంలో, రైతుయాత్రలకు, రాజకీయ ఆర్థిక సంబంధమైన ఆయుధంగా ఉపయోగపడిన "రైతురక్షణ సంఘం" అనేది 1931 లో తెనాలిలో స్థాపించబడింది.

రెండు విధాలైన ఆర్థిక ఆందోళనా సమ్మేళనం, రైతుయాత్రల్ని ఆశీర్వదిం

టమేకాక రాజకీయ మనస్తత్వం కలిగిన, నిరుత్సాహ నిస్పృహ పూరితులైన, రైతాంగ సమీకరణకు, ఆ విధంగా దేశమంతటా తోడ్పడినందున ఆంధ్రరైతు ఉద్యమం అఖిల భారత ప్రాముఖ్యత దృష్ట్యా వారిని ఆకర్షించింది.

జమిందారి వ్యతిరేకోద్యమం :

తిరిగి మరోమారు 1931లో జమిందారీ విధానానికి వ్యతిరేకంగా ఆంధ్ర రైతాంగ ఉద్యమం నడుపటంవలన, అది భారతప్రజల దృష్టిని ఆకర్షించింది. 193.లో రైతు సంఘంచేత నియమించబడిన "ఆర్థిక విచారణ కమిటీ" జమిందారీ పరిపాలన లోని అవకతవకల్ని, ముఖ్యంగా "వెంకటగిరి" జమిందారీలోని స్థితిగతుల్ని వివరించింది. తద్వారా, మధ్యయుగపు ప్రజల బ్రతుకుకంటే ఆధునిక జమిందారీ ప్రాంతాల్లోని ప్రజలబ్రతుకు దుర్భరంగా వున్నదన్న నగ్నసత్యం భారత హృదయాల్ని కదిపివేసింది. స్వతంత్ర రాజులకున్న సమస్త అవకాశాల్ని జమిందార్లు ప్రజల రక్తాన్ని పీల్చుకుని అనుభవిస్తూ, ప్రజలయెడ తమ బాధ్యతల్ని మరిచిపోయారని తేలిపోయింది. ఇదికూడా అఖిలభారత దృక్పథానికెక్కింది. ఆంధ్రరైతాంగ స్థితిగతుల్నే ఆధారంగా పరిస్థితుల్ని తిలకించమని సంయుక్త రాష్ట్రాల రైతాంగానికి అలహాబాద్ నాయకుడు పిలుపిచ్చాడు కూడ.

శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు, సత్యమూర్తి (మద్రాసు) శ్రీయుత విశ్వనాథదాస్ (మాజీ ఒరిస్సా ముఖ్యమంత్రి అయినాడు) నెల్లూరి వెంకట్రామా నాయుడుగార్ల సమక్షంలో జరిగిన "వెంకటగిరి జమిందారీ రైతాంగ" మహాసభలో చరిత్రాత్మకంగా, "జమిందారీ విధానం నశించాలి" అనే నినాదం ఆమోదించబడింది. ఆ నినాదానికి ప్రాతినిధ్యం వహించేదానికి, ఆ సమావేశానికి అధ్యక్షత వహించేదానికి నాకు అదృష్టం కలిగినందుకు ధన్యుడ్ని. ఆ తరువాత నాలుగేళ్ళకే అఖిలభారత నినాదంగా అది వ్యాపించింది. ఈరోజు భారతజాతీయ కాంగ్రెస్ సైతం దీన్నే మంత్రోచ్చారణగా స్వీకరించింది. అన్ని రాష్ట్రాలలోని తమ తమ శాసన సభలలో కాంగ్రెస్ మంత్రివర్గాలు జమిందారీ రద్దుబిల్లుల్ని తయారుచేసే విషయంలో - అమలు జరిపే విషయంలో తీవ్రంగా పని చేస్తున్నవి.

నెల్లూరి వెంకట్రామానాయుడు :

జమిందారీ రైతు ఉద్యమానికి తండ్రి, జమిందారీ విధానం నశించాలి అనే నినాదానికి మూలపురుషుడు, ఆంధ్రరైతాంగ విప్లవ తలమానిక, ప్రముఖ భారతీయవార్ధి

అయిన మన నెల్లూరు వెంకట్రామానాయుడు ఒక పేదరైతు. అంతేకాదు. స్వయం కృషితో, స్వానుభవవిద్యను పొందిన ఒక గ్రామస్థుడు. ఆయన ఒక ప్రముఖ రైతు నాయకుడు. వాస్తవానికి ఆయన భారతరైతు ఉద్యమానికే పితామహుడు. వెనుకటి ఆంధ్రరైతు రాజులైన కాకతీయ - మనుమసిద్ధులకు వారసుడు. ఆయన మహా భారతాన్ని రచించిన తిక్కన్న పుట్టిన ప్రదేశంలోపుట్టి, మహాత్మాజీ శక్తిని జీర్ణించు కున్నాడు. అటువంటి చైతన్యం కలిగిన విప్లవ కార్యకర్తని రైతాంగభక్తుని మరెవరినీ నేను చూడలేదు.

ఐరోపీయ సామ్యవాద పాతశాలకు చెందిన మార్క్సుభావాలు మాబోటివారి మీద తమ ప్రభావాన్ని నిలబెట్టుకోవచ్చు. ఏవో కొన్ని సిద్ధాంతాలు చదివిన మాకు జమిందారీ రద్దువిధానాన్ని గురించి పోరాటం సృష్టించగలిగిన శక్తివుంటే ఉండవచ్చు. మేము రైతురాజ్య సాధనగూర్చి కలలుగనటం కూడా సహజం. కానీ ఆంధ్ర సాహిత్యా నికి - సంస్కృతికి - రైతాంగానికి నిజమైన ఈ ప్రతినిధి, భారతదేశ సుగుణ సంపద లకు పెట్టనికోట అయిన ఈవ్యక్తి, 1926 లోనె, ఏవిధంగా విశాలదృష్టితో - అమిత ధైర్యంగా ఈ బలీయమైన దుర్భర విధానం, త్వరగా రద్దుకావలసిన ఆవశ్యకతని గూర్చి విధానం ఇవ్వగలిగాడు? దీనికి నా సమాదానం : రెండు వేల సంవత్సరాల స్వాతంత్ర్య సంప్రదాయం, అధికారం ఆత్మగౌరవం, పంచాయితీ రాజ్యం, పెద్యేండ్ల వీరపూజా సంప్రదాయం, యుద్ధమమకారం, మొదలైన దక్షిణభారత రైతాంగానికున్న లక్షణాలు; అనుమానాస్పదం లేకుండా మనదేశ పత్రికా స్వాతంత్ర్యానికి, రైతాంగానికి ప్రాతి నిధ్యం వహించగలిగిన రామానాయుడువంటి వారిని సృష్టించుకొని వుంటవి.

# స్వయం కల్పిత వృత్తి వ్యవస్థే
# మన ఆర్థిక సమస్యల పరిష్కారానికి మార్గం

అశేష శ్రామికజనాలు తరతరాలుగా స్వయం కల్పితవృత్తులు చేపట్టి స్వతంత్రఉద్యోగం చేసుకుంటూ, ప్రభుత్వంపైగాని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలపైగాని ఆధారపడకుండా సర్వస్వతంత్రులుగా ఎవరికీ తల వంచకుండా, ఆత్మాభిమానంతో ఆత్మవిశ్వాసంతో జీవితం సాగిస్తున్నారు. వారికి రక్షణ కావాలంటారు రంగాజి. వారికి స్వాతంత్ర్యం కావాలంటారు రంగాజి. అదే రైతు, కూలి చేతివృత్తులు, బుద్ధిజీవుల ప్రజాస్వామిక రాజ్యాంగం. దానినే కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్ సిద్ధాంతంగా, బాపూజీ ఆశీస్సులు పొందారు రంగాజి. పైయావత్తుగ్రామీణ శ్రామికజనాల అభివృద్ధి, వికాసాలకు చేపట్టదగు కార్యాచరణ పథక రచనయే యీ వ్యాసం. "1959 నవంబరు." సంపాదకుడు

వ్యక్తిక కేపిటలిస్టు రంగం గురించి మన ప్రణాళికా సంఘం తీసికొంటున్న దృక్పథం, అవలంబిస్తున్న విధానాలు స్వయం కల్పిత వృత్తిదారుల పట్ల ఏమాత్రం తగవవి గమనించవలసి ఉన్నది. ఇప్పటికే చాల ఆలస్యమైనప్పటికి ఇకనయినా ఈ గమనింపు అవసరం. ఈ మాట అంటున్నామంటే దీనికి కారణం ఉన్నది. కేవలం స్వలాభా పేక్షతో కార్యరంగంలోకి దూకే కొద్దిమంది పారిశ్రామికుల అనంతమైన స్వేచ్ఛకు భద్రత కలిపించటం, ఆ సంస్థలలోని అసంఖ్యాక ప్రజలకు ఈ స్వేచ్ఛను నిరాకరించటం కేపిటలిజానికి ప్రత్యేక లక్షణం. కాని స్వయం కల్పిత వృత్తివ్యవస్థ ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఈ వ్యవస్థలోని సభ్యులకందరకు ఇలాంటి స్వేచ్ఛ ఉంటుంది; ఆ స్వేచ్ఛకు భద్రతకూడ ఉన్నది. 'వీరికి సహజమైన ఉత్సాహ ప్రోత్సాహాలు, ఆత్మగౌరవం ఉంటవి. ఆర్థికాధికారం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతం కావటానికి కేపిటలిజం దారితీస్తుంది. కాని స్వయంకల్పిత వృత్తి వ్యవస్థ ఇందుకు భిన్నంగా ఈ ఆర్థికాధికారాన్ని సాధ్యమైనంత ఎక్కువమందికి పంచుతుంది. సాంఘికంగా గాని,

ఆర్థికంగా గాని లేక రాజకీయంగా గాని సంఘంలో ఉండే అధికారానికి ఒక ప్రత్యేక లక్షణం ఉన్నది. అధికారం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమైనప్పుడు తత్ఫలితంగా ఆ అధికారులలో అహంకారం ప్రబలి, బాధ్యతారహితంగా ప్రవర్తించటం అలవడి, నియంతృత్వానికి బాటలు పడతవి. ఇలాకాక అధికారం వికేంద్రీకృతమై ప్రజలచేతుల లోకి పోయిననాడు సంఘానికి అది ప్రయోజనకారి అవుతుంది.

పెద్దపెద్ద పారిశ్రామిక వ్యాపార సంస్థలలో తమకుగల వాటాలమీద, ఇతర ఆస్తులమీద ఎలాంటి పరిమితులు పెట్టనీయకుండా కేపిటలిస్టులు ప్రభుత్వాన్ని ఇంతవరకు అపుతూనే ఉన్నారు. కాని స్వయంకల్పితవృత్తి వ్యవస్థలోని అధిక సంఖ్యాకవర్గమైన రైతులు మాత్రం తమ భూవసతులకు గరిష్ఠ పరిమితులు విధించే సూత్రాన్ని ఆమోదించారు. ఇతర రంగాలలోని పలువిధాలైన ఆస్తుల మీద, ఆదాయాలమీదకూడ ఇలాంటి పరిమితులను విధించాలని రైతులు కోరుతున్నారు: కాని ఇంతవరకు ప్రయోజనం కనిపించలేదు. ప్రభుత్వంతో పోటీపడి ప్రభుత్వరంగాన్ని తమకుదూరంగా ఉంచగల శక్తి కేపిటలిస్టులకు ఉన్నది. స్వయంకల్పిత వృత్తిదారులయిన రైతులకు, కేపిటలిస్టులకు వారి వారి దృక్పథాలలోనే చాల తేడాలున్నవి. రైతులు తమ వ్యావసాయకోత్పత్తులకు కనీసపు గిట్టుబాటు ధరలు లేకపోయినా ఎంతో ఔదార్యంతో, త్యాగంతో ఆ కొద్దిపాటి ధరలకే అంగీకరించారు. కాని ఇతర పారిశ్రామికులు తమ పారిశ్రామికోత్పత్తులకు అధికమైన ధరలు కావాలని ప్రయత్నించి సఫలీకృతులయినారు. కాబట్టి గిట్టుబాటు ధరలు లేకపోయినా ప్రజాసేవానురక్తితో వాటిని అంగీకరించిన మన రైతులకు - స్వలాభాపేక్షతో తమ వస్తువుల ధరలను అనంతంగా పెంచివేసిన కేపిటలిస్టులకు ఎంత అంతర మున్నదో ఆలోచించండి జాతికి కావలసిన ఆహారాన్ని అందించ వలసిన బాధ్యత ప్రభుత్వానిది. చౌకగా ఆహారాన్ని అందించటంలో తమ కెన్ని కష్టనష్టాలున్నప్పటికి రైతులు ప్రభుత్వంతో హృదయ పూర్వకంగా సహకరించారుగదా! దేశము జాతి క్లిష్టపరిస్థితులలో ఉన్న సమయంలో స్వార్థప్రేరితులయిన కేపిటలిస్టులు ఏమి చేశారో అందరకు తెలిసిన విషయమే. మనకు ఉన్న కొద్దిపాటి విదేశీ మారక ద్రవ్యాన్ని అనేక విధాల దొంగవాటుగా ఇష్టంవచ్చినట్లు వినియోగించి ప్రభుత్వ కృషిని విఫలంచేసి ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టారు. మన ప్రభుత్వాశయమయిన సోషలిస్టు పద్ధతి సమాజ సిద్ధాంతలో అంతర్భాగాలయిన ఉత్పత్తి విధానాలను, వినిమయ మార్గా

అను వ్యాపార - పారిశ్రామికాధినేతలు తలక్రిందులు చేసి చిక్కులు కలిగించారు. అందుచేత స్వయంకల్పిత వృత్తి వ్యవస్థకు, వ్యక్తికి కేపిటలిస్టురంగానికి ఎంతో భేదం వున్నది ఇవి రెండు ఒకే రంగానికి సంబంధించిన వనుకోవడం పొరపాటు. ఈరెండు రంగాలు భిన్న భిన్న వ్యవస్థలని గమనించాలి. వాటి రెంటికి సంబంధించిన విధానాల లోను దృక్పథాలలోను ఆ తేడా కనిపించాలి. వీటి రెంటిని విడిగా దేనికి దానిగా చూడాలి గాని కలిపి చూడరాదు.

ఈ స్వయంకల్పిత వృత్తిదారులను కేపిటలిస్టులకు భిన్నంగా విడిగామాడ విరాకరించిన పక్షంలో జాతికి ఎంతటి నష్టం సంభవించగలదో మన ప్రణాళికా కారులు గుర్తించాలి. రైతుల స్వయంకల్పిత వృత్తి హోదాను, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి తలక్రిందులు చేయగల ప్రణాళికల మూలంగా ఎంతటి అరిష్టం కలగనున్నదో ప్రణాళికా సంఘం గుర్తించాలి. స్వతంత్ర జీవులయిన రైతులను అటు లాగి ఇటు లాగి కేపిటలిస్టులుగానో లేక కూలీలుగానో చేయప్రయత్నించితే ఆ ప్రయత్నం తప్పక విఫలం కాగలదని ప్రణాళికా కారులు గ్రహించాలి. సరిగా అభివృద్ధి చెందీచెందని దేశాలలో రైతులను స్నేహితులుగా గుర్తించి, వారిపట్ల విశ్వాసం ప్రదర్శించి, వారి సహాయ సానుభూతులను పొందటం దేశానికి ఎంతో అవసరం, లాభదాయకం ఎవరెన్ని చెప్పినా ప్రజాస్వామిక సంఘంలో నిజమయిన సోషలిజానికి లక్షణం ఏమిటి? వికేంద్రీకరణే గదా! దేశంలోని సంపద, అధికారం, ఉత్పత్తి సాధనాలు, సంఘాలు సాధ్యమైనంతవరకు వికేంద్రీకరింప బడటమే కదా! ప్రజాస్వామిక సోషలిజానికి లక్షణం! మన రైతులు, చేతివృత్తులవారు, కళాకారులు ఈ వికేంద్రీకరణకు పునాదాలు. ఈ విషయంలో భారత దేశం అదృష్టాన్ని కొనియాడవలసి వున్నది. పాశ్చాత్యుల పారిశ్రామిక సామ్రాజ్యవాదం రెండు శతాబ్దాలపాటు భారత దేశాన్ని పీడించి వదలి నప్పటికి ఉత్పత్తి సాధనాలు దేశవ్యాప్తంగా వికేంద్రీకృతమై ఉన్న మనరైతాంగ ఆర్థిక వ్యవస్థమాత్రం చెక్కు చెదరకుండ నిలిచి ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. అభినందిందుకొనవలసిన సంగతి. ఈ వికేంద్రీకృత కూడలులు (అంటే రైతు కుటుంబాలు) మన సంఘ ఆర్థిక వ్యవస్థకు ఈనాటివరకు పునాదులుగా ఉండగలగటం సంతోషించవలసిన విషయం. ఏమైనప్పటికి శతాబ్దాల తరబడి విస్మరింపబడి, నిర్లక్ష్యం చేయబడుతున్న ఈ రైతు కుటుంబాలకు ఇప్పటికైనా నేటి ప్రణాళికా బద్ధమైన ఆర్థిక

వ్యవస్థలోనైనా వెంటనే తగిన సహాయం చేయటం మన ప్రథమ కర్తవ్యం. ఈ రైతుల కృషిని సహకారపూర్వకంగా సమన్వయపరచటం, వీరికి కావలసిన ఋణసౌకర్యాలు ఏర్పాటు చేయటం, వీరి ఉత్పత్తి కార్యకలాపాలకు కావలసిన ఇతర పనిముట్లను, వస్తువులను వెంటనే అందించటం మొదలైన సహాయాలు జరగవలసి వున్నవి. వీటినన్నింటిని సాధించటానికి సహకార సంఘాలు కావాలి. సహకార సమన్వయాలతో సామరస్య పూరితంగా విలసిల్లగల సాంఘిక స్థితిగతులు ఏర్పాటు కావాలి. రైతాంగానికి ఈభద్రతలు కలిగించాలి.

ఈ స్వయంకల్పిత వృత్తివ్యవస్థకు కావలసిన ధనం, ఇతర సహాయాలు వాస్తవానికి అంత పెద్దవేమీకాదు. దేశంలో పారిశ్రామికాది ఇతర రంగాల అవసరాలతో పోల్చి చూచినప్పుడు ఈ మాట నిర్భయంగా చెప్పవచ్చు. అంతేకాక ఈ రంగానికి అందించే సహాయం ఎంతో పొదుపుగా, సక్రమంగా, వినియోగించబడి, మంచి లాభాలు వస్తాయనటంలో కూడ ఎట్టిసందేహం వుండనవసరం లేదు. ఇతర రంగాలకు కావలసిన సహాయాన్ని అందించటంలో మోయవలసినంతటి భారం దీనిని గురించి ప్రభుత్వానికి ఉండదు. ఈ స్వయంకల్పిత వృత్తివ్యవస్థ పట్ల స్నేహపూర్వక దృక్పథం వహించిన పక్షంలో ఈ వ్యవస్థ రక్షణకు, అభివృద్ధికి వినియోగించబడే ప్రతి పైస కూడ పెద్దఎత్తున అధికోత్పత్తి సాధనకు ఉపయోగపడే మంచి ఫలితాలను ఇయ్యగలదని ప్రభుత్వం వారు గ్రహించగలరు.

## స్వయంకల్పిత వృత్తిదారులపట్ల ప్రభుత్వ బాధ్యత

మన జాతీయ జీవితంలో ఈ స్వయంకల్పిత వృత్తివ్యవస్థ చాల ప్రముఖభాగమని ఇది శాశ్వతమైన భాగమని ప్రభుత్వం గుర్తించి అంగీకరించాలి. స్వయంకల్పిత వృత్తిదారుల ఉత్పత్తి విధానాలను ఆధునికీకరణ కావించటానికి ప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలి. వీరి సాంకేతిక సామర్థ్యాన్ని, సాంస్కృతిక స్థితిగతులను అభివృద్ధి చేయటానికి వెంటనే ప్రయత్నాలు ప్రారంభం కావాలి.

ముఖ్యంగా భూమి ఎత్తుపడిపోకుండ జేయటంలోను, భూసారాన్ని పెంపొందించటంలోను కనుగొనబడిన శాస్త్రీయ పరిశోధనలను వెంటనే అమలులోనికి తీసికొని వచ్చి రైతులకు నేర్పటం అవసరం. నీటిసౌకర్యాల ఏర్పాటును గురించి, పంటకాల్వల తీరుతీయాలని గురించి వచ్చిన ఆధునిక పద్ధతులను వెంటనే నెలకొల్పాలి. ఆధునిక వ్యవసాయ విధానాలను అమలులో పెట్టటానికి తగినంత విస్తరంగా పెద్దఎత్తున నీటి పారుదల సౌకర్యాలు కలిగించటంకూడ అవసరం. శాస్త్రీయంగా పరిశోధించబడిన మంచిమంచి విత్తనాలు అదనుకి అన్ని స్థలాలలోను చౌకగా అందేటట్లు చేయాలి.

ఈ స్వయంకల్పిత వృత్తిదారులందరు ఇంచుమించు గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తూ ఉంటారు. కనుక వీరి ఆర్థిక సాంస్కృతిక స్థాయిని అభివృద్ధి చేయటానికి కావలసిన సాంఘిక వాతావరణం కలిగించటానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. ఉదాహరణకు గ్రామాలలో మంచిదుకాణాలను నెలకొల్పాలి; రోడ్లను వేయాలి; రవాణాకు ఉపకరించే కాల్వలను ఏర్పరచాలి; రైలుమార్గల శాఖలను విస్తరింపచేయాలి. ఇంతేకాక గ్రామాలలో బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, గ్రంథాలయాలు, పాఠశాలలు, వైద్యశాలలు, పరిశోధనశాలలు నెలకొల్పాలి. గ్రామాలలో ముఖ్యంగా కావలసిన వాటిలో ఋణం ప్రధానమైనది. ఈ ఋణ సౌకర్యం కలిగించటానికి ముఖ్యంగా సహకార ఋణ సౌకర్యాలు ఏర్పాటుచేయాలి. గ్రామీణ ప్రజలకు కావలసిన నిత్య జీవితావసర వస్తువులను, ఇతర పరికరాలను అందించటంకోసం కో - ఆపరేటివ్ స్టోర్సులను ఏర్పాటుచేయాలి.

గ్రామాలలో ఏర్పరచే బహుళార్థసాధక గ్రామీణ సహకార సంఘాలు, చేయవలసిన పనులు చాల ఉన్నవి. గిడ్డంగులు, దుకాణాలు, ఆహార పదార్థాలను తయారు చేసే కేంద్రాలు మొదలయిన వాటిని నిర్మించవలసి ఉండటముచేత మరి రెండు పంచవర్ష ప్రణాళికల వరకుకూడ ఇవి గ్రామాలలోని రైతులకు, ఇతర చేతివృత్తుల వారికి అవసరమయ్యే ఋణములో సగము కోసము మాత్రమే అందించగలవు. అందుచేత ఆమిగిలిన సగము స్వయం కల్పిత వృత్తిదారులు కేపటలిస్టు ఋణదాతల

మీదనే ఆధారపడవలసి ఉంటుంది కాబట్టి ఋణదాతల చర్యలపై తగిన నియమ నిబంధనలు ఉంచటముకోసము ఋణదాతలను క్రమబద్ధము చేసే చట్టము ఒకదానిని తీసికొనిరావలసి ఉంటుంది. ఒక ప్రక్క ఋణదాతలను మరొక ప్రక్క చిల్లర దుకాణ దారులకు రిజర్వు బ్యాంకు, స్టేట్ బ్యాంకు కొంత ధన సహాయము చేయవలసి ఉంటుంది. ఆయా వ్యక్తులవద్ద ఉండేసరకుల హామీ మీదగాని, ఇతర హామీలమీదగాని, ఈ ధనసహాయము చేయవలసి ఉంటుంది.

స్వయం కల్పిత వృత్తిదారులకు వారి ప్రధాన వృత్తుల ద్వారా, తత్సంబంధమైన ఇతర అనుబంధ వృత్తుల ద్వారా సంవత్సరములో ఎంతకాలము పనిపాటలు దొరుకు తున్నవో తెలిసికోవటానికి తగిన లెక్కలను అప్పుడప్పుడు సేకరిస్తు ఉండాలి. కనీసము మూడు సంవత్సరాలకు ఒకమారైనా ఈ లెక్కల సేకరణ జరగాలి. ఈ లెక్కలు ప్రతి గ్రామములోని ప్రజలకు తెలియజేయబడుతూ వుండాలి. జీవితరంగములో ప్రవే శించనున్న యువకులకు వారి తల్లిదండ్రులకు ఈలెక్కలు ముఖ్యముగా అందుబాటులో ఉండాలి. ఈ వివరాలు ఈ కొత్తవారికి ఎంతగానో తోడ్పడుతవి.

నిత్యజీవితావసర వస్తువుల ఉత్పత్తి వ్యయము ఎంతెంతగా ఉన్నదో తెలియ చేసే వివరాలను జీవన వ్యయానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తీసి కొంటు వుండాలి. ఇలా జీవితావసర వస్తువుల వ్యయానికి సంబంధించిన లెక్కలను బట్టే తదనుగుణముగా ప్రభుత్వ విధానాలు ఎప్పటికప్పుడు వివరించబడుతూ వుండాలి.

గ్రామీణ ప్రజలకు కావలసిన గృహవసతిని గురించి సరైన అంచనాలు తయారు చేయాలి. వ్యవసాయ కూలీలకు, ఇతర చేతి వృత్తుల వారికి, రైతులకు కావలసిన వివిధ గృహాల నమూనా పథకాలను - వారి వారి అవసరాలను బట్టి సిద్ధం చేయాలి. రైతులకు కావలసిన పశువులగాదులు, బ్యారెన్లు మొదలయిన వాటిని గురించి కూడా సరైన లెక్కలు తయారు చేయాలి. ఆయా రైతులకు కావలసిన ఋణ సౌక ర్యాలు, ఇతర వస్తువుల అవసరాలు సరిగా అంచనా వేసి అందించటానికి ఈ లెక్కలు, అంచనాలు ఉపయోగపడతవి. ఆ ఉద్దేశముతోనే ఈ అంచనాలు జరిగాలి.

ఇవికాక మన పంచవర్ష ప్రణాళికలలో సూచించబడిన ఇతర సహాయాలు కూడ మరింతగా అందించాలి. స్వయంకల్పిత వృత్తిదారులకు ఈనాటి అవసరాలకు సరి పోయేటంతగా ఈ సహాయ కార్యక్రమాలు జరగాలి. మన ప్రణాళికా కారులు స్వయం కల్పిత వృత్తిదారులకు ఇదివరకె కొంత సహాయము చేశారు, కాని అది చాలకొద్ది. అయినప్పటికి ఆ కొద్దిపాటి సహాయముతోనే వీరు చాల అభివృద్ది సాదించారు. మన ప్రణాళికా సంఘమువారు ఈ విషయమై ఇదివరలో అవలంభించిన నిర్లక్ష్య వైఖరిని ఇకనైనా సవరించుకోవటము అవసరము.

## గ్రామీణ పరిశ్రమలు

స్వయంకల్పిత వృత్తి వ్యవస్థలోని ప్రజలకు ప్రధానమైన రెండు సమస్యలు ఎప్పటి కప్పుడు అధికమవుతు ఎదురవుతున్నవి. నిత్యము కష్టించి శ్రమించి ఈప్రజల జీవన ప్రమాణము పెంచటము ఒక సమస్య. ప్రతి సంవత్సరము ఈ రంగములోనికి అధికముగా, నూతనముగావచ్చే యువకులకు పనిపాటలను చూపించటము రెండవ సమస్య. ఈసమస్యల పరిష్కారానికి కొన్ని మార్గాలున్నవి. వ్యవసాయోత్పత్తులను కార్య కలాపాలను విస్తృతము చేయాలి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించిన పరిశ్ర మలను ఏర్పాటు చేయాలి. కొన్నికొన్ని పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకిం చాలి. ఇలా చేస్తే ఈ పరిష్కారము తేలికే, చెట్ల పెంపకము, పట్టుపురుగుల పెంప కము, కూరగాయల పెంపకము, ఇతర ఫలవృక్షాల పెంపకము మొదలైనవాటిని అభి వృద్ధిచేసికొని వ్యవసాయ కార్యకలాపాలను, ఆదాయాన్ని పెంపొందించు కొనవచ్చు. పశు విస్తరణ పథకాలు, పాడిపరిశ్రమ, తేనెటీగల పెంపకము ఆహారపదార్థాలను తయారుచేయటము, ఈ మొదలైన వ్యవసాయానికి సంబంధించిన పరిశ్రమలకుకొన్ని ఉదాహరణలు ఇక ఈ స్వయంకల్పిత వృత్తివ్యవస్థకు ప్రత్యే కించవలసిన పరిశ్రమ లను గురించి, వాటి వివరాలనుగురించి ఆలోచించటముకోసముఒక సంఘాన్ని నియ మించటము అవసరము. ఈ పనులు చేసినవక్షంలో స్వయం కల్పిత వృత్తి రంగము లోని వారికి పనిపాటలకు కొదవ ఉండదు. ఆదాయానికికూడ మార్గాలు ఏర్పడుతవి.

ఈ పై చెప్పిన కార్యకలాపాలు వల్ల ఎట్టి ప్రయోజనాలు సిద్ధించగలవో సూచించటానికి ఆహార పదార్థాలను తయారు చేసే కేంద్రాలను, గుడ్డల పరిశ్రమను గురించి ఉదహరిస్తాను. ఈ ఉదాహరణవల్ల స్వయము కల్పిత వృత్తిదారుల ఆదాయానికి ఇవి ఎంతగా తోడ్పడగలవో తెలుస్తుంది. ఆహారపదార్థాలను కొనుక్కొనే వారు, చెల్లిస్తున్న మూల్యములో నూటికి 40 వంతులు ఆ పదార్థాలను తయారుచేసే వారికి పోతున్నదని పాశ్చాత్య దేశాలలో అంచనా వేశారు. కాబట్టి ఈ పరిశ్రమలను బాగా పెంపొందించిన పక్షములో దీనివల్ల గ్రామీణ ప్రజల ఆదాయము పెరిగి వారి జీవన ప్రమాణముకూడ పెరగగలదు. అలాగే ఇండ్లలో వాడకానికి పనికివచ్చే ముతక మధ్యరకముబట్టలు తయారు చేయటాన్ని గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించవచ్చు. దీనిమూలముగాకూడ స్వయం కల్పితవృత్తిదారుల ఆదాయము, జీవనప్రమాణము పని పాటలు పెరగ గలవు.

ఇక గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించవలసిన గృహపరిశ్రమలు, మధ్య రకము పరిశ్రమలు ఉన్నవిగదా! పరిశ్రమలను దేశ వ్యాప్తముగా అన్ని ప్రాంతాలకు సమముగా విభజించి పెంపొందించే విధానము అవసరము. ఈ విధానము ద్వారా .పరిశ్రమలకు గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించవలసి ఉన్నది. పరిశ్రమలను వీలయినంతవరకు ఇలా దేశవ్యాప్తము చేసి ఇంచుమించు ప్రతి గ్రామము ఆర్థికముగా ఉండటానికి సహాయపడాలి. వృత్తి సౌకర్యాలను అన్ని ప్రాంతాలకు చూపటము, ఆదాయాలకు మార్గము చూపటము దీనికి ఆదర్శాలు. అంతేగాక ఇలా చేసినందువల్ల ఒక ప్రాంతము లోని వారికి పనులుండి మరొక ప్రాంతములోని వారికి పనులు దొరకని స్థితి ఏర్పడదు. అన్ని ప్రాంతాలు సమముగా అభివృద్ధి చెందుతవి. పరిశ్రమలుకూడ దేశమంతట విలసిల్లుతు ఉంటవి.

ఇవి స్వయంకల్పిత వృత్తిదారులకు ఎంతో అవసరమయిన విషయాలు. అయినప్పటికి ప్రభుత్వము యీ విషయాలు తనకు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటము చేత వీటినిగురించి ఇంత విపులముగా చెప్పవలసి వచ్చింది. యీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి

ఉదాహరణలు కోకొల్లలుగా చూపవచ్చు. ఒకటి, రెండు విషయాలు మాత్రమే ఇక్కడ చూపుతున్నాను. ఉత్పత్తి అధికము కావాలంటే శాస్త్రీయముగా పరిశీలించబడిన విత్తనాలను రైతులకు అదునుకు సరఫరా చేయటము చాల ప్రధానము. అన్న విషయము గుర్తించటానికి ప్రభుత్వానికి తొమ్మిది సంవత్సరాలుపట్టింది. కొత్తసాగులోకి తీసికొనిరాబడినభూముల మీద మొదటి ౮ లేక 10 సంవత్సరాల వరకు ఎలాంటి అభివృద్ధి పన్నులు వేయరాదని గుర్తించటానికి కూడ ప్రభుత్వానికి దీర్ఘ కాలము పట్టింది.

మనదేశములోని ప్రత్యేకమైన సాంఘిక ఆర్థిక స్థితిగతులమూలముగా ఉత్పన్నమయ్యే కొన్ని చిక్కులను పరిష్కరించటానికి ఈ స్వయం కల్పిత వృత్తి సిద్ధాంతాన్ని ఒక మార్గముగా నేను ప్రతిపాదిస్తున్నాను. లక్షలాది కుటుంబాలకు పనిపాటలు చూపించటము మనదేశములోని ప్రధానసమస్య. ముందు నిర్వర్తించవలసిన కర్తవ్యము. పని దొరకని రోజుల్లా వీరికి పస్తుతప్పదు. ఆధునిక స్థితిగతులలో నిరుద్యోగము ఆత్మహత్యలకు నేరాలకు సంకుచితత్వానికి దారితీయకతప్పదు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఈ కారణము చేతనే ప్రతి అంగుళము భూమి ఎవరో ఒకరి సొంతముగా ఉంటున్నది. అంతేకాక మానవునికి ఉపయోగపడగల పశుపక్ష్యాదులు సైతము వారివారి వ్యక్తిగత ఆస్తులుగా ఉంటున్నవి. పనిపాటలకు అడిగే హక్కు ఉన్నదని ఆదేశాలు గమనించినవి. ఇలాంటి దేశాలలో ప్రజలకు కావలసిన పనిపాటలు చూపించలేని పక్షములో ప్రభుత్వము అలాంటి ప్రజలకు నిరుద్యోగ సహాయ నిధి ఏర్పాటు చేస్తుంది కాని భారత ప్రభుత్వము మాత్రము తన ప్రజలకు పని చూపించేస్థితితో లేదు. నిరుద్యోగులకు ఆర్థికముగా సహాయపడగలస్థితిలో అంతకుముందేలేదు అందుచేతనే యీ స్వయంకల్పిత వృత్తి విధానము ఎంతో కాలంనుంచి ఆయా కాలపరీక్షలకు నిలబడి తట్టుకొంటూ వస్తున్నది కాబట్టి స్వయం కల్పిత వృత్తి విధానములో యీ చారిత్రక శక్తి సామర్థ్యాలు ఉన్నవని గుర్తించటము అవసరము.

అనువాదం - జాస్తి జగన్నాథం

### అఖిలాంధ్ర ప్రజల మహోద్యమం ద్వారా సంప్రాప్తించిన

# నాగార్జున సాగర్ ప్రాజెక్టు

కృష్ణాలోయ అభివృద్ధికి ఆచార్య నాగార్జునుడు భావించిన పథకం అమలు 1852 లో సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు మరెందరో మానవతావాదుల కృషి ఫలితంగా విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మాణంతో ప్రారంభమైంది. వందేండ్లకు పూర్వమే "మెకంజీ" తుంగభద్ర, సిద్దేశ్వరం, పులిచింతల ప్రాజెక్టులు సాధ్యమని రిపోర్టు తయారు చేసిరి. అందుకే స్వతంత్రానికి పూర్వం అటు తరువాత ఎందరో మహానుభావుల నిరంతర నిర్విరామ కృషిద్వారా తుంగభద్రకు సాధ్యమైనది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు బహుళార్థ ప్రాజెక్టుగా సాధించుకొన్నాము.

కృష్ణాలోయ ప్రాజెక్టుల సాధనలో నాలుగైదు శతాబ్దాలుగా సాగించిన ప్రజా ఉద్యమాల గురించిన ఆచార్య రంగాజీ వ్యాసమును పాఠకుల సౌకర్యార్థము ప్రచురించుచున్నాము.

-ఎడిటర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు యీనాడు ఆంధ్ర రైతాంగం, తదితర జనాలకు, మాగాణి వసతులు, విద్యుచ్ఛక్తి ప్రసాదించబోతున్నదంటే, భారతీయ ఆర్థిక, సాంఘిక సౌష్టవానికొక నూతన శక్తి కల్గించునంటే, ఆంధ్రులకు ప్రధమంగా కారకులైన, రైతు నాయకులకు కృతజ్ఞత దెల్పుకొనుట, భారతీయుల, ధర్మము, ఆంధ్రులకు ఆనందము.

దాదాపు వంద సంవత్సరాల క్రితం దొక్కల కరువు కాలపు అనుభవాల పిమ్మట, శ్రీ మెకంజీ తయారు చేసిన రిపోర్టుల ప్రకారం, పులిచింతల వద్ద ఆనకట్ట కట్టుటకు సాధ్యమని పంచెను. సిద్దేశ్వరపు ప్రాజెక్టు, తుంగ

భద్ర ప్రాజెక్టులు కూడా సాధ్యమని ఆయన వ్రాసిరి.

మాజీమంత్రి శ్రీ కోటిరెడ్డి, మరెందరో మాబోంట్లు తుంగభద్ర ప్రాజెక్టు కొరకై 30 సంవత్సరాల పర్యంతం కృషి చేసిరి. తత్ఫలితంగా, ఈ నాటికి, ఆ తుంగభద్ర ప్రాజెక్టు సిద్ధించినది: రాయల సీమలో ప్రధాన భాగాంకే గాక, తెలంగాణములో కొంత భాగాలకు, కరువు నివారణ సాధ్య మగుచున్నది.

ఆ ప్రయత్నంతో బాటు, సంగమేశ్వరపు ప్రాజెక్టు అవసరమంటూ, శ్రీ నాగినేని వెంకయ్య, (మాజీ అసెంబ్లీ సభ్యులు) ఆంధ్రరాష్ట్ర రైతు సమ్మేళన అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి వెంకట సుబ్బయ్య ప్రభృతుల సహాయముతో, సంగ మేశ్వర ప్రాజెక్టు రైతు సంఘమును స్థాపించిరి.

స్వరాజ్యము వచ్చినది. భారత ప్రభుత్వము క్రొత్త క్రొత్త ప్రాజెక్టుల నిర్మించుటలో, శ్రీ కోటిరెడ్డి, నేను ప్రచార మొనర్చిన ప్రధాన ఆర్థిక సూత్రమును అంగీకరించెను. అంతవరకు బ్రిటీషు ప్రభుత్వము, ప్రతి ప్రాజెక్టుపై ఖర్చిడిన ధనముపై, అసలు ఫాయిదాలు వివిధ వాణిజ్యాలపై అందినట్లుగా సంపాద్యమగు నప్పుడే యే ప్రాజెక్టునైనా నిర్మించుటకు పూనుకొను చుండెను. ఆ ధోరణి అభివృద్ధి దాయకం కాదంటిమి మేము. ఎంతెంతగా కరువు నివారణ జరుగునో గుణించా లంటిమి. మరెంతగా వడ్లు, తదితర పంటలు ప్రతి సంవత్సరం పండించదగునో, ఎవ్వరెవ్వరికి వుద్యోగ, ప్రాప్తి కల్గునో, మొత్తంగా దేశానికి అదనమైన వుత్పత్తి, సంపదభివృద్ధి కల్గునో లెక్కించవలెనంటిమి. ఆ లెక్కలను బట్టి, ప్రాజెక్టులపై పెట్టుబడి పరిమితులు నిర్ణయించుకోవాలంటిమి. మా యీ నూతన సూత్రము స్వరాజ్య ప్రభుత్వము 1949లో అంగీకరించెను.

ఇంతలో శ్రీ మోటూరి సత్యనారాయణ ముక్త్యాలరాజా, నార్ల వెంకటేశ్వర రావు, క్రమంగా నాగినేని, గొట్టిపాటి, వావిలాల ప్రభృతులు పులిచింతల వద్ద కృష్ణానదిపై ప్రాజెక్టు నిర్మించుచో, కొద్దిఖర్చుపై అధిక మాగాణి వసతుల సంపా దించవచ్చునని, నందిగామ, విజయవాడ, తాలూకాలకు అద్దరిన, సత్తెనపల్లి, గుంటూరు తాలూకాల కిద్దరిన, రైతుల రక్షించవచ్చునని ఆందోళనను 1949-52 ప్రబల పరిచిరి. ఆ వుద్యమమందు ఎంతెంతో ఖర్చులు పెట్టిరి. కరపత్రాలు ప్రచు రించిరి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వముల మేల్కొలిపిరి రాజాగారు, సత్యనారాయణగారు, వారికన్ని విధముల, రాష్ట్రకాంగ్రెసు నుండి, రైతు సమ్మేళనము ద్వారా,

పార్లమెంటులో సహాయపడు అదృష్టముపొందితిని.

ఆ ప్రాజెక్టును ప్లానింగు కమీషను వారు పరీక్షించు సమయమందె, శ్రీ ముక్త్యాల రాజా, డాక్టరు కె.యల్. రావు గారి సలహా, సహాయముపై, పులిచింతల కంటే నందికొండవద్ద మరెంతో పెద్దదైన ప్రాజెక్టును నిర్మించుట సాధ్యమని గ్రహించిరి. శ్రీ మోటూరు సత్యనారాయణ సహాయము బొందిరి. వావిలాలతోదైరి. పులిచింతల ప్రాజెక్టుపై ఎంతో కృషిచేసి, విజయప్రాప్తి బొందగల్గుదుమనుకొనే సమయానికి, ఈ గొప్ప ప్రాజెక్టు సాధ్యమనిపించుటతోడనే, ఏ సంకుచితధోరణికి లొంగక ప్రజల ఆర్థిక అభివృద్ధినే కాంక్షించుచూ, శ్రీ మోటూరి, ముక్త్యాల రాజా నందికొండ ప్రాజెక్టు వుద్యమాన్ని బలపరచుటకు ముందుకొచ్చిరి.

ఆ యదనున, ఆంధ్రప్రభ అప్పట్లో దాని సంపాదకులు శ్రీ నార్లవారు ముందంజవేస్తూ నందికొండ వుద్యమానికి ప్రాణంపోసిరి. అంతటితో మా ప్రాజెక్టు వుద్యమం సుగమం కాలేదు.

ఎంతో కాలంనుండి సంగమేశ్వర ప్రాజెక్టు కావాలంటున్న శ్రీ నాగినేని, చేగిరెడ్డి వుదారతతో ఈ నూతనోద్యమాన్ని బలపరచబూనిరి.

కాని, సంకుచిత రాజకీయ, ఆర్థిక వ్యవహారములకు నాయకత్వం వహించుచే, స్వకీయ రాజకీయములకు లాభమనుకొనుచూ, కోస్తా ఆంధ్రులంతా "మీరు", తన పరిసర ప్రాంతాలవారు "మేము" అంటూ, రాచకీయ జీవితమును ప్రబల పరచుకొనుచుండిన ఆనాటి శ్రీ సంజీవరెడ్డి నందికొండను తలచుకొనుటకు ముందు, తుంగభద్ర అని కొన్నాళ్ళు, సిద్దేశ్వరమని మరొకమాట, సంగమేశ్వరమని మరెంతో పట్టుదలతో, మొండికాలు అడ్డుపెట్టసాగిరి. ఆనాటి దురదృష్టమా అంటూ, నందికొండ ప్రాజెక్టును అడ్డగించు వారికే, ముందు మద్రాసు ప్రభుత్వములో పిమ్మట ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వమందు పెత్తనము పెరుగుచుండెను.

ఢిల్లీ ప్రభుత్వము, ప్లానింగు కమీషను అప్పటి హైదరాబాదువారు పులిగడ్డ, నందికొండ ప్రాజెక్టులపై సుముఖత చూపుచుంటే సిద్దేశ్వరం, సంగమేశ్వరం ప్రాజెక్టుల పేరుతో శ్రీ సంజీవరెడ్డి ప్రభృతులు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎన్నో అడ్డంకులు కల్గించుట మా కందరికి ఎంతో ఆశ్చర్యము కల్గినది. మేమందరం రైతు వుద్యమం ద్వారా సర్వదా అన్ని ప్రాంతాలలో అందుకోగల్గిన మాగాణి ప్రాజెక్టుల సాగించు వుద్యమమందె హృదయ పూర్వకంగా కృషిచేస్తూ వుంటిమి,

మున్ముందుగా, తుంగభద్ర ప్రాజెక్టుకే, ప్రాధాన్యత నిస్తూ వుంటిమి. సిద్దేశ్వరం ప్రాజెక్టుద్వారా, సంగమేశ్వరం ద్వారా కలిగేటట్లు రాష్ట్రి రైతాంగ రక్షణ, ఆర్థిక అభివృద్ధి, మరెంతో నందికొండద్వారా కలిసివచ్చుననే పూర్తి విశ్వాసముతో కృషి చేసితిమి కనుక సంకుచితులై, ప్రాంతీయ దురభిమానం పొంది పక్షపాతంగా, అధర్మంగా నందికొండ మధ్య సిద్దేశ్వరం మధ్య పోటీని కల్పించు శ్రీ సంజీవరెడ్డి ప్రతిష్టంభన మాకు దిగ్భ్రమ కల్గించు చుండెను.

ఈ వివాదమును సాకుగా జూచుకొని కొందరు మద్రాసు ఇంజనీయరులు, అధికారులు, మంత్రులు సిద్దేశ్వరమునే బలపరుస్తూ, విచారణ కొరకై వొక కమిటీని భారత ప్రభుత్వముచేత నిర్ణయింప బూనుకొనిరి. దానిలో వొక్క ఆంధ్ర యింజనీయరును కూడా నియమించకుండుట దుస్సహమును ఎటులో శ్రీ మోటూరి తెలుసుకొనిరి. నన్నుచేరి ఆ యన్యాయము నెదురించుటకు ప్రోద్బలపరచిరి. అప్పటి కేంద్రమంత్రి శ్రీ ప్రకాష్ నకు గట్టి వుత్తరము వ్రాసి, ఆ యన్యాయమును ఆపితిమి.

అంతట యేర్పడెను, ఖోస్లా కమీషన్! వారు అటు హైదరాబాదు వైపు నున్న, నందికొండవద్ద మిట్టల జూచుటకు ప్రోగ్రాం యేర్పరచిరి గాని, మాచర్ల వైపునవున్న నదీతీరము జూచుటకు వ్యవధిగాని, అవకాశముగాని యేర్పరచరైరి మద్రాసు ఇంజనీయర్లు.

అప్పుడు ఆ 1952లో కాంగ్రెసుకు మెజారిటీ పోయిందిగాని, కాంగ్రెసు మంత్రులే, తాత్కాలికంగా పెత్తనం చేస్తూవున్న సంధి సమయం.

ఎటుల కమీషన్ వారిని, మాచర్ల అడవుల దాటించి, నదీ తీరమునకు వెళ్ళునట్లు ప్రోత్సహించుట, బలపరుచుట! ఆ కారడవుల మధ్యగా వెళ్ళుటకు వారిని వొప్పించుటెటుల? శ్రీ కోనూరి కన్నయ్య, శ్రీ వట్టికొండ రామయ్యచౌదరి చిత్రకళాకారుడు శ్రీ గుర్రం మల్లయ్య, శ్రీ కావూరి వెంకయ్య, నందికొండ ప్రాజెక్టు కమిటీని నడపుచుండిరి. మాబోంట్ల సహాయం సలహా ప్రకారం శ్రీ కన్నయ్య ఎంతో సాహసి, కార్యదక్షుడు. శ్రీ రామయ్య పట్టుదలగలరైతు యువకులు. వారునోన్నసారులు ఢిల్లీకి రాయబారములు నడపిరి. వీరి ప్రోత్సాహము వాగ్దానముల మీద ఆధారపడి శ్రీ ఖోస్లాకు వారి మద్రాసు మకాములో హామీ యొసంగితి. అప్పుడు కమీషన్‌కు వీలున్న 76 గంటల వ్యవధిలో ఆరుమైళ్ళ

పర్యంతం, మాచర్ల పరిసరాల నుండి నది వరకు వున్న అడవిలో, ఏదో రీతిగా, జీపు నడవగల్గినట్లుగా చెట్లుకొట్టి, గట్టులతట్టి, గోతులనింపి, దారి యేర్పరచుటకు షేము ప్రయత్నింతుమని హామీ యిస్తిని. శ్రీ ఖోస్లా (యిప్పుడాయన ఒరిస్సా గవర్నరు) నాయంమన్న అభిమానం, విశ్వాసమువల్ల, మిగతా కమిషన్ వారి నొప్పించిరి. మద్రాసు ప్రభుత్వపు అడ్డంకుల త్రోసివేసిరి.

## తలగుడ్డ వారి మార్గము

అనుకున్న సమయానికి కమీషన్ ఒంగోలులో రైలుదిగిరి. సాహసికులు కన్నయ్య, రామయ్య వారిని మాచర్లకు చేర్చిరి. అచ్చటనుండి శ్రీ పొతకమూరి అంతయ్య (తలగుడ్డ) వారిని తన జీపులో అప్పటి వరకు యెవ్వరు కారులతో నడువని అటవీ మార్గముగా, తానుగా చూచుకొంటున్న దారిన, తనజీపుతో కమీషను వారిని చేర్చిరి కృష్ణమ్మతల్లి వొడ్డునకు. అది దారియా? రోడ్డా? డొంకా? ఏదీకాదు? తలగుడ్డవారి మార్గము. ఆ మార్గమును అటుల ఆ అంతయ్యగారి రాకెట్టు బండిని సాగించుటకు తగినట్లు చెట్లను, గుట్లను, తొలగించిన వారెవ్వరు? ఈనాటి కోట్లు సంపాదించుకొన్న కాంట్రాక్టర్లుగాదు, లక్షలు బొందిన కాంగ్రెసు పెత్తందారులు గాదు: లక్షలుగా ఎన్నికలు, సభలు, విందులకై అనుభవిస్తున్న కాంగ్రెసు మంత్రి వర్గపు సహాయకులు, నాయకులుగారు. వారంతా వేలకొలదిగా వుండిన, కష్టజీవు లైన, కూలి-నాలి అడుగని తమ అన్నాల ముద్దలనే తెచ్చుకొన్న, తమ తమ యెద్దుల బండ్లను తోలుకొచ్చుకున్న స్థానికమగు 25 గ్రామాల రైతులు, కూలీలు. వారిదొకే కోరిక, ఆశ, ఆశయము! వీరబ్రహ్మంగారు తమ జోశ్యమందు పల్కి-నటుల, నందికొండ గొప్ప సరస్సు కావాలి. అశేష జనాలకు అన్నపానాదులు అందాలి. అటుల వారు శ్రమించితే యేర్పడిన మార్గము. దానిపై నడపిరి జలరాసులు అందించ బైలుదేరిన అంతయ్యగారి జీపు రధము.

ఆ కృష్ణమ్మ వొడ్డునుండి, అగాధంగా వున్న ఆ నదీమతల్లి నడక, పడక, వేగము చూచిరి కమీషను. భగవంతు డెన్నివేల సంవత్సరాల క్రితమో యిచ్చాడె, డాము నిర్మాణం కావాలని నిర్ణయించినట్లున్న ఆ సృష్టి దేవతా నడుమునకు వడ్డాణం అందించుటకు తమ్ము పిలిచిరని అన్నారట కమిషన్ వారు. అంత అదృష్టమగు అనుభవమె ఈనాటి నాగార్జున సాగరపు పునాదిరాయి. దాన్ని వేయించుటకు ఆనాటి

పురోహితులు కన్నయ్య, రామయ్య, మల్లయ్య, అంతయ్య. వారికి ఆంధ్రులంతా కృతజ్ఞులు.

ఆ ఖోస్లా కమీషనుకు, అప్పటి హైదరాబాదు ప్రభుత్వము తమ సుముఖతను తెల్పిరి. కాని మద్రాసు ప్రభుత్వము అప్పటికీ కాలడ్డముపెట్టుతూ, ఇప్పటికీ అఖిలాంధ్ర శుభము కోరువారమని పత్రికలచే తమ అధికారం ఆసరాతో వ్రాయించుకొనువారి ప్రాబల్యమువల్ల ఏదో ఒక కుంటి అభ్యంతరం లేపుచుండెను. ఖోస్లానెంతగానో బెదిరించిరి. సంవత్సరం పర్యంతం వారి రిపోర్టు వెల్లడవకుండాజేసిరి. ఎట్టకేలకు అది ప్లానింగు కమీషనుకు అందజేయునట్లు, ఎందరమో ఎన్నో రాయబారాలు నడిపితిమి విజయం బొందితిమి.

## ఆర్కియాలాజికల్ డిపార్టుమెంటు మొండికాలు

## శ్రీ మోటూరి సమయస్ఫూర్తి

మధ్యలో ఆర్కియలాజికల్ డిపార్టుమెంటు వారు నాగార్జున శిధిలాలకొరకై, మేము 1935-36లో నిర్మింపజేసిన మ్యూజియం మునిగిపోతుంది, కనుక నంది కొండను సన్నబరచాలన్నారు. మోటూరివారి సూచనపై మధ్యనున్న కొండపై ఆ శిధిలాలను నిల్పండి అని తిరిగి ఆందోళన చేసితిమి. దాంతో ఆ బాధ వదలినది. ఇప్పుడా మ్యూజియమా ద్వీపముపై వెల్గుచున్నది. అదొక గొప్ప "టూరిస్టు సెంటరైనది".

ఇంతలో ఆంధ్రరాష్ట్రము వచ్చినదా శ్రీరాముల దయవల్ల! తిరిగి ఆనాటి సైంధవులె ఆంధ్ర ప్రభుత్వ ప్రముఖులై వెల్గజొచ్చిరి. అన్నీ అడ్డంకులే, కన్పడకుండా, ప్రభుత్వపు కలపు పోటులన్నీ వ్యతిరేకమే. ప్రజలవద్దకు మంచి పల్కులతో ఢిల్లీ ప్రభుత్వము వద్దకు ములుకులగు సాక్ష్యాలతో నందికొండను పందికొండగా మార్చెదమన్నవారె, వివిధ వ్యతిరేక ఆయుధాల ప్రయోగించుచుండిరి.

## త్రివేది చల్లని చూపు

అదృష్టవశాత్తు 1955 రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సర్దారు లచ్చన్న విశ్వాస రాహిత్య తీర్మాన ఫలితంగా వచ్చెను. గవర్నరు శ్రీ త్రివేదీ పాలనంపైకొచ్చెను. అప్పటి వరకు వెల్గిన సైంధవులు తాత్కాలికంగా పదభ్రష్టులైరి. నందికొండ

ప్రాజెక్టు ప్రణోద్యమమును, అదే తగు సమయమనుకొని, మేమంతా విజృంభింప చేసితిమి. ఇటు గవర్నరు వద్దకు, అటు ప్రధాని నెహ్రూ, ప్లానింగు కమీషను వద్దకు రాయబారాలు నడపినారెందరో ప్రజాసేవకులు, నిజనాయకులు. ఐనా అట్టి ప్రముఖ సమస్యపై, మంత్రులు మాత్రమే నిర్ణయం చేయదగునంటూ తిరిగి శ్రీ సంజీవరెడ్డి బృందము తలయెత్తిరి. ఆనాటి రాచకీయములో, కృషికార్‌లోక్ పార్టీ సహాయము తోడనే, తిరిగి నిల్చుటకు కాళ్ళు, చూచుటకు కళ్ళు పొందగల్గిన కాంగ్రెసు వారు మా నందికొండ డిమాండును అంగీకరించక తప్పదనుకున్నారు. నెహ్రూజీ తలయొగ్గక తప్పలేదు. ఆయనకు మా అందరి నెదిరించుటకు అప్పటికి దిక్కుగా వుండిన సంజీవరెడ్డి కుంటి వాదములను విడనాడక తప్పలేదు. అటుల అంత కష్టంమీద, త్రివేదీ పట్టుదల, తోడ్పాటుతో, వివిధ ప్రజాస్వామిక పక్షాల కలయికగా యేర్పడిన యునైటెడ్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారపు వూపుతో బైట పడి బ్రతుకగల్గింది. ఆ నందికొండ పుట్టివల్కుట తోడనే అందరు "నాగార్జున సాగర్" అని ఆ క్రీ. శ. 2200 నాటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్త నాగార్జునాచార్యుని స్మరించుతూ యీ ప్రాజెక్టు పుట్టుకలకు జయజయ ధ్వానాలు లేపుకొంటిమి. ఆ మధ్యంతరపు యెన్నికలు రాకుంటే, కృషికార్-లోక్‌పార్టీ సహకారము కాంగ్రెసుకు అత్యవసరము కాకుంటే, ఆ సంజీవరెడ్డి బలగాలే ప్రభుత్వాధికారంలోనే కొనసాగితే, తుంగభద్ర హైలెవల్ ఛానల్ వచ్చేదేమో కాని అటు సిద్దేశ్వరం పెరిగేది కాదు, యిటు నాగార్జున సాగర్ యీ ప్రధమ మొట్టువరకైనా 1972 వరకైనా పెరుగుటకు అవకాశం కల్గేది కాదని ప్రజలెందరో యీ నాటికి నమ్ముచుండుటలో ఆశ్చర్యంలేదు.

## చీమలు పెట్టిన పుట్టలు

జీవిత పరిణామాలు ఆశ్చర్యకరము. "చీమలు పెట్టిన పుట్టలు" గతే, యిట్టి ప్రజాహితైక వ్యవహారములకు కల్గుచుండును. అప్పుడటుల నందికొండ యీ నాగార్జునసాగరుగా పెరుగుటకు వ్యతిరేకించినవారే, సాగరు నిర్మాణములో ఎన్ని లక్షలు వొక్కొక్కరు తమ తమ పెత్తనాలలోని బంధు, మిత్ర, రాచకీయ వర్గీయులకు అందించుకొనిరో ప్రజలకు తెలియును. ఏ విధంగా దాని పెంపుదలకు వాయిదాల పెంచిరో గదా! తుదకు సాగరు పెంపకమునకందు మున్న ప్రతిమెట్టుపై తమ తమ పేరులను పత్రికలవారిచేత చెక్కించుకుంటూ వుండిరి. వంద సంవత్స

కాల క్రితం నిర్మింపబడిన వంతెనెలెన్నో యిప్పటికి నిల్చివుంటూంటే, వీరు తమలో భాగస్థులైన వారిచేత నిర్మింపబడిన వంతెన పది సంవత్సరాలైనా నిండక ముందే ప్రథమ వరదకే అర్పణ ఔతుంటే చూస్తూ, రాజకీయాధికారాన్ని అంటి పెట్టుకొని వున్నారు. ఇందులకు ఆశ్చర్యపడనేల, వీరే కావాలని 3. 1/2 కోట్లతో నిర్మింపజేసిన, కడెం ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరుపకముందే కూలిపోతున్నా, అధికారాన్ని వదలనేర్వని మంత్రిం పాలనమే మనకు అందుచున్నప్పుడు.

## ప్రాజెక్టుల ప్రసాద్

ముక్త్యాల రాజాను మేమప్పుడు ఆయన యీ ప్రాజెక్టులన్నీ యింత ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చుటకు, తుదకీ సాగరు రూపం దాల్చుటకు చేసిన ప్రభారమునకు ఆనందపడి "ప్రాజెక్టుల ప్రసాద" అని పిలుచుకొంటిమి. అంత శ్రద్ధ, శ్రమతో సంవత్సరాల తరబడి కృషిచేసిన మోటూరి, కోనూరి, తలగుడ్డ అంతయ్య, నాగినేని, గుర్రం మల్లయ్య, గొర్రెపాటి, మాచల వీరభద్రరావు, వావిలాల, కావూరి వెంకయ్య వీరిని ప్రజలు మరువజాలరు. రైతువుద్యమం స్థాపించుకున్న మేమంతా వారికి కృతజ్ఞులం. ఆ జహ్వారు ప్రక్కనజేరి, తమ విష బంధాల నుండి తప్పించుకొని, బ్రతికి పైకెదిగిన యీ సాగరు జన్మదినోత్సవాలకు పౌరోహిత్యం చేయ బయలుదేరిన ఆషాఢ భూతులకు కైవారములు పల్కువారే మేత్రిమాణ్యులగుచున్నారు. మా కందరికే గాక, ప్రజలెల్లరికి కావలసిది, కృష్ణమ్మ తల్లి పవిత్ర సవిలాలు ఆ వుదయగిరి, కనిగిరి, కంభం, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావు పేట, మాచెర్ల, మార్కాపురం, ఒంగోలు, దరిశి, పొదిలి తాలూకాల భూములను, అచ్చటి కష్టజీవులగు కర్మవీరుల రక్షించుట పోషించుటకేగదా ఆ సత్ఫలితాలు. నాగార్జునాచార్యుని చల్లని ఆశీర్వాదములతో అందుచున్నవి. అదేవాలు. ఆ జన్మదినోత్సవ సందర్భంగా ప్రసాదుగారి బావమరది, కొప్పారి రైతు ప్రముఖుని కుమారుడు, శక్తివంతుడైన ఇంజనీయరు శ్రీ రమేశ్‌చౌదరి సాగరు పుట్టు పూర్వోత్తరాలు, యింజనీయరింగు విశేషాలు, మున్ముందు ప్రటలకెట్టి సత్ఫలితాల నందజేయునో అంచనాల తెల్పుతూ, ఇంగ్లీషులో గొప్ప వ్యాసము వ్రాసిరి. దానికి నేనిచ్చిన వుపోద్ఘాతము చేర్చిరి. వ్యయ ప్రయాసల కోర్చి ప్రచురించిరి.

అందే చెప్పితి, భారతదేశపు ఆహార పదార్థాల వుత్పత్తి ప్రయత్నముల కీసాగరు నిర్మాణమొక బ్రహ్మాండమగు బలమని. ఈ 1965-66-67

సంవత్సరాలలో భారతావని కరవులు అశేష ప్రజలు పొందుచున్న ఆకలి మంటలచే సంక్షుభిత మగుచున్న యీ నిప్పులను కొంతగానైనా ఆర్పుటకు శుభమా అంటూ, నాగార్జునసాగరు ప్రథమ నవిలాం బొందు యీ శుభ సమయమున, సాగరు అవతరణకై జరిపిన ప్రయత్నాలలో భాగస్వాము లుగా వుండగల్గు అదృష్టము బొందిన మాకు మిత్రులు శ్రీ దరువూరి వీరయ్య యీ దివ్య సంస్మరణోత్సవమందీ స్థానము కల్పించినందులకు ఆనంద మొందుచున్నాము.

"నాగార్జునసాగర్ సర్వస్వము" సౌజన్యంతో

# కాంగ్రెస్‌లో నేను తిరిగి చేరడానికి కారణాలు

## —శ్రీ ఎన్. జి. రంగా వివరణ

విజయవాడ, ఆగస్టు 12: తాను కాంగెస్ పార్టీలో చేరడానికి గల కారణా లను వివరిస్తూ శ్రీ ఎన్.జి.రంగా ఈ క్రింది పత్రికా ప్రకటన చేశారు:

"మేము స్వతంత్ర పార్టీని స్థాపించి నప్పుడు రైతు యాజమాన్యపు హక్కు-పరిరక్షణకు రైతాంగం, చేతివృత్తులవారి స్వయం ఉపాధికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన వారిలో నేను ఒకడిని. బొంబాయి మిత్రులు ప్రయివేట్ రంగం పరిరక్షణ పట్ల హెచ్చు శ్రద్ధతో వున్నారు. పార్లమెంటరీ ప్రతిపక్షాన్ని అభివృద్ధిచేసి, ఆరంభ దశలో వున్న మన ప్రజాస్వామ్య వ్యవస్థలో నియంతృత్వం పాతుకుని పోకుండా నిరోధించాలని రాజాజీ పట్టుదలతో వున్నారు. ఎవరి అభిప్రాయాలకు వారు ప్రత్యేక ప్రాముఖ్యాన్ని ఇస్తూ, మా మా ప్రత్యేక ప్రయోజనాలకు, సిద్ధాంతాలకు రాయితీలు ఇచ్చుకొంటూ మేమందరమూ పై మూడు లక్ష్యాలను పార్టీ సిద్ధాంతాలలో చొప్పించాము.

కొత్త కాంగ్రెస్ శక్తులలో చేరాలన్న నా ప్రస్తుత నిర్ణయం, సిద్ధాంతాలలో ఆకస్మికంగా వచ్చిన మార్పుకాదు. వెనుక వ్యవసాయదారులపైనే గరిష్ఠ పరిమితి విధించడానికి కమతాలను సహకార రంగం పరిధిలోనికి తీసుకొని రావడానికి

కాంగ్రెస్ పట్టుబట్టి, వ్యవసాయేతర వర్గాలపై గరిష్ఠ పరిమితిని విధించడానికి, నిరాకరించినప్పుడు కాంగ్రెస్‌తో నేను తెగత్రెంపులు చేసుకొన్న విషయం జ్ఞప్తికి తెచ్చుకొంటే నా నిర్ణయాన్ని హర్షించగలరు. కాగా ఇప్పటి కాంగ్రెస్ అన్నివర్గాల పై గరిష్ఠ పరిమితులను విధించడానికి వోటర్ల తీర్పును పొంది వున్నది.

కొత్త కాంగ్రెస్‌ను వోడించడం ఇందిరాజీకి మెజారిటీ రాకుండా చేయడం అనే తాత్కాలిక లక్ష్యాన్ని సాధించడం కోసమే ఉమ్మడి కార్యక్రమం ఏదీ లేకుండా ఉమ్మడి సంఘటనను ఏర్పాటు చేయడానికి ఎన్నికల ముందు స్వతంత్ర, జనసంఘం, ఎస్ ఎస్ పి, సంస్థా కాంగ్రెస్ తొందరపడి తీసుకున్న నిర్ణయాన్ని ప్రజాస్వామ్య ప్రతిపక్షంలోని ఇతర నాయకులందరితోపాటు నేను కూడా సమర్థించాను. ఈ సంఘటన హృదయ పూర్వకంగా జరిగిన కలయికకాదు. అలాగని ఈ సంఘటన వల్ల ప్రజాస్వామ్య స్వేచ్ఛ విషయంలో మంచి దశ ఆవిర్భవిస్తుందని కూడా ఎవరూ ఆశించలేదు.

ఆస్తికి సంబంధించిన ప్రాథమిక హక్కు వుండవలసిన అవసరాన్ని మేమునొక్కి చెప్పాము. కాగా ఆదేశక సూత్రాలను అమలు పరచడానికి వీలుగా వాటిని సవరించాలని ఇందిరాజీ విజ్ఞప్తి చేసి వున్నారు. నేను ఎన్నికలపై ప్రచారం లోనికి దిగినకొద్ది నాకు పరిస్థితి ఇబ్బందిగా కన్పించింది. ఆస్తికి నష్ట పరిహారాన్ని పూర్తి గా చెల్లించాలన్న వాదాన్ని మార్చుకోనట్లయితే ప్రజల దుర్భర దారిద్యం పై మనం సమర్థంగా పోరాటం సాగించలేమని నాకు అన్పించింది. ఉత్పత్తి ముందు, పంపిణీ తర్వాత అనే నినాదానికి ప్రజల మద్దతును కోరడం చాలా కష్ట మని నేను గుర్తించాను. భూకమతాలపై ఇదివరకే గరిష్ఠ పరిమితి వచ్చినందువల్ల రాజ్యాంగం 17వ సవరణ రీత్యా వాటిని ప్రభుత్వం తీసుకోడానికి వీలయినందువల్ల మిగతా ఆస్తులన్నింటికీ రక్షణను కొనసాగించాలన్న మా వైఖరి ఆచరణసాధ్యం కాదని నాకు తోచింది.

## దేవుడిచ్చిన వరం

సమష్టి సంఘటనను, వాని భాగస్వామ్య పక్షాలను ప్రజలు పూర్తిగా త్రోసి పుచ్చడం దేవుడిచ్చినవరమని, అసాధ్యమయిన రాజకీయ బంధంనుంచి విడుదల జరిగింది. నేను నా సన్నిహిత సహచరులు ఒకరికి చెప్పాను. రాజకీయ పొత్తులను పునః పరిశీలించడానికి మనం సిద్ధపడాలని కూడా నేను చెప్పాను. ఇందిరాజీ నినా

దాను నాలుగు దశాబ్దాలుగా మేము చేస్తున్న నినాదాలే అయినప్పటికీ ఇందిరాజీ ఆ నినాదాలతో ప్రజలను జాగృతం చేశారు. మేము మాత్రం దురదృష్టవశాత్తు ఆమె పై ధ్వజం ఎత్తిన స్థితిలో పడిపోయాము.

దుర్భర దారిద్ర్యంతో అర్థాకలితో జీవిస్తున్నవారు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికకు బ్రహ్మాండమయిన మెజారిటీ మద్దతును ప్రకటించారు. ఇందిరాజీ బహుళ ప్రచారంలోకి తెచ్చిన నినాదాల పట్ల వారు తమ విశ్వాసాన్ని ప్రకటించారు.

రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, వెనుకబడిన తరగతులవారు — హరిజనులు గిరిజనులు స్వయం వృత్తిదారులు తమ పంచాయతీలలోను, మార్కెట్ లలోను, కులాలలోను వున్న స్థానిక పెత్తందార్ల జులిపింపులను లెక్కచేయకుండా భారతీయ కాంగ్రెస్‌కు వోటు చేయడంలో సఫలీకృతులయినారు.

## నేను ప్రజల మనిషిని

"నేను ఎల్లప్పుడూ ప్రజల మనిషినే. భారతీయ రాజకీయాలలో నేను పాల్గొన్న ప్రతి ఉద్యమం అది జమిందారీ పద్ధతి రద్దుకోసం కానివ్వండి, సంస్థానాధీశుల పాలన రద్దు కోసం కానివ్వండి, వ్యవసాయ విపణిలో వర్తకుల గుత్తసామ్య ధోరణులను వ్యతిరేకించడానికి కానివ్వండి, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికే ఉద్దేశించబడినాయి. కాంగ్రెసు అధిష్ఠాన వర్గంతో చేతులు కలిపి, స్థానిక కాంగ్రెసు నాయకులతో కలసి మెలసి పని చేయవలసిందిగా స్వరాజ్యానికి ముందు రోజుల్లో రైతు, వ్యవసాయ కూలీ, వృత్తిదారుల సంఘాలకు నేను సలహా ఇచ్చాను. 1944 లో గాంధీజీ హామీ ఇచ్చినందువల్లను కాంగ్రెసుతో ఉంటే ఈ వర్గాలవారి ప్రయోజనాలకు రక్షణ ఉంటుందని నేను అప్పుడు భావించాను.

ఎన్నికల ద్వారా, శాసన సభల ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి శ్రామిక నియంతృత్వం చేసే ప్రయత్నాలను ప్రతిఘటించడానికి ఏ రాజకీయ పక్షమూ సిద్ధపడక ముందే ఆంధ్రలోని నా సహచరులు, నేను మద్రాసు, ఆంధ్రలోని పార్టీ ప్రయోజనాలను త్యాగం చేసి 1952 లో రాజాజీ కాంగ్రెస్ మంత్రివర్గాన్ని, 1954 లో కర్నూలులో శ్రీ ప్రకాశం మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి వీలుకల్పించాము. ఆ విధంగా ప్రజాస్వామ్యం నిలబడడానికి దోహదించాము.

మన రాజకీయ పక్షాలలోను, శాసన సభలలోను, మంత్రి వర్గాలలోను, ప్రతిపక్షంలోను ప్రజాస్వామ్యానికి, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ముప్పుగా పరిణమించ గల ధోరణులు తలఎత్తుతున్న సంగతి నాకు తెలియకపోదు. అయితే ప్రజల ఆకాంక్షలను, సార్వత్రిక ఎన్నికలల్లో స్వేచ్ఛగా వ్యక్తమయిన భావాలను గుర్తించక పోయినట్లయితేను, సంపన్న, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలకు రక్షకులమని చెప్పుకొంటున్న వారు, మేధావులు నిరంతరాయంగా చేస్తున్న వాదోప వాదాలను తలకెక్కించుకుని పీడిత ప్రజానీకం తక్షణావసరాలను పట్టించు కోనట్లయితేనూ ప్రజాస్వామ్యానికి రాగల తీవ్రమయిన బెడదలను నేను గుర్తెరిగి వున్నాను.

స్వయం ఉపాధిక రక్షణ చేకూర్చి, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సమకూర్చడం ద్వారా ప్రజలకు మనం సేవ చేయాలనుకున్నట్లయితే కార్మికులకు సాంఘిక భద్రతను, జీవించడానికి అవసరమైన వేతనాలను ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి కూడా మనం కృషి జరుపవలసి వున్నది.

ఏది ఏమైనప్పటికి మనం పార్టీకి సంబంధించినంత వరకు మన గర్విష్టి తనాన్ని ఇతర వ్యాసంగాలను రాజకీయ వైఖరులను విరమించుకొని ప్రజా స్వామ్యంలో స్వేచ్ఛగా సమిష్టిగా జరిపే నిర్ణయాలను సిరసా వహిస్తామని పీడిత ప్రజాబాహుళ్యానికి హామీ ఇవ్వవలసి వుంది. మనం ఇవి చేయలేకపోతే వారం దరినీ ప్రజాస్వామ్యానికి శత్రువులైన వారి మీద ఆధారపడేట్లు చేయాల్సివస్తుంది. ఇందిరాజీ నినాదాలు కాంగ్రెసు ప్రకాళిక చేసిన వాగ్దానాలు అమలు జరగడానికి ఈ ప్రజాస్వామ్య శత్రువులే వాళ్ళకొక దిక్కవుతారు.

అహింసా విధానం ప్రాతిపదికగా ప్రజాస్వామ్యంలోను, గాంధేయ సోష లిజంలోను నేను పెంచుకున్న విశ్వాసానికి తగ్గట్లుగా ఇందిరాజీతో చేరాలని ప్రజల ఆశలను మానవ హక్కులను నూతన కాంగ్రెసు నెరవేర్చి సాధించి పెట్టగలిగే ట్లు చేయడంలో యథాశక్తి తోడ్పాలని నేను భావించాను.

## గాంధేయ వాదిని

40 ఏళ్ళ క్రితం మహాత్మా గాంధేయ పద్ధతులలో పూర్తికాలం ప్రజాసేవా కార్యక్రమంలో నిమగ్నం కావాలని మద్రాసు కాళాశాలలో కొనసాగేకన్నా, జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని నిశ్చయించుకున్నాను. 20 ఏళ్ళ క్రితం మిత్రవ

ప్రభుత్వంలో చేరవలసినదిగా వ్యామోహపెట్టే- ప్రతిపాదన లను కూడా వదులు; కొని మద్రాసులో ప్రతి పక్షంలో వుండి ప్రజాస్వామ్యానికి అండగా నిలవాలనే నిశ్చయించుకున్నాను. 14 సంవత్సరాల క్రితం స్వయం ఉపాధి, కర్షక స్వాతంత్ర్యాలను కాపాడేందుకు రాజకీయంగా అజ్ఞాత వాసంలో ఉండటానికి కూడా ఒప్పుకున్నాను. జవహర్‌లాల్ నెహ్రూ అధికారంలో ఉన్నప్పుడు గ్రామదానం, భూకమతాల సహకార వ్యవసాయతత్వ ప్రమాదాల నుండి రైతాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే నేనాపనిచేశాను.

మళ్ళీ నేను ఒక నిర్ణయానికి రావలసిన స్థితి ఏర్పడింది. పేదవారలతో నేను చేతులు కలపడానికి నేను నిరాకరించాలా? ఇప్పుడు ఈ వర్గాలవారు కళ్ళుతెరిచారు. 1930 నుంచి ఏఏ పరిష్కారాలతో నేను ప్రతిపాదిస్తున్నానో తమ సమస్యలకు అనే పరిష్కారాల సాధించుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఇన్నాళ్ళు తమ మనస్సులలో గాఢంగా మెదలుతున్న ఆశలను ఆశయాలను ప్రతిధ్వనింప చేసి నినాదాలకు చెవి యొగ్గి జాగృత మవుతున్నారు. నేను మధ్య తరగతి రాజకీయ అవసరాలను బట్టి వారివైపు రాలేనని రాజకీయంగా ప్రబద్ధమైన ఈ దశాబ్దంలో నా సర్వశక్తులు వారికోసం వినియోగించలేనని చెప్పడమేనా?

నేను ఖరారుగా తుదినిర్ణయానికి వచ్చే ముందు 1971 మార్చి ఎన్నికల పర్యవసానం ఎలా ఉండేది ఎటువంటి పరిణామాలు సంభవించనున్నది పూజ్య రాజాజీ తో వాదించడానికి ప్రయత్నించాను. ఇది ఒక విప్లవాత్మకమైన నిర్ణయమని దీన్ని మనం ఆలకించి అంగీకరించాలని ఆయన ఒప్పుకోలేదు. అదే సమయంలో స్వతంత్ర పార్టీలోని నా అనుచరులకు నచ్చచెప్పడానికి కూడా ప్రయత్నించాను. ఇందిరాజీకి వోటుకి చేసిన జనబాహుళ్యంతో చేరాలని అది కర్తవ్య మని నేను చిత్తశుద్ధితో గాఢంగా ఒక నిర్ణయానికి వచ్చానని నన్ను వదలి పెట్టడానికి జరుగుతున్న ఆలస్యానికి నేను బాధపడుతున్నానని రాజాజీ గ్రహించారు. చివరకు నా రాజకీయ భాగస్వామ్యం నుండి నన్ను వదలిపెట్టడానికి అది అట్టే బాధలేకుండా జరగడానికి ఆయన 8-1-72 న ఉత్తర్వు జారీచేశారు.

## ప్రజలతో చేరిక

ఇప్పుడు నేను చేస్తున్నది గతంలో సరిగ్గా ఇటువంటి క్లిష్ట సమయాలలో నేను చేసిన దానికి విరుద్ధమేమీకాదు. అంతే వ్యక్తిగతమైన వర్గ సంబంధమైన

ప్రయోజనాలనుత్యజించివేసి ప్రజాబాహుళ్యంతో చేరి వుండాలని వారి అవసరాలకు వారి ఆశలకు ఆశయాలకు కృషిచేయాలన్నదే ఎల్లప్పుడు నా అభిమతం. ఇప్పుడు ఇలా చేయడంలో కర్షకులు, స్వయంవృత్తిదారు, వ్యవసాయ కార్మికుల, తదితర శ్రామికుల శ్రేయస్సు కోసం కృషి చేయగలననే నా విశ్వాసం. వ్యక్తి గతమైన ద్వేషభావాలను దిగమింగి ప్రతిపక్షంలో ఒకరితో ఒకరు కలిసి పనిచేయగల మనకు ఇందిరాజీతో పని చేయడం ఏమంత కష్టం కాదు. పాత పెత్తందారీ నాయకత్వం నుంచి విముక్తి పొందిన కొత్త కాంగ్రెసుతో పనిచేయడం కూడా అంతే. ఇది ప్రజానీకం చైతన్య వంతమవుతున్న దశాబ్దం. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1947 లో భవిష్యత్తును గురించి చేసిన వూహలకు ఈ దశాబ్దంలో రూపకల్పన చేయడానికి మనం కృషి చేయాలి. దారిద్ర్యం, అజ్ఞానం, నిరక్షరాస్యత వీటి నుండి ప్రజాబాహుళ్యం విముక్తి అవడానికి కొత్త కాంగ్రెసు తన వాగ్దానాలను అమలు పరచడంలో మనం కూడా వ్యక్తిగా సమిష్టిగా తోడ్పడగలమని, తద్వారా విముక్తి త్వరగా సాధ్యపడ గలదని నా నమ్మకం.

కాంగ్రెసులో చేరడం వల్ల ప్రయోజనం ఏమీలేనప్పుడు, నేను ఈ మార్పును ఎందుకు కోరుకున్నాను. ఎందుకు చేరుతున్నాను అంటున్నారు. నాక్కావలసింది కర్షకులు వ్యవసాయ కూలీలుతో సహా, సర్వ ప్రజల శ్రేయస్సే వారి కోసం పనిచేయటమే నా ధ్యేయం. ఇంత కాలం ఇటువంటి దీక్షతో వారి కోసం కృషిచేశాను. ఇప్పుడు మళ్ళీ వారి సేవకు పునరంకితం అవడం అవసరమన్న అభిప్రాయంతోనే ఈ పని చేశాను. 1971-72 ఎన్నికలలో ప్రజలు తమ అభీష్టాలను విస్పష్టంగా నిర్ద్వంద్వంగా వ్యక్తం చేయడం చూసిన తరువాత ప్రజలతో చేరిపోవాలని వారికి అండగా నిలవాలని ఆకాంక్ష మరింత తీవ్రమైంది. 1923 లో మొట్టమొదటిసారిగా వ్యవసాయ కూలీల మహాసభ జరిగినప్పుడుగాని, 1948 లో తొలి కేదూత్ మజూదూర్ కాంగ్రెసును నేను ప్రారంభించినప్పుడుగాని నాలో ఇంత తీవ్రంగా లేదు.

వయస్సు ఎంత ఉన్నా రాజకీయాల నుండి విరమించని రాజాజీయే నాకు ఆదర్శం. 80 ఏళ్ళప్పుడు 1959 లో ఆయన ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. 90 ఏళ్ళు దాటినా ఇంకా రాజకీయాలలోనే వున్నారు. కాగా 70 ఏళ్ళ వయస్సులో వున్న మాబోటి వారు రాజకీయాల నుంచి విరమించడం ఏమిటని గాంధేయ మార్గంలో ప్రజల కోసం ఉత్సాహంగా హితోధికమైన కృషి చేయవలసిందే.

## మహాత్మాగాంధి ఆవాహయామి !

## భారతీ దేవిజీ ఆవాహయామి !

# శ్రీమతి భారతీదేవి సంస్మరణ

—ఆచార్య ఎన్. జి. రంగ

వేలాది, ఆంధ్ర నాలుగు చెరగుల,రైతు, కూలీ, చేతివృత్తుల సంఘాల కార్యకర్తల ప్రేమంపు మాతృమూర్తి శ్రీమతి భారతీ దేవి 13వ వర్ధంతిసందర్భంలో మనప్రియతమ నాయకుడు,ప్రేమైక మూర్తి ఆచార్యరంగా గారు చేసిన, ప్రసంగపాఠమున పాఠకులకు అందజేయుటకు సంతసించు చున్నాము.

ఇందు, వేదాంత, దార్శనిక, సిద్ధాంత ప్రవక్తగా తనహృద యాన్ని విప్పి ప్రజల ముందుంచిన ప్రసంగమిది.ఎన్ని జ్ఞాపకాలు, ఎంతటి చారిత్రక ఘట్టాలు మరెంతో సాంఘిక. ఆర్థిక, రాజ కీయాల అర్ధ శతాబ్ది చరిత్రనే మనముందించారు రంగాజీ. చద వండి-చదివించండి.

సంపాదకుడు

మనుష్యుల కందిన సైన్‌టిఫిక్కు శక్తులతో ఈ సంవత్సరమే, మాస ములోనే, రష్యను యీ ప్లేనురథికులు పరస్పరంగా రహస్యధోరణిలో పలుక్కున్న కబుర్లను, అలాగే ప్రపంచం చుట్టూ ప్రతిరోజూ పలుమారులు భ్రమణించు అమెరికను రథికులు, ఆకాశానికి పైబడి తిరుగుతూ, అదృశ్యులుగా వుంటూనే వున్నారు. రికార్డు చేసుకుంటూ వుండినారు. ఈ భూమి మీద వున్న మనం చూచి తిమా? వింటిమా? చెప్పగా తెలుసుకొంటిమి.

అంతకు మించిన శక్తులు, జీవులు సూర్యునికి పైబడిన, పైనున్న లోకాలలో వున్నాయంటూ, అమెరికాలో 25 సంవత్సరాలుగా తపస్సు చేస్తున్న బౌద్ధసైంటిస్టు, మరోరష్యను సైంటిస్టు చెప్పుతున్నారు.

ఆ ధోరణిలో, భారతీదేవి నాతో మీతో యీ నాడు యిచ్చట వచ్చి వుండజాలరా? కనుకనే, మన వైదిక మంత్రి ధోరణిలో పల్కుచున్నా!

వారు రాబోవు, లక్షణంగా, మన శ్రీమతి నాగళ్ళ హనుమాయమ్మ తిరుమలలో శ్రీ వెంకటేశ్వరుని సహస్రి స్థంభ మంటప సభాంగణంలో పది వుపన్యాసాలు చేసి, దేవిజీని యీ పెదవడ్ల పూడిలో "అవాహయామి" చేయగల్గుచున్నారు.

భారతీదేవికి, యీ పెద్ద చిన్న వడ్లపూడి, కాకాని ప్రాంతాలు ప్రాణ ప్రిదం! స్వరాజ్యం అందని ఆ రోజుల్లో అధికారులు, వారితో సయ్యాటలాడు భారతీయ రాచకీయ పెత్తందారులు మాకు ప్రత్యర్థులై యున్నప్పుడే, యీ ప్రాంతపుఅరవై వేల యకరాల భూమికి మాగాణి వసతులు తెస్తిమి. శ్రీ సూర్య నారాయణ పంతులు, సూదనగుంట చింపయ్య, సుబ్బారెడ్డి ప్రభృతుల సహకారం, పెద్దతనాం ప్రాపకంతో ఇచ్చటికి యీ నాడు యిటుల భారతీదేవిని ఆహ్వానించుకో గల్గు సత్తా మా కందరికి స్వరాజ్య భారత నవ నాయకులు యువనాయకులు అందించుచున్నారు.

మన భారతీదేవి స్వయంగా మనతో వున్నారనుకొందాం! ఢిల్లీలో సమావేశ మైన అలీన (నాన్ ఎలైన్డు) దేశాల మహత్తర సమావేశం గురించి ఎంతో ఆనంద పడేవారు. 115 దేశాల ప్రభుత్వాధి పతులు అచ్చటచేరిరే! అటు అమెరికా యిటు రష్యాలకు వివిధంగా చేరువైనవారే, తల యొగ్గువారే ఎందరో అందుండిరి. ఐనా, వారినుండి వీలైనంత స్వతంత్రం పొందుతూ, వారిద్దరు పరస్పరంగా పోటీ బడుతూ, యీనాటి యీశ్వర మూడోకన్ను తెరవగల్గి, తెరుస్తామంటూ ప్రపంచానికి భయం కల్గిస్తున్నారే, వారినుండి రక్షణ పొందాలనుకుంటున్నారు. వారంతా భారతదేశపు పెద్దతనాన్ని కోరుతూ చేరుకున్నారు. ఆ సభకు శ్రీమతి ఇందిరాజీ అధ్యక్షులు: ఆ సభాచర్చల ఫలితంగా, యీ అక్టోబరు- డిశంబరులలో జరుగు యునైటెడ్ నేషన్సు అసెంబ్లీలో, న్యూక్లియర్ బాంబుల యుద్ధ ప్రయోగం వారించుటకు; వెనుకబడిన, ఆర్థికంగా అభివృద్ధి పొందుచున్న దేశాలవారి ప్రజల రక్షణకు, రష్యా అమెరికాలు, వారి బలగాలను కట్టడి చేయుటకు గొప్ప ప్రయత్నాలు ఇందిరాజీ సారధ్యం క్రింద జరపబోతున్నారు గదా!

ఇంతటిశక్తి స్వరాజ్యముపొందక బానిసత్వములో దైన్యత జెందియుండే ఆనాటి (1946) దేశాలకు యెలా కల్గుచున్నది?

భారత జాతీయ స్వాతంత్ర్య సమరం సాగుచుండడం, ఆ సమరవీరులు, మహాత్ముడు: జవహరు, బోసు, దేవిజీ లాంటి స్త్రీ పురుష త్యాగులు, సామ్రాజ్యాధిపతుల నెదుర్కొంటూ, అన్ని దేశాలకు సంపూర్ణ స్వాతంత్ర్యం కోరు కున్నందు వల్లనే గదా!

ఆ స్వాతంత్ర్యోద్యమం కావాలన్నారు ఆనాటి రష్యన్ విప్లవాధ్యక్షులు శ్రీ లెనిను. ఆ వుద్యమానికి యెందరో బ్రిటీషు, ఫ్రెంచి సోషలిస్టులు తోడైరి. వారిని ప్రోత్సహించిరి గాంధీజీ! మేమందరం సంస్థలను నిర్మించి నడిపితిమి. మాకు తోడైరి జవహరు, సుభాషు, సరోజనీ ప్రభృతులు. రెండవ యుద్ధానంతరం భారతీయులు రష్యావారి సామ్రాజ్య వ్యతిరేక ప్రచారం ప్రచండమైనది. అందువల్ల ఆనాటి బానిస దేశాలు యీనాడు స్వతంత్రం బొంది, అలీన దేశాల సమాఖ్యగా పెరిగిరి. అంతటి మహత్తర వుద్యమంలో కీలక పాత్రను సాగించు అదృష్టం మా దంపతులకు కూడ అందినది. నా పుస్తకాల సంగ్రహాన్ని తిరిగి ఢిల్లీ సభకై ముద్రించిరి. ఇందిరాజీ మనందరం, భారతదేశంలో సాగించిన 50 సంవత్సరాల సామ్రాజ్య వ్యతిరేకోద్యమ చరిత్ర, చిహ్నంగా ఈనాటి యీ నూతన స్వతంత్ర దేశాల నాయకులకు వీటిని పంచి పెట్టింది, ఆ సభలో నన్ను భారతీయ డెలిగేటుగా ఇందిరాజీ ఆహ్వానించిరి. అర్ధ శతాబ్ది పర్యంతపు వుద్యమ నాయకులతో ఉన్న చిహ్నంగా, అన్ని దేశాల డెలిగేషన్లు వేర్వేరుగా నన్ను అభినందిస్తూ వుంటే, భారతీదేవికి కూడా ఆనందమే! నాతోబాటు ఆమె కూడా యీజిప్టు, సుడాను, శ్రీలంక, సోమాలిలాండులో వుండిరి. అప్పటి ఆఫ్రికనుల నాయకులు శ్రీ కెన్యాట్టా, జూలియస్ న్యెరెరె పాడుమోరులు వారి కెరుకయే! మా అందరితో చేరిరి. కలోనియల్ దేశాల స్వాతంత్ర్య సంపాదనా ఫ్రంటు కార్యదర్శి శ్రీమతి డైనాస్టాకు ఆమెకు సన్నిహితురాలు. కనుక భారతీదేవి ఆదర్శము సఫలీకృతమై నందులకు ఆ దేశాలన్నీ స్వరాజ్యం పొంది, ప్రపంచ శాంతికై తమ తమ ప్రజారక్షణకై ఆర్థిక స్వాతంత్ర్యముకై ఢిల్లీలో చేరినందులకు ఆ సభలో తన్ను నా మనసులో నిల్పుకుంటూ వ్యవహరించడం ఆమె కందించిన నా ప్రేమ పుష్పము.

అమెరికా తెలుగువారి ఆరోసభకు రమ్మన్న ఆహ్వానము అంతలో ఢిల్లీలో కాలుజారి పడితిని. యెడమభుజము చిట్లెను. ఆస్పత్రివారు, పుత్తూరువారు కటు

కట్టిరి. అంతటి బాధలో, సుదూరాన వున్న వాషింగ్టనులో జరుగు 1983 మేనెల 28, 29 జరుగు సభకు పోగల్గినా. అది ఎట్లా సాధ్యమయ్యెను? భారతీదేవి నిల్పుతూ వుండిన దేహవార్ధ్యతవల్ల! మేముభయులం, అర్ధశతాబ్దిగా సాగించిన ప్రజాసేవా వ్రతపు నైతికశక్తివల్ల.

అమెరికాలో ఐదువారాలు సంచరించితిని! ప్రతిభావంతులై, స్వయంశక్తి, భోగభాగ్యాలు సంపాదించుకొంటూ, వివిధశాస్త్ర, రిసర్చి వ్యవహారములందు ప్రబుద్ధులైన వేలాది ఆంధ్రయువకులు, యువతులు అలాంటి భారతీయుల మధ్య వారి సభలందు సన్మానములు అందుకొంటిని! ఎవ్వరితరపున! మనదేశ స్వాతంత్ర్య సేవారాధకుల తరపున. ఈనాటి ప్రపంచములో ప్రచండ అణుశక్తి బలోపేతులైన అమెరికా ప్రెసిడెంటు రీగన్ గారిని, ఇందిరాజీ కాన్కున్ సమావేశములలో కలిసి భారతదేశముయెడల కొంతగా సుముఖులుగా జేసిరి. ఆమె సంపాదిస్తున్న నైతిక బలాన్ని పెంచుటకు, ఆ దేశ ప్రజాప్రతినిధుల కాంగ్రెసునుకూడా స్నేహపు వాతావరణంలోకి ఆహ్వానించుకోవాలి! ఆ ప్రయత్నంచేయ బ్రయత్నిస్తే మంచిదను కున్నారు మన ప్రధాని!

ఎప్పుడో 1949, 52, 54 లో ఎందరినో ఎరుగుంటి. ఆ ప్రెసిడెంటు ట్రూమను, రూజువెల్టు సతీమణి స్వర్గీయులైరి. ఇప్పుడున్నవారిలో కొందరితో పరిచయులైన మన ఆంధ్రవైజ్ఞానులు, సంఘసేవకులు శ్రీ మిక్కిలినేని, యం. వి. రావు, మేకల సత్యనారాయణ, తిరుపతయ్య సహాయ మందినది. వారి కాంగ్రెసు కేంద్రమైన కాపిటోలులో, ఆదేశ కాంగ్రెసు పైదేశిక ప్రముఖ కాంగ్రెసు నాయకులను కలిసితి. మనదేశపు రాయభారి వర్గము వారు నాతోచేరిరి. కొంతగా వారందరి స్నేహితము, సహకార ప్రధానం పొంద బ్రయత్నించితి.

అటులే, వివిధ పట్టణాలలోని తెల్ల, నల్లవారి నాయకుల పరిచయం పెంచు కుంటిని. నా స్నేహితులు ఎలిజబెత్తు, రేనాసేకా, ఐరీను కబ్రాను మరెందరో యువతీ, యువకులు "నన్ను" తమ పెద్ద, క్రొత్త రాతయ్యగా యెంచుకొనిరి. ఇదంతా మనకు బలమిస్తున్నదని ఇందిరాజీ తృప్తి చెందుచున్నారు. ఈ స్నేహ సౌహార్ద సంపద మనదేశాని కందించగల్గుట, భారతీదేవికి, మనగ్రామాల ప్రజలకు తృప్తియేగదా!

ఇదిగో కొంగ్రొత్త శుభవార్త భారతీదేవిజీకి! పదమూడు సంవత్సరాల క్రితం, గాంధీజీ శతవర్ష మహోత్సవాల సందర్భముగా రాష్ట్రపతి గిరి అధ్యక్షతన జరిగిన సమావేశములో నేను ఒక తీర్మానం ప్రవేశపెట్టితి ఢిల్లీలో వున్న ఇండియా గేటు కెదురుగా ఇంతకు పూర్వము జార్జి చక్రవర్తి శిలా ప్రతిమకై వుండిన పీఠముపై మహాత్మగాంధి కంచువిగ్రహమును ఆవిష్కరించాలన్నాము. తిరిగి ఆరు సంవత్సరాల క్రితం, ఆనాటి ప్రధానమంత్రి శ్రీ మొరార్జీ దేశాయిని ఆ శిలా విగ్రహాన్ని యింకెప్పుడు ప్రతిష్టిస్తారని అడిగితి! ఎట్టకేలకు యిప్పుడు శ్రీమతి ఇందిరాజీ ప్రధానిగా వుండగా సత్వరంగా ఆ ప్రతిష్టాపన జరుగుతుందనే శుభవార్త యీ 1983 సంవత్సరపు దేవిజీ వర్ధంతి సభకు అందించగల్గుచున్నా!

భారతీ దేవీ, నేను చూచితిమి, ఏ సుందర కొండలమధ్య సృష్టి శృంగారం లాలికించు వుద్యానాలతోనిండినలోయలోఆనాడుసీతామహాదేవి శ్రీరామునికై తపస్సు చేసిన ప్రదేశము. ఆ శ్రీ లంకలోని యీనాడు వంచలాది భారతీయ వంశీకులైన సింహళ వాస్తవ్యులను క్రౌర్యంగా, అమానుషంగా మారణహోమంకు అర్పించిరా సింహళీయులు. ఆ దారుణ హత్యాకాండను, భారత పార్లమెంటేరియనులు పదే పదే చర్చించిరి: ఐక్యకంఠులై ఆ చర్య 'అధర్మ' మనే నా మాటను తమందరి ఘోషగా ప్రకటించమని స్పీకరుని కోరిరి. ఇందిరాజీ ప్రపంచ రాజ్యాధిపతులకు, సింహళదౌష్ట్యమును నిరసించమని ప్రార్థించిరి ఎట్టకేలకు సింహళ ప్రభుత్వము, ప్రజలు మానవరక్షణ మార్గమునకు వస్తున్నారని తృప్తిపడెదరు మన భారతీదేవీ!

ఈ మూడు సంవత్సరాలలో మానవత్వమును మరపించే దుష్టచైదములు అటు అస్సాంలో, ఇటు పంజాబులో సాధారణమగు చుండుట గాంధీజీకి, భారతీ దేవికి కల్గు హృదయతాపమెంతోగదా!

నిరంకారులనేవారు ఎప్పటి కప్పుడు ప్రజారక్షణకై అవతార మూర్తులు వెల్గుచుందురనే విశ్వాసముగలవారు. అట్టి నిరపరాధులగు సిక్ఖేతరులను అకాలీలు చంపరాదు: వారి దారుణద్వేషములను అందరు అన్ని పార్టీలవారు యెదిరించాలనే నా ప్రార్థనను యీ 1983 వర్ష ఋతువు పార్లమెంటు అంగీకరించిరని, దేవీజికి నివేదించగల్గుచున్నా!

కుబేరులై పారిశ్రామికాభివృద్ధి బొంది, అధునిక సైన్‌టిఫిక్ రహస్యములను నిండుగా పెంచుకున్న దేశాలకు ఈ అర్థశతాబ్దములో హెచ్చరిక చేస్తూనేవున్నాము,

ఏమని?జనాభా పెల్లుబికి,ఆర్థికంగా వెనుకబడిపోయి,ప్రపంచవ్యాపారములో,దీనావస్థలో దించబడియున్న దేశాలు, వారి ప్రజలకు చేయూత యివ్వాలని! దోపిడి వ్యాపారం మానాలని! తమకు అవసరంలేక, కోట్లుగా పడగలెత్తిన ధనధాన్యాలు, చదువు సంధ్యలు, మంత్రతంత్రాలు, బీదదేశాలకు వుదారంగా అందించుట యీ శతాబ్దిపు ధర్మధోరణిగా ఆచరించమని! ఆ సూత్రముల నిర్వచించు మా పుస్తకం "క్వింట సెన్సు ఆఫ్‌నాన్ ఎలైన్‌మెంటు Quintessence of Non - Alignment" యీ సంవత్సరాననే శ్రీశేషగిరిరావు ద్వారా ప్రచురించితిమి. ఈ ధర్మసూత్రాన్ని ఆమె నేను ఆనాటి 1930-1950 దశాబ్దాలనుండి ప్రచారం చేస్తూవుంటిమి!

మన పార్లమెంటు 1969 లో ప్రమాణము చేసినది. మహాత్మగాంధి నిర్వచించి ఆచరించిన సత్యాహింస సాంఘిక సమధర్మం మన జాతియధర్మమని అశేష పీడిత జనాల సముద్ధరణ, మానవసేవా వ్రతానుష్టానం మన ప్రజాస్వామ్య ధ్యేయమని!! తిరిగి యీ 1983 లో ఆ మార్గముననే నడుచుటకు కృత నిశ్చయుంమని!! భారతీదేవి కోరినదీ ఆమె ఆత్మ ఆరాటం చెందుచున్నదీ ఆ ప్రతిజ్ఞాపాలన కొరకే. ఆ ధోరణిలో మనమంతా హృదయపూర్వకంగా రైతుకూలీ ప్రజాసేవ చేయుచుండుటే ఆమెకు మనం అందించగల ఆరాధన, సంస్మరణ.

ఈ మూడు సంవత్సరాలలో పెళ్ళికూతుళ్ళు కట్నాలు వగైరా బాధలకు, నిర్బంధాలకు మరెంతగానో లోనగుచున్నారు. ఎంతగా చదువుకొన్నా స్వతంత్ర కుటుంబ పరిధులలోనే గౌరవప్రదం పొందజాలకున్నారు. బస్తీలలో, ఢిల్లీ, బొంబాయి, కలకత్తాలాంటి పాశ్చాత్య కుటుంబైక్యతకు వ్యతిరేకమగు వాతావరణమునకు లోనైనట్లు, పెరుగుచున్న పత్రికా ప్రకటన పొందుచున్న "ఆత్మహత్యల" కధలెన్నో? ఈ దారుణమగు అన్యాయపు నిర్బంధ జీవితము నుండి మన యువతులను రక్షించుకోవాలి. ఆనాడు వీరేశలింగం, యీశ్వర చంద్రుడు అంత వుద్యమాలను నడపిరి స్త్రీల మాన, స్వాతంత్ర్య రక్షణకై! యీనాడో? శ్రీమతులు కనకమ్మ, చుక్కమ్మ, లక్ష్మీబాయమ్మ, దుర్గాబాయిలతో చేరి మహాత్ముని ఆశీర్వాద బలంతో భారతీదేవి దశాబ్దాల పర్యంతం ఎంతగానో శ్రమించిరి. ఘోషా, బాల్య వివాహాలు, కట్నాలు వగైరా దౌర్భాగ్యములను యెదిరించిరి వితంతుల రక్షణకై! అది చాల లేదు. ఇంకెంతగానో, ఇంకెందరో సంస్కరణ ప్రియులగువారు, స్త్రీ స్వాతంత్ర్య సంపాదనా వీరులు, వీర వనితలు కావాలి.

ఆర్థిక స్తోమతలు స్త్రీలకు అందుచున్నవా! మహమ్మదీయ స్త్రీల స్థితి కొంచెం నాణ్యం! వారిమధ్య నిల్చియున్న బహుభార్యాత్వము వల్ల బలహీనమగు చున్నది. హిందువుల మధ్య యింకేంతగానో అన్యాయంగావుంది. మన హిందూకోడును సంస్కరించి, తల్లి దండ్రుల ఆస్తిలో ఆడబిడ్డలకు సమానహక్కు, బాధ్యతలు వుండాలని భారతీదేవి ఆశయము. ఆ హక్కుకై యింకా శ్రమించాలి.

ప్రపంచ మందలి మహమ్మదీయ దేశాలలో స్త్రీలస్థితి మరీ దైన్యంగా వున్నదే! మన యువకులు యీ కట్నాల పిశాచమునుండి ఎప్పుడు విముక్తిజెందు తారో! తల్లిదండ్రులు కోడళ్ళను యెప్పుడు అల్లారుముద్దుబిడ్డలుగా ఆహ్వానిస్తారో ? కనుక స్త్రీ స్వాతంత్రము కొరకు పోరాడుటకై సరోజనీదేవి, భారతీదేవి మరెన్ని జన్మలెత్తాలో!

ఈ పన్నెండు సంవత్సరాలలో కొంతవరకే స్త్రీజనాలకు అభివృద్ధి అందినది రక్షణ యింకెంతో అవసరం. శ్రీమతి దండావతి లాంటి సీనియరు మహిళా నాయకురాండ్రెందరో. భారతీదేవి, సరోజనీదేవి, కమలాదేవి, దుర్గాబాయి ధోరణిలో ధీమాతో శ్రమించి, సేవజేయువారు కావాలి! అదే ఇందిరాజీ కోరిక, వుద్బోధ. స్త్రీ లోకమును మరెంతో అంధకారమందు నిల్పుకుంటున్నారు? అనేక అలీనదేశాలు. వారి సభలోనే భావగర్భితంగా, పురుషుల ఆధిక్యతనే కంఠాభరణంగా కల్గియున్న వారి సమాఖ్యకు (ఇందిరాజీని) ఒక స్త్రీని- అధిపతిగా ఎన్నుకొనుట వారిలో వారి దేశాలలో స్త్రీ లోకము యెడల పెరుగుచున్న అభిమానమునకు చిహ్నమని ఆమె ఆశిస్తున్నారు. ఆ ప్రకటనకు మా తరపున సంతోషము తెలిపితిని.

అటుల అవకాశం కల్గినప్పుడల్లా ఇందిరాజీ స్త్రీలఅభ్యుదయము కొరకై దేశ, విదేశ సభలలో విపుల ప్రచారం చేస్తున్నారు. ఆమెను అంతగా 1970 నుండే భారతీదేవి ఆదరిస్తూ, అభిమానిస్తూ వుండేవారు.

మా రాచకీయ ధోరణికి మా ఆశయాల కనుగుణ్యంగానే, తగిన మలుపులు అవసరమనుకున్నాము. అటులనే క్రిందటి పుష్కర పర్వములో నేను, ఇందిరాజీని బలపరుస్తూ వుండుట ఆమెకు తృప్తి కల్గుచుండునని నా విశ్వాసము. 1923 నుండి యే రాచకీయ మార్గమును రైతుకూలీ శ్రమజీవుల సమగ్రాభివృద్ధికై అనుసరిస్తూ వుంటిమో ఆ ధోరణి పరిధికే ఇందిరాజీ క్రమంగా తన రాచకీయ పెత్తనాన్ని సాగించుటకు పూనుకుంటున్నారనే ఆశతో ఆమెను బలపరుచుట శుభప్రదమను

కున్నాము. రైతాంగ వ్యతిరేక ధోరణికి స్వస్తిచెప్పుతూ స్వయంవృత్తులవారు స్త్రీజనాలు తదితర వెనుకబడిన వారిరక్షణకై ఆమె ముందుకొస్తున్నందువల్ల ఆమెను బలపరుచుట ధర్మమన్నారు భారతీదేవి. నేను ఆమెతో అంగీకరించితిని. యీ మా ధోరణిని రైతుకూలీ ప్రజారాజ్యాశయమును అందుకున్న ప్రజలు 1980 ఎన్నికలలో ధ్రువపరుచుట ఆమెకు తృప్తికల్గిస్తున్నది.

అటులే అంతకుమించే మరెన్నోరీతుల సుఖము సంతోషము. సమానత్వము స్వాతంత్ర్యప్రదంగా యీనాటి మరునాటి యువజనులు పెద్దల ఆశీర్వాదములతో తమతమ అమ్మ, అమ్మమ్మలను అక్క-చెల్లెండ్లను, భార్యలను తమ బిడ్డలతల్లులను, అందరుస్త్రీలను. ఆదరించుకోవాలని మా దంపతులతరపున దేశ సంఘసేవల దృష్ట్యాకోరుతున్నా, ప్రార్థిస్తున్నా !

భారతీదేవీ ఆవాహయామి !

కిసాన్ గొర్రెపాటి ఆవాహయామి !

నలభై సంవత్సరాల పర్యంతం రాష్ట్ర కిసాన్ సమ్మేళనమునకు సారధ్య మొనర్చిన శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య 1969 - 70లో స్వర్గీయులైరి. 'వాహిని నిర్వాహకులుగా దశాబ్ది పర్యంతం యెన్నో బరువులు, సమ్మేళన బరువులకు తోడుగా భరించిరి. అంతటి సంఘ, రైతాంగ సేవకులు బహు అరుదు. అందులకే భారతీదేవి వారి యెడల ప్రత్యేక భక్తి కల్గియుండిరి ?

వారిద్దరికి, వారి ఆత్మబలం ద్వారా క్రిందటి ఐదారు సంవత్సరాలలో ప్రత్యేకంగా మన రైతాంగము అందించుసేవ లెట్టివి ?

1974 -75లో, ఆంధ్రలో ప్రత్తిపండించురైతులకుప్రత్తిధరలు పడిపోతుంటే, యువరైతు సేవకులు ఆందోళన చెందుచుండిరి. అట్టి పరిస్థితులలో రైతు వుద్యమ ప్రధాన డిమాండు ప్రభుత్వము రైతుల రక్షించుటకై గిట్టింపు ధరలకు వారి ప్రత్తిని కొంనటప్రారంభించాలని కోరితిమి. రాష్ట్ర ప్రభుత్వము తమ ఫండ్సు చాలవన్నారు. 'జాతీయ కాటను కార్పొరేషను' చేత ప్రత్తిని కొనిపించాల్సిందని ప్రధానమంత్రి ఇందిరాజీని కోరితిని. కామర్సు మినిష్టరు అందుకు వెనుకాడు చుండిరి. కాబినెట్టులో చర్చకు వచ్చునట్లు కొందరు మంత్రుల ద్వారా చేయించగల్గితిని. తుదకు ఇందిరాజీ చొరవచేసుకొంటిరి. తగిన ధరలకు ప్రత్తిని కార్పొరేషను కొనునట్లు చేయించ గల్గితిమి. అదే పద్ధతిన భారతదేశ మందలి ప్రత్తి రైతులందరికి అప్పటి నుండి

తగిన ధరలు, సమయానుకూలంగా కొనుగోలు యేర్పాటులు, కాటను కార్పొరేషను చేయునట్లు జాగ్రత్తపడుచున్నాము.

అటులే, 1978 - 79లో పుగాకు రైతులకు, విదేశీ వర్తకుల నుండి రక్షణ యేర్పరచ వలసివచ్చెను. ధరలు తగ్గించుట, కొనుగోలు తగ్గించడం, అంగీకరించు కున్న ధరలు చెల్లించకుండుట జరుగుచుండెను. అప్పటికి నేను పార్లమెంటులో తిరిగి వుండగల్గుట, రైతాంగముపై అభిమానం బొందిన శ్రీ మోహన్‌ధారియా మంత్రిగా వచ్చుట సాధ్యమయ్యెను. యస్. టి. సి. (ప్రభుత్వ వ్యాపార కార్పొరేషను) ద్వారా నిల్వ వున్న పుగాకు బేళ్ళను కొనుగోలు చేయునట్లు వ్యవహరించితిమి. అలాగా నాల్గు ఐదు సంవత్సరాలు రక్షణ అందుచుండెను. తిరిగి 1983 లో మితిమించి పుగాకు నిల్వలు పెరిగినవి. వ్యాపారులు యెగుమతి ఆర్డరులు లేవంటూ, ధరలు అతి తక్కువగా చూపించుచుండిరి. ఎవ్వరి వల్ల ఈ మోసం, ఈ కష్టం? ఎగుమతుల వారా, వ్యాపారులా, ఫాక్టరీలవారా? పెట్టుబడులపై వడ్డీలు పుగాకు విడుదల కావనే భయాలు, దిగజారుచున్న ధరల భయాలకు తాళలేక ఎట్ట కేలకు ప్రకాశంజిల్లా రైతులు "రైళ్ళు, రోడ్లురోకో" అనే సత్యాగ్రహం సాగించిరి, కొందరు రైతులు పోలీసు కాల్పులకు ఆహుతులైరి.

ఢిల్లీలో ఆ వెన్వెంటనే ఇందిరాజీ ప్రభుత్వాన్ని మేల్కొల్పినాను. రైతాంగముపై ప్రేమగల్గిన శ్రీ వి. పి.సింగు. కామర్సు మంత్రి యస్. టి. సి. చేత నేను కోరినట్లు పుగాకు నిల్వలకు రైతాంగము నుండి సరాసరిగా గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయిస్తానని హామీయిచ్చిరి. నెలపర్యంతం శ్రీ నాగినేని వెంకయ్య శరభయ్య రంగారావు శ్రీనివాసరావు ప్రభృతులు, సత్యాగ్రహుల తరఫున ఢిల్లీలో తపస్సు చేసిరి. అన్ని పార్టీల యం. పీ. లువారిని బలపరచిరి. ఇది వీరికెన్నడూ జరుగనట్లుగా, యస్. టి. సి వారిచేత, 21 కోట్ల ధరపై పుగాకు నిల్వలలో అత్యధిక భాగం, రైతుల నుండి సరాసరి కొనుగోలు చేయించుట సాధ్యమైనది. ఇందులకు ఇందిరాజీకి, సింగుగారికి, మరణించిన సత్యాగ్రహులకు రైతాంగం ఋణపడి యున్నారు; ఇంతటి రక్షణ, విజయం ఆనాటి నుండి రైతాంగసేవలు చేస్తూ, త్యాగ ధనాన్ని, ధర్మమార్గాన్ని అందించిన శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, భారతీదేవి వారి అనుయాయులకిదే నా కృతజ్ఞతాభివందనాలు.

వర్షాలులేకనో, అధిక వర్షాలవల్లనో, రైతులెంకగానో ప్రతి ఐదు సంవత్సరాలలో రెండు మారులు మాగాణి ప్రాంతాల్లో కూడా విస్తార నష్టాలు పొందు

చున్నారు. ఇక వ్యవసాయ కూలీలు భరించే నష్టాలు, ఆకలి బాధలను లెక్కించ గలమా ? ఆ కష్టకాలాల్లో, రైతు కూలీల రక్షించు బాధ్యత ప్రభుత్వము శిరసా వహించాలని రైతాంగోద్యమం 1923 నుండి ఘోషిస్తున్నది. అంతటిబాధ్యత, ఏవొక్క రాష్ట్రం భరించజాలదని. కేంద్రప్రభుత్వం ఇందిరాజీ పెత్తన కాలంలో ప్రత్యేకంగా గ్రహించుచూ, తామె బాధ్యత వహించి రాష్ట్రాలకు తోడగుదు మన్నారు. అనుభవ పూర్వకంగాచూస్తే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుకూడా ఈబరువు బాధ్యతలు వహించుటకు నిస్సహాయులగుదురు కనుక, ప్రపంచస్థాయిలో పర్మ నెంటుగా ప్రతిసంవత్సరం ప్రతి దేశంనుండి చందాలు పొందుతూ వుండే నిధి వుండాలని నేనువొక ప్రణాళికను ప్రపంచ ఆహారసంస్థకు యునైటెడు నేషన్సుకు 1970-75 లోఅందించితి.

1977 లోవచ్చిన తుఫాను ఆంధ్రుల కెంతో నష్టం కల్గించెను. ఈ క్రిందటి రెండు సంవత్సరాలలో వర్షాలు లేకపోయినందువల్ల, భారతదేశములో దాదాపు నాల్గవ వంతుగా పంటలు పోయె, కరువువచ్చె. కోట్లకొలదిగా రైతు కూలీలు అన్నార్తులైరి. కనుక ప్రపంచ మందలి అన్ని సాంఘిక రక్షణసంస్థలు, వ్యవసాయ ప్రజలకు నష్టపరిహారము కరువు నుండి రక్షణ అందించుట ప్రథమ ధర్మమని అంటున్నాము. యిన్నేళ్ళ నుండి చేస్తున్న మన యీ మన ఘోషను ఆలకించు చున్నారా ? ఏదో కొంత మార్పు వస్తున్నది. కనుకనే, 1982 లో ఆంధ్రలో శ్రీ విజయభాస్కరరెడ్డి వరదలు, తుపానులు వల్ల యిళ్ళు పంటలు పోగొట్టుకున్న రైతు కూలీలకు కొంత నష్ట పరిహారం అందించిరి. రైతాంగోద్యమ ప్రధాన కోరిక (డిమాండును ఈ మాత్రంగానైనా, ప్రభుత్వం అంగీకరించిన శుభవార్త గొర్రెపాటికి భారతీదేవికి యీ వర్థంతిలో అందించుచున్నా.

రాయలసీమ 1952 లో కరువులో బాధితమైనప్పుడు భారతీదేవి యెంతో ధనం, ధాన్యం సహాయం అందించిరి. ఆ గ్రామీణులు పదే పదే క్షామబాధ అనుభ వించుచునే వున్నారు. వారికి వివిధ స్వయం పోషకవృత్తులు, చదువులు అవసరం. వారి సమగ్రాభివృద్ధికై ఆమెకు నాకు ఆప్తులైన శ్రీ రాజగోపాలు (M. P.) వివిధ మైన సంస్థల నేర్పరుస్తున్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంఘ సేవకుల తోడ్పాటుతూ, నూతన ధోరణులలో ఆదర్శసేవా కార్యముల సాగించ గల్గు చున్నారని భారతీదేవికి యీనాడు తెల్పగల్గుచున్నా !

మా పుభయులకు ఆత్మీయులైన మీరు (M. P.) రాయలసీమ రక్షణకై వివిధ వైజ్ఞానిక స్వయంవృత్తుల సంఘాలను సాగిస్తూ వుండడం ఆమెకు ఆనందం కల్గించును. 1952 లో ఆమె ఆనాటి కరువు బాధితులకు సేవలు చేస్తూ యీ రాజన్నకు అందించిన ఆలోచనలకు ఈనాడు ఈ సంస్థలను వారివృందము నిర్మించి దీనజన సేవలు సాగించుట ఆమెకెంతో తృప్తికదా!

భారతీదేవి గ్రామీణప్రజలకై యెన్నెన్నో విధాల శ్రమించిరి. ఆమె ఆశయాలను విశ్వవిద్యాలయ వైజ్ఞానిక అంతస్థులో పరిశోధనచేయు వారు స్మరించుటకై యీనాటి పుత్సవాధ్యక్షులు శ్రీ బసవపున్నయ్య ఆంధ్ర విశ్వవిద్యాలయములో "ఎండో మెంటు" యేర్పరచుట శుభప్రదము.

భారతదేవికి, గొర్రెపాటికి ప్రియపాత్రులైన రైతాంగ సేవకులు శ్రీ నాగినేని వెంకయ్యను సన్మానించుసభకు అధ్యక్షత వహించు భాగ్యము (మే 15) నాకు అందినది. గ్రామీణ ప్రజల మధ్య గ్రంథాలయములద్వారా, విజ్ఞానప్రచారము చేయుటకై దశాబ్దాలుగా సేవిస్తున్న శ్రీ పాతూరి నాగభూషణం, వెంకయ్యగారిని సన్మానించిరి. అర్థశతాబ్దిగా ప్రజాసేవలో తన్మయత్వము పొందుచున్న ఈయిద్దరూ వారిద్దరికి ఆత్మీయులు. అటులే గ్రామీణుల గ్రంథాలయోద్యమమును సాగించుచూ అమరజీవులైన ప్రథమాంధ్ర స్వాతంత్ర్యవీరులలో పెద్దయగు గాడిచర్ల హరిసర్వోత్తముల శతవత్సరపుత్సవమునకు నన్ను ప్రధమపూజారిగా కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణంగారు ఆహ్వానించిన శుభవార్త భారతీదేవికి అందిస్తున్నా!

నాకు ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య 1981 నవంబరు ఏడో తేదీన నాగేలు చిహ్నాన్ని అందించిరి. అది నాజన్మదినం. దానిని రాష్ట్రీ రైతాంగోత్సవంగా ప్రభుత్వం గుర్తించ చున్నదన్నారు! అదొక అద్భుతమగు వుత్సవం. ఆ హైదరాబాదులో, రైతుల పంటలకు కనీస ధరలు, కూలీలకు కనీసవేతనాలు, కళాకారులకు కనీసమజూరీలు, స్వయం వృత్తుల గ్రామికులందరికి తగినంత మజూరీలు, సహకార సంస్థల బలం, ఆర్థిక వరి పౌరధరలప విస్తృతం, చక్కైన వస్త్రాలు అందించుట ప్రభుత్వప్రధర్మంగా గణించేరోజులు రావాలని! ఆనాడే ఆసమయ మందే చెప్పగలిగిని.

1925 నుండి గ్రామీణ పేదలు, కార్మికులకు నిరుద్యోగ నివారణకై తగిన వుద్యోగవసతులు అవి అందనప్పుడు కనీసం వుదర పోషణార్థమై భీమావతిహారం అందించే ప్రభుత్వం ఎప్పుడు అందునాయని ఆశిస్తూ వుంటిమి. స్వరాజ్యం అవతరించిన ముప్పై సంవత్సరాలు పైబడినాక ఈ మాత్రము రక్షణ అందించుటకు, ఇందిరాజీ నాయకత్వం ద్వారా మొదట మహారాష్ట్ర, పిమ్మట కేరళ, బీహారుల రాష్ట్ర ప్రభుత్వాలు కొంతగా యిందులకు పూనుకొన్నవి. ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబములో ఒక వయో కార్మికునికి నిండు భత్యము అందిస్తామన్నారు, ఈ సంవత్సరం భారత ప్రభుత్వమే అన్ని రాష్ట్రాలలో ప్రతికుటుంబంలో అథమం ఒక్క నిండు కార్మికునికైనా వుద్యోగం కల్పించు ప్రణాళికను తయారుచేయ బూనుకొన్నారనే శుభవార్త అందుచున్నది.

ఇంతకు ముందే క్రిందటి ఏడు సంవత్సరాల క్రితమే ప్రకోపయోగపడు నిర్మాణ, అభివృద్ధి కార్యక్రమాలు కొన్ని రాష్ట్రప్రభుత్వాలు చేపట్టిరే. ఎందరు కూలీలకు అదనపు వుద్యోగం కల్గింతురో, వారందరికి వేతనాలబదులు ధాన్యం రూపేణా వుచితంగా అందించు ప్రణాళికను ఇందిరాజీ ప్రభుత్వము ప్రయోగం చేసిరి. దాన్ని జనతా ప్రభుత్వము సాగించినందుకు అభినందించితిమి. క్రిందటి నాల్గు సంవత్సరాలలో, తిరిగి కాంగ్రెసు ప్రభుత్వములు దాన్ని విస్తరించుచున్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా దాన్ని పెంచుతూ, నిర్మాణ కార్యక్రమము లందు ప్రతి కుటుంబంలో అథమం ఒక్క వయోజనునికి నిండు వేతనంపై అదనపు వుద్యోగ వసతులు **(Employment not permanet jobs)** యేర్పరచుటకు ఇందిరాజీ కేంద్రప్రభుత్వము పూనుకొనుట నాకు ఆశాజనకంగా వున్నది.

వ్యవసాయ కూలీల రక్షణకై, మేమందరం యేనాటి నుండో ఆరాట పడుచునే వున్నాము. వెనుకబడిన తరగతుల వారి బిడ్డలు చదువులకు అందక పోవడానికి ప్రబల కారణం వారి దీనతనమే గదా? ఆ బాధను కొంతవరకైనా నివారించాలంటే వారి పిల్లలకు మధ్యాహ్న భోజనమైనా వుచితంగా నిండుగా సంపషంటి తరహన అందించడం ధర్మమనుకుంటూ వుంటిమి. ఎట్టకేలకు కాంగ్రెసు ప్రభుత్వం 1982లో ఆ సౌకర్యం దీనుల బిడ్డలకు కల్గించినది. మా ప్రాంతపు విద్యాలయాలలో, ప్రతి దినం మధ్యాహ్న సంతర్పణ మన దీన బిడ్డలకు అందించగల్గితిని. అప్పుడే దేవిజీ గారిప్పాటి వుంటే ఎంతో ఆనందపడ్యేది.

అంతటిబలీయులైననెహూ్రజీ, ప్లానింగుకమీషనులు రైతాంగపుస్వంత వుద్యోగము స్వంత వ్యవసాయము, స్వంతకమతముల రద్దుకై సాగిస్తూవుండినప్రచారాన్ని, సవరణ బిల్లులను యెదిరించితిమి. పార్లమెంటులో మనకు తగినంతబలం అందక పోయినా, పార్లమెంటరీ ప్లాటు ఫారాల ద్వారానే శ్రీ నెహూ్ర ప్రవేశపెట్టిన 17 రాజ్యాంగ శాసన సవరణ బిల్లుపై దాడి చేసితిమి. దేశమంతటా ఆందోళన సాగిస్తిమి, లక్షలాది రైతులచేత పోస్టుకార్డు పిటీషనుల ప్రయోగించితిమి. రాజాజీ తన దివ్యలేఖిని వాణిని మనకందించిరి. వీరు వీరోచితసేవలు అందించిరి. తుదకు రైతు కమతాన్ని రైతుల స్వంత వుద్యోగమును, ఆర్థిక స్వాతంత్ర్యమును రక్షించితిమి.

కోట్లాదిగా స్వంత వుద్యోగులై ఆర్థికస్వతంత్రమును అనుభవించుచున్న రైతాంగం అంతగా రైతురక్షణ సాధించిన వీరులు కర్ణాటకపు శ్రీ హెగ్డే, గుజరాతు భాయిశేలే, దామభాయి అమీన్. సి. యల్. పటేలు, పంజాబు బసంతసింగు వుద్ధమసింగు నాగోకే, ఆంధ్రులు కావూరి వెంకయ్య, గొట్టిపాటి, భారతీదేవి తమకృతజ్ఞతను యీ స్మృతిసభల ద్వారా తెల్పుకొనుచున్నారు. ఈ సభలు స్వచ్ఛందముగు రైతుసేవలకు ప్రోత్సాహం కల్గించును.

ఆవీరగాధను యీ సంవత్సరపు నేదినాన, పుస్తకరూపేణ ప్రచురించినాము. అందు పార్లమెంటులో నేనుచేసిన ప్రసంగాలు రాజాజీ అందించిన సందేశాలు చేర్చితిమి. ఆ గ్రంథానికి రూపురేఖలు శ్రీ అమరయ్య, చంద్రపాల్ తీర్చిదిద్దిరి. స్వతంత్ర పార్టీని మేము నడపకబోతే దానిద్వారా యిచ్చటమీరు, సర్దారులచ్చన్న, అచ్చటి మస్తానీ, వివిధరాష్ట్రాల అసెంబ్లీలలోని, సర్దార్ భగత్‌సింగు, బూటాసింగు, సింగుదేవులాంటి పార్లమెంటు సభ్యులు రైతురక్షణ యాత్రలు ప్రచండ ప్రచారం చేయకుంటే, రైతాంగ వ్యవస్థను ఆనాటి నుండి యిప్పటి వరకు ప్రభుత్వాలు రద్దు చేసేవారే! కోట్లకొలది రైతులు కూలీలుగా నిరుద్యోగులుగా దిక్కులేనివారై ప్రభుత్వాధికారులకు బానిసలయ్యే వారే!

స్వాతంత్ర్య సమరంబు సలిపి నాథుని తోడ
చెరసాలకేగిన సిద్ధహస్త !
ఘనుడు గాంధీతాత కలిజాడలలోన
మెలఁగిన సిసలైన కలికి మిన్న !
తెలుఁగు దేశము నంము వెలతేని కీర్తిని
వెలయించినట్టి సాధ్వీలలామ !
రంగాజి హృదయాంతరంగ రాజీవంబు
వికసింప నేర్చిన వీరపత్ని !
నారి లోకంబు నీకు సన్మాన మొసఁగ
పేరు గాంచిన విద్యా ప్రవీణ! గోగి
నేని వంశంబు దిపించి విలచితమ్మ
భారతీదేవి! నీకు మా వందనంబు !

—బొడ్డు ప్రకాశం

# 1944 లో నా సేవాగ్రాం యాత్ర

ఆచార్య రంగా

1944 లో ఆ నవంబరు ఉదయాన నేను సేవాగ్రాం చేరుకున్నాను. నా మనసంతా ఆశలతోపాటు ఆందోళనతో కూడా నిండి వున్నది. మహాత్ముని సన్నిధికి యిదినా మొదటి యాత్రకాదు. మహాత్మునితో సమావేశం యిది మొదటిసారికాదు. ఆ అయిదు మైళ్ళ పొడుగునా మార్గం, ప్రతి మలుపూ నాకు చిరపరిచితాలే! వెదురు బద్దలతో కట్టి మట్టి పూసిన ఆ వరండా నాకు ఎప్పుడూ హార్దిక స్వాగతం పలుకుతూనే వున్నది. దానిని ఆనుకునే వున్న చిన్న కుటీరం భారతదేశపు హృదయమూ, అంతరాత్మ అయిన మహాత్ముని తనలో నింపుకుని వున్నది.

బాపూజీ కార్యదర్శులలో ఒకరైన శ్రీమతి కుర్షిద్ బెన్ నన్ను ఎంతో ఉత్సాహపూరితంగా ఆహ్వానించి బాపూ నాతో సమావేశానికి ఎంతో ఆశక్తితో వేచియున్నారని తెలిపారు. అక్కడ కొన్ని వారాలుగా బస చేసి వున్న తెలుగు హరిజన పట్టభద్రుడు శ్రీరామస్వామి కూడా శ్రీ బాపుతో నా సమావేశం వల్ల కలిగే సత్ఫలితాలను గురించి ఆశ్రమ వాసులంతా ఆసక్తితో వున్నట్లు తెలియజేశారు. సహజంగానే నాలో కూడా ఆసక్తి అధికమై నా ప్రయత్నంలో సఫలీకృతుడను కావాలని గట్టిగా కోరుకున్నాను. చిరునవ్వుతో గాంధీజీ నన్ను పలకరించారు. నా ఆరోగ్యాన్ని గురించి, ముఖ్యంగా నా చెవిపోటును గురించి, ఆసుపత్రి అనుభవాలను గురించి, నా జైలు అనుభవాలను గురించి, ప్రత్యేకంగా కమ్యూనిస్టులతోనూ, సామ్రాజ్య వాదులతోనూ సవ్యసాచిగా పోరాటం జరుపుతున్న శ్రీమతి భారతీదేవిని గురించి ప్రస్తావించి విశదంగా తెలుసుకున్నారు. అంతటితో మా రెండు గంటల సుదీర్ఘ సమావేశాన్ని ప్రారంభించాము.

అమరావతి, తంజావూరు కారాగారాల్లో బహుభాషా ప్రాంతాల నుండి వచ్చిన డిటెన్యూలందరమూ కలిసి ఎన్నో జాతీయ సమస్యలను గూర్చి చర్చించినట్లు బాపూకు తెలియ జేశాను. "ప్రజాయుద్ధం" పేరుతో కమ్యూనిస్టులు దాని సమర్థించాలని చూడగా చలించకుండా దేశభక్తి గల మన గ్రామీణులు "క్విట్ ఇండియా" ఉద్యమంలో ఎంతో ఆసక్తితో పాల్గొన్న వైనాన్ని వివరించాను.

జాతీయ ప్రయోజనాల దృష్ట్యా గ్రామీణ రైతులను కూడగట్టుకొని వారి సమస్యల పరిష్కారానికి గట్టిగా కృషి చేయాలని చాలా మంది ఉద్దేశపడినట్లు తెలియజేశాను. బాపూ అన్నిటికీ అంగీకరించారు.

ఆ కారాగార విశ్వవిద్యాలయంలో, ప్రముఖంగా తంజావూరులో డిటెన్యూలందరూ మన ఉద్యమానికి యువకుల, విద్యార్థుల తోడ్పాటును పొందాలని గట్టిగా కోరినట్లు తెలియ జేశాను. కమ్యూనిస్టులు కారాగారంలో శిక్షణా తరగతులు నిర్వహించి డిటెన్యూలలో ఉత్సాహ పూరితులైన యువకులను, విద్యార్థులను దారితీస్తున్నట్లు తెలియజేశాను బాపూ మా అభిప్రాయాలతో ఏకీభవించారు.

రోజు రోజుకీ రైతులలో, మిల్లు కార్మికులలో రాజకీయాల పట్ల ఆసక్తి పెరుగుతున్నట్లు వారిని కూడగట్టి కమ్యూనిస్టుల మత దురహంకారుల కబంధ హస్తాలలో యిరుక్కోకుండా గట్టి ప్రయత్నం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాను. బాపూ భావం కూడా తదను గుణంగానే వున్నది.

బాపూ తన కార్యదర్శిని పిలిచి నిర్మాణాత్మక కార్యక్రమాలను విస్తృతపరిచే తన బహిరంగ విజ్ఞప్తితో కూడిన పత్రికా ప్రకటన ప్రతిని తీసుకుని రమ్మని చెప్పారు. దాని మీద సంతకంచేసి నాకు అందించారు.

అప్పటికే బాపూ మా సహకారాన్ని తెలుసుకుని రైతులను, కూలీలను, యువకులను, విద్యార్థులను, మహిళలను తన నిర్మాణాత్మక కార్యక్రమాల పరిధిలో చేర్చుకున్నట్లు గ్రహించాను. గిరిజనులను, చేనేత పని వారిని, యితరకళాకారులను గూడా చేర్చుకోవటానికి గాంధీజీ అంగీకరించారు.

మా డిటెన్యూలు, గాంధీజీకి దూరంలో నివసిస్తూ గూడా ఒకే విధమైన భావస్పందన కలిగివున్నట్లు తెలుసుకుని మే మిద్దరమూ సంతోషించాము.

తొలి చర్చలలోనే నేను ధైర్యం తెచ్చుకోవటంవల్ల కిసాన్, మజ్దూర్ కళాకారుల, బుద్ధిజీవుల రాజ్యస్థాపనకుగల సత్వర రాజకీయ ఆవశ్యకతను గూర్చి నా నివేదికను తెలియజేశాను. సత్యా హింసలు మూల ధర్మాలుగా కలిగిన స్వరాజ్య లక్ష్యానికి శాస్త్రీయ, తృప్తికర, ప్రగతి శీలక, రాజకీయ భాష్యంగా చెప్పుకోవచ్చునని తెలియ జేశాను.

సత్యా హింసలనే బాపూజీ నిర్దేశించిన మూల సూత్రాలను ప్రజాస్వామ్యంలో మాత్రమే అసలు వరవ వీలవుతుందని, ప్రజాస్వామ్యంలో మాత్రమే ప్రజలు

దరికీ మానవతా స్వాతంత్ర్యం మానవతా హక్కులు కలిగి ప్రతి ఒక్కరికీ హుందాతనం, పవిత్రత తన కుటుంబాలతో సహా చేకూరుతాయని విశదీకరించాను. కష్ట జీవులలో ఏ ఒకటి రెండు వర్గాల చేతులలో ప్రజాస్వామ్యం బందీ అయ్యే ప్రమాదం కూడా వున్నట్లు సూచించాను. అందువల్ల మానవతా హక్కుల తీర్మానానికి అనుగుణంగా ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ స్వాతంత్ర్యం, సంతోషం అందుబాటులో వుండే విధంగా తదనుగుణంగా ఉండే ప్రజాస్వామిక విధానాన్ని గురించి అందరికీ తగిన శిక్షణ యివ్వవలసి వున్నదని తెలిపాను.

నాదృక్పథాన్ని నామనస్సులో మెదలుతున్న ఆలోచనలను బాపూసూటిగా చూడగలిగారు. బ్రిటిష్ అమెరికన్, ఫ్రెంచి ప్రజాస్వామ్యాల వైఫల్యాన్ని గురించి ఫాసిస్టుల పాలనలోనికి దిగజారిన ఇటలీ, జర్మన్, జపాన్ ప్రజాస్వామ్యాల పతనాన్ని గురించి బాపూజీకి పూర్తి అవగాహన వున్నది. అందువల్లనే ప్రజాస్వామ్యంలో కష్టజీవులందరికి తగుస్థానం కల్పింపబడి నియంతలకు పర భాగ్యోపజీవులకు చోటు ఉండరాదని ఉద్ఘాటించారు బాపూ. అందువల్లనే నేను జంకుతూనే మన ప్రజాస్వామ్య ప్రభుత్వం అటు ఫాసిస్టు, కమ్యూనిస్టు విధానాలకు దూరంగా ఇటు పెట్టుబడిదారీ సామ్యవాద ప్రజాస్వామ్యాలకు దూరంగా రైతుకూలీ, బుద్ధిజీవి, కళాకారుల ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని బాపూను ప్రకటన చేయమని ప్రార్థించాను. ఇదేభావాన్ని నాతోపాటు తంజావూరు కారాగారంలో సహవాసం చేసిన షుమారు మూడువందలమంది డిటెన్యూలు వెలిబుచ్చారని గూడా మనవి చేశాను. బాపూ ముఖకమలం ఆనందమైన మందహాసంతో వెలుగొందింది. నన్ను అంతులేని ప్రేమపూరిత దృక్కులతో తిలకించారు. ఆయనలో బాల్యం తిరిగి పొడచినట్లు తోచింది: "రంగా! నీవన్నది నిజమే! మనం అసందిగ్ధంగా మన భావాలను ప్రకటించవలసిందే! నీవేమీ భయపడనవసరంలేదు. ప్రస్తుత రాజకీయ పదజాలంలో కాంగ్రెసు పార్టీ ప్రజాస్వామ్య, కిసాన్, మజ్దూర్ ప్రజా రాజ్యం లక్ష్యంగా ముందుకు సాగవలసిందే! నేను అంగీకరిస్తున్నాను" అన్నారు. సంతోషాన్ని పట్టలేక, ఆశ్చర్యపోతూ, ఆయన సంతోషాన్ని పాలుపంచుకుంటూ "అవశ్యం అంతే బాపూ" అని నా హర్షాన్ని వెలిబుచ్చాను నా ప్రసంగాన్ని పొడిగిస్తూ "విషయమంతా 1942 బొంబై ఎ.ఐ.సి.సి. తీర్మానంలో పొందుపరచబడి వుంది బాపూ" అన్నాను. నిజమేనయ్యా! నా మాటలలో రామరాజ్యస్థాపన కాంగ్రెసు లక్ష్యమని నేనంటే అదే నీ పదజాలంతో "కిసాన్, మజ్దూర్ ప్రజా

రాజ్యస్థాపన" అనే అర్థమని ప్రకటిస్తున్నానయ్యా" అన్నారు బాపూ. తిరిగి వాత్సల్యంతో ఆయన దీవెన లందించారు.

నేను అనుకోకుండా, బాపూజీ నేను ఎంతో సంకోచంతో వెలిబుచ్చిన, ఎన్నో రోజులనుంచీ కలలుకన్న నా ఆశయాలన్నిటికీ హస్తామోద ముద్రవేసేసరికి నాకు సంతోషాతిరేకంతో తలమునకలైనది. రెండు దశాబ్దాల సంఘటనలన్నీ ఈ అద్భుతమైన విజయంతో సమానం కాలేకపోయినవి. 1930లో కాంగ్రెస్ వారెవరూ కూడా నేను కలలుకన్న 'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం' భారత స్వరాజ్యంతో అవతరిస్తుందని నమ్మలేదు. చివరికి నాతో పని చేసిన సోషలిస్టులు, కమ్యూనిస్టులకు గూడా అఖిలిండియా కిసాన్ కాంగ్రెస్‌లో రైతులనూ రైతుకూలీలను ఒక త్రాటి క్రిందికి తెచ్చి స్వరాజ్యానంతరం కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యాన్ని స్థాపించడానికి ఒప్పించడానికి నా మేధా శక్తినంతటినీ ఉపయోగించాల్సి వచ్చింది. 1938 కిసాన్ కాంగ్రెస్ గయ సమ్మేళంలో కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యానికి ఆమోద ముద్ర పడింది. విప్లవ వీరుడు సుభాస్ చంద్రబోస్ నా ఆశయానికి అనుకూలురైనప్పటికీ బయటపడటానికి సంకోచించారు. కమ్యూనిస్టులతో కలసి పయనిస్తున్న రైతుకూలీలూ, పట్టణ వాసులైన ఛాందస భావపూరితులైన కాంగ్రెస్ వాదులు గూడా ఒకపట్టాన యీ పరిస్థితులలో రైతులూ, దళితులైన రైతుకూలీలూ కలిసి నవసమాజస్థాపన చేయుట సాధ్యమని భావించ లేకపోయినారు. నా సహచరులతో కలసి దీనికొక వేద ప్రవచనమంత పవిత్రంగా ప్రచారం గావించాను. తద్వారా రాజకీయశక్తి, సామాజిక న్యాయం మన ప్రజాస్వామ్యంలో పూర్తిప్రతిష్ఠ కలిగి సర్వజనులూ సుఖంగా ఉండాలని భావించాను. ఇంతకాలం నేను నా ఆశయాలకు బాపూ ఆమోదముద్ర పొంది తద్వారా నైతిక బలం ప్రజల హృదయాలలో స్థానం పొందాలని ప్రయత్నించాను.

కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య నిర్మాణ ఆశయానికి అనుగుణంగా బాపూ ఆమోదముద్ర పొందగలిగితే కమ్యూనిస్టుల ఛాలెంజీని తట్టుకోగలుగుతామని తంజావూరు జైలులో జైలు సెమినార్లలో చర్చించాను. తద్వారా విద్యార్థుల, యువకుల మద్దతు పొందగలమని భావించాము. అందువల్ల 1944 నవంబరులో బాపూతో చర్చలకు వెళ్ళటానికి తంజావూరు జైలులో నా సహవాసులంతా నా విజయాన్ని గురించి ఆకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రజావళి న్యాయసమ్మతమైన కోర్కెలను సమర్థవంతముగా బాపూ ముందుంచగలిగితే నా ప్రయత్నంలో సాఫ

ల్యం సాధించగలనని భావించాను. కాని మా అందరి సమిష్టి ఆలోచనలూ, ఆశయాలూ, పరిణాళికలూ కమ్యూనిస్టులు బోధించే ప్రొలిటేరియట్ విధానానికి వ్యతిరేకంగా చర్చించడానికి నాకు తగిన సామర్థ్యం వున్నదా అని అనుమానించాను. 1944లో ఆ మరపురాని సంఘటన జరగక ముందు నా మస్తిష్కాన్ని-యిటువంటి ఆలోచనలు తొలుస్తూనే వున్నాయి. బాపూజీ ముఖంలో చిరునవ్వుతో కూడిన సుస్వాగతాన్ని పసికట్టగానే నా భయాందోళనలన్నీ సమసిపోయినవి.

అందువల్ల బాపూజీ ఎప్పుడైతే కిసాన్ మజ్దూర్ కళాకార్ గిరిజనులందరూ గూడా స్వాతంత్ర్య ఫలాలను సమానంగా అనుభవించాలనే ఆశయానికి అంగీకృతి తెలియ జేశారో, ఆ క్షణంలో మా కిసాన్ కాంగ్రెస్ వాదుల తపస్సు ఫలించినట్లు ఆనందపరవశత్వంలో మైమరచిపోయినాను.

ఆ సాయంత్రం ప్రార్థన తరువాత నా శయ్యమీద వాలి గత సంఘటనలన్నింటినీ నెమరు వేసుకుంటూ ఆ రోజు జరిగిన సంఘటన కలలోనా! నిజమేనా! అనే భ్రాంతిలో పడి పోయాను. బాపూజీ అంగీకారం సమగ్రమేనా! లేక ఒకకొత్త భాష్య కారుడు మరో వక్ర భాష్యం చెప్పి నా పథకాన్ని నీరు కారుస్తాడా! అనే ఆందోళన నాలో కలిగింది. మరునాడు నేను బాపూతో చర్చలకు సంసిద్ధంకాగానే ఆయన నీకిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం కాక మరేమైన కోరటానికి వచ్చావా అని అడిగారు. దాంతో నా భయాందోళనలు సమసి పోయాయి.

కార్యకర్తలకు పార్టీ ప్రణాళికలలోనూ, నిర్మాణాత్మక కార్యక్రమాలలోనూ శిక్షణ యివ్వవలసిన ఆవశ్యకతను గూర్చి రైతు సంస్థ యిట్టి శిక్షణకు కార్యక్రమాలను ఏ విధంగా విజయ వంతంగా నిర్వహిస్తున్నదీ విశదీకరించాను. అట్టి రాజకీయ శిక్షణాలయాలలో నిర్మాణాత్మక కార్యకర్తల అఖిల భారత సమాజాన్ని నిర్వహించవలసిన ఆవశ్యకతను బాపూజీ అంగీకరించారు. అహమ్మదాబాదులో ఈ విధంగా కార్మికులకు శిక్షణ యివ్వడం జరుగుతున్నదని ఆ సంఘ కార్యక్రమాలను అధ్యయనం చేయమని నన్ను కోరారు.

కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యానికి బాపూజీ ఆశీస్సులు లభించిన సదవకాశం వల్ల సర్దార్ పటేల్ అధ్యక్షులుగా, శ్రీ గుల్జారీలాల్ నందా కార్యదర్శిగా నిర్వహింప

బడుతున్న హిందూస్థాన్ మజ్దూర్ ప్రజారాజ్య ఆశయాన్ని తమ మొట్టమొదటి ఆదేశిక సూత్రంగా ముద్రించారు. సహజంగానే అఖిల భారత విద్యార్థి కాంగ్రెస్‌లు గూడా ఈ ఆశయాన్ని అంగీకరించారు.

1945లో గాంధీజీ సెక్రటేరియట్ ద్వారా ఈ చరిత్రాత్మక సమావేశాన్ని గురించి ప్రచురణ జరిగింది. మచిలీ పట్టణంలో ఆ రోజు జరిగిన ఆంధ్ర యువకుల, సమ్మేళనంలో దిక్కులు పిక్కటిల్లే విధంగా "కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యానికి, మహాత్మగాంధీకి జయజయ ధ్వానాలు చేశారు, ఆ సమయంలో అన్ని కారాగారాలలో నిర్బంధితులుగావున్న కాంగ్రెస్ కార్యకర్తలు, జాతీయ కార్యకర్తలు మహాత్మగాంధీ తీసుకున్న ఈ ప్రగతిశీలక సామ్యవాద, ప్రజాస్వామ్య నిర్ణయానికి తమ మద్దతునిచ్చి హర్షించారు. కష్టజీవుల ప్రజాస్వామ్య సామ్యవాదానికి ప్రజా బాహుళ్యం యొక్క, విద్యార్థుల, యువకుల యొక్క మద్దతు సంపాదించడంలో తమ కృషికి బాపూ ఆశీస్సులు లభించినట్లు యువజనులందరూ తెలుసుకున్నారు.

బాపూతో ఆ మరపు రాని మూడు సమావేశాల లోనూ, నా మీదా, నా జీవితాశయాల మీదా నాకు పూర్తి నమ్మకం కలిగింది.

రైతుల, కూలీల, యువకుల, విద్యార్థుల, గిరిజనుల కళాకారుల సంఘాల నేర్పాటు చేయడానికి సోదర కాంగ్రెస్ కార్య నిర్వాహకుల సౌజన్యంతో కృషి చేయడానికి నాకు తగిన ధైర్యాన్ని గాంధీజీ కలిగించారు. పదవీ వ్యామోహం కొరకే మోననే అపోహ తలఎత్తకుండా సహకరించారు. అనాటి నుండి నా ప్రార్థనలో, నా ఆలోచనలలో, నా సమస్యలలో గాంధీజీ నాకు తోడు నిలిచారు. ఈ విధంగా గాంధీజీ నాకు తోడు నిలిచారు. ఈ విధంగా గాంధీజీ కోట్లాది మంది వ్యక్తులను వ్యక్తిగత, సామాజిక, సేవారంగాలలో ఉత్తేజితులను గావించారు.

గాంధీజీలో గొప్పతనం ఏమంటే వారు తనతో సహకరించిన వారితో కలిసి ప్రార్థన ద్వారా, భజనలద్వారా భగవంతునితో సంబంధాన్నేర్పాటు చేసుకున్నారు. 1925నుండి బాపూ నిర్యాణంతో కలుషితమైన 1948 వరకూ ఆ ప్రార్థనలలో పాల్గొని నైతిక స్థైర్యాన్ని ఆధ్యాత్మికానందాన్ని నేను పొంద గలిగాను. అందు వల్ల ఆ 1944 నవంబరు సాయంసంధ్యలలో గాంధీజీతో కలసి ప్రార్థనలు జరిపి తాదాత్మ్యం చెందాను.

ఆ చలికాల సాయం వేళలో ఆయనతో కలసి సేవాగ్రాంలో ఆయన కుటీరానికి దక్షిణంగా విశాల మైదానంలో ఆయనతో ప్రార్థనలలో పాల్గొంటూ మా ప్రజాస్వామ్య కిసాన్, మజ్దూర్, కళాకార్, బుద్ధిజీవి రాజ్య ఆశయాన్ని మనసారా అంగీకరించడం ద్వారా బాపూజీ నా భుజస్కంధాల మీద మోసిన భారాన్ని అవగాహన చేసుకున్నాను. ఆయన సందేశాన్ని భూమి నాలుగు చెరగులా విస్తరింపజేసే పవిత్ర కార్యాచరణకు తగిన మనో బలాన్ని పొందగలిగాను. ఖాదీ గ్రామోద్యోగ విస్తరణలో ఆయన చేసిన ఉత్తేజ కరమైన ప్రచారం ద్వారా మన కళాకారుల ఎడ ఆయనకు గల అనిర్వచనీయమైన ఆపేక్షను అర్థం చేసుకున్నాను. ఇంతకుపూర్వం కంటే యిప్పుడు మరింత స్పష్టంగా చూడగలిగాను: ఈ స్వచ్ఛంధ స్వతంత్ర' సహకార దేశభక్తి పూరితమైన కొల్లగొట్టాలనే ఆపేక్షలేని, అతిప్రాచీనమైన వ్యవస్థగల రైతులమీద అయనకు గల వాత్సల్యాన్ని వారి స్వతంత్ర జీవనాన్ని తనమీద ఆధారపడిన వారి భారాన్ని భరించే లక్షణాన్ని ఆయన హర్షించారు. 1920 నుండి ఆయన సుసంఘటితం చేసిన కార్యకర్తలందరినీ ఈ యిరువర్గాల వారి ఉద్ధరణకే వినియోగించాలని తలచారు. గ్రామీణ వాతావరణాన్ని పెంపొందించి, పట్టణ వాతావరణానికీ, కాలుష్యానికి దూరంగా, పారిశ్రామిక కేంద్రీకరణకు భిన్నంగా దోపిడీని గర్హిస్తూ, ప్రతివ్యక్తీ తన సోదరునికి సహాయపడుతూ స్వతంత్రంగా, సంతోషంగా జీవితం గడుపుతూ, ప్రభుత్వానికి, ఏ యితర యంత్రాంగానికీ భయ పడకుండా మనుగడ సాగించే ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ పార్టీ దారితీయాలని బాపూజీ ఆశించారనడంలో సందేహం లేదని నిర్ణయించుకున్నాను.

కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం ఆశయాన్ని గురించీ శ్వేతేతరజాతుల, దళిత జాతుల విముక్తి గురించీ నేను చేసిన విశ్వవ్యాప్తంగా అధ్యయన నివేధికలను తన స్వంతం చేసుకొని ఆశీర్వదించిన బాపూ విశాల దృక్పధాన్ని నేను అర్థం చేసుకున్నాను. ప్రజా సౌభాగ్యానికీ, సంతోషానికి వుద్దేశించిన సమకాల ఉద్య మాలయడ బాపూ అభిమానాన్ని గ్రహించాను.

ఆయన పధకాలలో దోపిడీకీ, నియంతృత్వానికీ తావులేదు. సోవియట్ పద్ధతికీ, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికీ చోటులేదు. ఆయనది గాంధేయపద్ధతి, ఆ మరుపురాని రెండురోజులలో గాంధేయ పద్ధతిలో సాధించవలసిన ప్రగతిని గురించి అర్ధంచేసుకున్నాను.

ప్రార్థనజరిగిన అనంతరం షుమారు రాత్రి 9 గంటలకు గాంధీజీ రైతు సంఘాలను గురించి కొన్ని వివరణలు కోరుతూ ఆయన తిరిగి నన్ను ఆహ్వానించారు. ఒక అరగంట సంభాషణ జరిగిన తరువాత బాపూ చాలా అలసిపున్నట్లు గ్రహించాను. శరీరం మారాంచేస్తున్నా బలవంతాన నిగ్రహించుకొని వింటున్నట్లు గ్రహించాను. ఆయనను అంతబాధపెట్టి నా ప్రసంగాన్ని కొనసాగించడంలో నామూర్ఖత్వానికి సిగ్గుపడి ఆ రాత్రికి సెలవిప్పించవలసిందిగా కోరాను. ఆయన అపార వాత్సల్యంతో చిరునవ్వునవ్వుతూ నా ప్రసంగాన్ని కొనసాగించమని కోరారు. ఆయనను బాధపెట్టడం ఇష్టంలేక సెలవుతీసుకున్నాను. ఆ 1944 నవంబరు మాసం ఆ విధంగా నా జీవితంలో మరుపురానిది.

అంతకు ముందు అర్ధదశాబ్దిగా జైలు జీవితంలో నేను నిర్వచించిన సిద్ధాంతాలకు పుస్తక రూపంకల్పించేపనిలో 1945లో నిమగ్నమైవున్నాను. "World role of National Revotulion" అనే గ్రంథాన్ని కృష్ణాజిల్లా ఈడుపుగల్లు రైతుమిత్రులు ప్రచురించగా అదిచదివి బాపూ ఆనందించారు. అందులో కమ్యూనిస్టులకంటే మిన్నగా మేము స్వాతంత్ర్యం కోసం పోరాడిన వివరాలతో మా ప్రణాళికకు హేతుపూర్వక వివరణ నందజేశాను.

బొంబే హింద్ కితాబ్ ప్రచురణలు "Outlines of National Revolutionary path"ను ప్రచురించారు. ఈ రెండు పుస్తకాలలో నేను తంజావూరు జైలులో చేసిన ప్రసంగాలు సమగ్రంగా ప్రచురింపబడ్డవి. ఈ రచనలలో నేను కార్మిక నియంతృత్వానికి విలక్షణంగా రైతులు, కళాకారుల సామాజిక న్యాయానికి, రాజకీయ జీవితంలో వారిసమభాగాన్ని పంచడం గురించి ప్రతిదేశంలోనూ వారికి గల హక్కును గురించి వివరించాను.

హిందుకితాబ్స్ వారేనా "Colonial and Coloared peoples" ను ప్రచురించారు. దీనిని బాపూకే అంకితమిచ్చాను. అన్ని దేశాలలోనూ ముఖ్యంగా వలస దేశాలలో గ్రామీణులకు రైతులకు, కళాకారులకు సమసామాజిక స్థాయినందజేసే ఆర్థిక ప్రగతి నందజేయవసిన ఆవశ్యకతను గురించి వివరించాను. అభివృద్ధి చెందిన దేశాలు పొందవలసిన భాగాన్ని గురించి ప్రత్యేక విశదీకరణ ఉన్నది. జగమంతా ఒకటే, సంపన్నతనూ, దారిద్ర్యాన్నీ పంచుకోవడానికి అన్ని దేశాల ప్రజలూ భాగస్వాములేనని సిద్ధాంతీకరించాను. బాపూ ఈ సిద్ధాంతాన్ని అంగీక

రించారు. వలస దేశాలన్నిటికీ స్వాతంత్ర్యాన్నిచ్చి వారికి ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంఘాలు సాంకేతిక, ఆర్థిక, రాజకీయ సహాయాన్నందజేయవలసిన ఆవశ్యకతను నేను ఈ రచనలో నొక్కి వక్కాణించడాన్ని బాపూ విశేషంగా శ్లాఘించారు.

అదే ప్రచురణ సంస్థ నా "Why Four Crore Artisns Haail Gandhian Plan" ను ప్రచురించారు. ఇప్పటికే మన సమాజంలో నాలుగుకోట్ల చేతివృత్తి పనివారు కళాకారులు స్వయం ఉపాధి కల్పన ద్వారా స్వాతంత్ర్యాన్ని అనుభ విస్తున్న వివరణ నిచ్చాను. ఈ సిద్ధాంతం గాంధేయ పథంలో కుటీర పరిశ్రమల ద్వారా దేశాన్ని వికేంద్రీకృత ప్రజాస్వామ్య, సహకార సోషలిజం వైపుకు దారి తీస్తుంది. అందువల్ల బాపూ ఈ చిన్న పొత్తాన్ని ఎంతగానో అభిమానించారు. ఇది "గాంధియన్ ప్లాన్" రచయిత శ్రీ శ్రీమన్నారాయణ్ అగర్వాల్ సంపాదకత్వంలో వెలువడింది.

ప్రజా బాహుళ్యంతో నాకున్నగల సాన్నిహిత్యం ఆధారంగా మేధా వరంగా నేను చేస్తున్న సేవయెడ ఆయనకుగల అభిమానానికి తార్కాణమా అన్నట్లు 1930 లో నేను వ్రాసిన " The Tribes of Nilgiries "మీద హిందీలో తన అభి ప్రాయాన్ని ప్రకటిస్తూ ఎంతో కాలంగా దళితులైన గిరిజనుల సంక్షేమం తనకెంత హృదయానికి దగ్గరగా ఉన్నదో వివరించారు గాంధీజీ.

భారత్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షురాలుగా శ్రీమతి భారతీదేవి కాంగ్రెస్‌వారి క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా కమ్యూనిస్టుల ప్రజాయుద్ధ ఆందోళనకు వ్యతిరేకంగా చేసిన కృషి శ్రీమతి కుర్షీద్ బెహన్‌ను ఆకట్టుకున్నది. అందువల్ల ఆమె నేను బాపూజీతో సంభాషణలకు రూప కల్పన చేయడంలో, సంభాషణల సారాంశాన్ని ప్రకటనకు అనుకూలంగా రూపొందించడంలో విశేషంగా తోడ్పడ్డారు.

గాంధీజీ సచివాలయంలో యితరులు ఈ విధగా తోడ్పడలేదు. బాపూజీతో నా సంభాషణా సారాంశాన్ని ప్రచురించడానికి వారు సుముఖత చూపలేదు. అందు వల్లనే కొంతమంది సంకుచిత మనస్కులైన కాంగ్రెసు వాదులు భావించినట్లు కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యస్థాపన ఆశయాన్ని బాపూజీ సమ్మతించటం వీరికి రుచించలేదు. ముఖ్యంగా ఆంధ్ర, బీహార్ రాష్ట్రాల వారికి దీనివల్ల కాంగ్రెస్, కిసాన్ సమ్మేళన్‌ల మధ్య బాంధవ్యం పెరగడం తద్వారా క్విట్ ఇండియా ఉద్యమ

కాలంనాటికే బలపడిన వామపక్షీయులకు బలం పెరుగుతుందేమోనని సందేహం కలిగింది. అదృష్టవశాత్తూ గాంధీజీయే స్వయంగా అడ్డుపడి నాతో సంభాషణలను పూర్తిగా ప్రచురించమని ఆదేశించారు. జాతీయ వాదులైన పత్రికలు యావత్తు ఈ ప్రెస్ రిపోర్టుకు పూర్తి ప్రచారాన్నిచ్చి ప్రచురించాయి. ముఖ్యంగా కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యానికి బాపూజీ అంగీకృతి గురించి మరింత ప్రముఖంగా ప్రస్తుతించాయి.

తరువాత 6 నుండి 12 నెలలు వరకు భారతదేశానికి కాబినెట్ మిషనువారు వచ్చి అహమ్మద్‌నగర్ జైలునుండి కాంగ్రెస్ నాయకులను విడుదలచేసేవరకు అన్ని రాష్ట్రాల నుండి నాకు ఆహ్వానాలు అందుతూనే వున్నాయి. యువ విద్యార్థి నాయకులనుండి వృద్ధ కాంగ్రెస్ వాదుల వరకు ఎందరో నాకు అభినందన సందేశాలు పంపించారు. నా ఆదర్శ కిసాన్‌మజ్దూర్ ప్రజారాజ్యానికి బాపూజీ మద్దతు లభించడం వారినెంతగానో ఉత్తేజపరచి తద్వారా కమ్యూనిస్టులతో పోరాటానికి శక్తినిచ్చింది. నేను రచించిన " World role of Natoinal Revotulion" " Outlines of Nations Revolution anry path " అనేరచనలలో కమ్యూనిస్టు ప్రచారానికి సరియైన జవాబు నందించాను. సర్దార్‌పటేల్‌కు ఆ రోజులలో కుడిభుజంగా చెప్పుకోదగ్గ యువనాయకుడు శ్రీ యస్. కె. పాటిల్ బొంబాయిలో సిటిజన్‌షిప్ కాలేజీని ఏర్పాటుచేసి నన్ను ఆహ్వానిస్తే అప్పుడే కారాగారాలనుండి విడుదలైన వేలాది కాంగ్రెస్ కార్యకర్తలు గుమిగూడి విన్నారు. కిసాన్ కళాకార్ మజ్దూర్, బుద్ధిజీవి ప్రజాస్వామ్యాన్ని గురించి వారి ఆహ్వానం మీద పలుచోట్ల ఉపన్యశించాను.

తరువాత ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రిగా కేంద్రమంత్రివర్గంలో దేశీయాంగ శాఖామంత్రిగా ఎదిగిన అప్పటి క్విట్‌ఇండియా ఉద్యమ ప్రముఖనేత శ్రీ యస్.డి. తివారీ ఆ కళాశాలలో శిక్షణపొంది హిందీలో ఒక కరపత్రాన్ని నా ఉపన్యాసాల ఆధారంగా ప్రచురించగా అది బహుజనాదరణ పొందింది. ఆ తరువాత జనతా మంత్రివర్గంలో కాబినెట్ మంత్రిగా పనిచేసిన శ్రీ రవీంద్రవర్మ గూడా ఆ రాజకీయ కళాశాలలో శిక్షణ పొందినవారే. కమ్యూనిస్టు ప్రాబల్యంగల విద్యార్థి ఫెడరేషన్ పోటీగా అఖిల భారత విద్యార్థి కాంగ్రెస్ వారిని కిసాన్‌మజ్దూర్ ప్రజాస్వామ్య ఆశయానికితీర్చిదిద్దిన ఘనత శ్రీ వి. యల్. సుందరరావు, శ్రీ నవ్రేకర్‌ల తోడ్పాటుతో శ్రీ రవీంద్రవర్మకే దక్కింది.

యుద్ధానంతర రాజకీయ భాష్యంలో కిసాన్‌మజ్దూర్ ప్రజాస్వామ్యాన్ని నిజమైన కాంగ్రెస్ వాదుల ఆశయంగా మీరట్ కాంగ్రెస్ సమావేశంలో శ్రీ జె. బి. కృపలానీ ప్రస్తుతించారు.

మా సామ్యవాద గాంధేయసిద్ధాంతాలను ప్రాచుర్యంలోనికి తీసుకురావటానికి మేము పలుచోట్ల సిటిజన్‌షిప్ కళాశాలలు, రైతుసంస్థలు నిర్వహించాము. సర్దార్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూగారలు కాంగ్రెస్ పాలిసీల పునర్వ్యవస్థీకరణ చేసిన కాలంలో నన్ను కాంగ్రెస్ కార్యవర్గంలోనికి తీసుకోవడం సర్వత్రా హర్షించ బడింది. తరువాత నేనులండన్‌లో అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తిదారుల ఫెడరేషన్ ఏర్పాటుచేయడానికి వెళ్ళినపుడు 1946 లో నన్ను ఆంధ్రకాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో అత్యున్నత స్థాయి సమావేశాలకు నన్ను ఆహ్వానించడాన్ని గాంధీజీ హర్షించారు. కాంగ్రెస్ మంత్రివర్గాలకు ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలను, ఆశయాలను తీర్చిదిద్దడానికి ఈ సమావేశాలలో నేను పాల్గొనడం దోహదం చేస్తుందని బాపూ అభిప్రాయపడ్డారు.

# స్వయంశక్తి స్వయం సహాయాలతో

## దేశాభి వృద్ధికి సమైక్యంగా కృషి సాగాలి

ఇటీవల కారుమంచిలో భారత సేవక సమాజ్ ఆధ్వర్యమున జరిగిన యువజన విద్యార్థి శిక్షణ శిబిరము యొక్క స్నాతకోపన్యాసమునందు శ్రీమతి భారతీదేవి రంగాగారు 1957లో చేసిన ప్రసంగమును వ్యాసరూపంలో ప్రచురిస్తున్నాం.

—ఎడిటరు

ప్రజాస్వామ్య రాజ్యాంగము జయం పొందాలంటే, బాధ్యతాయుత రాజ్యాంగ సంస్థల ద్వారా ప్రజలకు తగిన రక్షణ, పెంపు కలగాలంటే, పౌరులైన వారందరు తమ్ముతాము నడుపుకోగల, సేవించుకోగల్గిన, అభివృద్ధి పరచుకోగల శక్తి కలిగి వుండాలి.

ఎంతకాలం వరకు ప్రజలు ప్రభుత్వం మీదనే ఆధారపడు చుంటారో, తమ నిత్య జీవనాధారం కొఱకై, సాంఘిక జీవిత సౌకర్యముల కొఱకై, సాధారణ స్వాతంత్ర్యముల ననుభవించుట కొఱకై, అంతవరకు వారికి నిజమైన, నిండైన స్వాతంత్ర్యము అందదు. అందిన స్వాతంత్ర్యము నిలువజాలదు. వారి జీవితం అధికారుల కను సంజ్ఞలపై ఆధారపడి వుండును. అనుభవంలో వుండాలన్నా స్వరాజ్యం స్థిరపడాలన్నా స్వతంత్ర్య స్వయం సేవకశక్తి, స్వయం రక్షణశక్తి అనుదినం ప్రజలు పెంచుకోవాలి.

ఈ ధర్మాన్ని రాజకీయ సత్యాన్ని మహాత్ములు ఎన్నడో గ్రహించిరి. మన మధ్య ప్రచారం చేస్తూ వుండిరి ఆనాటినుండి.

కనుకనే యిట్టి శక్తిని మన ప్రజలు, మనజాతి పోగొట్టుకొనుట వల్లనే మన స్వరాజ్యం పోయిందనిరి; పరెవ్వరూ మనల త్రొక్కి వేయడం వల్ల మాత్రం కాదన్నారు. తిరిగి అట్టి శక్తిని సంపాదించుకోవడం ద్వారా స్వరాజ్యాన్ని సాధించుకో గలమన్నారు. అదే ప్రధానంగా వారు మన దేశీయులకు చేస్తూవున్న బోధలోని స్వారస్యం సార సంగ్రహం.

అందులకే నిర్మాణ కార్యక్రమాన్ని సూచించిరి. ఖద్దరు, గ్రామీణ పరిశ్రమలు, గ్రామోద్ధరణ కార్యక్రమం, అస్పృశ్యతా నివారణ, వివిధ సంఘముల

మధ్య సామరస్యము, స్వయం సహాయక పరిశ్రమలు పెంపొందించు కోవాలని బోధించిరి. క్రమంగా మన ప్రజల దృష్టిని, వినాశక ధోరణులనుండి సృష్టికారక దారులలోనికి తెచ్చినారు.

వారి బోధలను హృద్గతం చేసుకొన్నాము. ఆచరణలో పెట్టుకోవాలనుకొన్నాము. అనుభవంలోనికి తేవాలనుకొన్నాము మేమందరము. ఎందరమో వారి దారిలో వ్రతానుష్టానము చేయపూనుకొన్నాము కనుకనే ఖద్దరు ధరించుచున్నాము రాట్నాన్ని త్రిప్పుచున్నాము ఖద్దరుదారాన్ని తీయుటకు కుతూహలులమైనాం. అట్లు స్వకీయ వృత్తులంపు చేతులతో, నిండు మనస్సులతో, హృదయ బలంతో కృషి చేయుటకు పూనుకొన్నాం. అట్లు వృత్తి విద్యల నేర్చు కోవడం, స్వావలంబనం పెంచుకోవడం, స్వయం కృషి చేయడం, గ్రామీణ జీవితం, వృత్తులతో ఐక్యం కావడం ధర్మమను కొన్నాం, గౌరవమని తలచినాం! ముందడుగు వేశాం క్రిందటి పాతిక సంవత్సరాలనుండి, యిట్టి స్వయం సేవాకార్యక్రమం ద్వారా, తదితరులకు దారి చూపెట్టుకొనుచున్నాం. గ్రామోద్ధరణ కార్యక్రమం, మా మీ జీవితాల ద్వారా రచించుకొంటున్నాం. ఈ విధంగా ఏ ప్రభుత్వం పై ఆధారపడవలసిన అవసరం లేకుండా చేస్తూ చేసుకొంటూ జీవిస్తున్నాం. ఇదే నిర్మాణ కార్య క్రమమని మహాత్ముని అడుగు జాడలలో నడుస్తూ గ్రహించినాం. ఈ విధానం ద్వారా ప్రజలందరికి స్వయం సహాయక శక్తి కల్గించగలమని విశ్వసిస్తున్నాము. ఆదర్శప్రాయంగా జీవించమన్నారు మహాత్ములు. అదే మా జీవితాలకు గీటురాయి అను కొన్నాము. స్వరాజ్యం వచ్చిన పిమ్మట కూడా నిండైన సాంఘిక స్వరాజ్యం, స్వాతంత్ర్యం అందరికి అందాలంటే, యిట్టి ఆదర్శ ప్రాయముగా వుండే స్వయం సహాయకశక్తి పెంపొందించే నిర్మాణాత్మక కార్యక్రమం కార్యకర్తలు విరివిగా పెరగాలని విశ్వశిస్తున్నాము. యిట్టిశక్తిని పొందినవారు, పొందుచున్న వారు దినదినానికి అత్యధికంగా పెరుగుతూ వుండాలి. కనుకనే వారిని తర్ఫీదు చేసుకోవాలి. అందులకు, తరగతులు పాఠశాలలు అవసరం.బాపూజీ బ్రతికి వుండగానేవారేస్వయంగా ఎన్నో విద్యాలయాలు నడిపిరి. మేము బాపూజీ ఆశీర్వచన బలంద్వారా రైతాంగ విద్యాలయాలు, యువజన, విద్యార్థి, పౌర శిక్షణాలయాల ద్వారా వేలకొలది యువజనుల తయారు చేస్తూ వున్నాము.

ఆ మా ప్రయత్నాలను జాతీయంగా విస్తరించి నడుప వలసియున్నది. కను కనే ప్రభుత్వం ద్వారా రక్షణ దళాల తోడ్పాటుతో N.C.C, A.C.C. జాతీయ డిసిప్లిన్డ్ స్కౌట్ దళాలను తయారు చేసుకొంటున్నాము. ప్రజల స్వయం సహాయక యత్నం ద్వారా ఈ భారత సేవక సమాజ శిక్షణ శిబిరాలను ప్రారంభిస్తు న్నాము. స్వరాజ్యం లేని ఆ రోజులలో స్వరాజ్య సంపాదనా ప్రయత్నం ద్వారా అనేకులం అటు రాజకీయ చైతన్యం, ఇటు నిర్మాణాత్మక శక్తిని పొంద గల్గుటకు అవకాశం పొందగల్గేవారం. ఈ స్వరాజ్య భారతంలో వివిధ రాజకీయ పార్టీల ద్వారా ఆయా పార్టీల రాజకీయ చైతన్యం వేర్వేరు పౌరులు పొందవచ్చు. కాని అందరు పౌరులకు సమానంగా, ఆత్మీయంగా అంగీకృతంగా వుండే రాజ్యాంగ హక్కు బాధ్యతలను సంబంధించిన సాంఘిక ధర్మ సూత్రముల గ్రహించుట, అనుష్ఠించుటకు తగిన చదువు అవసరం. ఆ బోధ నొసంగుటకు సంస్థ కావాలి. అట్లు రాజకీయ పార్టీలకు మించి అన్ని పార్టీలకు మించి అన్ని పార్టీలకు చెందిన వారైన పౌరులైనట్టి ప్రజల సేవింపాలనే కుతూహలులైన వారందరికి నిర్మాణా త్మక కార్యక్రమం కావాలి. అందులకు వుమ్మడి సంస్థ కావలయును ఈ రెండు ధర్మాల నిర్వర్తించుతూ స్వయం సేవాశక్తి పెంపొందించే ప్రయత్నం చేయగల సంస్థగా నిరూపించు కొంటున్నాం. ఈ బి.యస్. యస్.ను ఆ దినాల్లో 'పౌర సత్వ విద్యాలయాలను' నడిపింపాం. ఈ రోజుల్లో ఈ భారత సేవక సమాజం నిర్మించుకొన్నాం. రెంటి ద్వారా జన బాహుళ్యము యొక్క సేవా సౌభాగ్యముల సాధించుటకే మన ప్రయత్నం.

ఈ సమాజమునకు కొంత జన్మకధ కలదు. ఇలాంటి సేవా ధర్మముల నడుపుటకు మున్ముందుగా క్రైస్తవుల, యువజనుల సమాజములు రామ క్రిష్ణ మిషను వారు దారి చూపిరి. రాజకీయ ధోరణిలో బయలు దేరిన గోఖ్లే గారి "భారత సేవకుల సమాజము" లజపతిరాయగారి "ప్రజా సేవక సమాజము"కూడా ప్రధమ యద్ధానంతరము నుండి కృషి చేయుచున్నవి. మహాత్ముని శిష్యులైన వారెందరో ఆంధ్రలో వున్నవ లక్ష్మీనారాయణ, స్వామి సీతారాం, పొణకా కన కమ్మ, ప్రభృతులు 1923 నుండి నిర్మాణాత్మక ప్రణాళికను అమలు జరుపుటకై కొంతగా వివిధ నిర్మాణ కార్యక్రమాలు, బోధనా తరగతులను నడుపుచు అనేక గ్రామాలు స్వరాజ్యావతరణ పిమ్మట, ఎలాగ మన గ్రామీణ ప్రజలు తమ్ము తాము సేవించుకోవలెనో పునరుద్ధరణ చేసుకోగలరో: సూచించునట్లు నూతన సేవామార్గము

లను, వేయ బూనుకొనుచుండిరి. మా దంపతులము రైతు, కూలీ, చేనేత, చేతి వృత్తులవారి, వుద్యమాలను 1928 నుండి స్థాపించుతూ నడుపుతూ వున్నాము. ఈ వుద్యమాలను సాగించుటకు నిర్మాణ ధోరణి, శక్తి యుక్తిగల యువజనుల అవసరం గ్రహించుకొని, వారిని తర్ఫీదు చేయుటకై, ప్రప్రథమంగా నిడుబ్రోలులో రైతాంగ విద్యాలయం. రామానీడు ధర్మాల సహాయంతో నడుపుచూ క్రమంగా దేశపు నలుమూలలలో రైతాంగ, పౌరసత్వ, యువజనుల విద్యాలయాలను నడుపుచున్నాము. తోడుతా అలా తర్ఫీదు బొందుచున్న పట్టభద్రులకు అనుభవం మహాత్ముని కార్యక్రమమందు కల్గునట్లుగా, గ్రామ పంచాయితీల నిర్మించి, గ్రామోద్ధరణ కార్యక్రమాలను సాధించ బూనుకొంటిమి. రైతులకు, వ్యవసాయకూలీలకు, చేనేతవారికి, వివిధ చేతి వృత్తుల వారికి, వెనుక బడ్డ జాతులవారికి, గ్రామీణస్త్రీలకు వారివారి వృత్తి సంఘములనిర్మించ బూనుకొంటిమి. అంతటితో తృప్తి చెందిన చాలదని గ్రహించితిమి. గ్రామాలలో రోడ్లు, వంతెనలు, చెరువులు, బావులు, గ్రంథాలయాలు, విద్యాలయాలు, విశ్రాంతి భవనాలు, ఆయుర్వేద ఆరోగ్యపు ప్రాంతఃకాల సౌకర్యాలు కలిగించాలను కొంటిమి. అందులకై ఇంజనీయర్ల సహాయం స్థానిక సంస్థలు, అధికారుల సహాయా ప్రభుత్వపు ధన సహాయం అవసరమని గ్రహించితిమి. ఆధోరణిలో శాసనబలంతో, ప్రభుత్వంయొక్క సహకారాన్ని కోరుచూ, పొందుచుంటిమి. ఈ ధోరణిలో కీర్తిశేషులైన ఆ నరసింహ దేవర సత్యన్నారాయణ, సజీవులైయున్న పంగులూరి నరసింహారావు మాకు తోడ్పడిరి. ఈ గ్రామోద్ధరణ కార్యక్రమం, ప్రభుత్వ తోడ్పాటుతో నడపుట అవసరమని అప్పుడే గ్రహించు కొంటిమి. కొంతగా సహాయం గ్రామపంచాయితీ వుద్యమ ప్రాబల్యం ద్వారా పొందుతూ వుంటిమి. గ్రామస్థుల ఆర్థిక పరిస్థితులు బాగుచేసుకోవాలంటే, సహకార సంఘముల స్థాపించుకోవాలని కాంగ్రెసు వారు నలభై సంవత్సరాల క్రితమే గ్రహించిరి. ఆ మార్గాన కూడా ప్రజాసేవకై కీర్తి శేషులు వేమవరపు రామదాసు పంతులు ముందడుగు వేస్తూవుండిరి. అట్లే మేమంతా గ్రామగ్రామాలలో ఈనాటివరకు సహకారోద్యమాన్ని బలపరుస్తున్నాము. ఇన్ని ఉద్యమాలను స్వరాజ్యానంతరం నడపుటకు ఐక్యమైన సర్వపక్షీయుల సమాన సహకారం పొందగల్గిన సంస్థ అవసరం గదా! ఈ విషయమునే మహాత్ముని సమ్ముఖాన రంగాగారు ఆ 1944 లో చర్చించిరి. అప్పుడే నిర్మాణ కార్యక్రమం ప్రాణంగల జాతీయ సేవకులంతా భారత లోక్ సేవక సంఘముగా చేర్పట

మంచిదని మహాత్ముని సలహాను దేశానికి అందించగలిగిరి. తుదకు 1952 లో ప్లానింగ్ మంత్రి నందా, ఆచార్యరంగా, క్రిప్లానీ గారలు అశోక మెహతా ప్రభృతులు మన జాతీయ ప్రధాన నాయకులు జవహరులాలుగారి అధ్యక్షత క్రింద భారత సేవక సమాజమును స్థాపించినారు.

ఈ సమాజ సేవాధర్మచ్ఛాయలను పెంచుటకై ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, రాష్ట్రాలకు, శిక్షణ శిబిరాల నేర్పరిచి నడపుటకు ఆంధ్రదేశపు వాలంటీరు దళాల నిర్మాణాధిపతి, లోక్ సేవకులు, మన హనుమంతరావుగారు ప్రధాన సేవకులుగా నిర్ణయింపబడుట ముదావహము. ఇచ్చట మరి అన్ని శిక్షణ కేంద్రములలో చేరు చున్న, యువజనులకు నేర్పదలచుకొన్న ప్రధాన విషయములు, వ్యవహారములేవి?

గ్రామీణ ప్రజలు తమతమ పేర ధర్మముల స్వయం సహాయక శక్తిని చేయూతగాగొని ఎట్లు నిర్వర్తించుకోవలెనో తెల్పుటకు, తప్పురాము ఈ కేంద్రము లందు తయారు చేసుకోవాలి. కనుక మహాత్ముని ధోరణిలో గ్రామీణ, ఆరోగ్య, సాంఘిక, సాధారణ అవసరాలను తీర్చుటకై శ్రమదానం, ధనదానం, భూదానం, అని "దానత్రయ" మంత్రమును జపించుట నేర్చుకోవాలి. అంటే స్వయంగా కృషి చేసి అందిన నాలుగు దమ్మిడీలను భద్రంగావాడుచు, దొరికిన దేవాలయాలు గ్రామ కంఠాలు, తదితర బంజరులు, తలాకాలు, బావులను ప్రజలందరి సహాయం కొరకు తిరిగి వుపయోగపడునట్లు చేయవలసి యున్నది.

పంచాయితీ బోర్డులు, సహకార సంఘాలు, గ్రంథాలయాలు, దేవాలయాలు, తదితరస్థానికంగా వుండే సంస్థలు, తమ ధర్మములను తమ ఫండ్స్‌ను అత్యంత శ్రద్ధతో వాడుకొనునట్లు తత్ఫలితంగా ప్రజోపయోగం అధనంగా కల్గునట్లు చేయుటలో వారితో వినయ విధేయతలతో, హృదయ పూర్వకంగా సహకరించు తత్పరతతో, కృషిచేయవలెను. వారిశక్తులు ఇనుమడించునట్లుగా, వారుతలంచుకొను నిర్మాణ కార్యములకు అవసరమైన ప్లానులను, ఎస్టిమేట్లను, వేయించడం స్థానికాధికారులు వారితో కలసి పనిచేయుచుండు జిల్లాప్లానింగ్ కమిటీలు, తగినంత ధనసహాయం, తదితరబలం, అందించునట్లు ప్రయత్నించాలి. ఇటుల ప్రజలతో, వారి స్థానిక నాయకులతో, అటు ప్రభుత్వ పెత్తన దార్లతో సహకారం నెరపుచు అంచపకు ఆ ప్తులైన ప్రజాసేవ సేయగలశక్తి, ఆలోచనలను, ఈ విద్యాలయాల్లో మనము ప్రాథమిక, తర్ఫీయతు ఇవ్వవలసియున్నది. వివిధ

వృత్తులవారు అభివృద్ధి దాయకమైన జాతీయ ఆదాయమును, వృత్తిఆదాయాభివృద్ధి ద్వారా పెంచగల్గు పరికరాలను. వుత్పత్తి మార్గాలను అవలంబించునట్లు సహాయ పడుట మన బి.ఎస్.ఎస్. ప్రధాన కర్తవ్యయములలో నొకటి. అటులే ఇప్పటివరకు అందుచున్న దేవాలయాలు, తటాకాలు, గ్రంధాలయాలు, అలాంటి ధర్మ సంస్థలను ధర్మతోపులు, గొప్పవృక్షాలను, ఇప్పటినుండైన అందరి పౌరులకు అందుబాటు లోకి తేవడం, వాటినందరు ఆదరణతో హెచ్చుగా సాంఘికోపయోగము కొరకు వాడుకొనునట్లు చేయుట ఈ సమాజ సేవకుల ధర్మం.

గ్రామీణప్రజల వుమ్మడి ఆదాయం హెచ్చు చేయుటకు ప్రయత్నించుట అత్యవసరం అట్టి ఆదాయములకు ఆధారమైన చెరువులు, తోటలు, గ్రామకంఠా లను రక్షించుకోవాలి. అట్టి నైతిక శక్తులు పెరుగుటకు, విజయవంతమగుటకుగాను క్రిందటి శతాబ్దరీతులవలె మరెవ్వరినో నిందించుట, ద్వేషించుట, క్రిందకు దిగ జారచేయుట వుత్తమ మార్గముకాదని మహాత్మాజీ బోధించియున్నారు. మరెలాగ ఈ ధర్మసాధ్యం! మనలను మనము వుద్ధరించుకొనుటకు స్వయంగా సేవించుకొనుటకు పూనుకోనుట అభివృద్ధి దాయకమగు మార్గము ధర్మసమ్మతము, ప్రపంచమునకు శాంతి ప్రదమని మహాత్ముని బోధ!! ఇందుల కనుగుణమైన సేవా మార్గము సంఘ నిర్మాణధోరణి అభివృద్ధిదాయకమగు ఆందోళన, నిర్మాణయుక్తమగు కార్య క్రమము, ఈ భారత సేవకసమాజము ద్వారా నిరూపించాలని మన జాతీయ నాయకులు పూనుకొనుచున్నారు. వారిని బలపరచుటెట్లో ఈ మార్గాన నడచు టెట్లో, మన మీ విద్యాలయాల ద్వారా విచారించుదాము.

సమతాధర్మము మనదేశానికి ప్రజలకు ఆచరణ యోగ్యమని ఈనాటి మన జాతీయ ప్రభుత్వం, నాయకులు, అంగీకరించియున్నారు. ఈ ధర్మప్రకారం రైతు లకు, కూలీలకు రక్షణ కల్గించుట గ్రామీణ కూలీలకు నిండువుద్యోగము, పండు జీవితం, తృప్తికల్గించు జీవితాధారమగు సాంఘిక, ఆర్థిక, సౌకర్యములు కల్గించుట ఎట్లో ఆలోచించాలి. ఆ మార్గాలను అవలంబించాలి కదా! గ్రామీణ ప్రజలకు బస్తీవారి కందుచున్న, అందగల సర్వ సౌకర్యములు దాదాపు సమానంగా అందు నట్లు చేసుకోవాలి. ఒక బృందపు ప్రజలు మరొక బృందం వారిని శోషింపచేయ కుండా ఒకరు మరొకరి సహకారమును పొందుచూ అందరూ అభివృద్ధి పొందగల్గు విధానములను సుహృదయంతో ఆలోచించి తయారు చేసుకోవాలి. అప్పుడేదేశం

ప్రజలమధ్య అన్యాయాలు, అన్యాక్రాంతాలు, జరుగకుండా పరస్పర సహకార సంపద వర్ధిల్లగలుగుతుంది. అట్టిది ఎటులసాధ్యమో ఈ విద్యాలయాల్లో మనము ఆలోచించుకుందాం.

## పరస్పరం సహకరించుకోవాలి

గ్రామీణ ప్రజలు ప్రపంచమం దంతటా పట్టణ ప్రజలకంటే పురాణ కాలాల్లో ఇంతగా ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడి వుండేవారు కారేమో ? రాజకీయంగా మాత్రం ఎల్లకాలాల్లో అన్నిదేశాల్లో వెనుకబడి యుండేవారు. రాజులు, చక్రవర్తులు, గ్రామీణులనుండి పొందుచుండిన ధన, ధాన్యముల పైననే వారి అతులిత భాగ్యభోగ్యములను అనుభవిస్తూ వుండేవారు. అయినా కొంతవరకైనా ఆనాటి పంచాయితీ కామన్‌వెల్తులు (పంచాయితీ) బస్తీలవాటిప్రభువులనుండి రక్షణ గల్గించ గలుగుచుండేవి. ఈ శతాబ్దిములో ప్రపంచమంతటా గ్రామీణ ప్రజలు అన్ని విధాల వెనుకబడి పోయినారు. రాజకీయాధికారం వారికందడం దుస్తరమగుచున్నది. అల్లే ఆర్థిక దైన్యత వారి లక్షణమైనది. సాంఘిక దౌర్బల్యము గ్రామాలలో కాపురము చేస్తున్నది. ఈ దౌర్భాగ్యం నుండి మన దేశపు గ్రామీణుల తప్పించుటకు మహాత్ములు ఎంతో శ్రమచేస్తూ యుండిరి. వారిబోధల మార్గాననే ఆచార్య రంగా రైతాంగ విద్యాలయం ప్రచురణల ద్వారా సర్వ ప్రజల మధ్య, బృందాల మధ్య, దేశదేశాలమధ్య, ఒకే దేశమందలి వివిధ ప్రాంతాలమధ్య ధర్మమార్గాన హెచ్చుతగ్గులు తగ్గించాలంటూ అనుభవానికి వీలైనంతవరకు సమత్వం సాధించాలంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ ధర్మాచరణం అవసరమని రెండవ ప్రపంచ యుద్ధానంతరము ప్రపంచ వైజ్ఞానికులు, రాజకీయనాయకులు, యునైటెడ్ నేషన్స్ పెత్తనదారులు అంగీకరించినారు. ఆచరణలో ఈ ధర్మాన్ని సాధించుటకు తగినంత నైతిక శక్తులు పెరుగుట లేదు.

ఇంతకుపూర్వం వివిధ ప్రజాసేవ కార్యములకై వేర్వేరు సేవాసంఘములు స్థాపించబడుతూయున్నవి. వేర్వేరు సంస్థలు నిర్మించుకొంటూ యున్నాము. వాటిని నిర్వహించు వారు ప్రత్యేకంగా ప్రభుత్వ సహకారమును, సహాయమును, కోరుచుందురు కొంత పొందుచున్నారు. ఆ ప్రయత్నా లన్నిటికంటే హెచ్చు జయప్రదంగా సమగ్రమగు రీతిని సార్వజనీనమగు వివిధ కార్యక్రమాలు, సంస్థలు, ఐక్య సంఘటనా శక్తి పొంది ఏకనాయకత్వ సహాయంతో ప్రభుత్వంతో సంప్ర

దింపులు చేస్తూ ప్రజాసహకారమును సమీకరించుకోవాలనే తాపత్రయంతో ఈ భారత సేవక సమాజము స్థాపించబడినది, నడుపబడు చున్నది.

ఐనా, ఈ సమాజ నిర్వాహకులు, అన్ని ప్రయత్నాలు కేంద్రీకరింప బడాలనే పిచ్చిలో బడరాదు: తదితర సేవకులకు సాయంచేయడమే తమ ప్రధాన ధర్మమని గ్రహించాలి. వివిధ సంస్థలు, వుద్యమాలు, సంఘసేవా ప్రయత్నాలు ఎంతవిరివిగా వుంటే అంత మంచిదనుకోవాలి. వారందరికి సహాయం చేయడం, వారి సలహా, సహాయం, తాను పొందడమే తనప్రధాన లక్ష్యంగా గ్రహించాలి.

## ప్రజలు ప్రభుత్వమూ కలిసికట్టుగా కృషి సాగించాలి.

స్వరాజ్యం వచ్చేవరకు, వివిధ సాంఘిక రంగాలలో దేశాభివృద్ధి కొఱకై, ప్రజాసేవకై. ఎందరెందరో సంఘసేవా తత్పరులు, దేశభక్తులు, మహాత్ముని శిష్యులు రైతు, కూలీ, గ్రామీణ ఉద్యమాభిమానులు, తమ సర్వశక్తులు ధారపోస్తూ ప్రజా సంస్థలను నిర్మించి నడపుచుండిరి. అట్టి ప్రయత్నాలు జాతీయ పునర్నిర్మాణమున కెంతో అవసరమైనవి. వాటి నిర్వహణకై ధనమార్జించడం ఎంతో కష్టమగుచుండెను. స్వరాజ్యం వచ్చిన పిమ్మట ఆయా కార్యాలన్నింటిని, మిగతా జాతీయావసర కార్యకలాపములను నిర్వహించుటకై ఇటు ప్రజలు, అటు ప్రభుత్వం హృదయపూర్వకంగా పరస్పరంగా సహకరించుకుంటూ కృషిచేయుట అవసరం గదా! ప్రజలిచ్చు చందాల మీదనే ఆధారపడి, వివిధ సంస్థల నడపుట బహుకష్టం. అందువలననే అట్టి సేవా కార్యములు పరిమితములగును. ప్రభుత్వం అన్ని సాంఘిక సంక్షేమ కార్యములను, సంస్థలను నడుపజాలదు. అందులకు ధనము తక్కువ, సేవకులు కరువే! కనుక రెండువైపుల నుండి, ప్రజాసేవకులు, ప్రభుత్వమూ సహకరించుకుంటూవుంటే, హెచ్చు సేవా కార్యములను నడుపుకోవచ్చును.

కనుకనే ప్రజలు ప్రభుత్వం యొక్క సహకారం ద్వారా జాతీయ, ఆర్థిక, సాంఘిక అభివృద్ధి సత్వరంగా బలవత్తరంగా సాధించుకోవాలంటే, సోవియట్ వారు ప్రచారములోనికి తెచ్చిన మార్గం : జాతీయ ప్లానింగ్ - ఆచరణయోగ్యమని మన కాంగ్రెసు, జాతీయ నాయకులు 1948 — 50లో గ్రహించిరి. అప్పటివరకు కాంగ్రెసు రైతాంగ ఉద్యమాలు వారు నడుపుచున్న ప్లానింగ్ ధోరణులు, మహాత్మునిచే స్థాపించబడిన, ఖాదీప్రతిష్ఠానము, గ్రామ పరిశ్రమల సంఘంవారి నిర్మాణ కార్యక్రమాల ననుసరించి పనిచేయుటకై జాతీయ ప్లానింగ్ కమీషన్లు 1951లో

స్థాపించుకొన్నాము. అప్పటినుండి ఆ కమీషనుద్వారా ప్రథమ పంచవర్ష ప్రణాళికను రచించుకొని, సాధించుకొన్నాము. దేశీయులు, జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాలకు అలవాటు పడుచున్నారు. ఆ 1920 నుండి 1950 వరకు ఎందరెందరమో వేర్వేరుగా నడుపు కొంటున్న ప్రణాళికలు, ఊహించుకొంటున్న కలలు కార్యరూపం దొందుటకు ఈనాడు ప్రారంభమగుచున్న ద్వితీయ పంచవర్ష ప్రణాళిక, సావకాశం కల్గించునట్లున్నది. ఇందులకు మన దేశస్థులంతా, ఈనాటి వరకు సాంఘిక సేవ యందు పండుచున్న జాతీయ సేవకులను, వారితో సహకరిస్తున్న ప్రజలను అభినందించాలి. వారందరు ఏర్పరచిన సేవాశ్రమాలు, సంఘ పునర్నిర్మాణ ధోరణులు, ఈనాటి భారత సేవా సంఘమునకు అందుచున్న, అత్యంత విలువైన వారసత్వం, జాతీయ సౌభాగ్యము.

ఈ దినాల్లో ప్రజలపై శిస్తుబాధలు హెచ్చుచున్నవి. పది, ఐదవందల సంవత్సరాల క్రితం ఎలాగా నిత్య జీవితావసరాలన్నిటిపై భారమైన శిస్తులు వేయ బడేవో అట్లే ఈనాడు శిస్తులు క్రొత్త క్రొత్త వస్తువులు, వాటి వాడుకలపై పడబోవు చున్నవి. ఐతే అప్పటికి ఇప్పటికి గొప్ప భేదమున్నది. ఆనాడా శిస్తుల వసూళ్ళంతా రాజభోగాలపై పోయేవి. ఇప్పుడో, ప్రజోపయోగమగు కార్యముల కొఱకని చెప్పుకో గల్గుచున్నాము.

## దుబారా తగ్గించుకోవాలి

ఐనా, ఈనాడు కూడా కొన్ని దౌర్భాగ్యములు లేక పోలేదు. ప్రజా సౌకర్య ముల కొఱకే ఈ శిస్తుల రూపేణా సంపాదించబడే ధనాన్ని వుపయోగిస్తామను కొంటున్నా, అనుభవంలో, రూపాయిఖర్చుతో, ప్రజలందరికి దక్కుచున్న ఉపయోగం, అర్ధరూపాయి విలువైన వుంటుందా అనే సందేహం కలుగుచున్నది. కంట్రాక్టర్లు, మామూళ్ళు, లంచాలు, వృథా ఖర్చులు, నష్టాల క్రింద ఎంతో పోతు న్నది. ఇందువల్ల ప్రజలకా నష్టం? సంఘానికా లాభంలేదు? ప్రభుత్వం నీరసించి పోతుంది. ఉద్యోగులు, అప్రతిష్టపాలు కావడం, అవినీతికి లోబడడం జరుగును. ఈ నష్టాలనుండి మనదేశాన్ని ప్రజలను రక్షించుకోవాలి. అందుల కొక నివారణో పాయం ఈ భారత సేవక సమాజపు సేవా విధానం. దీనిద్వారా, కంట్రాక్టర్లు, లంచాలు, వుద్యోగుల వైపరీత్యపు ధోరణులనుండి విముక్తిపొందవచ్చు. ప్రభుత్వం నుండి ఇవ్వబడే ప్రతి రూపాయికి, అధనం అర్ధరూపాయి విలువగల సేవా కార్య

క్రమాన్ని నడుపుటకు, సాధించుటకు ప్రయత్నం చేయవచ్చును. పైగా బి. యస్. యస్. నియమాల ప్రకారం మనం నిజంగా పనిచేస్తే ప్రభుత్వపు ప్రతి రూపాయికి అదనంగా ప్రజల శ్రమదానం, ధన దానం, భూదానముల ద్వారా, అధమం మరొక అర్ధరూపాయి, వీలుంటే, మరో అదనపు రూపాయి ఖరీదయిన సాంఘికోపయోగ మగు కార్యక్రమాన్ని సాధించుకోవచ్చు. ఈ విధంగా ప్రజాసేవాకార్యములను, ప్రజలు చెల్లించి, ప్రభుత్వం ద్వారా ఖర్చుపెట్టుకొనే ధనాన్ని, సద్వినియోగం చేయడమేకాక, మరింతగా పెంచుకొంటూ, ఎవ్వరికీ నష్టంగాని పద్ధతిని అందరికీ వుపయోగపడ్యే మార్గాన వాడుకోవడం సాధ్యమగును. ఇదే సావలంబన ధర్మానికి దగ్గరైన సాంఘిక సేవా ధర్మ పంథా. ఈ దారిన నడచుటకే సమాజం వుపయోగ పడవచ్చును. ఈ విధంగా ప్రజాసేవ చేస్తేనే, దేశం సత్వరంగా అభివృద్ధి చెందగలదు. నియంతృత్వబలం గూడా ఈ విధానానికి చేర్చి, రష్యా, చైనా వారు జాతీయ అభివృద్ధిని సాధిస్తున్నారు. ప్రజాస్వామిక మందుకూడా, ఈ సేవావిధానం ద్వారా జాతీయ రక్షణ, అభివృద్ధి సాధించగలమని నమ్ముచున్న, మాబోంట్ల రైతాంగం, కూలీ, కళాకారుల వుద్యమాల సేవకుల మందరం, ఉత్సా హులమై ఈ సమాజంతో హృదయపూర్వకంగా సహకరిస్తున్నాం. క్రమంగా ఈ సేవా కార్యసాధనద్వారా, ప్రజాసేవకుల సంఖ్యను పెంచుకోగల్గుతాం. వారికి తర్ఫీదు, అనుభవం, ప్రసాదించుకొందాం. క్రమేపి, వారినుండే అందరికి అంగీ కృతులైన సారథులు మన గ్రామీణ పంచాయితీలు, సహపొందుకో గలం. భారత సేవక సమాజంవారు నిర్వహించుచున్న యువజన, విద్యార్థి శిక్షణ శిబిరంలు జయ ప్రదంగా నిర్వహించ గలిగితే మనం అన్ని రంగాలలో జయం పొందగలం.

నిర్మాణ కార్యక్రమం ద్వారా, పరస్పరం సహాయ సహకారములతో గ్రామ ప్రాతిపదికగా దేశాభివృద్ధికి సమైక్యంగా కృషిచేయుటకు యావత్తు ప్రజలను ముందుకు తీసుకొని రావాలి. అప్పుడే మనం జయం పొందుతాం. భావితరాలు సుఖ, శాంతి, అభ్యుదయాలతో మనగలుగుతాయి.

●

# రైతులపై శీతకన్ను వేయడం
# జాతి మనుగడకే ప్రమాదం

—శ్రీమతి భారతీదేవి రంగా
ఎం. ఎల్. సి

ఆహార సమస్యపై లెజిస్లేటివ్‌కౌన్సిల్‌లో ది, 14-8-59న శ్రీమతి భారతీదేవిరంగా గారు చేసిన ఉపన్యాసంలోని కొన్ని భాగాలను వ్యాసరూపంలో ప్రచురిస్తున్నాము.

ఆహార సమస్య ఒక ప్రాంతానికి సంబంధించినది కాదు. ఒక జాతికి సంబంధించినదిగాదు. దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి క్లిష్ట సమస్య. ఇది డబ్బు ఉన్న వాళ్ళకు డబ్బులేని బీదవారికి గూడ చాల తికమకకలిగిస్తున్నది, రామదాసు చెరలో ఉన్నపుడు "తక్కువేమి మనకు- రాముడు ఒక్కడుండగా" అనిఅన్నట్లుగా మేము కూడా రైతు దృక్పథం కలిగినవాడు, రైతు తత్వాన్ని స్పష్టంగా అర్థం చేసుకోగలిగినవాడు, హృదయ తత్పరుడు, విజ్ఞాని అయిన మన తిమ్మారెడ్డిగారు రైతు సమస్యలను తీర్చి దిద్ద గలుగుతాడు అని గంపెడంత ఆశతో ఎదురు చూస్తున్నాం.

ఆయన మంత్రి అయిన దగ్గరనుంచి ఆయన ధోరణి చూస్తుంటే రైతులకు అండ, దిక్కు ఉన్నదనిపించారు. కాని ఫలితం మాత్రం శూన్యం. 10 మందితో కలసి వుంటే గెలుచుకొనేవారే తిమ్మారెడ్డిగారు. కాని ఒంటిగాడై పోయారు. మనమే బీద ప్రజానీకం మీద "అయ్యో పాపం" అని జాలి తలుస్తాం. రైతులు ఇంకా తలుస్తున్నారు. మనమంతా బస్తీల వాళ్ళం. కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. ఎవరెవరి రాజకీయధోరణి ననుసరించి వారు "అయ్యోపాపం!" అన్నప్పటికీ పల్లెటూళ్ళలో రైతులు ఏ సిద్ధాంతాలు తెలియకుండా, ఏ విధానాలు తెలియకుండా ఏ రాజకీయ ధోరణి తెలియకుండా అయ్యో పాపం అనుకోబట్టె ఈ సంఘానికి నానా అవస్థలు పడి సంపాదిస్తున్నారు. పాము అనుకోడు, చీకటి అనుకోడు, వాన అనుకోడు: బురద అనుకోడు - ఈ విధంగా కష్టపడుతున్న రైతులను ఇంకా బాగా ఉత్సాహం గలిగి పండించండయ్యా అంటే ఎక్కడ నుండి తీసుకొచ్చి పండిస్తారు. ఏమైన 4 దమ్మిడీలువుంటే అవి సంవత్సరంపొడుగునా ఖర్చు అయి పోతాయి. వ్యవసాయ

తరుణం వచ్చే టప్పటికి డబ్బు ఉండదు. ఎరువులు కొందామంటె మితిమించిన ధరలు అయిపోయినాయి. పలుగులు కొందామా అంటె అంత కంటేధర. అసలు మార్కెటులో కనబడనే కనబడవు. ఎక్కడనో సొసైటీలలో ఇవ్వాంగదా అంటారు అధికారులు, మంత్రులు. ఏ సొసైటీలో ఏమో అతనికి దిక్కే తెలియదు. ఏ విధమైన సదుపాయాలు రైతుకు జరగడంలేదు. ఎరువులు అంతకంటె మటుమాయం అయిపోతాయి. ఎక్కడా దొరకవు. బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కోవాలి. కొనుక్కొంటె ప్రక్క రైతుతోపాటు నాకు గూడా పండుతుంది గదా అని ఉబలాటపడి తాను దివాలా ఎత్తయినా సరే అప్పు ఇచ్చేవాడుంటేచాలు రెట్టుకి రెట్టుపెట్టి ఎరువులుకొని వేస్తాడు. దివాళా ఎత్తిపోతే పోయాడు-ఉత్సాహంగా పండిస్తూఉంటే బీదలకు బాగా పంచి పెడుతూ ఉండవచ్చు ననుకుంటున్నారు. బీదలకు వారే పంచి పెట్టాలా? రైతులరక్తమేపిండాలా ప్రభుత్వం కొంత సహాయపడిఉదారత్వం చూపెట్టి పేదలను ఆదుకోవాలి. రైతులకు సహాయంచేయాలి. రైతులకు అన్నిపరికరాలు ఇచ్చి సౌకర్యాలు కలిగించకుండా "యితర దేశాలలో యింత ధాన్యం పండించారు, ఇంత సరుకు ఉత్పత్తి అవుతున్నది. స్త్రీలు, పిల్లలు, ముసలి వాళ్ళు కూడా కష్టపడి చేస్తున్నారు. ఈ దేశములో మాత్రం ఎందుకు చేయరు ? ముసలివాళ్ళు ఊరికే కూర్చుని పోకిళ్ళు పోవడము, వయస్సులో ఉన్నవాళ్ళకు పురాణ కాలక్షేపాలు, చిన్నవాళ్ళు ఆడుకోవడం, తిని బాగా గంతులు వేయడం చేస్తూ రైతులు ఒక్కళ్ళే తిని కూర్చుని పేదవాళ్ళను కష్టపడమంటున్నారని" ఆక్షేపణలు చేస్తే ఏమి బాగుంటుంది? రైతులకు ఏ విధమైన సదుపాయాలు లేవు. 'ఇండస్ట్రీస్‌లో పని చేసేవారి మాదిరిగా పొలంలో పనిచేయుటకు నీడకావాలి. పందిళ్ళు వేయండి వర్షానికి మైనపు పట్టలు పరచండి. నీడను కూర్చొని కోత కోస్తాం. నాట్లు వేస్తాం. ఎండ తగలకూడదు. మేము బురద త్రొక్కం' అని రైతులు ఎదురుతిరుగుతున్నారా ? వాళ్ళు ఏమి చేయమంటున్నారు ? రూపాయి విలువ తగ్గిపోయి రైతుకు కావలసిన వస్తువుల ధరలు ఎన్నో రెట్లు పెరిగిపోయి రైతులలో 4 దమ్మిడీలు కనబడక తికమక పడుతున్నా, బ్యాంకులు అప్పు ఇచ్చినా - ఇవ్వకపోయినా ఎన్ని బాధలో పడి, ఏదో విధంగా పెట్టుబడి యింటిలో నీళ్ళు త్రాగినా పైకి డాబుసరిగా 'తిన్నాను, త్రాగాను' అనే వేషంతో ఎప్పుడు ధాన్యం అమ్ముకుందామా ! ఎప్పుడు మరల భూమికి ఖర్చు పెడదామా అని - తహతహ పడుతూ ఉంటే ఈ ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వం పెద్దయోచనలు, పెద్ద ప్లానులు ఏమేమో చెపుతున్నారు. ఏమిప్లాన్ అది? రైతులను క్రుంగదీసే ప్లానా? రైతులను మట్టిచేసే ప్లానా? రైతులు

మట్టిపోతే రైతులు నాశనం అయిపోతే బీదవారి ఉద్యోగ సమస్య ఎలాతీరుతుంది? గ్రామాలలో రైతులుక్షేమంగావుండి, పటుత్వంకలిగి, గుండెధైర్యంకలిగి, ఉత్సాహం కలిగి, కష్టపడటం "నా ధర్మం" అని అనుకోబట్టె సేద్యంచేసి పల్లెటూళ్ళలో వున్న బీదల నిరుద్యోగం తగ్గిస్తున్నాడు. బస్తీలలో నీడనుహూర్చొని ఉద్యోగాలతో బ్రతికే సోదరులకు భోజనం పెడుతున్నాడు. అటువంటప్పుడు కొంచెం ధరలు ఎక్కువపెట్టి కొనుక్కుందామనే ఉత్సాహం బస్తీవారికి వుండాలి. తెలిసినవాళ్ళు పేద ప్రజానీకానికి చెప్పాలి. ఎక్కువ ధర పెట్టి ధాన్యం కొంటె నష్టంలేదు. రైతుకు గిట్టుబాటు ధరకావాలి. "గిట్టుబాటు అయినపుడె గదా మనకు తగిన కూలి ఇవ్వ గలుగుతాడు. లేకపోతే మనం తగినంతకూలి ఎలాకోరగలం ? ఏ విధంగా సంపాదించుకో గలం ?" అని పేద ప్రజానీకానికి చెప్పాలి. రైతుకు గిట్టుబాటు ధరరాబట్టాలి. రాబట్టిననాడె పేద ప్రజానీకానికి హెచ్చుకూలి ఇవ్వండి అని ఖచ్చితంగా పోరాడి సాధించవచ్చు. అంతేగాని ఒకరిమీద ఒకరికి వైషమ్యం కలిగించి ఒకరి బాధలు ఒకరికి అర్థంగాని అయోమయస్థితిలో ప్రజానీకాన్ని పెట్టి రైతాంగాన్ని మసిచేద్దామనే ఆలోచన మాత్రం పనికిరాదు. అది దేశానికే క్షేమంగాదు. మనసోదరులు చెప్పినట్లు పల్లెటూళ్ళల్లో ఉన్న రైతాంగం "మాకు ఎందుకు ఈ కర్మ ? పల్లెటూళ్ళల్లో ఉండి కొండ ప్రాంతములో జంతువులతో పోరాడి కావలి కాచి, ధాన్యం తీసుకెళ్ళి కారు చౌకగా బస్తీలలో అమ్మి నేను, నా పెళ్ళాం, బిడ్డలు అన్నమో రామచంద్రా ! అని ఏడుస్తున్నాము: బలహీన పడిపోతున్నాము. నేను కూడా బస్తీకిపోయి, చిన్న పరిశ్రమలో పనివాడుగా చేరి 'కాసిన్ని బియ్యం' కొనుక్కుని తింటాను" అని రైతు భీష్మించితే ఆనాడు ఎట్టి దుస్థితికి మనమంతా తహతహ లాడి పోవలసి వస్తుంది ? ఆ స్థితిని మాత్రం తీసుకురావద్దని మనవి చేస్తున్నాను. ఆంధ్రమండలి ప్రత్యేకంగా ఏర్పడాలని కోరుతున్నారు. అది చాలా అన్యాయం. ఈ విధంగా ఆహార సమస్య తీరదు. మార్కెటులో హెచ్చుధాన్యం దొరుకుతున్నప్పుడు ఆహార ధాన్యాలు తరుగు అని అనుకోవడం చాలా పొరపాటు. ప్రభుత్వంవారు దీనిని మిగులు రాష్ట్రంగా గుర్తించి, మార్కెటులో ధాన్యాన్ని కొని చౌక డిపోలు పెట్టి గ్రామాలలోను, బస్తీలలోను పేద ప్రజానీకానికి తప్పని సరిగా సహాయం చేయాలని కోరుచున్నాను. అంతేగాని ఎప్పుడో జనవరి నెలలో రైతు ఉక్కిరి బిక్కిరి అయిపోతూ, ధాన్యం వచ్చేరావడంతోనే ముందుగతి ఏమిటో ఆలోచించుకోకుండా అమ్ముతుంటే ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టి కొని ఎందుకు నిలవచేయకూడదు? అంటున్నారు. ఎందుకు నిలవ చేయాలి ? రైతు

ఎందుకు అమ్ముకోవాలి ? వచ్చే సంవత్సరం పండునో - ఎండునో తెలియదు. నీరు రావడంలోటె నాటుమొక్క వేయగానే ఆ మొక్క ఫలితానికొచ్చి పండుతుందని గ్యారంటీ ఎవరు యిస్తున్నారు ? పంటలు పోతేనె రెమిషన్ అని చెప్పి మహా సముద్రంలో బొట్టులాగా ఏమో ఇస్తున్నాం అని అంటారు.

దీనితో రైతుయొక్క సమస్య తీరిపోతుందా ? రైతుమీద ఉన్న బాధ్యత పోయిందా ? పోలేదు. కనుకనే రైతుడబ్బు కొరకే ధాన్యాన్ని నిలవచేసుకోవడం లేదు. ఆదాయం చేసుకోవడంలేదు. ఈ పంటను వచ్చే సంవత్సరం వరకు చూచు కుంటేనేగాని అతని మనస్సునకు తృప్తి వుండదు. నేను తిని మిగతా జనానికి అందించగలను అనే ఒర్పుతోటి ఆలోచనతోటి, రైతు నిలవ ఉంచుతున్నాడుగాని కోటికి పడుగలెత్తటానికిగాదు. దేశంలో ఎన్నో వ్యవసాయ ఫారములున్నాయి. వాటిద్వారా నయినా లెక్కలు తేల్చి ఏ స్టేటుకు ఆ స్టేటు ఇంత ధర గిట్టుబాటు అవుతుందని తేల్చకుండా ప్రభుత్వంవారు వారి యిష్టం వచ్చినట్లుగా నిరంకుశంగా ధర నిర్ణయించికారుచౌకగా ధాన్యాన్ని అమ్మాలనడమే ఆహార వుత్పత్తి క్షీణతకు కారణం అని మనవి చేస్తున్నాను.

ఇతర దేశాలలో ఏ విధంగా రైతు నిలబడటానికి, మిక్కటంగా పండించ టానికి ప్రోత్సహించాలో అదేరీతిగా మన దేశంలో కూడ అట్టి అవకాశాలు కలి గించి రైతాంగాన్ని రక్షించి, పేద ప్రజానీకాన్ని ఆదుకునేందుకు బస్తీలలో చౌక డిపోలుపెట్టి ఆ నష్టాన్ని ప్రభుత్వం భరించి సహాయపడాలని మనవి చేస్తున్నాను.

రైతులకయ్యే ఖర్చులను దృష్టిలో పెట్టుకొని బస్తా ధాన్యానికి ఎంత ధర గిట్టుతుందని ప్రభుత్వం ఈనాటికి తేల్చలేని స్థితిలో యున్నది. రైతులు పండించు ఆహారధాన్యాలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించవలసి యున్నది. మనము బీదలకు కూలి హెచ్చు కావాలి అంటున్నాము. బీదలకు ఎంత కూలి వుండాలి అనేది నిర్ణయించటం అవసరం. రైతుల వద్ద చౌకగా ధాన్యం తీసుకొచ్చి ప్రజలకు చౌకడిపోలు పెట్టి ఆహారధాన్యాన్ని ఇవ్వాలి. ఎంతో వుదారంతో మన యొక్క ఆలోచనలను వెల్లడించడంతోపాటు రైతుల యొక్క కష్టాల్ని కూడా మనం చూడాలి. ఈనాడు గ్రామాములలో ఎంతమంది భూస్వాములు వున్నారు? వందఎకరాల వారు ఎంతమంది వున్నారు ? వెయ్యి ఎకరాలవారు ఎంత

పంది వున్నారు ? ఇప్పుడు వున్నది ఎవరు ? భూస్వాములను ఎప్పుడో తొలగించాము. భూస్వాములు పోయారు. ఐదు, పది ఇరువది ఎకరాలు భూవసతి గల్గిన రైతులను భూస్వాములని మనము ఎలా చెప్పగలము ? కష్టపడి, శరీరం కాయలు కాచేటట్లు, ఆవస్థపడే రైతుకు తాను పండిచిన ధాన్యానికి గిట్టుబాటైన ధర గిట్టుతుందా లేదా ? అని ఆలోచించాల్సిన బాధ్యత అన్ని పక్షాల వారిమీద యున్నది. రైతు శ్రమపడితేనేగదా పంటపండేది ! కష్టపడే శ్రామికుడు కొంచెము చౌకగా ఆహారధాన్యము కొనుక్కొని సౌఖ్యంగా భోజనం చేసేదానికి వసతి కావాలి. వారికి సౌకర్యాలు కల్గించాలని మనము కోరుతున్నాము. అదిన్యాయము. కాబట్టి ప్రభుత్వం వారు సబ్సిడీలు ఇచ్చి రైతుకు నష్టం లేకుండా, పేదవారికి చౌకగా ధాన్యము దొరుకు నట్లుగా చౌక డిపోలుపెట్టి, పేద ప్రజానీకమును అవసరమైన సమయములలో ఆదుకోమని మనము పదేపదే కోరుతున్నాము. దానిని గురించి ఎంతో ప్రచారము చేస్తున్నాము. కాని మనం చెప్పుకుంటున్న రీతిగా చౌక డిపోలు ఏర్పాటు చేయలేక పోయాము. ధాన్యం కళ్ళంలోనుండి యింటికి రావటంతోటే ప్రభుత్వం రైతుకు రిబేటు యిచ్చి ధాన్యం తీసుకొంటే బాగుంటుంది. ఇదివరకు ప్రకాశం పంతులుగారి గవర్నమెంటులో అప్పుడు బస్తాకు రూపాయి, రెండు రూపాయలు అదనంగా యిస్తామనే టప్పటికి, రైతు లెంతో వుత్సాహముతో ధాన్యాన్ని విడుదల చేసియున్నారు. ఇది మనకు అనుభవంలో యున్న విషయము కనుక, రైతులకు గిట్టుబాటయిన ధర నిర్ణయించి ఆ పైన కొంత సబ్సిడీకూడా యిస్తే బీదలైన రైతులు తమయొక్క కష్టానికి ఫలితము దక్కిందని సంతోషిస్తారు. కాబట్టి రైతులకు సబ్సిడీలు యిచ్చి, ధాన్యం కొని, చౌక డిపోల ద్వారా పేద ప్రజానీకాన్ని ఆదుకోవాలని కోరుతున్నాను.

మన గ్రామాలలో చిన్న చిన్న పరిశ్రమల ద్వారా ప్రజలు నాలుగు దమ్మిడీలు సంపాదించుకొనేవారికి వీలైన పరిశ్రమలు యెన్నో వున్నవి. వారి విషయమై ప్రభుత్వము శ్రద్ధ తీసుకోవాలి. చాపలు, ఇంట్లో వుపయోగించే పరికరాలు అక్కడి ప్రజలు చేతులతోనే శ్రమపడి చేస్తూ వుంటారు. వారు ఆ వస్తువులు తీసుకువచ్చి చౌకబారుగా ప్రజలకు అమ్ముకొని, ఆ పూటకు పొట్టకు ఏదో యింత క్షుద్బాధ తీర్చుకొనుటకు ప్రయత్నం చేయవచ్చును. అలా కష్టపడి పనిచేసేటటువంటి బీద పారిశ్రామికులు కక్కుర్తి కొరకు తాము తయారుచేసిన వస్తువులను చౌకబారుగా అమ్ముకోకుండా, వారి వస్తువులను ప్రభుత్వము కొని, వారిని ఆదరించి

వారికి కూడా కొంత సబ్సిడీ యిచ్చి, తద్వారా గ్రామ పరిశ్రమలకు సంబంధించిన వస్తువులు తయారు చేయటానికి వారికి పుత్సాహము కలిగించాలని నేను కోరుచున్నాను.

రాజకీయ బాధితుల విషయం వచ్చినది. వారిని మనము అదరించవలసిందే. త్యాగం చేసినవారి యెడల మనం అభిమానం చూపెట్టుకోవాల్సినదే. వారి బిడ్డలకు చదువు మొదలయిన విషయంలో శ్రద్ధ చేస్తామంటున్నారు. రాజకీయంగా ఎన్నో కష్టాలకు పాల్పడినటువంటి అనేకమంది స్త్రీలు, పురుషలు ఉన్నారు. అటువంటి వారు ఉండటానికి ఇళ్ళులేక అవస్థల పాలైనారు. వారిని బంధువులుగాని, ఇతరులు గాని ఆదరించిన వారు లేరు. 1921 సం నుండి 1942 వరకు అవస్థలపాలై, స్వరాజ్యోద్యమంలో పాల్గొన్న స్త్రీ-పురుషల యొక్క బిడ్డలకు చదువు విషయంలో శ్రద్ధ చూపిస్తున్నారు. అస్తులు లేని రాజకీయ బాధితులకు, ప్రభుత్వంవారు భూములివ్వనటువంటి రాజకీయ బాధితులకు ఇళ్ళ సౌకర్యాలు కలిగించవలసినదిగా మనవి చేస్తున్నాను.

విద్య విషయంలో మనం ఖర్చుపెట్ట బోయేది లక్షరూపాయలు. ఇది చాలా చిన్న మొత్తంగా నేను భావిస్తున్నాను. మనం రాష్ట్రం మొత్తంమీద పదిలక్షల రూపాయలైనా ఖర్చుపెడితే, ఇవాళ వున్నటువంటి అవసరం కొంతవరకు తీరుతుందని నేను విశ్వసిస్తున్నారు.

మా సోదరి రామసుబ్బమ్మగారు వ్యవసాయ కళాశాలలు జిల్లాకు ఒకటి అయినా పెట్టుటకు ఏర్పాటు చేయాలని కోరారు. ఈనాడు బిడ్డలను కాలేజీలలో చేర్పించాలంటే సీట్సు దొరుకుట లేదని తల్లిదండ్రులు అల్లాడి పోతున్నారు. ఆ సీట్స్ కొరకు చెప్పటానికి వీల్లేనంతగా రికమండేషన్సు ఉంటుంన్నవి. ఇప్పటికి 15 వందలమంది ఎగ్రికల్చరల్ కాలేజీలో సీట్సుకొరకు తహతహలాడుతున్నారు. మనం దేశంలో అధికంగా ఆహారము పండించాలంటున్నాము. మనము రాష్ట్రం మొత్తంమీద యెన్నో కళాశాలలు, యెప్పుడో యేర్పాటు చేసుకొనవలసినది. ఇట్టి సౌకర్యాలు కలుగ జేసుకోకుండా అధికంగా ఆహారము రైతులుపండించాలనుకోరటం సరైనదిగాదు. ఎగ్రికల్చరల్ కాలేజీలు యేర్పాటుచేసుకోకుండా, వ్యవసాయనికి సంబంధించిన విద్యాబోధన ప్రజానీకానికి జరుగుతుందని మనం విశ్వసిస్తే, ప్రజలు మన మాటల మీద విశ్వాసం కోల్పోతారు. ఈ అవసరాన్ని గుర్తించి వెంటనే ప్రభుత్వంవారు మరికొన్ని వ్యవసాయ కళాశాలలు తప్పనిసరిగా ఏర్పాటుచేసి, యీ అవసరాన్ని తీరుస్తారనే విశ్వసిస్తున్నాను.

# కృష్ణా జిల్లా మహిళా మహాసభలో

# అధ్యక్షోపన్యాసము

శ్రీమతి భారతీదేవి రంగాగారు, ప్రపంచ దేశాలన్నింట పర్యటించారు. యూరప్‌లో దీర్ఘకాలం రంగాజీతో గడిపారు. విద్యాభ్యాసం చేశారు. రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాల అధ్యయనం చేశారు. సాంఘిక, సాంస్కృతిక విషయాలపై, పరిశోధన చేశారు. కందుకూరి, రాజారామమోహన్‌రాయ్, ఈశ్వరచంద్రవిద్యాసాగర్‌లవంటి సంస్కర్తల రచనలు ఆసక్తితో చదివారు. ప్రాచీన, ఆధునికసాంఘిక ఆచార వ్యవహారాలపట్ల అవగాహన వున్నది. అందువలన వారి మహిళా సంఘఅధ్యక్షోపన్యాసంలో, కేవలం సంప్రదాయ రీతుల ఈసడించక. అందలి మంచిని ఆహ్వానిస్తూ, ఆధునిక పద్ధతుల, ఆచారాల ఆలంబనను కొనియాడారు. ప్రబోధాత్మకమైన యీరచనను పాఠకుల కందజేయుటకు సంతసించుచున్నాను.

– సంపాదకుడు

నన్ను ఈనడు ఈ బాధ్యత నెరవేర్చమని కోరిన మీ ఆహ్వాన సంఘము వారికి నా చెల్లెమ్మలు శ్రీమతులు గొట్టిపాటి మహాలక్ష్మమ్మ, సరస్వతమ్మ మొదలయిన వారికి నా కృతజ్ఞతాభివందనములు.

ఘ ం ట సా ల

ఈ ఘంటసాల నాకు, శ్రీ రంగాగారికి ఎంతో ప్రాణ ప్రదము. ఇచ్చటి అక్క చెల్లెండ్రు మా దంపతులపై చూపెట్టు ప్రేమాదరములు అనన్యము చల్లపల్లిలో మా రైతాంగ విద్యాలయము క్రిందటి సంవత్సరము అంతటి జయప్రదంగా నడచిందంటే ఘంటసాల రైతాంగ యువతులు, నాయకులు ఆ చల్లపల్లి రాజాగారు కారకులు. స్కూలు విద్యార్థులను, మమ్ములను ఆరు వారములు పోషించినది ప్రేమించినది ఈ ఊరి మహిళా లోకపు సేవికలు.

క్రిందటి 30 సంవత్సరముల నుండి మా దంపతులము భారత రైతాంగోద్యమమునకు ఒక రూపురేఖ దేహం, ప్రాణం కలిగించ ప్రయత్నించుచున్నాము. ఆ సేవారంగమందు ఆంధ్రదేశపు బాధ్యత భారమైన ఖర్చులతో కష్టాలలో ఆశాభంగముతో కంటకప్రాయమైన క్రిందటి 10సంవత్సరముల నుండి శిరసావహించి యావదాంధ్ర రైతాంగపు కృతజ్ఞతకు పాత్రులగుచున్న నా సోదరులు గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారిది, ఈ గ్రామము అనుకొన్నప్పుడు మా హృదయాలు పొంగుతుండును. ఒక ఉద్యమానికి జీవితం అంకితమొనర్చుకొనువారి కుటుంబీకులగుటలో బాధలు బాధ్యతలు దారితెన్నులు కాన్పించిన తెంపులు, త్యాగాలు ఎట్టివో వారికి ఎంతగా మనస్సును రాపిడిపెట్టు అనుభవాలు కలుగునో నాస్వానుభవం. కనుకనే నా సోదరి శ్రీమతి గొర్రెపాటి సరస్వతమ్మ మొదలగువారిని తలచుకొన్నప్పుడు మీ ఘంటసాల గడ్డలో మీయంత గాంభీర్యము, తీయదనము, నిగ్రహం త్యాగశక్తి ఇమిడియున్నవో నేను ఊహించుకోగలను ఎందరో పైకి కనపడు నాయకుల తెంపు త్యాగాలనే చూడగలరు. ఆ కస్తూరిభాయి యొక్క 50 సంవత్సరాల సహకార దాంపత్యశోభను అనుభవించిన ఆ మహాత్ములే ఆమె త్యాగమును, బాధల తలంచుకొన్నప్పుడేల నీరై పోయిరో ఆలోచించుకోవలదా? అంతటి త్యాగశీలి మా శ్రీమతి గొర్రెపాటి ఆమెకు అలాంటి మహిళామతల్లులకు ఇవే నా ప్రేమపూర్వక వందనములు.

వీరితో సరితూగగల పురుషులు ఒక్కరే మనకు ఈ దినములలో కన్పించుతారు. వారే మన సరోజనీదేవిగారి భర్త పేరయ్యగారు, అట్టి పురుషులయెడగూడ నాకు అభిమానం కలదు. దంపతులు కావడికుండలు అను మనవారి భావం అర్ధనారీశ్వరుల అను పూర్వీకుల భావం ఘంటసాల దంపతులకేగాక అందరు భారతీయ దంపతులకు ఆమోదార్హము.

మరొక గొర్రెపాటి ఈ గడ్డలోగల ఆనాటి బౌద్ధుల జిజ్ఞాస, శాతవాహనుల నాటి విశాల దృక్పథమును మన రైతాంగ సుహృదయత, పట్టుదల, శృంగార

సౌభాగ్యలక్ష్మిని తీర్చిదిద్దు నిర్మాణ కౌశలతకుజేర్చి ఈనాటి రైతాంగ పండితులయి నారు. వామనునివలె బయలుదేరి ఎలాగ మరెవ్వరికి ఒత్తిడి కల్గించకుండా ఆంధ్ర విజ్ఞానవెల్లుల ప్రసాదించుచున్నారో చూచుకొని ఆనందపడుచున్నాము. వారే రంగాగారి జీవిత చరిత్రమ గొప్పగా రచించిరి. రాచకీయాలలో నిర్మాణ కార్యక్రమ నిర్వహణములో పేరెన్నికగన్న ఎందరో గౌరవప్రదమగు స్థాయిని మీ జిల్లా రాష్ట్రమందే మీ గ్రామానికి గౌరవం సంపాదించుచునే యున్నారు. కనుక ఈచోట ఈ సభ జరుగుచుండుట మహిళోద్యమమునకు కాంగ్రెస్ సేవా పరిమళముల పొందుటకు శుభసూచకమే.

## దివి

ఈ తాలూకా మాబోంట్లకు ప్రియపాత్రము. ఇందేగదా ఆగ్నేయాసియా దేశాలకు అమరావతి, నాగార్జున శిల్పాలు, శ్రీరాముల గాథలను భారతీయ కళా కాంతులద్వారా అందించి సముద్రాల ఆకట్టి కాంతియుత దిగ్విజయ యాత్రమ సాగించిన ఆ శాతవాహన యుగంపు రాజధాని నగరము, శ్రీకాకుళం. అందలి ఆంధ్రవిష్ణు దేవాలయం ఆనాటి రోమక సామ్రాజ్యముతో చైనావారితో వ్యాపార ములు నడిపించిన చోటులే ఇవి. ఆ చురుకుదనం, ఆ విశాల వ్యవహారదక్షత, ఆనాటి జనుల పరాక్రమం ఈనాటికి మీలో అంతర్గర్భితమయి యున్నవని నా ఆశ. ఈ "పురిటిగడ్డ" నుండి మన ఈ మహిళోద్యమమునకు కృష్ణవేణీమతల్లి ఆ పశ్చిమాద్రినుండి ఏరి ఏతెంచు తన పవిత్ర సలిలముల ద్వారా ఊపు ఉల్లాసం పొందుతు కృష్ణగడ్డలకు పొంపుకల్గించుగాక!

## మహిళోద్యమము పరిమితులు

భారతదేశపు మహిళోద్యమం బ్రిటిషువారి కాలంలో ప్రారంభమయినది. బస్తీలలో కొంతగా వెలసినది. పండితోత్తముల మధ్యనే ధనికుల సరసనే పైపై మెట్టులందే మెలగినది.

అయితే విప్లవవాదులగు శ్రీమతి ఖజిస్సుసతి, అనిబిసెంటమ్మా, సరోజినీ దేవి, కమలాదేవి ప్రభృతులు ఈ ఉద్యమానికి ఆగరాని ఊపును ఇచ్చిరి. అంతు

లేని ప్రాణంపోసి అందగా నిల్చిరి. ఏ రాచకీయాలతో సంబంధం లేదనుకొని తన ప్రయాణం ప్రారంభం చేసుకొన్న మన మహిళోద్యమము మహాత్ముని సృష్టి ప్రతిభ లోబడకుండ గలిగెనా? వేలకొలది స్త్రీలు బాపూజి చరణారవిందముల నందుకొని ఉజ్వలమగు నిర్మాణశక్తి పొంది ఆ త్యాగంతో మన మహిళోద్యమమునందుచేరిరి. అటుల చేరుకుంటున్న వారిలో నేనొక్కరమ కనుక మన ఉద్యమం స్వయం సంపూర్ణమైనదనుకొనరాదు. జాతీయమగు ప్రబల నిర్మాణశక్తులలో మన ఉద్యమం ఒక్కటి. కుటుంబంలో నెట్లో అటులనే అన్ని ప్రజోద్యమములలోను మనకు తీరరాని అవిభాజ్యమగు భాగము కలదు. పెండ్లి పేరంటములందు సర్వకళా శోభిత మగు ముత్తయిదు వెట్టి కాంతి పుంజమగునో అటులే మన ఉద్యమము తన్నుతా పెంచుకొని సర్వశుభ లక్షణముల పొందుచు జాతీయోద్యమములగు రైతాంగశ్రామిక సంఘాలకు ప్రధాన పోషణ కాదగును.

## ఉద్యమ అవసరము

అయినా భారతదేశంలో మహిళోద్యమమును ప్రారంభించుటకు ప్రత్యేక అవసరం కల్గినది. పాశ్చాత్య దేశములలో ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం వరకు స్త్రీలకు ఓటింగు హక్కు లభ్యముకానున్నా, చదువు సంధ్యలందు మత సాంఘిక మర్యాదలలో వారు అభివృద్ధి మార్గమందే యుండిరి. పెండ్లి పేరంటములందు కూడా మన స్త్రీలకంటె హెచ్చు సౌకర్యములు వారికేయుండెను.

భారత నారీమణులకట్టి భాగ్యం లేదాయెను. రాజారామమోహనరాయ అడ్డు కోకుండా వుంటే నిర్భాగ్యులైన వితంతువులు సహగమనము ఒనర్చుట తప్పనిసరి అయియుండేది కదా! ఈశ్వరచంద్ర విద్యాసాగరుల వ్యవహారశక్తిని ధారబోయ కుండావుంటే వితంతువులు పునర్వివాహము చేసికొనుటకు మనపెద్దలు తలయొగ్గే వారా! కరండికార్, మహారాష్ట్రములో వీరేశలింగం ఉన్నవ ఆంధ్రలో ధైర్యంచేసి నిర్మాణశక్తితో మనప్రక్క చేరకుంటే స్త్రీలు విద్యాబుద్ధులింత విరివిగా పొంద గలుగుట కష్టమయ్యేడిది. స్త్రీలకు వేదాధ్యయనాది హక్కులుండరాదనేవారు ఈ శతాబ్దారంభమున గూడావుండినారంటే మనపెద్దల మనోతత్వమెంత పెడదారుల బట్టెనో ఊహించుకోగలము.

ఇంగ్లీషు పాలన వచ్చిన పిమ్మట కూడా పాశ్చాత్యులతో సాంఘిక మర్యాద లందుకొనుట ప్రారంభించిన తరువాత కూడా ఘోషాపద్ధతి సడలుటకు బదులు మర్యాదస్థాయి పెంచుకొనదలచిన కులాలు ప్రజలు "ఈ దౌర్భాగ్యపు వరదాను" అవలంభించుట 1983 వరకు చూచుచునేయుంటిమి.

కనుకనే స్త్రీలు అట్టిదీనస్థితి పోగొట్టుకొనుటకై మహిళోద్యమము అవసర మాయెను. అందు ప్రప్రథమంగా నాయకత్వమును ప్రసాదించిన ఆవీర నారీమణులు సరోజినీదేవి, సరళాదేవి, లక్ష్మీబాయమ్మ, ఖజిన్నుసతి, అనిబిసెంటమ్మా మనకు చిరస్మరణీయులు.

స్త్రీలకు చదువుచెప్పుట అవసరము. వేదాధ్యయన హక్కు కలదు. పురుషు లతో సమానముగ ప్రజాహిత జీవితమందు గౌరవస్థాన ముండవలయును. వారికి గూడ ఉన్నత విద్యాలయాలవసరము. ఆటపాటలందు వారికి గౌరవస్థాయి ప్రసా దించవలెను. ప్రభుత్వోద్యోగములందు వారికి ప్రవేశం కల్గించవలయును. సాంఘిక మర్యాదలందు వారికి సమాన గౌరవస్థానం ప్రసాదించుటకు తగును వ్యవహార నిర్వహణములందు వారును గణనీయులు అని సాధారణ సాంఘికతత్వం ఈనాటికి పై పై తరగతులవారిమధ్య ప్రచారమై అంగీకృతమగుటకే యినాళ్ళు పట్టినది. ఇప్పటికింకను రైతాంగంలో ఎందరెందరో కూలినాలి జనాలలో మరెంతమందో ఈ ధోరణికి రాలేకున్నారంటే మన స్త్రీజనాల సాధారణస్థితి వేరుగా వర్ణించవలెనా!

## మన సమస్యలు – మారుమనువులు

పాశ్చాత్యదేశాలలో ఎప్పటినుండో గౌరవప్రదముగా సాధారణ సాంఘిక వ్యవస్థగా అంగీకరింపబడుచున్న "మారుమనువు" హక్కును మనదేశమందలి సన్నజనాలను కొనబడే హరిజనులు, ఆటవికజాతులవారు వివిధగ్రామీణ ఉప వృత్తుల వారు అనుభవించుచున్న బ్రాహ్మణ్యపు మర్యాదల శిరసా వహించుకొన్న కులాలవారు మాత్రము తమ స్త్రీలకందనివ్వక పోగా మీదుమిక్కిలి అట్టిహక్కును కోరుట హిందూమరా చారములకు వ్యతిరేకమని వితండవాదమును లేపిరి. పైగా అట్టిహక్కును అనుభవించువారంతా "తక్కువకులాలు" గాపరిగణించిరి. వారిచే

అటుల అంగీకరింపజేసిరి ఇదితప్పనియా "మారుమనువుహక్కు" పొందియుండుట అభివృద్ధి సూచకమని ఆన 1923 లో రంగాగారు ప్రకటిస్తే "అయ్యోఅంతమాటా" అని మనవారెందరో ఆశ్చర్యపడిరి.

కనుకనే ఈనాడు మారుమనువు హక్కును సన్న జనాలకేగాక అందరి స్త్రీలకు ఇవ్వాలంటూ హిందూకోడ్ బిల్లువస్తే హాహాకారాలొనర్చి సనాతనధర్మ ప్రచారకులున్నారంటే ఆశ్చర్యమా !

## ఉండాలికదా మారుమనువులు

ఏలఉండరాదు మనకు హక్కు కొత్తదిగాదే. ఆ హక్కును అనుభవిస్తున్న మన జనాలు వైవాహిక సౌఖ్యము, సంపద, మర్యాద సాంఘికాభివృద్ధి పొందు చున్నారుగదా ! అట్టి హక్కు పురుషులకు వున్నది. వారేమైన వెర్రిగావ్యవహరించు చున్నారా ? లేదే సన్నజనాలస్త్రీలు వెర్రిమొర్రిగా సంఘ జీవితాన్ని కలుషితము చేస్తున్నారా ? లేదే కనుకనే అందరి స్త్రీలకు తమకవసరమైనప్పుడు ఈ మార్గంను అనుసరించుటకు హక్కుకలదని ప్రకటించుటఉచితమే.

స్త్రీలకు రాచకీయ ఆర్థికహక్కు బాధ్యతలు పురుషులతోబాటు సమానముగా వుండాలనుటకూడా విప్లవాత్మక కోరికలుగా ఒకనాడువుండెను. ఎందులకో ? "అర్ధనారీశ్వరత్వం పురుషులకు మాత్రమే వర్తింపజేసిరి. పురుషునకు హక్కులుంటే చాలుననుకొనిరి. స్త్రీధనమును దేవుని ధనముగా పరిగణించు చుండిన దినాలివి. దేవుని ధనాన్ని దిగమ్రింగు ఈరోజులలో స్త్రీధనాన్ని గౌరవించువారెవరు అలాంటప్పుడు స్త్రీలకు ఆస్తిపాస్తులను ప్రత్యేకించవలననే అవసరమేర్పడు చున్నది.

## వృత్తులు

ముమ్మందుగా పాశ్చాత్యదేశాలలో ఇప్పుడిప్పుడు మన దేశాలలో పారిశ్రామిక తదితరవృత్తులందు స్త్రీలకు పురుషులతోబాటు సమానహక్కు బాధ్యతలు కావాలనే నినాదము బయలుదేరినది. అందుతప్పులేదు. ఒకే పనిని దాదాపుగా ఒకే

చతురతసత్తాతో నిర్వహించనప్పుడు వేరు వేరుగా మజూరి "ఇవ్వజూచుటధర్మమా. కనుకనే అంతర్జాతీయ కార్మికసభ వారు స్త్రీ పురుషులకు ఒకే విధమగు పనుల నిర్వహించుటలో సమానకార్య నిర్వహణకు సమానమగు జీతభత్యములివ్వవలననే ధర్మమును నిర్వచించినారు. దీనిని మనప్రభుత్వం కూడా అంగీకరించింది అయితే ఆచరణలోకి ఈధర్మం ఇంకారాలేదు. మన స్త్రీలు ఈ విషయమై ఆలోచించాలి.

## ఆస్తిపాస్తులు

బిడ్డల అందరి మధ్యా తల్లి దండ్రుల ఆస్తిపాస్తులు సమానముగా పంచాలనే వినాదం వింటున్నాము. ఇంతదనుక ఇతరదేశాలలో తండ్రి ఆస్థిని కుమారుల మధ్యనైనా సమానంగా పంపిణిచేసితీరాలనే ధర్మము అంగీకృతముకాలేదు. తండ్రిదే ఇష్టం. తల్లిదే ఇష్టం. మనదేశమందు అట్లుకాదు. మగబిడ్డలందరిమధ్యా తాతతండ్రుల ఆస్తులు సమానముగా పంపిణికావలెననే మనధర్మము పాశ్చాత్యుల ఆచారముకంటే యోగ్యమైనది.

కనుక తిరిగి ఆపాశ్చాత్యుల సంకుచితాచారమును పునరుద్ధరించాలని మన హిందూకోడ్ బిల్లు ధోరణి మంచిదికానేరదు. అయితే పంపిణికాదగు మనతాత తండ్రుల ఆస్తులు ఒక్క కుమారుడికేనా లేక కుమార్తెలకు కూడా అందదగునా? పైపై ఆలోచనలకైతే కుమార్తెలకుకూడ సమానముగా అందదగుననిపించును. కాని కుమారులకు తమ భార్యలద్వారా అందగలుగు అదనపు ఆస్తికంటె కుమార్తెలకు తమ భర్తలద్వారా సంక్రమించదగు అదనపు ఆస్తి సాధారణంగా హెచ్చుకావచ్చు కనుక కుమారులకంటె కుమార్తెలకు కొంచెము తక్కువ భాగము అందినా ఫర్వాలేదనిపించవచ్చును.

ఇట్టి పంపకము అంగీకరింపబడినపుడు అలాగ సంప్రాప్తమగు ఆస్తిపాస్తులు ఆడుబిడ్డలకే చెందవలెనా? లేక ఇప్పటివలె వారి భర్తలకా? భర్తలకు గాక వారికి చెందియుండ వలయునని మనము తీర్మానించు కొనవలయును. మారు మనువుహక్కు స్త్రీలకు లేనప్పుడు వారి భర్తలకే వారి ఆస్తులపై హక్కు నిచ్చుటలో కొంత అర్థ ముండెడిదేమో "మారుమనువుహక్కు" ఇవ్వాలనుకొన్న,

ఈ దినములలో తమ ఆస్తి పాస్తులపై పూర్తి హక్కు ఆయా స్త్రీలకే ఉండుట ధర్మము. అయితే బిడ్డలందరికీ తండ్రుల ఆస్తులపై సమాన హక్కులు ఇస్తూ తల్లుల ఆస్తులపై ఇవ్వరాదా? తల్లులు తగుపాటి సత్తా సామర్థ్యం లేని వారుగాక తండ్రులకు వర్తించిన ధర్మము వారికి వర్తించనవసరము లేదు. ఆమరణాంతము తమ ఆస్తి పాస్తులను తామే పూర్తిగా అనుభవించనట్లును ఆ పిమ్మటమాత్రము బిడ్డలకు తండ్రుల ఆస్తిపాస్తులపై అంసు హక్కులవలెనే తగుపాటి హక్కు కలుగునట్లు చేసికొనవచ్చును. బిడ్డలు లేకనే చనిపోవు భార్య ఆస్తిపై ఈనాడు భర్తకు పూర్తి హక్కు కలదు. ఇది న్యాయముకాదు తల్లిదండ్రుల ఆస్తులనుండి భాగము తెచ్చుకొన్న స్త్రీ తనకు బిడ్డలు లేనప్పుడు తాను మరణించినప్పటికి మిగుల్చుకున్న ఆస్తులను తన పుట్టింటివారికి చెందునట్లు చూచుకొనవలయునను కొనుటయే సహజము. కనుక అట్టి ఆస్తులు ఆమె అక్కచెల్లెండ్ర అన్నదమ్ములకే చెంద వలయుననుట తగును.

భర్త ఆస్తి నుండి కూడా కొంత భాగము భార్యకు చెందవలయునని కోర కూడదా? వారిద్దరు చేరుకొని కష్టించి శ్రద్ధగా జాగ్రత్త పరస్తేనేకదా భర్త ఆస్తి పాస్తులు పెరుగు చుండేది. పాశ్చాత్యులలో కొన్ని దేశాలవారు గృహకృత్యములు నెర వేర్చుచున్నందులకు గృహిణులకు జీతభత్యములు కూడ ఏర్పరచు చున్నారు. మనమంత దూరం పోజాలకున్నాం. సరే పెరుగుచున్న భర్త ఆస్తిపాస్తులలో భార్యకు బాగం కోరరాదా?ఎప్పుడు? కుటుంబము సౌఖ్యముగా జరుగుతున్నంత వరకు అట్టి ఆలోచన కలుగదు. వారిద్దరి మధ్య విరోధము కలిగినప్పుడే కదా అలాంటి ఆలోచన. అప్పుడు "విడాకులు" చేసుకొనిరా వారి వారి నడత తప్పిదములకు బాధ్యత అవసరం ననుసరించి భార్యకు "మనోవర్తి" ఇవ్వ వలసిన బాధ్యత ఈనాటి శాసనం ప్రకారం భర్తపైకలదు. దీనికి మించిచేయవలసినదేమి? ఇప్పటి కంటె హెచ్చుగా భర్త ఆస్తిపాస్తుల ననుసరించి "మనోవర్తి" ఏర్పరచమనుట తగును.

విడాకులు పొందిన తరువాత "మారుమనువు పొంది నప్పుడు కూడా ఈ ఈ మనోవర్తి పూర్వపు భర్తను యివ్వ మనటం ధర్మమా? ఈ సందర్భంలో

యిప్పటి వరకు మారుమనువు హక్కులను ఆచారానుగతంగా అవలంభించుచున్న ప్రజలలో యెట్టి మర్యాదలున్నవో ఆలోచించుట తగును. పైగా అవసరము అధికముగా కలిగి నప్పుడేగాని సాధారణ పరిస్థితులందు మారుమనువు తలంపులకు మన సంఘమందు ప్రోత్సాహం కలిగించరాదనే భావం మనవారియందు హెచ్చుగా నున్నది. దానికి సరిపోవు నట్లే ఈ భర్త ఆస్తిపై భార్యకిచ్చు హక్కును నిర్ణయించు కొనుట మంచిది. ఇంతకు వివాహం గురించి మన మొక ధార్మికధోరణికి రావలసి యున్నది. పాశ్చాత్యులలో కూడా మన బ్రాహ్మణ్యపు ధర్మంను అంగీకరించు కేధలిక్కులు కలరు. అట్టి వారమందరం "అర్ధనారీశ్వరత్వమును అంగీకరించుచున్నాము. అయితే యిదే సాంఘీకాభివృద్ధికి పరమోత్కృష్టమైన ధర్మమన జాలం. కనుకనే కొన్ని కొన్ని పరిస్థితులందీధర్మము ఆచరణయోగ్యం కాజాలదని అంగీకరించుచున్నాం. "మారుమనువు" తప్పని సరిగా వచ్చుననుకొంటున్నాం. అదియు ధర్మ మార్గమేనని అంగీకరిస్తున్నాం. కాని అది "ఆపత్ ధర్మము" గానే పరిగణించుట తగునను కొంటున్నాము. ఆ ధోరణినే మన సన్నజనాలు వ్యవహరించుచున్నారు.

●

# ఆచార్య రంగా - పీఠికలు



ద్వితీయ భాగము

# మన కవిబ్రహ్మ

(ఆచార్యరంగగారు కవిబ్రహ్మ సన్మానసంచికకు వ్రాసినవ్యాసమిది)

"అది యొక సాయంతనము. కొల్లూరునకు కాంగ్రెసు ప్రచార నిమిత్తము వెళ్ళియుంటిమి. ఆ సందర్భములో మిత్రులు కొందరు అచ్చటి హైస్కూలు తెలుగుపండితుల గురించి చెప్పుచుండిరి. వారి కవిత్వప్రతిభ, భావనాబలము, సాహిత్య ప్రపంచమందలి వారి వీరవిహార మపుడు తెలిసికొన్నా- ఇంతలో శ్రీమతి భారతీదేవి నాకంతకుముందు ఈ కవీంద్రుని భావనాప్రతిభను గురించి చెప్పిన విషయాలు మనస్సునకు వచ్చినవి. తోడనే ఆహ్వానము పెట్టితిని. వారు వచ్చిరి. తమ రచనల కొన్నిటిని వినిపించిరి. ఆనాడు నాకెంతయో ఆనందం, ఆశలూ కలిగినవి.

చూచుటకా! వారొక రైతు బిడ్డ. కవనంపు బిడ్డలాగు తళతళ లాడలేదు. ఇటు లేయుండిరి కవికోకిల రామిరెడ్డిగూడను. ఐతే రెడ్డిగారి కంఠమందీపలుకు చురుకు ఒక విధమైన తియ్యందనము ఉండేవిగావు.

వారి పద్యాలలో ఆ గుంటూరు మిరపకాయలోని చురుకు ఆ యెర్రని చక్కందనము వున్నాయి, ఆనాటివారి వాగ్ధోరణిలో నా భావనాదృష్టి పథానికి గోచరించిన వివి. ఆ నా చిన్ననాటి పల్నాటివీరుల పల్లెపదాలు, దట్టీగట్టి బయల్దేరు చున్న బాల చంద్రుని జబర్దస్తీ, ఆ వలపు వెన్నెలలో నుండి బయలు వెడలుచున్న తీవ్రత, ఆ విశాలమైన ఛాతి, ఆ వారవేసి కప్పు, ఆ భయంకరమగు కరవాలము, ఆ మునుమున్న అంగరాను, ఆయన వెనుకనే కనుపట్టు సైన్యవిన్యాసాలు, వారి పాదాలవద్దనే నురుగులుగ్రక్కుచూ, మరణించువారికి పునర్జన్మ నీయగాలవనే నాగా మహాబలములలాను : ఏ మాదృశ్యము? ఒక్క క్షణములో భయంకరముగానుండెను మరొక్క క్షణములో ఉత్సాహజనకముగా ఇంకోక్షణమంత ఉద్రేకపూరితముగా! "నేనే ఆ యుద్ధమందు చేరుతున్నా! బాలచంద్రునీ బలగాలలో ఒక్కరినైనా! బాలచంద్రుని కలలో నొక్కటిగా మారుతున్నా! ఆ నరసింగరాజును పట్టు కుంటున్న బాలు నొకమైనా చేరుకున్నా" నన్నట్లు తన్మయుడనైపోతిని.

అంతటి భావనాశక్తి, చిత్రకళాపైదగ్ధ్యము, హృదయాకర్షణ బలం ఆ యువకవీంద్రుని కవనములో, పాటలో, మాటలో వున్నవానాడు.

పెరిగినాడాకవీంద్రుడు. పండితుడైనాడు. గ్రంథాలను మనముందు పెట్టుచు

న్నాడు. తిక్కన ఆనాటి భారతయుద్ధాన్ని తన పదమూడవశతాబ్దపు రాజకీయాను భవముతో సమ్మేళనపరచుకొంటూ ఆ సాటిలేని తెలుగుభారతమును వ్రాసినారు: ఈ నాటివారును యుగ పురుషుల చరిత్ర నానాటి తిక్కనంతకమ్మని ఆంధ్రకవన మందు పొందుగుచుండిరి. అందులో ఈనాటి విప్లవధోరణిలో స్వతంత్రపద్ధతులు, వ్యవహారయుగమునకు సరివచ్చురీతినే ఆనాటి పల్నాటి యుద్ధ కథనమును సర్వస్వతంత్రుడై ధైర్యసాహసాలతో మహాత్ముని సత్యాగ్రహయుగ నిర్మాణ ధోరణి యిరవై శతాబ్దపు ప్రజాస్వత్వసంపాదిత తత్వముల మేళవింపుచేసికొంటూ నూతనప్రబంధధోరణిలో నల్లుచున్నారు.

ఒకవిధముగ భట్టుమూర్తి స్ఫురణకు వస్తాడు. వీరిధోరణిచూస్తే పాతకథ, నూతనపుమాట, పురాతనసృష్టి, ఈనాటి తుష్టి ఆనాటి స్వతంత్ర, సాంఘిక వివర ణాలు, ఈనాటి సొగసుల ఆభరణాలు వారి రచనలో కోకొల్లలు.

తిరిగి మళ్ళా 1940 లో పాలపత్రులో కలుసుకొన్నా : అప్పటికి వీరిని "కవిబ్రహ్మ" అని కొందరు పిల్చుకొంటుండేవారు. ఎందుకనో యీ బిరుద మను కొన్నా ! మన ఆంధ్రులు అతిత్వరితంగా బిరుదులు విస్తారంగా ఇచ్చుకొంటారు. అంతకంటె త్వరితంగా ఓర్వలేనివారు వానికి ఒడికి అంతకంటె బలమైన తిట్లను పూనుకొంటారు అనే అపవాదులు కలవు. కనుక ఇట్టి స్వతంత్రరచనల వింత విన్నాణముగా సృష్టించుచు నెదుగుచున్న ఈ కవీంద్రునకిట్టి బాధనేల కల్పించుచున్నా రనుకొన్నా ! నేడు వారి రచనలు విని చదివినపిమ్మట ఆ బిరుదెంతైనా వారికి తగుననుకొన్నా.

ఈ శతాబ్దములలో సాంఘిక భావముల స్వతంత్రించి, చిత్రించుటకు దర్శించుటకు కవిరాజుగారు ప్రౌఢకవిత్వము నల్లిరి. వారి "ఖూనీ" అనే వచన గ్రంథమునకు సాటి వున్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి" యొక్కటియే. వారిప్పటి ధోరణిలో ఆలోచింపుకొంటూ "కవిరాజు శిష్యుడై" ఆంధ్రచరిత్రకు ప్రాణముపోసిన "పల్నాటి వీరుల" కథను స్వతంత్రరచనముద్వారా మనకందరికు నుత్సాహము, వీరపూజాధోరణి, కార్యనిర్వహణశక్తి, దీర్ఘకాల కవితాసక్తి, దిన దినాభివృద్ధి చెందు సృష్టికారకప్రతిభ, కల్పనాసౌందర్యము, ఊహా ప్రతిభావము నెంతో విస్తారముగ మన ఆంధ్రలోకమున కందించి తన బిరుదును సార్థకపరచు కొనుటేగాక ఈనాటి ఆంధ్రులందింత ప్రతిభ కలదని నిరూపించు కవీంద్రులైరి.

# "వీరే వెంకటనరసయ్యగారు"

ఈయన రైతుబిడ్డ. ఇరవై సంవత్సరముల ప్రాయమువరకు రైతాంగజీవి. పొలముల బలం, పంటల పొలి, నల్లరేగడ, అడవుల అందము, కొండల ఔన్నత్యం, పశువుల సేవ - వాగుల పరుగు, ఋతువుల మెరుపుల ఘుమఘుమా ర్భటులు, తానొక రైతుబాలుడై గ్రామీణుడై నిండుగా అనుభవించుచూ కేకలు కూకలు వేసుకొంటూ, రైతాంగపుచేలపదాలు పాడుకొంటూ మొక్కజొన్నకండెల చిద్విలాసము సజ్జజొన్నకంకుల చిక్కందనము, కొత్తిమిరి సుగంధము, సెనగ పులుపు, కంది యెర్రందనము, పెసర పసిమి, మిరప చురుకుదనము, తన కవితా హృదయమందు చేర్చుకొంటూ పెరిగిన ఆనాటి పిల్లకవీశ్వరుడు ఎటులో ఏ గాలి మహత్తువల్లనో కవిరాజుచేతిలో పడినాడు. ఈ సారముగల మట్టిని మెదిపి ముక్కు మొగము దిద్దె నా మహానుభావుడు. ఆ మట్టి బొమ్మకు పసిమి మెరుగులు పెట్టు కొన్నాడీ కవీశ్వరుడు స్వీయప్రతిభవల్ల. ఇట్టులనే పెరిగెనా యేమి ఆనాటి పోతన్నగూడ ?

చదివినారా వారి రచన "మగువమాంచాల" ఎట్టి తెలుగు మగువ ఆమె ! ఎంతటి వీరపత్ని ! ఏ మానుషంగల తండ్రి తన కట్టి బిడ్డ కావాలని కోరడు? శ్రీనాధుని కవితలోనే ఆమె కెంతో ప్రాణముండెను. పల్నాటి సుద్దులు చెప్పు చుండే కీ శే॥ బిల్లునాగయ్య యామె నొక అపురూప సుందరిగా చిత్రించినాడు. ఇక వెంకటనరసయ్యగారో ఆమెను ఈనాటి విద్యావంతులకు విదుషీమణుల కొక ఆదర్శప్రాయమగు, ఆనందదాయకి యగు దేశభక్తురాలిగ పతివ్రతామతల్లిగా ప్రణయ సౌరభముల వెదజల్లు సుందరిగా వీరనారిగా ప్రసాదించినారు. ఆప్రౌఢ మన ఆంధ్ర స్త్రీ రత్నమే యని మనకు గర్వము కలుగుచుండును.

అందరివలెనే భూమిపైననే ఉంటామంటారు మనకవీంద్రులు. బ్రహ్మనా యుణ్ణి తలపై పెట్టుకొని నాయకురాలిని తక్కువ చూపు చూచినారెందులకో ?తన వీర వైష్ణవాభిమానము గాదుగదా? వున్నవవారి "నాయకురాలు" ఈ దిగువవారికి కారణమయ్యెనేమొ? శ్రీనాధుని స్త్రీ నాయకత్వముపై నుండిన కోపము కాదులే; "నాయకురాలు" వెంకటనరసయ్యగారి లేఖనిద్వారా శ్రీనాధుని వద్ద పొందిన మాలిన్యము పోగొట్టుకొన్నది. పున్నపవారి శుద్ధ పంచతంత్రపు రాజకీయమునుండి విముక్తి నొందినది. ఆమె ఒక ప్రతిభాశాలిని, ప్రముఖ మంత్రిణి, సుప్రసిద్ధ వీర

నారీమణి, బ్రహ్మనాయనితో సమానమైన ప్రజానాయకురాలు. ఆ పదునొకండవ శతాబ్దిలో ప్రజాసామాన్యమంత అగచాట్లతో భూమి బద్దలు చేసుకొంటూ, పైకి వస్తున్న యుగధోరణిలో ఆమె స్త్రీయై, రైతై, గ్రామీణమైయుండియు అనాటి రాచరికమునకు ప్రధానమంత్రిణియై, సర్వసేనాధిపత్యమును వహించినది. అంతటి అద్వితీయ విశ్వరూపిణి యగు నాయకురాలు దాదాపు తన విశ్వరూపమును వెంకట నరసయ్యగారి భావ వీధియందు పొందగల్గినది. ఈ కవీంద్రులే మరొకమారు ఆమె గుణ ప్రసారము చేసినచో సత్యభామతో దీటైన మగువ మాంచాలకు నీడై ద్రౌపతీదేవి కెనయై తిరిగి మనకు వీరరస విస్ఫూర్తితో ప్రత్యక్షము కాగలదు.

ఎందులకీ పల్నాటియుగ వీరుల విషయమై వెంకటనరసయ్యగారు తమ శక్తినింతగా ధారవోయుచున్నారు? ఇది యొక కథయే గదా: అయిన పక్షమున అంత యుపయోగముండెడిది కాదేమో? ఒకప్పుడు విశ్వకవి రవీంద్రుడు, రామాయణము ద్వారా శతాబ్దముల తరబడి మన ప్రజలందు గృహ, కుటుంబ, రాజ్యాంగధర్మములను వాల్మీకి ప్రచార మొనర్చి మన హృదయములందు "పితృభక్తి, సోదర ప్రేమ, ఏకపత్నీవ్రత ధర్మములు" ప్రజాసేవయే రాజ్యాంగపు ప్రధానలక్ష్యము లనునవి నిశ్శంకముగా చర్చ కనవకాశముగా నెట్లు స్థిరపరచెనో చక్కగా తెల్పిరి.

అటులే శ్రీ కృష్ణుడు అఖిల భారతావనిని అటు గాంధారము నుండి ఇటు కన్యాకుమారి వరకు నొక రాజ్యముగా సంధానపరచుటయు అందులకై భారతదేశ మందలి వివిధ రాజ్యాంగ కులాల, వంశాల, వృత్తుల వారందరిని పెండ్లిండ్లు, స్నేహితాలు, తదితర సంబంధాల ద్వారా ఐక్య మొనర్చి ఆటవిక ప్రజలను, ద్వీపాంతరజాతులను, నానావిధ ఆచారములకు చెందిన సంఘాలను వివిధ బంధుత్వముల ద్వారా ఆటలు, పాటలు, యజ్ఞయాగాదులు, గురుశిష్యుల సంబంధముల ద్వారా చేర్చి కూర్చి అప్పటివరకు అంగీకరింప బడుచు వచ్చిన అభివృద్ధి నిరోధక రాజ్యాంగ సాంఘికాచారములను తొలగద్రోసి, నూతన సాంఘిక సృష్టిని చేసి రాజ్యాంగ నీతిని భీష్ముని ద్వారా ప్రకటించి ఆనాటి తన సాంఘిక రాజకీయ నిర్మాణ సూత్రములకు వేదాంత రూపము భగవద్గీత అయితే, కవిత్వ స్వరూపము మహాభారతమని నిరూపించిరి. అటులే పదునొండవ శతాబ్దములో జరిగిన పల్నాటి యుద్ధము కూడ ఒక విప్లవయుగ పర్యవసానము. అప్పటిదనుక పైై రెండు కుల

ముల వారే రాజ్యాంగాధికారమునకు అర్హు లనే భ్రమలో దక్షిణాది ప్రజలుండిరి. కనుకనే పల్నాటి రాజులకు సంతతి లేకపోతే త్రిపురి (Central Provinces) రాజులనుండి దత్తు తెచ్చుకొనవలసి వచ్చెను. వారి సంతతివారే నలగామ రాజు, నరసింగరాజు ప్రభృతులు. దాక్షిణాత్య ప్రజా సామాన్యమునకు అనగా, తెలగ, రెడ్డి, కమ్మ, వెలమ, బలిజ, బోయ, హరిజన తదితర వృత్తుల వారికి తోడున్న ఆటవిక జాతులకు రాజ్యాంగాధికారము సంక్రమింప జేయుటకు పైవారొప్పుకొను చుండుట లేదు సరికదా తమ కట్టి అధికారము కలదని, పొందుట తగునని, రాజకీయ సాంఘిక ధర్మముల ప్రవచించువారప్పటివరకు లేకుండిరి.

యూరపులో ఎటుల మధ్యయుగము లందు పురోహితునితో నిమిత్తము లేకుండ దేవుని ఆరాధించుట, సాక్షాత్కరించుకొనుట, ప్రతి వ్యక్తికి హక్కు కలదను సూత్రములనిర్వచించు "ప్రొటెస్టాంటిజమ్" ను, "Reformation"ను బయలుదేరినందువలన ప్రజానీకమునకు నూతన రాజ్యాంగవికాసము ఎటులకల్గెనో అటులనే వీరశైవము, వీర వైష్ణవములద్వారా పది, పదకొండు, పన్నెండు శతాబ్దముల దక్షిణాది ప్రజలలో కులతత్వ మందున్న అడ్డంకులు, హెచ్చుతగ్గుల తిక్కలపై తిరుగుబాటు కల్గెను. పురోహితుల ప్రాధాన్యత తగ్గెను. భక్తులపెత్తనము పెరిగెను. వ్యక్తుల హక్కులు పైకివచ్చెను. జన సామాన్యపు సర్వసమానత్వము అందరి మనసునకు వచ్చెను. సామాజిక సమానత్వ దృష్టి ప్రజలలో పెరిగెను. ఇందులకు ముఖ్యంగా వివిధ మతాల మధ్య చెలరేగిన సంఘర్షణలు తోడ్పడెను. ఆ మత యుద్ధములందు దక్షిణాది ప్రజలు విచ్చల విడిగా పాల్గొనిరి. వీరవైష్ణ వమునకు బ్రహ్మనాయుడు శిరోమణియైతే వీర శైవమునకు నాగమ్మ నాయకమణి యైనది. పరాయి దేశమునుండి దత్తత వచ్చిన రాజులు ప్రేక్షకులుగానే యుండ గల్గిరి. రెండు మతముల వారికి ప్రాధాన్యమైన బలము ప్రజలయందంతర్గర్భితమై యుండిన ఆ మత కలహములలో ప్రస్ఫుట పరచబడిన వీరత్వమే! కనుకనే ఒకటి వీర వైష్ణవమైతే మరొకటి వీరశైవము. ఒకరు అంతవరకు త్రొక్కి వేయ బడుచుండిన హరిజనులకే సర్వ సేనాధిపత్యం కట్టబెడితే మరొకరు అంతవరకు నలిగిపోతూ ఉండిన స్త్రీలకు పోటీ సర్వ సేనాధిపత్యము నందజేసిరి. ఒకరు చాప కూళ్ళకు (సర్వజనసహ పంక్తిభోజనం) ఉత్సహించితే మరొక్కరు శివభక్తు లందరికి సర్వము ఒప్పగించిరి: ఇటుల పరస్పరమైన పోటీలతో పైకులము,

క్రిందకులము అను భేదములు మరచి ఒకరికంటెఒకరు ముందై రాజ్యాంగాధికార మంతను శాస్త్రాధికారముతో శతాబ్దముల తరబడి చేబట్టుకొనిన వారి నుండి తొలగ ద్రోసి వీరపూజా ధురంధరులైన బ్రహ్మనాయుడు, నాగమ్మ హస్తములలోనికి తెచ్చుకొనిరి.

అటుల వీరులకు సంపాదించుకొన్న రాజ్యాంగాధికారమును కారెంపూడి నాప రాళ్ళపై నాట్యమాడుతూ నడచుచుండె నాగులేటిలో తమ వీరరక్తమును కలుపుతూ తమ వీరపుత్రీ, పుత్రకులకు అర్పణజేసిరి. అప్పటినుండి యిప్పటివరకు దక్షిణాదిన తిరిగి సూర్యచంద్ర కులముల రాజులకే రాజ్యాంగాధికారము చెందవలెనను దౌర్భాగ్యపు అభివృద్ధి నిరోధకములైన రామాయణ భారతాది రాజకీయసిద్ధాంతములకు ప్రజలు దాసులు కాకున్నారు. పల్నాటి వీరుల యుద్ధము ఇంతటి భావదాస్య విమోచన కల్గించినది. అందువల్లనే వీరపూజ అప్పటినుండి యిప్పటివరకు దక్షిణాది గ్రామీణ ప్రజలలోప్రత్యేకంగా రైతుకూలీలలో కుటుంబమంత్రంగా, కులతత్వముగా వృత్తిలక్షణంగా ప్రతివ్యక్తియొక్క ఆత్మగౌరవ లక్షణంగా వస్తూఉన్నది. ఈనాడు "రైతుకూలీ ప్రజారాజ్య" ఆశయం దక్షిణాది రైతాంగపు కూలీ, వృత్తి ప్రజల హృదయములందు ఇంత చురుకైన, ఘాటైన, విస్తారమైన, బలమును, స్థానమును పొందుచున్నదంటే దానికి విశాలమైన, అగాధమైన, ఉత్సాహవంతమైన పల్నాటి వీరపూజ తాలూకు పునాదులే ముఖ్యకారణం. అప్పటినుంచి రెడ్డి, కాకతీయ, విజయనగర, తంజానగర, చంద్రగిరి, కళింగ, నెల్లూరు, కొండవీడు, వరంగల్ ప్రాంతములందెల్ల చెలరేగిన ఆంధ్ర, తమిళ, కర్నాటక ప్రజాసామాన్యపు రాజ్యాంగ నిర్మాణ, నిర్వహణ శక్తియుక్తులు వీరపూజాబలము ఈనాటివరకు దక్షిణాది రాజ్యాంగసత్తాకు కారణమగుచున్నది. ఇంతటి నూతన ప్రజాయుగశక్తిని పెంపుజేసిన వీరపూజాగ్ని, పల్నాటి యుద్ధమందు బయల్వెడలినది. —ని సెగలకు బైనేని పిచ్చుగుంటవారు ఆంధ్రప్రజల కందించుచున్నారు. దాని సత్తాను శ్రీనాథుడు ద్విపదలో బలపరిచి భద్రపరిచెను. ఆ నిప్పును రెచ్చగొట్టి చేవజేర్చి యీనాటి విప్లవజ్వాలలగా లేపి చూపి మనకందరకందించి ముందుముందువారికి జేరునట్లు ప్రబంధపరచి యీనాటి సాంఘిక విప్లవమునకు ఆనాటి వీరపూజా విప్లవరేఖల శాఖలు, శక్తులు, యుక్తులు, ఎంతగా ఉపకరించునో మన ప్రజాసామాన్యపు హృదయములలో చేరియున్న పదిశతాబ్దములనుండి పేరుకొనుచుండిన తత్వముల

కన్నింటికి నూతనబలము రూపురేఖలు ఈ ప్రబంధ మర్యాదలలో నిముడ్చుచున్నారు ఈనాటి వెంకటనరసయ్యగారు. ఇది యొక మహత్తరమైన విప్లవపూరిత కార్య నిర్వహణ.

ఇంతటితో వీరు తనివినొందుటలేదు. ఆ పల్నాటి విప్లవాగ్నం నుండి బయలుదేరిన మహారాణియే కాకతీయ రుద్రమదేవి. నాగాంబయే మహామంత్రిణి కాకుంటే సర్వసేనాధి నాయకిగా రాణించకుంటే ఆ పిమ్మట నొక శతాబ్దమునకు వచ్చిన రుద్రమదేవి మహారాణి కాగల్గునా? సర్వసేనాధి నాయకిగా వ్యవహరించ గల్గునా? తోటి వీరులు సహింతురా? ఆమె 40 సం॥లకు పైబడి చక్రవర్తినిగా ప్రపంచమంతా పొగడునట్లు ప్రజల పాలించగల్గెడిదా? కనుకనే శ్రీ వెంకట నరసయ్యగారు ఆ పల్నాటి రణభూమిలో బయలుదేరిన మహత్తును రుద్రమదేవి ద్వారా బయల్పరువ ప్రయత్నించుచున్నారు.

రుద్రమదేవిని కూడ త్వరలోనే గొప్ప కావ్యరూపముగా అందించబోవు చున్నారు. వారి కావ్యాలలో "క్షేత్రలక్ష్మి" భారతీదేవి గారికి అభిమానపాత్రమా గ్రంథరాజము, ఎందుకంటే మంచెపై పిట్టలు తోలుచుండి ఆ గాలి తరగలలో తేలి యాడే మన కవీంద్రుల కవితాగాన స్రవంతిలో అడుగడుగున రైతుకూలీ ప్రజా రాజ్య మోలలాడు చుండును.

ఈ గ్రామీణ జీవితము ఒక మనదేశముననేగాదు. ప్రపంచమంతకును ప్రాణ పవిత్రమైనది. మన చెరువులందలి తామర, కలువపూవుల తళుకులా ఆ పూల ప్రతిబింబముల నోలార్చు నీటి కెరటాలు, వానిపైగా ప్రసరించివచ్చే పైరగాలితో సయ్యాటలాడుచుండే జొన్నరేకులు, వాటిపై మిలమిలలాడే సూర్యకాంతుల మాధు ర్యము చూరలాడినవారికే ఎరుక వెంకటనరసయ్యగారి కవనమహత్తు—సృష్టి కారకశక్తి— భావమాధుర్యమును.

ఆయనకు అటు పండితుల పదగుంఫన కావలె. ఇటు మాలాంటి ప్రజా బాహుళ్యధోరణి కనుపైన తీరుతీయాలు కావాలి. ఈ రెంటి సమ్మేళనతో కొంత ఇబ్బంది కల్గుతునేయుంటుంది. అయినా వారి ప్రయత్నము దొడ్డది. ఫలితము గణ నీయము. అందువల్లనే వారి వ్రాతలలో కొన్ని ఘట్టాలు పారాయణయోగ్యాలు. మరికొన్ని ఘట్టాలు అప్పటికప్పుడు ప్రజాసామాన్యాన్ని ఊపి ఉడికించి ఆకాశ మంత వరకూ ఎత్తివేయునవి అయినవి. ఆయన రచన నోటికి, చెవికి, హృదయా నికి మూడుమూర్తుల ఇంపు కల్గించుచుండంటే చాలదా?

శ్రామికజనులపై వీరికి ప్రబల విశ్వాసము కలదు. పైకులాల వారికే రాజ్యాంగాధికారము పొందగల హక్కు కలదని పురాతన భావదాస్యమును భేదించుకొని వీరత్వమును ప్రకటించి ప్రజలనాకట్టి పాలించగల వారందరికీ రాచరికపు హక్కుగలదని నిరూపణ చేసిన యుగము ఆ పలనాటి వారిది. నాటి యుద్ధమందు వీరమరణమొందిన వారికే ప్రప్రథమంగా దక్షిణాపథమందు కారెంపూడిలో వీరుల "దేవాలయం" స్థాపించిరి. ఆ వీరుల పూజారులందరు రాచరికమును కాకతీయ, విజయనగర, రెడ్డి, చోళ రాజ్యములందు రాష్ట్రకూటులనుండి పదునేడు శతాబ్దముల వరకు రాజ్యాధికార మనుభవించిరి. వారిలో ప్రథమశ్రేణికి అధికసంఖ్యాకులుగా రైతులు, కూలీలు చేరగల్గిరి. కనుకనే యీనాటి వరకు ఈ రైతుకూలీల వంశములు ఆనాటి క్షాత్రలక్షణ లక్షితములైన ఆత్మవిశ్వాసముల ప్రకటించుకోగల్గుచున్నవి. అందులకే వారిమధ్యనే అఖిలభారత రైతుకూలీ యుద్యమాలు బయలుదేరుట రైతు కూలీ ప్రజారాజ్యాశయము ప్రచారమగుటయు.

వారి మనస్తత్త్వమునకు శాశ్వతిక చారిత్రక క్షాత్రయుత రాజ్యాంగ శక్తి యుక్తుల విజ్ఞాన ప్రపంచమందు వెదజల్లుతున్నారీ కవిబ్రహ్మలు.

రాష్ట్రీ కాంగ్రెసువారు నెలకొల్పిన ఆంధ్రరాష్ట్రీ జాతీయ విజ్ఞానపరిషత్తున అధ్యక్షులైనప్పటినుండి వెంకటనరసయ్యగారి జీవితమందొక నూతనాధ్యాయము ప్రారంభమైనది. "జాతీయ విజ్ఞానం" ప్రథమ సంచికద్వారా ఆంధ్రదేశంలో నుపాధ్యాయులుగా నున్నవారెందరెందరు ఎన్నెన్ని విజ్ఞానాభివృద్ధికరములగు విషయములు గురించి ఆలోచించి చదువుచు వ్రాయగల్గుచున్నారో, మనకందరికి చూపెట్టుతున్నారు. నూతన విజ్ఞానకేంద్రములందెట్టి చదువులు ఎట్టి తీరుతీయములు నేర్చుకొనవచ్చునో ఆ సంచిక ద్వారా సూచించినారు. ఇంతవరకు వారొక హైస్కూలు, కాలేజి పండితులె. ఇప్పుడో ఆంధ్రదేశ విజ్ఞానోన్ముఖాలయిన సర్వప్రజా హృదయాస్థానములకు పండిత సోదరులు, కవిమిత్రులును. ఈనాటి యువరచయితలకు వీరొక ఆదర్శప్రాయులగు సాహిత్య ప్రపంచ కృషీవలులు. స్వయంకృషి ద్వారానే ఆంధ్ర కవీంద్రులలో అత్యధిక సంఖ్యాకులుగా పైకెదిగిన వారిలో ప్రధానులు. ప్రేమింపదగినవారునుఅయిరి మన వెంకటనరసయ్యగారు- వారన్నియెడల ధన్యులు.

(రుద్రమదేవి కావ్యంనుండి)

-- ఆచార్య యన్. జి. రంగా

# "విప్లవాధ్యక్షుడు" గ్రంధ పరిచయం

ఒక ఉత్తేజకరమైన ధోరణితో, నేతాజీ జీవితాన్ని మన ఆంధ్రులకుఅందించి శ్రీ విజయరాజకుమార్ ప్రజలకు అమోఘమైన సేవచేశారు, ఆనాటి భారత విప్లవ కాంగ్రెస్‌కు "తిరుగుబాటు అధ్యక్షుడు"గా "విప్లవాధ్యక్షుడు"గా, "సాటిలేని అధ్యక్షుడు"గా నేతాజీ జగమెరిగిన పురుషుడు.

ఒక వైపున మంత్రివర్గాలం, వాటి కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్న పరిపాలనా ఉపాంగాలం, వ్యాపారస్తులం, పారిశ్రామిక వేత్తల ఇంకా తదితర సాంఘిక శక్తుల సానుభూతి సంపాదిస్తే, దయకు పాత్రులైతే, ఎన్నో విధాల లాభం పొందే అవకాశాలు ప్రజలకు ప్రత్యక్షంగా కనుపిస్తున్నప్పటికి, ఈనాటికీఆయన విషయంలో మన ప్రజలు ఎందుకు అమిత శ్రద్ధని ప్రదర్శిస్తున్నారు ?

అతి బాధాకరమైన 1920-40 సం॥రాల మధ్యకాలంలో బ్రిటీషువారి నిరంకుశ సామ్రాజ్యవాదంతో, నిరంతరోత్సాహంతో సుభాష్‌బాబు ఆయన సహచరులు జరిపిన ఎడతెగని వీరోచిత పోరాటాల వివరాలను గురించికాని లేక కాంగ్రెస్‌తో దాని నాయకులైన సర్దార్, నెహ్రూలకు సంబంధించిన తప్పొప్పుల వివరాల గురించికానీ, వారిలో చాలమంది జ్ఞప్తిలో వుంచుకున్నట్లు కనుపడదు. అతడొక నిరంతర స్వరాజ్య వీరుడని, మన జాతీయ స్వాతంత్ర్యానికి తన సర్వస్వాన్ని పణంగా అర్పించాడనీ, భారత స్వరాజ్యోద్యమాన్ని చురుకుగా సాగించేదానికి మహాత్మాగాంధీని సహితం ధిక్కరించి ధైర్యాన్ని ప్రదర్శించాడనీ, ద్వితీయ ప్రపంచ యుద్ధ సమయంలో మానవ మారణ హోమం జరుగుచున్న సందర్భములో బానిస బంధాలను తెగగొట్టేదానికి అత్యంత ప్రాణప్రదమైన మాతృభూమిని విడచి వెళ్ళాడని, మనదేశంలో కాకుండ ఎక్కడో పోరాటం ముమ్మరంగా సాగుతున్న ప్రదేశంలో, మన తరపున జరిపే పోరాటంలో, మనదేశంకొరకు ఆహుతయ్యాడని మాత్రమే వారికి తెల్సు. వారు ఉత్తేజితులు, అనుభూతులు కావటానికి ఆ మాత్రం చాలు. అటువంటి ఉత్తమ మార్గాన్ని అమోఘత్యాగాన్ని చూచుకుని వారు గర్వపడుతున్నారు - తృప్తిపడుతున్నారు.

ఏ సందర్భంలోనైనా. ఏ దేశంలోనైనా, ఉన్న పరిస్థితుల బట్టి తమ సమకాలీన నాయకత్వ సాధనలతో,తమభావానుగుణ్యంగా తగినంత తృప్తిని వారు

పొందలేక పోయినప్పుడు, తమ కోర్కెలు ఉన్నదానితో పరిమితం చేసుకోలేకపోయి నప్పుడు, అన్ని దేశాలలోనూ, అన్ని రకాలాల్లోనూ స్త్రీలకు-పురుషులకు, ప్రత్యేకంగా యువకులకు-విద్యార్థులకు, అటువంటి మహాపురుషులు ఎప్పుడూ అమోఘ సందేశా న్నివ్వటమనేది సహజం. మానవుని దైనందిన సామాజికఅభిప్రాయాలు ఎప్పుడూ శాశ్వతం సుస్థిరమైనవికావు కాబట్టి, ఒక విధంగా అవి తమను అంటిపెట్టుకుని వున్నంతకాలం సామాజిక అభ్యుదయానికి - అభివృద్ధికి, అధునాతన ఆశలు - ఆశయాలతో. వారు కంటున్న నిరంతర కలలు వాస్తవిక స్వరూపాన్ని పొందేట్లు చేయగలిగిన, లేక తమను ప్రోత్సాహపరిచి పురోగాములుగా చేయగలిగిన, నాయకుల నిమిత్తం, ఒక్కొకప్పుడు అరుగులు చాచుకుని చూడటం ఒక విశేషం. ఇదంతా ఊహాగానమా ? ఒక విధంగా అభిప్రాయాలు ఆశయాలు ఎంత శాస్త్రీ యంగా వున్నప్పటికీ మానవ సంఘాలు ఊహా ప్రపంచానికి తమ సౌఖ్యాన్ని పణంగా అర్పించటంలేదూ ?

ఒకప్పుడుగానీ మరొకప్పుడుగానీ, మానవమాత్రుని ప్రవర్తనలో కను పించే ప్రత్యేకత, ఊహాప్రపంచాల్ని స్వప్నజగత్తును సృష్టించుకోవటంలో వ్యక్త మౌతుంది. వేదాంతులు, స్వాప్నికులు, ధైర్యసాహసికులు, ఉన్నత పోరాట సాంప్రదాయికులు, భావదాస్య రహితులైన నాయకులు, అనంత ప్రజల సౌఖ్యప్రద మార్గాల్ని సాహసించి వెతుకుతూ వెళ్ళే సందర్భాలలో — ప్రతివ్యక్తి జీవిత పంథాలో నిజమైన సజీవ అభ్యున్నతిని చూపెట్టే - వారి మనోబలం ఎంతైనా సమర్థనీయం. అయినప్పుడు గ్రీస్‌దేశపు అచెల్లిస్: భారతంనాంటి అభిమన్య, కర్ణ అర్జున - కృష్ణ: వాల్మీకి ఇండియా రామ—హనుమాన్, పురుషోత్తం-అలెగ్జాండర్, నాటి జాట్లు: అశోక ఇండియాలోని కాళింగులు: కాకతీయుల ప్రతాపరుద్రుడు: మొగలాయి హయాంలోని శివాజీ, భరతపూర్ జాట్లు: 20 వ శతాబ్దంలోని భగత్ సింగ్, జతీన్‌దాస్, సుభాస్‌బాబులు అమర జీవులుగా చిరస్మరణీయులు.

బుద్ధుడు, జీసస్ సింహాసన పరిత్యాగం చేసినట్లే, స్వరాజ్య భానోదయ సందర్భంలో మహాత్మాగాంధీ ఢిల్లీలో అస్తమించాడు. అయినప్పటికీ ఈనాటికి వారు నోచుకొన్న ప్రజాహృదయాలలో రారాజులు. అదేమాదిరిగా స్వరాజ్య భారత దేశంలో. ఉపయమైన మొదటి నాయకుడుగానో, రెండవ నాయకుడుగానో, మూడో నాయకుడుగానో మహాత్మాజీ అనుచరులలో కాంగ్రెస్ లవకాశాన్ని కలిగివుండేవాడు నేను. అంతేగాక, స్వరాజ్య సమయంలో, జవహర్‌లాల్ లాంటి ప్రధాన మంత్రు

లలో ఒకడుగా, మన చరిత్ర గ్రంథాలలో ఆయనకూడా స్థానం ఆక్రమించి వుండే వాడు. ఈ అవకాశాల గురించి ఆయన ఆలోచించి వుండకపోలేదు. అయితే ఆయన తనకీర్తిని ఇనుమడింపచేసే మార్గం ఇదికాదని అసంతృప్తి పొందాడు. ఈనాడు ప్రఖ్యాతిపొందిన కాంగ్రెస్‌లోని అసంఖ్యాక మిత్రులవలె భారత చరిత్రలో తనస్థానం సుస్థిరం కాబడిందని ఆయనకు తెల్సు. అంతటితో ఆగలేదు. గొప్ప వారు తృప్తి పడటానికి ఆమాత్రం గౌరవ ప్రతిష్ఠలు చాలు. అయితే ఆయన ఆ గొప్పవారితో భేదించటానికి ఆతురత ప్రదర్శించాడు! ఎందుకంటే, అసంఖ్యాకులు కనుచూపుమేరలో అసాధ్యమని ఊహించే ఒకఘనకార్య సాధనాప్రయత్నం నిమిత్తం జరిపే పోరాటంతో, పూర్తిగా ఆ గొప్పతనాన్ని మేళవించి, సత్ఫలితాన్ని పొందక పోతే, గొప్పతనపు ప్రత్యేకత ఏముంది ? భారతదేశం స్వతంత్రం పొందే నిమిత్తం, ద్వితీయ ప్రపంచ యుద్ధం సృష్టించిన ప్రత్యేక వాతావరణంఅనుగుణ్యంగా వుందని, ఆయన గట్టిగా ఆలోచించి, ఆ ఆలోచనకు తాను ఏకైకంగానే కట్టుబడ వలసి వచ్చింది. ఎందుకంటే, జాతీయ నాయకత్వం ఆయన చూపించిన ఈ అభి ప్రాయంతో ఏకీభవించ లేకపోయింది. కాబట్టి భారత భూమిలో పోరాటం, జాతీయనాయకత్వ ఆశయాను గుణ్యంగా ముందుకు తీసుకు పోయేనిమిత్తం, సమర రంగాన్ని స్వేచ్ఛగా కాంగ్రెస్‌కు వదలివేసి, ఒకే ఆశయసాధన నిమిత్తం, తన స్వంత పంథాలో పురోగామియై, ఆకాశంలో ఎగురుతూ నీళ్ళలో ఈదుతూ, దేశం విడిచి ఆయన వెళ్ళిపోయాడు. అప్పటినుంచి తన దేశ ప్రజలు ఆయన జరిపిన వీరోచిత ఉద్యమాల ద్వారానే, బ్రిటిషు ప్రభుత్వం భారత దేశాన్నుంచి వెళ్ళిందనీ, ఆ విధంగానే భారతదేశం స్వతంత్రం పొందగలిగిందని, దృఢమైన నమ్మకంతో వున్నారు. భారత జాతీయనాయకత్వ సాధనాలుకూడా అమోఘమైనవి-చైతన్య ప్రపూ తరితమైనవి. అయితే నేతాజీని ఉపయోగించుకొనేవారు, ఇంకా కొద్దిదైనప్పటికీ అతని అనుచరవర్గం తమ తిరుగులేని వీరత్వం, హద్దులులేని సాహసం, అంతు లేని త్యాగాలు ప్రదర్శించి, ఎంతో చైతన్యవంతులుగానున్నా అద్భుత వ్యక్తులు గానున్నా రుజువు చేసుకున్నారు.

అమోఘమైన 1938-40 సంవత్సరాల మధ్యకాలంలో, నేతాజీ పక్షంగా నిలబడిన అనేకమంది అదృష్టవంతులైన స్వాతంత్ర్య సర్దార్లతోపాటు, నాకుకూడా నేతాజీ పక్షంగా వుండే అదృష్టం కలిగింది. మా రైతాంగోద్యమానికి ఆయన హరి పూర్ అధ్యక్షస్థానం ఎంతో మద్దత్తు నిచ్చింది. కొంత మంది కాంగ్రెస్ మితవాద

నాయకులతో ఆయన ప్రారంభించిన పోరాటం, మెరికలలాంటి మాలోని కొందరిని అధికారం కోసరం తాపత్రయ పడే వారికి భిన్నమైన వర్గంగా ఏర్పడటానికి అవకాశం కలిగించింది. ఆయన బాహాటంగా రైతాంగోద్యమాన్ని సమర్థించటం, జాతీయ ఉద్యమంలో పనిచేస్తున్న మమ్మల్ని ఆయన బ్రిటిషు ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రదర్శించే ఎత్తుగడలు, అమితంగా ఆకర్షించినయ్. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఆయనవుండి, ప్రపంచయుద్ధం ఆ సంవత్సరం ప్రజ్వరిల్లబోతుందని నొక్కి వక్కాణించినందున, స్వరాజ్య సముపార్జనకు అనువైన అవకాశం గలిగిన సందర్భంలో, ఆయన వంటి బలీయమైన అధ్యక్షుడు దేశానికి అవసరమని మేం అభిప్రాయపడ్డాం. కాబట్టి అదృష్టకరమైన త్రిపురి కాంగ్రెస్ సందర్భములో, తిరిగి ఆయనే అధ్యక్షుడుగా వచ్చేందుకు మేమంతా సహాయ పడ్డాం. ఎప్పుడైతే మహాత్మా గాంధీ తద్భిన్నమైన అభిప్రాయానికి వచ్చాడో అప్పుడు పరిస్థితులు మారి, సుభాస్ బాబు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షునికి తగ్గ అవకాశాన్నిస్తూ, రాజీనామా ఇచ్చేందుకు పరిస్థితులు వత్తిడి పెట్టడం ద్వారా, ఇక అప్పటి నుంచి అతివాద ఐక్యసంఘటన సంస్థ (Left Consolidation Committee) స్థాపనకు నేను కృషిచేయ ప్రారంభించాను. అయితే 1940 ఏప్రియల్ 1 వ తేదీతో మొదట రాయిస్టులు, తరువాత సోషలిస్టులు, ఆ తరువాత కమ్యూనిస్టులు వరుసగా అతివాద ఐక్యసంఘటనా సంస్థని వదలిపోయినందున, కిసాన్ కాంగ్రెస్ వాదులమైన మేము, ఫార్వర్డుబ్లాక్ వారు మాత్రమే అందులో మిగిలిపోయాం.

ఆయన వ్యక్తిత్వం ఎలాంటిది ? అనే విషయాన్ని వివరించాలంటే, మూడేండ్ల మా ఉభయుల మధ్యవున్న సన్నిహితమైత్రి రీత్యా ఏ కొంచెంగానో క్లుప్తీకరించి చెప్పటం సాధ్యంకాదు. బాపు మాదిరిగానే తన మిత్రుల్ని ఎలా ప్రేమించాలో, ఎలా గౌరవించాలో అనే విషయం, ఆయనొక్కడికిమాత్రమే తెల్సు. ప్రతిస్వరాజ్య వీరుడు ఆయనకు అత్యంత సన్నిహిత మిత్రుడు కావటంవలన, కొన్ని సందర్భాలలో ఆ సన్నిహితత్వం అనేక రాజకీయ చిక్కుల్ని కల్పించిందికూడ. తనతోటి ఉన్నత స్థాయిలో జరిగే రాజకీయ చర్చలలో, రసాభాసలలో నిర్మొగమాటంగా భేదించే సహచరులతో సహితం, ఎంతో స్నేహంగానూ ఎంతో ఆదరంగానూ ఉండటం, ఆయనలోనే చూడగలిగాను. ఆయన వ్యక్తిత్వం, గాంభీర్యంతోనూ, విజ్ఞానంతోనూ కూడి వుండటమేకాక, అభిమానం, ప్రేమ, సాటిలేని విధేయతల కలయికల సమ్మేళనం కూడ. ఉన్నత

స్థాయిలో వున్న కొద్దిమంది తమ సర్వస్వాన్ని అదే ఆశయం కోసరం త్యాగం చేసి నప్పటికీ, ఏదో వ్యక్తిగతమైన సేవాపరాయణత్వాన్ని, వ్యక్తిగత ధోరణిలోనే ప్రదర్శించటంగానీ, బహియమైన నాయకుల సమాఖ్యలో పరస్పర విధేయతలు ప్రదర్శించుకోవటంగానీ, పరస్పర ప్రేమకు కట్టుబడటంకానీ బహు అరుదుగా గోచరిస్తుంది. కానీ సుభాస్‌బాబు మాత్రం ఆ ప్రేమని, మైత్రిని ఎంతగా చూపెట్టే వాడంటే, ఒక్కొకప్పుడు మా మధ్యనున్న అభిప్రాయభేదాల్ని సహితం మర్చిపోయి, మా ప్రతిఒక్కరి ఆనందాన్ని ఆయన్ను తృప్తిపెట్టేంతవరకు, అతివాద ఐక్య సంఘటన సంస్థలో కానీ, కాంగ్రెసు నాయకత్వంలో కానీ, మరో సహచరునికి ఈ ఘనత దక్కలేదు. మార్క్సిజాన్ని ఆమూలంగా అర్థం చేసుకోవటంలో కానీ, ప్రజాసంఘాలు స్థాపించటంలోకానీ, ప్రజాస్వామ్య సాహిత్య విషయంలోగానీ. సిద్ధాంత - వేదాంత - చరిత్రల సంబంధంగా కానీ, మాలోని కొంతమందికి బాగా తెల్సుననే ఆలోచనలు వుండేవి. మాలో కొంతమందిమి అంతకంటే మంచి వుపన్యాసకులం, సమర్థమైన సంఘ నిర్మాతలం లేక అన్నింటిలో సామర్థ్యంగల వాళ్ళం వున్నాం. అనేక మంది ఏ మాత్రం తీసిపోనీ ధైర్య సాహసాలు త్యాగాలు ప్రదర్శించినవారూ వున్నారు. ఇంకా యితర విషయాలలో అనేక మందికి అంతకంటే అధికమైన అవకాశాలు పుట్టుకతోనే వున్నయ్. అయినప్పటికీ ఆయన్ను, విప్లవ వీరోచిత సాంప్రదాయాల చిట్టి బాబుగా, జాతీయ స్వాతంత్ర్య సమర ధృవ తారగా ఎంతో సంతోషంగా మేం ఎందుకు ఎంచుకున్నామంటే, ఆయన అటువంటి చక్కని మిత్రుడు - సహచరుడు - వీరులమధ్య వీరుడు.

1938-39 సంవత్సరాల మధ్యకాలంతో ప్రపంచ యుద్ధం విధిగా వచ్చి తీరుతుందని సుభాష్‌బాబు, మాలో చాల మందిమి నిశ్చయించుకున్నాం. అంతేకాకుండా "మ్యూనిచ్ ఒడంబడిక" అగౌరవం పొందింది కాబట్టి, ఇక అది యుద్ధ నివారణకు తోడ్పడలేదని కూడా నిశ్చయించుకున్నాం. అందుకని; రాష్ట్రాలలోని కాంగ్రెసు మంత్రివర్గాలని, మొత్తంగా కాంగ్రెసుని, బ్రిటీషు ప్రభుత్వం మన మంత్రి వర్గాలను రద్దుచేసి తమ సామ్రాజ్య నిరంకుశత్యాన్ని యధావిధిగా సాగించే సాహసం చూపెట్టే పక్షంలో, భారత స్వాతంత్రాన్ని ప్రకటించుకునే నిమిత్తం ప్రజల్ని సమాయత్తంచేసే తక్షణ కార్యక్రమాన్ని ఇవ్వాలని అభ్యర్థించాం. ఇది ఇలావుంటే మరో వైపున కొంతమంది మన పార్లమెంటరీ నాయకులు ఏదో ఒక రకమైన రాజీ కుదిర్చే నిమిత్తం బ్రిటీషువారితో మంతనాలు ప్రారంభించారు.

అయితే బ్రిటిషుసామ్రాజ్యవాదులతో ఏ రాజీచేసుకునే దానికి మేం తయారుగాలేము. అప్పటి కాంగ్రెసు అధ్యక్షహోదాలో వున్న సుభాషబాబు, 1937-వ సంవత్సరపు రాజ్యాంగం, భారతదేశానికి ప్రసాదించే ఫెడరేషన్ విధానాను గుణ్యంగా జరిగే ఏ రాజీబేరాలు సాగవని, ధైర్యంగా తెగవేసి చెప్పాడు. మహాత్మా గాంధీ - జవహర్‌లాల్ నెహ్రూలు కూడా సమానంగానే ఫెడరల్ ప్రణాళికను వ్యతిరేకించారు. కానీ కాంగ్రెసు సంస్థ ద్వారా లేక కాంగ్రెసు మంత్రివర్గాల చేతగానీ, దేశాన్ని బ్రిటీషు వ్యతిరేక పోరాటానికి సన్నద్ధంచేసే ధోరణిలో మాత్రం లేదు. ఈ విధంగా యుద్ధం సమీపించేకొలది. 1936 ఢిల్లీ అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశంలో విషయం చర్చకువచ్చింది. ఏ విధంగా తాను పార్ల మెంటరీ ప్రతిపక్షంగా వ్యవహరించగలడో లేక జాతీయ విరుద్ధంగా తయారౌతున్న కాంగ్రెసు మంత్రివర్గాలతో మేం పోరాడేందుకు సుభాసు ఏ విధంగా మాకు అనుమతి యిస్తాడో అనే అంశాల మీద మహాత్మా ఆశ్చర్య పోవటమేకాక సుదీర్ఘ ఆలోచనలో పడ్డాడు.

కాంగ్రెసును తిరిగి మంత్రివర్గీయుల హస్తగతం చేయటమా ? లేక సుభాస్ మళ్ళీ కాంగ్రెస్‌నుగానీ మంత్రివర్గాలనుగానీ పోరాటోన్ముఖులుగా చేసేందుకు ఎన్ను కోబడటమా ? అనే సమస్య మీద విభేదాలు విధిగా వచ్చేట్లు కనుపిస్తుండటంలో ఆశ్చర్యపడవలసిం దేమీ లేదు. అందుకని అధ్యక్ష ఎన్నిక ప్రత్యేకంగా ప్రాముఖ్య త వహించింది. కాంగ్రెసు హేమా హేమీ నాయకులంతా ఎంత తీవ్రమైన బాహాట వ్యతిరేకత ప్రదర్శించినప్పటికీ, సుభాస్ తిరిగి ఎన్నిక కావటం ఒక విధంగాఅతివాదు లలోకాంగ్రెస్‌నిజమైన పోరాటపంథాలోఇక పురోగమిస్తుందనే ఆత్మతృప్తికి హేతు వైనప్పటికీ,పరోపై పునఅకస్మాత్తుగా మహాత్మాగాంధీతనసవాల్‌తోముందుకురావటం వలన,ఇకఅప్పుడు బోస్- గాంధీలలో ఎవరు ప్రధానమో ఎంచుకోవలసిన గడ్డు పరీక్షకాంగ్రెసుకు ఏర్పడింది. ఆ సందర్భంగా మాలోచాలమందిమి మహాత్మాగాంధీ చూపిన ధోరణి అన్యాయమని భావించాం. ఏమైనప్పటికీ తక్షణ భారత స్వాతంత్ర్య సాధన నిమిత్తం, బ్రిటన్‌తో పోరాడేందుకు దేశాన్ని సమాయత్తం చేసే విషయంలో అధిక సంఖ్యాక కాంగ్రెస్‌వాదులు తమ వివ్యక్తధర్మాన్ని మరచి మహాత్మాజీనే అనుసరించ నిర్ణయించుకున్నారు. 1939-వ సం।లో జాతీయ సమరాన్ని ప్రారంభిం చాలని మేం నిర్ణయించుకున్న తరువాత అయిదారు మాసాలకు జరిగిన సంఘటనలు మా వాదాన్ని బలపరిచాయి. ఎలాగంటే, మాలో చాలామందిమి ఊహించినట్లు

1939 సెప్టెంబరులో యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా ప్రజ్వరిల్లింది: కాంగ్రెస్ తోకానీ, కాంగ్రెస్ మంత్రివర్గాలతో కానీ సంప్రదించకుండానే వలస విధానంలో వున్న భారతదేశంలో, తమ పలుకుబడి ఎలా వుంది వ్యక్తంచేసుకుంటూ, ఇంగ్లాండు భారతదేశాన్ని యుద్ధరంగంలోని కీడ్చింది.

కాంగ్రెసు నాయకులు ప్రదర్శిస్తున్న అసంబద్ధమైన, దౌర్భాగ్యమైన మంత్రి వర్గాల మోజుతోపాటు, బ్రిటీషువారు తీసుకున్న ఈ క్రౌర్యనిర్ణయానికి దేశం ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందింది. సుభాష్ బాబు కాంగ్రెసు అధ్యక్షస్థానానికి రాజీనామా ఇచ్చి దేశాన్ని పోరాటానికే తయారుచేయటం మంచిదని చేసుకున్న నిర్ణయం, నన్ను ఉత్తేజపూరితుణ్ని చేసింది. బ్రిటీషువారితో పోరాడేందుకు స్వతంత్రప్రతిపత్తి గలిగిన నాయకత్వం అవసరమని గుర్తించి మాలో చాలా మందిమి బాహాటంగా సుబాస్ శ్రేణిలో చేరాం.

ఆయన ఇటువంటి భయంకర వాతావరణంలో వున్నపుడు, కాంగ్రెసు కార్యవర్గం కాంగ్రెసు మంత్రివర్గాలను రాజీనామా లివ్వమని కోరింది. అయితే ఈ మాత్రమే సరిపోతుందా ? ప్రజాహృదయాల్ని చూరగొనటానికి ఇంతకంటే అదనంగా ఏదోచేసి చూపెట్టాలని మహాత్మ అభిప్రాయపడ్డాడు. అలా యుద్ధభయాన్ని ప్రజలమధ్య ప్రదర్శించాలనుకున్నాడు కూడ. అందుకని ఆయన వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు. 75000ల మంది కాంగ్రెసువారు దానిలో పాల్గొనేందుకు అనుమతిచ్చాడు.

బాపు ఆలోచన ఏమంటే, ఆ ప్రసిద్ధపోరాటం కాంగ్రెసు వ్యతిరేకత ప్రదర్శించేవారి ఆటకట్టిస్తుందని. అయితే, ఆ ఆలోచన ప్రజలలో అంతగా పని చేయలేదు. కారణం వారు సామ్రాజ్యవాదంతో పోరాడేందుకు ఒక తీవ్రమైన కార్యక్రమాన్ని వాంఛించారు.

నేను 1940 మార్చి 31వ తేదీన జైలులో నిర్బంధించబడ్డాను. ఏప్రియల్ ఆరవతేదీన "జాతీయవారం" జరిపినందుకు సుబాషకూడా అరెస్టు చేయబడ్డాడు. ఇక అంతటితో బీహార్ రైతుమహాశయులు కోపోద్రిక్తులై లేచారు. సుదీర్ఘకాలంగా ఊహించుకుంటున్న స్వతంత్రపోరాటం, అలా అతివాద ఐక్యసంఘటనాసంస్థ ద్వారా ప్రారంభించబడిందని మహాత్మా, ఇంకా అనేకమంది మావట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. ఫర్వాలేదు-ఆ తర్వాత కొద్దిమాసాల వ్యవధికే సామ్రాజ్యవాద యుద్ధానికి కాంగ్రెసు మద్దత్తులేదని తెలిపే నిమిత్తం వ్యష్టి సత్యాగ్రహాన్ని ప్రకటించాడు.

ఆ సందర్భంలో సుభాస్‌బాబు మహాత్మాజీ తీసుకున్న ఈ కార్యక్రమానికి కొంతవరకు తృప్తిపడి, కాంగ్రెసు ఆ కార్యక్రమాన్నే గనుక భారతదేశంలో ఎడతెరిపి లేకుండా సాగిస్తున్నట్లయితే, పోరాటాన్ని పటుతరం చేసేందుకు తాను ఇతర దేశాలకు వెళ్ళి ద్వితీయరంగాన్ని ప్రారంభించాలని అనుకున్నాడు. అలా గయితే, ఎంతోకాలంనుంచి కాంగ్రెసులో గాంధీజీ - ఆయన సహచరులకు-బోస్ ఆయన సహచరులకు మధ్యనున్న అభిప్రాయభేధాలు త్వరలో సమసిపోతాయని కూడా ఆయన ఆశ.

1940-42 మధ్య జరిగిన ఈ సంఘటనలన్నీ అమూల్యమైన కాలాన్ని వృధాపరిచినయ్. ఈ క్లిష్టసమయంలోనె ప్రపంచసంఘటనలు భయవ్యవస్థనుంచి విభ్రాంతి వ్యవస్థకు నడిపించాయ్. యుద్ధ ప్రారంభదశలో తన జాతీయ అంత ర్జాతీయ స్వార్థాన్ని చూసెట్టుకుంటూ, కమ్యూనిస్టు సమాజ భద్రత నిమిత్తం, నాజీ జర్మనీతో నిరాక్రమణ లేక నిర్యుద్ధసంధి జేసుకొని, మొదట పోలాండును, జర్మనీ ఆక్రమించుకునేదానికి దోహదం కల్పించి, దానిలో సగభాగం తానుకూడా వాటా పుచ్చుకుని, తదుపరి ఆగ్నేయ ఐరోపాలోని మూడు బాల్టిక్ రాజ్యాలను దిగమ్రింగ టాన్ని సహించి, రణతంత్రరీత్యా ఫిన్లాండ్‌లోని సగాన్ని గుటకాయ స్వాహా చేసేట్లు జర్మనీకి అవకాశాల్ని కల్పించి, సోవియట్ రష్యా, తనమీద ఆధారపడిన ప్రపంచరాజ్యాలలోని పార్టీలన్నీ, ఆ యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధంగా భావించారు. కాబట్టి, వలసరాజ్య జాతీయ పోరాటాలను బలపర్చటానికి తీర్మానించు కోవటం కూడా జరిగింది.

భారతదేశంలోని కమ్యూనిస్టులుకూడా, కాంగ్రెస్‌కు భిన్నంగా భారతదేశంలో పోరాటానికి కావలసిన స్వతంత్ర నాయకత్వాన్ని గాఢంగా వాంఛిస్తున్నట్లు నటించి అతివాద ఐక్యసంఘటనాసంస్థలో చేరారు. అయితే ఏ క్లిష్టపరిస్థితుల్లోనైనా, మేం జైళ్ళలో పడకుండావుంటే, ప్రజలలో మాకున్న పలుకుబడిని వినియోగించి కిసాన్ కాంగ్రెసు వాదులమైన మేము, సోషలిస్టులు, ఫార్వర్డ్‌బ్లాక్‌వారు సుసంఘటిత నిర్మా ణాత్మకశక్తి గలిగివుండి, ఒక చక్కని పోరాట కార్యక్రమాన్ని ఇచ్చి, ఉద్య మాన్ని నడిపించగలరనే అనుమానం భయంకోవున్న కమ్యూనిస్టులు: తమలోని అధికసంఖ్యాకుల్ని ప్రవాసంలో అట్టిపెట్టి, కొద్దిమందిని మాత్రమే మాతోకలిపి, మమ్మల్ని బలవంతపెట్టి ఏదో ఒక పోరాటకార్యక్రమానికి ఉపక్రమిస్తే, అప్పుడు

ప్రభుత్వం దమననీతి చూపిస్తే మేం జైళ్ళలో నిర్బంధించబడితే, మా పరోక్షంలో రెచ్చిపోయిన ప్రజా జీవితాన్ని, ప్రజా కార్యక్రమాల్ని, తుదిపోరాటం ద్వారా ప్రవాసంలోని తమ అధిక బలంతో, తమ హస్తగతం చేసుకుని, ఎర్ర సైన్యాలను భారతదేశానికి ఆహ్వానించి, బ్రిటీషువారిని ఓడించి, భారత ఆధిపత్యాన్ని స్వీకరించి భారతదేశంలో ఆ విధంగా కార్మిక నియంతృత్వాన్ని స్థాపించాలని, కమ్యూనిస్టులు ఒక దురభిప్రాయానికి వచ్చారు. సోషలిస్టులు దీన్ని వాసనబట్టి, రాంఘర్‌లో జరిగిన రాజీ వ్యతిరేక మహాసభకు వచ్చి సహకరికచేదానికి నిరాకరించారు. నేను కూడా కమ్యూనిస్టులతో భేదించటానికి నిర్ణయించుకున్నాను. ఎందుకంటే, ఏ విధంగా మా స్వతంత్ర పోరాటం అతివాద ఐక్యసంఘటనా సంస్థ నాయకత్వాన సాగించబోతున్నామో అనే అంశంమీద చర్చించే నిమిత్తం వార్ధాలో నేను, ఆ పార్టీ నాయకుడైన శ్రీ ఎ. కె. ఘోష్ను బాపూ దగ్గరకు తీసుకుపోయినప్పుడు: నిర్మాణ పోరాటానికి సంబంధించినంతవరకు ఏ పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు పార్టీ అహింసా విధానానికి కట్టుబడివుండదని, శ్రీ ఘోష్ బాపూకు స్పష్టపరిచాడు. అంతే కాకుండా ఈ వాస్తవిక విషయాలన్నీ సుబాస్‌బాబు దృష్టికి వచ్చిన వెనువెంటనే కమ్యూనిస్టులతో చేరిన మా స్వతంత్ర పోరాటం అహింసాత్మకంగా సాగించబడుతుందని ప్రజలకు మనం హామీ యివ్వటం ఏమంత బాగుండదని ఆయన ఆమోదించాడుకూడా. పై చెప్పిన ప్లాన్‌తో "ప్రొలిటేరియన్‌పాత్" అనే కమ్యూనిస్టుల రహస్య సిద్ధాంత గ్రంథం సుబాస్ చేతుల్లో బడింది. కమ్యూనిస్టులతో ఈ పరిస్థితుల్లో కలిసి వుండేదానికి వీలులేదని సుబాస్ నిర్ణయించుకోవటానికి ఆ మాత్రం ఆధారంచాలు. ఈ విధంగా అతివాద ఐక్య సంఘటనా సంస్థ విచ్ఛిన్నం కావటమే కాక, బ్రిటిష్ వారితో అహింసాత్మకంగా పోరాటం సాగించేదానికి ప్రత్యామ్నాయ నాయకత్వం కోసరం మేం చేసిన ప్రయత్నాలన్నీ ఇలా భగ్నమైనయ్.

అధిక సంఖ్యాకుల్ని చిందరవందర చేయటానికి ఈ అనుభవాలు చాలు. యథార్థానికి ఈ సంఘటనల వలన మంచి సమర్థులైన కొంతమంది స్నేహితుల సహకారం కూడా మాకు దూరమైంది.

భారతదేశంలో నాయకత్వం నిమిత్తం జరుగుతున్న నిత్య సంఘర్షణ తొలగించటం, బ్రిటీషువారికి వ్యతిరేకమైన ఇతర స్వతంత్ర రాజ్యాలలో వారి యుద్ధ పరిహారాన్ని-పరికరాల్ని వినియోగించుకోవటం అనే, ద్వివిధ కార్యసాధన

నిమిత్తం ఆ క్లిష్టపరిస్థితుల్లో తనచుట్టుకు తాను దేశాంతరుడై కార్యక్రమాన్ని ప్రారంభించాలని సుభాస్ నిర్ణయించుకున్నాడు.

సుభాస్‌బాబు రహస్యమార్గాన బ్రిటీషువారి ఇనుప హస్తాలనుంచి వారిని మైమరపించి, దేశాంతరుడు కావటాన్ని చూచి నేను తిరుచునాపల్లి జైలులోవుండి నిట్టూర్పు విడిచినప్పటికీ, ఒకగొప్ప రాజకీయ ప్రజ్ఞాధురంధరుని మాదిరిగా సుభాస్ బాబు రొంపినించి బైటపడ్డందుకు, అలా భారత స్వతంత్ర ఉద్యమం ద్విగుణీకృతంగా సాగబోతున్నందుకు సంతోషపడ్డాను. 1942 మార్చి-ఏప్రియల్ మాసాలలో వార్ధాలోనూ, ఢిల్లీలోనూ మహాత్మాజీతో సంభాషించిన అనంతరం, దేశాంతరుడైన సుభాసుబాబు తీసుకున్న కార్యక్రమ ప్రాముఖ్యతనుబట్టి నా ఆశలు పటుతరమైనయ్. సుభాసుబాబుకు నాకు మధ్యవున్న స్నేహసంబంధాలన్నీ బాపూకు తెలియనివి కావు. కాబట్టి సుభాస్ క్షేమంగానూ సురక్షితంగానూ ఉన్నాడని, తన ప్రత్యేక పంథాలో ప్రత్యేక ధోరణిలో ఆయనిచ్చిన రేడియో ఉపన్యాసాన్ని ఒకరు విని, అది సుభాసు కంఠమేనని తనకు స్పష్టపరిచారనీ నాకు హామీయిస్తూ, ఒక విధంగా రాజకీయ విభేధాలున్నప్పటికినీ, తానింకా సుభాస్‌బాబును యథావిధిగా ప్రేమిస్తున్నానని బాపు చెప్పాడు. అయినప్పటికీ, నేను సుభాస్‌బాబుకు అత్యంత సన్నిహిత మిత్రుడ్నిగావున్నా, ప్రజాయుద్ధంగా చిత్రించుకుని నినాదమిచ్చి కమ్యూనిస్టులు ధోరణి మార్చుకున్నందుకు, కాంగ్రెసు నాయకత్వంలో సహకరించే విషయంలో నేను వెనుకంజవేయలేదు. కాబట్టి నేను అంతకంటే అధికంగా ఆయన ప్రేమ పాత్రుడ్ని కాగలిగాను. ఈ విధంగా నామాదిరిగానే అనేకమంది కాంగ్రెసువు, సుభాసుబాబుకు విశ్వాసపాత్రులుగా వుండేట్లు బాపూ సహాయం లభించింది.

భారత కమ్యూనిస్టులు భావించిన దానికి భిన్నంగా సోవియట్ రష్యా పరిపాలకులు సుభాస్‌కు కావలసిన ప్రోత్సాహం — మద్దత్తు ఇవ్వటమే కాకుండా, ఉన్నతమైన జాతీయ అంతర్జాతీయ ప్రాముఖ్యతరీత్యా నాజీ పరిపాలకులను చేరేందుకు సుభాస్‌కు తగిన సహాయం కూడా చేశారు. నాజీ ఫాసిస్టు శక్తులు ఆయన్ను భారత మహానాయకుడుగా గుర్తించి, భారతజాతీయ సైనికనిర్మాణం నిమిత్తం, మనుష్యుల్ని సేకరించుకునే అధికారంఇవ్వటమేకాక, ఆయన్ను ఒకబాధ్యతకలిగిన భారత పెద్దగా భావించి, సంధులు కూడా చేసుకున్నారు. భారత స్వతంత్ర పోటీప్రభుత్వాధినేతగా ఆయన పెంపొంది ఒక సబ్మెరిన్‌లో బర్మా-మలయాలను చేరుకుని ఆగ్నేయాసియాలో ప్రశస్తి పొందిన అజాద్ హింద్ ఫౌజును స్థాపించి తానే దానికి సర్వసేనాధిపతియై

నేతాజీగా స్తుతించబడి, భారత స్వతంత్ర ప్రభుత్వానికి కావలసిన సాధన సంపత్తిని అమోఘమైన స్వతంత్ర ప్రతిపత్తితో సముపార్జించే కార్యక్రమానికి ఉపక్రమించి, భారతీయుల ప్రాణాల్ని-ఘనతని-గౌరవాన్ని, ఆస్థి - పాస్తుల్ని పోషించగలిగిన స్థాయికి, తన శక్తి స్తోమతలను పెంపొందించుకొని, నాజీ-ఫాసిస్టు జపాన్ శక్తులతో అత్యంత గౌరవప్రదమైన ధోరణితో వ్యవహరించి, జపాన్ ఆక్రమిత ప్రాంతంలో భారత పౌరులకు ప్రత్యేక రాజ్య ప్రతిపత్తిని నేతాజీ సాధించిపెట్టిన ఈ వ్యవహారమంతా అత్యంతాశ్చర్యకరం. నేతాజీ యిచ్చిన ప్రముఖ నినాదాన్ని శిరసావహించి, హృదయపూర్వకమైన విప్లవాత్మక సహకారాన్ని, ఆదేశాలలోని లక్షలాది భారత ప్రజానీకం ఇవ్వటాన్ని, రేడియో ఉపన్యాసాలద్వారా భారతదేశం లోని ప్రజలు తెల్సుకుని ఎంతో ఉత్తేజ పూరితులయ్యారు. ఇదంతా కూడా ఆ మహత్తర వ్యక్తిత్వంలో మూర్తీభవించిన ఒక విశేషం. నిర్దుష్టమైన ఆయన వాగ్ధోరణి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో ఆయనకున్న ఆరని పిపాస, తిరుగు లేని ఆయన వీరత్వం, కేవలం సైనిక బృందాల్లోనేగాక సామాన్య పౌరుల్లో కూడా, తాము సృష్టించుకోదొలచే స్వతంత్రభారత ప్రభుత్వ వ్యవస్థాపనకు తమ సర్వ స్వాన్ని అర్పించుకుంటున్నారనే వార్తలు, ఇక్కడ మన ప్రజానీకంలో కాంగ్రెస్ వారనుసరిస్తున్న మందగొండి తనాన్ని తీవ్రంగా నిరశించేంతవరకు దోహదం కల్పించినయ్.

ఈ మధ్య కాలంలో యుద్ధం వక్రగతికి దారితీసింది. రష్యనులు,ప్రపంచంలో వున్న తదితర కమ్యూనిస్టులు, జర్మనీ వచ్చి నియంత రష్యామీద యుద్ధంప్రకటించ టంతో నాజీలకు వ్యతిరేకంగా వుండాలని తీర్మానించుకున్నారు. కాబట్టి అప్పటి వరకు కాంగ్రెస్‌ను - కాంగ్రెస్ నైతిక మేధను బలపరుస్తున్న భారత కమ్యూనిస్టులు ఆ యుద్ధాన్ని ప్రజాయుద్ధంగా చిత్రించి, తమ సామ్రాజ్య వ్యతిరేక కార్యక్రమా లన్నింటినీ రద్దుచేసుకుని, బ్రిటీషు ప్రభుత్వాన్ని దాని తాబేదార్లను హృదయపూర్వ కంగా బలపరిచే కార్యవిధానాన్ని చేబట్టారు. ఈ సమర్థనీయంకాని పరిస్థితుల నుంచి కోలుకోవటం ఎలాగని, భారతీయ మనస్తత్వ రీత్యా అప్పటి భారత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షురాలైన భారతీదేవిగారు, భారత ప్రభుత్వాలు ఆలోచించారు. అందుకని ఆమె—ఆమె సహచరులు భారతదేశంలో మంత్రివర్గాలమీద, అంతర్జా తీయ వ్యవహారాలమీద, తక్షణ కార్యక్రమాల మీద సంపూర్ణాధికారాలతో, భారత దేశంలో ఒక జాతీయ ప్రభుత్వం ఏర్పడినట్లయితే అప్పుడది ప్రజాయుద్ధమౌతుంది గాని, మరో విధంగా కాజాలదని విశ్వసించారు,

కిసాన్ ఉద్యమాలలో తగినంత అదనపు బలాన్ని పొందగలిగిన వ్యవధి నిమిత్తం, తాత్కాలికంగా మాత్రమే కమ్యూనిస్టులు ఆమె ధోరణిని అంగీకరించటం జరిగింది. దురదృష్టవశాత్తు స్వామీసహజానంద, ఇందూలాల్‌యాజ్ఞిక్‌లు విడుదల అయినంతనే వారు కమ్యూనిస్టులతో చేతులు కలిపినందున ఫార్వర్డ్‌బ్లాక్, కిసాన్ కాంగ్రెస్ వాదులు కమ్యూనిస్టులతో భేదించవలసి వచ్చింది. ఈ విధంగా బ్రిటీషు వారిని బలపరిచే కిసాన్‌సభ, కాంగ్రెసును బలపరిచి బ్రిటీషువారితో పోరాటం జరుపాలనే కిసాన్‌కాంగ్రెస్ ఇలా రెండు సంస్థలు ఉద్భవించినయ్.

అసంఖ్యాక ప్రజానీకానికి సత్యాగ్రహ కార్యక్రమాన్ని తప్ప, అంతకు మించి వారిలో సాధారణ అసంతృప్తిని కోగొట్టగలిగి,తప మార్గంలోనే నడిపించటమనేది మహాత్మాగాంధీకి గానీ, కాంగ్రెస్‌కుగానీ అసంభవంగా కనుపించింది. బ్రిటీషు వారి సామ్రాజ్యతత్వాన్ని గురించి, ఇకనేమాత్రం ఆలోచించటంకూడా వారికి సాధ్యపడలేదు. కాబట్టి 1942 ఆగస్టులో క్విట్‌ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించ నిర్ణయించుకున్నారు. కిసాన్ కాంగ్రెస్ వాదులమైన మనమంతా ఆ మహా ఉద్యమంలోనికి పరుగులు తీశాం. మాత్ృభూమి కర్పించవలసిన ఎటువంటి త్యాగానికైనా మనం వెనుదీయలేదు. ఒకవైపున మాకత్యంత సన్నిహిత సహచరుడు, మిత్రుడైన నేతాజీ ఒక అమోఘమైన కార్యక్రమాన్ని స్వీకరించి, ఉద్యమాన్ని నడుపుతున్న సందర్భంలో, మేం కూడా అటువంటి కార్యక్రమాన్ని ఇక్కడ స్వీకరించినందుకు తృప్తిపడినాం. అద్భుత చైతన్యాన్ని కల్పించిన క్విట్‌ఇండియా ఉద్యమం, నేతాజీ బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని సమూలంగా నాశనం చేయాలని, తలపెట్టిన పోరాటానికి అత్యున్నతమైన, గౌరవమైన అవకాశాన్ని కల్పించటమే కాకుండా ఆయన అంచనాలుకూడాకార్యసాధనానుకూలంగానేవున్నట్లుకనుపించినయ్.

1921వ సంవత్సరంలో ఇంగ్లాండులోని ఇండియన్ల వార్షిక సమావేశవేదిక మీద సివిల్ సర్వీస్‌లోని సభ్యుడుగా సుబాసుబాబు, ఆయనకంటె కొంచెం వెనుకగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చేరిన నేను మాట్లాడుట సంభవించిన తరువాత, మా ఉభయులకూ మిత్రులైన కొందరు అదొకరకమైన భయాన్ని చూపెట్టారు. మేము ఉభయులం కూడా భారతదేశానికి వేల్సు యువరాజు రాకను బహిష్కరించుటకు తీసుకున్న చర్యల్ని సంయుక్తంగానే సమర్థించాం. యూనివర్శిటీ విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో, ధైర్యసాహసాలు కలిగిన ప్రముఖుల్లో, ఆయనొకడని మాత్రం నాకు తెల్సు.

కాంగ్రెస్ మహాసభలు జరుగుతున్న సందర్భంలో రెండవసారి కరాచీలో ఆయన్ను కల్సుకున్నాను. ఒకవైపున గాంధీ-ఇర్విన్ సంధిచేసుకుంటూనే బ్రిటీషు దౌష్ట్యలు మరోవైపున భగత్‌సింగ్‌ను ఉరితీయటాన్ని ఖండించటానికి, ఆయనతో పాటు నేనూ ఆమోదించాను. అందుకనే ఆయన సమావేశానికి హాజరయ్యాను. అనేకమంది ఇతర విప్లవవాదులతోపాటు నేనుకూడా పోరాటానికి సంబంధించిన వివిధ దృక్పథాల్లో తర్కించే నిమిత్తం వెళ్ళాను. గాంధేయమార్గానికి భిన్నంగా స్వాతంత్ర్య సముపార్జనకు అనుసరించాల్సిన పంథాను గురించి ఆయన ఆలోచిస్తున్నపుడు, కాంగ్రెస్ జారీచేసిన ప్రాథమిక హక్కుల సూత్రావళి ఎడల నాతృప్తిని వ్యక్తంచేసి 'స్వరాజ్యం ప్రజాయత్తం' అన్న ధోరణిలో అభివృద్ధి పొందేందుకు ఆ విధానాలు దోహదంగా వుంటవని చెప్పాను. సుబాసు ఆమోదించాడు కానీ, ఆయన హృదయం స్వాతంత్ర్య సముపార్జన నిమిత్తం తీసుకోవలసిన చర్యలు, కార్యక్రమంపై పరుగులు తీస్తుంది. మార్క్సిజాన్ని గురించి కమ్యూనిస్టుల ఎత్తుగడల గురించి సుదీర్ఘమైన తర్కం జరిగిన తరువాత, మే ముభయులం దగ్గరగా వున్నామని పరస్పరం అర్థం చేసుకున్నాం. విప్లవ కార్యక్రమానికి రైతాంగాన్ని కూడా సమీకరించాలన్న విషయంలో ఆయన నాతో ఏకీభవించాడు కానీ, అది వారి దైనందిన అవసరాలను తీర్చగలిగిన పునాదులమీద ఉండాలని, అసంఖ్యాక రైతాంగం విషయంలో కమ్యూనిస్టుల విరుద్ధధోరణి ఎంత అసంబద్ధంగా వున్నదో, ఆ విషయాన్నికూడా గుర్తించుకున్నాం. అయితే భారత రాజకీయాల్లో మా ధోరణికి సంబంధించినంతవరకు ఒక గొప్ప బేధముంది. ఆయన గాంధేయ విధానాలను ఆమోదించడు. అంతేకాకుండా గాంధీనాయకత్వం తగినంత వేగంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టలేదని ఆయన భావిస్తుంటే, ఈ విషయంలో నేను ఎందుకు భేదిస్తున్నానంటే, ఏ విధంగా మహాత్మాజీతో భారత రైతాంగం సంబంధాలను కలిగివున్నారో, దేశస్వాతంత్ర్యానికి ఆయన నాయకత్వావస్యకత ఎంతో నేను గుర్తించాను.

అయినప్పటికీ మేముభయులం ఒకరితో ఒకరు సహకరించు వేదానికి ఆమోదించుకున్నాం. అంతే కాకుండా ప్రజాసంఘాల్ని అభివృద్ధి చేయాలనే అంశం మీద ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరిగినయ్. కిసాన్ రంగంలో నిపుణుడైన సహచరుడుగా తీసుకోవటానికి ఆయన ఆమోదించాడు. ఇంతలోనే ఆయన జైలుకు ఆ తరువాత యూరప్‌కు పోవలసిన పరిస్థితు లేర్పడినయ్. ఆయన వియన్నాలో

81696

వున్నపుడు మా ఉభయులకు మిత్రుడైన ఒక వైద్యవిద్యార్థి రాజకీయ కార్యకర్త కాకపోయినా మా రాజకీయ వ్యవహారాల్లో శ్రద్ధని చూపెడుతున్నందుకు, ఆయన ద్వారా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుకున్నాం. ఆవిధంగా 1934-35 సం లలో పరస్పరంగా నిత్యసంబంధాలు పెట్టుకున్నాం. జమిందారీ ప్రాంతాలలోని స్థితిగతులమీద, నిరంతరాయంగా ప్రజాపోరాటం నడుపగలిగిన ప్రోత్సాహాన్ని కల్గిస్తూ, నేను "జమిందారీ రైతుల ఆర్థిక స్థితిగతులు" అను గ్రంథాన్ని వ్రాస్తే దానికి ఆయన పరిచయ వాక్యాలు వ్రాశాడు.

మే మొకప్పుడు వార్ధాలో బజాజ్ భవనంలో మకాం పెట్టాం. మూడు మాసాల కొకమారు నేను బాపూను చూచే అలవాటు వుంది. 1937-39 సంవత్సరాల మధ్యకాలంలోని క్లిష్టపరిస్థితుల్లో నేను బాపూను చూచినపుడల్లా నా మీద ఏవో కొన్ని ఫిర్యాదు లుంటుండేవి. లేకపోతే కాంగ్రెస్ మంత్రివర్గీయులు, నేను సమాధానం చెప్పుకోవలసిన కొన్ని ఫిర్యాదులు నా మీద - కిసాన్ కాంగ్రెస్‌మీద పెట్టి వుంచేవారు. ఈ ఫిర్యాదులన్నింటినీ బాపూ తన వద్ద అట్టి పెట్టుకుని, నేను ఆయన్ను సందర్శించినపుడెల్లా సంజాయిషీలు చెప్పుకుని జవాబులు రాబట్టుకోవలసిన, ప్రధాన ఫిర్యాదు లేమిటో, ఏరి నిర్ణయించుకునేవాడు. ఆయన నాకు పోస్టుద్వారా ఆ ఫిర్యాదుల్ని ముందుగా పంపించే విషయంలో ఎప్పుడూ బాధపడేవాడు కాదు. ఎందుకంటే వాటిని బైట పెట్టి నా విషయాలను బ్రిటీషు సి.ఐ.డీ. ల దృష్టికి తేవటం ఆయనకు యిష్టముండేది కాదు. ఈ మార్చు కృష్ణాజిల్లా జమీంధారీ ప్రాంతాల్లో, జమీందార్లు కొంతమంది రౌడీలను మేపి, దౌర్జన్య హింసాకాండ సాగించిన సందర్భంలో, దాన్నెదుర్కొనే విషయంలో నేను రైతులకిచ్చిన ఉపన్యాసాల గురించి, సంజాయిషీ యివ్వాల్సి వచ్చింది. జమీందార్లమీదకు రైతులను ఉసికొల్పి దౌర్జన్యాలకు కారకుడినైనానని, మద్రాసు ప్రధాన మంత్రి అయిన శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులైన డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య పంతులుగారు, ఈ ఉభయులు విశ్వసించినట్లుగానే నేను కాంగ్రెస్ నుంచి బైటపడతానని, ఆంధ్ర కాంగ్రెస్‌వర్గాలలో కొన్ని ప్రబలమైన వదంతులు బయలుదేరినవి.

నాకు బాపూ పిలుపు వచ్చింది. సుబాస్ అంతకుముందే అక్కడవున్నాడు. "రాష్ట్రపతిరాక ఏమైనా అభ్యంతరకరమా" అని ఆయన నన్నుఅడిగినాడు. "లేదు ఆయన సమక్షాన్ని నేను ఆహ్వానిస్తున్నా" నని నే నన్నాను. క్రమంగా ఆయన

చర్చలు పొడిగించి నా ఉపన్యాసాల ప్రసక్తి తెచ్చి, "అవి నీవే చేసివున్నట్లయితే పరిస్థితి అంధకారబంధురంగా వుంద" న్నాడు. సుభాస్‌బాబు జోక్యం కల్పించుకుని, "ఒక వేళ అందిన భోగట్టా సరైనది కాకపోవచ్చు; లేక సి.ఐ.డీ. లు దాన్ని తయారుచేసి వుండవచ్చు" అని అన్నాడు. "రైతులు భోగట్టా నిచ్చే విషయంలో అంత ఖచ్చితంగా వుండకపోవచ్చు. అయితే అటు వంటి జాగ్రత్త తీసుకునే విషయంలో నేనప్పుడు తయారుగా లే" నని చెప్పాను. అప్పుడు బాపు "పరిస్థితి అలావుంది" అన్నాడు. అందు కాయనతో ఏకీభవిస్తూ "నేను చెప్పింది, చేసిందంతా కూడా రైతుల సాంప్రదాయ సిద్ధమైన అహింసా విధానంతో ఉన్నద"ని సమర్థించు కున్నాను. అప్పుడు సుభాష్‌బాబు "అయినట్లయితే ఆ ఉపన్యాసాలు ఆమోదించ బడినవి. దౌర్జన్యోద్రేకాలకు గురిచేసింది అనే ఫిర్యాదు రద్దుపర్చబడింది" అని చెప్పాడు. "అలానే కావచ్చు; అయితే ఒకరైతు ఒక దొంగను కానీ, దోపిడీగాడిని కానీ, రౌడీని కానీ, సమాజ ద్రోహిని కానీ కాళ్ళుచేతులు బంధించి సమీప పోలీసు స్టేషనుకు అప్పగించటం దౌర్జన్యపూరితమైన చర్యగా బాపు ఎన్నడూ భావించడని నేను నమ్మాను." వెంటనే బాపు "అది కాంగ్రెస్ ఉద్దేశ్యం కాదా?" అని అడిగాడు. అయినప్పుడు "కిసాన్ ప్రజలు ఆ అహింసా ధోరణినే అనుసరించారు. ఒక వైపున వారి నాయకులను చావమోదుతూంటే, కార్యకర్తలను కాల్చివేస్తుంటే, స్త్రీలను అవమాన పరుస్తుంటే నోరుకట్టేసుకుని ఆచరణ సాధ్యంకాని, అహింసా వాదాన్ని అనుకరిస్తూ, పుణ్యదినం కోసరం కాంగ్రెస్ నిరీక్షిస్తుందిలే" అని నేను సమాధానమిచ్చాను. ఇదంతా పరిశీలిస్తున్న సుభాస్‌బాబు "అయితే మీ నిర్వచన ప్రకారం అహింసావాదం చైతన్యపూరితమైంది — శక్తిగలిగిందన్నమాట" అని అన్నాడు. ఈ అవకాశాన్ని తీసుకుని "గాంధీజీ అసలు పెడుతున్న చైతన్యపూరిత మైన శక్తివంతమైన అహింసావాదం అటువంటిదేనని నేను హృదయపూర్వకంగా నమ్మాను"అని అన్నాను. గాంధీజీ బిగ్గరగా నవ్వటం ప్రారంభించాడు. తుదకు నేను వెలుగులో వున్నట్లు భావించుచున్నాను. "రంగా అన్నిట్లో వున్నాడ"ని బాపూ నవ్వుతుంటుంటే ఆయనతో పాటు సుభాస్‌బాబు నేనుకూడా కలిశాం. ఈ విధంగా నా మీద తేబడిన అభియోగం అంతమైంది.

సేవాగ్రామ మందు ఆ సాయంత్రం తిరిగివచ్చే సందర్భంలో సుభాస్‌బాబు నేను ఒకే కారువైపుకు నడిచిపోతున్నపుడు, గాంధీజీ సమక్షంలో యదార్థాన్ని గురించి యిచ్చిన సంజాయిషీకి, ఆయన ఎంతో తృప్తిపడి బాపూ సమక్షంలో

అలాచెప్పి ఒప్పించగలిగినటువంటి వారిని బహుకొద్దిమందిని మాత్రమే చూశాను, అని తన సంతృప్తిని ప్రదర్శించాడు. మేమే నిజమైన గాంధేయ భక్తులమని నాటకమాడుతున్న మితవాదుల ఆటలను అరికట్టేందుకు, తాను చేసే ప్రయత్నాలతో పూర్తిగా సహకరించమని కూడా కోరాడు. ఆ మరుసటి రోజు తేనీరు తీసుకుంటున్నప్పుడు, తాను నేషనల్ ప్లానింగ్ కమీషన్ స్థాపించినందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నాయకులు యెంతగా అసంతృప్తి పొందారో, ఈ సందర్భంగా కోరకుండానే జవహర్‌లాల్, నేషనల్ ప్లానింగ్ కమిటీలో చేరి దానికి అధ్యక్షుడుగా వ్యవహరిస్తూ తనకు ఎలా మద్దతిస్తున్నాడో, ఆ విషయాలన్నీ చెప్పాడు. అప్పుడు ఆయనకున్న బలాన్ని నేను గుర్తించ గలిగాను. బలీయమైన మితవాదుల బారి నుండి నాబోటి సన్నిహిత మిత్రులను ఎలా కాపాడేదానికి నమ్మకమైన ప్రయత్నాలు చేశాడో, ఆంతరంగిక విశ్వాసాన్ని చూపెట్టాడో తనతో సహకరించేదానికి-సన్నిహిత మైత్రికి నిష్కపటమైన ఆహ్వానాన్నిస్తున్నాడో, ఆ ధోరణిని బట్టి సుభాస్‌బాబు, నిరంతరం అభివృద్ధి అయ్యే మిత్రుల సన్నిహితుల సంఖ్యను పెంచుకో గలుగుతున్నాడు. బాపూ దగ్గరవున్న ఏ కాంగ్రెస్ నాయకుని కంటే కూడా ఆయనకు నేను అత్యంత సన్నిహిత మిత్రుడుని అయిపోయాను.

1939 బొంబాయి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశానంతరం, అఖిలబర్మా కూలీ మహాసభకు అధ్యక్షత వహించే నిమిత్తం, కాంగ్రెస్ నూతన నియమావళిని ఎదిరించటానికి వేసుకున్న పథకం ప్రకారం, నేను సహకరించటం సాధ్యంకాక పోవచ్చునని. సుభాస్‌బాబుకు తదితర మిత్రులకు ప్రయాణమౌతూ చెప్పాను. ఆ కార్యక్రమంలో నేను భాగస్తుణ్ని కాలేక పోయినపుడు దానిమీద నా అభిప్రాయాన్ని వివరించే విషయంలో కూడా నా అశక్తతను ఒప్పుకున్నాను. అయితే సుభాస్‌బాబు మాత్రం మన పోరాటానికి అనుగుణ్యంగా నా బర్మా పర్యటన ఎంతగానో ఉపకరించగలదని కమిటీకి నచ్చజెప్పి, కమిటీ శుభాకాంక్షలను అందజేశాడు. పైవాంశ సంఘాతులైన కాంగ్రెస్‌వాదులు మాత్రం అంతగా తృప్తిపడలేదు. వాళ్ళు ఆ పరిస్థితుల్లో నేనేదో సుభాస్‌బాబు దగ్గరనుంచి ప్రత్యేకమైన సందేశాన్ని బర్మా రివల్యూషనరీ పార్టీ నాయకుడైన బామాకు తీసుకు వెళుతున్నాననే అనుమానంతో నా బర్మా ప్రయాణానికి అసంతృప్తి పడ్డారు. అంతేకాకుండా నన్ను కాంగ్రెసు నుంచి బహిష్కరించే సమయం కోసరం కూడా ఎదురు చూస్తున్నారు. నేను ఇండియాలోనే గనుక వుండేట్లయితే అతివాద

ఐక్యసంఘటనా సంస్థ యిచ్చిన కార్యక్రమం ప్రకారంగా వ్యతిరేక దినోత్సవం జరుపుతానని కూడా వూహించారు. ఆ తరువాత ఒక దేవత, అధిదేవతను సమీపించినపుడు, అధిదేవత ఆ దేవత నుద్దేశిస్తూ, "కాబట్టి పిట్ట మీ గూటిలోనే పొదుగుతుందా ?" అని ప్రశ్నించగా, దేవత "లేదు పిట్ట బంగాళఖాత తీరాన్నను సరించి, ఎగిరిపోయింద"ని చెప్పటాన్ని తరువాత నేను తెల్సుకున్నాను.

అతివాద ఐక్యసంఘటనా సంస్థలో నా మాదిరిగానే స్వామీసహజానంద, ఇందూలాల్ యాజ్ఞిక్‌లతో కూడా ఆయన సహచర్యాన్నభివృద్ధి చేసుకోవటానికి ఎంతో సంతోషించేవాడు. నేను ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరకపోయినప్పటికినీ దాని కార్యవర్గ సమావేశాలకు రావల్సిందిగా సుభాస్ నన్ను బలవంత పెడుతుండేవాడు. కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు నా మీద తీవ్రమైన శత్రుత్వాన్ని వహించారంటే, మా యిరువురి మధ్యనున్న సన్నిహిత మైత్రి అందుకు కారణం. ఒక రోజు ఇద్దరు కాంగ్రెసు అధి దేవతలు నే నెప్పుడు కాంగ్రెసు నుండి బైటకు పోతానో ఆ విషయాన్ని గురించి తెల్సుకోవాలని కుతూహల పడ్డారు. అప్పుడిది బాపూ అభిప్రాయమా అని నేను ప్రశ్నిస్తే, ఈమారు బాపూ కూడానిన్ను రక్షించలే"దని వారు నిష్కర్షగా సమాధాన మిచ్చారు. అప్పుడు స్వాతంత్ర్య సైనికులకు, వీరులకు కాంగ్రెసు దక్కుతుంది కానీ, కొద్దిమంది ఉపదేవతలకు కాంగ్రెసు స్వంత ముల్లెకాదని సమాధాన మిచ్చాను.

అటువంటి క్లిష్ట భూయిష్టమైన, విషకలుషితమైన రాజకీయ వాతావరణంలో సుభాస్‌బాబు, మాలోని చాలామందిమి జాతీయ స్వాతంత్ర్యం కోసరం నిరంతరాయంగా పనిచేసుకోవాల్సి వచ్చింది. ఒకవైపున బ్రిటీషువారు నిర్దాక్షిణ్యంగా మామీద దుముకుటకు సిద్ధంగా వున్నప్పుడు ప్రసిద్ధిపొందిన పలాస అఖిలభారతకిసాన్ మహాసభ జరిగింది. అనంతరం వారు దయారహితంగా వ్యవహరించారు. మరొక వైపున కక్షసాధించాలని కాంగ్రెసు దైవమ్మన్యులు, మేము అగౌరవ పర్చబడి రాజకీయంగా నామరూపాలు లేకుండా పోతే చూచి సంతోషించటానికి తయారుగా

వున్నారు. ఇన్ని పరిస్థితుల్లో కూడా బాపూ చెప్పినట్లు "విపరీత ధైర్యంతో" బ్రిటీషువారి సవాల్‌ను ఎదుర్కొనేదానికి ఆమోదించాం. కష్టపడి పనిచేశాం. అయితే బ్రిటీషువారి ఉత్తర్వును ధిక్కరించేదానికి నిర్ణయించుకున్నపుడు బాపూ వద్దనుంచి తాత్కాలికంగా, బ్రిటీషు ఉత్తర్వుకు విధేయత చూపమని ఆయన కనీస కోరికగా, నాకొక ఆదేశం వచ్చినప్పుడు అదినా జాతీయ ఆత్మగౌరవానికి ఒక గొప్ప అవమానంగా భావించాను. ఆ సందర్భంలోనే నిజమైన మిత్రుడుగా సుభాన్ బాబు ముందుకువచ్చి నేను జరుపుతున్నటువంటి పోరాటం గౌరవ ప్రదమైనదిగానూ పరిస్థితులకు అనుగుణ్యమైనదిగానూ వున్నదని ప్రజాలోకానికి నచ్చజెప్పాడు. నాపరంగా వెలిబడేందుకు రాజకీయ దూరదృష్టిని ప్రదర్శించే విషయంలో, సుభాన్ బాబుకు తప్ప మరింకెవ్వరికీ నైతిక ధైర్యం చాలకపోయింది. ఇటువంటప్పుడు ఆయనకన్న కలల ప్రకారంగా, ఆశయానుగుణ్యంగా తొలి తాత్కాలిక స్వతంత్ర భారత ప్రభుత్వాధ్యక్షుడై, జాతికి నేత అయినప్పుడు, మా ఉభయుల మధ్యనున్న స్నేహధర్మరీత్యా దేశమంతటా వున్న మా సహచరులు కిసాన్ కార్యకర్తలు ఎంతో గర్వపడినారంటే ఆశ్చర్యపడవలసిందేమీలేదు.

సుభాస్‌బాబు దీర్ఘప్రవాసానంతరం తిరిగి కలకత్తాలో కనుపించినప్పుడు 1938వ సంవత్సరంలో కలకత్తా శ్రద్ధానంద పార్కులో అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన రైతుమహాసభకు అధ్యక్షత వహించే అవకాశంకూడా నాకు కలిగింది. 1938వ సం। మార్చి మాసంలో హరిపురా రైతుయాత్ర సందర్భంలో నేను అధ్యక్షత వహించినపుడు, కిసాన్‌వాదులందరూ కాంగ్రెస్‌లోచేరి భారత స్వాతంత్ర్యోద్యమాన్ని బలపర్చమని ఆహ్వానించాడు. సి.ఆర్.దాస్ నడిపి నటువంటి "ఫార్వర్డ్" అనే దినపత్రికపేరు సార్థకం చేసే నిమిత్తం "ఫార్వర్డ్ బ్లాక్" అని తన పార్టీకి నామకరణం చేయమని నేనిచ్చిన సలహానుకూడా ఆయన సహృదయంతో స్వీకరించాడు. నేను ఫార్వర్డు బ్లాకులో చేరకపోయినప్పటికీ, నా విప్లవ కార్య విధానంలో విశ్వాసముంచిన ఆయన 1939 సం లో బొంబాయిలో జరిగిన అఖిలభారత ప్రథమ ఫార్వర్డు బ్లాక్ మహాసభలో నన్ను ప్రారంభోపన్యాసం చేయమని ఆహ్వానించాడు. యదార్థానికి మా మైత్రి ఎంత గాఢంగా వుండేదంటే, సర్దార్ వల్లభాయి కూడా నన్ను ప్రతీఘాతుకవర్గంలో ఒకడుగా భావించేంతవరకు,

అయితే నేనెందుకు ఫార్వర్డు బ్లాక్‌లో చేరలేదు అని అంటే ఈ విషయంలో నేను సుభాస్‌కు స్పష్టంగా చెప్పాను. కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య స్థాపన సాధ్యమైనంత త్వరలో జరిగే నిమిత్తం జాతీయ స్వాతంత్ర్య పోరాటంతో సహకరించదల్చుకున్నానని, ఆ విధంగా మన ప్రజానీకాన్ని బూర్జువాల - కార్మికుల నియంతృత్వం బారినుంచి రక్షించాలని నేను వాంఛించాను. ఎంతకాలమైతే కాంగ్రెస్ కానీ ఫార్వర్డు బ్లాక్‌కానీ అటువంటి స్వరాజ్యానికి హామీ యివ్వలేకున్నారో, పోగా-స్వరాజ్య భారతదేశంలో పెత్తనం ఎవరికి సంక్రమింపజేయ దల్చుకున్నారో, అనే ఆ విషయాలను గురించి ఆలోచించితే, కిసాన్ ప్రజానీకానికి ఎక్కడా దరీదిక్కు కనిపించదు. సుభాస్‌బాబు, బాపు ఉభయులూ నే ననుసరించే సక్రమ విధానాన్ని, దీని నైతిక పునాదిని క్రమంగా గ్రహించారు. కాబట్టి జాతీయ స్వాతంత్ర్య సాధనానంతరం, న్యాయమైన సామాజిక విధానాలు కాంగ్రెస్ ఆమోదించేదానికి సిద్ధంగా వుందని, బాపు దానిచేత ఒక ప్రకటన చేయించాడు. రైతుకూలీలు రాజ్యాధికారాన్ని చేబట్టే విషయంలో తన కభ్యంతరంలేదని ప్రకటించేదానికి సుభాస్‌కూడా సిద్ధపడ్డాడు. అయితే దేశభక్తియుతమైన, స్వార్థత్యాగ పూరితమైన మధ్యతరగతుల మాటేమిటని ఆయన విస్తుపోయాడు. మేమీ విషయంలో ఒక సంయుక్తాభిప్రాయానికి వచ్చేలోపలనే, నిర్మాణరహితమైన ఏప్రియల్ పోరాట సందర్భంలో ఆయన బంధించబడ్డాడు. అదే సందర్భంలో వివిధ రాష్ట్రాలలోని ఖైదీలను కల్సుకునే నిమిత్తం ఒక జైలునుంచి మరొక జైలుకు ప్రయాణంచేస్తూ, వివిధ భారత విప్లవ తరగతుల న్యాయమైన క్రమబద్ధమైన హక్కులగురించి పునరాలోచన చేయవలసిన ఆవస్యకతను గుర్తుకు తెస్తున్నాను. తుట్టతుదకు మా మధ్య రైతుకూలీ కళాకారుల బుద్ధిజీవుల ప్రజాస్వామిక రాజ్యానికి సంబంధించిన నిర్వచన విషయంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఆ సందర్భంలో సుభాస్ మాతో కనుక వున్నట్లయితే, ఆయన మా యీ సంయుక్తాభిప్రాయంతో ఏకీభవించేవాడని నిస్సందేహంగా అనుకున్నాం. దీన్ని క్లుప్తమైన రాజకీయ ప్రకటనగా బహాళ ప్రచారంలో పెట్టేందుకుగాను. ఈ విధానాన్ని "కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యం" అన్నాము. ఈ ఆశయాన్ని బాపూముందు పెట్టి ఆయనకు లోతుపాతుల్ని చక్కగా వివరించి నేను ఆయన ఆశీస్సులు యివ్వమని కోరాను. 1942 ఏప్రియల్ మాసంలో తన మనసు కూడా ఈ విధానానికి అనుకూలంగా వుందని అయితే, తనపట్టుకు తాను

అటువంటి రాజకీయ నినాదానికి రాజకీయంగా కట్టుబడదేనని ఒక హామీయిచ్చాడు. అదృష్టం దాన్ని వరించే కొలది 1942 ఆగస్టు మాసంలో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, స్వరాజ్య భారతదేశంలో రాజకీయాధికారం సాధారణంగా కష్టజీవులైన పొలాలలోని రైతులకు కర్మాగారాలలోని కూలీలకు కదితరంగా వున్న ప్రజలకు సంక్రమించాలని తం పాలసీగా ఒక ప్రకటన చేసింది. ప్రజాస్వామిక వాదులమైన మేం, జాతీయ నాయకులైన గాంధీజీ - నేతాజీ - నెహూ్రి - సర్దార్‌లతో భుజం భుజం కలిపి పనిచేసినందుకు మా కది ఘన విజయంగా భావించుకున్నాం. జాతీయ పునస్తత్వంతో వున్న మా యీ ధోరణిని నేతాజీ ఎంతగానో ఇతరులందరికంటే అధికంగా గౌరవించేవాడని నా వరకు నేను అభిప్రాయ పడ్డాను.

ఈ జీవితగాధ శ్రీ కుమార్‌గారు తన స్వంత ధోరణిలో ఉత్సాహవంతంగా వ్రాశారు. భారతదేశం స్వరాజ్యం పొందిన తరువాత ఈ ప్రముఖ భారత వీర పుత్రుని మహోన్నత జీవితాన్ని ఆదర్శంగా పెట్టుకుని, చైతన్య ప్రపూరితులైన అసంఖ్యాక ప్రధాన యువకులలో ఈయన ఒకడు. సుబాస్ నిర్వచించిన సేవా తత్వంతో చూపెట్టిన సాహసమార్గంలో పతాకాన్ని నిరంతరం ఎగిరించాలని సాంప్రదాయం కలిగిన సుశిక్షిత యువక బృందంతో, ఈయనకూడా చేరాడు. మన జాతీయ స్వాతంత్ర్య పోరాట సందర్భంలో కాంగ్రెస్ ప్రదర్శించిన అసమాన ధైర్య సాహసాలను ఈయన చక్కగా చిత్రించాడు. స్వాతంత్ర్య యుద్ధంలోని సాహస కృత్యాలమీద ప్రత్యేకంగా ఈయన దృష్టిని కేంద్రీకరించి పూజ్యమైన నేతాజీ ప్రధాన జీవిత విశేషాలను మన మనసుకు హత్తుకు పోయేలా చేశారు.

సుబాస్ నేతగా నిరూపించుకుంటున్నప్పుడు ఒక ధైర్య సాహసాలు కలిగిన యువ ఉద్యోగి నేతాజీ అడుగుజాడలలోనికి వెళ్ళాడు. ప్రజాస్వామిక కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య ఆశయం. ఆయన్ను ఆకర్షించినందుకు అది నా అదృష్టంగా భావించుకుంటున్నాను. అతడే వెనుకటి బ్రిటీషు సేనలో ఒక లెఫ్టినెంట్‌గానూ అజాద్ హింద్ ఫౌజులో ఒక కెప్టెన్‌గానూ ఉన్న శ్రీ ఎల్ అప్పారావుగారు యూరప్‌లో అ. హి. ఫౌ. ను నేతాజీ సమీకరించుతూ వున్నప్పుడు నేతాజీతో అనేక సందర్భాలలో మాట్లాడాడు. బ్రిటీషు శక్తిని ధిక్కరించాడు. దేశాంతర

జైళ్ళనుండి విడుదల పొందిన తరువాత కిసాన్ ఉద్యమానికి తనకు తానుగా అంకితమై దేశంలో తనమిత్రులతో సహచరులతో చేతులు కలుపమన్న నేతాజీ సలహాలను పాటించాడు. నేతాజీని గురువుగా భావించుకున్న ఏకలవ్యుడైన శ్రీ కుమార్ కూడా రైతుకూలీల ప్రతినిధి సంస్థ అయిన, రైతుకూలీ ప్రజారాజ్య ఆశయాన్ని సాధించ దల్చుకున్న, కృషికార్ లోక్ పార్టీలో చేరటానికి నిర్ణయించు కుని నేతాజీని గౌరవించే అనుచర బృందానికి ఇది సరైన మార్గమనికూడా ఈయన అభిప్రాయ పడ్డాడు.

ప్రగాఢమైన ఆత్మవిశ్వాసంతో, ఊహా ప్రపంచంలో ఎంలో సాహసంతో గాంధీ నేతాజీలు నిర్వచించిన వీరత్వాన్ని సేవాపరాయణత్వాన్ని ఆదర్శంగా పెట్టు కుని నేను సాగిస్తున్న కృషి, పోరాటం మన ప్రజానీకానికి నూతన ఉత్సాహం, ఉత్తేజం సంక్రమింపచేయ గలవని ఆశిస్తున్నాను.

కాంగ్రెసువారు చాల అరుదుగా తాపీగా దైనందిన రాజకీయ జీవితంలో నేతాజీ పునరాగమనాన్ని గురించి ఆలోచిస్తుంటారు. ఎందుకంటే ఆయనొక్కడే సమర్థమైన ప్రతిపక్షాన్ని సృష్టిస్తాడనే భయం వారికి వుంది.

మన మిప్పుడు స్వతంత్ర భారతదేశంలో నివశిస్తున్నాం. అధికార ప్రతిష్ఠల కోసరం ప్రాకులాడే అధునాతన దైవాంశ సంభూతులు కూడా మన కిప్పుడున్నారు. ఇప్పుడిదే మాత్రం పరాయి ప్రభుత్వం కాదు. లేక దాన్ని 1946కు ముందు మాదిరి ముక్తసరిగా ఎదుర్కొనే అవశ్యకతకూడా కనుపించదు. ప్రస్తుతం ప్రభుత్వంమీద తిరగబడటానికి తగిన సమయంకాదు. యదార్థానికి అధిక సంఖ్యా కులు ఈ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు చేశారు.

అయినప్పటికీ మన యువకులు తిరుగుబాటుదారులవైపు విప్లవకారులవైపు ఎందుకు ఆర్రులు చాచారు? లేక ప్రభుత్వ వ్యతిరేకులవైపు ఎందుకు దృష్టిని ప్రసరిస్తున్నారు. అధిక సంఖ్యాకులు ప్రభుత్వానికి తందానతాన అని తాళంవేస్తుంటే వీరు వారితో ఎందుకు మేళవించలేకపోతున్నారు? దీని కంతటికీ కారణం యువకుల్లో సాహసకృత్యాలను సమర్థించేతత్వం ప్రబలివుంది, ఆ సాహసకృత్యాలకు చెల్లించ వలసిన మూల్యం ఎంత అనే విషయంతో వారికి నిమిత్తం లేకపోవటం, సమాజ స్థాయి, రాజకీయ అధికారం, స్థిరపడిన నైతికబంధాలు ఎదుర్కోవలసిన సవాల్,

ధైర్య సాహసాలు కలిగిన యువకులను ఎప్పుడు ఆకర్షిస్తుందో, ప్రపంచంలోకానీ లేక ఒక దేశంలో కానీ మానవత్వంలోని ఏదో ఒక భాగానికే, సామాజిక స్వభావ విషయంలో, ఆశయాలు-సిద్ధాంతాల విషయంలో మరో సాహస ధోరణిని రూపొం దించి, ఆ విధంగా మార్గదర్శకులు అయ్యే అవకాశం వుందా ?

భయంకరమైన 1943-45 సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశానికే ఆయన స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టి వుంటే ఆయన ఏ ధోరణిలో ఏ కార్య క్రమాన్ని సాగించ సాహసించేవాడు ? — గర్వకారణంగా ఆయన కాంగ్రెసును పునరుద్ధరించేవాడా ? పునర్జీవం పోసేవాడా ? లేక ప్రతిపక్షాలను సంఘటిత పరిచేవాడా ? అనే ఈ విషయాలు నేటి స్వరాజ్య భారత విజ్ఞాన యువజన సమాజం లోని ఉత్తేజకరమైన భావాలు. ఏది ఏమైనప్పటికీ వీరు నేతాజీ చర్యల్ని సమర్థించు కుంటూ సన్నిహితంగా వుంటున్నారు.

భారతభూమిలో ఆయన ఆంతరంగిక సహచర బృందంలోని సభ్యులుగా, ఆయన తుది కార్యకలాపాలు సాగిస్తున్న సందర్భంలో చేరిన: అంటే జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించే నిమిత్తం దేశాంతరాన వున్న భారతీయులు - ఇతర రాజ్యాల సహకారాన్ని తీసుకోబోయే ముందు ఆయనతో కలిసి పనిచేసినవారు, ఈ పరిస్థితుల్లోనే కనుక ఆయన దేశంలో వున్నట్లయితే ఏ విధంగా వ్యవహరించి వుండేవాడో ఊహించలేకున్నారు. అయినప్పుడు వారిలోవారికి ఏర్పడిన అభిప్రాయ భేదాలవలన కొంతమంది కమ్యూనిస్టులవైపు పోతుంటే, లేక వారికి సమీపంగా చేరుకుంట్రుంటే, మరికొంతమంది ప్రజా సోషలిస్టు పార్టీలో చేరుతుంటే, ఇంకా కొంతమంది తిరిగి కాంగ్రెస్‌లో కల్సిపోతుంటే, శ్రీ కుమార్ లాంటి కొద్దిమంది కె.యల్.పి. లోకి వస్తున్నారు. సుబాస్‌బాబు ఈ దేశంలోగనుక వుండటం సంభవిస్తే 1947 సం॥ అనంతరం సుబాస్‌బాబు ఏ ధోరణితో తన కార్య విధానాన్ని సాగించి వుండేవాడో ఎవరు ఊహించి చెప్పగలరు.

అనేకమంది ప్రభుత్వంలోనూ రక్షక దళాల్లోనూ అ. హిం. ఫౌజులోనూ ఉన్న చురుకైన నాయకులు లక్ష్యసాధనా విషయాలలో ఆయనచూపే పట్టుదలకు సన్నిహిత స్నేహభావాలకు ఆత్మవిశ్వాసాన్ని పొందగలిగిన ఆయన అద్భుత శక్తికి ముగ్ధులై వివిధ విధాలైన దేశభక్తులుగా మారిన భోగట్టా నాకు క్రమంగా తెలిసింది.

తన హృదయంలోని లక్ష్య సూటి మార్గాల్ని ఇతోధికంగా అభివృద్ధి చేయగల విషయ మేదైనావుంటే దాన్ని సాధించేటందుకు తన శక్తినంతా కేంద్రీక రించి పోరాడుతాడు అన్నదానికి ఒక విధంగా అనేక మందికి కష్టం కల్పించినప్పటికి కాంగ్రెస్ అధ్యక్షుడుగా తన పునరెన్నికకు సంబంధించిన నిదర్శన మొక్కటే చాలు. అదేమాదిరిగా అవసరమొచ్చినపుడు తృణప్రాయంగా వదవుల్ని త్యజించి బైటకు రాగలడనేందుకు, ఆ అధ్యక్షస్థానం, స్వాతంత్ర్య పోరాటాన్ని పురోగ మింప చేసేందుకు ఇంకే మాత్రం ఉపకరించలేదని అభిప్రాయపడి మహా సంతో షంతో ఆ మహోన్నత పదవిని మందహాసంతో వదలివేసి దైవాంశ సంభూతులు, అసీనులైన సభావేదికను దిగి అత్యున్నత సన్నిహిత మైత్రి సూచకంగా నా ప్రక్కనే వచ్చి కూర్చుని ఆఫీసు నిర్వాహకులను - సమావేశకర్తలను - అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గాన్ని విస్తుపోయేలా చేయగలిగిన శక్తి కూడా ఆయనలో వుంది.

ఇంకొక్కమాట. సన్నిహితమైత్రి చక్కని వ్యక్తిత్వం ఉత్తేజిత పూరిత మైన సందేశం మూర్తీభవించిన ఆ నేతాజీని గొప్ప సహచరుడుగా నాయకుడుగా శ్రీ కుమార్ నాకు గుర్తు చేస్తున్నారు. ఇంతటి ఘనత వహించిన భారత విప్లవ వీరుని మహాశక్తిని గత అనుభవాలలోకి దృష్టిని మళ్ళించేలా - అలా ప్రజల్లో నా సంబంధాలను గురించి చెప్పగలిగినట్లుగా శ్రీ కుమార్ తోడ్పడినందుకు నా హృదయపూర్వకమైన కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను.

| | |
|---|---|
| భారత రైతాంగ విద్యాలయం<br>"విప్లవవాదుల పరిశోధనాలయం"<br>(అని నేతాజీ నామకరణ)<br>నిడుబ్రోలు | జైహింద్<br>రంగా<br>1—3—54 |

# "కర్షకా" అభిప్రాయము

శ్రీ కొండవీటి వెంకయ్యగారి "కర్షకా" యను పిలుపును వింటిని. సంతోషమందితిని. ఎందులకీ అచ్చమైనరైతు యీ బలమైన పిలుపునకు పూనుకున్నాడు? "కదలని వస్తుజాల మదిగాక భువిందిరుగాడు ప్రాణులన్ సదమలరీతి బోషణను సల్పెడి" మా రైతును జూస్తే సహజంగానే వెంకయ్య "పుడమును బెంది నిత్యము నమో నమయంచు" నుతించగోరతారు కనుక, రైతుల సంఘ శక్తియందు వెంకయ్యకు మితిమించిన విశ్వాసము కలదు. కనుకనే "నీ బలగము తోడ పైబడిన భాగము బెట్టుదురోయి కర్షకా" యంటున్నారు. ఆ సత్తైన పల్లిలో గూడా యెన్ని కలవల్ల రైతాంగమందు కుల మత పోరాటాలు బైలుదేరినవి. దానికి విరుగడుగా "కృషి నేర్పుగ జేసెడి వారికెల్ల నిర్మలమగు వంశ మొక్కటియే" అన్నారు. రైతు తన బాధల నివారణ చేసుకోవాలంటే అతడు సంఘం బాకృతిం దాల్చ పావన రూపంబు జగంబు నిండుటకునై పాటొందమ"ంటున్నారు. ధనిక షోమరుల నడంచక గోగు పచ్చడినే భుజింప గల్గుచున్న రైతుల రక్షింపనివాడు "భగవంతుడయి యుండునా?" అంటున్నాడు వెంకయ్య కనుకనే రైతుల రెచ్చగొట్టుటకై "నీవేతగు రాజ్యకర్తవు, ధనేశ్వరు లెవ్వరు కారం"టున్నారు. తన రైతాంగంను సేవించలేదని "కవులు కలాలు డబ్బుగల గాడిదకే బలియయ్యె"నంటూ పోతనపంథాను ద్రొక్కుచున్నాడు." యిటుల స్వవర్గ రక్షణకై "భారత భావి భాగ్యమును పంటను సృష్టిని జేయునట్టి" "రైతుల రాజ్యమే ధర విరాజిలుచుండగ నీకవీశ్వరుల్ ప్రీతిని నీదుగేయముల పేర్కొనుచుం"డరని హామి యిస్తున్నారీ రైతుబిడ్డ (యిట్టివారికై ఆంధ్ర రైతాంగము యెదురుచూచుచున్నది. రైతులపేరిట వీరికి నేనిదే ఆహ్వానమందించు చున్నాను) వీరి మధురమగు కవిత్వాజాల మన రైతాంగమునకు నూతనశక్తి కల్గించుతుగాత.

నిడుబ్రోలు,<br>
25-4-38.

గోగినేని రంగ నాయకులు<br>
రైతాంగ విద్యాలయము

# జీవిత మధురిమ ఇదే ఇదే

భారత స్వాతంత్ర్య సత్యాగ్రహ సమరం జరిగే రోజుల్లో—ముప్పై సంవత్సరాలకు ముందే ఈ చిరు నాటిక రచన. ఇప్పుడు ప్రపంచ విఖ్యాతి బడసిన డాక్టర్లు, ఆనాటి బాల కవీంద్రుడు—మా సత్యనారాయణ మహాకవియై పలికారు 'ఔను,ఔను అది నిజమే లే!' కాదనగలవారెవరు?

'జీవిత మధురిమ అదే అదే' అంటూ ఆడుతూ పాడుతూ, ఇప్పటికి యీ 'మధురిమ' రేడియో ద్వారా దివ్య సంగీతముతో అందుకున్నాము ఆంధ్రులము. ఈ మధురిమ ద్వారా 'జగతికి కళ్యాణము కల్గించు రహస్యము' 'తెలిసికొనుము నీలో వుందని' సహృదయుడై, 'నిర్మల విజ్ఞాన నిధులు నీలో దాగున్నాయని' మహా కవియై, 'కనులు విప్పర కాన బ్రహ్మము నిండు నీలో నిండియున్నది'యని వేదాంతియై పలుకుచున్నారు. ఎందరో యెల్లప్పుడు యెల్ల యెడల పొందే ఆరాటానికి మన సత్యం ఎంత కమ్మని కవన మల్లిరి!

'జీవిత మధురిమ మంటే ఏమిటి'? ఎంత ఆతురత, ఏమిటి, ఏమిటి, ఏమిటి? అంత వేగము ఆ యువ పురుషుడు ఆ సత్యనారాయణ హృదయమున రేగినది! సమాధానమునకు పాట పూర్తియగు వరకూఆగగలడా? ఆగ నివ్వగలడా? అందించుచున్నారు తన హృదయమందు ఈ బాధిత, ప్రపంచ మానవ కోటికొక ఆశారేఖ:

'మనసులోని లోతులు త్రవ్వి, అందులోని మేలిమితీసి జగతికి కళ్యాణము కల్గించుట: అదే సేవ జగతికి, అదే జీవిత మధురిమ' హృదయం ఆనందంతో తేలియాడునటుల 'పాటలు అంతశ్రావ్యంగా' 'అణచరాని అర్థంకాని ఒక శక్తి' ని ప్రజ్వలింప చేస్తూ తెలుగు పదాల ద్వారా ఈ మహాకవి 'అదే, అదే, అదే' అంటూ 'ఏమి టేమిటి, ఇక అదేమిటి' అనే మన అందరి ఆరాటమునకు మధుర కవిత నందించుచున్నారు. ఇదిమొక మహా కావ్యము. ఈ కావ్యమును రచించిన వారొక బాల కవీంద్రుడు. ఈ కవనమున కింతవరకూ మనుష్యులు గీచిన హద్దు గీతలు పోయినవి. 'ఇరుకు హద్దులు దాటి' 'విశాలవిశ్వములో విహరించు స్వాతంత్ర్యము' మన కందించుచూ మన సత్యం ఆనాడే మహా కవిగా పరిక్వత అందుకొనిరి. ఇంతకూ ఈ మహాకవి ఎవ్వరు? ఎప్పుడోగాని కవీంద్రులు

సాధారణ జీవిత పరిధుల మించి లక్ష్మీ సరస్వతుల సంపూర్ణ అనుగ్రహం పొంది దేవతల నధిగమించి సంపూర్ణ సంసార సుఖముల నందుకొనజాలదు. మన సత్యమో, అన్నిటిని నిండుగా పొంది 'వాళ్ళదీ కాదు, వీళ్ళదీకాదు అందరిదీని' అంటూ ప్రపంచ మందంతటా ప్రఖ్యాతి పొందిన మహా భిషగ్వరులైన యీ నాటి డాక్టరు సత్యనారాయణ. ఆనాడో 'దీనారటం కాంతీర్ధ మాడించుకొన్న' శ్రీనాధుడు వెలసెను. చివరకాయన జీవిత మధురిమ నందుకోగలిగేనా? '—ఆ దేవేంద్రుని ధిక్కరించేనా'? ప్రజలందరికీ 'తిండిని కొందరు ఎందుకో దొరక నివ్వర'ని యీ కవి సత్యం దుఃఖిస్తూ డాక్టర్ సత్యనారాయణగా పెరిగి ప్రజలందరికీ, ప్రాణం, ఆనందం అందిస్తున్నారు. వీరే పూజ్య రాజాజీ శాంతి సాధనకై ప్రపంచ యాత్ర సుఖంగా, శోభాయానంగా చేయగల్గుటని, శక్తిని, రక్షణను, ఆనందమును అంద జేసిన ప్రసిద్ధ పురుషులు, రసజ్ఞులు. పుణ్యాత్ములు.

ఇదియొక మహాకావ్యము. శుభము, సుఖము, ఆనందం, సత్యాన్వేషణలో, సత్యపథంలో వున్నవంటూ, కమ్మని పదముల ద్వారా సువర్ణ దీధితుల విరజిమ్ము హృదయావిర్భూతమగు పద్యముల ద్వారా కవి వచించినాడు. "సస్యశ్యామల వర్ణ వస్త్రముల దాల్చిన కష్టజీవులకు విరజాజుల పాన్పు నందించు జగమే నాటకం. ఆ జగమునకు నీవే ప్రాణము" అనే మహా సత్యంను యింత సొగసుగా ధాటిగా హృదయం పల్లవించునటుల చిన్ననాటి సత్యం యొక్క హృదయా వేగంను నా మిత్రుడు, బంధువు నిర్మల విజ్ఞాననిధి యగు ఈనాటి సత్యనారాయణ, యీ చిన్ని 'అరవిందం' ను 'అమ్మ' కు అందించుచున్నారు. అందులకివే నా కృతజ్ఞతాభి వందనలు.

మన కందరికీ ప్రియతములు, అందచందాల కవనంపు తల్లి ముద్దు బిడ్డడు శ్రీ పున్నవ లక్ష్మీనారాయణగారికి ఈ కవి కుమారుడు ఎంతో ప్రేమ పాత్రుడు. సుందర నందనోద్యాన కోకిల.

ఆనాడు పోతన 'బాలరసాలసాల నవ...... కావ్యకన్యను' సృజించెను. సర్వాభరణ లక్షణ వక్షిత నొనరించెను. అమెను శ్రీరాముని కర్పించెను. మన సత్యనారాయణ, అంత కంతకూ, సౌందర్య భరితమైన ఈ భావ కన్యను ప్రజా సామాన్యపు ఆనందం కొరకై అందించుచున్నారు. ఇట్టి కథనం, కవనం,

కామితార్థదాయి. ఒక భావనా ప్రపంచం ఒక్కొక్క యుగాని కొక్కటికే అందు చుండును. అట్టి అర్హత డాక్టరు సత్యనారాయణ గారికే కలిగినది.అందువలన వారికివే నా అభినందనలు.

'జీవిత మధురిమ' లోని ముఖ్య సంగీతం మన భారతీయ భావనకు, తెలుగు సాహిత్య శైలికిని సంగీత రచనకూ గీటురాయి. గాంధీసిద్ధాంతముల యొక్కయు, మానవత్వంలో ఉపనిషత్తులకు గల విశ్వాసం యొక్కయు, ఆది శంకరుల వేదాంతంయొక్కయు సారంను ఆ గీతికలో రచయిత పొందుపరచారు. ఇలాంటి రచన ఒక్కొకతరంలో ఒకసారే ఉద్భవిస్తుంది. సత్యం, మధువంటి ఉత్తమ ప్రేమికుల మధ్య నడచిన భావగర్భితమైన సంభాషణ రమణీయంగా ఉంది. నిండు పున్నమి నాటి పండు వెన్నెలలో గోదావరి గలగలలు మనోహరంగా ఉన్నాయి. ముప్పది ఏండ్లనాడు వ్రాసినవైనా యీ నాటిక యిచ్చే సందేశం శాశ్వతమైనది. దీనుల కోసం, పతితుల కోసం మానవులు చేయవలసినత్యాగాన్ని ప్రబోధిస్తున్నది.

ఆదర్శమే జీవనంగా మనగలిగి, కత్తినీ, కలమునూ, కుంచెనూ, సమర్థవంతంగ వాడగలిగిన సిద్ధ హస్తులు మా సత్యనారాయణకివే ఆశీస్సులు.

ఈ కావ్య రసాను భూతిని పొందగోరు అన్ని భాషలవారికీ ఈ 'జీవిత మధురిమ' యెప్పుడందునో!

ఎన్. జి. రంగా

●

# "సహకార వ్యవసాయం"

"కో ఆపరేటివ్ ఫార్మింగు" ప్రపంచమందెచ్చటా జయప్రదం కాలేదు. దాని ద్వారా ఉత్పత్తి పెరుగుటలేదు, పంటల గిట్టింపు ఖర్చులు తగ్గుటలేదు. రైతుల కింతవరకు అందుచున్న (స్వల్పంగానైనా!) స్వతంత్రము కుంటువడు చున్నది, తగ్గి పోవడమేగాక అదృశ్యమగుచున్నది: పైగా, ఆర్థిక దాస్య పిశాచము నకు అర్పణ చేస్తున్నదని లోకంపోకడ కాకి గోల చేస్తున్నది. ఇది సత్యమని ఈ గ్రంథ పారాయణం తెల్పును. ఇంకెంతో చెప్పచున్నా, ఈ అభివృద్ధి నిరోధక మార్గాన్నే అవలంభించాలనే మొండిపట్టుదలకే అంకితులైన రాచకీయ పెత్తందారులు, ఇది పనికి రాకపోతే, మరేది పనికివస్తుందో (alternative) తెల్పండనుటకు సాహసిస్తున్నారు.

అసలు ఇంకేదో కావాలనుకోవడం దేనికి ? స్వాతంత్ర్యము పనికిరాదనేనా? ఆర్థిక స్వాతంత్ర్యము నిరర్థకమనియా ? స్వంతత్ర ఉద్యోగమే, స్వయం కల్పిత వృత్తి అభివృద్ధి కనువుగాదనా? అలాగైతే కమ్యూనిస్టులు, ఫాసిస్టులు, పార్ల మెంటరీ డెమాక్రసి పనికిరాదంటూ నియంతృత్వమే కావాలంటూ ఉండిరే, వారు గూడా మరింకేమి కావాలో చూపెట్ట మనిరే, వారికంటె యీ పెత్తందారుల ఆహ్వానం, సవాలు ఏ విధంగా మంచిది, అనుచరణీయం ?

రైతాంగ వ్యవసాయమే చారిత్రికంగా ఈనాటి ప్రపంచ అనుభవ ఫలితంగా అభివృద్ధిదాయకమైనది, అధికపంటల నివ్వగల్గింది. అత్యధిక సంఖ్యాకులైన శ్రామికులకు, ఆర్థిక స్వాతంత్ర్యము, మానసిక వికాసము, సాంఘికస్థాయి, మాన వత్వమునకు మూలకందమగు స్వత్వము, స్వరాజ్యము, సుఖము, సంతోషముల ప్రసాదించగలదు. ఇది నిర్వివాదాంశము.

ప్రజాస్వామిక దేశాలన్నిటిలో రైతాంగ కుటుంబ వ్యవసాయ విధానాన్ని గౌరవిస్తున్నారు, బలపరుస్తున్నారు. సహకారోద్యమము దానికి తోడునీడగా, అదనంపు "దన్ను"గా పెంచుతున్నారు. అంతేగాని రైతాంగ వ్యవస్థనే తొలగించు టకు రైతుకుటుంబాల ఆర్థిక స్థాయి, స్వాతంత్ర్యమును అపహరించుటకు దాన్ని పోటీగా నిల్పుటలేదు. అట్టిఅభివృద్ధి నిరోధకమైన, చరిత్ర గుణపాఠానికి వ్యతిరేక మైన, స్వతంత్రమును దిగమ్రింగగల్గు ఉద్యోగుల నిరంకుశ పెత్తనాల కొలవాల మైన ధోరణిని —సహకార వ్యవసాయమును — మన రాచకీయపార్టీలే ప్రచారం చేయ సాహసిస్తున్నవి. సోవియట్ రష్యా ఈ దౌర్భాగ్యధోరణికి 1921లోనే ధాత్రి

తీసింది. ఐతే ఈ 38 సంవత్సరాల పిమ్మట, రైతాంగ కుటుంబ వ్యవస్థను తిరిగి తల యెత్తనిచ్చినది. తన సహకార వ్యవసాయ ధోరణి నిల్చి ఉండాలంటే, రైతాంగ వ్యవస్థను గుర్తించి, అంగీకరించి, యీడు జోడుగా (co - existence) వ్యవహరించుటకు తలయొగ్గక తప్పినదికాదు. అచ్చట ప్రతి రైతు కుటుంబానికి అర్ధ యెకరము నుండి రెండెకరాల వరకు ప్రత్యేక భూవసతి తిరిగి యిచ్చినారు. రైతులకు తమ సొంత కమతాలలోని పంటలు, పశువులు అమ్ముకొనుటకు స్వతంత్రము యివ్వవలసివచ్చినది. నలభై సంవత్సరాల పర్యంతం కోట్ల జనాలకు చెప్పరాని బాధలు కల్గించి, వారి ఆర్థిక స్వాతంత్ర్యమును అపహరించి, తుదకుతమ "సహకార వ్యవసాయం" బ్రతికి వుండాలంటే రైతాంగ వ్యవస్థను తిరిగి పెరుగ నివ్వవలసిందే ననుకుంటున్న రష్యాను చూచియైనా మన రాజకీయ పార్టీలు గుణపాఠం పొందవద్దా? మనకు దక్కుచున్న ఆర్థిక స్వరాజ్య కళికలను భద్రపరుచుకోవలదా? మనకు బుద్ధుని బోధలెలా చరిత్ర దయవల్ల అందినవని ఆనంద పడుచున్నామో, అటుపై రైతాంగ వ్యవస్థను కౌగలించుకొని పెంచుకోవలదా? అందరు ఒప్పుకొనేదే రైతులకు ఎన్నో అవసరాలున్నవని: ప్రభుత్వ సాయం కావాలని; పెట్టుబడులు పెరగాలని చౌకపరపతి అందాలని: ఎరువులు, మంచి విత్తనాలు, మాగాణి, మురుగుపోయే వసతులు పెరగాలని!! గిట్టింపు ధరలు అవసరం: అదనపు పంటల నిల్వచేయగల్గటం జరగాలి! ఇవ్వి మరెన్నో వసతులను కల్గించవలసిన బాధ్యత ప్రభుత్వం, స్వయంగా సకలార్థ సహకార సంఘములద్వారా శిరసావహించాలి! అట్టి అభివృద్ధిదాయక కార్యక్రమాలకై స్వరాజ్యావతరణ కోరితిమి. స్వరాజ్యం వచ్చిన పిదప అందులకు మన ప్రభుత్వాలు పూనుకోగల్గుచున్నవా? ఈ సమయాన విశ్వాసరాహిత్య తీర్మానం రైతాంగ వ్యవస్థపైకాదు: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలమీద ప్రజలు ప్రయోగం చేయడం తగును. ప్రపంచమందలి ఇతర ప్రభుత్వాలకు పోల్చుకుంటే, మన ప్రభుత్వాలు కుంటికాలే వేస్తున్నవి. ఆ బలహీనతను కప్పిపుచ్చుకొనుటకా వీరంతా రైతాంగ వ్యవస్థపై దూకుడు చేస్తున్నారు?

రైతులు తదితర సొంత వృత్తులవారి ఓటులపై రాజ్యాధికారం పొందిన ఈ పెద్దలు, ఈ అశేష జనాల ఆర్థిక స్వాతంత్ర్యావహరణకై "ప్లాను" వేస్తూఉంటే, చూచి ఊరుకోగలమా? జాయింట్ కో ఆపరేటివ్ ఫారమ్ పెట్టి, అందు భూముల్ని

చేర్చినవారందరికి పట్టాలిస్తారట! నాలుగయిదు సంవత్సరాలలో ఆ పట్టాలను గుర్తించుట మానరనగలమా? శతాబ్దాలతరబడి స్థిరపడియున్న భూస్వామ్యము, స్వంతవృత్తి మనుగడనే ఇంతబాధ్యతా రహితంగా రద్దుచేయడానికి పూనుకోగల పార్టీలు, ప్రభుత్వాలు బైలుదేరినప్పుడు, తమ సొంతమనే తత్పరతకు దూరమైన సర్టిఫికేట్లు (divorced from function) దారం తెగిన గాలిపటములుగా మారి పోవా? తరతరాలుగా, అన్ని ఆస్తులకంటె స్థిరమైన, నమ్మకమైన, సుభలంగా మార్చరాని ఆస్తిగా పట్టా భూములను కొన్నారు కోట్ల కొలది రైతాంగం. తమ నిల్వ సొత్తును, శ్రమను, చెమటను, ఆశలను భూదేవి రూపేణా చేర్చుకొన్నారు, చూచుకొన్నారు, పూజించుకొన్నారు. అట్టి అచంచలమైన ఆస్తులు తమ స్వాధీనం నుండి పోతుంటే, వాటికి బదులు రైతాంగముయొక్క హృదయాలు కుళ్ళిపోవా? అలాగా పదిహేను కోట్ల రైతులు దిగులుపడి, దిగాలునబడి, క్షీణించి పోవుట దేశారిష్టముకాదా? అది చూచి ఊరుకోగలమా? ఆ ఉపద్రవాన్నుండి రక్షించుట దేశాన్ని, ప్రజలను, మానవత్వాన్ని ప్రేమించువారందరి ధర్మము కాదా?

శ్రీ జవహర్‌లాల్, ప్లానర్లు ఈ దేశారిష్టమగు అభివృద్ధి నిరోధకమగు ధోరణిలో వుంటున్నారని తెలియ వచ్చినప్పటి నుండి మన దేశస్థుల హెచ్చరించు చునే యున్నాను. ప్రథమ పంచవర్ష ప్రణాళిక పార్లమెంటులోచర్చకు వచ్చినప్పుడె, 1952 లానే, దీన్ని నేను యెదిరించితిని. తిరిగి 1957 లో రెండవప్లాను రాచకీయ వాతావరణంలోకి వస్తున్నప్పుడే, పార్లమెంటులో పార్టీనాయకుల సభలో యెదిరించి నాను. మస్సూరీలో 1955 లో సహకార మంత్రుల సమావేశములో, చైనాకు భారత సహకారుల రాయబారం పంపించాలనుకుంటున్నప్పుడే తిరిగి 'ఖబడ్దార్' అంటిని. ఆనాటి ప్లానింగు మంత్రి నందా ధోరణిద్వారా, జవహర్‌లాల్‌గారి తత్వం తిరిగి ప్రదర్శితమైతే, ఆ వెంటనే "అఖిలభారత సహకార యూనియనుజర్నలు"లో ఆ సహకార వ్యవసాయంవల్ల కలుగగల్గు ఉపద్రవాలను గురించి వ్యాసం వ్రాసితి, ఆ పిమ్మట శ్రీ పి.ఆర్. పరుచూరియొక్క సహకారంతో సంవత్సరాలపర్యంతం, ఆ వ్యాసమందు ఉదహరించబడిన సూత్రాలు, ధర్మాలపై చదువులు, చర్చలు, పరి శోధనలుచేస్తూ వుండుటవల్ల తయారైనదే ఈ గ్రంథము.

ఈ గ్రంథము పాండిత్యముపై, ప్రపంచపు అనుభవాలపై, ప్రజాభ్యుదయం సత్యాన్వేషణ కోరుచున్న తపస్సుపై ఆధారపడియున్నది. కనుకనే ప్రొఫెసరు షెనాయ్‌గారు ఇది చదివిన తరువాతైనా ప్లానర్లు తమ పిచ్చిసవాలును ఉపసంహ

రించుకొంటారేమో; రాచకీయ పెత్తందారులు తమ రైతాంగ వ్యతిరేక ధోరణిని మానుకొంటారేమోనని ఆశించిరి. అది నిరాశమైనది.

అఖిలభారత కాంగ్రెసువారి "ఆర్థిక బులిటెన్‌వారు ఈ గ్రంథపు ఆలోచనలను ఎదుర్కొనుట దుస్తరమని వ్రాసిరి. ప్రభుత్వపు "యోజనా" పత్రిక ఈ గ్రంథపు పాండిత్యాన్ని, రంగా అనుభవాన్ని, ఆలోచనలను గమనించక తప్ప దన్నది. ఆ పిమ్మటైనా, కాంగ్రెసుపెద్దలు తమ వైపరీత్యపు ధోరణిని వదలు కొందురేమోనన్న ఆశలు విఫలమైనవి.

తుదకొక రాజీపద్ధతిని మార్చి 7 వ తేదీన శ్రీజవహర్‌లాల్‌ను, నేను ఢిల్లీలో కలుసుకొన్నప్పుడు సూచించినాను. మా ఇద్దరికి తీరరాని అభిప్రాయభేదాలీ వ్యవహారంగురించి ఉన్నప్పుడు, ఇటు యీ రైతాంగకుటుంబ వ్యవసాయ వ్యవస్థను, అటు సహకారవ్యవసాయ వ్యవస్థను, ఒకదానితో ఒకటి పోటీపడుచూ, ఎవ్వరికెయ్యది యిష్టమో ఆ విధంగా రైతులు వాటిని ఉపయోగించుకొనగల రాజకీయ, ఆర్థిక, సాంఘిక వాతావరణం నిర్మించుకొందామని; అంటె Coexistence in healthy competition. దానికి ఆయన ఒప్పుకోలేకపోయిరి. అంటే మొండితనంగా రైతాంగవ్యతిరేక ధోరణిలోనే తమ పెత్తనాన్ని నడుపాలనే స్ఫురించుచుండెను. దానికి నేను సుతరాం అంగీకరించజాలనంటిని.

ఇంతకు, యీ పుస్తకాన్ని వ్రాసినవారు, తర్జుమాచేసినవారు, ప్రచురిస్తున్నవారు పండితులు, శాస్త్రపరిశోధకులే. కనుక రాచకీయ మొండితనాలను వదలి, వాస్తవమైన పరిశోధనలద్వారా (Experimental) సహకార వ్యవసాయం, రైతుల ఆర్థిక అభివృద్ధికి, స్వతంత్రానుభవానికి, కుటుంబస్థాయికి, దేశ సర్వతో ముఖాభివృద్ధికి వ్యతిరేకమని మా విశ్వాసం. కాదని రుజువు చేసే బాధ్యత దాన్ని రాచకీయ బలంద్వారా ప్రజలపై రుద్దాలనుకొనే వారిదే! దేశీయ ప్రజలకు రాచకీయ సంపాదనోద్యమంలో మా శక్తికొలది శ్రమించితిమి. ఇప్పుడో దేశీయరక్షణ, అభివృద్ధికి ఆధారమగు, అశేషజనాల స్వయంవృత్తి, ఆర్థిక స్వాతంత్ర్యము, నైతిక స్థాయినినిల్పి, పెంచి,రక్షించుటకై తిరిగి త్యాగధనాన్ని తెంపును ప్రదర్శించవలసివస్తున్నది. సత్యము కొరకై నిలబడవలసిన సమయమిది. ఈ ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యోద్యమమందు అందరం చేరుకుందాం! మహాత్ముని ఆశయలను

దీన జనాల ఆశలను, స్వాధీన వృత్తి ప్రజల సుఖ, సంతోషములను రక్షింపు కొందాం.

ఈ మా ఆంగ్ల గ్రంథాన్ని అధిక ప్రయాసలకోర్చి చక్కని తెలుగులోకి తర్జుమాచేసి యిచ్చిన పత్రికా రచయితలు శ్రీ జాస్తి జగన్నాథంగారికి, పుస్తక ప్రచురణ కర్తలు కిసాన్ బుక్ ట్రస్టు వారికి, ప్రచురణార్థము ద్రవ్యసహాయం చేసిన భారత రైతు ఉద్యమాభిమానులు నా సహచరులు శ్రీ వెనిగళ్ళ సుబ్బయ్య గారికి, వారి కుటుంబానికి నేను కృతజ్ఞుడను.

నాగపూరు కాంగ్రెసుసభ (జనవరి 1959) నుండి చెలరేగుచున్న ఆందోళనలో రైతులు, రైతాంగ ఆర్థిక—సాంఘిక వ్యవస్థ, స్వాధీనవృత్తులు, స్వతంత్ర ఆర్థిక జీవిత రుచులనుండి కలకాలం అనుభవిస్తున్నవారు, ఈ గ్రంధపఠనంద్వారా, తమ రక్షణ మార్గాన్ని చూచుకొని, స్వధర్మ, స్వతంత్రరక్షణకై కృషి చేయుదురు గాక !

విజయవాడ.<br>2-4-59

రంగ

# ఆంధ్ర గ్రంథాలయ మహోద్యమ చరిత్ర

—ఆచార్య రంగా

ఆంధ్రదేశంలో గణుతికెక్కిన ప్రజోద్యమాల్లో గ్రంథాలయోద్యమం ఒకటి. మన రాష్ట్రంలో వయోజన విద్యా ప్రచారంలో గ్రంథాలయోద్యమం ప్రముఖ పాత్ర వహించింది. మన రాష్ట్రం తర్వాత ఎన్నదగింది మైసూరు. అక్కడ గ్రంథాలయోద్యమం కూడా విద్యా వ్యాప్తికెనలేని కృషిసల్పుతున్నది. స్వాతంత్ర్య సిద్ధికి పూర్వం ఉండిన బరోడా రాష్ట్రంలో కూడా గ్రంథాలయోద్యమం బహుళ వ్యాప్తి నొందిందిగాని, ఆ వుద్యమం ఆంధ్ర, మైసూరు రాష్ట్రోద్యమాలవలె ప్రజా సహకారంతో గాక, మహారాజావారి ఆర్థిక సహకారంతో పెంపొందింది.

ఆంధ్ర గ్రంథాలయోద్యమం ప్రధానంగా గ్రామాల్లో విద్యావ్యాప్తికై నిర్దేశింప బడి ప్రత్యేక కృషి చేసింది. 1938 వరకూ-రెండు దశాబ్దాలకాలం శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయోద్యమానికి ప్రధాన సారధ్యం వహించి, గ్రామస్థులలోని విద్యాగంధ ప్రభావితులలో ఉత్సాహాన్ని రేకెత్తించి, వారిలో గ్రంథాల యెడల, గ్రంథాలయాల యెడల విశేషాభిమానాన్ని, అభిరుచినీ ప్రతిష్ఠించి, గ్రామాలలోఅనేక గ్రంథాలయాలుస్థాపించబడునట్లుగా అవిరళ కృషి చేశారు. మళ్ళీ అంతటి దీక్షతో, సమర్థతతో, నిష్కల్మష హృదయంతో వయోజన విద్యావ్యాప్తికి పాటు పడుతున్న శ్రీ పాతూరి నాగభూషణం వంటి పుణ్యపురుషుడు ఆ వుద్యమానికి లభ్యం కావటం అదృష్టమే నని చెప్పాలి. గత 39 సంవత్సరాలకు పైగా శ్రీ నాగభూషణం తమ సర్వస్వాన్నిఅర్పించి గ్రంథాలయోద్యమానికి తనజీవితాన్నే అంకితం చేసి నిర్నిద్రా కృషీవలులై విద్యా వ్యాప్తికి పాటుబడుతున్నారు. జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం, కర్షకోద్యమం నిర్వహింపబడి విజయవంతమైన గాంధీయుగం దేశానికి శ్రీ నాగభూషణం గారిని ప్రసాదించింది. పల్లెపట్టుల విద్యావ్యాప్తి ఎంత అవసరమో గుర్తించి నిరక్షరాస్యతతో యుద్ధానికి సిద్ధపడిన మనీషి శ్రీ నాగభూషణం.

వేరే వ్యాపకం లేకుండా తన కాలాన్నంతటినీ గ్రంథాలయోద్యమానికే అంకితం చేయాలని శ్రీ నాగభూషణం 1934 వ సం॥లో దృఢంగా నిశ్చయించుకొన్నారు. విద్యా వ్యాప్తి అనే ప్రజాసేవ జీవిత లక్ష్యంగా నాటినుండి పురోగమించారు. ఆనాటి జాతీయ జీవనంలో ఏవిధమైన ప్రత్యేకాదరణ ఉండనప్పటి స్థితిలో ఆయన యిట్టి నిర్ణయాన్ని తీసుకోవటం ధైర్యోపేతమేనని భావించాలి. కేవలం గ్రంథాలయాల స్థాపన, నిర్వహణం మాత్రమే ఆయన కోరికకాదు. ప్రజలకు సద్గ్రంథాలను అందజేయాలనేది కూడా ఆయన ఆశయం. ఆయన అందుకై ప్రత్యేక శ్రద్ధాసక్తులు తీసుకొనేవారు. జాతీయనాయకులనుండి ఏ విధమైన ప్రోత్సాహం లభించకపోయినా, ఉత్తమ గ్రంథాలను లిఖించగల శక్తి సామర్థ్యాలుగల్గిన

శ్రీ మానికొండ సత్యనారాయణ శాస్త్రి వంటి మహా పండితులను శ్రీ నాగభూషణం ఈ విషయంలో తోడుగా తీసుకొన్నారు. ఇట్టి పండిత ప్రకాండుల ఉత్తమ గ్రంథాలను ఎంతో వ్యయప్రయాసలకోర్చి ముద్రించి ప్రజలకు అందజేశారు. తీవ్రమైన కృషి చేసి నిధులను సేకరించి శ్రీ మానికొండ, శ్రీ గోటేటి జోగిరాజు ప్రభృతుల గ్రంథాలను ప్రజల ముందుంచి ఎన్నో జాతీయ వ్యావసాయిక సమస్యల పరిష్కారానికి మూల విరాట్టయినారు. ప్రశంసనీయమైన, అమూల్యమైన వాస్తవమైన ప్రజాసేవ ఇది!

గ్రంథాలయ నిర్వాహకులకు శిక్షణ నీయాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం తలపెట్టక పూర్వమందే శ్రీ నాగభూషణం గ్రంథాలయ శాస్త్ర బోధనాశాలలను, తరగతులను నిర్వహించి వందల యువకులను ఆ శాస్త్రంలో ప్రవీణులుగా తయారు చేశారు.

దేశభక్తులలో అగ్రశ్రేణికి చెందిన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుపట్ల శ్రీ నాగభూషణం గారికి మిక్కిలి భక్తి ప్రపత్తులు. అందువల్ల ఆయనను ఉద్యమ నాయకత్వం వహించవలసిందని శ్రీ నాగభూషణం కోరారు. ఆంధ్రదేశ పత్రికా సేవారంగంలో ఈ ఉభయుల సమష్టికృషి అమూల్యమై, ప్రతిభావంతమై విలసిల్లింది. వీరు గురుకులంలో తండ్రి కుమారులవలె ప్రవర్తించి ఆంధ్రదేశ వయోజన విద్యా వ్యాప్తికి అమేయ సౌష్ఠవాన్ని చేకూర్చారు. పడమటలోని శ్రీ కొమ్మ సీతారామయ్య వంటి కొందరు దాతల సహకార ప్రోత్సాహాలు లభిస్తున్నందుకు గ్రంథాలయోద్యమ ప్రధాన కేంద్రంగా ఆ తావునే ఎన్నుకొని అక్కడే స్థిరపడి శ్రీ హరిసర్వోత్తమరావు పేర "సర్వోత్తమ భవనం" నిర్మించారు. ఇది ఎంతో ఘనతగల విషయం.

రాష్ట్రం తాలూకు ఉభయ సభల్లో దేనిలోనైనా ఒక సభ్యుడు కావలసినవాడై యుండిన్నీ శ్రీ నాగభూషణం ఎన్నికలు డబ్బుతో కూడుకొన్నవి కావటం వల్లనూ, జాతి కుల వర్గాది చిక్కులు అనేకం ఆ రంగాన్ని ఆవరించివుండటం వల్లనూ ఆయన అందుకు దూరంగానే ఉండిపోయారు. దానితో రాష్ట్రంలో నిరక్ష

రాస్యతతో యుద్ధానికి సిద్ధపడే మహామనిషి, ధీమంతుడు ప్రసాదించగం సేవలను శాసన సభలు కోల్పోయినాయి.

గ్రంథాలయ శాసనం, లోకల్ లైబ్రరీ అథారిటీస్ మున్నగు తదుద్యమ సంబంధితాల జన్మకారకుడైన శ్రీ నాగభూషణానికే మన ప్రజాస్వామ్యంలో తత్ సంబంధమైన నాయకత్వా స్నియలేకపోవటం గమనార్హమైన విషయం!! !అయి నప్పటికీ ఆయనేమీ నిరుత్సాహ పడి, అడుగున బడి పోలేదు!

శ్రీ నాగభూషణం మన సంఘ సేవకుల్లో అగ్రగణ్యులు. ఆయన మంచి స్నేహితుడు, సహచరుడు, దీక్షాపరుడైన నిస్వార్థ కార్యకర్త మాత్రమే కాక సమర్థుడైన నాయకుడు. ప్రతిఫలాపేక్షరహితంగా ప్రజా సమస్యల పరిష్కారానికి రేయింబవళ్లూ క్రమశిక్షణా పూర్వమైన కృషీ వలత్వంతో దీక్షతో పనిచేయుటయే శ్రీ నాగభూషణం తన జీవిత పరమావధిగా చేసుకున్నారు. ఆయన చక్కని ఆరోగ్యంతో, శక్తితో, నియమ నిష్ఠతో వర్ధిల్లాలని నేను భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. ఆయన ఎల్లప్పుడూ సంతోషస్వాంతులై వుండటం అదృష్టం. ఆయన షష్ట్యబ్ది పూర్తి చేశారు. ఆయన సేవా భాగ్యం దేశానికి కలగగలందులకై, వారికి ఆరోగ్యం చక్కగా వుండాలని నేను కోరుకుంటున్నాను.

ప్రజాసేవ జీవితలక్ష్యంగా పురోగమించే ఆయనను ఆయన సహచరులూ, సహకార ప్రతిష్ఠవులూ తమ ప్రేమాభిమానాలనూ ఆయనకు పంచి యిచ్చి, ఆయన అమూల్య ప్రజాసేవా తత్పరతతో నిత్యం వర్ధిల్లాలని చదువుల తల్లి శారదాదేవిని ప్రార్థిస్తున్నారని శ్రీ నాగభూషణం తన మనుము నందు నిల్పుకొని, ఉత్సాహియై తమ కార్యక్రమంలో పురోగమించాలని కోరుతున్నాను. శ్రీ శారదా దేవ్యాలయాలను ప్రజా హృదయాలలో నిర్మించి సద్విద్యా ప్రభావితులనుగా ప్రజలను ప్రబోదించాలని నేను నిండు మనస్సుతో కోరుకొంటున్నాను.

# కాంతికిరణాలు - కవితా పరిచయం

స్వాతంత్ర్య సమరయోధులుగా జైళ్ళలో క్రుగ్గి దేశారాధన చేసిన ప్రముఖు లెందరో గలరు. వారిలో కవిత్వ శక్తిని కూడా ప్రయోగించ గల్గిన వారు బహు కొద్దిమంది.

మహాత్ముని రాజకీయ విప్లవమందు వీరులుగా విజృంభించి ప్రజలకు ఆదర్శ మూర్తులైన వారునూ కలరు. ఐతే, గాంధేయ సాంఘిక విప్లవాలను హృదయ పూర్వకముగా అంగీకరించి ఆచరణయందు ముందడుగు వేస్తూ యుండిన వారెందరు ?

గుత్తా కుటుంబము అటు రాజకీయ ఇటు సాంఘిక విప్లవ వీరులుగా ప్రసిద్ధి నొందిరి. వారి సోదరులు హెచ్చు సంఖ్యలో బ్రిటీషు పాలనానెదిరించి సత్యా గ్రహోద్యమంలో చేరిరి. జైళ్ళ శిక్షలు అనుభవించిరి. ఆస్తుల నర్పించిరి. తమ సొంతకుమార్తెయైన శ్రీమతి భారతీదేవిని అరిగె వంశీయులయిన హరిజనులకు నలుబదేండ్లకు ముందే ఈకవీశ్వరుని అన్నయగు శ్రీ రామానుజయ్యగారు వైవాహ వేదికయందు పెండ్లికూతురుగా అర్పించిరి. అంతటి సాహసికులు వీరలు, దేశ భక్తులు, ఆంధ్ర దేశమందు ఈ నాటికి మరెందరో కలరా ?

మహాత్మునికి ఆశర్యమూ ఆనందమూ కలిగినది. మాకందరికీ ఎంతో ఉత్తే జము కలిగినది. శ్రీమతి భారతీదేవి ఈ రైతాంగ కుటుంబమును ఆదర్శవంతముగా చూచుకొని వీరి అన్నగారినీ పెండ్లి కూతురు శ్రీమతి భారతిని తమ హృదయానికి హత్తుకొనిరి.

ఈ గుత్తా సోదరులలో శ్రీ వీరరాఘవయ్య చౌదరికవులు మరియు గాయకులు ప్రజాహితైక జీవితమందు, వివిధ రంగములలో రాజకీయ కోణాల్లో; సేవలనందిం చాలని కుతూహల పడుచున్న పెద్దలు యువజనులైనవారినెందరెనో వీరెరుగుదురు. వారి జీవిత విశేషములను వారి ప్రజాసేవలను కవీశ్వరుని దృష్టితో వుదారులే.

ప్రజాసేవచేయడంలోగల సాధక బాధకాలు నెరిగినవారు. స్వరాజ్యావతరణ పిమ్మట, అధికార పిపాసుల్లై, ఎందరెందరో ఇతరరంగాల్లో యోగ్యులైన

వారే పరస్పరంగా వివిధ బాధలు ఇతరులకు కల్గిస్తూ, పైపైకి పోవాలనే తాపత్ర యంతో ఎన్నెన్నో వెట్టి మొట్టి విధములతో చిక్కు-కొంటూ ఉన్నారో తెలుసు కొన్నారు వీరు. అయినా తమ స్వంతమునకైగాక, ప్రజానీక క్షేమమునకై కొంత గానో, గొప్పగానో కృషిసల్పుచున్న వారెవ్వరా అని ఆలోచించగల్గిన వుదారభావు కులీ కవీశ్వరులు.

అలా ఆనాటి దేశభక్తులలో ఈ నాటి ప్రజాసేవారంగమందు విహరించు నట్టి పెత్తందారులలో తనకు నచ్చినవారెందరినో తన కవితామ తల్లికి యీ గ్రంథ ముద్వారా పరిచయపరుస్తున్నారు. ఇంకెందరో ఆంధ్ర, తమిళ కర్నాటక రాష్ట్రము లలో ఉండినట్టి ప్రజాసేవకులు, కవీశ్వరుని దృష్టి పథమునందుకొన్న అదృష్టులగు వారు ఈ గ్రంథముద్వారా పరిచయమగుచున్నారు. ఎంతటి వుదాత్తభావుకులు. వయోజనులందరికి ఇట్టి ప్రజాసేవకులను పరిచయం చేయాలనుకోవటం మెచ్చ తగిన విషయం.

వారిలాగే ప్రజాసేవచేయని ఈ నాటి యువజనుల ఎంతగానో ప్రోత్స హించటం. యీ కవీశ్వరుని సేవాసక్తి గీటురాయి యీ గ్రంథమే తార్కాణం మా దంపతులకు యీ ప్రసిద్ధ స్వతంత్రవీరుల కుటుంబం క్రిందటి నలభై సంవత్సరాల నుండి పరిచయం. భారతీ రైతాంగ విద్యాలయమందీ సోదరులలో కొందరు పట్టభ ద్రులైనారు. వీరిప్పటికినీ ఇంత నిస్వార్థులై కవులై ఆదర్శరైతులై. తమిళనాడులో నిలబడి యీ ఆంధ్రావని యువకులకింత వుత్తేజకరమగు సాహిత్య సంఘసేవా దర్శముల ప్రచారము చేయగల చూచుట ఆంధ్రులందరికీ గర్వకారణము. నాకు ప్రత్యేకంగా తృప్తి మా వాహిని పత్రిక, భారతీదేవి పుత్రిక ఈ నాడెంతో ఆనంద మును కృతజ్ఞతను యీ ఆదర్శ దేశభక్తుల కందించ గల్గుచున్నది.

ఇట్లు

ఆచార్యరంగా

యమ్. పి. పార్లమెంటు ఉపనాయకులు

న్యూ ఢిల్లీ.

16-9-1980

# "బాపూ-నేనూ" ఆనాటి పలుక్కులు

1925 నాటినుండి బాపూ ఆత్మబలిదానం నాటివరకు ఆయనతో నేను జరిపిన చర్చలు, అవగాహనల స్మృతిగుచ్ఛమిది. ఆ చివరివారంలో, ఆ ఆత్మాహుతి సమయంలో అంతకుముందెన్నడూ లేనంతగా నేను బాపూ ధ్యానంలో నిమగ్నమై పోతిని. బాపూతో నాకుగల సన్నిహిత సంబంధాలకు చెందిన స్మృతులన్నిటినీ సంక్షిప్తంగా వ్రాసుకొంటూ నా దుఃఖానికి ఓదార్పుని, నా కార్యక్రమాలకు ఉత్సాహాన్ని పొందుతూ వచ్చాను. అయితే ధ్యానముద్రలో వ్యాఖ్యలు సరిగా సాగేవికావు. అయితే ఇన్నేండ్లకు - బాపూ శతజయంత్యుత్సవాల సందర్భంలో ఆ వ్యాఖ్యలను తిరిగి చూచుకొని, లుప్తభాగాలను పూరించుకోడానికి నా స్మృతిశక్తిని కూడగట్టుకున్నాను. క్రమరహితంగా వున్న రికార్డులను వెదకుతున్నప్పుడు యిలా కూడదీసిన వ్యాఖ్యలను ఈ చిన్న పుస్తకంలో గుదిగ్రుచ్చుతున్నాను.

వీటి అవగాహనకు గాంధీ సాహిత్యంతోను, నాటి దేశ కాల రాజకీయ సాంఘిక పరిస్థితులతోను పరిచయం అవసరం. బాపూతో ముఖాముఖిని, ఆయన సమక్షంలోను జరిగిన సంభాషణల సమీకరణకు నేను ధ్యాన ముద్రితుణ్ణి కావలసి వచ్చింది. ఆ ధ్యానం ద్వారా సాధించిన స్మృతులను నా శక్తికొలది మాలగా అల్లి సమర్పిస్తున్నాను. ఈ రచనలో గాని, దీనిలో వ్యక్తంచేసిన భావాలలోగాని ఏట్టి లోటుపాట్లు కనిపించినా అవి నాకే చెందుతాయి. ఈ లోటుపాట్ల ఆధారంగా బాపూ వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని బలహీన పరచటంగాని, పొరపాటుగా చిత్రీకరించటం గాని జరగరాదని మనవి.

దరిద్ర నారాయణులను సేవించడానికి తన అనుచరులు చేసే ప్రయత్నాలకు బాపూ ఏ విధంగా సలహాలిస్తూ వుండేవారో, మార్గ దర్శకత్వం వహించేవారో ఈ గ్రంథం వివరిస్తుంది. మా శక్తి సామర్థ్యాలను బట్టి మేము ఆయన హెచ్చరిక వల్ల ప్రయోజనాలను పొందుతూ వుండేవారము. జలాశయంలోని ప్రతి జలబిందువు పైన దాని పరిమాణంతో నిమిత్తం లేకుండా సూర్యరశ్మి ఏ విధంగా సమానంగా ప్రసరిస్తుందో అదే విధంగా బాపూ తన ప్రేమామృతాన్ని మాపై వర్షింపజేసేవారు.

బాపూ సన్నిహిత సంబంధాన్ని పొందగల్గిన అదృష్టవంతులంతా ఆయన తమకు అందించిన ఆలోచనలను, చిరునవ్వులను తమ కృషిలో, సేవలో ప్రతిఫలింవ జేసుకోగలిగేవారు. అర్థ శతాబ్దంపాటు ఆయన నిర్వహించిన కార్యక్రమాలు, ఉద్యమాలు, ఆయన సాహచర్యం లక్షలాది ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చ గల్గినవి. తద్వారా వారు ఆయన దీవెనలను పొందగల్గినట్లు తృప్తి చెందేవారు.

ఇట్టి ప్రత్యేకావకాశాలను పొందలేకపోయినవారు కూడా ఆయన వ్యక్తిత్వం కార్యక్రమాలు, ఆలోచనలు, ప్రబోధాలు పఠించి పరిశీలించి, అనుసరించి ప్రయోజనం పొందేవారు. బాపూజీకి లభించిన యిట్టి ఏకలవ్య శిష్య ప్రముఖులలో - అమెరికాలో జన్మించిన ఆఫ్రికన్ జాతీయుడు డాక్టర్ మార్టిన్ లూథర్‌కింగ్ అత్యున్నతులు. ఈయన కూడ బాపూవలెనే హత్యకు గురియైనారు - ఇంకెంతో చిన్న వయస్సుననే.

రానున్న తరాలవారు బాపూ అడుగుజాడలలో నడవడానికి అనువుగా-నేను, నా సహచర కార్యకర్తలు పాతికేండ్లుగా మా హృదయాలలో మహాత్మునకు అందిస్తున్న నివాళులలో లేశ మాత్రంగా భావిస్తూ నేసిన భావపరంపరలనే హారాన్ని ప్రియపాఠకులకు అందిస్తున్నాను.

బాపూ - నేనూ జరిపిన మరికొన్ని చర్చలను "స్వాతంత్ర్యం కోసం పోరాటం" అనే పుస్తకంలో వివరించాను.

ఈ రచనకు నాకు తోడ్పడిన గ్రంథాలు : 'స్వరాజ్య' వార్షిక సంచిక 'మహాత్మాగాంధీ - లాస్ట్ ఫేస్' వాల్యూములు-2, రచయిత : ప్యారేలాల్ : 'మహాత్మా'- వాల్యూము—6, సంపాదకుడు : టెండూల్కర్. ఈ గ్రంథాల ప్రచురణ కర్తలకు నా కృతజ్ఞత.

## ఈనాటి పల్కులు

"భారతీయులు మహాత్ముని ప్రబోధాలను మరుస్తున్నారా?" అని ప్రపంచంలో ప్రముఖులు కొందరు ప్రశ్నిస్తున్నారు. 1969లో ప్యారిస్‌లో జరిగిన గాంధీ

శతజయంతి అంతర్జాతీయ మహాసభలలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు నేను "గాంధీ బోధనలు సజీవమైనవే; భారతీయులు వాటిని మరువలేరు. మరువరు. నేటికి వారు బాపూ మార్గమునే అనుసరిస్తున్నారు" అని రూఢిగా పలికినాను.

1971, 1977 ఎన్నికలలో మన దేశప్రజలు దరిద్రనారాయణులను సేవించెదమన్న వారికే, 'గరీబీహఠావు' సాధించెదమన్న వారికే అత్యధికమైన మెజారిటీని పార్లమెంటులో రెండు వేర్వేరు పార్టీలకు యిచ్చి తమ ప్రజాస్వామ్య, గాంధేయభక్తిని ఋజావు పరచుకొన్నారు.

క్రొత్త లోక్‌సభలో మెజారిటీని పొందిన జనతాపార్టీ సభ్యులు రాజఘాట్‌లో గాంధీజీ సమాధివద్ద 1977 మార్చి 23వ తేదీ ఉదయాన తమ ప్రమాణ పత్రాన్ని బాపూజీకి లాంఛన ప్రాయంగా అందించుకున్నారు. ఆ ప్రమాణమే గాంధీజీ అందరికీ అందించిన దరిద్రనారాయణ సేవావ్రతం.

అటు కాంగ్రెస్‌వారు, ఇటు జనతావారు కూడా మహాత్ముని దారిలో ఆయన బోధలను అనుసరించి దారిద్ర్యాన్ని పారద్రోలుటే అత్యవసర ధర్మమంటున్నారు. అందుకే యిందుకై పోటీలు పడుతున్నారు.

ఇట్టి శుభసమయమునకు గాంధీజీ 1925 లోనే ప్రప్రథమ పాఠమును బోధించి, నాందిపలికారన్న సత్యాన్ని ఈ పుస్తకం స్పష్ట పరచుతున్నది.

గోభూమి, నిడుబ్రోలు

ది 7-4-77 రంగ

# 1) గుంటూరు మండల సర్వస్వము

మిత్రులు శ్రీ దరువూరి వీరయ్య "గుంటూరు మండల సర్వస్వము"ను పునర్ముద్రణకిస్తూ, మరికొన్ని కొత్త వ్యాసములు, గుంటూరు ప్రజల జాతీయ, సాంఘిక సేవా విశేషములు అదనంగా ప్రజల కందించుచున్నందుల కెంతయు సంతోషము.

నేనునూ, గుంటూరు మండలం వాడనని, గుంటూరు ప్రాంతీయుడనని చెప్పుకొనుట, ఆంధ్రులలో గౌరవప్రదమే! గుంటూరు కృష్ణానదిచే పెంచబడు చున్నది. కొంతకాలం క్రితం కృష్ణాజిల్లా కూడా యీ నదికే అంది వుండేది.

గోదావరి నది ఆంధ్ర వాఙ్మయమునకు ఆదిపదముల నందిస్తూవుంటే కృష్ణమ్మతల్లి శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, చోళులు, కాకతీయుల రాజ్య బలములద్వారా, భారత దేశమందేగాక, బంగాళా ప్రాంతమున కావలి వైపుననున్న దేశములందుకూడా ఆంధ్రుల నాగరికత, కళాకాంతులకు, ఆశ్రయము పొందించినది.

ఈ రెండు మహానదుల జలాలు, త్వరలో కలియబోవుచున్నవి. కాలువల ద్వారానే కాక, ఏటి వెల్లువలు, విద్యుత్ కాంతులు, మాగాణపు బంగారు పంటల ద్వారా యీ నదుల స్పర్శవల్ల వెల్లివిరియుచున్న, సంస్కారపు పుష్పములు ఆంధ్ర దేశమందంతట, తమ శుభ సౌరభములచే అలముకొను చున్నవి.

ఆనాటి కర్మవీరులే యీనాటికి నల్లరేగడను, యెర్ర సింధూరపు బయళ్ళను సస్యశ్యామలంగా చేస్తున్నారు. అప్పటి పల్లవ చల్లరాయి చిత్రాలు తమ చిరు హస్తాలతో పెంచినవారు, వాటిని సముద్రాలపై వూపినవారు, యిప్పటి విశ్వకర్మ లుగా పల్లె ప్రజలుగా మన్నల నందుకుంటున్నారు.

ఆ బుద్ధుని బోధనలను "దమ్మపథము" గా అందించిన శ్రీ ప్రసాదు, అమరావతిని అంతకాలము పాలించిన ఆ రుద్రమదేవి బిడ్డ మహారాణి. నాగార్జున

సాగరానికి సగర చక్రవర్తిలా తపస్సు చేసిన కన్నయ్య, వెంకయ్య, ప్రసాద్, సత్యనారాయణరావు, ఆంధ్ర రాష్ట్రావతరణకై యెంతో కష్టించిన, దేశభక్త, ఉన్నవ, టంగుటూరి, స్వామి శీతారాం, శ్రీరాములు, యీ నదుల సంస్పర్శచే సిద్ధిని పొందినవారే గదా!

ఈనాడును, యీ సీమ ఆర్థిక పారిశ్రామిక, సాంఘిక రంగములందు పైకెదుగుచున్నది. ఇచ్చటి వర్తకులు, వాణిజ్యాధిపతులు దూరదృష్టి గలవారు.

ఈ ప్రాంతమందే కాలేజీలు, హైస్కూళ్ళు, మరెన్నో విద్యా సంస్థలు, ప్రజల ప్రోత్సాహముతో పెరుగుచున్నవి. అన్ని మతాలకు యిచ్చట ఆశ్రయము మెండు.

కవుల కిచ్చట రాజుల కాలములో, అందని సంస్కార, సన్మాన సౌరభములు, ఆరని హారములగుచున్నవి.

ఇచ్చటి నుండే, అత్యధిక సంఖ్యాకులగు సత్యాగ్రహులు, వీరగంధము నందుకొనిరి. ఈనాటి హిమగిరి రక్షణలో కూడా, తులాభంములవీరుడు అచ్యుత రాయలు కృష్ణకు వన్నె తెచ్చిరి. పల్నాటి వీరులప్పుడు, స్వతంత్ర వీరులిపుడున్న, రైతాంగ వుద్యమ సేవకులీనాడు ముందుకు తెస్తున్నది ఘాధాగము.

ఇట్టి ప్రదేశానికి, ప్రజలకు యీ "సర్వస్వము" తగును. ఇటులే ఆంధ్రలో, భారతావనిలో ప్రతిప్రదేశానికి సర్వస్వము అవసరము. అన్ని ప్రాంతాలలో యిటులే మహావీరులు, సేవకులు, వుద్యమ నిర్మాతలు, ప్రజా నాయకులు పుట్టిరి, పుట్టుచున్నారు.

యువకుల కిట్టి వుత్సాహజనకమగు రచనలు అవసరము. ఇట్టి సేవ చేయుచున్న శ్రీ వీరయ్య కివే నా ధన్యవాదము.

న్యూఢిల్లీ
9-9-1963

రంగ

# రైతు భజనావళి - తొలిపలుకు

రైతుభజనావళి పుట్టినదాది, (1934 లో) క్రొత్త క్రొత్త భావముల వుత్సాహవంతముగ నుండు నడకలపై అఖిలాంధ్ర గ్రామిక ప్రజానీకమందు నడచుచున్నది. ఆనాటి శెట్టిపల్లి నుండి ఈనాటి కవిబ్రహ్మావరకు రైతుకూలీలశక్తి, విప్లవజ్వాలం వెల్లించి, పెంచు కవీశ్వరుల భావజుంపముగా విరాజిల్లుచున్నది.

పేరునకు "రైతుభజనావళి" వాస్తవానికిది "గ్రామిక భజనావళి" ఈ విప్లవ పదగుచ్ఛము ఎందరెందరో యువజనులకు నూతనోత్సాహమేగాక, అభివృద్ధికారకమైన విప్లవ భావాలను చురుకైన గేయ చెలుకుల నేగాక, మనోల్లాసమును, వికాసమును కలిగించుచున్నది.

ఆంధ్రప్రజానీకమందు నూతనాశయములు వాని సాధించుటకై నూతనోద్యమములు క్రిందటి అర్ధ శతాబ్దమందు బయల్దేరినవి. వీటన్నిటికొక నూతనమగు, బలవత్తరమగుశక్తి వడి, పట్టు అశేష ప్రజానీకమును లేవదీసి, వురూ9తలూగించి, సృష్టికారకమగు శక్తిగా పెంచుచున్న రైతు, కూలి, యువజన, విద్యార్థి వుద్యమాలే. ఈ విప్లవోద్యమములకు ప్రాణము మహాత్ముని సత్యాహింసలనే ధర్మసూత్రములు, సత్యాగ్రహమనే పంథా. వీటికి వడి, వేడి, వెల్గు ఉత్సాహము కల్గించగల గేయ సంపుటే ఈ "రైతు భజనావళి".

పాటలబలం మాటలతోనేలేదు. శబ్దములందే ప్రస్ఫుటము కాజాలదు: నృత్య లక్షణములందే కానరాదు, కారణమా ? పాటలలో సమగ్రమగు ప్రాణము కలదు. భావవీచికలు, ఆశయ రేఖలు, ఆవేశపు కణికలు, హృదయ స్పందనాలు, మరెన్నో బలమగు లక్షణాలు పాటలందు అంతర్గర్భితము కాగలవు. అన్ని శుభలక్షణాలు ఈ "రైతుభజనావళి" యందు ముప్పిరిగొనియున్నవి. కనుకనే ఆంధ్ర ప్రజలకేగాక, యువజనులకును ప్రాణప్రదమగు చున్నది: క్రిందటి 15 సంవత్సరాలలో 12 ప్రచురణలకు ఎదుగుచున్నది.

ఈ నూతన సంచికలయందు పెరుగుచున్న విస్తరించుచున్న గ్రామిక జనావళి భావవీధులు, ఆశయావేగములు, ఆలోచనా తత్పరతలు, రాజకీయార్థిక భావ

ధోరణులు ప్రస్ఫుట మగుచున్నవి. ఆ 1930-40 వరకు రైతాంగమంతా, తమ అంతర్గర్భితమైయున్న, వ్యవసాయకూలీలు, భూమిగల్గిన రైతులు, కౌలుదారులను రైతులను ప్రముఖముగా, పారిశ్రామిక కూలీలను తోడు ప్రజలుగా మనో ప్రపంచ మందు చేర్చుకొని, "రైతుకూలీ రాజ్యస్థాపన చేయగావలె రెండు రెండోయి" అంటూ ప్రయోగించుచుండిన విప్లవకవి శెట్టిపల్లి భావయుగములో నుంటిమి, మధ్య వచ్చిపడిన 1939–45 ప్రపంచయుద్ధ ఆపత్కాలమందు "శాంతి, శాంతి" యనే ప్రపంచ ప్రజల ఆరాటమును, దానికితోడు, స్వరాజ్య సంప్రాప్తికై వుడుకు చున్న హృదయావేదనను, దీనజనోద్ధరణకై వెల్లుచున్న ఆశాపరంపరలేగాక, ఆవేళ వెల్లువలు, నిరాశ, నెంతో శ్రమపై వెడల నడుపుచూ, ధైర్యసాహసోపేత మగు, విజయలక్ష్మిని కాంక్షించుతూ ప్రకటించుకొంటూన్న స్వప్రబోధమును, యుద్ధకాల మందు, ఆ పిమ్మట ప్రకటితమైన సంచికలు మన ఆంధ్రశ్రామిక లోకమునకు అందించినవి.

1946–47 లో వెల్వడిన సంచికయందో, అతివిస్తారమైన, సర్వశ్రామిక లోకమును ఆవరించు కొనుచు యువజనులకు నాయకులై, రైతు, కూలీ, కళా కారులు, బుద్ధిజీవులందరి ఐక్యత ద్వారా "సర్వశ్రామిక రాజ్యము"ను స్థాపించ వలెననే, భారతదేశపు యుద్ధానంతర పట్టుదలను హృద్గతమొనర్చుకొన్న యువ కవీంద్రులు పున్నయ్య, రాఘవదాసు, రాజులురెడ్డి తమ భావముప్పిరిద్వారా, కలుపులు, బీదతనము, విరామములేని శ్రమ జీవితమునకే అలవడియున్న విశాల ప్రజలనుండి, నూతనాశయ, ప్రబోధితములగు గీతముల మనకందించు చున్నారు. కలకాలము నుండి కష్టజీవులు పొందుచున్న కడగండ్లను, హృదయవిదారకముగా, విప్లవోత్తేజకరంగా, శ్రీ యినగంటి పున్నయ్య తన పద్యమంజరిద్వారా మనల మేల్కొల్పుచున్నారు.

ఆలోచనా ప్రపంచమంతా వీరి భావగీతికలంకొక సృష్టి కారకశక్తి గందు. ఆశల నల్లిబిల్లిగా పెంచుకొనగోరు ప్రజలకా వీరొక వుద్వేగము కల్గించుచున్నారు. కార్యనిర్వహణకై వుద్రేక పడువారి కా వీరొకసువిశాలమైన విప్లవ భావపారిశ్రామి

కాలయము సృష్టించుచున్నారు. కష్టజీవులైన వారికి సత్వరముగా అభివృద్ధిదాయకమగు, సుఖదాయకమగు వినూత్న సంఘ పునర్నిర్మాణమును వెన్వెంటనే కాంక్షించు వారికి, మార్క్సు కంటె, లెనిను, స్టాలినులకంటె, అటు రష్యా, యిటు అమెరికాలకంటె, ప్రపంచశాంతి, మానవుని పవిత్రత, వ్యక్తుల స్వతంత్ర్యము, సాంఘికాభివృద్ధి కల్గించు విప్లవజ్వాలలు ప్రసాదించుచున్న. పరిపక్వతస్థితి కందుకొనుచున్న, అభివృద్ధిదాయకమగు, విప్లవాత్మకమగు, గంగా యమునా సరస్వతీ సంగమానంతరం త్రివేణి అందించుచున్న గంభీరమగు, విస్తారమగు, ప్రాణప్రదమగు, రక్షణదాయకమగు, సృష్టికారకమగు నూతన భావస్రవంతిని మన ప్రజా హృదయముల పల్లవింప జేయుటకు బయల్వెడలినది. దానికి మన కార్మిక సోదరులు, రైతాంగ బిడ్డలు, ప్రవాస కార్మికుల అనుభముల జీర్ణించుకొన్న శ్రీ సిల్లారాజులురెడ్డి, శెట్టివల్లి చెణుకులతో, మన యువక జనుల మేల్కొల్పుచున్న గీతములజేర్చి, ఆ సంచికలకొక వడి, వేగము జేర్చుచుండిరి.

ఈనాటి ఈ సంచికకో, ఏన్నోవిలువైన, వుత్సాహవంతమైన, నూతన భావ ప్రబోధకరములైన గీతములను ప్రసిద్ధ శ్రామికజన విజ్ఞానులు, కవులు, గాయకులు ప్రసాదించు చున్నారు. నిన్న, మొన్ననే అకస్మాత్తుగా, అన్యాయముగా మనల వీడిపోయిన, సుప్రసిద్ధ 'కవిబ్రహ్మ' ఏటుకూరి తన గంభీర గీతములతో, విజ్ఞానమయ పదాలతో, రైతాంగము నుద్బోధించుచూ, పండితాగ్రములపై నున్న విజ్ఞానులు, కవులు కూడా ఈనాటి విప్లవయుగమందు ప్రజాభ్యుదయమును హృదయమార కోరుచున్నారని వెల్లడించుచున్నారు. వారు మన రైతాంగమునకొక విప్లవాత్మకమగు చారిత్రిక భావము, భవిష్యద్వాణి ప్రసాదించుచుండిరి.

యువజనులలో కూడ నూతన వైజ్ఞానిక కవులు శ్రామిక జనాల సేవించి, ప్రోత్సహించి, రక్షించుటకు ముందడుగువేస్తూ వుండడం శుభప్రదం, పెద్దలనుండి కవి శ్రీ యినగంటి పున్నయ్య, పిన్నలనుండి శ్రీ బండ్లమూడి శివరామకృష్ణ, పున్నయ్య, రాఘవదాసు, రాజులరెడ్డి, జాస్తి నరసయ్య ప్రభృతులు ఈ సంచికకు నూతన కాంతులు ప్రసాదించుచున్నారు.

భారతీయ శ్రామిక జనులెవ్వరు ? యుద్ధాత్పూర్వము, సోవియటువారి అను భవాల వల్లను, భారతదేశమందలి కమ్యూనిస్టులు, సోషలిస్టుల ధోరణివల్లను, స్వాతంత్ర్య సమరమందు తగినంత తెంపుగా మిగతావారు త్యాగమొనర్చుటకు పూగకుండుట చేతను, మనందరి విప్లవతత్వము, భారతీయ, తదితర అస్వాతంత్ర్య దేశాలు ప్రజల అనుభవాలతో నిండుగా పరిపక్వత బొందకుండుటవల్లను, మహాత్ముని బోధలంతర్గర్భితమై యుండినందున, మానవలోకపు విలువ, ప్రతి వ్యక్తి కందవలసిన స్వాతంత్ర్యము, స్వేచ్ఛ, హక్కు, సత్యాల అత్యంతావ శ్యకత, సాంఘికాభివృద్ధియందు వ్యక్తులకు అనుదిన జీవితమందు అందజేయ వలసిన రక్షలు, హక్కులు, శక్తియుక్తులు, విజ్ఞానభావ స్వాతంత్ర్యములు, నైతికా భివృద్ధి కనువగు సౌకర్యములు, ప్రపంచ శాంతి, తద్వారా, జాతి జాతిమధ్య, దేశ దేశములమధ్య, మానవబృంద, బృందములమధ్య విరాజిల్లవలపిన స్నేహ్నా సౌభ్రాతృత్వ, సహకార సంపదల విలువను మనమంతా నిండుగా గ్రహించ కుండుటచే మార్క్సు, లెనిను, స్టాలిను ప్రభృతులిచ్చు చుండిన రాచకీయనినాదములు 'కూలిరాజ్యము' "రైతు రాజ్యము" ఆ పిదప విస్తరించుకొన్న నినాదము "రైతు కూలీ రాజ్యస్థాపనా" శయములతో తృప్తిజెందుచుంటిమి.

కాని, 1942 విప్లవమందు, బుద్ధిజీవుల ప్రాబల్యము, విప్లవశక్తి, త్యాగ మహిమ, నూతనాశయాభిమానాలు యెల్లరకు విస్తారముగా ప్రస్ఫుటమైనవి.

ఎంతగా యుద్ధయుగమందు కళాకారుల పూర్తిసహకారముపై ఈ యంత్ర యుగ ప్రజలు అన్నిదేశాలలో, ప్రత్యేకంగా ప్రాచ్యదేశములందు, సాధారణ జీవితపు, యుద్ధకాలపు అవసరాల తీర్చుకొనుటకు ప్రజలు ఆధారపడవలసి వచ్చెనో చూచితిమి.

కనుక, యుద్ధాత్పూర్వమువలెనే, బుద్ధిజీవుల, కళాకారుల విషయమై అశ్రద్ధ చేయుట అసంగత మగుననిగ్రహించుకో గల్గితిమి.

అటంబాంబులొచ్చిన తర్వాత, పట్టణజీవితము, ప్రాభవము, నాగరికత ఎంతటి బుద్బుదప్రాయమగుచున్నదో, అపాయకరమగు చున్నదో, గ్రామీణ నాగరికత రక్షణధాయక మగునో ఎల్లరకు తేటతెల్లమైనది.

కనుకనే, మహాత్ముని రాచకీయాశయ ప్రాశస్త్యము, వుదారమగు సర్వ శ్రామికుల ఆకర్షించి, ఆవరించుకొను సాంఘిక విప్లవ సూత్రముల అవసరము, నిర్మాణ యుక్తమగు, అహింసాత్మకమగు, అభివృద్ధియకమగు సమగ్రవిప్లవమును కాంక్షించు వారందరికి ద్యోతకమైనది. కనుకనే మన మీనాటి "సర్వశ్రామిక రాజ్యస్థాపనావశ్యకతను" గ్రహించుకున్నాము. బుద్ధిజీవుల పూర్ణసహకారాన్ని, కళాకారుల క్రాంతికారకపు తోడ్పాటును రైతుకూలీలు పొందవలెనని తీర్మానించు కొన్నాము. కనుకనే రైతుకూలీలు, ప్రజాస్వామ్యమందలి ప్రధాన భాగాలేగాని, సర్వప్రజలు కారని గ్రహించి, రైతుకూలీలతో చేయకున్న ప్రజారాజ్యస్థాపనకై కృతనిశ్చయులమగు చున్నాము. కనుకనే 'రామరాజ్యము'ను కోరిన మహాత్ములే, రైతుకూలీ ప్రజారాజ్యమును స్థాపించుటయు ఆ దారియందే సాధ్యమగు శ్రామిక విప్లవాశయసాధన యని నమ్మిరి, ప్రకటించిరి. ఆ రైతుకూలీ ప్రజారాజ్యాధికారము ద్వారా, సర్వశ్రామిక సహకార సురాజ్యమును సాధించగల్గుదుమని బోధించిరి. ఇటుల పరస్పరంగా బల పరచుకొనుచూ, అందరు ప్రజల నభివృద్ధి మార్గమున తీసుకొని రాగల్గు 'రైతుకూలీ ప్రజారాజ్యము' సర్వశ్రామిక సహకార సాంఘిక ప్రతిపత్తి, పరస్పరముగా బలపరచుకొనుచుంటే, అహింసాత్మకమైన, అభివృద్ధి దాయకమైన దినదినము నూతన సుఖముల, శోభల ప్రజలకందించు సర్వతోముఖ శ్రామిక సుఖ జీవనము సాధ్యమగునని వారు బోధించిరి.

ఆ దివ్య సందేశమును యీనాటి "రైతుభజనావళి" మనకందించు చున్నది.

పాటలలో, గేయములలో, పద్యాలలో బిలిబిలి పల్కులలో యీ దివ్య సందేశమును, ప్రచారయోగ్యముగా, మననజేసుకొను ధోరణిలో, హృదయ రంజకమైన యమకములలో, వుత్తేజపూరితమైన యమకములలో "రైతుభజనావళి" ఆంధ్ర ప్రజలకు సమర్పించు చున్నది.

ఇంతటి రసవత్తరమగు గ్రంధమును, సందేశముల జొంపమును శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, ఎందరో ఉజ్వల విప్లవగాయకుల, వీరుల సహ కారంతో ఆంధ్రరాష్ట్ర రైతు కాంగ్రెసుపేర అర్పించు చున్నందులకు కృతజ్ఞులము.

ఈ విన్నాణమైన, తేజోవంతమైన, విజ్ఞానప్రదమైన, ఆశాపూరితమైన పద్య, పాటల పొదరిల్లును ఆంధ్రకవన వుద్యానమునకెంతో శోభ, సొంపు, యింపుల కల్గించి, వెల్గొందుచున్న కవిబ్రహ్మ ఏటుకూరికి అంకితమొసంగుచుండుట శ్లాఘాపాత్రము.

కవిబ్రహ్మ స్మారక సభామండపము.
నిడుబ్రోలు
25-11-49

రంగ

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C. No. 81696
హైదరాబాద్-500 044.



" కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్ సిద్ధాంత ప్రవక్త "